## మొదటి అధ్యాయం

# 'బైబిల్' అంటే ఏమిటి?

- బైబిల్ లోని పుస్తకాలు, వాటి ప్రామాణికతా స్థాయి
- వాటి పరస్పర వైరుధ్యాలు
- వాటిలోని అసభ్యమైన తప్పులు



"ఇవి కేవలం మీరు, మీ పూర్వీకులు పెట్టుకున్న కొన్ని పేర్లు తప్ప మరేమీ కావు.

అల్లాహ్ వాటిలో ఏ ప్రమాణాన్నీ అవతరింపజేయలేదు"

( ఖుర్ఆన్, 'నజ్మ్' )

# అధ్యాయం-1

## పాతనిబంధన మరియు క్రొత్త నిబంధనలోని గ్రంథాలు

## మొదటి ప్రకరణం

## గ్రంథాల పేర్లు, వాటి సంఖ్య

క్రైస్తవ పండితులు బైబిల్ లోని గ్రంథాలను రెండు రకాలుగా వర్గీకరిస్తారు. మొదటి రకానికి చెందిన గ్రంథాలు హజ్రత్ ఈసా (అ) [ఏసుక్రీస్తు] కు పూర్వం గతించిన దైవప్రవక్తల తరపున తమకు చేరాయనేది వారి వాదం. ఇక రెండవ రకానికి చెందిన గ్రంథాలు హజ్రత్ ఈసా (అ) [ఏసుక్రీస్తు] తర్వాతి కాలంలో దివ్యప్రేరణ ద్వారా వ్రాయబడ్డాయనేది వారి వాదం. మొదటి రకానికి చెందిన గ్రంథాల సముచ్చయాన్ని ‘ పాత నిబంధన’ **(Old Testament)** అని, రెండవ రకానికి చెందిన గ్రంథాల సముచ్చయాన్ని ‘ క్రొత్త నిబంధన’ **(New Testament)** అని పిలుస్తారు. రెండు రకాల గ్రంథాల సముచ్చయాన్ని ‘బైబిల్’ అని పిలుస్తారు. ‘బైబిల్’ అనేది గ్రీకు పదం. గ్రీకు భాషలో ‘బైబిల్’ అంటే ‘గ్రంథం’ అని అర్థం.

మళ్ళీ ఈ రెండు నిబంధనలు రెండు రకాలుగా ఉన్నాయి. మొదటి రకానికి చెందిన గ్రంథాల ప్రామాణికత విషయంలో ప్రాచీన కాలానికి చెందిన క్రైస్తవులందరూ ఏకాభిప్రాయాన్ని కలిగి ఉన్నారు. ఇక రెండవ రకానికి చెందిన గ్రంథాల ప్రామాణికత విషయంలో క్రైస్తవులలో భేదాభిప్రాయాలున్నాయి.

### పాత నిబంధనకు చెందిన మొదటి రకం గ్రంథాలు :

పాత నిబంధనకు చెందిన మొదటి రకం గ్రంథాలు (వేటి ప్రామాణికత విషయంలోనయితే ప్రాచీనకాలపు క్రైస్తవ పండితులందరూ ఏకాభిప్రాయాన్ని కలిగియున్నారో ఆ గ్రంథాలు) 38 ఉన్నాయి.

ఆ 38 గ్రంథాల పేర్లు ఇవి :-



(1) ఆదికాండము [1]. ఆదికాండమును అరబీలో ‘సిఫ్రుల్ ఖలీఖహ్’ అని కూడా అంటారు.

(2) నిర్గమ కాండము [2] (3) లేవీయ కాండము [3]

(4) సంఖ్యా కాండము [4] (5) ద్వితీయోపదేశ కాండము [5]

---

**(అథఃసూచికలు)**

[1] ఆదికాండము ను అరబీ భాషలో ‘సిఫ్‌రె తక్‌వీన్’ అని పిలుస్తారు. అరబీ భాషలో ‘సిఫ్’ అంటే ‘పుస్తకం’ అని అర్థం.

బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో ఆదికాండము పేరు ‘పైదాయిష్’. బైబిల్ ఇంగ్లిష్ అనువాద ప్రతిలో ఆదికాండము పేరు **Genisis.** ఆదికాండములో భూమ్యాకాశాల సృష్టి మొదలుకొని దైవప్రవక్తలయిన హజ్రత్ ఆదమ్ (అ) (ఆదాము), హజ్రత్ నూహ్ (అ) (నోవహు), హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) (అబ్రాహాము), హజ్రత్ ఇస్‌హాఖ్ (అ) (ఇస్సాకు), హజ్రత్ యూసుఫ్ (అ) (యోసేపు) ల కాలాలకు చెందిన చరిత్ర ఉంది. ఆదికాండము దైవప్రవక్త హజ్రత్ యూసుఫ్ (అ) మరణ సంఘటనతో ముగుస్తుంది. ఇందులో 50 అధ్యాయాలు ఉన్నాయి.

[2] బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో నిర్గమ కాండము పేరు ‘ఖురూజ్’. బైబిల్ ఇంగ్లిష్ అనువాద ప్రతిలో నిర్గమ కాండము పేరు **Exodus.** నిర్గమ కాండములో దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) (మోషే) పుట్టుక నుంచి మొదలుకొని, ఆయన ఇస్లామీయ సందేశ ప్రచారాన్ని నిర్వహించడం, ఫిర్‌ఔన్ (ఫరో) ఎఱ్ఱ సముద్రంలో మునిగిపోవడం, సీనా (సీనాయి) కొండ మీద ఆయన (హజ్రత్ మూసా(అ) (మోషే) అల్లాహ్ (యెహోవా)తో సంభాషించడానికి సంబంధించిన సంఘటనలు, తౌరాతు ఆజ్ఞలు (దేవుని ఆజ్ఞలు) మొదలయినవి ప్రస్తావించబడ్డాయి. నిర్గమకాండము ఇశ్రాయేలీయులు సీనాయి బయలుప్రాంతంలో బసచేయడానికి సంబంధించిన సంఘటనల ప్రస్తావనతో ముగుస్తుంది. ‘నిర్గమనం’ అంటే ‘విడచిపెట్టి వెళ్ళడం’ అని అర్థం. ఈ పుస్తకంలో ఇశ్రాయేలీయులు ఐగుప్తు నుంచి నిష్క్రమించడానికి సంబంధించిన సంఘటన ప్రస్తావించబడి ఉంది గనుక దీనిని ‘నిర్గమ కాండము’ అని పిలుస్తారు. ఇందులో 40 అధ్యాయాలు ఉన్నాయి.

[3] బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో లేవీయ కాండము పేరు ‘అహ్‌బార్’. బైబిల్ ఇంగ్లిష్ అనువాద ప్రతిలో లేవీయ కాండము పేరు **Leviticus.** ఇందులో ఇశ్రాయేలీయులకు వారు సీనాయి బయలుప్రాంతంలో బసచేసిన కాలంలో ఇవ్వబడిన ఆజ్ఞల ప్రస్తావన ఉంది. ఇందులో 27 అధ్యాయాలు ఉన్నాయి.

ఈ ఐదు గ్రంథాలనూ కలిపి 'తౌరాత్' అంటారు. ఇది అరామిక్ భాషకు చెందిన పదం. ఈ పదానికి 'ధర్మశాస్త్రం', 'బోధన' అనే అర్థాలున్నాయి. కొన్ని సందర్భాల్లో ఈ పదం ఔపచారికంగా పాతనిబంధనకు చెందిన గ్రంథాలను సూచించేందుకు సైతం ఉపయోగించబడుతుంది.

(6) యెహోషువ [6] (7) న్యాయాధిపతులు [7]

---

**(అథఃసూచికలు)**

4 బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో సంఖ్యా కాండము పేరు 'గిన్‌తీ'. బైబిల్ ఇంగ్లిష్ అనువాద ప్రతిలో సంఖ్యా కాండము పేరు **Numbers.** ఇందులో ఇశ్రాయేలీయుల జనాభా లెక్క మొదలుకొని వారు కనాను దేశానికి వెళ్ళడానికి ముందు వరకు సంభవించిన సంఘటనలు, యొర్దాను నది ఒడ్డున దైవప్రవక్త హజ్‌రత్ మూసా (అ) (మోషే)కు ఇవ్వబడిన ఆజ్ఞలు మొదలయినవి ప్రస్తావించబడ్డాయి. ఇందులో మొత్తం 36 అధ్యాయాలు ఉన్నాయి.

5 బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో ద్వితీయోపదేశ కాండము పేరు 'ఇస్‌తిస్‌నా'. బైబిల్ ఇంగ్లిష్ అనువాద ప్రతిలో సంఖ్యా కాండము పేరు **Deuteronomy.** ఇందులో 'సంఖ్యాకాండం' తర్వాత దైవప్రవక్త హజ్‌రత్ మూసా (అ) (మోషే) మరణం వరకు సంభవించిన సంఘటనలు, ఆదేశాలు ప్రస్తావించబడ్డాయి. ఇందులో మొత్తం 34 అధ్యాయాలు ఉన్నాయి.

6 బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'యెహోషువ' పుస్తకం పేరు 'యెషూఅ'. బైబిల్ ఇంగ్లిష్ అనువాద ప్రతిలో యెహోషువ పుస్తకం పేరు **Joshua.** ఈ గ్రంథం దైవప్రవక్త హజ్‌రత్ మూసా (అ) ప్రత్యేక సేవకులయిన హజ్‌రత్ యూషత్ బిన్ నూన్ (అ) (యెహోషువ) కు సంబంధించినది. ఆయన దైవప్రవక్త హజ్‌రత్ మూసా (అ) పరమపదించిన తర్వాత ఇశ్రాయేలీయుల దైవప్రవక్తగా దైవంచే నియుక్తులయ్యారు. ఆయన ఇశ్రాయేలీయులను తీసుకొని అమాలఖహ్‌తో ధర్మయుద్ధం చేశారు. ఆ యుద్ధంలో ఆయన విజయం సాధించారు. ఈ పుస్తకంలో ఆయనకు సంబంధించి ఆయన మరణం వరకు సంభవించిన సంఘటనలు పేర్కొనబడ్డాయి. ఇందులో మొత్తం 24 అధ్యాయాలు ఉన్నాయి.

7 బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'న్యాయాధిపతులు' పుస్తకం పేరు 'ఖుజాహ్'. బైబిల్ ఇంగ్లిష్ అనువాద ప్రతిలో 'న్యాయాధిపతులు' పుస్తకం పేరు **Judges.** ఇందులో హజ్‌రత్ యూషత్ (అ) (యెహోషువ) మృతినొందిన తర్వాత ఇశ్రాయేలీయుల ***(తరువాతి పేజీ చూడండి)***



(8) రూతు [8] (9) సమూయేలు మొదటి గ్రంథము [9]

---

**(అథఃసూచికలు)**

***(7 వ అథఃసూచిక తరువాయి భాగం)***

స్థితి గురించి వివరించబడింది. ఆ సమయంలో వారి పరిపాలకుడెవడూ లేడు. వారి విగ్రహారాధన, దుష్కార్యాల కారణంగా అల్లాహ్ మాటిమాటికీ ఒక అపరిచిత రాజును వారి పరిపాలకునిగా చేసేవాడు. ఆ రాజు వారిని హింసించేవాడు. అయితే వారు పశ్చాత్తాపపడి దైవం వైపుకు మరలి ఆయనను వేడుకున్నప్పుడు వారి కొరకు ఎవరో ఒక నాయకుడు దైవం తరపున పంపబడేవాడు. ఆ నాయకుడు వారిని ఆ కష్టాల నుంచి గట్టెక్కించేవాడు. అయితే వారు తిరిగి దౌష్ట్యాలకు పాల్పడేవారు. అప్పుడు తిరిగి మరొక దుర్మార్గుడయిన పరిపాలకుడు వారిపై దాపురించేవాడు. ఆ కాలంలో వారు తమ కొరకు ఉన్న నాయకుడిని 'న్యాయాధిపతి' అని పిలిచేవారు. అలాగే ఆ కాలాన్ని 'న్యాయాధిపతుల కాలం' అని పేర్కొంటారు. కనుక ఈ పుస్తకాన్ని ' న్యాయాధిపతులు' అని పిలుస్తారు. ఇందులో 21 అధ్యాయాలున్నాయి.

8 బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'రూతు' పుస్తకం పేరు 'కితాబె రాఊత్'. బైబిల్ ఇంగ్లిష్ అనువాద ప్రతిలో దీని పేరు **Ruth.** ఇందులో హజ్‌రత్ దావూద్ (అ) (దావీదు) తాతగారయిన అబూ ఊబైద్ (ఓబేదు) మాతృమూర్తి అయిన, రాఊత్ (రూతు) స్థితిగతుల ప్రస్తావన ఉంది. రాఊత్ (రూతు) మోయాబు దేశస్థురాలు. ఆవిడ ఆ తర్వాత బేత్లెహేముకు వచ్చేసారు. అక్కడ ఆవిడ బోయజును వివాహమాడారు. ఆయన ద్వారా ఆవిడకు ఓబేదు (ఊబైద్) జన్మించారు. ఓబేదుకు యెష్షయి జన్మించగా, యెష్షయికు దావీదు [ హజ్‌రత్ దావూద్ (అ) ] జన్మించారు. 'రూతు' అనే పుస్తకంలో 4 అధ్యాయాలు ఉన్నాయి.

9 బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'సమూయేలు మొదటి గ్రంథము' పేరు 'సమూయేల్'. బైబిల్ ఇంగ్లిష్ అనువాద ప్రతిలో దీని పేరు **1 Samuel.** ఈ పుస్తకం దైవప్రవక్త హజ్‌రత్ కాలిబ్ (అ) తర్వాత దైవప్రవక్తగా దైవం తరపున నియుక్తులయిన హజ్‌రత్ సమూయేల్ (అ) (సమూయేలు) జీవన స్థితిగతులకు సంబంధించినది. హజ్‌రత్ సమూయేల్ (అ) (సమూయేలు) ఇశ్రాయేలీయుల ఆఖరి న్యాయాధిపతి. ఆయన కాలంలోనే తాలూత్ (బైబిల్‌లో ఇతడు 'సౌలు' అని పేర్కొనబడ్డాడు) ఇశ్రాయేలీయులకు రాజు అయ్యాడు. సమూయేలు మొదటి గ్రంథములో దైవప్రవక్త హజ్‌రత్ సమూయేల్ (అ) (సమూయేలు) దైవదౌత్యం, తాలూతు (సౌలు) పరిపాలన, దైవప్రవక్త హజ్‌రత్ దావూద్ (అ) [దావీదు] జాలూతును హతమార్చడం, సౌలు మరణం వరకు గల సంఘటనలు పేర్కొనబడ్డాయి. ఈ పుస్తకంలో మొత్తం 31 అధ్యాయాలు ఉన్నాయి.

(10) సమూయేలు రెండవ గ్రంథము [10] (11) రాజులు మొదటి గ్రంథము [11]

(12) రాజులు రెండవ గ్రంథము [12] (13) దిన వృత్తాంతములు మొదటి గ్రంథము [13]

(14) దిన వృత్తాంతములు రెండవ గ్రంథము [14]

**(అథఃసూచికలు)**

10 ఈ పుస్తకంలో తాలూత్ (సౌలు) మరణం తర్వాత దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ) (దావీదు) పరిపాలన, తాలూత్ (సౌలు) కుమారులతో ఆయన పోరాటం మొదలయినవాటికి సంబంధించిన సంఘటనలు ప్రస్తావించబడ్డాయి. ఈ పుస్తకంలో 24 అధ్యాయాలు ఉన్నాయి.

11 బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'రాజులు మొదటి గ్రంథము' పుస్తకం పేరు 'సలాతీన్'. బైబిల్ ఇంగ్లిష్ అనువాద ప్రతిలో దీని పేరు **1 Kings.** ఇందులో దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ) [దావీదు] వృద్ధాప్యం, మరణం, దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) [సొలొమోను] పట్టాభిషిక్తులవడం, ఆయన పరిపాలనాకాలం, ఆయన మరణం, ఆయన తదనంతరం ఆయన కుమారుల స్థితిగతులు, అహాబు రాజు మరణం వరకు గల సంఘటనలు ప్రస్తావించబడ్డాయి. దైవప్రవక్త హజ్రత్ ఇల్యాస్ (అ) [ఏలీయా] ప్రస్తావన కూడా ఇందులో ఉంది. ఈ పుస్తకంలో మొత్తం 22 అధ్యాయాలు ఉన్నాయి.

12 బైబిల్ ఇంగ్లిష్ అనువాద ప్రతిలో దీని పేరు **2 Kings.** ఇందులో అహాబు రాజు మరణం నుంచి సిద్కియా పరిపాలన వరకు గల సంఘటనలు ప్రస్తావించబడ్డాయి. ఇందులో దైవప్రవక్త హజ్రత్ ఇల్యాస్ (అ) [ఏలీయా] మరియు దైవప్రవక్త హజ్రత్ అల్‌యసత్ (అ) [ఎలీషా] స్థితిగతుల ప్రస్తావన కూడా ఉంది. ఈ పుస్తకంలో మొత్తం 25 అధ్యాయాలు ఉన్నాయి.

13 బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'దినవృత్తాంతములు మొదటి గ్రంథము' పేరు 'తవారీఖ్'. బైబిల్ ఇంగ్లిష్ అనువాద ప్రతిలో దీని పేరు **1 Chronicles.** ఇందులో దైవప్రవక్త హజ్రత్ ఆదమ్ (అ) [ఆదాము] మొదలుకొని దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) [సొలొమోను ] వరకు గల వంశవృక్షం, దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ) [దావీదు] వరకు గల స్థితిగతుల సంక్షిప్త వివరణ, దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ) [దావీదు] పరిపాలనకు సంబంధించిన విపులమైన వివరణ అందించబడింది. ఇందులో మొత్తం 29 అధ్యాయాలు ఉన్నాయి.

14 ఇందులో దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) [సొలొమోను] పరిపాలన, ఆయన తర్వాత పలువురు రాజుల స్థితిగతులు సిద్కియా రాజు వరకు పేర్కొనబడ్డాయి. ***(తరువాతి పేజీ చూడండి)***



(15) ఎజ్రా [15] (16) నెహెమ్యా గ్రంథము [16] (17) యోబు గ్రంథము [17]

**(అథఃసూచికలు)**

***(14 వ అథఃసూచిక తరువాయి భాగం)***

అలాగే నెబుకద్నెజరు యెరూషలేముపై దాడి చేయడానికి సంబంధించిన సంఘటన పుస్తకం చివర పేర్కొనబడింది. ఇందులో మొత్తం 36 అధ్యాయాలు ఉన్నాయి.

15 బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'ఎజ్రా' పుస్తకం పేరు 'ఉజ్‌రా'. బైబిల్ ఇంగ్లిష్ అనువాద ప్రతిలో దీని పేరు **Ezra.** బహుశా ఇది దైవప్రవక్త హజ్రత్ ఉజైర్ (అ) పేరు కావచ్చు. ఇందులో పారశీక దేశపు రాజయిన కోరెషు నెబుకద్నెజరు దాడి తర్వాత యెరూషలేమును రెండవమారు నిర్మించడం, తర్వాత దైవప్రవక్త హజ్రత్ ఉజైర్ (అ)కు దేశబహిష్కరణ శిక్ష విధించబడడం, యూదులను తమ స్వదేశానికి తిరిగి రప్పించడం, వారు తమ పాపాలకు గాను దైవాన్ని క్షమాపణ వేడుకోవడం మొదలయిన సంఘటనలు పేర్కొనబడ్డాయి. అదే క్రమంలో దైవప్రవక్త హజ్రత్ జకరియ్యా (అ) [జెకర్యా] మరియు అజీజా మొదలయినవారి గురించి కూడా పేర్కొనబడింది. ఇందులో మొత్తం 10 అధ్యాయాలు ఉన్నాయి.

16 బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'నెహెమ్యా' పుస్తకం పేరు 'నహ్‌మియాహ్'. బైబిల్ ఇంగ్లిష్ అనువాద ప్రతిలో దీని పేరు **Nehemiah.** ప్రారంభంలో నెహెమ్యా పారశీక దేశపు రాజయిన అర్తహషస్త **(Artaxerxes)** రాజు సేవకులుగా ఉండేవారు. ఆయనకు నెబుద్నెజరు చేతుల మీదుగా బైతుల్ ముఖద్దిస్ (యెరూషలేములోని దేవుని మందిరం) నాశనం చేయబడడానికి సంబంధించిన వార్త చేరినప్పుడు ఆయన రాజు నుంచి అనుమతిని పొంది యెరూషలేముకు చేరుకున్నారు. అక్కడ ఆయన హజ్రత్ ఉజైర్ (అ)తో కలిసి దానిని తిరిగి నిర్మించారు. ఈ పుస్తకంలో ఈ సంఘటనలన్నీ వివరణాత్మకంగా ప్రస్తావించబడ్డాయి. అలాగే ఇందులో యెరూషలేము నిర్మాణంలో పాలుపంచుకొన్నవారి పేర్లు పేర్కొనబడ్డాయి. ఈ సంఘటనలన్నీ సుమారుగా క్రీ.పూ.445 లో జరిగాయి. ఈ పుస్తకంలో మొత్తం 13 అధ్యాయాలు ఉన్నాయి.

17 బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'యోబు' పుస్తకం పేరు 'అయ్యూబ్'. బైబిల్ ఇంగ్లిష్ అనువాద ప్రతిలో దీని పేరు **Job.** ఈ పుస్తకం దైవప్రవక్త హజ్రత్ అయ్యూబ్ (అ) [యోబు] వైపుకు స్థాపింపబడింది. ఆయన యొక్కసహనస్థయిర్యాల గురించిన ప్రశంస ఖుర్‌ఆన్‌లో సైతం పేర్కొనబడి ఉంది. మృతసముద్రానికి తూర్పు దిక్కున 'ఊజు' అనే పేరు గల పట్టణమొకటి ఉంది. ఆయన అక్కడ జన్మించారు. అక్కడే ఆయన దేవునిచే పరీక్షించబడ్డారు. ఖుర్‌ఆన్‌లో

***(తరువాతి పేజీ చూడండి)***

(18) కీర్తనల గ్రంథము [18] (19) సామెతల గ్రంథము [19] (20) ప్రసంగి [20]

**(అథఃసూచికలు)**

***(17 వ అథఃసూచిక తరువాయి భాగం)***

ఆ పరీక్షలకు సంబంధించిన వివరాలు పేర్కొనబడలేదు. తౌరాతు గ్రంథంలో ఆయన చర్మ వ్యాధులచే పరీక్షించబడ్డారని పేర్కొనబడి ఉంది. ఈ పుస్తకంలో ఆ పరీక్షలకు సంబంధించిన గాథే పేర్కొనబడింది. అందులో ఎక్కువభాగం హజ్రత్ అయ్యూబ్ (అ) [యోబు] యొక్క ముగ్గురు స్నేహితులయిన తేమానీయుడైన ఎలీఫజు, షూహీయుడైన బిల్దదు, నయమాతీయుడైన జోఫరు లతో జరిగిన సంభాషణలతో కూడుకొని ఉన్నది. ఆ ముగ్గురు స్నేహితులు హజ్రత్ అయ్యూబ్ (అ) [యోబు] పై ఆ విపత్తులు ఆయన చేసిన ఏదో తప్పుకు శిక్షగా వచ్చిపడ్డాయని నిరూపించాలని కోరుకున్నారు. అయితే హజ్రత్ అయ్యూబ్ (అ) [యోబు] మాత్రం ఆ విషయాన్ని నిరాకరించేవారు. చివరగా అల్లాహ్ తరఫున వెలువడిన నిర్ణయం పేర్కొనబడింది. ఈ పుస్తకంలో మొత్తం 42 అధ్యాయాలు ఉన్నాయి. ఈ పుస్తకం తనలో ఇమిడియున్న కవిత్వం మరియు సాహిత్యం రీత్యా అత్యున్నతమైనదిగా పరిగణించబడుతుంది.

18 బైబిల్ అరబీ అనువాద ప్రతిలో 'కీర్తనల గ్రంథం' పుస్తకం పేరు 'జబూర్'. బైబిల్ ఇంగ్లీష్ అనువాద ప్రతిలో దీని పేరు **Psalms.** ఖుర్ఆన్‌లో అల్లాహ్ "మేము దావూద్‌కు జబూర్‌ను ప్రసాదించాము" అని ఏ గ్రంథం గురించి అయితే ప్రస్తావించాడో ఆ దైవగ్రంథం యొక్క ప్రక్షిప్త (మార్పులూచేర్పులకు గురిచేయబడిన) రూపమిది. ఈ పుస్తకం ఎక్కువగా స్తోత్రం మరియు హితబోధతో కూడిన కీర్తనలతో నిండి ఉన్నది. ఇందులో 150 కీర్తనలు ఉన్నాయి.

19 బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'సామెతల గ్రంథం' పుస్తకం పేరు 'అమ్‌సాల్' . బైబిల్ ఇంగ్లీష్ అనువాద ప్రతిలో దీని పేరు **Proverbs.** ఇది సామెతలు మరియు ఉపదేశాల సంకలనం. దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) [సొలొమోను]దీనిని క్రోడీకరించారని క్రైస్తవులు పేర్కొంటారు. బైబిల్ లోని 'రాజులు మొదటి గ్రంథము' యొక్క 4వ అధ్యాయంలోని 32వ వాక్యంలో 'అతడు మూడువేల సామెతలు చెప్పెను' అని పేర్కొనబడింది. ఇందులో 31 అధ్యాయాలు ఉన్నాయి.

20 బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'ప్రసంగి' పుస్తకం పేరు 'వాఇజ్' . బైబిల్ ఇంగ్లీష్ అనువాద ప్రతిలో దీని పేరు **Ecclesiastes.** దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ) [దావీదు] కుమారులలో ఒక కుమారుని పేరు 'జామిఅహ్' లేదా 'వాఇజ్' అని ప్రతీతి. ఈ గ్రంథంలో ఆయన ఉపదేశాలే పేర్కొనబడి ఉన్నాయి. ఇందులో మొత్తం 12 అధ్యాయాలు ఉన్నాయి.



(21) పరమ గీతము [21] (22) యెషయా గ్రంథము [22] (23) యిర్మీయా [23]

**(అథఃసూచికలు)**

21 బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'పరమ గీతము' పుస్తకం పేరు 'గజ్‌లుల్ గజ్‌లాత్ '. బైబిల్ ఇంగ్లీష్ అనువాద ప్రతిలో దీని పేరు **Songs of Solomon.** క్రైస్తవుల ఉవాచ ప్రకారం ఇది దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) [సొలొమోను] పలికిన గీతాల సంకలనం. దీనికి సంబంధించిన ప్రస్తావన బైబిల్ లోని 'రాజులు మొదటి గ్రంథము' యొక్క 4వ అధ్యాయంలోని 32వ వాక్యంలో 'అతడు మూడువేల సామెతలు చెప్పెను, వెయ్యిన్నియయిదు కీర్తనలు రచించెను' అని పేర్కొనబడింది. ఇందులో 8 అధ్యాయాలు ఉన్నాయి.

22 బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'యెషయా' పుస్తకం పేరు 'యస్‌ఇయాహ్ '. బైబిల్ ఇంగ్లీష్ అనువాద ప్రతిలో దీని పేరు **Isaiah.** ఇది హజ్రత్ అష్‌ఇయా బిన్ ఆమూస్ (అ) (ఆమోజు కుమారుడయిన యెషయా) వైపుకు ఆపాదించబడింది. ఆయన క్రీస్తుపూర్వం ఎనిమిదివ శతాబ్దంలో యహూదాహ్ (యూదా) రాజయిన హజ్‌ఖియాహ్ (హిజ్కియా)కు ప్రధానమంత్రిగా ఉన్నారు. అష్షూరు రాజయిన సన్హేరీబు యెరూషలేము మీదికి దండెత్తినప్పుడు హజ్రత్ అష్‌ఇయా (అ) [యెషయా] హిజ్కియా రాజుకు ఎంతగానో సహకరించారు. దీనికి సంబంధించిన ప్రస్తావన 'రాజులు రెండవ గ్రంథము' యొక్క 28వ అధ్యాయంలోనూ, 'దినవృత్తాంతములు రెండవ గ్రంథము' యొక్క 32వ అధ్యాయంలోనూ ఉన్నది. ఈ పుస్తకంలో హజ్రత్ అష్‌ఇయా (అ) [యెషయా] కు భవిష్య సంఘటనలకు సంబంధించి కలిగిన దర్శనములు పేర్కొనబడి ఉన్నాయి. ఆ భవిష్యవాణులను (క్రైస్తవుల ఉవాచ ప్రకారం) ఆయన ఉజ్జియా యోతాము, ఆహాజు, హిజ్కియాయను యూదా రాజుల దినములలో వెలువరించారు. ఈ పుస్తకంలో మొత్తం 66 అధ్యాయాలు ఉన్నాయి. ఇది కూడా తన సాహిత్య విలువల రీత్యా ఎంతో ఉన్నతమైనదిగా పరిగణించబడుతుంది.

23 బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'యిర్మీయా' పుస్తకం పేరు 'యర్‌మియాహ్ '. బైబిల్ ఇంగ్లీష్ అనువాద ప్రతిలో దీని పేరు **Jermiah.** ఇది హజ్రత్ అష్‌ఇయా (అ) వారసులయిన హజ్రత్ ఇర్మియా (అ) వైపుకు ఆపాదించబడింది. ఆయన యోషీయా మరియు సిద్కియా కాలములో ఇశ్రాయేలీయుల అకృత్యాలను నిరోధించేందుకై ప్రభవింపజేయబడ్డారు. అయితే ఇశ్రాయేలీయులు

***(తరువాతి పేజీ చూడండి)***

(24) విలాప వాక్యములు [24]      (25) యెహెజ్కేలు [25]

**(అథఃసూచికలు)**

***(23 వ అథఃసూచిక తరువాయి భాగం)***

తమ అకృత్యాలను విడనాడనప్పుడు ఆయనకు దైవవాణి ద్వారా నెబుకద్రెజరు శిక్ష ఆ జాతిపై విరుచుకుపడబోతున్నదనే సమాచారం తెలియజేయబడింది. ఆయన ఆ విషయాన్ని వెల్లడించారు. అలాగే తౌరాతు గ్రంథము ప్రకారం వారికి బబులోను రాజుకు లొంగిపోవలసిందిగా ఆయన జాతి ప్రజలకు సలహా ఇచ్చారు. కానీ ఆ జాతి ప్రజలు ఆయనకు ఎన్నో కష్టాలకు గురిచేశారు. చివరకు నెబుకద్రెజరు యెరూషలేము పైకి దండెత్తగా ఆ నగరం పూర్తిగా నాశనమయిపోయింది. అప్పుడు హజ్రత్ ఇర్మియాహ్ (అ) [యిర్మీయా] ఈజిప్టుకు తరలిపోయారు. పవిత్ర ఖుర్ఆన్‌లో "ఔ కల్లజీ మర్ర అలా ఖర్యతిన్.... " అనే వాక్యంలో పేర్కొనబడిన సంఘటన ఒక ఉల్లేఖనం ప్రకారం ఆయనకు సంబంధించినదే. యిర్మీయా గ్రంథములో పైన పేర్కొనబడిన సంఘటనల ప్రస్తావనే ఉన్నది. అలాగే ఇశ్రాయేలీయులను అకృత్యాల నుంచి నివారించడం జరిగింది. ఈ పుస్తకంలో మొత్తం 52 అధ్యాయాలున్నాయి.

24 బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'విలాప వాక్యములు' పుస్తకం పేరు 'నౌహ '. బైబిల్ ఇంగ్లిష్ అనువాద ప్రతిలో దీని పేరు **Lamentations.** నెబుకద్రెజరు దాడి తర్వాత యెరూషలేము నాశనమయిపోయినప్పుడు, ఇశ్రేయేలీయులపై తీవ్రమైన శిక్ష విరుచుకుపడినప్పుడు ఎవరో ఈ విలాపవాక్యములను (శోక గీతికలను) పలికారు. ఈ విలాప వాక్యాలను క్రైస్తవులు హజ్రత్ ఇర్మియా (అ) [యిర్మీయా] వైపుకు ఆపాదించారు. ఈ పుస్తకంలో మొత్తం 5 అధ్యాయాలున్నాయి.

25 బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'యెహెజ్కేలు' పుస్తకం పేరు ' కితాబె హిజ్ఖీఏల్'. బైబిల్ ఇంగ్లిష్ అనువాద ప్రతిలో దీని పేరు **Ezekiel.** ఇది హజ్రత్ హిజ్ఖీల్ (అ) [యెహెజ్కేలు] వైపుకు ఆపాదించబడింది. (ఈయనకు సంబంధించిన పరిచయం ఇంతకు ముందు ఇవ్వబడింది) ఈ పుస్తకంలో ఆయన ద్వారా అల్లాహ్ యొక్క (విస్పష్టమైన) వాక్కు భవిష్యవాణుల రూపంలోనూ, హితోపదేశాల రూపంలోనూ పేర్కొనబడింది. ఈ పుస్తకంలో మొత్తం 48 అధ్యాయాలున్నాయి.



(26) దానియేలు [26]      (27) హోషేయ [27]      (28) యోవేలు [28]

**(అథఃసూచికలు)**

26 బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'దానియేలు' పుస్తకం పేరు 'దానీఏల్ '. బైబిల్ ఇంగ్లిష్ అనువాద ప్రతిలో దీని పేరు **Daniel.** ఇది హజ్రత్ దానియాల్ (అ) [దానియేలు] వైపుకు ఆపాదించబడింది. ఆయన గురించి తౌరాతు గ్రంథములో ఈ విధంగా పేర్కొనబడి ఉంది: " నెబుకద్నెజరు ఏయే అధికారులనయితే యూదా నుంచి బబులోనుకు తీసుకుపోయాడో వారిలో హజ్రత్ దానియాల్ (అ) [దానియేలు] కూడా ఉన్నారు". రాజు యొక్క పలు స్వప్నాలకు సరియైన వివరణలను, భావములను అందజేసినందుకు గాను ఆయన బబులోను ప్రాంతానికి అధిపతిగా నియమింపబడ్డారు. ఈ పుస్తకం ప్రారంభంలో బబులోను రాజులకు వారి భవిష్యత్తుకు సంబంధించి వచ్చిన స్వప్నాలు పేర్కొనబడి ఉన్నాయి. అలాగే స్వయంగా హజ్రత్ దానియాల్ (అ) [దానియేలు] ఇశ్రాయేలీయుల భవిష్యత్తుకు సంబంధించి దర్శించిన స్వప్నాలు కూడా పేర్కొనబడి ఉన్నాయి. అలాగే వాటిలో దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) [ఏసు] కు సంబంధించిన శుభవార్త కూడా ఇమిడి ఉన్నది. ఈ పుస్తకంలో మొత్తం 12 అధ్యాయాలున్నాయి.

27 బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'హోషేయ' పుస్తకం పేరు' **హోసీత్'** . బైబిల్ ఇంగ్లిష్ అనువాద ప్రతిలో దీని పేరు **Hosea.** తౌరాతు గ్రంథం ఉల్లేఖనం ప్రకారం హోసీత్ బిన్ బీరీ దైవప్రవక్త. (ఇస్లామీయ గ్రంథాలలో ఈయనకు సంబంధించిన ప్రస్తావన మాకు లభ్యం కాలేదు) ఆయన ఉజ్జియా, యోతాము, ఆహాజు, హిజ్కియా అనే యూదా రాజుల దినములలో (క్రీస్తుపూర్వం తొమ్మిదవ శతాబ్దంలో) జీవించారు. ఆ కాలంలోనే ఈ దైవవాక్కు (హోషేయ గ్రంథము) ఆయనపై అవతరించింది. ఈ పుస్తకంలో ఎక్కువగా ఇశ్రాయేలీయుల అకృత్యాలపై హెచ్చరికలు, పశ్చాత్తాపం చెందవలసిందిగా హితోపదేశం, సత్కార్యానికి గాను ఇవ్వబడే ప్రతిఫలం మొదలయినవాటికి సంబంధించిన ప్రస్తావన ఉన్నది. ఈ ప్రస్తావన ఎక్కువగా ఉదాహరణలతోనూ, సంకేతాలతోనూ కూడుకొని ఉంది. ఈ పుస్తకంలో మొత్తం 14 అధ్యాయాలున్నాయి.

28 బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'యోవేలు' పుస్తకం పేరు 'యువాఈల్' . బైబిల్ ఇంగ్లిష్ అనువాద ప్రతిలో దీని పేరు **Joel.** తౌరాతు గ్రంథం ఉల్లేఖనం ప్రకారం ఈయన దైవప్రవక్త.

***(తరువాతి పేజీ చూడండి)***

(29) ఆమోసు [29] (30) ఓబద్యా [30] (31) యోనా [31]

**(అథఃసూచికలు)**

*(28 వ అథఃసూచిక తరువాయి భాగం)*

మూడు అధ్యాయాలతో కూడుకొనియున్న ఈ పుస్తకంలో ఆయనపై అవతరింపజేయబడిన దైవవాక్కు ప్రస్తావన ఉన్నది. అందులో అకృత్యాలను విడనాడవలసిందిగా ఉపదేశం, ఉపవాసానికి సంబంధించిన ఆదేశం, దాని మంచి పర్యవసానాలు మొదలయినవి పేర్కొనబడ్డాయి.

[29] బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'ఆమోసు' పుస్తకం పేరు **'ఆమోస్'** . బైబిల్ ఇంగ్లీష్ అనువాద ప్రతిలో దీని పేరు **Amos.** తౌరాతు గ్రంథం ఉల్లేఖనం ప్రకారం ఈయన కూడా దైవప్రవక్త. ఆయన ప్రారంభంలో తెకోవ పట్టణంలో కాపరిగా ఉన్నారు. ఆ తర్వాత రమారమి క్రీస్తుపూర్వం 783 లో దైవప్రవక్తగా దైవం తరపున నియుక్తులయ్యారు. ఉజ్జియా రాజు కాలంలో ఈ తొమ్మిది అధ్యాయాలతో కూడిన పుస్తకం ఆయనపై అవతరించింది. ఇందులో ఇశ్రాయేలీయులను వారి అకృత్యాల విషయంలో హెచ్చరించడానికి సంబంధించిన ప్రస్తావన ఉంది. అలాగే వారిపైకి శిక్షగా 'రాజులు రెండవ గ్రంథము' యొక్క 15 వ అధ్యాయపు 29వ వచనంలో పేర్కొనబడిన అష్షూరు రాజు **(Assyria)** దాడికి సంబంధించిన భవిష్యవాణి పేర్కొనబడింది.

[30] బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'ఓబద్యా' పుస్తకం పేరు 'కితాబె అబ్దియాహ్' . బైబిల్ ఇంగ్లీష్ అనువాద ప్రతిలో దీని పేరు **Obadiah.** ఇది 21 వచనాలతో కూడిన చిన్న పుస్తకం. ఇందులో క్రైస్తవుల ఉవాచ ప్రకారం హజ్రత్ అబ్దియా (అ) కు కలిగిన ఒక దర్శనం గురించి పేర్కొనబడి ఉంది. ఆ దర్శనంలో ఎదోము పట్టణానికి సంబంధించిన కొన్ని భవిష్యవాణులు పేర్కొనబడ్డాయి.

[31] బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'యోనా' పుస్తకం పేరు ' యోనాహ్' . బైబిల్ ఇంగ్లీష్ అనువాద ప్రతిలో దీని పేరు **Jonah.** ఈ పుస్తకం ప్రసిద్ధ దైవప్రవక్త అయిన హజ్రత్ యూనుస్ (అ) [యోనా] వైపుకు ఆపాదించబడింది. నాలుగు అధ్యాయాలతో కూడిన ఈ పుస్తకంలో ఆయన నీనెవె పట్టణం వైపుకు ఆయన ప్రభవింపజేయబడడానికి సంబంధించిన సంఘటన పేర్కొనబడి ఉంది. ఈ సంఘటన ముస్లింలలో ప్రసిద్ధమయిన వృత్తాంతము కంటే కొంచెం భిన్నంగా పేర్కొనబడి ఉంది.



(32) మీకా [32] (33) నహూము [33] (34) హబక్కూకు [34]

**(అథఃసూచికలు)**

[32] బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'మీకా' పుస్తకం పేరు 'మీకాహ్ '. బైబిల్ ఇంగ్లీష్ అనువాద ప్రతిలో దీని పేరు **Micah.** ఇది మోరష్తీయులయిన హజ్రత్ మీఖా (అ) [మీకా] వైపుకు ఆపాదించబడింది. ఆయన రమారమి క్రీస్తుపూర్వం తొమ్మిదవ శతాబ్దంలో హిజ్కియా రాజు దినములలో ప్రభవింపజేయబడ్డారు. ఆయన ఇశ్రాయేలీయులను వారి అకృత్యాల విషయంలో భయపెట్టడంతో పాటు దేవుని శిక్ష గురించి హెచ్చరించారు కూడా. హిజ్కియా రాజు ఆయన హితోపదేశాన్ని స్వీకరించి సన్మార్గాన్ని అవలంబించగా దేవుని శిక్ష తొలగిపోయింది. దీనిగురించి రాజులు రెండవ గ్రంథము లో 23వ అధ్యాయం యొక్క 26 వ వచనంలోనూ, యిర్మీయా గ్రంథములో 26వ అధ్యాయం యొక్క 18 వ వచనములోనూ పేర్కొనబడి ఉంది. ఈ పుస్తకంలో మొత్తం 7 అధ్యాయాలున్నాయి. అవన్నీ ఈ సత్యధర్మ ప్రచారానికి సంబంధించిన విషయాలతోనే నిండియున్నాయి.

[33] బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'నహూము' పుస్తకం పేరు 'కితాబె నాహూమ్' . బైబిల్ ఇంగ్లీష్ అనువాద ప్రతిలో దీని పేరు **Nahum.** తౌరాతు గ్రంథము ప్రకారం ఈయన కూడా దైవప్రవక్తే. ఆయన జీవించిన కాలానికి, జీవితచరిత్రకు సంబంధించిన వివరాలు మాకు లభ్యం కాలేదు. మూడు అధ్యాయాలతో కూడిన 'నహూము' గ్రంథంలో ఆయన దర్శించిన ఒక స్వప్నం గురించి పేర్కొనబడింది. అందులో నీనెవె పట్టణపు వినాశనానికి సంబంధించిన భవిష్యవాణులు పేర్కొనబడ్డాయి.

[34] బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'హబక్కూకు' పుస్తకం పేరు 'కితాబె హబఖ్ఖూఖ్' . బైబిల్ ఇంగ్లీష్ అనువాద ప్రతిలో దీని పేరు **Habakkuk.** తౌరాతు గ్రంథము ప్రకారం ఈయన కూడా దైవప్రవక్తే. ఆయన ప్రభవించిన కాలానికి సంబంధించిన ఆధారాలు విశ్వసనీయమైనవిగా లేవు. తౌరాతు గ్రంథం ద్వారా ఆయన నెబుకద్నెజరు యెరూషలేముపై దాడి చేయడానికి ముందరి కాలంలో జీవించారని తెలుస్తుంది. హబక్కూకు పుస్తకంలో ఆయన దర్శించిన ఒక స్వప్నం గురించి పేర్కొనబడింది. అందులో ఇశ్రాయేలీయులను వారి అకృత్యాల పట్ల హెచ్చరిక, నెబుకద్నెజరు యెరూషలేముపై దాడి చేయడానికి సంబంధించిన భవిష్యవాణి పేర్కొనబడ్డాయి. ఈ పుస్తకంలో మొత్తం 3 అధ్యాయాలున్నాయి.

(35) జెఫన్యా [35]    (36) హగ్గయి [36]    (37) జెకర్యా [37]

---

**(అథఃసూచికలు)**

[35] బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'జెఫన్యా' పుస్తకం పేరు **'సఫీనాహ్'** . బైబిల్ ఇంగ్లిష్ అనువాద ప్రతిలో దీని పేరు **Zephaniah.** తౌరాతు గ్రంథం ప్రకారం ఈయన కూడా దైవప్రవక్త. యూదా రాజయిన ఆమోను కుమారుడయిన యోషీయా **(Josiah)** కాలంలో ప్రభవించారు. మూడు అధ్యాయాలతో కూడిన ఈ పుస్తకం ద్వారా ఆయన నెబుకద్నెజరు ద్వారా విరుచుకుపడబోయే శిక్ష గురించి ఇశ్రాయేలీయులను హెచ్చరించారు.

[36] బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'హగ్గయి' పుస్తకం పేరు 'కితాబె హజ్జా' . బైబిల్ ఇంగ్లిష్ అనువాద ప్రతిలో దీని పేరు **Haggai.** ఈ పుస్తకం హజ్రత్ హజ్జా (అ) [హగ్గయి] వైపుకు ఆపాదించబడింది. నెబుకద్నెజరు ద్వారా యెరూషలేము నాశనమయిపోయిన తర్వాత పారశీక రాజయిన దర్యావేషు కాలంలో సుమారు క్రీ.పూ.522లో హజ్రత్ హజ్జా (అ) [హగ్గయి] ప్రభవించారు. ఆయన తిరిగి యెరూషలేమును నిర్మించేలా తన జాతి ప్రజలను ప్రేరేపించారు. ఈ విషయం గురించి బైబిల్ లోని 'ఎజ్రా' పుస్తకం యొక్క 5 వ అధ్యాయపు మొదటి వచనంలో పేర్కొనబడి ఉంది. రెండు అధ్యాయాలతో కూడిన ఈ చిన్న పుస్తకంలో యెరూషలేమును తిరిగి నిర్మించడానికి సంబంధించిన ఉపదేశం, ఆ కార్యంలో అడ్డంకులను ఏర్పరిచే వారికి హెచ్చరిక పేర్కొనబడి ఉన్నాయి.

[37] బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'జెకర్యా' పుస్తకం పేరు 'కితాబె జకరియ్యా' . బైబిల్ ఇంగ్లిష్ అనువాద ప్రతిలో దీని పేరు **Zechariah.** ఈ పుస్తకం హజ్రత్ జకరియ్యా(అ) [జెకర్యా] వైపుకు ఆపాదించబడింది. తౌరాతు గ్రంథము ప్రకారం ఆయన యెరూషలేము నిర్మాణంలో హజ్రత్ హజ్జా (అ) (హగ్గయి) సహచరులలో ఒకరుగా ఉన్నారు. ఈ పుస్తకంలో ఎక్కువగా స్వప్నాలు పేర్కొనబడి ఉన్నాయి. వాటిలో ఇశ్రాయేలీయుల భవిష్యత్తు గురించి, దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) [ఏసు] రాకడ గురించి (3వ అధ్యాయంలోనూ, 9వ అధ్యాయంలోనూ) భవిష్యద్వాణులు పేర్కొనబడి ఉన్నాయి. ఈ పుస్తకంలో మొత్తం 14 అధ్యాయాలున్నాయి. (ఈయన పవిత్ర ఖుర్ఆన్‌లో పేర్కొనబడిన దైవప్రవక్త హజ్రత్ జకరియ్యా (అ) కారనే విషయాన్ని గుర్తుంచుకోవాలి)



(38) మలాకీ [38] (ఈయన దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) [ఏసు] ప్రభవించడానికి దాదాపు 42 సంవత్సరాల ముందు జీవించియున్నారు)

పాతనిబంధనకు చెందిన ఈ మొదటి రకపు 38 పుస్తకాలన్నీ ప్రాచీన కాలపు క్రైస్తవ పండితుల దృష్టిలో విశ్వసనీయమైనవి, అంగీకరించబడినట్టివి. అయితే సామిరీ వర్గం [39] దృష్టిలో కేవలం ఏడు పుస్తకాలు మాత్రమే స్వీకరించదగినవి. వాటిలో ఐదు దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) [ఏసు] వైపుకు ఆపాదించబడినట్టివి. సామిరీ వర్గానికి చెందిన 'యెహోషువ' పుస్తకం, 'న్యాయాధిపతులు' పుస్తకం భిన్నమైనవి. అలాగే వారి తౌరాతు గ్రంథం సాధారణ యూదుల తౌరాతు గ్రంథం కంటే భిన్నమైనది.

---

**(అథఃసూచికలు)**

[38] బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'మలాకీ' పుస్తకం పేరు 'మలాకీ '. బైబిల్ ఇంగ్లిష్ అనువాద ప్రతిలో దీని పేరు **Malachi.** ఇది హజ్రత్ మలాఖియా (అ) [మలాకీ] వైపుకు ఆపాదించబడింది. ఆయన పాత నిబంధన కాలానికి చెందిన ఆఖరి దైవప్రవక్త. ఈ పుస్తకంలో ఇశ్రాయేలీయుల కృతఘ్నత గురించి మరియు దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) [ఏసు] పుట్టుకకు సంబంధించిన భవిష్యద్వాణి (మూడవ అధ్యాయంలో) పేర్కొనబడి ఉంది. ఈ పుస్తకంలో మొత్తం 4 అధ్యాయాలున్నాయి.

[39] 'సామిరీ' అనేది యూదులకు చెందిన ఒక వర్గం పేరు. ఇది పాలస్తీనాలోని 'సామిరహ్' **(Samaria)** అనే పట్టణానికి చెందినదిగా చెప్పబడుతుంది. సామిరహ్ పట్టణం నాశనమయిపోయిన తర్వాత తిరిగి అభివృద్ధి చెంది 'నాబిలస్' **(Nablous)** అనే పేరుతో ప్రసిద్ధమయింది. అక్కడి ప్రజలు సాధారణ యూదులతో మౌలికంగా రెండు అంశాలలో విభేదిస్తారు. ఒకటి ఆమోదించబడిన గ్రంథాల సంఖ్య విషయంలో వారు విభేదిస్తారు. ఈ విషయం గురించి 'ఇజ్‌హారుల్ హఖ్' (ఈ గ్రంథానికి మూల రచన) రచయిత పేర్కొనియున్నారు. రెండు ఆరాధన కొరకు ఉద్దేశించబడిన ప్రదేశం విషయంలో వారు విభేదిస్తారు. అనగా వారు సాధారణ యూదులకు భిన్నంగా యెరూషలేమును కాకుండా గెరిజీము కొండను ప్రాతిపదికగా తీసుకొని ఆరాధిస్తారు. ఆ కొండ నాబిలస్ కు దక్షిణ దిశలో ఉంది. అక్కడ క్రీస్తుపూర్వం నాల్గవ శతాబ్దంలో మనష్షే (ఈయనకు సంబంధించిన ప్రస్తావన బైబిల్ లోని 'ఎజ్రా' గ్రంథం యొక్క 10 వ అధ్యాయంలోని 30వ వాక్యంలో ఉన్నది) ఒక హైకల్ (యూదుల దేవాలయం)ను నిర్మించాడు.

## పాత నిబంధనకు చెందిన రెండవ రకం గ్రంథాలు :

పాత నిబంధనకు చెందిన రెండవ రకం గ్రంథాలు (వేటి ప్రామాణికత విషయంలోనయితే క్రైస్తవ పండితులలో భేదాభిప్రాయాలున్నాయో ఆ గ్రంథాలు) 9 ఉన్నాయి. ఆ 9 గ్రంథాల పేర్లు క్రింద పేర్కొనబడుతున్నాయి.

(1) ఎస్తేరు [40] (2) బారూకు గ్రంథము [41]

**(అథఃసూచికలు)**

[40] బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'ఎస్తేరు' పుస్తకం పేరు 'అస్తర్'. బైబిల్ ఇంగ్లీష్ అనువాద ప్రతిలో దీని పేరు **Esther.** ఎస్తేరు ఒక యూదు మహిళ పేరు. ఆమె నెబుకద్నెజరు యెరూషలేము పైకి దండెత్తిన తర్వాత బబులోను వైపుకు బహిష్కరించబడినవారిలో చేరియున్నది. ఇరాన్ (పారసీక)రాజు అయిన అహష్వేరోషు **(Ahasuerus)** తన మొదటి భార్య పట్ల కినుక వహించి ఆమెను (ఎస్తేరును) వివాహం చేసుకున్నాడు. ఆయన మంత్రి అయిన హామాను ఎస్తేరు తండ్రి అయిన మొర్దెకై పట్ల కినుక వహించి బహిష్కరించబడిన యూదులందరినీ హింసించాలని సంకల్పించుకున్నాడు. అప్పుడు ఎస్తేరు రాజు ద్వారా అతడిని నిరోధించింది. ఈ వృత్తాంతమే ఈ పుస్తకంలో పేర్కొనబడింది. ఈ పుస్తకంలో మొత్తం 10 అధ్యాయాలున్నాయి.

[41] బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'బారూకు' పుస్తకం పేరు 'బారూక్'. బైబిల్ ఇంగ్లీష్ అనువాద ప్రతిలో దీని పేరు **Baruch.** ఇది హజ్రత్ బారూఖ్ (అ) [బారూకు] వైపుకు ఆపాదించబడింది. ఆయన హజ్రత్ ఇర్మియా (అ) [యిర్మీయా] శిష్యులు మరియు ఆయనపై అవతరించే దైవవాణిని వ్రాసే లేఖకులు. ఆయన హజ్రత్ ఇర్మియా (అ) [యిర్మీయా] వెంట సుఖదుఃఖాలన్నింటిలోనూ తోడుగా ఉన్నారు. ఈ విషయం గురించి బైబిల్ లోని 'యిర్మీయా' గ్రంథము యొక్క 32వ అధ్యాయంలో 13 నుంచి 16వ వచనము వరకు, 36 వ అధ్యాయంలో 4 నుంచి 32 వ వచనము వరకు, 43 వ అధ్యాయంలో 3 నుంచి 16 వ వచనము వరకు మరియు 45 వ అధ్యాయంలో 1 నుంచి 3 వ వచనము వరకు పేర్కొనబడి ఉంది. ఈ పుస్తకం ప్రొటెస్టెంట్ వర్గానికి చెందిన బైబిల్ లో (నేడు ఎక్కువగా వాడుకలో ఉన్న బైబిల్) లేదు. ఈ పుస్తకం కేథొలిక్ వర్గానికి చెందిన బైబిల్ లో ఉంది.



(3) 'దానియేలు గ్రంథం' లోని ఒక భాగం (4) తూబియా గ్రంథము [42]

(5) **Judith** గ్రంథము [43] (6) సొలొమోను జ్ఞానము గ్రంథము [44]

(7) చర్చి హితోపదేశాలు [45]

**(అథఃసూచికలు)**

[42] బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'తూబియా' పుస్తకం పేరు 'కితాబె తూబియా'. బైబిల్ ఇంగ్లీష్ అనువాద ప్రతిలో దీని పేరు **Tobit.** తూబియా నఫ్తాలి వంశానికి చెందిన ఒక యూదుడు. ఆయన దేశం నుంచి బహిష్కరించబడిన దినములలో అష్షూరుకు వెళ్ళిపోయాడు. ఆయనకు 'అల్‌బార్' (సజ్జనుడు) అనే బిరుదు ఉండేది. 'తూబియా' గ్రంథములో ఆయన, ఆయన కుమారుడు సాగించిన ఒక సుదీర్ఘమైన, ప్రమాదకరమైన ప్రయాణం గురించి పేర్కొనబడింది. అలాగే ఆయనకు చెందిన ప్రేమ గాథ కూడా ప్రస్తావించబడి ఉంది. అలాగే దేవునిపై సంపూర్ణంగా నమ్మకముంచాలనే తాకీదు ఈ పుస్తకంలో పేర్కొనబడి ఉంది. సాహిత్య విలువల రీత్యా ఈ పుస్తకం ఎంతో ఉన్నతమైనది. ఈ పుస్తకం కూడా ప్రొటెస్టెంట్ వర్గానికి చెందిన బైబిల్‌లో లేదు.

[43] బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో **Judith** పుస్తకం పేరు 'కితాబె యహూదియత్'. బైబిల్ ఇంగ్లీష్ అనువాద ప్రతిలో దీని పేరు **Judith.** ఇది ఒక యూదు మహిళ వైపుకు ఆపాదించబడింది. ఆమె సాహసం చేసి తన జాతి ప్రజలకు అసూరు రాజు హింసల నుంచి విముక్తి కలిగించింది. ఆమెకు చెందిన ఒక ప్రేమ గాథ ఈ పుస్తకంలో ప్రస్తావించబడి ఉంది.

[44] బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'సొలొమోను జ్ఞానము' పుస్తకం పేరు 'దానిషె సులైమాన్'. బైబిల్ ఇంగ్లీష్ అనువాద ప్రతిలో దీని పేరు **Wisdom of Solomon.** ఇది పూర్తిగా 'సామెతలు' గ్రంథాన్ని పోలి ఉంటుంది.

[45] బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'చర్చి హితోపదేశాలు' పుస్తకం పేరు 'కలీసాయీ పంద్ ఒ నసాయిహ్'. .బైబిల్ ఇంగ్లీష్ అనువాద ప్రతిలో దీని పేరు **Ecclesiasticus.** ఇది క్రీస్తుపూర్వం 200 కు చెందిన 'మసీహ్ ఇబ్నె సరూఖ్' అనే వ్యక్తి మనుమడి వైపుకు ఆపాదించబడింది. ఇందులో మసీహ్ ఇబ్నె సరూఖ్‌కు చెందిన కొన్ని హితోపదేశాలు పేర్కొనబడి ఉన్నాయి. సాహిత్యవిలువల రీత్యా ఈ పుస్తకం ఎంతో ఉన్నతమయినది.

(8) మకాబీయులు మొదటి గ్రంథము [46] (9) మకాబీయులు రెండవ గ్రంథము [47]

## క్రొత్త నిబంధనకు చెందిన గ్రంథాలు

### క్రొత్త నిబంధనకు చెందిన మొదటి రకం గ్రంథాలు :

క్రొత్త నిబంధనకు చెందిన మొదటి రకం గ్రంథాలు (వేటి ప్రామాణికత విషయంలోనయితే ప్రాచీన కాలపు క్రైస్తవ పండితులందరూ ఏకాభిప్రాయాన్ని కలిగియున్నారో ఆ గ్రంథాలు) 20 ఉన్నాయి. ఆ 20 గ్రంథాల పేర్లు ఇవి :-

(1) మత్తయి సువార్త [48] (2) మార్కు సువార్త [49]

**(అథఃసూచికలు)**

[46] బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'మకాబీయులు మొదటి గ్రంథము' పుస్తకం పేరు 'మకాబియోం కీ పహ్‌లీ కితాబ్'. ఇది మకాబీయుల మొదటి గ్రంథము. ఇందులో వారి విద్రోహానికి సంబంధించిన గాథ పేర్కొనబడి ఉంది.

[47] బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'మకాబీయులు రెండవ గ్రంథము' పుస్తకం పేరు 'మకాబియోం కీ దూస్‌రీ కితాబ్'. ఇది మకాబీయుల రెండవ గ్రంథము. ఇందులో కొన్ని సంవత్సరాల చరిత్ర, ఎంతో అసంగతమైన ఉల్లేఖనాలు పేర్కొనబడి ఉన్నాయి.

ఈ పుస్తకాలతో పాటు ' మొదటి Esdras , రెండవ Esdras, 'ముగ్గురు పిల్లల గీతము', 'బయలు మరియు డ్రాగన్' (Bel and the Dragon) 'మనష్షే ప్రార్థన' అనే ఐదు పుస్తకాలు సైతం విభేదించబడ్డాయి. పైన పేర్కొనబడిన 9 పుస్తకాలు మరియు ఈ ఐదు పుస్తకాలు కలిపి మొత్తం 14 పుస్తకాలయ్యాయి. ఈ 14 పుస్తకాల సముచ్ఛయాన్ని ' అపాక్రిఫా' **(Apocrypha)** అని పిలుస్తారు. ప్రొటెస్టెంట్ వర్గానికి చెందినవారు ఈ 14 పుస్తకాలను దైవగ్రంథాలుగా విశ్వసించరు.

[48] బైబిల్ ఉర్దూ మరియు అరబీ అనువాద ప్రతులలో 'మత్తయి సువార్త' పుస్తకం పేరు 'ఇన్జీలె మతా'. బైబిల్ ఇంగ్లీష్ అనువాద ప్రతిలో దీని పేరు **Maththew.** ఈ పుస్తకం దైవప్రవక్త హజ్‌రత్ ఈసా (అ) [ఏసు] పన్నెండు మంది శిష్యులలో ఒకరయిన మతా (మత్తయి)

*(తరువాతి పేజీ చూడండి)*



(3) లూకా సువార్త [50]

**(అథఃసూచికలు)**

*(48 వ అథఃసూచిక తరువాయి భాగం)*

**(Maththew)** వైపుకు ఆపాదించబడింది. ఆయన పాలస్తీనా దేశంలోని కపెర్నహూము (కాఫర్‌నామ్ )**(Capharnaum)** అనే పట్టణంలో శిస్తు వసూలు చేసే అధికారిగా నియమించబడి బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన హతమార్చబడ్డారు. అయితే ఆయనను ఎప్పుడు, ఎక్కడ హతమార్చడం జరిగిందో వివరాలు లభ్యం కాలేదు. నాలుగు సువార్తలలో ఒక సువార్త (మత్తయి సువార్త) ఈయన వైపుకే ఆపాదించబడింది. క్రైస్తవులు ఈ సువార్తను అతి ప్రాచీన బైబిల్‌గా విశ్వసిస్తారు. వాస్తవానికి ఆ సువార్త (మత్తయి సువార్త) ఆయన ద్వారా ఎంత మాత్రం వ్రాయబడలేదు.

మత్తయి సువార్తలో దైవప్రవక్త హజ్‌రత్ ఈసా (అ) [ఏసు] వంశావళి నుంచి మొదలుకొని ఆయన దివ్యారోహణం వరకు గల సంఘటనలు పేర్కొనబడి ఉన్నాయి. ఇందులో భాగంగా ఎన్నో ఆజ్ఞలు సైతం పేర్కొనబడ్డాయి. ఇందులో మొత్తం 28 అధ్యాయాలు ఉన్నాయి.

[49] బైబిల్ ఉర్దూ మరియు అరబీ అనువాద ప్రతులలో 'మార్కు సువార్త' పుస్తకం పేరు 'ఇన్జీలె ముర్‌ఖుస్'. బైబిల్ ఇంగ్లీష్ అనువాద ప్రతిలో దీని పేరు **Mark.** ఈ పుస్తకం దైవప్రవక్త హజ్‌రత్ ఈసా (అ) [ఏసు] యొక్క పన్నెండు మంది శిష్యులలో ఒకరయిన పుత్‌రుస్ (పేతురు) **(Peter)** శిష్యుడయిన ముర్‌ఖుస్ (మార్కు) **(Mark)** వైపుకు ఆపాదించబడింది. అలెక్సంద్రియ **(Alexandria)** లోని చర్చిని ఆయనే నిర్మించారని క్రైస్తవులు పేర్కొంటారు. ఆయనను క్రీ.శ. 68 లో హతమార్చడం జరిగింది. ఆయన సువార్త పూర్వకాలపు దైవప్రవక్తలు దైవప్రవక్త హజ్‌రత్ ఈసా (అ) [ఏసు] రాకడ గురించి పలికిన భవిష్యద్వాణులతో ప్రారంభమయి ఆయన (హజ్‌రత్ ఈసా (అ) [ఏసు] ) దివ్యారోహణంతో ముగుస్తుంది. ఇందులో మొత్తం 16 అధ్యాయాలున్నాయి.

దైవప్రవక్త హజ్‌రత్ ఈసా (అ) [ఏసు] పన్నెండు మంది శిష్యులలో ఒకరయిన పుత్‌రుస్ (పేతురు) **(Peter)** దైవప్రవక్త హజ్‌రత్ ఈసా (అ) [ఏసు] శిష్యులందరిలోనూ విశిష్ట స్థానాన్ని కలిగియున్నారు. ఆయన అసలు పేరు 'సమ్‌ఆన్' (సీమోను)**(Simon).** ఆయన చేపలు పట్టుకొని జీవించేవారు. ఆయన దైవప్రవక్త హజ్‌రత్ ఈసా (అ) [ఏసు] ను విశ్వసించిన తర్వాత ధర్మప్రచార కార్యకలాపాల విషయంలో ఆయన చైతన్యాన్ని గమనించిన దైవప్రవక్త హజ్‌రత్ ఈసా (అ) [ఏసు] ఆయనకు 'పుత్‌రుస్' (పేతురు) **(Peter)** అని పేరు పెట్టారు. 'పుత్‌రుస్' (పేతురు) అంటే 'బండరాయి' అని అర్థం. తొలుత ఆయన అంతియొకయ

*(తరువాతి పేజీ చూడండి)*

(4) యోహాను సువార్త [51]

ఈ నాల్గింటిని (మత్తయి సువార్త, మార్కు సువార్త, లూకా సువార్త, యోహాను సువార్త) కలిపి అరబీలో 'అనాజిలె అర్‌బఅహ్' (నాలుగు సువార్తలు) అని పిలుస్తారు. 'ఇన్‌జీల్' అనే పదం ఈ నాలుగు సువార్తలను ఉద్దేశించినదే. అయితే అప్పుడప్పుడూ ఔపచారికంగా (సామ్యాన్ని బట్టి) క్రొత్త నిబంధనకు చెందిన అన్ని పుస్తకాలను సూచించేందుకు సైతం 'ఇన్‌జీల్' అనే అరబీ పదం ఉపయోగించబడుతుంది. ఈ పదం వాస్తవానికి అరబీ భాషకు చెందిన పదం కాదు. గ్రీకు భాషలోని 'ఇంక్లియూన్' అనే పదం అరబీ భాషలోనికి గ్రహించబడి 'ఇన్‌జీల్ ' గా వ్యవహారంలోకి వచ్చింది. 'ఇంక్లియూన్' అనే గ్రీకు పదానికి అర్థం 'శుభవార్త' లేదా 'బోధన' అని అర్థం.

**(అథఃసూచికలు)**

***(49 వ అథః సూచిక తరువాయి భాగం)***

(అంతాకియహ్)**(Antioch)** పట్టణంలో ఉన్నారు. ఆ తర్వాత ఆయన రోమా (రూమ్)**(Rome)** తీసుకెళ్ళబడి అక్కడే ఉరి వేయబడ్డారు. ప్రస్తుతం మనకు అందుబాటులో ఉన్న క్రొత్త నిబంధన గ్రంథములో ఆయన వ్రాసిన రెండు పత్రికలు చేర్చబడి ఉన్నాయి. ఆయన సుమారు క్రీస్తుపూర్వం 10 లో జన్మించారు. ఆయన మరణం క్రీ.శ. 67 లో సంభవించింది.

[50] బైబిల్ ఉర్దూ మరియు అరబీ అనువాద ప్రతులలో 'లూకా సువార్త' పుస్తకం పేరు 'ఇన్జీలె లూఖా'. బైబిల్ ఇంగ్లీష్ అనువాద ప్రతిలో దీని పేరు **Luke.** లూకా తన కాలంలో వైద్యునిగా సేవలందించారు. ఆయన పౌలు సాగించిన ప్రయాణాలలో ఆయనకు తోడుగా ఉన్నారు. ఈ విషయం మనకు బైబిల్ క్రొత్త నిబంధన గ్రంథంలోని'అపొస్తలుల కార్యములు' గ్రంథములోని 16 వ అధ్యాయం ద్వారా తెలుస్తుంది. సుమారు క్రీ.శ. 70 లో ఆయన మరణం సంభవించింది. ఆయన సువార్త దైవప్రవక్త హజ్రత్ యహ్యా (అ) [ యోహాను ] పుట్టుకకు సంబంధించిన సంఘటన నుంచి మొదలవుతుంది. 24 అధ్యాయాలతో కూడిన ఈ పుస్తకంలో దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) [ఏసు] ) దివ్యారోహణం వరకు గల సంఘటనలు, ఆజ్ఞలు పేర్కొనబడి ఉన్నాయి.

[51] బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'యోహాను సువార్త' పుస్తకం పేరు 'ఇన్జీలె యోహన్నా'. యోహాను **(John)** హబీబ్ బిన్ జబదీ (జెబెదయి కుమారుడయిన యోహాను) దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) [ఏసు] ) యొక్క పన్నెండు మంది శిష్యులలో విశిష్టమైనవారిగా వినుతికెక్కారు.

***(తరువాతి పేజీ చూడండి)***



(5) అపొస్తలుల కార్యములు [52] (6) అపొస్తలుడైన పౌలు రోమీయులకు వ్రాసిన పత్రిక [53]

**(అథఃసూచికలు)**

***(51 వ అథః సూచిక తరువాయి భాగం)***

బైబిల్ క్రొత్త నిబంధన గ్రంథము లోని నాలుగు సువార్తలలో నాల్గవ సువార్త 'యోహాను సువార్త' పేరుతో ఆయన వైపుకే ఆపాదించబడింది. అలాగే క్రొత్త నిబంధన గ్రంథములోని మూడు పత్రికలు ( 'యోహాను వ్రాసిన మొదటి పత్రిక', 'యోహాను వ్రాసిన రెండవ పత్రిక', 'యోహాను వ్రాసిన మూడవ పత్రిక' ) మరియు ' ప్రకటన గ్రంథము' (యోహాను వ్రాసిన ప్రకటన గ్రంథము) ఆయన వైపుకే ఆపాదించబడ్డాయి. ఆయన జీవిత పర్యంతం యూదుల హింసలను భరిస్తూ గడిపారు. క్రీస్తుశకపు మొదటి శతాబ్దంలోనే ఆయన మరణం సంభవించింది. గుర్తుంచుకోవలసిన విషయమేమిటంటే క్రైస్తవులు దైవప్రవక్త హజ్రత్ యహ్యా (అ) ను సైతం 'యోహాను' అని పిలుస్తారు. అయితే ఆయన ప్రస్తావన వచ్చినప్పుడు 'విశ్వసనీయుడైన యోహాను' లేదా ' బాప్తిస్మమిచ్చు యోహాను' అని తరచుగా పేర్కొనబడుతుంది. అయితే 'యోహాను సువార్త' ఎవరికయితే ఆపాదించబడిందో ఆ యోహాను ప్రస్తావన వచ్చినప్పుడు 'విశ్వసనీయుడైన' లేదా 'బాప్తిస్మమిచ్చు'అనే విశేషణాత్మక పదం ఉపయోగించబడదు. ఈ వ్యత్యాసాన్ని మనం గుర్తుంచుకోవాలి.

యోహాను సువార్తలో దైవప్రవక్త హజ్రత్ యహ్యా (అ) [బాప్తిస్మమిచ్చు యోహాను] **(John)** ప్రభవించిన తరువాతి సంఘటనల నుంచి దైవప్రవక్త హజ్రత్ ఈసా(అ) [ఏసు] దివ్యారోహణం వరకు గల సంఘటనలు పేర్కొనబడి ఉన్నాయి. ఇందులో మొత్తం 21 అధ్యాయాలు ఉన్నాయి.

[52] బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'అపొస్తలుల కార్యములు' పుస్తకం పేరు 'రసూలోఁ కే ఆమాల్ '. బైబిల్ ఇంగ్లీష్ అనువాద ప్రతిలో 'అపొస్తలుల కార్యములు' పుస్తకం పేరు **Acts of Apostles.** లూకా తన శిష్యుడయిన థెయొఫిలా **(Theophilus)** కు ఈ పత్రికను వ్రాయడం జరిగిందని ప్రతీతి. ఇందులో దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) [ఏసు] నిష్క్రమణ (దివ్యారోహణం) తర్వాత ఆయన శిష్యుల కార్యకలాపాలు, ముఖ్యంగా పౌలు రోమాకు చేరుకునేంత వరకు అతడి ధర్మప్రచార సంబంధిత ప్రయాణాల స్థితిగతులు (సుమారు క్రీ.శ. 22 వరకు) పేర్కొనబడి ఉన్నాయి. ఇందులో మొత్తం 28 అధ్యాయాలు ఉన్నాయి.

(7) అపొస్తలుడైన పౌలు కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక [54]

**(అథఃసూచికలు)**

53 బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'అపొస్తలుడైన పౌలు రోమీయులకు వ్రాసిన పత్రిక' పుస్తకం పేరు 'పౌలుస్ కా ఖత్ రోమియోం కీ జానిబ్'. బైబిల్ ఇంగ్లిష్ అనువాద ప్రతిలో దీని పేరు **The Epistle of Paul to Romans** లేదా సంక్షిప్తంగా **Romans.** ఈ పత్రికలో పౌలు రోమా నగరవాసులను సంబోధించాడు. ఆ రోమా నగరమే నేటి ఇటలీ దేశ రాజధాని నగరమైన 'రోమ్'. అది టైబర్ నది ఉత్పత్తి స్థానం నుంచి 50 మైళ్ళ దూరంలో ఉంది. ఆ కాలంలో అక్కడ యూదులు అధిక సంఖ్యలో నివసించేవారు. (అపొస్తలుల కార్యములు, 18 : 2 ). పౌలు రోమీయులకు వ్రాసిన పత్రికలో మొదట శుభవార్త పేర్కొనబడింది. తరువాత విశ్వ సృష్టి లక్ష్యం, క్రైస్తవులకు హితోపదేశాలు పేర్కొనబడి ఉన్నాయి.

పౌలు పూర్వాశ్రమ జీవితానికి సంబంధించిన వివరాలు స్పష్టంగా లభ్యం కావు. అయితే బైబిల్ క్రొత్త నిబంధన గ్రంథములోని 'అపొస్తలుల కార్యములు', పౌలు వ్రాసిన పత్రికలను అధ్యయనం చేసినప్పుడు అతడు ఇశ్రాయేలు వంశానికి చెందినవాడయి బెన్యామీను గోత్రములో పుట్టిన హెబ్రీయుడని విదితమవుతుంది. అతడి అసలు పేరు 'సౌలు'. ఫిలిప్పీయులకు అతడు వ్రాసిన పత్రికలో తనను గురించి అతడు స్వయంగా ఇలా ప్రకటించుకున్నాడు:

***" ఎనిమిదవ దినమున సున్నతి పొందితిని, ఇశ్రాయేలు వంశపువాడనై, బెన్యామీను గోత్రములో పుట్టి హెబ్రీయుల సంతానమైన హెబ్రీయుడనై, ధర్మశాస్త్ర విషయము పరిసయ్యుడనై..." (అపొస్తలుడైన పౌలు ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక, 3 : 5 )***

పౌలు రోమీయుడనే విషయం మనకు 'అపొస్తలుల కార్యములు' లోని 22 వ అధ్యాయపు 28వ వాక్యం ద్వారా తెలుస్తుంది. పౌలు పూర్వాశ్రమ జీవితానికి సంబంధించిన ఈ వివరాల తర్వాత మనకు 'అపొస్తలుల కార్యములు' లోని 7 వ అధ్యాయపు 58వ వాక్యంలో అతడికి సంబంధించిన ప్రస్తావన మొట్టమొదట గోచరిస్తుంది. అక్కడ అతడి పేరు 'సౌలు' గా పేర్కొనబడింది.

54 బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'అపొస్తలుడైన పౌలు కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక' పుస్తకం పేరు 'పౌలుస్ కా పహ్‌లా ఖత్ ఖోరింథియోం కీ జానిబ్'. బైబిల్ ఇంగ్లిష్ అనువాద ప్రతిలో దీని పేరు **The Epistle of Paul to Corinthians** లేదా సంక్షిప్తంగా

***(తరువాతి పేజీ చూడండి)***



(8) అపొస్తలుడైన పౌలు కొరింథీయులకు వ్రాసిన రెండవ పత్రిక [55]

**(అథఃసూచికలు)**

***(54 వ అథః సూచిక తరువాయి భాగం)***

**1 Corinthians.** ఇది కొరింథు పట్టణవాసులకు పౌలు వ్రాసిన పత్రిక. ఈ పుస్తకం ప్రారంభంలో కొరింథీయులను సమైక్యంగా ఉండవలసిందిగా హితవు పేర్కొనబడి ఉంది. ఎందుకంటే ఆ కాలంలో వారు పరస్పర కలహాలలో కొట్టుమిట్టాడుతూ ఉన్నారు. ఆ తర్వాత 7 వ అధ్యాయంలో వైవాహిక జీవితానికి సంబంధించిన కొన్ని ఆదేశాలు పేర్కొనబడ్డాయి. 8 వ అధ్యాయం నుంచి విగ్రహారాధన చెడుగులు పేర్కొనబడడంతో పాటు విగ్రహారాధనతో కూడిన పరిసరాలలో క్రైస్తవుల వ్యవహార సరళి ఏవిధంగా ఉండాలో నిర్దేశించబడింది. ఆ తర్వాత 12 వ అధ్యాయం నుంచి దేవుని ఆత్మిక వరానుగ్రహాల వైపుకు వారి దృష్టిని సారింపజేయడం జరిగింది. 15 వ అధ్యాయం నుంచి పరలోకం మరియు పాపపరిహారం అనే అంశాలకు సంబంధించిన చర్చ ఉంది. 16 వ అధ్యాయంలో దానధర్మాల గురించి పేర్కొనబడింది. ముఖ్యంగా క్రైస్తవ వ్యాప్తి కొరకు చందా ఇవ్వవలసిందిగా ప్రోత్సాహక వాక్యాలు పేర్కొనబడి ఉన్నాయి. ఈ పుస్తకంలో మొత్తం 16 అధ్యాయాలున్నాయి.

'కొరింథు' గ్రీసు దేశపు దక్షిణ ప్రాంతంలోని ఒక పట్టణం పేరు. దానిని బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'కొరింథస్' అని పేర్కొనడం జరిగింది. ఇంగ్లిష్‌లో దానిని **Corinth** అని పేర్కొనడం జరుగుతుంది. ఆ పట్టణం ఐశ్వర్యంతో తులతూగే పట్టణంగా విరాజిల్లింది. ఇప్పటికీ దానికి చెందిన కొన్ని ఆనవాళ్ళు మనకు గోచరిస్తాయి. ప్రస్తుతం మనకు లభ్యమవుతున్న బైబిల్ క్రొత్త నిబంధన గ్రంథంలో ఈ పట్టణంలోని క్రైస్తవ దేవాలయాల పేర పౌలు వాసిన రెండు పత్రికలు ఉన్నాయి.

55 బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'అపొస్తలుడైన పౌలు కొరింథీయులకు వ్రాసిన రెండవ పత్రిక' పుస్తకం పేరు 'పౌలుస్ కా దూస్‌రా ఖత్ ఖోరింథియోం కీ జానిబ్'. బైబిల్ ఇంగ్లిష్ అనువాద ప్రతిలో దీని పేరు **2 Corinthians.** ఈ పుస్తకంలోని ప్రారంభపు 6 అధ్యాయాలలో పలు మతపరమైన ఉపదేశాలు పేర్కొనబడి ఉన్నాయి. ఆ తర్వాత క్రైస్తవ దేవాలయ స్థాపనకు సంబంధించి కొన్ని విషయాలు పేర్కొనబడ్డాయి. ఆ తర్వాత 10వ అధ్యాయం నుంచి పుస్తకం చివరి వరకు పౌలు సువార్తను అందజేస్తూ కొనసాగించిన ప్రయాణానికి సంబంధించిన ప్రణాళికలు పేర్కొనబడి ఉన్నాయి. ఈ పుస్తకంలో మొత్తం 13 అధ్యాయాలు ఉన్నాయి.

(9) అపొస్తలుడైన పౌలు గలతీయులకు వ్రాసిన పత్రిక [56]

(10) అపొస్తలుడైన పౌలు ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక [57]

(11) అపొస్తలుడైన పౌలు ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక [58]

**(అథఃసూచికలు)**

56 బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'అపొస్తలుడైన పౌలు గలతీయులకు వ్రాసిన పత్రిక' పుస్తకం పేరు 'పౌలుస్ కా ఖత్ గలతియోఁ కీ జానిబ్'. బైబిల్ ఇంగ్లిష్ అనువాద ప్రతిలో దీని పేరు **Galatians.** ఇది గలతీయ **(Galatia)** పట్టణవాసులకు పౌలు వ్రాసిన పత్రిక. 'గలతీయ' ఉత్తర ఆసియా ప్రాంతంలోని ఒక రోమను మండలం పేరు. దాని రాజధాని నగరం పేరు అంకారా ('అన్‌ఖరహ్') అక్కడి క్రైస్తవ దేవాలయాల పేర ఈ పత్రిక సుమారు క్రీ.శ. 57 లో వ్రాయబడింది. గలతీయకు చెందిన ప్రజలు క్రైస్తవాన్ని వదలి మరొక మతం వైపుకు ఆకర్షితులవుతున్నట్లుగా పౌలుకు సమాచారమందినప్పుడు పౌలు ఈ పత్రికను గలతీయుల పేర వ్రాయడం జరిగింది. ఈ పత్రికలో పౌలు వారిని ధర్మ పరివర్తనం నుంచి నివారించేందుకు, తమ మతంపై స్థిరంగా ఉంచేందుకు ప్రయత్నించడానికి సంబంధించిన వివరాలు పేర్కొనబడి ఉన్నాయి.

57 బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'అపొస్తలుడైన పౌలు ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక' పుస్తకం పేరు ' పౌలుస్ కా ఖత్ ఇఫుస్ వాలోఁ కీ తరఫ్ '. బైబిల్ ఇంగ్లిష్ అనువాద ప్రతిలో దీని పేరు **Ephesians.** ఇది 'ఎఫెసు' పట్టణవాసులకు పౌలు వ్రాసిన పత్రిక. 'ఎఫెసు' **(Ephesus)** అనేది ఆసియా మైనర్ లో ఒక ప్రముఖ పట్టణంగా విరాజిల్లింది. అక్కడ 'డయానా' **(Diana)** అనే పేరుతో పిలువబడే ఒక బ్రహ్మాండమైన దేవాలయముండేది. పౌలు మూడు సంవత్సరాల పాటు ధర్మప్రచారాన్ని నిర్వహించి దానిని క్రైస్తవానికి చెందిన ప్రధాన కేంద్రంగా మార్చివేయడం జరిగింది. (చూడండి : 'అపొస్తలుల కార్యములు' : 19 : 10 ) ఆరు అధ్యాయాలతో కూడిన 'ఎఫెసీయులకు పౌలు వ్రాసిన పత్రిక ' లో ఎఫెసీయులకు కొన్ని నైతిక ఉపదేశాలు ఇవ్వబడ్డాయి.

58 బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'అపొస్తలుడైన పౌలు ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక' పుస్తకం పేరు ' పౌలుస్ కా ఖత్ ఫిలిప్పిస్ వాలోఁ కీ తరఫ్ '. బైబిల్ ఇంగ్లిష్ అనువాద ప్రతిలో దీని పేరు **Philippians.** ఇది ' ఫిలిప్పీ' పట్టణవాసులకు పౌలు వ్రాసిన పత్రిక. 'ఫిలిప్పీ' అనేది

*(తరువాతి పేజీ చూడండి)*



(12) అపొస్తలుడైన పౌలు కొలొస్సయులకు వ్రాసిన పత్రిక [59]

(13) అపొస్తలుడైన పౌలు థెస్సలొనీకయులకు వ్రాసిన మొదటి పత్రిక [60]

(14) అపొస్తలుడైన పౌలు థెస్సలొనీకయులకు వ్రాసిన రెండవ పత్రిక [61]

**(అథఃసూచికలు)**

*(58 వ అథః సూచిక తరువాయి భాగం)*

యూరప్ ఖండంలోని 'మాసిదోనియ' మండలానికి చెందిన ఒక పట్టణం పేరు. అది యూరప్ ఖండానికి చెందిన మొట్టమొదటి పట్టణం. అక్కడ పౌలు సువార్తను బోధించినప్పుడు చెరసాలలో బంధించబడడం జరిగింది. (అపొస్తలుల కార్యములు : 16 : 12 - 40 ) ఈ పత్రికలో సమైక్యతకు సంబంధించిన ఉపదేశాలు, కొన్ని నైతిక హితోపదేశాలు ఉన్నాయి. ఈ పుస్తకంలో మొత్తం 4 అధ్యాయాలున్నాయి.

59 బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'అపొస్తలుడైన పౌలు కొలొస్సయులకు వ్రాసిన పత్రిక' పుస్తకం పేరు ' పౌలుస్ కా ఖత్ ఖోలాసాయిస్ వాలోఁ కీ తరఫ్ '. బైబిల్ ఇంగ్లిష్ అనువాద ప్రతిలో దీని పేరు **Colossians.** ఇది 'కొలొస్సయి' పట్టణవాసులకు పౌలు వ్రాసిన పత్రిక. 'కొలొస్సయి' **(Colosse)** అనేది ఆసియా మైనర్ కు చెందిన ఒక పట్టణం పేరు. ఈ పత్రికలో క్రైస్తవం విషయంలో కొలొస్సయులకు ప్రోత్సాహక వాక్యాలు, దుశ్చేష్టలకు దూరంగా ఉండవలసిందిగా ఉపదేశాలు పేర్కొనబడ్డాయి. ఈ పుస్తకంలో కూడా 4 అధ్యాయాలున్నాయి.

60 బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'అపొస్తలుడైన పౌలు థెస్సలొనీకయులకు వ్రాసిన మొదటి పత్రిక' పుస్తకం పేరు ' పౌలుస్ కా పహ్‌లా ఖత్ తసాలోనీఖీ వాలోఁ కీ తరఫ్ '. బైబిల్ ఇంగ్లిష్ అనువాద ప్రతిలో దీని పేరు **1 Thessalonians.** ఇది 'థెస్సలొనీకయ' పట్టణవాసులకు పౌలు వ్రాసిన పత్రిక. 'థెస్సలొనీకయి' అనేది యూరప్ ఖండంలోని మాసిదోనియ ప్రాంతానికి చెందిన ఒక పట్టణం పేరు. అది నేడు టర్కీ దేశంలో ఉంది. థెస్సలొనీకయులకు పౌలు వ్రాసిన మొదటి పత్రికలో పౌలు దేవునికి ప్రీతికరమైన జీవితం గురించి, ఇతర అంశాల గురించి చర్చించడం జరిగింది. ఈ పుస్తకంలో 5 అధ్యాయాలున్నాయి.

61 బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'అపొస్తలుడైన పౌలు థెస్సలొనీకయులకు వ్రాసిన రెండవ

*(తరువాతి పేజీ చూడండి)*

(15) అపొస్తలుడైన పౌలు తిమోతికి వ్రాసిన మొదటి పత్రిక [62]

(16) అపొస్తలుడైన పౌలు తిమోతికి వ్రాసిన రెండవ పత్రిక [63]

(17) అపొస్తలుడైన పౌలు తీతుకు వ్రాసిన పత్రిక [64]

**(అథఃసూచికలు)**

***(61 వ అథః సూచిక తరువాయి భాగం)***

పత్రిక' పుస్తకం పేరు ' పౌలుస్ కా దూస్‌రా ఖత్ తసాలోనీఖీ వాలోఁ కీ తరఫ్ '. బైబిల్ ఇంగ్లీష్ అనువాద ప్రతిలో దీని పేరు **2 Thessalonians.** ఈ పత్రికలో పౌలు సంబోధితులను వారి సత్కార్యాల విషయంలో ప్రోత్సహించడం జరిగింది. అలాగే వారి వ్యవహార శైలికి సంబంధించి వివిధ ఉపదేశాలు ఇందులో పేర్కొనబడ్డాయి. ఈ పుస్తకంలో మొత్తం 3 అధ్యాయాలున్నాయి.

[62] బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'అపొస్తలుడైన పౌలు తిమోతికి వ్రాసిన మొదటి పత్రిక' పుస్తకం పేరు ' పౌలుస్ కా పహ్‌లా రిసాలహ్ తీమోథీస్ కే నామ్ '. బైబిల్ ఇంగ్లీష్ అనువాద ప్రతిలో దీని పేరు **1 Timothy.** తిమోతి పౌలుకు చెందిన ఒకానొక శిష్యుడు. అతడు పౌలుకు పలు ప్రయాణాలలో తోడుగా ఉన్నాడు. (అపొస్తలుల కార్యములు : 16 : 1-3, 17 : 14 ) పౌలు అతడిని విశ్వసించడంతో పాటు ప్రజల చేత అతడిని గౌరవింపజేసేవాడు. ( అపొస్తలుడైన పౌలు కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక : 16 : 10 ) ( అపొస్తలుడైన పౌలు ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రిక : 2 : 19 ) ఈ పుస్తకంలో ఆరాధనలు మరియు నైతికతకు సంబంధించిన హితోపదేశాలు పేర్కొనబడి ఉన్నాయి. ఇందులో మొత్తం 6 అధ్యాయాలున్నాయి.

[63] బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'అపొస్తలుడైన పౌలు తిమోతికి వ్రాసిన రెండవ పత్రిక' పుస్తకం పేరు ' పౌలుస్ కా దూస్‌రా రిసాలహ్ తీమోథీస్ కే నామ్ '. బైబిల్ ఇంగ్లీష్ అనువాద ప్రతిలో దీని పేరు **2 Timothy.** ఈ పత్రికలో ధర్మం నుంచి మరలిపోయిన కొంతమంది గురించి పేర్కొనబడి ఉంది. అలాగే తిమోతికి ధర్మప్రచార కార్యానికి సంబంధించి ఇవ్వబడిన కొన్ని ఉపదేశాలు, అంత్యకాలానికి సంబంధించిన భవిష్యద్వాణులు పేర్కొనబడి ఉన్నాయి. ఈ పుస్తకంలో మొత్తం 4 అధ్యాయాలున్నాయి.

[64] బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'అపొస్తలుడైన పౌలు తీతుకు వ్రాసిన పత్రిక' పుస్తకం పేరు

***(తరువాతి పేజీ చూడండి)***



(18) అపొస్తలుడైన పౌలు ఫిలేమోనుకు వ్రాసిన పత్రిక [65]

(19) పేతురు వ్రాసిన మొదటి పత్రిక [66]

(20) యోహాను వ్రాసిన మొదటి పత్రిక [67] (కొన్ని వాక్యాలు తప్ప)

**(అథఃసూచికలు)**

***(64 వ అథః సూచిక తరువాయి భాగం)***

' పౌలుస్ కా రిసాలహ్ తీతూస్ కీ తరఫ్'. బైబిల్ ఇంగ్లీష్ అనువాద ప్రతిలో దీని పేరు **Titus.** తీతు కూడా ధర్మప్రచార సంబంధిత ప్రయాణాలలో పౌలుకు తోడుగా ఉన్నాడు. ( 'గలతీయులకు' : 2 : 1 ) పౌలు అతడిని ప్రేమించేవాడు. ( 'అపొస్తలుడైన పౌలు కొరింథీయులకు వ్రాసిన రెండవ పత్రిక' : 2 : 13 ) పౌలు తీతును 'క్రేతు' **(Crete)** అనే పట్టణంలో ధర్మప్రచారం నిమిత్తం విడచిపెట్టడం జరిగింది. ( 'అపొస్తలుడైన పౌలు తీతుకు వ్రాసిన పత్రిక' : 1 : 5 ) ఈ పత్రికలో ధర్మప్రచార పద్ధతులు, బిషప్పులు కలిగియుండవలసిన గుణగణాలు పేర్కొనబడ్డాయి. ఈ పుస్తకంలో మొత్తం 3 అధ్యాయాలున్నాయి.

[65] బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'అపొస్తలుడైన పౌలు ఫిలేమోనుకు వ్రాసిన పత్రిక' పుస్తకం పేరు ' పౌలుస్ కా రిసాలహ్ ఫీలేమోన్ కీ జానిబ్ '. బైబిల్ ఇంగ్లీష్ అనువాద ప్రతిలో దీని పేరు **Philemon.** ఫిలేమోను కూడా ధర్మప్రచార సంబంధిత ప్రయాణాలలో పౌలుకు తోడుగా ఉన్నాడు. ఒనేసిమును పౌలు ఫిలేమోను వద్దకు పంపుతున్న సమయంలో ఈ పత్రికను వ్రాయడం జరిగింది.

[66] బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'పేతురు వ్రాసిన మొదటి పత్రిక' పుస్తకం పేరు ' పుత్‌రుస్ కా పహ్‌లా రిసాలహ్ '. బైబిల్ ఇంగ్లీష్ అనువాద ప్రతిలో దీని పేరు **1 Peter.** పేతురు గురించిన పరిచయం ఇంతకు ముందే పేర్కొనబడింది. ఇది పేతురు వ్రాసిన బహిరంగ లేఖ. ఈ పత్రిక సంబోధితులు పొంతు, గలతీయ, కప్పదొకియ, ఆసియ, బితునియ అను దేశములకు చెందిన ప్రజలు. ఈ పత్రికలో వివిధ మతపరమైన, నైతిక హితోపదేశాలు పేర్కొనబడి ఉన్నాయి. ఈ పుస్తకంలో మొత్తం 5 అధ్యాయాలున్నాయి.

[67] బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో ' యోహాను వ్రాసిన మొదటి పత్రిక' పుస్తకం పేరు ' యోహన్నా కా పహ్‌లా రిసాలహ్ '. బైబిల్ ఇంగ్లీష్ అనువాద ప్రతిలో దీని పేరు **1 John.** ఈ పత్రికలో వివిధ మతపరమైన, నైతిక హితోపదేశాలు పేర్కొనబడి ఉన్నాయి. ఈ పుస్తకంలో మొత్తం 5 అధ్యాయాలున్నాయి.

## క్రొత్త నిబంధనకు చెందిన రెండవ రకం గ్రంథాలు :

క్రొత్త నిబంధనకు చెందిన రెండవ రకం గ్రంథాలు (వేటి ప్రామాణికత విషయంలోనయితే క్రైస్తవ పండితులలో భేదాభిప్రాయాలున్నాయో ఆ గ్రంథాలు) 7 ఉన్నాయి. అలాగే 'యోహాను వ్రాసిన మొదటి పత్రిక' కు చెందిన కొన్ని వాక్యాల ప్రామాణికత విషయంలోనూ క్రైస్తవ పండితులలో భేదాభిప్రాయాలున్నాయి. ఆ 7 గ్రంథాల పేర్లు క్రింద పేర్కొనబడుతున్నాయి.

(1) అపొస్తలుడైన పౌలు హెబ్రీయులకు వ్రాసిన పత్రిక [68]

(2) పేతురు వ్రాసిన రెండవ పత్రిక [69] (3) యోహాను వ్రాసిన రెండవ పత్రిక [70]

(4) యోహాను వ్రాసిన మూడవ పత్రిక [71]

### (అథఃసూచికలు)

68 బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'అపొస్తలుడైన పౌలు హెబ్రీయులకు వ్రాసిన పత్రిక' పుస్తకం పేరు ' పౌలుస్ కా రిసాలహ్ ఇబ్రానియోం కీ జానిబ్ '. బైబిల్ ఇంగ్లిష్ అనువాద ప్రతిలో దీని పేరు **Hebrews.** ఈ పత్రికలోనూ వివిధ మతపరమైన, నైతిక హితోపదేశాలు పేర్కొనబడి ఉన్నాయి. వాస్తవానికి యూదులనే హెబ్రీయులని కూడా అంటారు. ఈ పుస్తకంలో మొత్తం 13 అధ్యాయాలున్నాయి.

69 బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో ' పేతురు వ్రాసిన రెండవ పత్రిక' పుస్తకం పేరు ' పుత్‌రుస్ కా దూస్‌రా రిసాలహ్ '. బైబిల్ ఇంగ్లిష్ అనువాద ప్రతిలో దీని పేరు **2 Peter.** ఈ పత్రికలో అసత్య ప్రవక్తలకు, అసత్య గురువులకు సంబంధించి కొన్ని హితోపదేశాలు, కొన్ని భవిష్యద్వాణులు పేర్కొనబడి ఉన్నాయి. ఈ పుస్తకంలో మొత్తం 3 అధ్యాయాలున్నాయి.

70 బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో ' యోహాను వ్రాసిన రెండవ పత్రిక' పుస్తకం పేరు ' యోహన్నా కా దూస్‌రా రిసాలహ్ '. బైబిల్ ఇంగ్లిష్ అనువాద ప్రతిలో దీని పేరు **2 John.** ఈ పత్రిక ఒక మహిళను సంబోధిస్తూ వ్రాయబడింది. ఆ మహిళ పేరు తెలియబడలేదు. ఈ పత్రికలో 13 వాక్యాలున్నాయి.

71 బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో ' యోహాను వ్రాసిన మూడవ పత్రిక' పుస్తకం పేరు

*(తరువాతి పేజీ చూడండి)*



(5) యాకోబు వ్రాసిన పత్రిక [72] (6) యూదా వ్రాసిన పత్రిక [73]

(7) యోహాను వ్రాసిన ప్రకటన గ్రంథము [74]

### (అథఃసూచికలు)

*(71 వ అథః సూచిక తరువాయి భాగం)*

' యోహన్నా కా తీస్‌రా రిసాలహ్ '. బైబిల్ ఇంగ్లిష్ అనువాద ప్రతిలో దీని పేరు **3 John.** యోహాను తన శిష్యుడయిన గాయుని **(Gaius)** సంబోధిస్తూ వ్రాసిన పత్రిక ఇది. ఈ పత్రికలో 14 వాక్యాలున్నాయి. ఈ పత్రికలో ఎక్కువగా సంబోధితుడిని ఉద్దేశించి ప్రశంస, ప్రోత్సాహక వాక్యాలు ఉన్నాయి.

72 బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో ' యాకోబు వ్రాసిన పత్రిక' పుస్తకం పేరు ' యాఖూబ్ కా రిసాలహ్ '. బైబిల్ ఇంగ్లిష్ అనువాద ప్రతిలో దీని పేరు **James.** యూసుఫ్ (యోసేపు) కుమారుడయిన ఈ యాకోబు వడ్రంగి. ఆయన దైవప్రవక్త హజ్రత్ ఈసా [ ఏసు] కు చెందిన పన్నెండు మంది శిష్యులలో ఒకరు కాదు. 'అపొస్తలుల కార్యములు' పుస్తకంలో ఈయన ప్రస్తావన ఎక్కువగా ఉంది. ఆయన హతమార్చబడ్డారు. (గుర్తుంచుకోవలసిన విషయమేమిటంటే దైవప్రవక్త హజ్రత్ ఈసా [ఏసు] కు చెందిన పన్నెండు మంది శిష్యులలో ఒకరయిన జెబదయి **(Zebedee)** కుమారుడయిన యాకోబు (యాఖూబ్ బిన్ జబ్దీ) యోహాను సోదరుడు. 'యాకోబు వ్రాసిన పత్రిక' లోని యాకోబు, ఆ యాకోబు కారు. ఆయనను 'యాఖూబుల్ అక్బర్ ' అని పిలుస్తారు.) ఈ బహిరంగ లేఖలో ఆయన పలు నైతిక హితోపదేశాలను వెలువరించారు.

73 బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో ' యూదా వ్రాసిన పత్రిక' పుస్తకం పేరు ' యహూదా కా రిసాలహ్ '. బైబిల్ ఇంగ్లిష్ అనువాద ప్రతిలో దీని పేరు **Jude.**

యూదా **( Jude Thaddaeus )** యాకోబు (యాఖూబ్) సోదరుడు. ఆయన దైవప్రవక్త హజ్రత్ ఈసా [ ఏసు] కు చెందిన పన్నెండు మంది శిష్యులలో ఒకరు. ఆయన ప్రస్తావన 'యోహాను సువార్త ' ( 14 : 22 ) లో ఉంది. ఈ పత్రికలో అసత్యవాదులకు దూరంగా ఉండవలసిందిగా హితవులు, ఇతర మతపరమైన ఉపదేశాలు పేర్కొనబడి ఉన్నాయి. (గుర్తుంచుకోవలసిన విషయమేమిటంటే క్రైస్తవుల ఉవాచ ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ఈసా [ఏసు] ను పట్టించిన యూదా, ఈ యూదా ఒకరు కారు. ఏసును పట్టించినది ఇస్కరియోతు యూదా)

## బైబిల్ గ్రంథాల పరిశోధన కొరకు క్రైస్తవ పండితుల సభలు :

ఆ తర్వాత పాఠకులు తెలుసుకోవలసిన విషయమేమిటంటే క్రీ.శ. 325 లో కాన్స్టంటైన్ రాజు[75] ఆదేశం మేరకు క్రైస్తవ పండితుల మహాసభ నాయిస్ [76] పట్టణంలో నిర్వహించబడింది. ఆ సభ ద్వారా సందేహాస్పదమయిన గ్రంథాల విషయంలో పరస్పర సలహా సంప్రదింపుల ద్వారా, చర్చల ద్వారా నిర్దుష్టత సాధించాలనేది వారి లక్ష్యం. ఎంతగానో పరిశీలించిన మీదట, సలహా సంప్రదింపులు జరిపిన మీదట ఆ క్రైస్తవ పండితులు **Judith** గ్రంథం స్వీకరించదగినదిగా, మిగిలిన గ్రంథాలను సందేహాస్పదమయినవిగా తీర్మానించారు. జెరోమ్ [77] ఈ గ్రంథానికి వ్రాసిన ముందుమాట ద్వారా ఈ విషయం విశదమవుతుంది.

ఆ తర్వాత క్రైస్తవ పండితుల మరొక మహాసభ క్రీ.శ. 364 లో నిర్వహించబడింది. ఆ

---

**(అథఃసూచికలు)**

74 బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలో 'యోహాను వ్రాసిన ప్రకటన గ్రంథము' పుస్తకం పేరు ' ముషాహెదాతె యోహన్నా '. బైబిల్ ఇంగ్లీష్ అనువాద ప్రతిలో దీని పేరు **Revelation.** క్రైస్తవుల ఉవాచ ప్రకారం ఇది యోహానుకు కలిగిన దర్శనం. ఇందులో కొన్ని భవిష్యద్వాణులు పేర్కొనబడి ఉన్నాయి.

75 ఈయన ఒకటవ కాన్స్టంటైన్ చక్రవర్తి. అతడి పేరు మీద బైజాంతియను 'కాన్స్టంటనియ' (కాన్స్టాంటినోపుల్) అని పిలవడం జరిగింది. ఎందుకంటే అతడు ఆ పట్టణాన్ని తన రాజధానిగా చేసుకున్నాడు. అతడి మరణం క్రీ.శ. 337 లో సంభవించింది.

76 'నాయిస్' పట్టణం నైకియ **(Nicaea)** గా ప్రసిద్ధి చెందింది. అక్కడ జరిగిన క్రైస్తవ మహాసభను ' నైకియ కౌన్సిల్ ' గా పిలుస్తారు.

77 ' సెయింట్ జెరోమ్' **(St. Jarome)** ప్రసిద్ధ క్రైస్తవ పండితుడు, తత్త్వవేత్త. ఆయన క్రీ.శ. 340 లో జన్మించాడు. ఆయనే బైబిల్‌ను లాటిన్ భాషలోకి అనువదించాడు. అలాగే ఆయన బైబిల్ విద్యలలో ప్రసిద్ధిగాంచాడు. బైబిల్ విద్యలకు సంబంధించి ఆయన ఎన్నో పుస్తకాలు రచించాడు. ఆయన మరణం క్రీ.శ. 420 లో సంభవించింది. అయితే ఇక్కడ పేర్కొనబడిన జెరోమ్, ఆ జెరోమ్ కాదు. కనుక విస్పష్టంగా జాన్ హిస్ శిష్యుడయిన, క్రీ.శ. 1416 లో మరణించిన జెరోమ్ గురించి ఇక్కడ ప్రస్తావించబడిందని అర్థం చేసుకోవాలి.



సభ 'లూడీషియా సభ' గా ప్రసిద్ధి చెందింది. ఆ సభలో పాల్గొన్న క్రైస్తవ పండితులు కూడా మొదటి సభలో పాల్గొన్న క్రైస్తవ పండితులు 'యహూదియత్' గ్రంథానికి సంబంధించి వెలువరించిన తీర్పును నిర్ధారిస్తూ ఆమోదించారు. అంతేగాకుండా ఆ తీర్పుకు ఏడు ఇతర గ్రంథాలను కూడా చేర్చి వాటిని స్వీకరించదగిన ప్రామాణిక గ్రంథాలుగా తీర్మానించారు. ఆ ఏడు గ్రంథాల పేర్లు క్రింద పేర్కొనబడుతున్నాయి :

(1) ఎస్తేరు (2) యాకోబు వ్రాసిన పత్రిక (3) పేతురు వ్రాసిన రెండవ పత్రిక (4) యోహాను వ్రాసిన రెండవ పత్రిక. (5) యోహాను వ్రాసిన మూడవ పత్రిక. (6) యూదా వ్రాసిన పత్రిక (7) పౌలు హెబ్రీయులకు వ్రాసిన పత్రిక

లూడీషియా సభ తాను వెలువరించిన తీర్పును సర్వసామాన్య సందేశం ద్వారా తాకీదు చేయబడిన సందేశంగా మలచివేసింది. అలాగే యోహాను వ్రాసిన ప్రకటన గ్రంథము ఆ రెండు సభల్లోనూ స్వీకరించదగిన ప్రామాణిక గ్రంథాల జాబితా నుంచి తొలగించబడి సందేహాస్పదమైనదిగానే పరిగణించబడింది.

ఆ తర్వాత క్రీ.శ. 397 లో క్రైస్తవ పండితుల మరొక మహాసభ నిర్వహించబడింది. ఆ మహాసభ ' కార్థేజ్ సభ' **(Cortiage)** గా ప్రసిద్ధి చెందింది. ఆ మహాసభలో పాల్గొన్నవారిలో ప్రఖ్యాత క్రైస్తవ పండితుడయిన ఆగస్టైన్, ఇంకా నాటి కాలానికి చెందిన నూట ఇరవై ఆరు మంది ఇతర ప్రసిద్ధ క్రైస్తవ పండితులు ఉన్నారు. ఆ సభలో పాల్గొన్న సభ్యులు అంతకు ముందు నిర్వహించబడిన రెండు సభలు వెలువరించిన తీర్పులను ఆమోదించడంతో పాటు వాటికి క్రింద పేర్కొనబడిన గ్రంథాలను కూడా చేర్చారు.

(1) సొలొమోను జ్ఞానము గ్రంథము (2) తూబియా గ్రంథము (3) బారూకు గ్రంథము (4) చర్చి హితోపదేశాలు (5) మకాబీయులు మొదటి గ్రంథము (6) మకాబీయులు రెండవ గ్రంథము (7) యోహాను వ్రాసిన ప్రకటన గ్రంథము

అయితే ఆ సభలో పాల్గొన్న పండితులు బారూకు గ్రంథాన్ని దాదాపు యిర్మీయా గ్రంథంలో ఒక భాగంగా తీర్మానించారు. ఎందుకంటే బారూకు (హజ్రత్ బారూఖ్ (అ) ) యిర్మీయా (హజ్రత్ ఇర్మియా (అ) ) వారసులు మరియు ప్రతినిధి. అందుకే వారు గ్రంథనామాల జాబితాలో బారూకు పేరుతో ప్రత్యేక గ్రంథాన్ని పేర్కొనలేదు.

ఆ తర్వాత మరొక మూడు మహాసభలు నిర్వహించబడ్డాయి. అవి : (1) టర్లర్ సభ (2) ఫ్లోరెన్స్ సభ (3) టొరంట్ సభ. ఈ మూడు సభల్లో పాల్గొన్న క్రైస్తవ పండితులు కూడా మొదటి కార్థేజ్ సభ వెలువరించిన తీర్పును ఆమోదించారు. కేవలం ఆఖరి రెండు సభలు బారూకు

గ్రంథం పేరును విశ్వసించదగిన ప్రామాణిక గ్రంథాల జాబితాలో ప్రత్యేకంగా పేర్కొనడం జరిగింది.

ఈ సభలు నిర్వహించబడిన తర్వాత సందేహాస్పదమైనవిగా పరిగణించబడుతూ వచ్చిన గ్రంథాలన్నీ క్రైస్తవులందరి దృష్టిలో ఆమోదించబడిన గ్రంథాలుగా తీర్మానించబడ్డాయి.

## ఈ ప్రాచీన క్రైస్తవ పండితుల తీర్పులపై ప్రొటెస్టెంట్ వర్గం తిరుగుబాటు:

విశ్వసించదగిన ప్రామాణిక గ్రంథాలుగా పరిగణించబడుతూ వచ్చిన బైబిల్ గ్రంథాల ప్రామాణికతా స్థాయి క్రీ.శ. 1200 వరకు కొనసాగింది. అప్పుడు ప్రొటెస్టెంట్ వర్గం ఉనికిలోకి వచ్చింది. ప్రొటెస్టెంట్ వర్గానికి చెందినవారు తమ పూర్వీకులయిన క్రైస్తవ పండితుల తీర్పుకు విరుద్ధంగా 'బారూకు గ్రంథము', ' తూబియా గ్రంథము', **Judith** గ్రంథము', 'సొలొమోను జ్ఞానము గ్రంథము', ' చర్చి హితోపదేశాలు', ' మకాబీయులు మొదటి గ్రంథము', 'మకాబీయులు రెండవ గ్రంథము' అనే గ్రంథాలు తప్పనిసరిగా తిరస్కరించదగిన, అవిశ్వసనీయమైన, అప్రామాణిక గ్రంథాలుగా తీర్మానించారు.

అదేవిధంగా ఈ వర్గానికి చెందినవారు 'ఎస్తేరు' గ్రంథానికి చెందిన కొన్ని అధ్యాయాల విషయంలో తమ పూర్వీకులయిన క్రైస్తవ పండితుల తీర్పును తిరస్కరించారు, కొన్ని అధ్యాయాల విషయంలో వారి తీర్పును ఆమోదించారు. ఎందుకంటే ఆ గ్రంథంలో మొత్తం 16 అధ్యాయాలున్నాయి. అందులోని మొదటి 6 అధ్యాయాలు మరియు 10వ అధ్యాయానికి చెందిన మూడు వాక్యాలు తప్పనిసరిగా ఆమోదించదగిన, విశ్వసించదగిన భాగాలుగా వారు వ్యాఖ్యానించారు. ఎస్తేరు గ్రంథంలోని మిగిలిన ఆరు అధ్యాయాలు తప్పనిసరిగా తిరస్కరించదగినవిగా, అవిశ్వసనీయమైనవిగా వారు పేర్కొన్నారు. వారు తమ ఈ తిరస్కరణకు సంబంధించి ఆరు ఆధారాలను పేర్కొన్నారు. అవి క్రింద పేర్కొనబడుతున్నాయి:

1. ఈ గ్రంథాలు తమ మూల భాషలయిన హెబ్రూ మరియు జాల్దీ భాషలలో అసత్యమైనవి. ఈ కాలంలో ఆ భాషలలో ఈ గ్రంథాలు లభ్యమవడం లేదు కూడా.

2. యూదులు ఈ గ్రంథాలను దైవగ్రంథాలుగా ఆమోదించరు.

3. క్రైస్తవులలో అందరూ ఈ గ్రంథాలను ఆమోదించలేదు.

4. జేరోమ్ ఈ విధంగా పేర్కొన్నారు: " ఈ గ్రంథాలు ధార్మిక నియమాల నిర్ధారణ కొరకు సరిపోజాలవు.

5. కమ్‌లూస్ ఈ విధంగా విశదపరచడం జరిగింది : " ఈ గ్రంథాలు చదవబడతాయి గానీ ప్రతి ప్రాంతంలోనూ పఠించబడవు"



నేను చెప్పేదేమిటంటే ఇందులో క్రైస్తవులందరూ వాటిని ఆమోదించలేదనే సూచన ఉంది. అనగా ఇందులో మరియు 3 వ ఆధారంలో పేర్కొనబడిన భావం ఒక్కటే.

6. యూసీబీస్ 'రాబిత్ ' అనే పుస్తకంలోని రెండవ అధ్యాయంలో ఈ విధంగా స్పష్టీకరించాడు: " ఈ పుస్తకాలు ప్రక్షిప్తాలకు గురి చేయబడ్డాయి, ముఖ్యంగా ' మకాబీయులు రెండవ గ్రంథం"

1వ, 2వ మరియు 6వ ఆధారాలను పరిశీలించినట్లయితే వారు తమ పూర్వీకులయిన క్రైస్తవ పండితుల అవిశ్వసనీయత గురించి, అవినీతి గురించి ప్రకటించిన కారణంగా వేలాదిమంది ఆ పుస్తకాలను, అనగా వేటి మూలాలయితే కనుమరుగయిపోయాయో, కేవలం అనువాద గ్రంథాలు మాత్రమే మిగిలియున్నాయో, ఏవయితే యూదుల దృష్టిలో ప్రక్షిప్తాలకు గురిచేయబడ్డాయో, ముఖ్యంగా 'మకాబీయులు రెండవ గ్రంథము', అటువంటి పుస్తకాలను తప్పనిసరిగా విశ్వసనీయమైన, ప్రామాణిక గ్రంథాలుగా ఆమోదించే విషయంలో ఏకీభవించడమనేది తప్పుడు చర్యగా మారిపోయిందని అవగతమవుతుంది.

మరి వాస్తవం ఇది అయినప్పుడు ఏ ప్రత్యర్థి ముందయినా ఆ గ్రంథాలను విశ్వసనీయమైన, ప్రామాణిక గ్రంథాలుగా విశ్వసించే విషయంలో క్రైస్తవులందరూ ఏకీభవించి ఉన్నారని ప్రస్తావించడం సముచితమవుతుందా? అయితే కేథొలిక్ వర్గానికి చెందినవారు మాత్రం నేటివరకు ఆ గ్రంథాలను తమ పూర్వీకుల అనుసరణలో ఆమోదిస్తూ వచ్చారు.

# ఈ పుస్తకాలలో ఏదీ ప్రామాణికం కాదు!

ఏదయినా గ్రంథం దైవగ్రంథంగా, తప్పనిసరిగా ఆమోదించదగిన, విశ్వసించదగిన గ్రంథంగా పరిగణించబడేందుకై అన్నింటికంటే ముందు ఆ గ్రంథం ఫలానా దైవప్రవక్త మాధ్యమంగా వ్రాయబడిందని, ఆ తర్వాత మన వరకు మూలానికి సమీప ప్రమాణంతో, ఎటువంటి హెచ్చుతగ్గులకు లేదా మార్పుచేర్పులకు గురికాకుండా అది చేరిందని పటిష్ఠమైన ఆధారంతో సహా నిరూపించబడాలి. దివ్య ప్రేరణను పొందే ఏ వ్యక్తి వైపుకయినా కేవలం అనుమాన ప్రమాణం ద్వారా ఏదయినా గ్రంథాన్ని ఆపాదించడమనేది ఆ గ్రంథం ఆ వ్యక్తి యొక్క రచన అనేందుకు ఋజువు ఎంతమాత్రం కాజాలదు.

అదేవిధంగా ఈ విషయంలో ఏ ఒక్క వర్గమో లేదా కొన్ని వర్గాలు కేవలం ప్రకటించినంతమాత్రాన సరిపోదు. చూడండి : 'దర్శనముల గ్రంథము' (కితాబుల్ ముషాహిదాత్) , ' ఆదికాండపు చిన్న గ్రంథము' (తక్‌వీన్ కీ సిఫ్‌రె సగీర్), ' ఆరోహణ గ్రంథము' ( కితాబుల్ మేరాజ్ ) ' మర్మముల గ్రంథము' (కితాబుల్ ఇస్‌రార్), 'నిబంధన గ్రంథము' (కితాబె టెస్టమెంట్), 'ఒప్పుకోలు గ్రంథము' (కితాబుల్ ఇఖ్‌రార్) దైవప్రవక్త హజ్‌రత్ మూసా (అ) (మోషే) వైపుకు

ఆపాదించబడ్డాయి. అదేవిధంగా ఎజ్రా నాల్గవ గ్రంథము దైవప్రవక్త హజ్రత్ ఉజైర్ (అ) వైపుకు ఆపాదించబడింది. అలాగే ' యెషయా ఆరోహణ గ్రంథము' (కితాబె మేరాజె అష్ఇయాహ్) మరియు ' యెషయా కు కలిగిన దర్శనముల గ్రంథము' అనే గ్రంథాలు హజ్రత్ అష్ఇయా (అ) [యెషయా] వైపుకు ఆపాదించబడ్డాయి. అదేవిధంగా హజ్రత్ ఇర్మియాహ్ (అ) (యిర్మీయా) కు చెందిన ప్రసిద్ధ గ్రంథంతో పాటు మరొక గ్రంథం కూడా ఆయన వైపుకు ఆపాదించబడింది. అలాగే పలు హితోక్తులు హజ్రత్ హబఖ్ఖూఖ్ (అ) వైపుకు ఆపాదించబడ్డాయి. అలాగే 'కీర్తనల గ్రంథము' (సిఫ్రె మజామీర్ (జబూర్)) పేరుతో ఎన్నో గ్రంథాలు దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) [సొలొమోను] వైపుకు ఆపాదించబడ్డాయి. అలాగే క్రొత్త నిబంధన గ్రంథంలోని పుస్తకాలలో ఇంతకుముందు పేర్కొనబడ్డ పుస్తకాలతోపాటు డెబ్భైకి మించిన సంఖ్యలో పుస్తకాలు దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) [ఏసు] వైపుకు, ఆయన మాతృమూర్తి అయిన హజ్రత్ మర్యమ్ (అ) (మరియమ్మ) వైపుకు, దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) [ఏసు] శిష్యుల వైపుకు, వారి శిష్యుల వైపుకు ఆపాదించబడ్డాయి.

ఆ కాలానికి చెందిన క్రైస్తవులు ఈ గ్రంథాలన్నీ కల్పితమైన, అసత్యమైన గ్రంథాలని ప్రకటించారు. ఆ ప్రకటనతో నేడు గ్రీకు చర్చి, కేథొలిక్ మరియు ప్రొటెస్టెంట్ వర్గాలకు చెందిన చర్చీలన్నీ ఏకీభవించాయి. అదేవిధంగా దైవప్రవక్త హజ్రత్ ఉజైర్ (అ) వైపుకు ఆపాదించబడిన ఎజ్రా మూడవ గ్రంథము గ్రీకు చర్చి దృష్టిలో బైబిల్ పాతనిబంధన గ్రంథంలో ఒక భాగమయిన, తప్పనిసరిగా ఆమోదించదగిన, విశ్వసనీయమైన పవిత్ర గ్రంథం. అయితే ఆ పుస్తకం కేథొలిక్ మరియు ప్రొటెస్టెంట్ వర్గాలకు చెందిన చర్చీల దృష్టిలో కల్పితమైన, అసత్యమైన గ్రంథం. దీనికి సంబంధించిన వివరాలు మీకు ఇన్షా అల్లాహ్ (అల్లాహ్ చిత్తమయితే) రెండవ అధ్యాయంలో లభ్యమవగలవు. మొదటి అధ్యాయంలో మీకు 'బారూకు గ్రంథము', ' తూబియా గ్రంథము', **Judith** గ్రంథము', 'సొలొమోను జ్ఞానము గ్రంథము', ' చర్చి హితోపదేశాలు', ' మకాబీయులు మొదటి గ్రంథము', 'మకాబీయులు రెండవ గ్రంథము' , 'ఎస్తేరు' గ్రంథంలోని ఒక భాగం కేథొలిక్ వర్గీయుల దృష్టిలో తప్పనిసరిగా ఆమోదించదగిన, విశ్వసనీయమైన గ్రంథాలని, అయితే ప్రొటెస్టెంట్ వర్గీయుల దృష్టిలో అవి తప్పనిసరిగా తిరస్కరించదగిన, అవిశ్వసనీయ గ్రంథాలనే విషయం తెలియజేయబడింది.

మరి పరిస్థితి ఇది అయినప్పుడు కేవలం ఏదయినా పుస్తకం లేదా గ్రంథం దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) [ఏసు] శిష్యులలో ఒక శిష్యుని వైపుకు లేదా ఎవరో ఒక దైవప్రవక్త వైపుకు ఆపాదించబడినంత మాత్రాన అది దైవగ్రంథమని, తప్పనిసరిగా ఆమోదించదగిన, విశ్వసనీయమైన, ప్రామాణికమైన గ్రంథంగా మనం అంగీకరించవలసిన అవసరమేమిటి? అదేవిధంగా వారు ఆధారాలను పేర్కొనకుండా కేవలం ప్రకటించినంత మాత్రాన దానిని మనం ఎంతమాత్రం



ఆమోదించలేము. అందుకే మేము పలుమార్లు పెద్ద పెద్ద క్రైస్తవ పండితులను మూలానికి సమీప ఆధారాన్ని అందించవలసిందిగా కోరాము. అయితే అటువంటి ఆధారాన్ని వారు అందజేయలేకపోయారు. నాకు, ఒక పాస్టర్‌కు మధ్య జరిగిన ఒకానొక సంవాదంలో మూలానికి సమీప ఆధారాన్ని అందజేయలేకపోవడానికి గల కారణాన్ని ఆయన ఈ విధంగా పేర్కొన్నారు: **" మా వద్ద మూలానికి సమీప ఆధారం లేకపోవడానికి గల కారణం 313 సంవత్సరాల పాటు క్రైస్తవులను ప్రశాంతంగా ఊపిరి పీల్చుకోనివ్వని స్థాయిలో ఎదురయిన ఉపద్రవాలు, కష్టాలే. "**

మేము క్రైస్తవులు ప్రామాణిక గ్రంథాలుగా ఎంచేవాటిని ఎంతో సునిశితంగా పరిశీలించాము, శోధించాము. అయితే కేవలం ఊహలు, అంచనాలు తప్ప మరేమీ లభ్యం కాలేదు. వారు ఏదయితే పేర్కొంటారో అది కేవలం ఊహ, కొన్ని అంచనాలపై ఆధారపడి ఉంటుంది. అయితే మేము ఇంతకుముందే ఈ విషయంలో కేవలం ఊహకు లేదా అంచనాకు ఎంతమాత్రం విలువ లేదని, అది ఎంతమాత్రం పనికిరాదని పేర్కొని ఉన్నాము. కనుక వారు ఏదయినా సముచిత ఆధారాన్ని, మూలానికి దగ్గర ప్రమాణాన్ని పేర్కొననంతవరకు నిరాకరించడం తప్ప మాకు గత్యంతరం లేదు. ఆధారాన్ని పేర్కొనడమనేది సూత్రప్రాయంగా వారి బాధ్యతే గానీ మా బాధ్యత కాదు. అయితే మేము నిస్వార్థపూరితంగా, నిష్పక్షపాత బుద్ధితో చర్చిస్తున్నాము. అయితే ప్రతి గ్రంథం ఆధారానికి సంబంధించి చర్చించడం సుదీర్ఘమైన చర్య అవుతుంది. మేము కేవలం కొన్ని గ్రంథాల ఆధారాల గురించి చర్చిస్తాము. పాఠకులు సునిశితంగా వాటిని అధ్యయనం చేయగలరు:

'ఏ తౌరాతు గ్రంథమయితే దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) [మోషే] వైపుకు ఆపాదించబడిందో అది ముమ్మాటికీ దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) [మోషే] చే వ్రాయబడిన గ్రంథాలలో ఒకటి' అనే విషయానికి ఖచ్చితమైన ఆధారాలేమీ లేవు. ఈ విషయానికి సంబంధించి కొన్ని ఆధారాలు మా వద్ద ఉన్నాయి:

## ప్రస్తుతం 'తౌరాతు' గ్రంథం పేరుతో ఉనికిలో ఉన్న గ్రంథం దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) (మోషే)పై అవతరించిన గ్రంథం కాదు. అందుకు సంబంధించిన ఆధారాలు

**మొదటి ఆధారం:** 2 వ అధ్యాయంలో తప్పు నెం-4 కు సమాధానంగా, ప్రసంగం నెం. 1, 2, 3 క్రమంలో మేము ఈ గ్రంథాలు ప్రక్షిప్తాలకు గురయ్యాయనేందుకు ఆధారాలను పేర్కొంటూ

ఆమోను కుమారుడయిన యోషీయా **(Josiah)** [78] కంటే ముందు తౌరాతు మూలగ్రంథం పరంపరానుగతంగా చేరడమనే ప్రక్రియ నిలిచిపోయిందని పేర్కొన్నాము. ఆయన పట్టాభిషిక్తుడయిన 18 సంవత్సరాల తర్వాత లభించిన తౌరాతు ప్రతిని [79] ప్రామాణికమైన

**(అథఃసూచికలు)**

78 ఆమోను కుమారుడయిన యోషీయా **(Josiah)** యూదా దేశానికి రాజుగా కొనసాగారు. ఆయన హజ్రత్ ఇర్మియా (అ) [యిర్మీయా] మరియు హజ్రత్ సఫ్నియా (అ) ల కాలంలో కొనసాగారు.

79 'రాజులు రెండవ గ్రంథము' యొక్క 22వ మరియు 23 వ అధ్యాయాలలో ఈ తౌరాతు ప్రతి లభ్యమవడానికి సంబంధించిన వివరాలు విపులంగా పేర్కొనబడ్డాయి. యోషీయా రాజు కంటే ఎంతో ముందు నుంచే తౌరాతు ప్రతి ఏదీ ఉనికిలో లేదు. అది అప్పటికే కనుమరుగయిపోయింది. అయితే 'హిల్కీయా' అనే యాజకునికి యెహోవా మందిరాన్ని శుభ్రం చేస్తున్న సమయంలక్షో తౌరాతు ప్రతి లభించింది. రాజు ఆ తౌరాతు ప్రతిని తన శాసనాంగంగా చేసుకున్నాడు. 'రాజులు రెండవ గ్రంథము' యొక్క 23వ అధ్యాయపు 22వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది : **" ... ఇశ్రాయేలీయులకు న్యాయము నడిపించిన న్యాయాధిపతులున్న దినముల నుండి ఇశ్రాయేలు రాజుల యొక్కయు యూదా రాజుల యొక్కయు దినములన్నింటి వరకు ఎన్నడును జరుగనంత గొప్పగా ఆ సమయమందు పస్కా పండుగ ఆచరింపబడెను."** అనగా అప్పటివరకు తౌరాతు ప్రకారం పస్కా పండుగ ఆచరింపబడలేదు. ఆ తౌరాతు ప్రతి లభ్యమయినప్పుడు పస్కా పండుగ ఆ విధంగా గొప్పస్థాయిలో ఆచరింపబడింది. కేవలం ఒక దేవాలయపు యాజకుని వాక్కును దైవగ్రంథానికి ప్రాతిపదికగా తీర్మానించడం జరిగిందనే విషయాన్ని ఇక్కడ మనం పరిశీలించవచ్చు. వాస్తవానికి విశ్వసనీయమైన దైవగ్రంథంగా పరిగణించబడిన ప్రతి ఏదయితే ఉందో దానిని సంవత్సరాలుగా విశ్వసించినవారే లేరు.

'పస్కా పండుగ' **(Passover)** అనేది యూదులకు చెందిన ఒక మతపరమైన పండుగ. అది ఏప్రిల్ 14వ తేదీన జరుపుకోబడేది. వాస్తవానికి అది ఇశ్రాయేలీయులు ఐగుప్తీయుల నుంచి విముక్తులయిన సంఘటన సంస్మరణ దినంగా జరుపుకోబడేది. ఎందుకంటే అదే తేదీన దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) [ మోషే ] ఈజిప్టు (ఐగుప్తు) నుంచి నిష్క్రమించారు. పస్కా పండుగను

***(తరువాతి పేజీ చూడండి)***



మూలగ్రంథంగా విశ్వసించలేము. ఆ విధంగా అవిశ్వసనీయమైనదిగా పరిగణించబడడంతో పాటు ఆ ప్రతి కూడా బహుశా నెబుకద్నెజరు [80] దాడి సంఘటనకు ముందే నశించి ఉంటుంది. ఆ సంఘటనలో కేవలం తౌరాతు గ్రంథం మాత్రమే కాకుండా పాత నిబంధనకు చెందిన గ్రంథాలన్నీ నశించిపోయాయి. ఆ తర్వాత హజ్రత్ ఉజైర్ (అ) [ఎజ్రా] క్రైస్తవుల దృక్పథానికి అనుగుణంగా ఆ గ్రంథాలన్నింటినీ వ్రాసారు. [81] అయితే ఆ తౌరాతు ప్రతి మరియు దాని

**(అథఃసూచికలు)**

***(79 వ అథః సూచిక తరువాయి భాగం)***

ఉర్దూలో 'ఈదె ఫసహ్' అంటారు. 'ఫసహ్' అంటే 'గొఱ్ఱె' అని అర్థం. ఈ పండుగ జరుపుకోబడే రోజు ఒక గొఱ్ఱె బలి ఇవ్వబడేది. కనుక ఈ పండుగను 'ఈదె ఫసహ్' (పస్కా పండుగ) అంటారు. ఈ పండుగను జరుపుకోవడానికి సంబంధించిన వివరణాత్మక ఆదేశాలు బైబిల్ లోని 'నిర్గమ కాండము' యొక్క 23 వ అధ్యాయపు 15 వ వాక్యంలో , 'లేవీయ కాండము' యొక్క 23 వ అధ్యాయంలో 5వ వాక్యం నుంచి 8వ వాక్యం వరకు మరియు 'సంఖ్యా కాండము' యొక్క 28 వ అధ్యాయపు 16వ వాక్యం నుంచి 25 వ వాక్యం వరకు పేర్కొనబడి ఉన్నాయి.

80 'నెబుకద్నెజరు' అనే రాజును ఉర్దూ బైబిల్ లో బఖ్తె నసర్ (లేదా) బనూ కిద్ నసర్ **(Nabuchodonosar)** అని పిలుస్తారు. (తౌరాతు గ్రంథములో ఈ పేరే పేర్కొనబడింది) ఈ రాజు గురించి బైబిల్ పాతనిబంధనలో పేర్కొనబడింది. అతడు యెరూషలేము పైకి దాడి చేసి దానిని సర్వనాశనం చేశాడు. అది ఇశ్రాయేలీయులు తమ అకృత్యాలను విడనాడనందుకు గాను దేవుని తరపు నుంచి విరుచుకుపడిన ఒక శిక్ష. దానికి సంబంధించిన భవిష్యద్వాణులను ఎందరో దైవప్రవక్తలు వెలువరించారు.

81 **The Second Book of Esdras** 14 / 19-48 చూడండి. అందులో ఆ గ్రంథాలు అగ్నికి ఆహుతవడానికి సంబంధించిన సంఘటన ప్రస్తావించబడి ఉంది. కేథొలిక్ వర్గం ఈ గ్రంథాన్ని ఇప్పటికీ విశ్వసనీయ ప్రామాణిక గ్రంథంగా ఆమోదిస్తుంది. అయితే ప్రొటెస్టెంట్ వర్గం ఏకంగా ఆ సంఘటననే తిరస్కరిస్తుంది. ('హమారీ కితాబె ముఖద్దసహ్', పేజీ : 45) కానీ నెహెమ్యా గ్రంథములోని 8 వ అధ్యాయంలో పేర్కొనబడిన సంఘటన **Esdras** గ్రంథానికి మద్దతుగా నిలుస్తుంది. దీనినిబట్టి విస్పష్టంగా తెలుస్తున్నదేమిటంటే దైవగ్రంథమయిన తౌరాతు

***(తరువాతి పేజీ చూడండి)***

నకళ్ళన్నీ కూడా ఆంటియోకస్ దాడి సంఘటనలో [82] నశించిపోయాయి.

**రెండవ ఆధారం:** గ్రంథవహులు (క్రైస్తవులు మరియు యూదులు) దినవృత్తాంతములు మొదటి గ్రంథాన్ని, దినవృత్తాంతములు రెండవ గ్రంథాన్ని హజ్రత్ ఉజైర్ (అ) (ఎజ్రా) దైవప్రవక్తలయిన హజ్రత్ హజ్జా (అ) [హగ్గయి] మరియు హజ్రత్ జకరియ్యా (అ) [జెకర్యా] తోడ్పాటుతో వ్రాసారనే విషయంలో ఏకాభిప్రాయాన్ని కలిగియున్నారు. అయితే

---

**(అధఃసూచికలు)**

*(81 వ అధః సూచిక తరువాయి భాగం)*

మూలప్రతి నశించిపోయింది. అయితే హజ్రత్ ఉజైర్ (అ) (ఎజ్రా) తౌరాతు గ్రంథాన్ని వ్రాసి ప్రజల ముందు దానిని చదివి వినిపించారు. విచిత్రమయిన విషయమేమిటంటే కేథొలిక్ బైబిల్ అయిన **Knox Version** (క్రీ.శ. 1963 లో ప్రచురితం) లో కూడా **Esdras** గ్రంథం నుంచి ఈ సంఘటన ప్రస్తావించబడియున్న అధ్యాయమే ఏకంగా తొలగించబడింది. ఆ ప్రతిలో **Esdras** రెండవ గ్రంథం పదమూడవ అధ్యాయంతో ముగిసిపోతుంది. ఆ సంఘటన గురించి ప్రస్తావించేందుకు మా వద్ద **Esdras** గ్రంథానికి సంబంధించి ఆ ఒక్క ప్రతి తప్ప మరేమీ లేనప్పటికీ స్వయంగా క్రైస్తవులు వ్రాసిన పలు పుస్తకాలలో వాస్తవానికి **Esdras** గ్రంథం లో ఆ సంఘటన ప్రస్తావించబడి ఉన్నదనే విషయం అంగీకరించబడింది. ఎన్‌సైక్లోపేడియా బ్రిటానికాలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది : " నిశ్చయంగా మనం **Esdras** రెండవ గ్రంథం 14 : 20 నుంచి 26 వరకు గల వాక్యాలలో 'తౌరాతు గ్రంథం కాలిపోయిన కారణంగా ఎజ్రా (హజ్రత్ ఉజ్రా (అ) ) దానిని తిరిగి వ్రాయడం జరిగింది' అనే ఉల్లేఖనాన్ని పఠిస్తాము. "

(ఎన్‌సైక్లోపేడియా బ్రిటానికా, 3వ సంపుటి, పేజీ : 501, శీర్షిక : 'బైబిల్, ఆర్గ్యుమెంట్ ఆన్ ఓల్డ్ టెస్టమెంట్, యాక్సెప్టెడ్ కాంటెంట్స్ )

పాస్టర్ టీ. మేస్లీ కూడా బైబిల్ హెడింగ్ లో **Esdras** గ్రంథం ద్వారా ఈ విషయాన్ని ఉల్లేఖించారు.

82 'నాల్గవ ఆంటియోకస్ ఏపీఫేనిస్' **(Antiochus)** ఆసియా ఖండానికి చెందిన ప్రసిద్ధ రాజుగా కొనసాగాడు. అతడు క్రీ.పూ. 168 లో యెరూషలేమును స్వాధీనం చేసుకొని దానిని నాశనం చేసివేశాడు. దానితో మరొకమారు నెబుకద్నెజరు యెరూషలేముపై దాడి చేసిన సంఘటన

*(తరువాతి పేజీ చూడండి)*



ముగ్గురు దైవప్రవక్తల వాక్కు. 'దినవృత్తాంతములు మొదటి గ్రంథము' యొక్క 7వ మరియు 8వ అధ్యాయాలలో బెన్యామీను సంతానానికి సంబంధించిన ప్రస్తావనలో పరస్పర మరియు ప్రత్యక్ష విరుద్ధంగా ఉంది. అలాగే వారు ఈ విషయానికి సంబంధించిన వ్యాఖ్యానంలో ప్రసిద్ధమైన 'తౌరాతు' గ్రంథంతో [83] సైతం రెండు రకాలుగా విభేదించారు. ఒకటి పేర్ల విషయంలోనయితే, మరొకటి లెక్కింపు విషయంలో, అనగా వ్యక్తుల సంఖ్య విషయంలో. ఎందుకంటే బైబిల్ పాత నిబంధన గ్రంథంలోని 'దిన వృత్తాంతములు మొదటి గ్రంథము' యొక్క 7 వ గ్రంథం ద్వారా మనకు బెన్యామీను కుమారులు ముగ్గురని తెలుస్తుంది.[84] అయితే 'దిన వృత్తాంతములు మొదటి గ్రంథము' యొక్క 8 వ గ్రంథం ద్వారా మనకు బెన్యామీను కుమారులు ఐదుగురని తెలుస్తుంది.[85]

---

**(అధఃసూచికలు)**

*(82 వ అధః సూచిక తరువాయి భాగం)*

పునరావృతమయినట్లయింది. 'మకాబీయులు మొదటి గ్రంథం' లో అతడు యెరూషలేము పైకి దాడి చేయడానికి సంబంధించిన సంఘటన, తౌరాతు గ్రంథం కాల్చివేయబడడానికి సంబంధించిన సంఘటన విపులంగా పేర్కొనబడి ఉన్నాయి.

(చూడండి : 'మకాబీయులు మొదటి గ్రంథం', 1 / 59 )

83 బైబిల్ పాతనిబంధన గ్రంథంలోని 'ఆదికాండము', 'నిర్గమకాండము', 'లేవీయ కాండము', 'సంఖ్యాకాండము' మరియు 'ద్వితీయోపదేశ కాండము' అనే ఐదు గ్రంథాలు 'తౌరాతు' గా ప్రసిద్ధమయ్యాయి. 'ప్రసిద్ధ తౌరాతు గ్రంథము' అని పేర్కొనబడిన చోట ఈ ఐదు గ్రంథాల సముచ్చయమని అర్థం చేసుకోవాలి. అయితే అది వాస్తవానికి దైవప్రవక్త హజ్రత్ మూసా(అ) (మోషే) పై అవతరించబడిన మూల తౌరాతు గ్రంథం కాదనే చర్చ కొనసాగుతోంది.

84 " బెన్యామీను కుమారులు ముగ్గురు; బెల బేకరు యెదీయవేలు."

('దినవృత్తాంతములు మొదటి గ్రంథం', 7 : 6 )

85 " బెన్యామీను కనిన కుమారులలో బెల అనువాడు జేష్ఠుడు, రెండవవాడు అష్బేలు, మూడవవాడు అహరహు, నాల్గవవాడు నోహా, అయిదవవాడు రాపా."

('దినవృత్తాంతములు మొదటి గ్రంథం', 8 : 1 )

అయితే ప్రసిద్ధ తౌరాతు గ్రంథం ద్వారా మనకు బెన్యామీను కుమారులు పదుగురని తెలుస్తుంది.[86] అలాగే గ్రంథవహులకు చెందిన పండితులందరూ 'దినవృత్తాంతములు మొదటి గ్రంథము' లోని వివరణ తప్పుడు వివరణ అని ఏకీభవిస్తూ తీర్మానించారు. ఆ విధంగా పొరపాటు దొర్లడానికి గల కారణాన్ని వారు ఈ విధంగా పేర్కొన్నారు: " దైవప్రవక్త హజ్రత్ ఉజైర్ (అ) (ఎజ్రా) కుమారులు మరియు మనుమలకు మధ్య వ్యత్యాసాన్ని గుర్తిస్తూ వివరణను అందజేయలేదు. అలాగే వంశవృక్షానికి సంబంధించి ఆయన ఏయే పత్రాల ద్వారా ఉల్లేఖించారో అవి లోపభూయిష్ఠమైనవి".

ఈ ముగ్గురు దైవప్రవక్తలు తౌరాతును అనుసరించేవారనే విషయం విస్పష్ట సత్యం. ఒకవేళ దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) (మోషే) పై దైవం తరఫున అవతరించిన తౌరాతు గ్రంథం బైబిల్ పాతనిబంధన గ్రంథంలోని ప్రసిద్ధ తౌరాతు గ్రంథమే (ఆదికాండము, నిర్గమకాండము, లేవీయకాండము, సంఖ్యాకాండము మరియు ద్వితీయోపదేశ కాండము అనే ఐదు గ్రంథాల సముచ్చయం) అయిన పక్షంలో ఈ ముగ్గురు దైవప్రవక్తలు దానిని విభేదించేవారూ కాదు, పొరపాటుకు పాల్పడేవారూ కాదు. అలాగే దైవప్రవక్త హజ్రత్ ఉజైర్ (అ) (ఎజ్రా) ఆ తౌరాతు గ్రంథాన్ని విడిచిపెట్టి లోపభూయిష్ఠమైన వంశవృక్ష పత్రాలపై నమ్మకముంచేవారూ కాదు.

అదేవిధంగా దైవప్రవక్త హజ్రత్ ఉజైర్ (అ) (ఎజ్రా) రెండవమారు దివ్యప్రేరణ ద్వారా వ్రాసినట్లుగా చెప్పబడుతున్న తౌరాతు గ్రంథమే క్రైస్తవుల దృష్టిలో ప్రసిద్ధమైన, ప్రామాణికమైన, విశ్వసనీయమైన తౌరాతు గ్రంథమయిన పక్షంలో వారు (క్రైస్తవులు) దానిని వ్యతిరేకించేవారు కాదు, అనగా దైవప్రవక్త హజ్రత్ ఉజైర్ (అ) (ఎజ్రా) లోపభూయిష్ఠమైన వంశవృక్ష పత్రాలపై ఆధారపడి పొరపాటు చేశారని పేర్కొనేవారు కాదు. దీనినిబట్టి బైబిల్ లో తౌరాతు గ్రంథంగా ప్రసిద్ధమయిన గ్రంథం దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) పై అవతరించబడి, ఆయనచే వ్రాయబడిన తౌరాతు గ్రంథం ఎంతమాత్రం కాదని, అలాగే దైవప్రవక్త హజ్రత్ ఉజైర్ (అ) (ఎజ్రా) చే వ్రాయబడినట్లుగా చెప్పబడుతున్న తౌరాతు గ్రంథం కూడా దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) చే వ్రాయబడిన తౌరాతు గ్రంథం కాదనే విషయం స్పష్టమయింది. వాస్తవానికి బైబిల్ లో తౌరాతు గ్రంథంగా ప్రసిద్ధమయిన గ్రంథం యూదులలో నాడు ప్రసిద్ధమయి ఉన్న గాథలు, వృత్తాంతాల సముచ్చయం. వారికి చెందిన పండితులు వాటిని ఆ సముచ్చయంలో ఉల్లేఖనాల ప్రామాణికతపై

---

**(అథఃసూచికలు)**

[86] " బెన్యామీను కుమారులైన బెల బేకెరు అష్బేలు గెరా నయమాను ఏహీ రోషు ముప్పీము హుప్పీము ఆర్దు." ('ఆదికాండము', 46 : 21 )



విమర్శనాత్మకంగా విశ్లేషించకుండానే పొందుపరచడం జరిగింది. ఇక ముగ్గురు దైవప్రవక్తలు ( దైవప్రవక్త హజ్రత్ ఉజైర్ (అ) [ఎజ్రా], దైవప్రవక్త హజ్రత్ హజ్జా (అ) [హగ్గయి] మరియు దైవప్రవక్త హజ్రత్ జకరియ్యా (అ) [జెకర్యా] ) పొరపాటు చేశారని, తప్పుడు వివరణను అందజేశారని గ్రంథవహులకు చెందిన పండితులు వ్యాఖ్యానించడాన్ని పరిశీలిస్తే గ్రంథవహుల దృష్టిలో ఏవిధంగానయితే దైవప్రవక్తలు మహాపాపాలు చేయడానికి సైతం అతీతులు కారో అదేవిధంగా రచనలోనూ, ధర్మప్రచార కార్యనిర్వహణ విషయంలోనూ తప్పులకు పాల్పడేందుకు సైతం అతీతులు కారని విశదమవుతోంది. దీనికి సంబంధించిన మరింత వివరణ మీకు 2 వ అధ్యాయం లోని మొదటి లక్ష్యానికి చెందిన ఋజువు. నెం. 16 లో లభ్యమవుతుంది.

**మూడవ ఆధారం:** ఏ వ్యక్తయితే యెహెజ్కేలు గ్రంథము[87] యొక్క 45వ మరియు 46వ అధ్యాయాలను సంఖ్యాకాండము యొక్క 28వ మరియు 29వ అధ్యాయాలతో పోల్చి అధ్యయనం చేస్తాడో అతడు రెండింటినీ ఆదేశాల విషయంలో పరస్పర విరుద్ధమయినవిగా గ్రహిస్తాడు. స్థూలమయిన విషయమేమిటంటే దైవప్రవక్త హజ్రత్ హిజ్ఖీఏల్ (అ) (యెహెజ్కేలు) తౌరాతు గ్రంథాన్ని అనుసరించేవారు. ఒకవేళ ఆయన కాలంలో అదే (అనగా బైబిల్ పాతనిబంధనలోని ఆదికాండము, నిర్గమకాండము, లేవీయకాండము, సంఖ్యాకాండము మరియు ద్వితీయోపదేశ కాండము అనే ఐదు గ్రంథాల సముచ్చయం) తౌరాతు గ్రంథమయిన పక్షంలో ఆయన వాటికి చెందిన ఆదేశాల విషయంలో ఎందుకు విభేదించేవారు?

అలాగే బైబిల్ పాతనిబంధన గ్రంథంలో తౌరాతు గ్రంథంగా ప్రసిద్ధమయిన గ్రంథాలలో ఎన్నోచోట్ల " కుమారులు తమ పెద్దల పాపాల విషయంలో మూడు తరాల వరకు పట్టుబడతారు" అని పేర్కొనబడింది. అయితే యెహెజ్కేలు గ్రంథంలోని 18వ అధ్యాయపు 20 వ వచనంలో **" పాపము చేయువాడే మరణమునొందును; తండ్రి యొక్క దోష శిక్షను కుమారుడు మోయుటలేదని కుమారుని దోష శిక్షను తండ్రి మోయడు, నీతిపరుని నీతి ఆ నీతిపరునికే చెందును, దుష్టుని దుష్టత్వము ఆ దుష్టునికే చెందును"** అని పేర్కొనబడి ఉంది. ఈ వచనం ద్వారా ఏ వ్యక్తీ మరొక వ్యక్తి చేసిన నేరానికి గాను దైవంచే పట్టుబడడని విదితమవుతోంది. ఇదే సత్యం. పవిత్ర ఖుర్ఆన్ గ్రంథంలోనూ ఈ విషయం గురించి ఒకచోట ఈ విధంగా పేర్కొనబడింది:

---

**(అథఃసూచికలు)**

[87] ఈ రెండు చోట్ల ఖుర్బానీ (దేవునికి అర్పించే జంతుబలి) కు సంబంధించిన ఆదేశాలు పేర్కొనబడి ఉన్నాయి. అయితే వాటికి సంబంధించిన వివరణల్లో వైరుధ్యముంది.

**“ అల్లా తజిరు వాఇరతుఽ వ్విజ్ర ఉఖ్రా ”** ( బరువును మోసే ఏ ప్రాణీ మరొక ప్రాణి బరువును మోయదు”   (ఖుర్ఆన్, ‘నజ్మ్’ : 38)

**నాల్గవ ఆధారం:** ఏ వ్యక్తయితే ‘కీర్తనల గ్రంథము’, ‘నెహెమ్యా ’, ‘యిర్మీయా’, మరియు ‘యెహెజ్కేలు’ గ్రంథాలను అధ్యయనం చేస్తాడో అతడు పూర్వ యుగంలో ఏ రచనా విధానమయితే కొనసాగిందో అది ప్రస్తుతం ముస్లింలలో వ్యవహారంలో ఉన్న రచనా విధానమేనని తప్పనిసరిగా గ్రహిస్తాడు. అనగా ఒకవేళ రచయిత స్వయంగా తన స్వీయ స్థితిగతుల గురించి లేదా తాను స్వయంగా చూసిన సంఘటనల గురించి వ్రాసినట్లయితే దానిని పఠించే వ్యక్తికి రచయిత తన స్వీయ స్థితిగతుల గురించి లేదా తాను చూసిన సంఘటనల గురించి వివరిస్తున్నాడనే విషయం బోధపడేది. ఈ విషయం తౌరాతుగా పరిగణించబడుతున్న బైబిల్ పాతనిబంధనకు చెందిన తొలి ఐదు గ్రంథాలలో ఎక్కడా మనకు కానరాదు. ఇంకా చెప్పాలంటే వాటిని దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) (మోషే) కాకుండా మరొక వ్యక్తి వ్రాసినట్లుగా, అతడు యూదులలో ప్రచారంలో ఉన్న గాథలను, వృత్తాంతాలను ఈ గ్రంథంలో క్రోడీకరించి, తాను క్రోడీకరించిన ఉల్లేఖనాలలో  దేనినయితే తాను దేవుని వాక్కుగా భావించాడో దానికి ముందు ‘యెహోవా ఇట్లు చెప్పెను’ అని పేర్కొన్నట్లుగా, దేనినయితే దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) (మోషే) వాక్కుగా తాను భావించాడో దానికి ముందు ‘ మోషే ఇట్లనెను’ అని పేర్కొన్నట్లుగా మనకు స్పష్టంగా విదితమవుతుంది. అలాగే అన్నిచోట్ల అతడు దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) (మోషే) ను ప్రథమ పురుషలో వ్యక్తీకరించినట్లుగా మనం గమనించగలము. అనగా ‘మోషే ఇట్లనెను’ అని పేర్కొన్నట్లుగా మనం  గమనించగలము.

ఒకవేళ బైబిల్ లో ప్రసిద్ధమయిన తౌరాతు గ్రంథంగా పరిగణించబడుతున్న గ్రంథం నిజంగానే దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) (మోషే) చే వ్రాయబడినట్లయితే హజ్రత్ మూసా (అ) (మోషే) తన కొరకు ఉత్తమ పురుష పదాన్ని (అనగా ‘నేను’ అనే పదాన్ని) ఉపయోగించేవారు. అలా కాకుంటే కనీసం ఒక్క చోటయినా ఆ విధంగా ఉపయోగించబడి ఉండేది. ఎందుకంటే ఉత్తమ పురుష పదం ద్వారా వివరణ అందజేయబడడమనేది ఆ గ్రంథం విశ్వసనీయతను ఎంతగానో పెంచివేస్తుంది. ఏ విషయం గురించయితే రచయిత స్వయంగా తానే సాక్షిగా వివరణను అందజేస్తాడో దానిని, అందుకు వ్యతిరేకంగా ఏదయినా పటిష్ఠమయిన ఆధారం లభించనంతవరకు, విశ్వసించడం మినహా మార్గాంతరం లేదు. ఇక ఏ వ్యక్తయితే తాను వివరిస్తున్న సంఘటనలకు స్వయంగా సాక్షిగా కాకుండా నివేదిక రూపంలో అందజేస్తాడో లేదా ఉనికిలో ఉన్న విషయానికి వ్యతిరేకంగా ఏదయినా ప్రకటిస్తాడో అందుకు గాను ఆధారాన్ని అందజేయవలసిన బాధ్యత స్వయంగా అతడిదే అవుతుంది.



**ఐదవ ఆధారం:** కొన్ని వచనాలు లేదా కొన్ని అధ్యాయాల విషయంలో ‘అవి దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) (మోషే) వాక్కు’ అని ప్రకటించే ధైర్యం ఎవరికీ లేదు. ఇంకా చెప్పాలంటే కొన్ని వాక్యాలయితే స్పష్టమైన రీతిలో ఆ గ్రంథ కూర్పుకర్త నిశ్చయంగా దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ) (దావీదు) కాలానికి ముందరి కాలానికి చెందజాలడనే విషయానికి లేదా ఆయన సమకాలికుడు కాడనే విషయానికి లేదా ఆయన తరువాతి కాలానికి చెందజాలడనే విషయానికి సాక్ష్యం పలుకుతున్నాయి. త్వరలోనే మీ ముందుకు ఆ వాక్యాలు మరియు అధ్యాయాలు ఈ గ్రంథం యొక్క 2వ అధ్యాయంలోని లక్ష్యం-2 లో ఇన్షా అల్లాహ్ (అల్లాహ్ చిత్తమయితే) విపులంగా రాబోతున్నాయి.

క్రైస్తవ పండితులు కేవలం అంచనాపూర్వకంగా “ ఆ వాక్యాలను తరువాత ఏ దైవప్రవక్తో చేర్చి ఉండవచ్చు” అని పేర్కొంటూ ఉంటారు. అయితే ఈ విషయం ముమ్మాటికీ తప్పే. ఎందుకంటే వారి వద్ద తమ ఈ ప్రకటనకు గాను ఏ ఆధారమూ లేదు. ఏ దైవప్రవక్తా తన గ్రంథంలో “ నేను ఫలానా గ్రంథంలోని ఫలానా అధ్యాయంలో ఫలానా వాక్యాన్ని చేర్చాను” అని పేర్కొనలేదు. అలాగే “ ఫలానా దైవప్రవక్త ఆ విధంగా చేర్చడం జరిగింది” అని కూడా పేర్కొనలేదు. ఈ విషయం మరే ఇతర ఖచ్చితమైన ఆధారం ద్వారానూ నిరూపితం కాలేదు. కేవలం ఊహలు, అంచనాలు ఈ విషయంలో ప్రయోజనదాయకం కాజాలవు. కనుక ఈ వాక్యాలు మరియు అధ్యాయాలు దైవగ్రంథానికి చెందినవనే విషయానికి ఖచ్చితమైన ఆధారం లభించనంతవరకు ఈ గ్రంథం (బైబిల్ పాతనిబంధనలోని మొదటి ఐదు గ్రంథాల సముచ్ఛయం) దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) (మోషే) చే వ్రాయబడిన దైవగ్రంథం కాదనే విషయానికే అవి సాక్ష్యాలుగా నిలుస్తాయి.

**ఆరవ ఆధారం:** ‘ఖులాసయె సైఫుల్ ముస్లిమీన్’ గ్రంథ రచయిత ‘ఎన్సైక్లోపేడియా బీనీ’ పదవ సంపుటం నుంచి ఈ విధంగా ఉల్లేఖించారు:

విశ్వసనీయుడయిన క్రైస్తవ పండితుడయిన డాక్టర్ సికిందర్ కైదస్ ‘న్యూ బైబిల్’ కు ముందుమాట వ్రాస్తూ ఈ విధంగా పేర్కొన్నారు: “ నాకు గుప్త ప్రమాణాల ద్వారా మూడు విషయాలు ఖచ్చితంగా తెలిసాయి: (1) ప్రస్తుత తౌరాతు గ్రంథం దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) (మోషే) చే వ్రాయబడిన గ్రంథం కాదు.   (2) ఆ గ్రంథం కనాను లేదా యెరూషలేములో వ్రాయబడింది. అనగా ఇశ్రాయేలీయులు ఎడారి జీవితం గడుపుతున్న కాలంలో, అనగా దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) (మోషే) జీవితకాలంలో వ్రాయబడలేదు. ఆ గ్రంథం యొక్క కూర్పు దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ) (దావీదు) కు ముందరి కాలంలో మరియు దైవప్రవక్త హజ్రత్ హిజ్ఖీఏల్ (అ) (యెహెజ్కేలు) తర్వాతి కాలంలో సంభవించినట్లుగా ఆధారం లేదు. ఆ గ్రంథం

దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) (సొలొమోను) కాలంలో వ్రాయబడినట్లుగా సముచితమైన రీతిలో విశదమవుతుంది. అనగా దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) జననానికి వెయ్యి సంవత్సరాల ముందు లేదా దానికి సమీప కాలంలో, అనగా ప్రఖ్యాత కవి అయిన హోమర్ జీవించిన కాలంలో అది వ్రాయబడింది. ఒక్కమాటలో చెప్పాలంటే ఆ గ్రంథం దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) (మోషే) దివంగతులయిన (మరణించిన) 500 సంవత్సరాల తర్వాత మాత్రమే వ్రాయబడినట్లుగా ఋజువవుతుంది.''

**ఏడవ ఆధారం:** క్రైస్తవ పండితుడయిన టోర్టన్ ఈ విధంగా పేర్కొన్నారు:

" తౌరాతు లో పేర్కొనబడిన జాతీయాలకు, ఇశ్రాయేలీయులు బాబెలు ఖైదు నుంచి విముక్తులయిన తర్వాతి కాలంలో వ్రాయబడిన, బైబిల్ పాతనిబంధన గ్రంథంలోని ఇతర గ్రంథాలలోని జాతీయాలకు మధ్య గుర్తించదగిన భేదమేమీ కనిపించదు. వాస్తవానికి రెండు కాలాల నడుమ 900 సంవత్సరాల సుదీర్ఘ అంతరముంది. రెండు కాలాల నడుమ అంతరమున్నప్పుడు ఆ కాలాలకు చెందిన భాషలోనూ భేదమేర్పడుతుందనే విషయం అనుభవపూర్వకంగా మనకు తెలుసు. ఇంగ్లిష్ భాషనే ఉదాహరణగా తీసుకుంటే ప్రస్తుతం వాడుకలో ఉన్న ఇంగ్లిష్ భాషను 400 సంవత్సరాలకు ముందు వాడుకలో ఉండిన ఇంగ్లిష్ భాషతో మీరు పోల్చినట్లయితే ఎంతో భేదమున్నట్లుగా మీరు గుర్తిస్తారు. అయితే బైబిల్ పాతనిబంధనకు చెందిన గ్రంథాలలో పేర్కొనబడిన జాతీయాలలో గుర్తించదగిన భేదమేమీ లేకపోవడానికి గల కారణాన్ని అంచనా వేస్తూ హెబ్రూ భాషలో నిష్ణాతుడయిన లియూస్లిన్ ఈ విధంగా పేర్కొన్నారు: **" ఈ గ్రంథాలన్నీ ఒకే కాలంలో వ్రాయబడ్డాయి"**

సత్యం కూడా ఇదే. రెండు కాలాల మధ్య అంతరమున్నప్పుడు వాటి భాషల్లోనూ వైరుధ్యాలు, వ్యత్యాసాలు ఏర్పడడమనేది ఎంతటి విస్పష్టమైన, నిరాకరించలేని సత్యమంటే టోర్టన్ మరియు లియూస్లిన్ ల తీర్పుకు మద్దతు పలకడం మినహా మార్గాంతరం లేదు.

**ఎనిమిదవ ఆధారం:** బైబిల్ పాతనిబంధన గ్రంథంలోని 'ద్వితీయోపదేశ కాండం' యొక్క 27 వ అధ్యాయపు 5 వ వచనంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" అక్కడ నీ దేవుడైన యెహోవాకు బలిపీఠమును కట్టవలెను. ఆ బలిపీఠమును రాళ్ళతో కట్టవలెను; వాటిమీద ఇనుప పనిముట్టు పడకూడదు"**

ఆ తర్వాత 8వ వచనంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" ఈ విధికి సంబంధించిన వాక్యములన్నిటిని ఆ రాళ్ళ మీద బహు విశదముగా**



**వ్రాయవలెను"**

ఈ ఎనిమిదవ వచనం బైబిల్ పారసీక అనువాద గ్రంథం (క్రీ.శ. 1835 లో ప్రచురితం) లో ఈ విధంగా పేర్కొనబడింది : - (దాని తెలుగు అనువాదం క్రింద పేర్కొనబడుతోంది)

**" మరియు ఆ రాళ్ళ మీద ఆ తౌరాతుకు చెందిన పదములన్నిటినీ విస్పష్టమైన రీతిలో వ్రాయుము"**

అలాగే క్రీ.శ. 1845 లో ప్రచురించబడిన బైబిల్ పారసీక అనువాద గ్రంథంలో ఈ విధంగా పేర్కొనబడింది : - (దాని తెలుగు అనువాదం క్రింద పేర్కొనబడుతోంది)

**" మరియు ఆ రాళ్ళమీద ఆ తౌరాతుకు చెందిన పదములన్నింటినీ ప్రఫుల్లమైన లిపిలో వ్రాయుము"**

'యెహోషువ గ్రంథం' లోని 8వ అధ్యాయంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" మోషే ధర్మశాస్త్ర గ్రంథములో వ్రాయబడిన ప్రకారము యెహోవా సేవకుడైన మోషే ఇశ్రాయేలీయులకాజ్ఞాపించినట్లు యెహోషువ ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా నామమున బలిపీఠమును ఇనుప పనిముట్లు తగిలింపని కారు రాళ్ళతో ఏబాలు కొండమీద కట్టించెను. దానిమీద వారు యెహోవాకు దహనబలులను సమాధాన బలులను అర్పించిరి. మోషే ఇశ్రాయేలీయులకు వ్రాసి యిచ్చిన ధర్మశాస్త్ర గ్రంథమును ఒక ప్రతిని అతడు అక్కడ ఆ రాళ్ళ మీద వ్రాయించెను" ( యెహోషువ, 8-30, 31, 32 )**

అదే అధ్యాయపు 32 వ వాక్యం క్రీ.శ. 1839 లో ప్రచురించబడిన బైబిల్ పారసీక అనువాద గ్రంథంలో ఈ విధంగా పేర్కొనబడింది : - (దాని తెలుగు అనువాదం క్రింద పేర్కొనబడుతోంది)

**" అక్కడ మోషే యొక్క తౌరాతును ఇశ్రాయేలీయుల ముందు వ్రాతపూర్వకముగా పొందుపరిచే నిమిత్తం ఆ రాళ్ళ మీద వ్రాయించెను."**

ఈ వాక్యం క్రీ.శ. 1845 లో ప్రచురించబడిన బైబిల్ పారసీక అనువాద గ్రంథంలో ఈ విధంగా పేర్కొనబడింది : - (దాని తెలుగు అనువాదం క్రింద పేర్కొనబడుతోంది)

**" ఆ ప్రదేశంలో ఆ రాళ్ళ మీద ఇశ్రాయేలీయుల ముందు ప్రత్యక్షముగా వ్రాయబడిన మోషే యొక్క తౌరాతు ప్రతిని వ్రాసెను "**

ఈ వాక్యాల ద్వారా విశదమవుతున్న విషయం ఇది : తౌరాతు గ్రంథం పరిమాణం

ఎంతగా ఉండేదంటే దానిని ఒకవేళ బలిపీఠపు రాయి మీద వ్రాయదలుచుకున్నా ఆ విధంగా వ్రాసేందుకు ఆ బలిపీఠం సరిపోయేది. ఒకవేళ పాతనిబంధన గ్రంథములోని తొలి ఐదు గ్రంథాల సముచ్చయమే మూల తౌరాతు గ్రంథమయిన పక్షంలో ఆ విధంగా బలిపీఠం మీద సమస్త తౌరాతు ప్రతిని వ్రాయడం సాధ్యం కాదనే విషయాన్ని మనం గ్రహించాలి. కనుక మేము నాల్గవ ఆధారంలో పేర్కొన్న విషయమే ఇక్కడా వర్తిస్తుంది.

**తొమ్మిదవ ఆధారం:** క్రైస్తవ పండితుడయిన ఫాదర్ టోర్టన్ ఈ విధంగా పేర్కొన్నారు:

**" దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) (మోషే) కాలంలో లేఖన విద్య వాడుకలో లేదు"**

ఈ ఆధారాన్ని పేర్కొనడానికి వెనుక ఆయన ఉద్దేశ్యం దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) (మోషే) కాలంలో లేఖన విద్య (వ్రాసే విద్య) వాడుకలో లేనప్పుడు హజ్రత్ మూసా (అ) (మోషే) ఆ ఐదు గ్రంథాలను (ఆదికాండము, నిర్గమ కాండము, లేవీయ కాండము, సంఖ్యాకాండము మరియు ద్వితీయోపదేశ కాండము) వ్రాయలేదని స్పష్టీకరించడమే. ఒకవేళ విశ్వసనీయమైన చరిత్ర గ్రంథాలు ఈ విషయానికి మద్దతు పలికినట్లయితే ఈ ఆధారం ఎంతో ముఖ్యమైనదిగా, విలువయినదిగా, శక్తివంతమైనదిగా పరిగణించబడుతుంది. టోర్టన్ వ్యాఖ్యకు క్రీ.శ. 1850 లో ఛార్లెస్ డాలీన్, లండన్ లో ప్రచురితమైన ఇంగ్లిష్ చరిత్ర గ్రంథంలోని క్రింద ఉటంకించబడిన పంక్తులు మద్దతుగా నిలుస్తాయి:

" పూర్వకాలంలో ప్రజలు ఇనుముతో లేదా ఇత్తడితో లేదా ఎముకతో చేయబడిన శలాక ద్వారా రాగి మీద లేదా కొయ్య మీద లేదా మైనం మీద అక్షరాలను చెక్కేవారు. ఆ తర్వాత ఈజిప్షియన్లు ఆ పలకలకు బదులుగా 'పేపర్స్' అనే చెట్టు ఆకులను ఉపయోగించనారంభించారు. ఆ తర్వాత బర్కస్ పట్టణంలో అట్ట కనిపెట్టబడింది. క్రీ.శ. ఎనిమిదవ శతాబ్దంలో దూది మరియు పట్టు నుంచి కాగితం తయారుచేయబడింది. ఆ తర్వాత క్రీ.శ. పదమూడవ శతాబ్దంలో వస్త్రం ద్వారా కాగితం రూపొందించబడింది. కలం క్రీస్తుశకం ఏడవ శతాబ్దంలో ఆవిష్కరించబడింది.''

ఈ చరిత్రకారుని పరిశోధన ఒకవేళ క్రైస్తవుల దృష్టిలో సరియైనదే అయిన పక్షంలో టోర్టన్ వ్యాఖ్యకు మద్దతు తెలిపేందుకు సందేహించవలసిన అవసరమే ఉండదు.

**పదవ ఆధారం:** బైబిల్లో తౌరాతు గ్రంథంగా ప్రసిద్ధమయిన పాత నిబంధనకు చెందిన తొలి ఐదు గ్రంథాలలో పలు వైరుధ్యాలతో కూడిన వాక్యాలు ఎన్నో ఉన్నాయి. అవి నిజంగానే దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) (మోషే) చే వ్రాయబడిన తౌరాతు గ్రంథమే అయిన పక్షంలో హజ్రత్ మూసా (అ) (మోషే) వాక్కు అటువంటి వైరుధ్యాలకు, తప్పులకు అతీతంగా



ఉండాలి. అయితే అటువంటి వైరుధ్యాలతో కూడిన వాక్యాలు ఎన్నో మనకు పాతనిబంధనలో కనిపిస్తాయి. ఉదాహరణకు 'ఆదికాండము' యొక్క 46 వ అధ్యాయపు 15వ వచనంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" వీరు లేయా [88] కడుపున సోరియహ్ అనే ఏఋ నడుమ పుట్టిన కుమారులు. దీనా కూడా ఆమె కుమార్తెయే. ఆ విధంగా ఆమెకు పుట్టిన కుమారులు, కుమార్తెలు మొత్తం కలిపి ముప్పది ముగ్గురు "**

ఇక్కడ అందరి సంఖ్య 33 అని పేర్కొనబడింది. ఇది తప్పు. వాస్తవానికి ఆ సంఖ్య 34. ఆ సంఖ్యను పేర్కొనే విషయంలో తప్పు జరిగిందనే విషయాన్ని ప్రసిద్ధ క్రైస్తవ పండితుడయిన, బైబిల్ వ్యాఖ్యాత అయిన హార్స్లే కూడా అంగీకరించారు. ఆయన ఈ విధంగా పేర్కొన్నారు:

**" ఒకవేళ మీరు పేర్లను లెక్కించినట్లయితే, దీనాను కూడా లెక్కలోకి తీసుకున్నట్లయితే ఆ సంఖ్య 34 అవుతుంది. ఆమెను (దీనాను) పరిగణనలోకి తీసుకోవడం తప్పనిసరి. జిల్పా [89] యొక్క సంతానం సంఖ్య ద్వారా ఈ విషయం మనకు తెలుస్తుంది. ఎందుకంటే ఆషేరు కుమార్తెయైన శెరహు మొత్తం పదహారు మంది సంతానంలో ఒకతె"**

---

**(అథఃసూచికలు)**

[88] ఇది బైబిల్ అరబీ ప్రతి అనువాదం. ప్రస్తుతం వాడుకలో ఉన్న ఉర్దూ, ఇంగ్లిష్ మరియు తెలుగు బైబిల్ ప్రతులలో ఈ వాక్యం ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" వీరు లేయా కుమారులు. ఆమె పద్దనరాములో యాకోబు వారిని అతని కుమార్తెయైన దీనాను కనెను. అతని కుమారులును అతని కుమార్తెలును అందరును ముప్పది ముగ్గురు."**

[89] అనగా లేయా సంతానం గురించి ప్రస్తావించబడిన తర్వాత తదుపరి వాక్యంలో జిల్పా (హజ్రత్ యాఖూబ్ (అ) (యాకోబు) యొక్క బానిస) సంతానం గురించి ప్రస్తావించబడింది. వారి సంఖ్య 16 అని తెలుపబడింది. కుమారులతో పాటు కుమార్తెయైన శెరహు (సారా) ను కూడా లెక్కలోకి తీసుకున్నప్పుడు మాత్రమే వారి సంఖ్య 16 అవుతుంది. ఇక్కడ కుమార్తెను కూడా లెక్కలోకి తీసుకున్నప్పుడు లేయా సంతానాన్ని లెక్కించే సమయంలోనూ ఆమెను లెక్కలోకి తీసుకోవలసి ఉంటుంది. అంతేగాకుండా స్వయంగా తౌరాతు గ్రంథంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది: **" అతని కుమారులును అతని కుమార్తెలును అందరును ముప్పది ముగ్గురు"** ఈ వాక్యంలో కుమారులతో పాటు కుమార్తెలు కూడా లెక్కలోకి తీసుకోబడినట్లుగా వివరణ ఉంది.

అదేవిధంగా 'ద్వితీయోపదేశ కాండము' యొక్క 23 వ అధ్యాయపు 2వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" కుండుడు యెహోవా సమాజములో చేరకూడదు. వానికి పదియవ తరమువాడైనను యెహోవా సమాజములో చేరకూడదు "**

(రంకు మగవానికి పుట్టినవానిని 'కుండుడు' అంటారు)

ఈ వాక్యము కూడా తప్పుడు వాక్యమే. ఒకవేళ ఈ వాక్యము సత్యమే అయిన పక్షంలో దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ) (దావీదు) మరియు పెరెసు[90] వరకు ఆయన పూర్వీకులందరూ యెహోవా సమాజంలో చేరకూడని పరిస్థితి ఏర్పడుతుంది. ఎందుకంటే దీనికి సంబంధించిన వివరణ ఆదికాండము యొక్క 38వ అధ్యాయంలోని 15వ వాక్యం నుంచి 19వ వాక్యం వరకు మరియు 27వ వాక్యం నుంచి 29వ వాక్యం వరకు పేర్కొనబడి ఉంది. దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ) (దావీదు) పెరెసు పదవ తరానికి[91] చెందినవారు. ఈ విషయం గురించి మత్తయి సువార్తలోనూ, లూకా సువార్తలోనూ దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) వంశావళిలో ఈ విధంగానే పేర్కొనబడి ఉంది. వాస్తవానికి దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ) (దావీదు) తన సమాజంలో ఐశ్వర్యవంతులుగా, జబూర్ గ్రంథం ప్రకారం దేవునికి చెందిన యువకులు.

అదేవిధంగా 'నిర్గమ కాండము' యొక్క 12 వ అధ్యాయపు 40వ వాక్యంలో ఏదయితే పేర్కొనబడి ఉందో అది నిశ్చయంగా తప్పు అని ఈ పుస్తకం యొక్క 2వ అధ్యాయంలోని లక్ష్యం-3 యొక్క బుజువు నెం.1 ద్వారా మీకు తెలుస్తుంది.

(అథఃసూచికలు)

90 పెరసు దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ) (దావీదు) కు తొమ్మిదవ తరం తండ్రి.

(దినవృత్తాంతములు మొదటి గ్రంథము, అధ్యాయం-2,
4 వ వాక్యం నుంచి 16వ వాక్యం వరకు)

91 అన్ని ప్రతుల్లోనూ ఈ విధంగానే పేర్కొనబడి ఉంది. అయితే ఇది గ్రంథ రచయిత తప్పు. వాస్తవమేమిటంటే దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ) (దావీదు) పెరసు యొక్క తొమ్మిదవ తరంలో ప్రభవించారు. ఈ విషయం మనకు మత్తయి సువార్త ( అధ్యాయం-1, 1వ వాక్యం నుంచి 6వ వాక్యం వరకు), లూకా సువార్త (అధ్యాయం-3, 33వ వాక్యం) మరియు దినవృత్తాంతములు మొదటి గ్రంథము (అధ్యాయం-2, 4వ వాక్యం నుంచి 16 వ వాక్యం వరకు) ద్వారా తెలుస్తుంది.



# ఇశ్రాయేలీయుల జనాభా లెక్కింపులో తప్పు

సంఖ్యాకాండము యొక్క మొదటి అధ్యాయంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" అట్లు ఇశ్రాయేలీయులలో తమ తమ పితరుల కుటుంబముల చొప్పున లెక్కింపబడిన వారందరు, అనగా ఇరువది యేండ్లు మొదలుకొని పై ప్రాయము కలిగి సేనగా బయలువెళ్ళిన ఇశ్రాయేలీయులందరు లెక్కింపబడి ఆరులక్షల మూడువేల ఐదువందల ఏబదిమంది యైరి. అయితే లేవీయులు తమ పితరుల గోత్రము చొప్పున వారితో పాటు లెక్కింపబడలేదు"**

(సంఖ్యాకాండము, అధ్యాయం-1, 45 వ వాక్యం నుంచి 47వ వాక్యం వరకు)

ఈ వాక్యాల ద్వారా యుద్ధం చేసేందుకు యోగ్యులయినవారి సంఖ్య ఆరులక్షలకు మించినదని తెలుస్తుంది. ఇక లేవీయులకు చెందిన స్త్రీ పురుషులు, అలాగే మిగిలిన వంశాలకు చెందిన స్త్రీలు మరియు ఇరవై సంవత్సరాల కంటే తక్కువ వయస్సును కలిగియున్న పురుషులు ఈ లెక్కింపులో పరిగణనలోకి తీసుకోబడలేదు. ఒకవేళ మనం ఆ విధంగా చేర్చబడని స్త్రీ పురుషులందరినీ లెక్కలోకి తీసుకోబడినవారితో చేర్చి లెక్కించినట్లయితే వారి మొత్తం సంఖ్య ఇరవై ఐదు లక్షలకు తక్కువ కాదు. వాస్తవానికి ఇది కొన్ని కారణాల రీత్యా తప్పు.[92]

(అథఃసూచికలు)

92 కొంతమంది ఈ తప్పును అంగీకరించారు. వీనర్ **(Wiener)** ఈ విధంగా పేర్కొన్నాడు: "బహుశా ఆ కాలంలో లేఖకులు ఆ సంఖ్యలను ఉల్లేఖించే విషయంలో తప్పు దొర్లి ఉంటుంది" జీ.టీ. మేస్లీ ఈ వ్యాఖ్యను అన్నింటికంటే ఎక్కువగా ఆమోదించదగినదిగా తీర్మానించారు. అయితే మళ్ళీ మతపరమైన పక్షపాత ధోరణితో ఈ విధంగా కూడా పేర్కొన్నారు: **" అక్కడ ఇశ్రాయేలీయులతో కొన్ని అతీంద్రియ శక్తులు మహిమాన్విత రీతిలో చేరిపోయాయి. కనుక ఇశ్రాయేలీయుల సంఖ్య ఆ విధంగా పెరిగేందుకు అవకాశం లేకపోలేదు"** ( బైబిల్ హ్యాండ్‌బుక్ బడీల్, ద్వితీయోపదేశకాండము) అయితే పాఠకులు ప్రస్తుతం చదువుతున్న ఈ పుస్తక రచయిత తదుపరి పేర్కొన్న ఆధారాల దృష్ట్యా (ముఖ్యంగా ఐదవ కారణం రీత్యా) జీ.టీ. మేస్లీ అందించిన వివరణ సత్యమయ్యేందుకు ఎంతమాత్రం అవకాశం లేదు. బోధపడని మరొక విషయమేమిటంటే ఒకవేళ మహిమాన్విత రీతిలో ఇశ్రాయేలీయుల సంఖ్య పెరగవలసియున్న పక్షంలో వారు ఈజిప్టు (ఐగుప్తు) లో నిలిచియున్నప్పుడు ఆ పెరుగుదల ఆవశ్యకత ఎక్కువగా ఉండినది. ఆ సమయంలోనయితే వారి సంఖ్య పెరగలేదు. వారు ఈజిప్టు నుంచి నిష్క్రమించిన తర్వాత, వారి ముందు ఏ శత్రువూ లేని సమయంలో వారి సంఖ్య పెంచబడింది. ఆ సమయంలో జనాభా పెరుగుదల అనేది ఒక మోయలేని భారంగా పరిణమించడం మినహా మరే విధంగానూ ప్రయోజనదాయకం కాదు.

## మొదటి కారణం:

ఇశ్రాయేలీయులకు చెందిన స్త్రీ పురుషుల మొత్తం సంఖ్య వారు ఈజిప్టు (ఐగుప్తు) కు వచ్చిన సమయంలో 70. (దీనికి సంబంధించిన వివరణ బైబిల్ పాతనిబంధన గ్రంథములోని 'ఆదికాండము' యొక్క 46 వ అధ్యాయపు 27వ వాక్యంలోనూ, 'నిర్గమకాండము' యొక్క 1వ అధ్యాయపు 5వ వాక్యంలోనూ మరియు 'ద్వితీయోపదేశకాండము' యొక్క 10వ అధ్యాయపు 22వ వాక్యంలోనూ అందించబడి ఉంది) మీకు త్వరలోనే ఈ పుస్తకం యొక్క 2వ అధ్యాయంలోని లక్ష్యం-3, బుజువు-1 లో పేర్కొనబడిన అంశం ద్వారా ఇశ్రాయేలీయులు ఈజిప్టు (ఐగుప్తు) లో నిలిచియున్న మొత్తం కాలం 215 సంవత్సరాలని, అంతకంటే ఎక్కువ ఎంతమాత్రం కాదనే విషయం తెలుస్తుంది. అయితే 'నిర్గమకాండము' యొక్క 1వ అధ్యాయపు 16వ వాక్యం ద్వారా ఇశ్రాయేలీయులు ఈజిప్టు (ఐగుప్తు) నుంచి నిష్క్రమించడానికి 80 సంవత్సరాల ముందు వారి మగబిడ్డలు పుట్టిన వెంటనే హతమార్చబడేవారని, ఆడబిడ్డలు విడచిపెట్టబడేవారని తెలుస్తుంది.

ఈ మూడు విషయాలను గురించి, అనగా ఇశ్రాయేలీయులు ఈజిప్టు (ఐగుప్తు) లోకి ప్రవేశించిన సమయంలో వారి సంఖ్య, వారు ఈజిప్టు (ఐగుప్తు)లో నిలిచియున్న కాలపరిమితి మరియు వారి మగబిడ్డలు హతమార్చబడడం అనే మూడు విషయాలను గురించి తెలుసుకున్న తర్వాత ఇప్పుడు తెలుసుకోవలసిన విషయమేమిటంటే ఒకవేళ వారి మగబిడ్డలు హతమార్చబడడానికి సంబంధించిన సంఘటనను మినహాయించినప్పటికీ, అనగా హతమార్చబడిన మగబిడ్డలను లెక్కలోకి తీసుకున్నప్పటికీ, అలాగే ప్రతి ఇరవైఐదు సంవత్సరాలకు వారి సంఖ్య రెట్టింపు అవుతూ వచ్చిందని భావించినప్పటికీ ఆ కాలపరిమితిలో వారి సంఖ్య 35 వేలకు సైతం చేరుకోజాలదు. మరి వారి (ఇశ్రాయేలీయుల) సంఖ్య ఇరవైఐదు లక్షలు ఎలా కాగలదు? ఒకవేళ ఇశ్రాయేలీయుల మగబిడ్డలు హతమార్చబడడానికి సంబంధించిన సంఘటనను పరిగణనలోకి తీసుకున్నట్లయితే, అనగా హతమార్చబడిన ఆ మగబిడ్డలను లెక్క నుంచి మినహాయించినట్లయితే ఇశ్రాయేలీయుల సంఖ్య ఇరవైఐదు లక్షలకు చేరుకోవడమనేది బుద్ధిపరంగా అసాధ్యమనే విషయం విస్పష్టమైన రీతిలో తేలిపోయింది.

## రెండవ కారణం:

ఇశ్రాయేలీయుల సంఖ్య 70 నుంచి పెరుగుతూ అంత ఎక్కువ సంఖ్యకు చేరుకోవడం, వారికి విరుద్ధంగా ఖబతీయులు ఎంతో సుఖంగా, నిశ్చింతగా ఉండినప్పటికీ ఇశ్రాయేలీయుల వలె వారి సంఖ్య అంతటి స్థాయిలో పెరగకపోవడం అనేది నిశ్చయంగా సత్యదూరం. ఈజిప్టును నాడు పరిపాలించిన రాజు వారిని ఘోరమైన రీతిలో హింసించేవాడు. వాస్తవానికి వారందరూ



ఉమ్మడి సమాజంగా అప్పుడు ఉనికిలో ఉన్నారు. అయినప్పటికీ వారు విద్రోహానికి పాల్పడలేదు, దేశం నుంచి నిష్క్రమించనూ లేదు. చివరకు పశువులు కూడా తన సంతానానికి సహకరించేందుకు సిద్ధపడతాయనే విషయాన్ని మనం మరువకూడదు.

## మూడవ కారణం:

'నిర్గమకాండము' యొక్క 12 వ అధ్యాయపు 38 వ వాక్యం ద్వారా ఇశ్రాయేలీయులతో పాటు ఎన్నో జంతువులు, అనగా ఆవులు, మేకలు, గొర్రెలు, ఎద్దులు మొదలయినవి కూడా ఉండేవని తెలుస్తుంది. అయినప్పటికీ అదే గ్రంథంలో వారు ఒక్క రాత్రిలోనే సముద్రాన్ని అధిగమించినట్లుగా పేర్కొనబడింది. అలాగే వారు ప్రతిరోజూ ప్రయాణం చేసేవారని[93] కూడా పేర్కొనబడింది. అలాగే వారు పయనమయి పోయేందుకు దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) (మోషే) యొక్క మౌఖిక ఆదేశాన్నే పరమ ప్రమాణంగా భావించేవారు. [94]

## నాల్గవ కారణం:

ఇశ్రాయేలీయులు మరియు వారి పశువులు పెద్ద సంఖ్యలో ఉన్న కారణంగా వారు నిలిచియుండేందుకై ఎంతో పెద్దదయిన, విశాలమైన స్థలం అవసరం. వాస్తవానికి సీనాయి కొండ చుట్టుపక్కలి ప్రాంతం, అదేవిధంగా ఏలీము [95] లో పన్నెండు నీటి బుగ్గలతో కూడిన ప్రాంతం వారు నిలిచియుండేందుకు సరిపోయేటంత వైశాల్యాన్ని కలిగి లేవు. మరి ఆ రెండు ఇరుకయిన ప్రాంతాలు ఇశ్రాయేలీయుల విస్తృత జనాభాకు ఏవిధంగా సరిపోయాయి?

---

**(అథఃసూచికలు)**

[93] 'నిర్గమకాండము', 13 వ అధ్యాయపు 21 వ వచనము. (వారు పగలు రాత్రియు ప్రయాణము చేయునట్లుగా యెహోవా త్రోవలో వారిని నడిపించుటకై..... )

[94] 'నిర్గమకాండము', 14 వ అధ్యాయపు ఒకటవ వచనము.

[95] 'ఏలీమ్' **(Elim)** అనేది ఎర్ర సముద్రపు ఒడ్డున ఉన్న ఒక ప్రాంతం. అక్కడ పన్నెండు నీటి బుగ్గలు, 70 ఖర్జూరపు చెట్లు ఉన్నాయి. దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) (మోషే) ఫిర్ఔన్ (ఫరో) నుంచి విముక్తిని పొందిన తర్వాత ఆ ప్రదేశంలోనే బస చేసినట్లుగా తౌరాతు గ్రంథంలో పేర్కొనబడింది. ( ' నిర్గమకాండము', 15వ అధ్యాయపు 27 వ వాక్యము )

## ఐదవ కారణం:

బైబిల్ పాతనిబంధన గ్రంథములోని 'ద్వితీయోపదేశ కాండము' యొక్క 7 వ అధ్యాయపు 22వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" నీ దేవుడైన యెహోవా నీ యెదుట నుండి క్రమక్రమముగా ఈ జనములను తొలగించును. అడవి మృగములు విస్తరించి నీకు బాధకములుగా నుండవచ్చును గనుక వారిని ఒక్కమారే నీవు నాశనము చేయతగదు, అది నీకు క్షేమకరము కాదు"**

పాలస్తీనా దేశం యొక్క పొడవు సుమారు 200 మైళ్ళు మరియు వెడల్పు సుమారు 90 మైళ్ళుగా ఉండేది. ఈ విషయానికి సంబంధించిన వివరణను 'ముర్షదుత్తాలిబీన్ ' అనే గ్రంథ రచయిత తన గ్రంథంలోని 10వ అధ్యాయంలో, 51వ పేజీలో (క్రీ.శ. 1840 లో, ఫాల్టహ్ నగరంలో ప్రచురితం) అందజేశారు. ఒకవేళ నిజంగానే ఇశ్రాయేలీయుల సంఖ్య అప్పుడు ఇరవైఐదు లక్షలు అయినట్లయితే, వారు అక్కడి నివాసితులు నశించిపోయిన తర్వాత ఒక్కసారిగా పాలస్తీనాను ఆక్రమించుకున్నట్లయితే మరి పశువుల సంఖ్య ఏవిధంగా పెరగగలదో[96] అర్థం కాదు. ఎందుకంటే వారి సంఖ్య ఒకవేళ ఇరవైఐదు లక్షల కంటే తక్కువ అయిన పక్షంలో కూడా వారు అంతటి చిన్న ప్రాంతాన్ని (దీని వైశాల్యం పైన పేర్కొనబడింది) జనావాస ప్రాంతంగా చేసేందుకు సరిపోతారు.

**(అథఃసూచికలు)**

[96] బైబిల్ యొక్క అరబీ మరియు ఇంగ్లిష్ అనువాదాలలో పైన పేర్కొనబడిన ద్వితీయోపదేశ కాండము యొక్క 7 వ అధ్యాయపు 22వ వాక్యంలో " అడవి మృగములు విస్తరించి నీకు బాధకములుగా నుండవచ్చును'' అనే వాక్యం " అడవి మృగములు నీ మీద అధికమయిపోవచ్చును'' అని పేర్కొనబడింది. ఇంగ్లిష్ బైబిల్ లో **(Lest the beasts of the field increase upon thee)** అని పేర్కొనబడింది. దానితో 22వ వాక్యం యొక్క పూర్తి భావం ఈ విధంగా గ్రహించబడుతుంది: " ఒకవేళ వారినందరినీ ఒక్కమారే నాశనం చేసినట్లయితే పాలస్తీనా జనాభా తక్కువగా మిగిలిపోతుంది. అలాగే జంతువులు అధిక సంఖ్యలో ఉన్న కారణంగా వారికి నష్టం జరిగే అవకాశముంది.'' ప్రస్తుతం పాఠకులచే చదువబడుతున్న ఈ గ్రంథ రచయిత అయిన హజ్రత్ మౌలానా రహ్మతుల్లాహ్ కైరాన్వీ (ర) ఈ విధంగా పేర్కొన్నారు: " ఒకవేళ ఆ ఇరవైఐదు లక్షల ఇశ్రాయేలీయులు ఒకేమారు పాలస్తీనాను ఆక్రమించుకున్న పక్షంలో మృగాల ద్వారా వారికి ప్రమాదం ఏవిధంగా సంభవించగలదు?'' (అనగా వారి సంఖ్య ఇరవైఐదు లక్షలు కాదని గ్రహించగలము)



అందుకే ఇబ్నె ఖల్దూన్ కూడా తన చరిత్ర గ్రంథంలో వ్రాసిన ముందుమాట[97]లో వారి సంఖ్య విషయంలో బైబిల్‌లో పేర్కొనబడిన విలువను నిరాకరించారు. అంతేగాకుండా ఆయన ఇలా పేర్కొన్నారు: " సత్యశోధకుల వ్యాఖ్య ప్రకారం దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) (మోషే) మరియు హజ్రత్ ఇస్రాయీల్ (అ) (ఇశ్రాయేలు) కు నడుమ కేవలం మూడు తరాల[98] అంతరముంది. అయితే కేవలం నాలుగు తరాల కాలపరిమితిలోనే ఇశ్రాయేలీయుల సంఖ్య అంతటి భారీ స్థాయిలో పెరిగిపోయి ఆ సంఖ్యకు (దాదాపు ఇరవైఐదు లక్షలకు) చేరుకోవడమనేది ఆమోదయోగ్యం కాదు.''

**(అథఃసూచికలు)**

[97] 13వ పేజీలో (బీరూట్ ప్రచురణ) 'ముగాలతుల్ ముఅర్రిఖీన్ ' (చరిత్రకారుల తప్పిదాలు) అనే శీర్షికతో అల్లామా ఇబ్నె ఖల్దూన్ ఈ విషయం గురించి వ్యాఖ్యానిస్తూ దీనికి సంబంధించి మరిన్ని ఆధారాలను పేర్కొన్నారు. వాటిలో ముఖ్యమైనది ఏమిటంటే అంతటి భారీ సైన్యం (ప్రాచీన యుద్ధరీతి ప్రకారం) యుద్ధం చేయదగినదిగా ఉండజాలదు. ఎందుకంటే అంతటి భారీ సంఖ్యలో (దాదాపు ఇరవైఐదు లక్షలమంది) సైనికులు యుద్ధభూమిలో శ్రేణులుగా నిలిచినపుడు ఒక శ్రేణికి చెందిన సైనికులకు మరొక శ్రేణికి చెందిన సైనికుల పరిస్థితి గురించి తెలిసే అవకాశం ఉండదు. ఆ కాలంలో పర్షియన్ల సామ్రాజ్యం ఇశ్రాయేలీయుల కంటే బ్రహ్మాండమైన స్థితిలో ఉండేది. నెబుకద్నెజరు వారిపై దాడి చేయడానికి సంబంధించిన సంఘటన ద్వారా వారి ప్రాంతాలు సైతం ఎంతో విశాలంగా ఉండేవని తెలుస్తుంది. అయినప్పటికీ ఏనాడూ పర్షియన్ల సైన్యం ఆ సంఖ్యకు (అనగా దాదాపు ఇరవైఐదు లక్షలకు) చేరుకోలేదు. ఖాదిసియ్యహ్ సందర్భంలో పర్షియన్ల సైన్యం ఒక లక్షా ఇరవైవేలుగా ఉండినది. అదే వారి సైనికశక్తికి సంబంధించి అతిపెద్ద సంఖ్య. మరి ఇశ్రాయేలీయులకు చెందిన సైనికుల సంఖ్య 6 లక్షలకు మించిపోయిందనే విషయాన్ని మనం ఏవిధంగా ఆమోదించగలము?

[98] అన్ని ప్రతుల్లోనూ 'మూడు' అనే సంఖ్యే పేర్కొనబడి ఉంది. అయితే ఇబ్నె ఖల్దూన్ తన చరిత్ర గ్రంథానికి వ్రాసిన ముందుమాటలో మాత్రం నాలుగు తరాల అంతరమున్నట్లుగా పేర్కొనబడింది. "యాకోబు కుమారుడు లేవీ, లేవీ కుమారుడు కహాతు (ఖాహిస్), కహాతు కుమారుడు ఇస్హారు, ఇస్హారు కుమారుడు ఇమ్రాన్, ఇమ్రాన్ కుమారుడు మోషే (దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) )'' అని పేర్కొనబడి ఉంది. నాలుగు తరాల అంతరమే సరియైనది.

కనుక సత్యం ఏమిటంటే ఇశ్రాయేలీయుల సంఖ్య 215 సంవత్సరాల కాలపరిమితిలో ఎంతవరకు చేరుకోగలదో అంత మాత్రమే ఉండినది,ముఖ్యంగా ఈజిప్టు (ఐగుప్తు) ను పరిపాలించిన రాజు వారిని ఘోరమైన రీతిలో హింసిస్తున్న కాలంలో, దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) (మోషే) మౌఖిక ఆదేశం వారు ప్రతిరోజూ ప్రయాణించేందుకు సరిపోయిన కాలంలో, సీనాయి పర్వతం చుట్టుపక్కలి ప్రాంతం మరియు ఏలీము ప్రాంతం వారు మరియు వారి పశువులు బస చేసేందుకు సరిపోయేంతగా విశాలంగా ఉన్న కాలంలో. ఒకవేళ వారు పాలస్తీనాను ఒకేమారు ఆక్రమించుకున్నారని మనం అంగీకరించే పక్షంలో పాలస్తీనాను సంపూర్ణ జనావాస ప్రాంతంగా చేసేందుకు వారి సంఖ్య సరిపోదని మనం అంగీకరించవలసి ఉంటుంది. అనగా వారి సంఖ్య దాదాపు ఇరవైఐదు లక్షలు అనేది పూర్తిగా తప్పు. వారు సంఖ్యాపరంగా తక్కువగా ఉన్న కారణంగానే పాలస్తీనాను జనసాంద్రతతో నింపివేసేందుకు సైతం వారి సంఖ్య సరిపోదని మనం అర్థం చేసుకోవాలి.

ఇప్పటివరకు పేర్కొనబడిన ఆధారాల ద్వారా గ్రంథవహుల వద్ద (క్రైస్తవులు మరియు యూదుల వద్ద) బైబిల్ పాతనిబంధన గ్రంథములోని 'ఆదికాండము', 'నిర్గమకాండము', 'లేవీయ కాండము', 'సంఖ్యా కాండము' మరియు 'ద్వితీయోపదేశ కాండము' అనే తొలి ఐదు గ్రంథాలు దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) (మోషే) ద్వారా వ్రాయబడినవేననే విషయానికి సంబంధించి ఎటువంటి ఆధారమూ లేదని విస్పష్టమైన రీతిలో తేలిపోతుంది. కనుక వారి తరపు నుంచి ఈ విషయానికి సంబంధించి ఏదయినా ఆధారం పొందుపరచబడనంతవరకు మేము ఆ గ్రంథాలను విశ్వసనీయమైన, ప్రామాణిక గ్రంథాలుగా ఆమోదించడం తప్పనిసరి కాదు. ఆ గ్రంథాలను అవిశ్వసనీయమన, అప్రామాణిక గ్రంథాలుగా తిరస్కరించేందుకు మాకు పూర్తిగా అవకాశముంది.

# యెహోషువ గ్రంథం స్థాయి

యూదుల మతానికి ప్రాతిపదిక అనదగిన తౌరాతు గ్రంథం పరిస్థితి ఇలా ఉంటే తౌరాతు గ్రంథం తర్వాత రెండవ స్థానంలో ఉన్న గ్రంథంగా పరిగణించబడే 'యెహోషువ' గ్రంథం పరిస్థితి గురించి ఇక వినండి. నేటివరకు నిశ్చయమైన రీతిలో ఈ గ్రంథ రచయిత ఎవరో కూడా తెలియరాలేదు. అలాగే ఈ గ్రంథం వ్రాయబడిన కాలం[99] కూడా తెలియబడలేదు. జర్హార్డ్, డ్యూడయతీ హబటూట్, ప్యాట్రిక్ మరియు టామ్‌లైన్ మరియు డాక్టర్ క్రీ అభిప్రాయం ఏమిటంటే ఇది ఈ గ్రంథం దైవప్రవక్త హజ్రత్ యూషఅ్ బిన్ నూన్ (అ) (యెహోషువ) ద్వారా వ్రాయబడిన గ్రంథం.



డాక్టర్ లైట్‌ఫుట్ ఈ విధంగా పేర్కొన్నారు: " ఇది ఫీనెహాసు( **Phinehas** )[100] చే వ్రాయబడిన గ్రంథం"

కాల్విన్ ఈ విధంగా పేర్కొన్నారు: " ఇది ఆజారుచే వ్రాయబడిన గ్రంథం"

డాంటల్ " ఇది హజ్రత్ సమూయేల్ (అ) (సమూయేలు)చే వ్రాయబడిన గ్రంథం" అని అభిప్రాయపడ్డారు.

హెన్రీ ఈ విధంగా వ్యాఖ్యానించారు " ఇది హజ్రత్ ఇర్మియా (అ) (యిర్మీయా)చే వ్రాయబడిన గ్రంథం"

ఈ విషయంలో ఎన్ని అభిప్రాయభేదాలున్నాయో చూడండి. వాస్తవానికి దైవప్రవక్త హజ్రత్ యూషఅ్ బిన్ నూన్ (అ) (యెహోషువ) కు మరియు హజ్రత్ ఇర్మియా (అ) (యిర్మీయా) ల మధ్య దాదాపు 850 సంవత్సరాల అంతరముంది. ఇంతటి తీవ్రస్థాయిలో అభిప్రాయభేదాలు తలెత్తడమనేది 'ఈ గ్రంథం వారి దృష్టిలో ప్రామాణికమైనది కాదు' అనే విషయానికి స్పష్టమైన నిదర్శనం. అలాగే ఈ విషయం గురించి వ్యాఖ్యానించే ప్రతి వ్యక్తీ కేవలం ఊహలు, అంచనాలపై ఆధారపడిన విషయాలనే పేర్కొనడం జరుగుతోంది. అనగా ఈ విషయం గురించి వ్యాఖ్యానించదలుచుకున్న వ్యక్తి వద్ద కొన్ని అంచనాలు ఉండి ఉంటాయి. వాటి ద్వారా ఆ గ్రంథ రచయిత ఫలానా వ్యక్తి అయి ఉంటాడని అతడు ఒక అంచనాకు వచ్చి వ్యాఖ్యానించనారంభిస్తాడు. ఆ విధంగా అంచనాల ఆధారంగా వ్యాఖ్యానించబడిన విషయం సైతం వారి దృష్టిలో ఒక ప్రమాణంగా పరిగణించబడుతోంది.

మనం ఒకవేళ 'యెహోషువ' గ్రంథం యొక్క 15వ అధ్యాయపు 63వ వాక్యంతో పాటు

---

**(అథఃసూచికలు)**

[99] ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికాలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది: " ఈ గ్రంథంలో పేర్కొనబడిన సంఘటనలకు ప్రత్యక్ష సాక్షి అయిన వ్యక్తే ఈ గ్రంథ రచయిత అయి ఉండవచ్చు. అలాగే ఆ వ్యక్తి ఎడిస్సా **(Edessa)** నగరవాసి. ఆ వ్యక్తి ఆ నగరం పర్షియన్ల యుద్ధ దాడికి గురయిన సమయంలో ఆ వ్యక్తి జీవించియుండాలి. " (ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా, పేజీ: 154, సంపుటి : 13 )

[100] ఫీనెహాసు **(Phinehas)** దైవప్రవక్త హజ్రత్ హారూన్ (అ) (అహరోను) మనుమడు. ఆయన గురించి బైబిల్ లో 'సంఖ్యాకాండము' 25 : 7, 31 : 6, 'కీర్తనల గ్రంథము' 106 : 30, యెహోషువ 22 : 13, ' న్యాయాధిపతులు' 20 : 28 అనే వాక్యాలలో పేర్కొనబడి ఉంది.

'సమూయేలు రెండవ గ్రంథము' యొక్క 5వ అధ్యాయపు 6వ, 7వ మరియు 8వ వాక్యాలను కలిపి పరిశీలించినట్లయితే ఈ గ్రంథం (యెహోషువ గ్రంథం) దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ) (దావీదు) పట్టాభిషిక్తులయిన తర్వాత ఏడవ సంవత్సరానికి ముందు వ్రాయబడిందని[101] స్పష్టమయిపోతుంది. అందుకే హెన్రీ వాస్కాట్ వ్యాఖ్యాన కూర్పుకర్తలు 'యెహోషువ' గ్రంథం యొక్క 15వ అధ్యాయపు 63వ వాక్యం గురించి వ్యాఖ్యానిస్తూ ఈ విధంగా పేర్కొన్నారు: " ఈ వాక్యం ద్వారా యెహోషువ గ్రంథం దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ) (దావీదు) పట్టాభిషిక్తులయిన తర్వాత ఏడవ సంవత్సరానికి ముందు వ్రాయబడిందని[102] విదితమవుతుంది.

**(అథఃసూచికలు)**

101 ఎందుకంటే 'యెహోషువ' గ్రంథం యొక్క 15వ అధ్యాయపు 63వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది: " **యెరూషలేములో నివసించిన యెబూసీయులను యూదా వంశస్థులు తోలివేయలేపోయిరి గనుక యెబూసీయులు నేటివరకు యెరూషలేములో యూదా వంశస్థుల యొద్ద నివసించుచున్నారు** " అయితే 'సమూయేలు రెండవ గ్రంథము' యొక్క 5వ అధ్యాయపు 6వ, 7వ మరియు 8వ వాక్యాలను అధ్యయనం చేసినప్పుడు దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ) (దావీదు) పట్టాభిషిక్తులయిన తర్వాత ఏడవ సంవత్సరం వరకు యెబూసీయులు యెరూషలేములో నివసిస్తూ ఉన్నారని తెలుస్తుంది. 'యెహోషువ' గ్రంథ రచయిత "యెబూసీయులు నేటివరకు యెరూషలేములో యూదా వంశస్థుల యొద్ద నివసించుచున్నారు'' అని పేర్కొనడం జరిగింది. దీనినిబట్టి యెహోషువ గ్రంథ రచయిత ఆ కాలానికి చెందినవాడని విదితమవుతోంది.

102 అంతేగాకుండా 'యెహోషువ' గ్రంథం యొక్క 16వ అధ్యాయపు 10వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది: " **అయితే గెజెరులో నివసించిన కనానీయుల దేశమును వారు స్వాధీనపరచుకొనలేదు. నేటివరకు ఆ కనానీయులు ఎఫ్రాయిమీయుల మధ్య నివసించుచు పన్ను కట్టు దాసులైయున్నారు"** అయితే 'రాజులు మొదటి గ్రంథము' యొక్క 9వ అధ్యాయపు 16 వ వాక్యంలో ఫిర్ఔన్ (ఫరో) దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) (సొలొమోను) కాలంలో కనానీయులను గెజెరు నుంచి తొలగించివేసినట్లుగా పేర్కొనబడి ఉంది. దీనినిబట్టి యెహోషువ గ్రంథం దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) (సొలొమోను) కాలాని కంటే ముందు వ్రాయబడిందని బోధపడుతుంది. అందుకే జీ.టీ. మేస్లీ ఈ విషయాన్ని అంగీకరిస్తూ ఇలా పేర్కొన్నారు: "'యెహోషువ'

*(తరువాతి పేజీ చూడండి)*



అంతేగాకుండా 'యెహోషువ' గ్రంథం యొక్క 10వ అధ్యాయపు 12వ వాక్యం ద్వారా విదితమయ్యే విషయమేమిటంటే ఈ గ్రంథ రచయిత కొన్ని సంఘటనలను[103] ఎటువంటి గ్రంథం ద్వారా ఉల్లేఖిస్తాడంటే దాని పేరు విషయంలో అనువాదకులు భిన్నాభిప్రాయాలను కలిగియున్నారు. కొన్ని అనువాదాలలో ఆ గ్రంథం పేరు ' యసీర్' అని పేర్కొనబడి ఉంటే, కొన్ని అనువాద గ్రంథాలలో 'యాసార్' అని పేర్కొనబడి ఉంది. కొన్ని అనువాదాలలో 'యాషారు' అని పేర్కొనబడి ఉంది. బైబిల్ అరబీ అనువాద గ్రంథం (క్రీ.శ. 1844 లో ప్రచురితం) లో 'సిఫ్రుల్ అబ్రార్' అని పేర్కొనబడింది. అయితే బైబిల్ అనువాద గ్రంథం (క్రీ.శ. 1811 లో ప్రచురితం) లో 'సిఫ్రుల్ ముస్తఖీమ్' అని పేర్కొనబడింది. అలాగే ఉల్లేఖించబడిన ఈ గ్రంథం ఉనికికి సంబంధించిన వివరాలూ లభ్యం కావు. ఆ గ్రంథ రచయిత వివరాలూ లభ్యం కావు, ఆ గ్రంథ రచనాకాలానికి సంబంధించిన వివరాలూ లభ్యం కావు. అయితే 'సమూయేలు రెండవ గ్రంథము' యొక్క 1వ అధ్యాయపు 18వ వాక్యం[104] ద్వారా ఈ గ్రంథ రచయిత దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ) (దావీదు) సమకాలికుడని లేదా ఆయన తరువాతి వాడనే విషయం

**(అథఃసూచికలు)**

***( 102 వ అథః సూచిక తరువాయి భాగం )***

గ్రంథం యొక్క 15వ అధ్యాయపు 63వ వాక్యాన్ని 'సమూయేలు రెండవ గ్రంథము' యొక్క 5వ అధ్యాయపు 6వ, 7వ మరియు 8వ వాక్యాలతో మరియు 'యెహోషువ' గ్రంథం యొక్క 16వ అధ్యాయపు 10వ వాక్యంతో మరియు 'రాజులు మొదటి గ్రంథము' యొక్క 9వ అధ్యాయపు 16 వ వాక్యంతో పోల్చి పరిశీలించినప్పుడు యెహోషువ గ్రంథం రాజ్ఆమ్ కాలానికంటే ముందే వ్రాయబడిందని తెలుస్తుంది'' ( 'హమారీ కితుబె ముఖద్దసహ్ (మన పవిత్ర గ్రంథాలు) మేస్లీ రచన, పేజీ : 176 )

103 ఒక సంఘటన గురించి ప్రస్తావించిన తర్వాత ఆయన ఈ విధంగా వ్రాశాడు: " **ఈ విధంగా ఆషారు గ్రంథములో వ్రాయబడి ఉండలేదా?"** ఆ గ్రంథం పేరు ఇక్కడయితే 'ఆషారు' అని పేర్కొనబడింది. అయితే 'సమూయేలు రెండవ గ్రంథము' యొక్క 1వ అధ్యాయపు 18వ వాక్యంలో ఆ గ్రంథం పేరు 'యాషారు' అని పేర్కొనబడింది. ఇంగ్లిష్‌లో **(Jasher)** అని పేర్కొనబడింది.

104 ఇందులో కూడా యాషారు గ్రంథం గురించి ప్రస్తావించబడి, అందులో నుంచి ఒక విలాపగీతం పేర్కొనబడి ఉంది. ఈ గీతం దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ) (దావీదు) వైపుకు ఆపాదించబడింది.

తప్పకుండా తెలుస్తుంది. ఈ కారణంగా 'యెహోషువ' గ్రంథ రచయిత దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ) (దావీదు) తరువాతి కాలానికి చెందినవాడని దాదాపుగా ఒక అంచనాకు రాగలము. అత్యధికుల వాదం విశ్వసనీయమైనదిగా సాధారణంగా పరిగణించబడుతుంది. వారు ఆధారమేమీ లేకుండానే 'యెహోషువ' గ్రంథం దైవప్రవక్త హజ్రత్ యూషఅ్ బిన్ నూన్ (అ) (యెహోషువ) చే వ్రాయబడిన గ్రంథమని వాదిస్తూ ఉంటారు. అందుకే మేము ఇతరులను వదలి ఆ అత్యధికులనే సంబోధిస్తూ వారి వాదం[105] కొన్ని కారణాల రీత్యా తప్పు అని పేర్కొంటాము.

## మొదటి మరియు రెండవ కారణం:

'తౌరాతు గ్రంథం' అవిశ్వసనీయతకు సంబంధించి ఇంతకుముందు 'మొదటి ఆధారం' పేరుతో పేర్కొనబడిన విషయమే 'యెహోషువ' గ్రంథం అవిశ్వసనీయతకు సంబంధించి కూడా మొదటి కారణంగా భావించాలి. ఇక 'తౌరాతు గ్రంథం' అవిశ్వసనీయతకు సంబంధించి ఇంతకుముందు 'నాల్గవ ఆధారం' పేరుతో పేర్కొనబడిన విషయమే 'యెహోషువ' గ్రంథం అవిశ్వసనీయతకు సంబంధించి కూడా రెండవ కారణంగా భావించాలి.

## మూడవ కారణం:

'యెహోషువ' గ్రంథంలో అత్యధికంగా ఎటువంటి వాక్యాలు పేర్కొనబడి ఉన్నాయంటే వాటిని అధ్యయనం చేసినప్పుడు అవి నిశ్చయంగా దైవప్రవక్త హజ్రత్ యూషఅ్ బిన్ నూన్ (అ) (యెహోషువ) చే పేర్కొనబడలేదని తెలుస్తుంది. ఇంకా చెప్పాలంటే అందులోని కొన్ని వాక్యాలు ఈ గ్రంథ రచయిత దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ) (దావీదు) సమకాలికుడయి ఉండవచ్చు లేదా ఆయన తరువాతి కాలానికి చెందినవాడయి ఉండవచ్చునేందుకు నిదర్శనంగా నిలుస్తాయి. ఈ విషయం గురించి ఇంతకుముందే తెలియజేయబడింది. ఇన్షా అల్లాహ్ (అల్లాహ్ చిత్తమయితే)

**(అథఃసూచికలు)**

105 'యెహోషువ' గ్రంథం దైవప్రవక్త హజ్రత్ యూషఅ్ బిన్ నూన్ (అ) (యెహోషువ) ద్వారా వ్రాయబడిన గ్రంథమనేది అత్యధికుల వాదం.

106 అనగా 'యెహోషువ' మూల గ్రంథమయితే దైవప్రవక్త హజ్రత్ యూషఅ్ బిన్ నూన్ (అ) (యెహోషువ) ద్వారా వ్రాయబడినదే. అయితే తరువాత కొన్ని వాక్యాలను ఏ దైవప్రవక్తో చేర్చడం జరిగిందని వారు పేర్కొంటూ ఉంటారు.



పాఠకులకు ఈ పుస్తకం యొక్క 2వ అధ్యాయంలో లక్ష్యం-2 లో ఈ వాక్యాలు గోచరిస్తాయి. అయితే క్రైస్తవ పండితులు కేవలం ఊహలు, అంచనాల ప్రాతిపదికన " ఈ వాక్యాలు ఏ దైవప్రవక్త ద్వారానో చేర్చబడినట్టివి[106] అని పేర్కొంటారు. అయితే ఈ వాదం ఖచ్చితంగా నిరాధారమైన తప్పుడు వాదం. కనుక ఈ విషయానికి సంబంధించి ఖచ్చితమైన ఆధారం లభించనంతవరకు ఈ వాదం ఆలకించబడేందుకు యోగ్యమైనది కాదు. ఇంకా చెప్పాలంటే ఈ వాక్యాలు దైవప్రవక్త హజ్రత్ యూషఅ్ బిన్ నూన్ (అ) (యెహోషువ) చే 'యెహోషువ' గ్రంథం వ్రాయబడలేదనే విషయానికి స్పష్టమైన నిదర్శనాలుగా నిలుస్తాయి.

## నాల్గవ కారణం:

'యెహోషువ' గ్రంథంలోని 13వ అధ్యాయపు 24వ మరియు 25వ వాక్యములలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" మోషే గాదు గోత్రమునకు, అనగా గాదీయులకు వారి వంశముల చొప్పున స్వాస్థ్యమిచ్చెను. వారి సరిహద్దు యాజెరును గిలాదు పట్టణములన్నియు, రబ్బాకు ఎదురుగానున్న అరోయేరు వరకు అమ్మోనీయుల దేశములో సగమును"**

'ద్వితీయోపదేశ కాండము' గ్రంథంలోని 2వ అధ్యాయంలో 16వ వాక్యం నుంచి 19వ వాక్యం వరకు ఈ విధంగా పేర్కొనబడింది:

**" సైనికులైన వారందరు ప్రజలలో నుండి లయమైపోయిన తరువాత యెహోవా నాకు ఈలాగు సెలవిచ్చెను. - నేడు నీవు మోయాబునకు సరిహద్దుగానున్న ఆరు దేశము దాటబోవుచున్నావు. అమ్మోనీయుల మార్గమున వెళ్ళునప్పుడు వారిని బాధింపవద్దు, వారితో యుద్ధము చేయవద్దు. ఏలయనగా లోతు సంతానమునకు దానిని స్వాస్థ్యముగా ఇచ్చినందున అమ్మోనీయుల దేశములో నీకు స్వాస్థ్యము నియ్యను. "**

ఆ అధ్యాయంలోనే 36వ మరియు 37వ వాక్యములలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" మన దేవుడైన యెహోవా అన్నిటిని మనకు అప్పగించెను. అయితే అమ్మోనీయుల దేశమునకైనను యబ్బోకు ఏటి లోయలోని యే ప్రాంతమునకైనను ఆ మన్నెములోని పురములకైనను మన దేవుడైన యెహోవా పోకూడదని చెప్పిన మరి ఏ స్థలమునకైనను నీవు సమీపింపలేదు"**

'యెహోషువ' మరియు 'ద్వితీయోపదేశ కాండము' అనే రెండు గ్రంథాలలో ఇదే విషయానికి సంబంధించి పేర్కొనబడిన విషయాలలో ఎంతటి వైరుధ్యముందో [107] గమనించవచ్చు.

ఒకవేళ ప్రసిద్ధ తౌరాతు గ్రంథంలో భాగంగా పరిగణించబడే 'ద్వితీయోపదేశ కాండము' అనేది క్రైస్తవుల వాదం ప్రకారం నిజంగానే దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) (మోషే) చే వ్రాయబడిన మూల తౌరాతు గ్రంథమే అయిన పక్షంలో దైవప్రవక్త హజ్రత్ యూషఅ్ బిన్ నూన్ (అ) (యెహోషువ) తౌరాతు గ్రంథంలోని వివరణకు విరుద్ధంగా ఎలా పేర్కొనగలరు? అలాగే స్వయంగా ఆయన సమక్షంలో జరిగిన సంఘటనకు సంబంధించి తప్పుడు వివరణను ఆయన ఎలా అందజెయ్యగలరు? ఇంకా చెప్పాలంటే ఇటువంటి తప్పుడు కార్యం దైవవాణిని గ్రహించిన ఏ దైవప్రవక్త తరపు నుండి కూడా జరగడమనేది విశ్వసించలేని విషయం.

## న్యాయాధిపతులు గ్రంథం స్థాయి

ఇక తౌరాతు గ్రంథం తర్వాత మూడవ స్థానంలో ఉన్న గ్రంథంగా పరిగణించబడే 'న్యాయాధిపతులు' గ్రంథం పరిస్థితి గురించి ఇక వినండి. ఈ గ్రంథం విషయంలో గొప్ప వైరుధ్యముంది. ఈ గ్రంథ రచయిత ఎవరో కూడా తెలియరాలేదు. అలాగే ఈ గ్రంథం వ్రాయబడిన కాలం కూడా తెలియబడలేదు. కొంతమంది క్రైస్తవ పండితులు అది ఫీనెహాసు చే వ్రాయబడిన గ్రంథమని పేర్కొంటారు. కొంతమంది అది హిజ్కియా చే వ్రాయబడిన గ్రంథమని పేర్కొంటారు. ఈ రెండు అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న పక్షంలో అది దైవగ్రంథం కాజాలదు.[108] కొంతమంది అది దైవప్రవక్త హజ్రత్ ఇర్మియా (అ) (యిర్మీయా) చే వ్రాయబడిన గ్రంథమని పేర్కొంటారు. మరి కొంతమంది అది దైవప్రవక్త హజ్రత్ ఉజైర్ (అ) (ఎజ్రా) చే వ్రాయబడిన గ్రంథమని పేర్కొంటారు. అయితే దైవప్రవక్త హజ్రత్ ఉజైర్ (అ) (ఎజ్రా) కు,

**(అథఃసూచికలు)**

107 ఎందుకంటే 'యెహోషువ' గ్రంథంలో దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) (మోషే) అమ్మోనీయులకు చెందిన దేశంలో సగభాగాన్ని పంచివేసినట్లుగా పేర్కొనబడి ఉంది. దీనినిబట్టి ఆ దేశం దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) (మోషే) వద్ద ఉన్నట్లుగా విదితమవుతుంది. అయితే 'ద్వితీయోపదేశ కాండము' ద్వారా అది ఆయనకు అసలు అప్పగించబడనే లేదని తెలుస్తుంది.

108 ఎందుకంటే ఫీనెహాసు మరియు హిజ్కియాలలో ఎవరూ దైవప్రవక్త కారు. హిజ్కియా యూదా దేశాన్ని పరిపాలించిన రాజు. హజ్రత్ అష్ఇయా (అ) (యెషయా) ఆయన కాలానికి చెందినవారే. ( 'రాజులు రెండవ గ్రంథము', 19వ అధ్యాయము, ' దినవృత్తాంతములు రెండవ గ్రంథము', 32వ అధ్యాయము )



ఫీనెహాసుకు నడుమ 900 సంవత్సరాల కంటే ఎక్కువ అంతరముంది.

కనుక ఒకవేళ క్రైస్తవుల వద్ద ఈ విషయానికి సంబంధించి ఏదయినా ఆధారమున్నట్లయితే ఇంతటి వైరుధ్యం తలెత్తేది కాదు. యూదుల దృష్టిలో ఈ వ్యాఖ్యలన్నీ తప్పుడు వ్యాఖ్యలు. అయితే వారు కూడా కేవలం ఊహలు మరియు అంచనాల ప్రాతిపదికన ఈ గ్రంథాన్ని హజ్రత్ సమూయేల్ (అ) (సమూయేలు) వైపుకు ఆపాదిస్తారు. ఈ విధంగా [109] ఈ విషయానికి సంబంధించి ఆరు అభిప్రాయాలు ఏర్పడ్డాయి.

## రూతు గ్రంథం స్థాయి

ఇక తౌరాతు గ్రంథం తర్వాత నాల్గవ స్థానంలో ఉన్న గ్రంథంగా పరిగణించబడే 'రూతు' గ్రంథం గురించి వినండి. ఈ గ్రంథం విషయంలో కూడా గొప్ప వైరుధ్యముంది. కొంతమంది అది హిజ్కియా చే వ్రాయబడిన గ్రంథమని పేర్కొంటారు. ఒకవేళ ఇది సత్యమయిన పక్షంలో రూతు గ్రంథం దైవగ్రంథంగా పరిగణించబడలేదు. (ఎందుకంటే హిజ్కియా దైవప్రవక్త కారు). కొంతమంది దృష్టిలో ఈ గ్రంథం దైవప్రవక్త హజ్రత్ ఉజైర్ (అ) (ఎజ్రా) చే వ్రాయబడిన గ్రంథం. యూదులు మరియు క్రైస్తవులందరూ ఇది హజ్రత్ సమూయేల్ (అ) (సమూయేలు) చే వ్రాయబడిన గ్రంథమని[110] పేర్కొంటారు.

క్రీ.శ. 1844 లో ప్రచురించబడిన 'కేథొలిక్ హెరాల్డ్' అనే పుస్తకం యొక్క 7వ సంపుటిలోని 205 వ పేజీలో ఈ విధంగా పేర్కొనబడింది:

" క్రీ.శ. 1819 లో స్టార్‌బర్గ్ లో ప్రచురించబడిన బైబిల్ ముందుమాటలో ఈ విధంగా పేర్కొనబడింది: ' రూతు గ్రంథం గృహ సంబంధ వృత్తాంతాలతోనూ, నిరర్థక కథలతోనూ నిండి ఉంది. ఇక యోనా గ్రంథమయితే కథల పుస్తకమే" అనగా అవిశ్వసనీయమైన వృత్తాంతం మరియు నిజం కాని కథ.

**(అథఃసూచికలు)**

109 ' హమారీ కుతుబె ముఖద్దసహ్' (మన పరిశుద్ధ గ్రంథాలు), మేస్లీ రచన, పేజీ : 179

110 ' హమారీ కుతుబె ముఖద్దసహ్' (మన పరిశుద్ధ గ్రంథాలు), మేస్లీ రచన, పేజీ : 184

# నెహెమ్యా గ్రంథం స్థాయి

ఇక ‘ నెహెమ్యా గ్రంథం’ విషయానికొస్తే దాని విషయంలోనూ ఇటువంటి వైరుధ్యమే ఉంది. ఎక్కువమందికి నచ్చిన వ్యాఖ్య ప్రకారం ఇది ‘నహ్మియాహ్’ (నెహెమ్యా) చే వ్రాయబడిన గ్రంథం. అత్‌హానీ షీస్ మరియు ఎపీఫానిస్ క్రీజిస్టమ్ [111] (**St. Epiphanius**) మొదలయినవారు ఇది దైవప్రవక్త హజ్రత్ ఉజైర్ (అ) (ఎజ్రా) చే వ్రాయబడిన గ్రంథమని అభిప్రాయపడ్డారు. ఒకవేళ నెహెమ్యా గ్రంథం నహ్మియాహ్ (నెహెమ్యా) చే వ్రాయబడిన గ్రంథమయిన పక్షంలో అది దైవగ్రంథం కాజాలదు. ఎందుకంటే నహ్మియాహ్ (నెహెమ్యా) దైవప్రవక్త కారు. అదేవిధంగా 12వ అధ్యాయంలోని ప్రారంభపు 26 వాక్యాలు నహ్మియాహ్ (నెహెమ్యా) చే వ్రాయబడిన వాక్యాల వంటివి కాజాలవు.[112] అలాగే అక్కడి సంఘటనతో ఉత్తమ రీతిలో సంబంధాన్ని కలిగియున్న వాక్యాలూ ఇందులో లేవు.

అలాగే ఈ గ్రంథంలోని 12వ అధ్యాయపు 22వ వాక్యంలో పారసీక రాజయిన దర్యావేషు గురించి ప్రస్తావించబడి ఉంది. వాస్తవానికి అతడు నహ్మియాహ్ (నెహెమ్యా) మరణించిన 100 సంవత్సరాల తర్వాతి కాలానికి చెందినవాడు. పాఠకులచే చదవబడుతున్న ఈ పుస్తకం యొక్క రెండవ అధ్యాయంలో లక్ష్యం-2 లో ‘ క్రైస్తవ వ్యాఖ్యాతలు వివశులయి ఈ విషయం తరువాత చేర్చబడిందని తీర్మానించారు’ అనే విషయం పాఠకులకు విదితమవుతుంది. బైబిల్ అరబీ అనువాదకుడయితే ఈ విషయాన్నే అక్కడి నుంచి తొలగించివేయడం జరిగింది.

**(అథఃసూచికలు)**

111 **St. Epiphanius** (క్రీ.శ. 315 లో జననం, క్రీ.శ. 402 లో మరణం) ప్రసిద్ధ బిషప్. ఆయన గొప్ప బైబిల్ పండితునిగా ఖ్యాతి గాంచారు. ఆయనచే రచించబడిన కొన్ని గ్రంథాలూ నేటికీ లభ్యమవుతున్నాయి.

112 ఎందుకంటే మొదటి పదకొండు అధ్యాయాలలోనయితే ‘ఉత్తమ పురుష’, అనగా ‘నేను’ అనే పదం ఉపయోగించబడింది. ఇందులో నహ్మియాహ్ (నెహెమ్యా) కొరకు ప్రథమ పురుష (ఆయన) పదం ఉపయోగించబడింది. అధికారియైన నహ్మియాహ్ (నెహెమ్యా) యాజకుడు మరియు శాస్త్రియైన ఎజ్రా (దైవప్రవక్త హజ్రత్ ఉజైర్ (అ)) కాలానికి చెందినవారు.



# యోబు గ్రంథం

ఆ తర్వాత ‘ యోబు గ్రంథం’ పరిస్థితి వినదగినది. బైబిల్ లోని ఇతర గ్రంథాలన్నిటితో పోలిస్తే యోబు గ్రంథం పరిస్థితి ఎంతో దయనీయంగా ఉంది. అందులో 24 రకాల వైరుధ్యాలున్నాయి. యూదు పండితులలో గొప్ప వ్యక్తిగా ప్రఖ్యాతి గాంచిన రబ్ [113]మహానీ దేజ్, మైకేల్స్, విలీక్లర్క్ మరియు సమ్‌లూద్ అస్తనాక్ మొదలయిన క్రైస్తవ పండితులయితే ‘యోబు’ (అయ్యూబ్) అనేది ఒక కాల్పనిక పేరని, ఆయన పేరుతో ఉన్న గ్రంథం తప్పుడు గాథను, అసత్యమైన వృత్తాంతాన్ని కలిగియున్నదని నొక్కి పేర్కొన్నారు. థ్యోడోర్ కూడా దానిని ఎంతగానో విమర్శించారు. ప్రొటెస్టెంట్ వర్గ నాయకుడయిన లూథర్ ఈ విధంగా పేర్కొన్నారు:

“ ఈ గ్రంథం[114] కేవలం ఒక కల్పిత గాథ మాత్రమే”

ఈ వ్యాఖ్యలన్నీ అనుకూలురకు చెందినవి. వ్యతిరేకులు ఈ విధంగా పేర్కొంటారు: “ ఈ గ్రంథ (యోబు గ్రంథం) రచయిత ఎవరో నిశ్చయంగా తెలియదు. కేవలం అంచనా ప్రాతిపదికన ఈ గ్రంథం వివిధ వ్యక్తుల వైపుకు ఆపాదించబడుతుంది” ఒకవేళ మనం ఈ గ్రంథం ఎలీహు[115] చే లేదా మనష్షే సమకాలికుడయిన ఏ అజ్ఞాత వ్యక్తి ద్వారానో వ్రాయబడినట్లుగా భావించినప్పటికీ అది దైవగ్రంథమని నిరూపితమయినట్లు కాదు. ఇది గ్రంథవహుల (క్రైస్తవులు మరియు యూదుల వద్ద) వద్ద తమ ఏ గ్రంథానికి సంబంధించీ మూలానికి సమీప ఆధారమేదీ లేదనేందుకు స్పష్టమైన, సంపూర్ణమైన నిదర్శనం. ఒక్కమాటలో చెప్పాలంటే వారి వాదానికి కేవలం అంచనాలు మరియు ఊహలే ఆధారం.

**(అథఃసూచికలు)**

113 ‘ రబ్’ లేదా ‘రిబ్బీ’ అని యూదు పండితులను పిలుస్తారు.

114 అన్ని ప్రతుల్లోనూ ఈ విషయం పేర్కొనబడి ఉంది. అయితే జీ.టీ. మేన్లీ ఈ విధంగా పేర్కొన్నారు: “ ఇది వాస్తవిక చరిత్రపై ఆధారపడినట్టిది అనేది లూథర్ అభిప్రాయం” (‘హమారీ కుతుబె ముఖద్దసహ్’ (మన పరిశుద్ధ గ్రంథాలు), పేజీ : 206) ఇక ప్రొటెస్టెంట్ వర్గం యోబు గ్రంథాన్ని బైబిల్‌లోని గ్రంథాలలో ఒక గ్రంథంగా పరిగణిస్తుంది. దీనినిబట్టి ప్రొటెస్టెంట్ వర్గం దృష్టిలో ఈ గ్రంథం సరియైనదే. అయితే పాఠకులచే చదువబడుతున్న ఈ గ్రంథ రచయిత అయిన మౌలానా రహ్మతుల్లాహ్ కైరాన్వీ (ర) యొక్క ఈ వ్యాఖ్యకు ప్రాతిపదిక ఏమిటో స్పష్టంగా తెలియరాలేదు.

# కీర్తనల గ్రంథం

ఇక 'కీర్తనల గ్రంథం' స్థాయి గురించి వినండి. ఈ గ్రంథం పరిస్థితి కూడా 'యోబు గ్రంథము' పరిస్థితి వంటిదే. ఏ సంపూర్ణ ఆధారం ద్వారానూ ఈ గ్రంథ రచయిత ఫలానా వ్యక్తి అనే విషయం నిరూపితం కాదు. అలాగే కీర్తనలన్నీ సంకలించబడిన కాలమేదో కూడా తెలియరాదు. అలాగే దానికి చెందిన పేర్లు దైవం తరపు నుంచి గ్రహించబడినట్టివో కావో అనే విషయానికి సంబంధించిన పరిశోధన కూడా కొనసాగలేదు. ప్రాచీన కాలానికి చెందిన క్రైస్తవ పండితులు ఈ గ్రంథ రచయిత విషయంలో విభేదించారు. ఆరీజన్ క్రీజిస్టమ్, ఆగస్టైన్, ఎన్‌బరోస్ మరియు యూథీమీస్ మొదలయినవారు ఈ గ్రంథం పూర్తిగా దైవప్రవక్త హజ్‌రత్ దావూద్ (అ) (దావీదు) చే వ్రాయబడిన గ్రంథమేనని అభిప్రాయపడ్డారు. ప్లీరీ, అత్‌హానీ షీస్, జేరోమ్, యూసీబియుస్[116] మొదలయినవారు ఈ గ్రంథం దైవప్రవక్త హజ్‌రత్ దావూద్ (అ) (దావీదు) చే వ్రాయబడిన గ్రంథమనే విషయాన్ని తీవ్రస్థాయిలో నిరాకరించారు.

హోరన్ "మొదటి వ్యాఖ్య ఖచ్చితంగా తప్పుడు వ్యాఖ్య" అని పేర్కొన్నారు. కొంతమంది వ్యాఖ్యాతలు " కొన్ని కీర్తనలు మకాబీన్ కాలంలో వ్రాయబడ్డాయి" అని పేర్కొంటారు.

అయితే ఈ వ్యాఖ్య కూడా బలహీనమైనదే. రెండవ వర్గానికి చెందిన అభిప్రాయం ప్రాతిపదికన 30 కి మించిన కీర్తనలు వాటి రచయిత ఎవరో తెలియని స్థితిలో ఉన్నాయని, అలాగే 10 కీర్తనలు, 90 నుంచి 99 వరకు గల కీర్తనలు దైవప్రవక్త హజ్‌రత్ మూసా (అ) (మోషే) చే రచించబడ్డాయని, 71 కీర్తనలు దైవప్రవక్త హజ్‌రత్ దావూద్ (అ) (దావీదు) చే

**(అథఃసూచికలు)**

115 బూజీయుడైన, బరకయేలు కుమారుడైన ఎలీహు దైవప్రవక్త హజ్‌రత్ అయ్యూబ్ (అ) (యోబు) తో జరిపిన సంభాషణ ఈ గ్రంథంలో (యోబు గ్రంథంలో) పేర్కొనబడి ఉంది. ఎలీహు కు సంబంధించిన ప్రస్తావన 'సమూయేలు మొదటి గ్రంథం' యొక్క 1వ అధ్యాయపు 1వ వాక్యంలో కూడా ఉంది.

116 యూసీబియుస్ (**Eusebius**) పాలస్తీనాకు చెందిన బిషప్. ఆయన క్రీ.శ. 260 లో జన్మించారు. ఆయన తాను రచించిన ' చర్చి చరిత్ర ' (**History of the Christian Church**) ద్వారా ప్రసిద్ధమయ్యారు. ఆయన క్రీ.శ. 340 లో మరణించారు.



రచించబడ్డాయని, 88వ కీర్తన హేమాను[117] చే రచించబడిందని, 89వ కీర్తన ఏతాను[118] చే రచించబడిందని, 72వ మరియు 77వ కీర్తనలు దైవప్రవక్త హజ్‌రత్ సులైమాన్ (అ) (సొలొమోను) చే రచించబడ్డాయని, మూడు కీర్తనలు యెదూతూను[119] చే రచించబడ్డాయని, 120 కీర్తనలు ఆసాపు[120] చే రచించబడ్డాయని భావించవలసి ఉంటుంది. అయితే కొంతమంది 74వ కీర్తన మరియు 79వ కీర్తన ఆసాపు చే రచించబడలేదని, 11 కీర్తనలు[121] కోరహు యొక్క ముగ్గురు కుమారులచే రచించబడ్డాయని పేర్కొంటారు. కొంతమంది వాటి రచయిత వేరే వ్యక్తి అని,

**(అథఃసూచికలు)**

117 ఎజ్రాహీయుడైన హేమాను (**Heman the Ezrahite**) తన కాలంలో గొప్ప తత్త్వజ్ఞానిగా ప్రసిద్ధుడు. ఈ విషయం మనకు 'రాజులు మొదటి గ్రంథము' యొక్క 4వ అధ్యాయపు 31వ వాక్యం ద్వారా తెలుస్తుంది.

118 ఎజ్రాహీయుడైన ఏతాను కూడా హేమాను వలె తన కాలంలో గొప్ప తత్త్వజ్ఞానిగా ప్రసిద్ధుడు. ఈ విషయం మనకు 'రాజులు మొదటి గ్రంథము' యొక్క 4వ అధ్యాయపు 31వ వాక్యం ద్వారా తెలుస్తుంది.

119 యెదూతూను ను ఉర్దూ బైబిల్ లో 'యెదూతూన్', ఇంగ్లిష్ బైబిల్ లో **Jeduthun** గా పేర్కొనబడింది. ఆయన దైవప్రవక్త హజ్‌రత్ దావూద్ (అ) (దావీదు) కాలానికి చెందినవాడని పేర్కొంటారు. ఆయనకు సంబంధించిన ప్రస్తావన 'దినవృత్తాంతములు మొదటి గ్రంథము' యొక్క 16వ అధ్యాయపు 38వ వాక్యంలోనూ, 25వ అధ్యాయపు 6వ వాక్యంలోనూ ఉంది. 'కీర్తనల గ్రంథము' లోని 39వ కీర్తన, 62వ కీర్తన, 77వ కీర్తన యెదూతూను వైపుకు ఆపాదించబడ్డాయి.

120 బెరక్యా కుమారుడయిన ఆసాపు ను ఉర్దూ బైబిల్ లో 'ఆసిఫ్', ఇంగ్లిష్ బైబిల్ లో **Asaph** గా పేర్కొనబడింది. 'దినవృత్తాంతములు మొదటి గ్రంథము' యొక్క 6వ అధ్యాయపు 31వ వాక్యం ద్వారా నిబంధన మందసమునకు స్థలము ఏర్పాటైన తరువాత యెహోవా మందిరమందు సంగీత సేవ కొరకు దావీదు (దైవప్రవక్త హజ్‌రత్ దావూద్ (అ)) చే నియమించబడిన వారిలో ఆసాపు కూడా ఒకరని విదితమవుతుంది.

అతడే ఆ కీర్తనలను వారి వైపుకు ఆపాదించాడని, కొన్ని కీర్తనలు మరొక వ్యక్తి చే రచించబడ్డాయని అభిప్రాయపడ్డారు.

కామిథ్ ఈ విధంగా పేర్కొన్నారు: " దావీదు (దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ) ) చే రచించబడిన కీర్తనలు 45 మాత్రమే. మిగిలిన కీర్తనలు ఇతరులచే రచించబడినట్టివి "

ప్రాచీన కాలానికి చెందిన యూదులు ఈ విధంగా పేర్కొన్నారు: "ఈ కీర్తనలు క్రింద పేర్కొనబడిన వ్యక్తులచే రచించబడినట్టివి :

ఆదాము (దైవప్రవక్త హజ్రత్ ఆదమ్ (అ)), అబ్రాహాము (దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) ), మోషే (దైవప్రవక్త హజ్రత్ మూసా (అ)), ఆసాపు (ఆసిఫ్), హేమాను, యెదూతూను మరియు కోరహు యొక్క ముగ్గురు కుమారులు. దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ) (దావీదు) కేవలం వాటిని ఒకచోట సమీకరించారు. "

ఈ విధంగా దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ) (దావీదు) కేవలం ఒక సంకలన కర్త మాత్రమే గానీ ఆయన ఏ కీర్తననూ రచించలేదనేది వారి అభిప్రాయం.

హోరన్ ఈ విధంగా పేర్కొన్నారు: " నవీన కాలానికి చెందిన యూదు పండితులు మరియు క్రైస్తవ వ్యాఖ్యాతలందరి యొక్క నిర్ధారిత ప్రకటన ఏమిటంటే ఈ కీర్తనలు క్రింద పేర్కొనబడిన వ్యక్తులచే రచించబడ్డాయి:

మోషే (దైవప్రవక్త హజ్రత్ మూసా(అ) ), దావీదు (దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ)), సొలొమోను (దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ)), ఆసాపు (ఆసిఫ్), హేమాను, ఏతాను, యెదూతూను, కోరహు యొక్క ముగ్గురు కుమారులు. "

ఇటువంటి వైరుధ్యమే కీర్తనలు సంకలించబడడానికి సంబంధించిన విషయంలోనూ మనకు కనిపిస్తుంది. కొంతమంది అవి దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ) (దావీదు) కాలంలో సంకలించబడ్డాయని పేర్కొంటారు. మరి కొంతమంది అవి హిజ్కియా రాజు కాలంలో అతడి సన్నిహితులచే సంకలించబడ్డాయని అభిప్రాయపడతారు. కొంతమంది అవి విభిన్న కాలాలలో సంకలించబడ్డాయని పేర్కొంటారు.

అదేవిధంగా కీర్తనల పేర్ల విషయంలోనూ భిన్నాభిప్రాయాలున్నాయి. కొంతమంది ఆ పేర్లు దైవం తరపు నుంచి గ్రహించబడ్డాయని అభిప్రాయపడతారు. కొంతమంది దైవప్రవక్త

**(అథఃసూచికలు)**

121 42వ కీర్తన నుంచి 49వ కీర్తన వరకు మరియు 84వ, 85వ మరియు 87వ కీర్తనలు.



కానటువంటి ఒక వ్యక్తి ఆ కీర్తనలకు ఆ విధంగా నామకరణం చేశాడని పేర్కొంటారు.

## ముఖ్య గమనిక:

క్రీ.శ. 1845 లో ప్రచురించబడిన పారశీక బైబిల్ అనువాద గ్రంథంలో 'కీర్తనల గ్రంథము' లోని 72 వ కీర్తన యొక్క 20వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

" యెష్షయి కుమారుడగు దావీదు ప్రార్థనలు ముగిసెను "

ఈ కీర్తన అరబీ బైబిల్ అనువాద గ్రంథాలలో 71వ కీర్తనగా ఉంది. దీనికి కారణం ఈ గ్రంథం యొక్క ముందుమాటలో పేర్కొనబడింది. పైన పేర్కొనబడిన వాక్యం బైబిల్ అరబీ అనువాద గ్రంథంలో తొలగించబడి ఉంది.[122] అనువాదకులు దానిని ఉద్దేశ్యపూర్వకంగానే తొలగించినట్లుగా స్పష్టమవుతుంది. తద్వారా కీర్తనల గ్రంథం విషయంలో భిన్నాభిప్రాయాలను కలిగియున్న క్రైస్తవ పండితులలో మొదటి వర్గం అభిప్రాయపడినట్లుగా కీర్తనల గ్రంథం పూర్తిగా దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ) (దావీదు) చే వ్రాయబడిన గ్రంథమని విదితమవ్వాలనేది వారి ఉద్దేశ్యం. అలాగే రెండవ వర్గానికి చెందినవారు ఈ వాక్యాన్ని చేర్చి ఉండేందుకూ అవకాశముంది. ఏదిఏమయినప్పటికీ ఈ విషయంలో మార్పులూచేర్పులు జరిగిన విషయం విస్పష్టంగా తేలిపోయింది, పేర్కొనబడియున్నదానిని తొలగించడం ద్వారా లేదా పేర్కొనబడని విషయాన్నిచేర్చడం ద్వారా.

# సామెతలు

ఇక 'సామెతల గ్రంథం' విషయానికొస్తే దాని పరిస్థితి కూడా ఎంతో దయనీయంగా ఉంది. కొంతమందయితే సామెతల గ్రంథం పూర్తిగా దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) (సొలొమోను) చే వ్రాయబడిన గ్రంథమని వాదించారు. అయితే సామెతల గ్రంథంలో వివిధ జాతీయాలు (విభిన్న కాలాలకు చెందిన) పేర్కొనబడి ఉండడం, వాక్యాల పునరుక్తి అనే విషయాలు వారి వాదం తప్పు అనేందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

**(అథఃసూచికలు)**

122 క్రీ.శ.1865 లో ప్రచురించబడిన బైబిల్ అరబీ అనువాద గ్రంథంలో ఈ వాక్యం 'కీర్తనల గ్రంథము' లో 72వ కీర్తనలోనే పేర్కొనబడి ఉంది.

అదేవిధంగా[123] 'సామెతలు' గ్రంథం లోని 30 వ అధ్యాయం యొక్క ఒకటవ వాక్యం మరియు 31వ అధ్యాయం యొక్క ఒకటవ వాక్యం కూడా ఈ వాదాన్ని నిరాకరిస్తున్నాయి. ఒకవేళ 'సామెతలు' గ్రంథంలో కొంత భాగం దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) (సొలొమోను) చే వ్రాయబడిందని మనం అంగీకరించినప్పటికీ విస్పష్టమైన రీతిలో కేవలం అందులోని 29 అధ్యాయాలు మాత్రమే ఆయనచే వ్రాయబడినట్లుగా పరిగణించవచ్చు. ఆ అధ్యాయాలు కూడా ఆయన జీవితకాలంలో సంకలించబడలేదు. ఎందుకంటే వాటిలోని ఐదు అధ్యాయాలు, అనగా 25వ అధ్యాయం నుంచి 29వ అధ్యాయం వరకు హిజ్కియా సన్నిహితులు సంకలించడం జరిగింది. ఈ విషయానికి 'సామెతలు' గ్రంథంలోని 25వ అధ్యాయపు ఒకటవ వాక్యం[124] ఆధారంగా నిలుస్తుంది. అలాగే ఈ కూర్పు దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) (సొలొమోను) పరమపదించిన 270 సంవత్సరాల తరువాత జరిగింది.

కొంతమంది 'సామెతలు' గ్రంథంలోని మొదటి 9 అధ్యాయాలు దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) (సొలొమోను) చే వ్రాయబడలేదని, (ఈ విషయం గురించి పాఠకులకు త్వరలోనే తప్పు నెం. 2 కు సమాధానంగా వ్యాఖ్యాత అయిన ఆడమ్ క్లార్క్ వ్యాఖ్య ఆధారంగా తెలుస్తుంది.) అలాగే 30వ అధ్యాయం ఆగూరు చే వ్రాయబడిందని, 31వ అధ్యాయం లెమూయేలు చే వ్రాయబడిందని అభిప్రాయపడ్డారు. అయితే క్రైస్తవ వ్యాఖ్యాతలకు ఆ ఇద్దరు ఎవరు? ఎప్పటివారు? అనే విషయాలకు సంబంధించిన ఆధారాలు ఇంతవరకు లభ్యం కాలేదు. అలాగే ఆ ఇద్దరూ[125] దైవప్రవక్తలు అనేందుకు సైతం ఆధారమేదీ లభ్యం కాలేదు. అయినప్పటికీ వారు తమ అలవాటు ప్రకారం కేవలం అంచనా ప్రాతిపదికన వారు దైవప్రవక్తలని పేర్కొంటారు. అయితే కేవలం వారి అంచనా ప్రతివాది కొరకు ఆధారంగా పరిగణించబడజాలదు.

**(అథఃసూచికలు)**

[123] 'సామెతలు' గ్రంథం లోని 30 వ అధ్యాయం యొక్క అంశం ఇది : " యాకె కుమారుడైన ఆగూరు పలికిన మాటలు'' అయితే 'సామెతలు' గ్రంథంలోని 31వ అధ్యాయం యొక్క అంశం ఇది: " రాజైన లెమూయేలు మాటలు, అతని తల్లి అతనికుపదేశించిన దేవోక్తి ''

[124] 'సామెతలు' గ్రంథం లోని 25 వ అధ్యాయం యొక్క అంశం ఇది : " ఇవియును సొలొమోను సామెతలే. యూదా రాజైన హిజ్కియా సేవకులు వీటిని ఎత్తి వ్రాసిరి''

('సామెతలు', 25 : 1)



కొంతమంది 'లెమూయేలు' అనేది దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) (సొలొమోను) పేరేనని అభిప్రాయపడ్డారు. అయితే ఇది తప్పు. ఎందుకంటే హెన్రీ వాస్కాట్ వ్యాఖ్యానం యొక్క కూర్పుకర్తలు ఈ విధంగా పేర్కొన్నారు:

" హోల్డన్ 'లెమూయేలు అనేది దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) (సొలొమోను) పేరేననే అంచనాను తిరస్కరించారు. అలాగే అది మరొక వ్యక్తి యొక్క పేరని నిరూపించారు. బహుశా వారికి లెమూయేలు పుస్తకం మరియు ఆగూరు పుస్తకం దైవం తరపున ప్రోక్తమయినట్లుగా నిరూపితమయ్యేందుకు దోహదపడే సముచిత ఆధారమేదో లభించి ఉంటుంది. లేకుంటే అవి శాసన గ్రంథాలలో ఏవిధంగా చేరగలవు?''

పైన పేర్కొనబడిన వ్యాఖ్యలో " బహుశా వారికి సముచిత ఆధారమేదో లభించి ఉంటుంది'' అనే వాక్యం తిరస్కరించదగిన అసత్య వాక్యం. ఎందుకంటే ప్రాచీన కాలానికి చెందిన క్రైస్తవ పండితులు తమ దృష్టిలో తిరస్కరించదగిన అసత్యమైన ఎన్నో గ్రంథాలను శాసన గ్రంథాలలో చేర్చియున్నారు. కనుక వారి యొక్క ఏ చర్యా ఆధారం కాజాలదు. ఈ విషయం ఈ ప్రకరణం చివర పాఠకులకు తెలుస్తుంది.

ఆడమ్ క్లార్క్ తన వ్యాఖ్యాన గ్రంథం యొక్క 3వ సంపుటిలోని 12వ పేజీలో మరియు 25వ పేజీలో ఈ విధంగా పేర్కొన్నారు:

" లెమూయేలు అనేది దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) (సొలొమోను) యొక్క పేరేననే వాదానికి గాను ఏ ఆధారమూ లేదు. అలాగే ఈ అధ్యాయం ఆయన కాలం తరువాత ఎంతో కాలానికి అనుబంధంగా చేర్చబడింది. అలాగే ఈ అధ్యాయం ప్రారంభంలో కనిపించే చాల్డీ[126] భాషకు చెందిన జాతీయాలు ఈ వాదానికి ఆధారం కాజాలవు.''

ఇంకా ఆయన 31వ అధ్యాయం గురించి ఇలా పేర్కొన్నారు:

**(అథఃసూచికలు)**

[125] ఫాదర్ మేస్లీ ఈ విధంగా పేర్కొన్నారు: " వీటిని క్రోడీకరించిన ఆగూరు మరియు లెమూయేలుకు సంబంధించి ఎటువంటి వివరాలూ తెలియవు'' ('హమారీ కుతుబె ముఖద్దసహ్' (మన పవిత్ర గ్రంథాలు), పేజీ : 218 )

[126] **Chaldee** కస్దిస్తాన్ కు చెందిన ప్రజలు మాట్లాడే భాషను 'చాల్దీ భాష' అంటారు. ఉర్దూ బైబిల్ లో ఈ భాష 'కసదీ' గా పేర్కొనబడింది.

" ఈ అధ్యాయం నిశ్చయంగా దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) (సొలొమోను) ద్వారా వ్రాయబడినది కాజాలదు"

'సామెతలు' గ్రంథంలోని 25వ అధ్యాయపు 1వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది:

" ఇవియును సొలొమోను సామెతలే. యూదా రాజైన హిజ్కియా సేవకులు వీటిని ఎత్తి వ్రాసిరి "

క్రీ.శ. 1838 లో ప్రచురించబడిన బైబిల్ పారసీక అనువాద గ్రంథంలో 'సామెతలు' గ్రంథం యొక్క 30వ అధ్యాయపు 1వ వాక్యం ఈ విధంగా పేర్కొనబడింది : (దాని తెలుగు అనువాదం క్రింద పేర్కొనబడుతోంది:

" యాకె కుమారుడైన ఆగూరు పలికిన మాటలు. ఆ మనుష్యుడు ఈతీయేలునకును, ఈతీయేలునకును ఉక్కాలునకును చెప్పిన మాట"

క్రీ.శ. 1845 లో ప్రచురించబడిన బైబిల్ పారసీక అనువాద గ్రంథంలో ఈ విధంగా పేర్కొనబడింది: (దాని తెలుగు అనువాదం క్రింద పేర్కొనబడుతోంది:

" యాకె కుమారుడైన ఆగూరు మాటలు. అనగా ఈతీయేలు మరియు ఉక్కాలు ద్వారా వెల్లడించబడిన దైవవాణి"

వివిధ భాషలకు చెందిన అత్యధిక అనువాదాలు ఇందుకు అనుగుణంగా ఉన్నాయి. అయితే బైబిల్ అరబీ అనువాద గ్రంథాలు ఈ విషయంలో భిన్నంగా ఉన్నాయి. క్రీ.శ. 1811 లో ప్రచురించబడిన బైబిల్ అరబీ అనువాద గ్రంథంలో అనువాదకుడు దీనిని తొలగించివేయడం జరిగింది. అయితే క్రీ.శ. 1831 లో మరియు క్రీ.శ. 1844 లో ప్రచురించబడిన బైబిల్ అరబీ అనువాద గ్రంథాల అనువాదకులిద్దరూ ఈ క్రింది విధంగా అనువదించారు: (దాని తెలుగు అనువాదం క్రింద పేర్కొనబడుతోంది)

" ఇవి అనఖాయీ కుమారుడగు జామిత్ [127] యొక్క వాక్కులు. అల్లాహ్ ఏ వ్యక్తికయితే తోడుగా ఉన్నాడో అతడు తెలిపిన స్వప్నం. అల్లాహ్ అతడికి తోడుగా ఉన్నప్పుడు ఆయన అతడికి సహకరించాడు."

---

**(అథఃసూచికలు)**

[127] ఈ అనువాదం తన యోగ్యత రీత్యా విచిత్రమైనది. కేవలం అంచనా ప్రాతిపదికన అనువదించడం జరిగింది. తద్వారా ఏదిఏమయినా వైరుధ్యమనేది సుస్పష్టం.



బైబిల్ అరబీ అనువాద గ్రంథాలలో [128] ఎంతటి వైరుధ్యముందో పరిశీలించండి.

అలాగే 31 వ అధ్యాయపు 1వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది:

" లెమూయేలు స్వప్నానికి చెందిన మాటలు. వాటి ద్వారా అతడి తల్లి అతడికి బోధించినది" [129]

మా వివరణను అర్థం చేసుకున్న తర్వాత బైబిల్ పాతనిబంధన గ్రంథంలోని 'సామెతలు' గ్రంథం పూర్తిగా దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) (సొలొమోను) ద్వారా వ్రాయబడిందని లేదా ఆయన వాటి సంకలన కర్త అని వాదించడం ఎంతమాత్రం సాధ్యం కాదనే విషయం పాఠకులకు బోధపడి ఉంటుంది. కనుక క్రైస్తవ పండితులలో అత్యధికులు 'సామెతలు' గ్రంథం ఎందరో వ్యక్తుల ద్వారా, అనగా హిజ్కియా, హజ్రత్ అష్ఇయా (అ) (యెషయా) మరియు బహుశా దైవప్రవక్త హజ్రత్ ఉజైర్ (అ) (ఎజ్రా) ద్వారా క్రోడీకరించబడిందనే విషయాన్ని అంగీకరించారు.

# ప్రసంగి

ఇక 'ప్రసంగి' గ్రంథం విషయానికొస్తే దాని విషయంలో కూడా తీవ్రస్థాయిలో అభిప్రాయభేదాలున్నాయి. కొంతమంది ఈ గ్రంథం దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) (సొలొమోను) ద్వారా వ్రాయబడిందని పేర్కొంటారు. ప్రఖ్యాత యూదు పండితుడయిన రబ్ ఖమ్జీ ఈ గ్రంథం హజ్రత్ అష్ఇయా (అ) (యెషయా) ద్వారా వ్రాయబడిందని వ్యాఖ్యానించారు.

---

**(అథఃసూచికలు)**

[128] క్రీ.శ. 1865 లో ప్రచురించబడిన బైబిల్ అరబీ అనువాద గ్రంథంలోని పదాలు సాధారణ అనువాదాలకు కొంచెం అనుగుణంగా ఉన్నాయి. " ముత్తఖియహ్ మసా కుమారుడైన ఆగూరు పలికిన మాటలు. ఆ మనుష్యుడు ఈతీయేలునకును, ఈతీయేలునకును ఉక్కాలునకును చెప్పిన మాట" ఇందులో 'ముత్తఖియహ్' అనే పదం సర్వసాధారణ అనువాదాలకు విరుద్ధంగా ఉంది. అలాగే 'మసా' అనే పదం అధికంగా చేరిన పదం.

[129] ఈ అరబీ బైబిల్ లోని వాక్యానికి బైబిల్ ఉర్దూ అనువాద గ్రంథంలో అనువదించబడియున్న వాక్యం యొక్క తెలుగు అనువాదాన్ని పేర్కొనడం జరిగింది.

టాల్మూడ్ [130] పండితులు ఇది హిజ్కియా చే వ్రాయబడిన గ్రంథమని పేర్కొంటారు. క్రోటీస్ " జర్దబాబిల్ అనే వ్యక్తి తన కుమారుడయిన అబీహూద్ కొరకు ఈ గ్రంథాన్ని రచించడం జరిగింది" అని పేర్కొంటారు. క్రైస్తవ పండితుడయి జహాన్ మరియు కొంతమంది జర్మనీకి చెందిన పండితులు " ఈ గ్రంథం యూదులు బబులోను ఖైదు నుంచి విముక్తులయిన తర్వాత వ్రాయబడింది" అని పేర్కొంటారు.

జర్ఖేల్ " ఇది ఆంటియోకస్ ఏపిఫేనిస్'[131] **(Antiochus)** కాలంలో వ్రాయబడింది. అయితే యూదులు బాబెలు ఖైదు నుంచి విముక్తులయిన తర్వాత దానిని దైవగ్రంథాలలో నుంచి తొలగించివేశారు. అయితే తరువాత అది తిరిగి ఆ గ్రంథాలలో చేర్చబడింది" అని వాదిస్తాడు.

# పరమగీతము

ఇక 'పరమగీతము' గ్రంథం విషయానికొస్తే దాని పరిస్థితి ఎంతో దయనీయంగా ఉంది. కొంతమంది ఈ గ్రంథం దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) (సొలొమోను) చే లేదా ఆయన సమకాలికుడయిన ఏ వ్యక్తి ద్వారానో వ్రాయబడినదని అభిప్రాయపడ్డారు. డాక్టర్ కనీకాట్ మరియు నవీన కాలానికి చెందిన క్రైస్తవ పండితులలో పలువురు " ఈ గ్రంథం దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) (సొలొమోను) చే వ్రాయబడిందని వాదించడం ఖచ్చితంగా తప్పు. ఎందుకంటే ఇది ఆయన పరమపదించిన తర్వాత ఎంతో కాలానికి వ్రాయబడింది." అని అభిప్రాయపడ్డారు. క్రీస్తుశకం ఐదవ శతాబ్దానికి చెందిన ఫాదర్ థియోడోర్ ఈ గ్రంథాన్ని, 'యోబు' గ్రంథాన్ని తీవ్రస్థాయిలో విమర్శించారు. హేమన్ మరియు లీక్లర్క్ ఈ గ్రంథం యాదార్థ్యాన్ని ఆమోదించేవారు కాదు. విష్టన్ ఈ విధంగా పేర్కొన్నారు: " ఇది ధర్మసమ్మతం కాని గానాబజానా మాత్రమే. దీనిని పవిత్ర గ్రంథాల నుంచి తొలగించవలసిన అవసరముంది" నవీన కాలానికి చెందిన ఎందరో క్రైస్తవ పండితులు కూడా ఈ విధంగానే తీర్మానించారు. సమ్లర్ " ఈ గ్రంథం కల్పితమైనది" అని వ్యాఖ్యానించారు. వార్డ్ కేథొలిక్ " కాసిలీయూ 'ఈ గ్రంథాన్ని

**(అథఃసూచికలు)**

[130] టాల్మూడ్ **(Talmud)** అనేది యూదులకు చెందిన ప్రసిద్ధ గ్రంథం పేరు. అందులో పాతనిబంధన గ్రంథం నుండి గ్రహించబడిన ఆదేశాలు, చరిత్రలు పేర్కొనబడి ఉన్నాయి.

[131] ఈ గ్రంథం యొక్క 82వ అథఃసూచిక చూడండి.



పాతనిబంధనకు చెందిన గ్రంథాల నుంచి తొలగించాలి. ఎందుకంటే అది అపవిత్రమైన గీతం' అని తీర్మానించారు" అని పేర్కొన్నారు.

# దానియేలు

థియోడోషన్ [132] యొక్క బైబిల్ గ్రీకు అనువాద గ్రంథంలోనూ, బైబిల్ లాటిన్ అనువాద గ్రంథంలోనూ, రోమన్ కేథలిక్కులకు చెందిన అన్ని బైబిల్ అనువాద గ్రంథాలలోనూ ఈ గ్రంథం యొక్క మూడవ అధ్యాయంలో ముగ్గురు పిల్లల గీతం ఉంది. అలాగే 13వ మరియు 14వ అధ్యాయాలు కూడా ఉన్నాయి. రోమన్ కేథొలిక్ వర్గం 'ముగ్గురు పిల్లల గీతము' అనే భాగాన్ని, 13వ మరియు 14వ అధ్యాయాలను విశ్వసనీయమైనవిగా ఆమోదిస్తుంది. అయితే ప్రొటెస్టెంట్ వర్గం వాటిని అసత్య గ్రంథాలుగా పేర్కొంటూ తిరస్కరిస్తుంది.[133]

# ఎస్తేరు గ్రంథము

'ఎస్తేరు' గ్రంథ రచయితకు సంబంధించిన వివరాలేమీ లభ్యం కావు. అలాగే ఈ గ్రంథం రచించబడిన కాలానికి సంబంధించిన వివరాలూ లభ్యం కావు. కొంతమంది క్రైస్తవులు 'ఇది దైవప్రవక్త హజ్రత్ ఉజైర్ (అ) (ఎజ్రా) కాలం నుంచి సైమన్ కాలం వరకు గల పండితుల రచన' అని అభిప్రాయపడ్డారు.

యూదుడయిన ఫెలో [134] ఈ విధంగా వ్యాఖ్యానించారు: "ఇది యేసు [135] కుమారుడయిన, బబులోను ఖైదు నుంచి విముక్తుడయి వచ్చిన యెహోయాకీను చే రచించబడిన గ్రంథం."

**(అథఃసూచికలు)**

[132] థియోడోషన్ **(Theodotion)** అనేది ఒక ప్రసిద్ధ హెబ్రూ క్రైస్తవ పండితుడి పేరు. ఆయన క్రీస్తుశకం రెండవ శతాబ్దంలో ఒక గ్రీకు అనువాదాన్ని తయారుచేశారు. ('హమారీ కుతుబె ముఖద్దసహ్' (మన పవిత్ర గ్రంథాలు)

[133] ప్రొటెస్టెంట్ వర్గానికి చెందిన బైబిల్ లో ఈ గ్రంథం కేవలం 12 అధ్యాయాలను కలిగియుంటుంది.

ఆగస్టైన్ ఈ విధంగా పేర్కొన్నారు: “ ఇది దైవప్రవక్త హజ్రత్ ఉజైర్ (అ) (ఎజ్రా) చే వ్రాయబడిన గ్రంథం” కొంతమంది “ ఇది రోకే మరియు ఎస్తేరు చే వ్రాయబడిన గ్రంథం” అని అభిప్రాయపడ్డారు. ఎస్తేరు గ్రంథానికి సంబంధించిన ఇతర స్థితిగతుల గురించి పాఠకులచే చదువుబడుతున్న ఈ గ్రంథం యొక్క 2వ అధ్యాయంలోని లక్ష్యం-2 యొక్క బుజువు-1 లో పాఠకులకు ఇన్షా అల్లాహ్ (అల్లాహ్ చిత్తమయితే) తెలుస్తుంది.

# యిర్మీయా గ్రంథము

ఈ గ్రంథం యొక్క 52వ అధ్యాయం నిశ్చయంగా హజ్రత్ ఇర్మియా (అ) (యిర్మీయా) ద్వారా వ్రాయబడినది కాజాలదు. అదేవిధంగా 10వ అధ్యాయపు 11వ వాక్యం కూడా ఆయనచే వ్రాయబడినది కాజాలదు. ‘52వ అధ్యాయం ఆయనచే వ్రాయబడినది కాజాలదు’ అని చెప్పడానికి కారణమేమిటంటే క్రీ.శ. 1838 లో ప్రచురించబడిన బైబిల్ పారసీక అనువాద గ్రంథంలో ‘యిర్మీయా గ్రంథము’ యొక్క 51వ అధ్యాయపు 64వ వాక్యం ఈ విధంగా పేర్కొనబడి ఉంది : (దాని తెలుగు అనువాదం క్రింద పేర్కొనబడుతోంది)

“ యిర్మీయా యొక్క మాటలు ఇంతటితో ముగిసెను ”

క్రీ.శ. 1845 లో ప్రచురించబడిన బైబిల్ పారసీక అనువాద గ్రంథంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది: (దాని తెలుగు అనువాదం క్రింద పేర్కొనబడుతోంది)

“ యిర్మీయా యొక్క మాటలు ఇక్కడి వరకు ఉండెను”

క్రీ.శ. 1844 లో ప్రచురించబడిన బైబిల్ అరబీ అనువాద గ్రంథంలో ఈ విధంగా

**(అథఃసూచికలు)**

[134] ఈయన యూదు పండితులలో ఒకరు. (క్రీ.పూ. 20 లో జననం, క్రీ.శ. 40 లో మరణం) ఈయన పౌలుకు సమకాలికుడు. (‘బైబిల్ హ్యాండ్‌బుక్’ )

[135] అన్ని ప్రతుల్లోనూ ఈవిధంగానే పేర్కొనబడి ఉంది. కానీ అది సరియైనది కాదు. ఎందుకంటే యెహోయాకీను ఏసు (క్రీస్తు కాదు) కుమారుడు కాడు, యెహోయాకీము కుమారుడు. యెరూషలేము నుండి బబులోనుకు చెరపట్టబడి కొనిపోబడిన కాలంలో ఆయన రాజు అవడం జరిగింది. ఆయన కేవలం మూడు నెలలు మాత్రమే పరిపాలించాడు. (చూడండి: ‘రాజులు రెండవ గ్రంథము’, 24వ అధ్యాయపు 8వ వాక్యము, 25వ అధ్యాయపు 27వ వాక్యము)



పేర్కొనబడి ఉంది : (దాని తెలుగు అనువాదం క్రింద పేర్కొనబడుతోంది)

“ యిర్మీయా యొక్క మాటలు ఇక్కడి వరకు ఉండెను” [136]

ఇక 10వ అధ్యాయపు 11వ వాక్యం హజ్రత్ ఇర్మియా (అ) (యిర్మీయా) చే వ్రాయబడినది కాజాలదు’ అని చెప్పడానికి కారణమేమిటంటే ఈ వాక్యం ప్రత్యేకంగా కసదీ[137] భాషలో ఉంది. మిగిలిన గ్రంథం మొత్తం హెబ్రూ భాషలో ఉంది. ఏ వ్యక్తి ఈ రెండింటినీ చేర్చడం జరిగిందో తెలియదు. క్రైస్తవ వ్యాఖ్యాతలు కేవలం అంచనా ప్రాతిపదికన “ వాటిని బహుశా ఫలానా వ్యక్తులు చేర్చి ఉండవచ్చు” అని వాదిస్తూ ఉంటారు. హెన్రీ వాస్కాట్ వ్యాఖ్యానం యొక్క కూర్పుకర్తలు ఈ అధ్యాయం గురించి ఈ విధంగా పేర్కొన్నారు:

“ దైవప్రవక్త హజ్రత్ ఉజైర్ (అ) (ఎజ్రా) లేదా మరే వ్యక్తో ఈ అధ్యాయాన్ని దానికి ముందరి అధ్యాయంలో ఏయే సంఘటనలు జరగబోతున్నాయని భవిష్యవాణులు పేర్కొనబడ్డాయో వాటికి వివరణగా, వాటి స్థాయికి సంబంధించిన స్పష్టీకరణగా చేర్చి ఉండవచ్చని తెలుస్తోంది”

హోరన్ తన వ్యాఖ్యాన గ్రంథం యొక్క నాల్గవ సంపుటిలోని 195వ పేజీలో ఈవిధంగా పేర్కొన్నారు:

“ ఈ అధ్యాయం యిర్మీయా (హజ్రత్ ఇర్మియా (అ)) మరణించిన తర్వాత, బబులోను ఖైదు నుంచి స్వాతంత్ర్యం లభించిన తర్వాత చేర్చబడినది. దానికి సంబంధించిన ప్రస్తావన కొంచెం ఈ అధ్యాయంలోనూ పేర్కొనబడి ఉంది”

ఆ తర్వాత అదే అధ్యాయంలో ఆయన ఇలా పేర్కొన్నారు:

**(అథఃసూచికలు)**

[136] బైబిల్ ఉర్దూ అనువాద గ్రంథంలో “ యిర్మీయా యొక్క మాటలు ఇక్కడి వరకు ఉండెను” అని పేర్కొనబడి ఉంది. బైబిల్ తెలుగు అనువాద గ్రంథంలో కూడా “ యిర్మీయా యొక్క మాటలు ఇంతటితో ముగిసెను” అని పేర్కొనబడి ఉంది. అలాగే ‘యిర్మీయా’ గ్రంథం యొక్క 52వ అధ్యాయపు మొదటి వాక్యంలో “ అతని తల్లి పేరు హమూటలు; ఈమె లిబ్నా ఊరివాడైన యిర్మీయా కుమార్తె.” అని పేర్కొనబడి ఉంది. ఈ పదాలు స్వయంగా హజ్రత్ ఇర్మియా (అ) (యిర్మీయా) చే పేర్కొనబడిన పదాలు కాజాలవు.

[137] కసదిస్తాన్ లో ఉండే నివసించేవారిని ‘కసదీయులు’ అని పిలుస్తారు. వారి భాషనే ‘కసదీ భాష’ అని పేర్కొంటారు. నెబుకద్నెజరు ఆ జాతికి చెందినవాడే.

‘ “ ఈ ప్రవక్త యొక్క వాక్కులన్నీ, 10వ అధ్యాయపు వాక్యం తప్ప హెబ్రూ భాషలో ఉన్నాయి. అయితే ఈ వాక్యం కసదీయుల భాషలో పేర్కొనబడి ఉంది”

ఫాదర్ డెన్మా ఈ విధంగా పేర్కొన్నారు: “ ఈ వాక్యం చేర్చబడినట్టి వాక్యం”

# యెషయా గ్రంథము

కేథొలిక్ వర్గ నాయకుడైన కార్కరన్ కు మరియు ప్రొటెస్టెంట్ వర్గానికి చెందిన పండితులలో వారన్‌కు మధ్య ఒక సంవాదం జరిగింది. ఆ సంవాదానికి సంబంధించిన విషయాలు క్రీ.శ. 1852 లో ఆగ్రాలో ప్రచురించబడ్డాయి కూడా. కార్కరన్ తన మూడవ లేఖలో ఈ విధంగా పేర్కొన్నారు:

“ జర్మనీకి చెందిన ప్రసిద్ధ పండితుడయిన అస్టాహలన్ ఈ విధంగా పేర్కొంటారు: ‘యెషయా గ్రంథం యొక్క 40వ అధ్యాయం మరియు దాని తరువాత 66వ అధ్యాయం వరకు హజ్రత్ అష్ఇయా (అ) ( యెషయా) చే వ్రాయబడలేదు.”

దీనినిబట్టి ‘యెషయా’ గ్రంథానికి చెందిన 27 అధ్యాయాలు హజ్రత్ అష్ఇయా (అ) ( యెషయా) చే వ్రాయబడలేదని తెలుస్తోంది.[138]

**(అథఃసూచికలు)**

[138] ఇక్కడ ఒక విషయాన్ని ప్రస్తావించడం ఆసక్తిదాయకమైనది. అదేమిటంటే ప్రొటెస్టెంట్ వర్గం దృష్టిలో పాతనిబంధనకు చెందిన గ్రంథాల సంఖ్య 38. అయితే ప్రసిద్ధ చరిత్రకారుడైన యూసీఫస్ దాదాపు క్రీ.శ. 100 లో ఈ విధంగా పేర్కొన్నాడు: “ మా వద్ద కేవలం 22 గ్రంథాలే ఉన్నాయి. వాటిలో పూర్వకాలానికి చెందిన స్థితిగతులన్నీ పేర్కొనబడి ఉన్నాయి. అవి దైవగ్రంథాలుగా ఆమోదించబడతాయి” (ఫాదర్ మేన్లీ చే రచించబడిన ‘హమారీ కుతుబె ముఖద్దసహ్’ (మన పవిత్ర గ్రంథాలు) లోని 47వ పేజీ ఆధారంగా) క్రైస్తవ సోదరులు మూడు అస్తిత్వాలను ఒకటిగా తీర్మానించే విషయం తెలిసిందే. ఇప్పుడు వారు 38 గ్రంథాలను 22 గ్రంథాలుగా తీర్మానించేందుకు సైతం ప్రయత్నిస్తున్నారు. వారు ఆ 38 గ్రంథాలను 22 గ్రంథాలుగా నిరూపించేందుకై విచిత్రమైన వక్రభాష్యాలను ఈ విధంగా వెలువరిస్తూ ఉంటారు: “ చిన్నస్థాయి దైవప్రవక్తలకు చెందిన 12 గ్రంథాలను ఒక గ్రంథంగా పరిగణించాలి, ఎజ్రా మరియు నెహెమ్యా గ్రంథాలను కలిపి ఒకే గ్రంథంగా పరిగణించాలి, రూతు మరియు న్యాయాధిపతులు గ్రంథాలను

***(తరువాతి పేజీ చూడండి)***



# నాలుగు సువార్తల వాస్తవికత

## మత్తయి సువార్త, లూకా సువార్త, మార్కు సువార్త :

మీకు త్వరలోనే ఈ గ్రంథం యొక్క రెండవ అధ్యాయంలోని లక్ష్యం-3, ఋజువు నెం.18 ద్వారా ప్రాచీన కాలానికి చెందిన క్రైస్తవ పండితులందరూ, నవీన కాలానికి చెందిన ఎందరో క్రైస్తవ పండితులు మత్తయి సువార్త హెబ్రూ భాషలో వ్రాయబడిందని, కానీ క్రైస్తవ వర్గాలు అందులో ప్రక్షిప్తాలకు పాల్పడిన కారణంగా అది కనుమరుగయిపోయిందని, ప్రస్తుతం లభ్యమవుతున్న మత్తయి సువార్త కేవలం దాని అనువాదం మాత్రమేనననే విషయంలో ఏకాభిప్రాయాన్ని కలిగియున్నారు. అయితే ఆ అనువాదానికి సంబంధించిన ఆధారాలు సైతం వారి వద్ద లేవు. చివరకు నిశ్చయమైన రీతిలో మత్తయి సువార్తను అనువదించిన అనువాదకుని పేరు సైతం నేటివరకు తెలియరాలేదు. వారు కేవలం ఊహలు మరియు అంచనాల ప్రాతిపదికన ‘బహుశా ఫలానా వ్యక్తులు దానిని అనువదించి ఉండవచ్చు’ అని పేర్కొంటారు. అయితే అటువంటి అంచనా ప్రతివాది కొరకు ఆధారం కాజాలదు. అటువంటి అంచనా ద్వారా మూల రచయిత వరకు ఆధారం నిలువజాలదు. ఈ గ్రంథాన్ని చదువుతున్నవారికి ముందుమాట లో నెంబర్-7 ద్వారా ‘మీజానుల్ హఖ్’ గ్రంథ రచయిత కూడా తాను ఎంతగా పక్షపాత ధోరణిని కలిగియున్నప్పటికీ మత్తయి సువార్త కు సంబంధించి ఎటువంటి ఆధారాన్నీ పేర్కొనలేకపోయారు. ఆయన కేవలం అంచనా ప్రాతిపదికన ఈ విధంగా పేర్కొన్నారు: “ బహుశా మత్తయి దీనిని గ్రీకు భాషలో రచించి ఉండవచ్చు” అయితే ఆధారాన్ని పేర్కొననప్పుడు కేవలం అతడి అంచనా లేదా ఊహ తిరస్కరించదగినదే అవుతుంది. కనుక ఈ అనువాద గ్రంథం (మత్తయి సువార్త) తప్పనిసరిగా ఆమోదించదగినది కాదు, తిరస్కరించదగినదే.

‘ఎన్‌సైక్లోపేడియా’ లో మత్తయి సువార్త గురించి ఈ విధంగా పేర్కొనబడింది:

**(అథఃసూచికలు)**

***(138 వ అథః సూచిక తరువాయి భాగం)***

కలిపి ఒకే గ్రంథంగా పరిగణించాలి, యిర్మీయా మరియు విలాప వాక్యములు గ్రంథాలను కలిపి ఒకే గ్రంథంగా పరిగణించాలి. ఈ విధంగా పరిగణించినప్పుడు పాత నిబంధనలోని గ్రంథాల సంఖ్య 22 అవుతుంది. ఇటువంటి హాస్యాస్పదమైన చర్యను చూసి ‘వారికి అల్లాహ్ సన్మార్గాన్ని చూపుగాక’ అని ప్రార్థించడం మినహా మనమేమీ చేయలేము.

‘ “ ఈ సువార్త (మత్తయి సువార్త) క్రీ.శ. 41 లో హెబ్రూ భాషలోనూ, కల్దానీ భాషకు మరియు సుర్యానీ భాషకు మధ్యస్థ స్థాయిలో ఉండే భాషలోనూ వ్రాయబడింది. కానీ ప్రస్తుతం అందుబాటులో ఉన్న గ్రీకు అనువాద గ్రంథం మరియు హెబ్రూ భాషలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న ప్రతి ఆ గ్రీకు భాషలో ఉన్న గ్రంథం యొక్క అనువాదమే”

వార్డ్ కేథొలిక్ తన గ్రంథంలో ఇలా పేర్కొన్నారు:

“ జెరోమ్ తన లేఖలో స్పష్టంగా ఇలా వ్రాశారు: ‘ ప్రాచీన కాలానికి చెందిన పలువురు క్రైస్తవ పండితులు మార్కు సువార్త యొక్క ఆఖరి అధ్యాయం విశ్వసనీయత విషయంలో సందేహాన్ని వ్యక్తం చేసేవారు. అలాగే ప్రాచీన కాలానికి చెందిన మరి కొంతమంది క్రైస్తవ పండితులు లూకా సువార్త యొక్క 23వ అధ్యాయానికి చెందిన పలు వాక్యాల విషయంలో సందేహాన్ని కలిగియుండేవారు. ప్రాచీన కాలానికి చెందిన మరి కొంతమంది క్రైస్తవ పండితులు లూకా సువార్త యొక్క ప్రారంభపు రెండు అధ్యాయాల విశ్వసనీయత విషయంలో సందేహాన్ని కలిగియుండేవారు. ఈ రెండు అధ్యాయాలు మార్సియూనీ వర్గానికి [139] చెందిన బైబిల్ ప్రతిలో లేవు.”

సత్యశోధకులయిన నోర్టన్ క్రీ.శ. 1837 లో బోస్టన్‌లో ప్రచురించబడిన తన గ్రంథంలో మార్కు సువార్త గురించి ఈ విధంగా పేర్కొన్నారు:

“ ఈ సువార్తలో పేర్కొనబడిన ఒక విషయం పరిశోధించదగినది. అది ఆఖరి అధ్యాయంలో 9వ వాక్యం నుంచి చివరి వాక్యం వరకు పేర్కొనబడిన విషయం. క్రీస్‌బాఖ్

**(అథఃసూచికలు)**

[139] ‘మార్సియూనీ’ అనేది క్రైస్తవులకు చెందిన ఒక వర్గం పేరు. అది పాతనిబంధనకు చెందిన గ్రంథాలను విశ్వసనీయమైనవిగా అంగీకరించదు. ఈ వర్గానికి చెందినవారు ఇద్దరు దేవుళ్ళను విశ్వసిస్తారు. ఒక దేవుడు మంచికి సృష్టికర్త అయితే, మరొక దేవుడు చెడుకు సృష్టికర్త అనేది వారి విశ్వాసం. వారు పాతనిబంధనకు చెందిన గ్రంథాలను రెండవ రకానికి చెందిన దేవుడు పంపాడని విశ్వసిస్తారు. క్రొత్తనిబంధన గ్రంథంలోని ఏయే అధ్యాయాలలోనయితే పాతనిబంధన గురించి ప్రస్తావించబడి ఉందో వాటిలోని విషయాన్ని ఈ వర్గానికి చెందినవారు తిరస్కరించేవారు లేదా అందులో ప్రక్షిప్తాలకు పాల్పడేవారు. ఈ వర్గ స్థాపకుడు ‘మార్సియూన్’. అందుకే ఈ వర్గాన్ని‘మార్సియూనీ వర్గం’ అని పిలుస్తారు. (‘ఇజాలతుష్షుకూక్’ యొక్క 192వ మరియు193వ పేజీల సంక్షిప్తీకరణ, లార్డ్‌నర్ మొదలయినవారి ఆధారంతో...) అరబీలో ఈ వర్గాన్ని ‘మర్ఖియూన్’ అని కూడా పిలుస్తారు.



విషయానికొస్తే విచిత్రమైన విషయమేమిటంటే ఆయన ఈ విషయం వ్రాయబడియున్న చోట సందేహానికి సంబంధించిన ఏ సంకేతాన్నీ ఉంచలేదు. వాస్తవానికి దాని వ్యాఖ్యానంలో అది చేర్చబడిన విషయానికి సంబంధించి ఎన్నో ఆధారాలు పేర్కొంటారు.”

ఆ తర్వాత ఆధారాలను ఉల్లేఖిస్తూ ఆయన ఈ విధంగా పేర్కొన్నారు:

“ దీనినిబట్టి నిరూపితమయిన విషయమేమిటంటే ఈ లిఖిత విషయం సందేహాస్పదమైనది. ముఖ్యంగా మనం లేఖకుల నైజాన్ని కూడా దృష్టిలో ఉంచుకోవాలి. వారు ఏదయినా విషయాన్ని తొలగించడంతో పోలిస్తే చేర్చేందుకే ఎక్కువగా ఇష్టపడేవారు”

క్రీస్‌బాఖ్ ప్రొటెస్టెంట్ వర్గానికి చెందిన విశ్వసనీయమైన పండితులలో ఒకరు. నోర్టన్ వారి దృష్టిలో ఆ స్థాయికి చెందిన వ్యక్తి కానప్పటికీ క్రీస్‌బాఖ్ వ్యాఖ్య అయితే వారి కొరకు నిశ్చయంగా ఆధారమే అవుతుంది.

# యోహాను సువార్త ప్రామాణికమైనది కాదు అందుకు ఆధారాలు

అదేవిధంగా పూర్తి ఆధారాలతో యోహాను వైపుకు ఆపాదించబడే బైబిల్ క్రొత్త నిబంధన గ్రంథంలోని యోహాను సువార్త ఆయనచే వ్రాయబడిందని నిరూపితం కాదు. ఇంకా చెప్పాలంటే అందులో ఈ విషయాన్ని నిరాకరించే కొన్ని అంశాలు ఉన్నాయి కూడా.

## మొదటి ఆధారం:

పూర్వ యుగంలో, అనగా దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) కు ముందరి కాలంలో మరియు ఆయన తర్వాతి కాలంలో ఏ రచనా విధానమయితే కొనసాగిందో అది ప్రస్తుతం ముస్లింలలో వ్యవహారంలో ఉన్న రచనా విధానమే. పాఠకులచే చదువబడుతున్న ఈ గ్రంథంలో “ప్రస్తుతం ‘తౌరాతు’ గ్రంథం పేరుతో ఉనికిలో ఉన్న గ్రంథం దైవప్రవక్త హజ్రత్ మూసా(అ) (మోషే) పై అవతరించిన గ్రంథం కాదు. అందుకు సంబంధించిన ఆధారాలు” అనే అంశంలో ‘నాల్గవ ఆధారం’ పేరుతో పేర్కొనబడిన అంశం ద్వారా ఈ విషయం ఇంతకుముందే తెలియజేయబడింది. అలాగే రెండవ అధ్యాయంలోని ‘లక్ష్యం-3’ యొక్క ఋజువు నెం.18 ద్వారా కూడా దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు లభ్యం కాగలవు.

యోహాను సువార్తను అధ్యయనం చేసినప్పుడు యోహాను తాను కళ్ళారా చూసిన విషయాలను గురించి వివరిస్తున్నట్లుగా ఖచ్చితంగా అనిపించదు. ఒక వ్యక్తి తాను కళ్ళారా చూసిన

విషయం గురించి పేర్కొన్నప్పుడు ఏదయినా పటిష్ఠమైన ఆధారం లభించనంతవరకు దానికి వ్యతిరేకంగా పేర్కొనబడ్డ ఏ విషయమూ అంగీకరించబడదు.

## రెండవ ఆధారం:

యోహాను సువార్త యొక్క 21వ అధ్యాయపు 24వ వాక్యంలో ఈవిధంగా పేర్కొనబడింది:

**“ ఈ సంగతులను గూర్చి సాక్ష్యమిచ్చుచు ఇవి వ్రాసిన శిష్యుడు ఇతడే; ఇతని సాక్ష్యము సత్యమని యెరుగుదుము ”**

ఇక్కడ ఈ వాక్యాన్ని వ్రాసిన వ్యక్తి యోహాను గురించి “ ఈ సంగతులను గూర్చి సాక్ష్యమిచ్చుచు ఇవి వ్రాసిన శిష్యుడు ఇతడే” అని పేర్కొన్నాడు. అలాగే “ ఇతని సాక్ష్యము...” అనే వాక్యభాగంలో ‘ఇతని’ అనేది ప్రథమ పురుషకు చెందిన సర్వనామము అనే విషయం మనకు తెలుసు. అలాగే “ యెరుగుదుము ” అనే పదం ఉత్తమ పురుషకు చెందిన సర్వనామము అనే విషయం కూడా మనకు తెలుసు. ఈ పదాలు యోహాను సువార్తను వ్రాసినది స్వయంగా యోహాను కాదనే విషయాన్ని వెల్లడిస్తున్నాయి. ఒకవేళ యోహానే స్వయంగా ఈ సువార్తను వ్రాసియున్న పక్షంలో ఆయన “ ఈ సంగతులను గూర్చి సాక్ష్యమిచ్చుచు ఇవి వ్రాసిన శిష్యుడు ఇతడే” అని కాకుండా “ ఈ సంగతులను గూర్చి సాక్ష్యమిచ్చుచు ఇవి వ్రాసినది నేనే” అని ఉత్తమ పురుషకు చెందిన సర్వనామమైన ‘నేనే’ అనే పదాన్ని ఉపయోగించి పేర్కొని ఉండేవారు. అలాగే “ ఇతని సాక్ష్యము సత్యమని యెరుగుదుము” అని కాకుండా “ నా సాక్ష్యము సత్యమని మీరు యెరుగుదురు” అని వ్రాసి ఉండేవారు. దీనినిబట్టి యోహాను సువార్తను స్వయంగా యోహాను కాకుండా మరొక వ్యక్తి వ్రాయడం జరిగిందని స్పష్టమయిపోతోంది. బహుశా ఆ వ్యక్తికి యోహాను చే వ్రాయబడిన కొన్ని అంశాలు లభ్యమయి ఉండవచ్చు. వాటినే అతడు తన తరఫున కొన్ని మార్పులూచేర్పులతో, కొన్ని విషయాల తొలగింపులతో సహా ఉల్లేఖించి ఉండవచ్చు. (సర్వసృష్టికర్త అయిన అల్లాహ్‌కే సర్వం ఎరుక)

## మూడవ ఆధారం:

క్రీస్తుశకం రెండవ శతాబ్దంలో ‘యోహాను సువార్త స్వయంగా యోహానుచే వ్రాయబడినది’ అనే విషయం తిరస్కరించబడినప్పుడు యోహాను శిష్యుడయిన పాలీకార్ప్ **(Polycarp)** [140] శిష్యుడయిన ఐరినియుస్ **(Irenaeus)** [141] జీవించియున్నాడు. ఆయన తిరస్కారులకు సమాధానంగా “ నేను పాలీకార్ప్ ద్వారా ఈ సువార్త (యోహాను సువార్త) ఏసు శిష్యుడయిన



యోహాను చే వ్రాయబడినట్లుగా విన్నాను” అని ఎంతమాత్రం పేర్కొనలేదు. ఒకవేళ యోహాను సువార్త నిజంగానే యోహానుచే వ్రాయబడియున్న పక్షంలో పాలీకార్ప్ కు ఆ విషయం తప్పకుండా తెలిసి ఉండేది. ఐరినియుస్ తన గురువయిన పాలీకార్ప్ ద్వారా గుప్త విషయాలను వింటూ వాటిని ఉల్లేఖిస్తూ కూడా ఈ మహోన్నతమైన, అతి ముఖ్యమైన విషయంలో (యోహాను సువార్త స్వయంగా యోహానుచే వ్రాయబడిందనే విషయం) ఒక్క పదాన్ని సైతం తన గురువు నుంచి వినకపోవడమనేది సత్యదూరమే. అలాగే ఆ విషయాన్ని ఆయన తన గురువు నుంచి విని కూడా మరచిపోయి ఉంటారనే అంచనా మరింత సత్యదూరం. ఎందుకంటే ఆయన వాగ్మూలిక (నోటి ద్వారా చెప్పబడిన) ఉల్లేఖనానికి ఎంతగానో విలువనిచ్చేవారు. అటువంటి ఉల్లేఖనాలను ఆయన ఎంతో జాగ్రత్తగా భద్రపరిచేవారు, గుర్తుంచుకునేవారు. మాయూసీబియూస్ క్రీ.శ. 1847 లో ప్రచురించబడిన తన చరిత్ర గ్రంథం యొక్క 5వ సంపుటిలో 20 వ అధ్యాయంలో 219వ పేజీలో వాగ్మూలిక ఉల్లేఖనాల విషయంలో ఐరినియుస్ వ్యాఖ్యను ఈ విధంగా ఉల్లేఖించారు:

**“ నేను ఈ వాక్కులను దేవుని అనుగ్రహంతో ఎంతో జాగ్రత్తగా విన్నాను మరియు నా హృదయంలో వ్రాసుకున్నాను, కేవలం కాగితాల మీద మాత్రమే కాదు. సుదీర్ఘకాలంగా నేను నిత్యం వాటిని చదువుతూ ఉండే పాత అలవాటును కలిగియున్నాను ”**

ఆయనకు ఆ విషయం గుర్తున్నప్పటికీ వ్యతిరేకుల ముందు దానిని వెల్లడించలేదనే విషయం ఇంకా సత్యదూరమే. ఈ ఆధారం ద్వారా క్రీస్తుశకం రెండవ శతాబ్దంలో వ్యతిరేకులు యోహాను సువార్త స్వయంగా యోహానుచే వ్రాయబడిందనే విషయాన్ని నిరాకరించినప్పుడు, వారి వాదానికి విరుద్ధంగా ప్రాచీన కాలానికి చెందిన క్రైస్తవ పండితులు ఆ సువార్త యోహాను ద్వారానే వ్రాయబడిందని నిరూపించలేకపోయారనే విషయం స్పష్టమయింది. కనుక యోహాను సువార్త

---

**(అథఃసూచికలు)**

[140] పాలీకార్ప్ **(Polycarp)** సమర్నకు చెందిన ప్రసిద్ధ బిషప్. ఆయన ఏసు శిష్యుల కాలంలో జీవించియున్నారు. ఆయన దాదాపు క్రీ.శ. 69 లో జన్మించి క్రీ.శ. 155 లో మరణించారు. కల్పిత దురాచారాలకు పాల్పడేవారికి వ్యతిరేకంగా ఆయన చేసిన ఘనకార్యాలు కూడా ప్రసిద్ధమే.

[141] ఐరినియుస్ **(Irenaeus)** లియూన్ కు చెందిన ప్రసిద్ధ బిషప్. ఆయన నిశ్చయమైన రీతిలో ఆమోదించబడిన ప్రామాణిక క్రైస్తవ పండితునిగా ప్రసిద్ధులు. ఆయన క్రీ.శ. 130 లో జన్మించి దాదాపు క్రీ.శ. 184 లో మరణించారు. కల్పిత దురాచారాలకు పాల్పడేవారికి వ్యతిరేకంగా ఆయన వ్రాసిన గ్రంథాలు ప్రసిద్ధమయ్యాయి. వాటి గ్రీకు అనువాద గ్రంథాలు నేటికీ మనకు లభ్యమవుతున్నాయి. (ఎన్‌సైక్లోపేడియా బ్రిటానికా)

స్వయంగా యోహాను ద్వారా వ్రాయబడలేదనే వాదం కేవలం ముస్లింలది మాత్రమే కాదు,

అలాగే పాఠకులకు త్వరలోనే ఇదే గ్రంథంలో పొరపాటు నెం.1 కు సమాధానంగా విగ్రహారాధకుడయిన, బహుదైవారాధకుడయిన పండితులలో ఒకడయిన సెల్సిస్ క్రీస్తుశకం రెండవ శతాబ్దంలో నొక్కి వక్కాణిస్తూ ఈ క్రింది విధంగా ప్రకటించాడనే విషయం విదితమవుతుంది:

**“ క్రైస్తవులు తమ సువార్తల్లో మూడు లేదా నాలుగు పర్యాయాలు ప్రక్షిప్తాలకు (మార్పులూచేర్పులకు) పాల్పడ్డారు. ఇంకా చెప్పాలంటే ఏకంగా వాటిలోని అంశాలే మారిపోయే రీతిలో వారు ప్రక్షిప్తాలకు పాల్పడ్డారు ”**

అదేవిధంగా మానీకీజ్‌కాన్ [142] వర్గానికి చెందిన పండితుడయిన ఫాస్టస్ క్రీస్తుశకం నాల్గవ శతాబ్దంలో ఈ విధంగా ఎలుగెత్తి చాటాడు:

**“ సత్యమైన విషయమేమిటంటే క్రొత్త నిబంధన గ్రంథాన్ని క్రీస్తు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) వ్రాయలేదు, ఆయన శిష్యులూ వ్రాయలేదు. ఒక అనామక వ్యక్తి దానిని వ్రాసి ఏసు శిష్యుల వైపుకు, వారి సహచరుల వైపుకు ఆపాదించాడు. తద్వారా ప్రజలు దానిని విశ్వసనీయమైనదిగా భావించాలనేది అతడి ఉద్దేశ్యం. అతడు ఏసును (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)ను విశ్వసించేవారిని తీవ్రమైన కష్టాలకు గురిచేయాలనే ఉద్దేశ్యంతో ఎన్నో తప్పులతో, వైరుధ్యాలతో కూడిన పుస్తకాలను వ్రాసివేయడం జరిగింది ”** [143]

## నాల్గవ ఆధారం:

క్రీ.శ. 1844 లో ప్రచురించబడిన ‘కేథొలిక్ హెరాల్డ్’ యొక్క 7వ సంపుటిలోని 205వ

**(అథఃసూచికలు)**

[142] మానీకీజ్‌కాన్ అనేది క్రైస్తవులకు చెందిన ఒక వర్గం పేరు. ఈ వర్గం యొక్క విశ్వాసం ఇది: “ ఏ దేవుడయితే దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) (మోషే) కు తౌరాతు గ్రంథాన్ని ప్రసాదించాడో, హెబ్రీయులయిన ప్రవక్తలతో సంభాషించాడో ఆయన నిజమైన దేవుడు కాడు (అల్లాహ్ క్షమించుగాక), షైతానులలోని ఒకానొక షైతాను” ఈ వర్గం బైబిల్ లోని క్రొత్తనిబంధనకు చెందిన గ్రంథాలను విశ్వసిస్తుంది. అయితే వాటిలో కొన్ని విషయాలు చేర్చబడ్డాయని, ప్రక్షిప్తాలకు అవి గురయ్యాయని ఈ వర్గం విశ్వసిస్తుంది. ఈ వర్గం వాటిలో తనకు ఇష్టమయిన విషయాలను గ్రహించి, మిగిలిన విషయాలను విసర్జిస్తుంది. మానీకీజ్ ఈ వర్గం స్థాపకుడు. ( ‘ఇజాలతుష్షుకూక్’ గ్రంథంలోని 194వ పేజీ నుంచి గ్రహించబడిన విషయ సారాంశము, లార్డ్నర్ యొక్క ‘కితాబుల్ అస్‌నాద్’ ఆధారంగా)



పేజీలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది :

**“ స్టావ్‌లిన్ తన పుస్తకంలో ‘నిస్సందేహంగా పూర్తి యోహాను సువార్త గ్రంథం అలెగ్జాండ్రియా విద్యాలయానికి చెందిన ఒక విద్యార్థి రచన’ అని పేర్కొన్నాడు ”**

స్టావ్‌లిన్ ఎంత ధైర్యంగా యోహాను సువార్త యోహాను చే వ్రాయబడలేదని ప్రకటిస్తున్నాడో చూడండి. అలాగే ‘అది అలెగ్జాండ్రియా విద్యాలయానికి చెందిన ఒక విద్యార్థి రచన’ అని ఎంత బహిరంగంగా పేర్కొంటున్నాడో చూడండి.

## ఐదవ ఆధారం:

సత్యశోధకుడయిన బర్‌తషీందర్ ఈ విధంగా పేర్కొన్నాడు :

**“ ఈ యోహాను సువార్త మొత్తం, అలాగే యోహాను వ్రాసినట్లుగా చెప్పబడుతున్న పత్రికలన్నీ ఆయన చే వ్రాయబడినట్టివి ఎంతమాత్రం కావు. ఏ వ్యక్తో క్రీస్తుశకం రెండవ శతాబ్దంలో వాటిని వ్రాయడం జరిగింది ”**

## ఆరవ ఆధారం:

ప్రసిద్ధ సత్యశోధకుడయిన క్రోమ్‌టీస్ ఈ విధంగా పేర్కొన్నాడు :

**“ ఈ యోహాను సువార్త లో మొత్తం 20 అధ్యాయాలు ఉండేవి. అఫ్‌సాస్ [144] కు చెందిన చర్చి 21 వ అధ్యాయాన్ని యోహాను మరణించిన తర్వాత చేర్చింది ”**

## ఏడవ ఆధారం:

క్రీస్తుశకం రెండవ శతాబ్దానికి చెందిన వజీన్ వర్గానికి చెందినవారు యోహాను సువార్తను విశ్వసించేవారు కాదు. అదేవిధంగా యోహానుచే వ్రాయబడినట్లుగా చెప్పబడుతున్న రచనలన్నింటినీ వారు విశ్వసించేవారు కాదు.

**(అథఃసూచికలు)**

[143] ఫాస్టస్‌కు చెందిన ఈ వ్యాఖ్యను పాఠకులచే చదువబడుతున్న ఈ గ్రంథ రచయిత అయిన మౌలానా రహ్మతుల్లాహ్ కైరాన్వీ (ర) ‘ఇజాలతుష్షుకూక్’ అనే గ్రంథంలోని లార్డ్నర్ యొక్క ‘కితాబుల్ అస్‌నాద్’ ఆధారంగా ఉల్లేఖించారు.

[144] బహుశా ఎఫిసస్ **(Ephesus)** కావచ్చు.

## ఎనిమిదవ ఆధారం:

పాఠకులచే చదువబడుతున్న ఈ గ్రంథం యొక్క 2వ అధ్యాయంలోని లక్ష్యం-2 ద్వారా పాఠకులకు యోహాను సువార్త యొక్క 8వ అధ్యాయానికి చెందిన ప్రారంభపు 11 వాక్యాలను క్రైస్తవ పండితుల వర్గం తిరస్కరించిందనే విషయం తెలుస్తుంది. అలాగే పాఠకులకు త్వరలోనే ఈ వాక్యాలు సుర్యానీ అనువాదంలో లేవనే విషయమూ తెలుస్తుంది. ఇప్పుడు ఒకవేళ యోహాను సువార్త విశ్వసనీయత కొరకు ఏదయినా ఆధారం లభ్యమవుతున్నట్లయితే క్రైస్తవులకు చెందిన సత్యశోధకులయిన పండితులు, కొన్ని వర్గాలు ఏమయితే పేర్కొనడం జరిగిందో ఆ విధంగా పేర్కొనడం జరిగేది కాదు. కనుక సత్యశోధకులయిన స్టాన్‌లిన్ మరియు బర్‌తషీందర్ లు పేర్కొన్నదే సత్యం.

## తొమ్మిదవ ఆధారం:

బైబిల్ క్రొత్తనిబంధనకు చెందిన నాలుగు సువార్తలు క్రోడీకరించబడిన కాలంలో బలహీనమైన, అల్పమైన, నిరాధారమైన ఉల్లేఖనాలు వ్యాప్తిలో ఉండేవి. దీనినిబట్టి కూడా క్రైస్తవుల వద్ద ఈ గ్రంథాల విశ్వసనీయతకు సంబంధించి ఏ ఆధారమూ లేదనే వాదానికి మద్దతు లభిస్తోంది.

హోరన్ క్రీ.శ. 1822 లో ప్రచురించబడిన తన వ్యాఖ్యాన గ్రంథం యొక్క 4వ సంపుటి యొక్క 2వ ప్రకరణంలోని 2వ అధ్యాయంలో ఈ విధంగా పేర్కొన్నారు:

" మనకు చర్చి చరిత్రకారుల ద్వారా సువార్తల రచనాకాలపు స్థితిగతులకు సంబంధించి అందిన సమాచారం ఎంతో లోపభూయిష్టంగా, అనిర్దిష్టంగా ఉంది. దాని ద్వారా ఏదయినా నిర్దిష్ట అంశం వరకు మనం చేరుకోలేము. ఇక ప్రాచీన కాలానికి చెందిన పండితులు బలహీనమైన ఉల్లేఖనాలను ధృవీకరించారు. అలాగే వాటిని గ్రంథస్థం కావించారు. తరువాతి కాలంలో ప్రభవించిన ప్రజలు వారిచే వ్రాయబడిన విషయాలను వారి మీద గౌరవభావంతో స్వీకరించారు. ఆ విధంగా నిజమైన మరియు అసత్యమైన ఉల్లేఖనాలు ఒక లేఖకుని నుంచి మరొక లేఖకుని వరకు చేరుతూ వచ్చాయి. మరింత సుదీర్ఘకాలం గడచిపోయిన కారణంగా ఇప్పుడు వాటిని విమర్శించడం, ఏది నిజమైన ఉల్లేఖనమో, ఏది అసత్యమైన ఉల్లేఖనమో నిగ్గుతేల్చడం కూడా కష్టసాధ్యమయిపోయింది"

ఆ తర్వాత అదే సంపుటిలో ఆయన ఈ విధంగా పేర్కొన్నారు:

" మొదటి సువార్త క్రీ.శ. 37 లో లేదా క్రీ.శ. 38లో లేదా క్రీ.శ. 42 లో లేదా, క్రీ.శ.48 లో లేదా క్రీ.శ. 61 లో లేదా క్రీ.శ. 62 లో లేదా క్రీ.శ. 63 లో లేదా క్రీ.శ. 64 లో వ్రాయబడింది. రెండవ సువార్త క్రీ.శ. 56 , తరువాత క్రీ.శ. 65 వరకు గల కాలంలో ఏదో సమయంలో, బహుశా



క్రీ.శ. 60 లో లేదా క్రీ.శ. 63 లో వ్రాయబడింది. మూడవ సువార్త క్రీ.శ. 52 లో లేదా క్రీ.శ. 63 లో లేదా క్రీ.శ. 64 లో వ్రాయబడింది. నాల్గవ సువార్త క్రీ.శ. 68 లో లేదా క్రీ.శ. 69 లో లేదా క్రీ.శ. 70 లో లేదా క్రీ.శ. 89 లో లేదా క్రీ.శ. 98 లో వ్రాయబడింది "

# పత్రికలు, ప్రకటనలు (లేదా దర్శనములు)

'అపొస్తలుడైన పౌలు హెబ్రీయులకు వ్రాసిన పత్రిక', 'పేతురు వ్రాసిన రెండవ పత్రిక', 'యోహాను వ్రాసిన రెండవ పత్రిక', 'యోహాను వ్రాసిన మూడవ పత్రిక', 'యాకోబు వ్రాసిన పత్రిక', 'యూదా వ్రాసిన పత్రిక', 'యోహాను వ్రాసిన ప్రకటన గ్రంథము', 'యోహాను వ్రాసిన మొదటి పత్రిక' అనే గ్రంథాలకు చెందిన కొన్ని వాక్యాలు ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) ) యొక్క శిష్యుల వైపుకు ఆపాదించబడడమనేది నిరాధారమైనది. ఇవి క్రీ.శ. 363 వరకు సందేహాస్పదంగానే ఉండిపోయాయి. కొన్ని పేర్కొనబడిన వాక్యాలు తిరస్కరించబడినట్టివి, నేటివరకు సత్యశోధకుల వర్గం దృష్టిలో తప్పయినవి. ఈ విషయం గురించి పాఠకులకు ప్రస్తుతం వారిచే అధ్యయనం చేయబడుతున్న ఈ గ్రంథం యొక్క 2వ అధ్యాయపు లక్ష్యం-2 ద్వారా తెలిసిపోతుంది. ఈ వాక్యాలు సుర్యానీ అనువాదంలో ఎంతమాత్రం లేవు. అలాగే అరేబియాకు చెందిన చర్చీలన్నీ 'పేతురు వ్రాసిన రెండవ పత్రిక'ను, 'యోహాను వ్రాసిన రెండవ పత్రిక' ను మరియు 'యోహాను వ్రాసిన మూడవ పత్రిక' ను, 'యూదా వ్రాసిన పత్రిక ' ను, 'యోహాను వ్రాసిన ప్రకటన గ్రంథము' ను తిరస్కరించాయి. అదేవిధంగా వాటిని సుర్యానీ చర్చీలు ప్రారంభం నుంచి నేటివరకు తిరస్కరిస్తూనే వచ్చాయి. త్వరలోనే పాఠకుల ముందుకు రాబోయే ఉల్లేఖనాల ద్వారా వారికి ఈ విషయం విదితమవుతుంది.

హోరన్ క్రీ.శ. 1822 లో ప్రచురించబడిన తన వ్యాఖ్యాన గ్రంథం యొక్క 2వ సంపుటి లోని 206 వ పేజీలో మరియు 207 వ పేజీలో ఈవిధంగా పేర్కొన్నారు:

" సుర్యానీ అనువాదంలో 'పేతురు వ్రాసిన రెండవ పత్రిక', 'యూదా వ్రాసిన పత్రిక', 'యోహాను వ్రాసిన రెండవ పత్రిక', 'యోహాను వ్రాసిన మూడవ పత్రిక', 'యోహాను వ్రాసిన ప్రకటన గ్రంథము', 'యోహాను సువార్త' యొక్క 8వ అధ్యాయంలో 2వ వాక్యం నుంచి 11 వ వాక్యం వరకు మరియు 'యోహాను వ్రాసిన మొదటి పత్రిక' యొక్క 5 వ అధ్యాయపు 7 వ వాక్యం అనేవి కూడా లేవు "

సుర్యానీ బైబిల్ గ్రంథ అనువాదకుడు వాటిని తొలగించడానికి గల కారణమేమిటంటే ఆయన దృష్టిలో అవి నిరూపితమైన, విశ్వసనీయమైన విషయాలు కావు. అందుకే వార్డ్ కేథొలిక్ క్రీ.శ. 1841 లో ప్రచురించబడిన తన గ్రంథం యొక్క 37 వ పేజీలో ఈ విధంగా పేర్కొన్నారు:

" ప్రొటెస్టెంట్ వర్గానికి చెందిన మహా పండితుడయిన రాజర్స్ క్రింద పేర్కొనబడిన గ్రంథాలను అసత్యమయినవిగా భావించి వాటిని పవిత్ర గ్రంథాల నుంచి తొలగించిన తన వర్గానికి చెందిన ఎందరో పండితుల గురించి ప్రస్తావించాడు:

' అపొస్తలుడైన పౌలు హెబ్రీయులకు వ్రాసిన పత్రిక', 'యాకోబు వ్రాసిన పత్రిక', 'యోహాను వ్రాసిన రెండవ పత్రిక', 'యోహాను వ్రాసిన మూడవ పత్రిక', 'యూదా వ్రాసిన పత్రిక', 'యోహాను వ్రాసిన ప్రకటన గ్రంథము' "

ప్రొటెస్టెంట్ వర్గానికి చెందిన గొప్ప పండితుడిగా ప్రఖ్యాతి గాంచిన డాక్టర్ ఫిలిప్ ఈ విధంగా పేర్కొన్నారు:

" అన్ని గ్రంథాలూ యూసీబియస్ కాలం వరకు తప్పనిసరిగా ఆమోదించవలసిన గ్రంథాలుగా పరిగణించబడేవి కావు "

అలాగే క్రింద పేర్కొనబడిన విషయాన్ని ఆయన నొక్కి వక్కాణించారు:

" 'యాకోబు వ్రాసిన పత్రిక', 'పేతురు వ్రాసిన రెండవ పత్రిక', 'యోహాను వ్రాసిన రెండవ పత్రిక', 'యోహాను వ్రాసిన మూడవ పత్రిక' అనేవి ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా(అ)) శిష్యులచే వ్రాయబడినవి కావు. అలాగే 'అపొస్తలుడైన పౌలు హెబ్రీయులకు వ్రాసిన పత్రిక' సుదీర్ఘ కాలంగా తిరస్కరించబడిన స్థితిలోనే ఉండినది. అదేవిధంగా సుర్‌యానీ చర్చీలు 'పేతురు వ్రాసిన రెండవ పత్రిక', ' యోహాను వ్రాసిన రెండవ పత్రిక', 'యోహాను వ్రాసిన మూడవ పత్రిక', 'యూదా వ్రాసిన పత్రిక', 'ప్రకటనల గ్రంథము' అనే గ్రంథాలను తప్పనిసరిగా ఆమోదించవలసిన విశ్వసనీయమైన గ్రంథాలుగా అంగీకరించలేదు. అదేవిధంగా వాటిని అరేబియా కు చెందిన చర్చీలు కూడా తిరస్కరించాయి. అయినప్పటికీ మేము ఆమోదిస్తున్నాము"

లార్డ్‌నర్ తన వ్యాఖ్యాన గ్రంథం యొక్క 4వ సంపుటి యొక్క 175 వ పేజీలో ఈ విధంగా పేర్కొన్నారు:

"సరల్ మరియు యెరూషలేముకు చెందిన చర్చీలు తమ కాలంలో 'ప్రకటనల గ్రంథము' ను విశ్వసనీయమైన గ్రంథంగా ఆమోదించేవి కావు. అంతేగాకుండా ఈ గ్రంథం యొక్క పేరు కూడా ఆయన వ్రాసిన చట్టపరమైన జాబితాలో లేదు"

ఆ తర్వాత 323 వ పేజీలో ఆయన ఈ విధంగా పేర్కొన్నారు:

" యోహాను వ్రాసిన ప్రకటన గ్రంథము' ప్రాచీన సుర్‌యానీ బైబిల్ అనువాద గ్రంథంలో లేదు. అలాగే దానికి బారహీబరియూస్ లేదా యాకోబు ఏదయినా వ్యాఖ్యానాన్నీ అందించడం జరగలేదు. ఏబిడ్‌జసూ కూడా తన జాబితాలో 'పేతురు వ్రాసిన రెండవ పత్రిక', 'యోహాను వ్రాసిన రెండవ పత్రిక', 'యోహాను వ్రాసిన మూడవ పత్రిక', 'యూదా వ్రాసిన పత్రిక', 'యోహాను



వ్రాసిన ప్రకటన గ్రంథము' అనే గ్రంథాలను విడచిపెట్టడం జరిగింది. ఇతర సుర్‌యానీయుల అభిప్రాయం కూడా ఇదే. "

క్రీ.శ. 1844 లో ప్రచురించబడిన ' కేథొలిక్ హెరాల్డ్ ' యొక్క 7 వ సంపుటి లోని 206 వ పేజీలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది :

" రోజ్ తన పుస్తకం యొక్క 161 వ పేజీలో ' ప్రొటెస్టెంట్ వర్గానికి చెందిన ఎందరో సత్యశోధకులు 'యోహాను వ్రాసిన ప్రకటన గ్రంథము' ను తప్పనిసరిగా ఆమోదించవలసిన గ్రంథంగా విశ్వసించలేదు. అలాగే ప్రొబర్‌ఐవాల్డ్ పటిష్ఠమైన ఋజువు ద్వారా యోహాను సువార్త, యోహాను వ్రాసిన పత్రికలు, యోహాను వ్రాసిన ప్రకటన గ్రంథం అనేవి ఒకే రచయిత ద్వారా వ్రాయబడిన గ్రంథాలు ఎంతమాత్రం కాజాలవని నిరూపించారు"

యూసీబియూస్ తన చరిత్ర గ్రంథం నెం.7 యొక్క 25 వ అధ్యాయంలో ఈ విధంగా పేర్కొన్నారు:

" డియోఫీసీష్ ఈ విధంగా పేర్కొన్నారు: ప్రాచీన కాలానికి చెందిన పలువురు క్రైస్తవ పండితులు 'యోహాను వ్రాసిన ప్రకటన గ్రంథము' ను పరిశుద్ధ గ్రంథాల నుంచి (బైబిల్ నుంచి) తొలగించివేశారు. దానిని తిరస్కరించే విషయంలో తీవ్రస్థాయిలో వ్యవహరించారు. అలాగే 'ఇదంతా అర్థరహితమైన, అజ్ఞానంతో కూడిన పెద్ద పరదా. దానిని ఏసు శిష్యుడయిన యోహాను వైపుకు ఆపాదించడం తప్పు. దానిని రచించిన వ్యక్తి ఏసు శిష్యుడూ కాజాలడు, సజ్జనుడైన వ్యక్తీ కాజాలడు, ఏ క్రైస్తవుడూ కాజాలడు' అని పేర్కొన్నారు. దానిని యోహాను వైపుకు వాస్తవానికి అధార్మికుడయిన, నాస్తికుడయిన సరన్ థసన్ ఆపాదించడం జరిగింది. అయితే నాకు దానిని పరిశుద్ధ గ్రంథాల నుంచి తొలగించివేసే శక్తి లేదు. ఎందుకంటే ఎందరో సోదరులు దానిని గౌరవిస్తారు. ఇక నా వ్యక్తిగత విషయానికొస్తే ఇది దైవవాణిని గ్రహించిన ఏ వ్యక్తి ద్వారానో వ్రాయబడిందనే విషయాన్నయితే అంగీకరిస్తాను. అయితే ఆ వ్యక్తి ఏసు శిష్యుడని, జెబెదయి కుమారుడని, యాకోబు సోదరుడని, యోహాను సువార్తను వ్రాసిన వ్యక్తి అనే విషయాన్ని మాత్రం సులభంగా నేను అంగీకరించలేను. అయితే అందుకు విరుద్ధంగా జాతీయాలు మొదలయినవాటి ద్వారా ఆ వ్యక్తి ఏసు శిష్యుడు ఎంతమాత్రం కాజాలడని, అలాగే దీనిని వ్రాసిన వ్యక్తి 'అపొస్తలుల కార్యములు' లో ప్రస్తావించబడిన యోహాను కూడా కాకపోవచ్చు. ఎందుకంటే అతడు ఆసియా ఖండానికి వచ్చినట్లుగా నిరూపితం కాలేదు. ఈ యోహాను ఆసియా ఖండానికి చెందిన మరొక వ్యక్తి. అఫ్‌సోస్ నగరంలో రెండు సమాధులు ఉన్నాయి. వాటి మీద యోహాను పేరు వ్రాయబడి ఉంది. వ్రాయబడిన విషయం మరియు అంశం ద్వారా యోహాను సువార్తకు సంబంధించిన యోహాను ఈ గ్రంథాన్ని వ్రాయడం జరగలేదని విదితమవుతుంది. ఎందుకంటే 'యోహాను సువార్త' మరియు యోహాను వ్రాసిన పత్రికలలో వ్రాయబడిన విషయం గ్రీకుల శైలి ప్రకారం ఎంతో స్వచ్ఛంగా

ఉంది. అందులో కఠినమైన పదాలు అధికంగా ఉపయోగించబడడమనేది జరగలేదు. అయితే అందుకు విరుద్ధంగా 'యోహాను వ్రాసిన ప్రకటన గ్రంథము' లో పేర్కొనబడిన విషయాలు గ్రీకు జాతీయాలకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. అందులో అపరిచిత శైలులు ఉపయోగించబడ్డాయి. అలాగే గమనించదగిన విషయమేమిటంటే ఏసు శిష్యుడు ఎక్కడా తన పేరును వెల్లడించడం జరగలేదు, సువార్తలోనూ వెల్లడించడం జరగలేదు, బహిరంగ పత్రికలోనూ వెల్లడించడం జరగలేదు. ఆయన తనను తాను 'ఉత్తమ పురుష' ('నేను' అనే పదం ద్వారా) లేదా 'ప్రథమ పురుష' ('ఆయన' లేదా 'అతడు' అనే పదం ద్వారా) ద్వారా వ్యక్తీకరిస్తారు. అలాగే ఉద్దేశ్యాన్ని ఎటువంటి ఉపోద్ఘాతమూ లేకుండానే మొదలుపెడతారు. అయితే అందుకు విరుద్ధంగా ఈ వ్యక్తి ('యోహాను వ్రాసిన ప్రకటన గ్రంథము' రచయిత) 'యోహాను వ్రాసిన ప్రకటన గ్రంథము' యొక్క మొదటి అధ్యాయంలో ఈ విధంగా పేర్కొన్నాడు: ' యేసుక్రీస్తు తన దాసులకు కనుపరచుటకు దేవుడాయనకుఅనుగ్రహించిన ప్రత్యక్షత. [145] ఈ సంగతులు త్వరలో సంభవింపనైయున్నవి; ఆయన తన దూత ద్వారా వర్తమానము పంపి తన దాసుడైన యోహానుకు వాటిని సూచించెను''

ఇక నాల్గవ వాక్యంలో " యోహాను ఆసియలో ఉన్న యేడు సంఘములకు శుభమని చెప్పి వ్రాయునది'' అని పేర్కొనబడి ఉంది. 9వ వాక్యంలో " మీ సహోదరుడను, యేసును బట్టి కలుగు శ్రమలోను రాజ్యములోను సహనములోను పాలివాడనునైన యోహానను నేను'' అని పేర్కొనబడింది.

22 వ అధ్యాయం యొక్క 8వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది : " యోహానను నేను ఈ సంగతులను విననవాడను చూచినవాడను''

ఈ వాక్యాలలో వీటిని వ్రాసిన వ్యక్తి ఏసు శిష్యుల విధానానికి విరుద్ధంగా తన పేరును వెల్లడించడం జరిగింది.[146]

**(అధఃసూచికలు)**

[145] ఇది 'యోహాను వ్రాసిన ప్రకటన గ్రంథము' యొక్క మొదటి అధ్యాయపు మొదటి వాక్యం.

[146] ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) శిష్యుడయిన యోహాను శైలి ఏమిటంటే ఆయన తన పేరును ఎక్కడా వెల్లడించరు. ఈ విషయాన్ని మనం 'యోహాను సువార్త' లోనూ యోహాను వ్రాసిన పత్రికలోనూ పరిశీలించగలము. అయితే ఈ వ్యక్తి ('యోహాను వ్రాసిన ప్రకటన గ్రంథము' యొక్క రచయిత) తన పేరును వెల్లడిస్తున్నాడు. దీనినిబట్టి ఈ యోహాను 'యోహాను సువార్త' కు చెందిన యోహాను కాడని, మరొక వ్యక్తి అని స్పష్టమవుతోంది.



"ఈ సందర్భంలో ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) శిష్యుడు తన సహజమైన అలవాటుకు భిన్నంగా తనను తాను పరిచయం చేసుకునే ఉద్దేశ్యంతో తన పేరును వెల్లడించడం జరిగింది'' అని సమాధానమివ్వడం ఎంతమాత్రం ఆమోదయోగ్యమైనది కాదు. ఎందుకంటే ఒకవేళ తనను తాను పరిచయం చేసుకునే ఉద్దేశ్యమే ఉన్నట్లయితే ఆయన తన పేరుతో పాటు తనను విశిష్టమైన రీతిలో, నిర్దిష్టమైన రీతిలో గుర్తింపజేసే ఏదయినా విశేష్య సూచక పదబంధాన్ని జోడించడం జరిగేది. ఉదాహరణకు 'జెబెదయి కుమారుడయిన యోహాను' అని గానీ లేదా 'యాకోబు సోదరుడయిన యోహాను' అని గానీ లేదా ' తన ప్రభువుకు ప్రియభక్తుడయిన యోహాను' మొదలయిన పదబంధాలతో ఆయన తనను తాను పరిచయం చేసుకొని ఉండేవారు. అయితే ఏదయినా ప్రత్యేకతను వెల్లడించే పదబంధాన్ని ఉపయోగించకుండా సాధారణమైన పదబంధాన్ని, అనగా 'మీ సోదరుడను' లేదా 'మీ శ్రమలో పాలివాడను' లేదా ' సహనంలో పాలివాడను' అనే పదబంధాల ద్వారా ఆ వ్యక్తి తనను తాను పరిచయం చేసుకోవడం జరిగింది. మేము ఈ విషయాలను అపహాస్య ధోరణితో పేర్కొనడం లేదు. మా లక్ష్యం ఈ ఇద్దరు వ్యక్తుల రచనలకు, సంభాషణా శైలులకు మధ్య ఉన్న భేదాన్ని వెల్లడించడమే.

అలాగే యూసీబియూస్ తన చరిత్ర గ్రంథం నెం. 3 యొక్క 3వ అధ్యాయంలో ఈ విధంగా స్పష్టీకరించారు:

" పేతురు వ్రాసిన మొదటి పత్రిక సత్యమైనది. అయితే 'పేతురు వ్రాసిన రెండవ పత్రిక' మాత్రం ఏ కాలంలోనూ పరిశుద్ధ గ్రంథాలలో చోటుచేసుకోలేకపోయింది. అయితే పౌలు వ్రాసిన 14 పత్రికలు మాత్రం తప్పకుండా పఠించబడుతూ ఉంటాయి. కొంతమంది 'పౌలు హెబ్రీయులకు వ్రాసిన పత్రిక' ను పరిశుద్ధ గ్రంథాల నుంచి తొలగించివేశారు''

ఆ తర్వాత పైన పేర్కొనబడిన గ్రంథం యొక్క 25 వ అధ్యాయంలో యూసీబియుస్ ఈ విధంగా స్పష్టీకరించారు:

" 'యాకోబు వ్రాసిన పత్రిక', 'యూదా వ్రాసిన పత్రిక', 'పేతురు వ్రాసిన రెండవ పత్రిక', 'యోహాను వ్రాసిన రెండవ పత్రిక', 'యోహాను వ్రాసిన మూడవ పత్రిక' అనేవి సువార్తల్లో పేర్కొనబడినవారిచే వ్రాయబడ్డాయా లేక అవే పేర్లను కలిగియున్న ఇతర వ్యక్తులచే వ్రాయబడ్డాయా అనే విషయంలో ప్రజల్లో అభిప్రాయభేదాలున్నాయి. ' పౌలు కార్యములు', 'బాష్టర్', 'పేతురు దర్శనముల గ్రంథము', 'బర్నియా పత్రిక', 'అనిస్తీతూషన్' అనే పేర్లతో వ్యవహరించబడే గ్రంథాలు కల్పిత గ్రంథాలు. ఒకవేళ నిరూపితమయినట్లయితే యోహాను వ్రాసిన ప్రకటన గ్రంథాన్ని కూడా అటువంటి గ్రంథంగానే (అవిశ్వసనీయమైన గ్రంథంగా) పరిగణించాలి.''

అలాగే ఆయన తన చరిత్ర గ్రంథం నెం.6 యొక్క 25 వ అధ్యాయంలో 'పౌలు

హెబ్రీయులకు వ్రాసిన పత్రిక’ కు సంబంధించి ఆరీజన్ చేసిన వ్యాఖ్యను ఈ విధంగా ఉల్లేఖించారు:

“ ప్రజలలో వ్యాప్తిలో ఉన్న విషయమేమిటంటే కొంతమంది దృష్టిలో ‘పౌలు హెబ్రీయులకు వ్రాసిన పత్రిక’ ను రోముకు చెందిన బిషప్ క్లేమంట్ [147] వ్రాశారు. కొంతమంది దానిని లూకా అనువదించారని భావిస్తారు”

క్రీ.శ. 178 లో జీవించియున్న అర్‌నీస్ పషప్‌లీస్, క్రీ.శ. 220 లో జీవించియున్న హిప్ పోలీతుస్, రోముకు చెందిన పెద్ద ఫాదర్ గా ప్రసిద్ధులయిన, క్రీ.శ. 251 లో జీవించియున్న నోతీస్ దీనిని (పౌలు హెబ్రీయులకు వ్రాసిన పత్రికను) విశ్వసనీయమైన మూలగ్రంథంగా ఆమోదించలేదు. కార్థీజ్ కు చెందిన పెద్ద ఫాదర్ గా ప్రసిద్ధులయిన, క్రీ.శ. 200 లో మరణించిన టర్‌టూలిన్ [148] ‘ఇది బర్నియా వ్రాసిన పత్రిక’ అని పేర్కొన్నారు. రోముకు చెందిన ఫాదర్ అయిన, క్రీ.శ. 212 లో మరణించిన కీస్ పౌలు వ్రాసిన పత్రికల సంఖ్య 13 అని పేర్కొంటూ ‘పౌలు హెబ్రీయులకు వ్రాసిన పత్రిక’ ను లెక్కలోకి తీసుకోలేదు. కార్థీజ్ కుచెందిన ఫాదర్ అయిన, క్రీ.శ. 248 లో మరణించిన సాటీపరన్ కూడా ‘పౌలు హెబ్రీయులకు వ్రాసిన పత్రిక’ గురించి ప్రస్తావించరు. ఇక సుర్‌యానీ[149] చర్చీలయితే నేటివరకు ‘పేతురు వ్రాసిన రెండవ పత్రిక’, ‘యోహాను వ్రాసిన రెండవ పత్రిక’, ‘యోహాను వ్రాసిన మూడవ పత్రిక’ అనే గ్రంథాలను విశ్వసనీయమైనవిగా ఆమోదించడం లేదు. స్కాల్చర్ ఈ విధంగా పేర్కొంటారు: “ ‘పేతురు వ్రాసిన రెండవ పత్రిక’ అనే పుస్తకాన్ని రచించిన వ్యక్తి తన సమయాన్ని వృధా చేశాడు”

యూసీబియుస్ తన చరిత్ర గ్రంథం నెం. 2 యొక్క23 వ అధ్యాయంలో ‘యాకోబు వ్రాసిన పత్రిక’ గురించి ఈ విధంగా పేర్కొన్నారు:

“ ఈ పత్రిక కల్పితమైనది అనే అభిప్రాయముంది. అయితే ప్రాచీన కాలానికి చెందిన ఎందరో క్రైస్తవ పండితులు దీని గురించి ప్రస్తావించారు. అదే అభిప్రాయాన్ని ‘యూదా వ్రాసిన పత్రిక’ విషయంలోనూ మేము కలిగియున్నాము. (అనగా అది కల్పితమైనదని అభిప్రాయపడుతున్నాము) కానీ ఎన్నో చర్చీలలో దాని ప్రకారం కూడా ఆచరణ కొనసాగుతోంది”

**(అథఃసూచికలు)**

147 **Clement of Rome** ( క్రీ.శ. 150 లో జననం, క్రీ.శ. 220 లో మరణం )

148 **Tertullian** అనే వ్యక్తే మొట్టమొదటగా క్రైస్తవ వ్రాత ప్రతులకు ‘క్రొత్త నిబంధన గ్రంథము’ అని నామకరణం చేశాడు. అలాగే దానికి పాతనిబంధనకు చెందిన గ్రంథాల వలె దైవగ్రంథ స్థాయిని ఆపాదించాడు. (‘బైబిల్ హ్యాండ్‌బుక్’ అనే పుస్తకం ఆధారంగా)



క్రీ.శ. 1850 లో ప్రచురించబడిన ‘బైబిల్ చరిత్ర’ (హిస్టరీ ఆఫ్ బైబిల్) అనే గ్రంథంలో ఈ విధంగా పేర్కొనబడింది:

“క్రోటీస్ ‘ ఈ పత్రిక, అనగా ‘యూదా వ్రాసిన పత్రిక’ గా పిలువబడుతున్న పత్రిక ఎడ్రిన్ పరిపాలనా కాలంలో యెరూషలేముకు చెందిన పదిహేనవ ఫాదర్ (యాజకుడు) అయిన వ్యక్తి వ్రాసినట్టిది’ అని పేర్కొన్నారు”

అలాగే యూసీబియుస్ తన చరిత్ర గ్రంథం నెం.6 యొక్క 25 వ అధ్యాయంలో ఈ విధంగా పేర్కొన్నారు:

“ ఆరిజన్ యోహాను సువార్తకు తాను వ్రాసిన వ్యాఖ్యాన గ్రంథం యొక్క 5 వ సంపుటిలో ఈ విధంగా పేర్కొన్నారు : ‘పౌలు అన్ని చర్చిలకూ ఏమీ వ్రాయలేదు. ఒకవేళ ఏ చర్చికయినా ఏమయినా వ్రాసినట్లుగా పేర్కొనవలసి వస్తే కేవలం మూడుగు నాలుగు పంక్తులు మాత్రమే వ్రాసారని పేర్కొనవలసి ఉంటుంది. ”

ఆరిజన్ వ్యాఖ్య ప్రకారం పౌలు వైపుకు ఆపాదించబడే (పౌలు చే వ్రాయబడినట్లుగా వ్యాప్తిలో ఉన్న) పత్రికలన్నీ ఆయనచే వ్రాయబడినవి కావు. అవన్నీ కల్పితమైనవి. వాటిని ఆయన వైపుకు ఆపాదించడం జరిగింది. బహుశా మూడు నాలుగు పంక్తులు పౌలు పలికిన మాటలు కూడా ఈ పత్రికలలో ఉండేందుకు అవకాశముంది. ఈ వ్యాఖ్యలను పరిశీలించిన తర్వాత పాఠకులకు

“ ఈ క్రొత్తనిబంధన గ్రంథాన్ని ఏసు (దైవప్రవక్త హజ్‌రత్ ఈసా (అ)) వ్రాయలేదు, ఆయన శిష్యులూ వ్రాయలేదు. ఒక అనామక వ్యక్తి దానిని వ్రాసి ఏసు శిష్యులు వైపుకు మరియు వారి సహచరుల వైపుకు ఆపాదించడం జరిగింది”

అనే ఫాస్టస్ వ్యాఖ్య పూర్తిగా సత్యమని విదితమయిపోతుంది. ఇందులో ఎటువంటి సందేహానికీ ఎటువంటి ఆస్కారమూ లేదు. ఈ విషయంలో ఆయన అభిప్రాయం ఖచ్చితంగా సరియైనది. ఇంతకుముందే ఈ ఆరు పత్రికలు మరియు ‘యోహాను వ్రాసిన ప్రకటన గ్రంథము’ క్రీ.శ. 363 వరకు సందేహాస్పదమైనవిగా, తిరస్కరించబడినవిగా పరిగణించబడుతూ వచ్చాయనే

**(అథఃసూచికలు)**

149 ‘సుర్‌యానీ’ అనేది వాస్తవానికి ఒక భాష పేరు. ఆ భాషను మాట్లాడే క్రైస్తవులు దాదాపు క్రీస్తుశకం ఐదవ శతాబ్దంలో అంతియొకయ చర్చి నుంచి దైవప్రవక్త హజ్‌రత్ ఈసా (అ) (ఏసు) గురించిన వాదోపవాదాలలో నిమగ్నులయి, విభేదాలకు గురయి వేరయిపోయారు. అందుకే వారిచే నెలకొల్పబడిన చర్చీలను ‘సుర్‌యానీ చర్చీలు’ అని పేర్కొంటారు

విషయం పేర్కొనబడింది. అలాగే వాటిని నాయిస్ లో క్రీ.శ. 325 లో నిర్వహించబడిన బ్రహ్మాండమైన క్రైస్తవుల మహాసభ కూడా ఆమోదించలేదు. అయితే క్రీ.శ. 364 లో నిర్వహించబడిన లూడీషియా మహాసభ మాత్రం ఈ 6 పత్రికలను ఆమోదిస్తూ తీర్మానం జారీ చేసింది. అయితే 'యోహాను వ్రాసిన ప్రకటన గ్రంథము' పేరుతో పిలువబడుతున్న గ్రంథం ఆ సభలోనూ సందేహాస్పదమైన, తిరస్కరించదగిన గ్రంథంగానే పరిగణించబడింది. అది క్రీ.శ. 397 లో నిర్వహించబడిన కార్థేజ్ మహాసభలో ఆమోదించబడింది. ఈ రెండు సభలు ఆ గ్రంథాలను ఆమోదించడమనేది ఆధారం కాజాలదు. మొదటి కారణమేమిటంటే ప్రతి సభకు చెందిన క్రైస్తవ పండితులు **Judith** గ్రంథాన్ని ఆమోదించారు. లూడీషియా సభ 'ఎస్తేరు' గ్రంథానికి చెందిన 10 వ అధ్యాయంలోని 10 వాక్యాలను, 10 వ అధ్యాయం తరువాతి 6 అధ్యాయాలను ఆమోదించింది. ఇక కార్థేజ్ సభలో పాల్గొన్న క్రైస్తవ పండితులు 'సొలొమోను జ్ఞానము' గ్రంథాన్ని, 'తూబియా' గ్రంథాన్ని, 'బారూకు' గ్రంథాన్ని, 'చర్చి హితోపదేశాలు' గ్రంథాన్ని మరియు మకాబీయుల గ్రంథాన్ని ఆమోదించారు. తర్వాత నిర్వహించబడిన మూడు సభలూ ఈ గ్రంథాల విషయంలో వారి తీర్పును ఆమోదించారు.

ఒకవేళ వారి తీర్పు లేదా నిర్ణయం ఆధారం ప్రాతిపదికన వెలువడి ఉన్నట్లయితే ఆ గ్రంథాలన్నింటినీ విశ్వసనీయమైన గ్రంథాలుగా ఆమోదించడం తప్పనిసరి అవుతుంది. ఒకవేళ వారి తీర్పు నిరాధారమైనదయితే (సత్యం కూడా అదే) ఆ గ్రంథాలన్నింటినీ నిరాకరించడం తప్పనిసరి. అయితే విచిత్రమైన విషయమేమిటంటే ప్రొటెస్టెంట్ వర్గం ఆ 6 పత్రికలు మరియు యోహాను వ్రాసిన ప్రకటన గ్రంథం విషయంలో వారి తీర్పును ఆమోదించింది. అయితే ఇతర గ్రంథాల విషయంలో వారి తీర్పును నిరాకరిస్తుంది, ముఖ్యంగా **Judith** గ్రంథం విషయంలో. వాస్తవానికి దానిని ఆమోదించే విషయంలో అన్ని క్రైస్తవ సభలూ సంపూర్ణంగా ఏకీభవించాయి.

ఎస్తేరు గ్రంథం విషయంలోనే కాకుండా తిరస్కరించబడిన ఇతర గ్రంథాల విషయంలో ' వాటి మూలం అంతరించిపోయింది' అనే వారి సాకు ఎంతమాత్రం ప్రయోజనదాయకం కాజాలదు. ఎందుకంటే జేరోమ్ తనకు **Judith** గ్రంథం యొక్క మూలప్రతి, 'తూబియా' గ్రంథానికి మూలం డీక్ భాషలో, 'మకాబీయులు మొదటి గ్రంథము' యొక్క మూలప్రతి మరియు 'చర్చి హితోపదేశాలు' యొక్క మూలప్రతి హెబ్రూ భాషలో లభ్యమయినట్లుగా, ఈ గ్రంథాలను ఆ మూలప్రతుల ద్వారానే అనువదించడం జరిగిందని పేర్కొన్నారు. కనుక వారు జేరోమ్ కు లభ్యమయిన ఆ గ్రంథాలకు చెందిన మూలప్రతులను ఆమోదించడం తప్పనిసరి. అదేవిధంగా వారు మత్తయి సువార్తను ఆమోదించకూడదు. ఎందుకంటే దానికి చెందిన మూలప్రతి కూడా కనుమరుగయిపోయింది.

ఇక రెండవ కారణమేమిటంటే హోరన్ అంగీకారం ద్వారా ప్రాచీన కాలానికి చెందిన



క్రైస్తవ పండితులు ఉల్లేఖనాలను విమర్శనాత్మక దృష్టితో విశ్లేషించి వాటి ప్రామాణికతను నిగ్గుతేల్చేవారు కాదని, వారు నిరాధారమైన, బలహీనమైన ఉల్లేఖనాలను సైతం విశ్వసించేవారని, ఆమోదించేవారని, గ్రంథస్థం కావించేవారని, వారి తరువాతి కాలంలో ప్రభవించే ప్రజలు వారిని అనుసరించేవారని నిరూపితమయింది. కనుక నిశ్చయంగా ఆ సభల్లో పాల్గొన్న క్రైస్తవ పండితులకు కూడా ఆ గ్రంథాలకు చెందిన పలు ఉల్లేఖనాలు తప్పకుండా చేరి ఉంటాయి. అలాగే వారు శతాబ్దాలుగా తిరస్కరించబడిన స్థితిలో ఉన్న తర్వాత వాటిని ఆమోదించారు.

మూడవ కారణమేమిటంటే క్రైస్తవుల దృష్టిలో పరిశుద్ధ గ్రంథాల స్థాయి శాసనాలు మరియు రాజ్య నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్ల వంటిది. క్రింద పేర్కొనబడిన విషయాలను అధ్యయనం చేయండి.

## పరిశుద్ధ గ్రంథాల స్థాయి శాసనాలు మరియు ఏర్పాట్ల వంటిది

(1) బైబిల్ గ్రీకు అనువాద గ్రంథం క్రైస్తవ పండితుల దృష్టిలో ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) శిష్యుల కాలం నుంచి క్రీస్తుశకం పదిహేనవ శతాబ్దం వరకు విశ్వసనీయమైనదిగా పరిగణించబడుతూ వచ్చింది. హెబ్రూ అనువాద గ్రంథాలు ప్రక్షిప్తాలకు (మార్పులూచేర్పులకు) గురయ్యాయని, గ్రీకు అనువాదమే సరియైనదని వారు విశ్వసించేవారు. తర్వాత పరిస్థితి పూర్తిగా తారుమారయింది. ప్రక్షిప్తాలకు గురయినదానిని సరియైనదిగా, సరియైన స్థితిలో ఉన్న గ్రంథాన్ని ప్రక్షిప్తాలకు గురయినదిగా, తప్పుడు గ్రంథంగా తీర్మానించివేశారు. దీనినిబట్టి వారికి చెందిన పెద్దల, పండితుల అజ్ఞానం తేటతెల్లమవుతోంది.

(2) దానియేలు గ్రంథము ప్రాచీన కాలానికి చెందిన క్రైస్తవ పండితుల దృష్టిలో గ్రీకు అనువాదం ప్రకారం సరియైనది. అయితే ఆరిజన్ అది తప్పులతో కూడుకొని ఉన్నదని తీర్మానించినప్పుడు అందరూ దానిని వదిలివేసి థియోడోషన్ [150] అనువదించిన గ్రంథాన్ని స్వీకరించారు.

(3) అరస్తీస్ పత్రిక క్రీస్తుశకం పదహారవ శతాబ్దం వరకు ఆమోదించబడిన గ్రంథంగా కొనసాగుతూవచ్చింది. అయితే పదిహేడవ శతాబ్దంలో దానిపై అభ్యంతరాలు వెలువడ్డాయి.

---

(అథఃసూచికలు)

[150] థియోడోషన్ **Theodotion** ఒక హెబ్రూ పండితుడు. ఆయన క్రీస్తుశకం రెండవ శతాబ్దంలో వ్యాప్తిలో ఉన్న హెబ్రూ మూలప్రతి ఆధారంగా ఒక అనువాద గ్రంథాన్ని రచించాడు. ఈ అనువాదం గ్రంథం హెఫ్తాదీ అనువాదం తర్వాత మొదటి అనువాద గ్రంథం.

ప్రొటెస్టెంట్ వర్గానికి చెందిన క్రైస్తవ పండితులందరి దృష్టిలో అది అసత్యమైనదిగా నిర్ధారించబడింది.

**(4)** బైబిల్ లాటిన్ అనువాద గ్రంథం కేథొలిక్ వర్గం దృష్టిలో విశ్వసనీయమైనదయితే ప్రొటెస్టెంట్ వర్గం దృష్టిలో అవిశ్వసనీయమైనది, ప్రక్షిప్తాలకు గురయినట్టిది.

**(5)** 'ఆదికాండము యొక్క చిన్న గ్రంథము' క్రీస్తుశకం పదిహేనవ శతాబ్దం వరకు విశ్వసనీయమైనదిగా, సరియైనదిగా పరిగణించబడేది. తర్వాత అదే గ్రంథం క్రీస్తుశకం పదహారవ శతాబ్దంలో తప్పయినదిగా, కల్పితమైనదిగా తీర్మానించబడింది.

**(6)** 'ఎజ్రా మూడవ గ్రంథము' ను గ్రీకు చర్చి నేటివరకు ఆమోదిస్తూనే వస్తోంది. అయితే ప్రొటెస్టెంట్ వర్గం మరియు కేథొలిక్ వర్గం మాత్రం దానిని తిరస్కరించబడిన గ్రంథంగా నిర్ధారిస్తూ వస్తున్నాయి. సొలొమోను యొక్క కీర్తనల గ్రంథాన్ని ( దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) యొక్క జబూర్ గ్రంథము) ప్రాచీన కాలానికి చెందిన క్రైస్తవ పండితులు ఆమోదించేవారు. అలాగే వారి పరిశుద్ధ గ్రంథాలలో అది వ్రాయబడేది. ఇంకా చెప్పాలంటే నేటివరకు కోడెక్స్ అస్కందరియానూస్[151] ప్రతిలో ఈ గ్రంథం చోటుచేసుకొని ఉంది. అయితే నేటికాలంలో అది కల్పితమైనదిగా పరిగణించబడుతోంది. ఇన్షా అల్లాహ్ (అల్లాహ్ చిత్తమయితే) క్రైస్తవులు తమ గ్రంథాలన్నీ కల్పితమైనవని క్రమక్రమంగా అవగతం చేసుకుంటారని ఆశిస్తున్నాము. సునిశిత పరిశీలనా దృష్టితో, పరిశోధనాత్మక దృక్పథంతో లోతయిన చారిత్రక అధ్యయనం ద్వారానే ఈ విషయానికి సంబంధించిన సత్యాసత్యాలను అవగతం చేసుకోవడం సాధ్యపడుతుంది.

ఈ సుదీర్ఘ చర్చ ద్వారా క్రైస్తవుల వద్ద పాతనిబంధనకు చెందిన లేదా క్రొత్తనిబంధనకు చెందిన గ్రంథాల విశ్వసనీయతకు సంబంధించి మూలానికి సమీప ఆధారమేదీ లేదని, ఎప్పుడయినా ఈ విషయంలో తీవ్రస్థాయిలో వారిని ప్రశ్నించినప్పుడు వారు ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా(అ)) పాతనిబంధనకు చెందిన గ్రంథాలు సత్యమయినవనే విషయానికి సాక్ష్యమిచ్చారని పేర్కొంటారని పాఠకులకు స్పష్టమయిపోయి ఉంటుంది. ఆ సాక్ష్యం యొక్క నిజమైన స్థాయి ఏమిటో, దాని వాస్తవికత ఏమిటో ఇన్షా అల్లాహ్ (అల్లాహ్ చిత్తమయితే) ఇదే గ్రంథం యొక్క రెండవ అధ్యాయంలో పొరపాటు-2 కు ఇవ్వబడిన సమాధానం ద్వారా సవివరంగా స్పష్టమవుతుంది.

**(అథఃసూచికలు)**

[151] కోడెక్స్ **(CODEX)** అని ఇంగ్లిష్ ప్రతిని పిలుస్తారు. అస్కందరియానూస్ ఉల్లేఖనం ప్రకారం ఈ ప్రతి 'కోడెక్స్ అస్కందరియహ్' అని పిలువబడుతుంది. బ్రిటన్ కు చెందిన మ్యూజియం లో ఇది ఉంది. ('హమారీ కుతుబె ముఖద్దసహ్' ('మన పరిశుద్ధ గ్రంథాలు', పేజీలు: 34, 35 )



# రెండవ ప్రకరణం

# బైబిల్ వైరుధ్యాలతోనూ, తప్పులతోనూ నిండియున్నది

## వైరుధ్యాలు [152]

**వలౌ కాన మిన్ ఇన్ది గైరిల్లాహి లవజదూ ఫీహిఖ్తిలాఫన్ కసీరా**

## మొదటి వైరుధ్యం:

బైబిల్ పాతనిబంధన గ్రంథంలోని 'యెహెజ్కేలు' [153]గ్రంథం యొక్క 45వ మరియు 46 వ అధ్యాయాలను 'సంఖ్యాకాండము' యొక్క 28వ మరియు 29వ అధ్యాయాలతో పోల్చి అధ్యయనం చేసిన వ్యక్తి రెండింటిలో పేర్కొనబడిన ఆదేశాలలో స్పష్టమైన వైరుధ్యాన్ని గమనించగలడు.

## రెండవ వైరుధ్యం:

బైబిల్ పాతనిబంధన గ్రంథంలోని 'యెహోషువ' గ్రంథం యొక్క 13వ మరియు 'ద్వితీయోపదేశ కాండము' యొక్క 2వ అధ్యాయంలోనూ గాదు గోత్రానికి చెందినవారి వారసత్వపు ఆస్తికి సంబంధించి పేర్కొనబడిన వివరణల్లో స్పష్టమైన వైరుధ్యముంది. వాటిలో ఒక వివరణ మాత్రం తప్పనిసరిగా తప్పుడు వివరణ. ఈ విషయం పాఠకులకు ఇదే గ్రంథంలో 'యెహోషువ గ్రంథం స్థాయి' అనే మకుటంతో పేర్కొనబడిన అంశం క్రింద 'నాల్గవ కారణం' పేరుతో పేర్కొనబడిన విషయం ద్వారా, 107వ అథఃసూచిక ద్వారా ఇంతకుముందే విదితమయింది.

**(అథఃసూచికలు)**

[152] ఈ ప్రకరణంలో ఈ గ్రంథ రచయిత అయిన హజ్రత్ మౌలానా రహ్మతుల్లాహ్ కైరాన్వీ (ర) 124 స్పష్టమైన వైరుధ్యాల గురించి పేర్కొన్నారు. పాఠకుల ముందుకు అవన్నీ ఒకదాని తర్వాత మరొకటి క్రమానుగతంగా రాబోతున్నాయి.

[153] ఈ రెండు చోట్ల ఖుర్బానీ (దేవునికి అర్పించే జంతుబలి) కు సంబంధించిన ఆదేశాలు పేర్కొనబడి ఉన్నాయి. అయితే వాటికి సంబంధించిన వివరణల్లో వైరుధ్యముంది.

## మూడవ వైరుధ్యం:

బెన్యామీను సంతానానికి సంబంధించి 'దినవృత్తాంతములు మొదటి గ్రంథము' యొక్క 7వ మరియు 8వ అధ్యాయాలలో పేర్కొనబడిన విషయానికి, 'ఆదికాండము' యొక్క 46 వ అధ్యాయంలో పేర్కొనబడిన విషయానికి నడుమ వైరుధ్యముంది. యూదులు మరియు క్రైస్తవులకు చెందిన పండితులు 'దినవృత్తాంతములు మొదటి గ్రంథము' లో పేర్కొనబడిన విషయం తప్పని అంగీకరించారు. ఈ విషయం ఇదే గ్రంథం యొక్క రెండవ అధ్యాయంలోని లక్ష్యం-2 ద్వారా పాఠకులకు తెలుస్తుంది.[154]

## నాల్గవ వైరుధ్యం- ఆడమ్ క్లార్క్ అంగీకారం:

'దినవృత్తాంతములు మొదటి గ్రంథము' యొక్క 8వ అధ్యాయంలో 29వ వాక్యం నుంచి 38వ వాక్యం వరకు పేర్కొనబడిన విషయానికి, 9వ అధ్యాయంలో 35వ వాక్యం నుంచి 44 వ వాక్యం వరకు పేర్కొనబడిన విషయానికి నడుమ పేర్ల వివరణలో వైరుధ్యముంది.

ఆడమ్ క్లార్క్ తన వ్యాఖ్యాన గ్రంథపు 2 వ సంపుటిలో ఈ విధంగా పేర్కొన్నారు:

" యూదు పండితులు ఎజ్రా (దైవప్రవక్త హజ్రత్ ఉజైర్ (అ)) కు రెండు పుస్తకాలు లభ్యమయ్యాయని, వాటిలో ఈ వాక్యాలు పేర్ల విషయంలో వైరుధ్యంతో పాటు పేర్కొనబడి ఉన్నాయని, ఆయన ఆ రెండింటిలో ఉత్తమమైన వివరణ ఏదో కనుగొనలేకపోయారని, కనుక ఆయన రెండింటినీ ఉల్లేఖించారని వాదిస్తారు.''

**(అథఃసూచికలు)**

154 **" బెన్యామీను కుమారులు ముగ్గురు; బెల బేకరు యెదీయవేలు."**

('దినవృత్తాంతములు మొదటి గ్రంథం', 7 : 6 )

**" బెన్యామీను కనిన కుమారులలో బెల అనువాడు జేష్ఠుడు, రెండవవాడు అష్బేలు, మూడవవాడు అహరహు, నాల్గవవాడు నోహా, అయిదవవాడు రాపా."**

('దినవృత్తాంతములు మొదటి గ్రంథం', 8 : 1 )

**" బెన్యామీను కుమారులైన బెల బేకెరు అష్బేలు గెరా నయమాను ఏహీ రోషు ముప్పీము హుప్పీము ఆర్దు."** ('ఆదికాండము', 46 : 21 ) (ఈ వచనం ద్వారా బెన్యామీను కుమారుల సంఖ్య పది అని తెలుస్తుంది)



'దినవృత్తాంతములు మొదటి గ్రంథము' యొక్క 8వ మరియు 9వ అధ్యాయాలలోని వాక్యాలలోని వ్యక్తుల పేర్లలోని వైరుధ్యాలు క్రింద గీతల ద్వారా పేర్కొనబడ్డాయి. పరిశీలించండి.

" గెదోరు అహ్యో జెకెరు అనువారు. " ('దినవృత్తాంతములు మొదటి గ్రంథం', 8 : 31 )

" గెదోరు అహ్యో జెకర్యా మిక్లోతు తరువాత పుట్టినవారు."

('దినవృత్తాంతములు మొదటి గ్రంథం', 9 : 37 )

---

" మిక్లోతు షిమ్యాను కనెను " ('దినవృత్తాంతములు మొదటి గ్రంథం', 8 : 32 )

" మిక్లోతు షిమ్యాను కనెను."('దినవృత్తాంతములు మొదటి గ్రంథం', 9 : 38 )

---

" సౌలు యెహూన్‌తన్ ను " (ఉర్దూ బైబిల్ లో 'దినవృత్తాంతములు మొదటి గ్రంథం', 8 : 33)

" సౌలు యూన్‌తన్ ను " (ఉర్దూ బైబిల్ లో 'దినవృత్తాంతములు మొదటి గ్రంథం', 9 : 39)

---

" మీకా కుమారులు పీతోను మెలెకు తారీత్ ఆహాజు " (ఉర్దూ బైబిల్ లో 'దినవృత్తాంతములు మొదటి గ్రంథం', 8 : 35)

" మీకా కుమారులు పీతోను మెలెకు తహ్‌రీత్ ఆహాజు " (ఉర్దూ బైబిల్ లో 'దినవృత్తాంతములు మొదటి గ్రంథం', 9 : 41)

---

" ఆహాజు యెహోయాదాను కనెను, యెహోయాద 'ఆలెమెతు'ను అజ్మావెతును జిమ్రీని కనెను, జిమ్రీ మెజాను కనెను'' ( 'దినవృత్తాంతములు మొదటి గ్రంథం', 8 : 36)

" ఆహాజు యరాను కనెను, యరా ఆలెమెతును అజ్మావెతును జిమ్రీని కనెను, జిమ్రీ మోజాను కనెను'' ( 'దినవృత్తాంతములు మొదటి గ్రంథం', 9 : 42)

---

" మోజా బిన్యాను కనెను, బిన్యాకు రాపా కుమారుడు, రాపాకు ఎలాశా కుమారుడు, ఎలాశాకు ఆజేలు కుమారుడు'' ( 'దినవృత్తాంతములు మొదటి గ్రంథం', 8 : 37)

" మోజా బిన్యాను కనెను, రెఫాయా బిన్యాకు కుమారుడు, ఎలాశా రెఫాయాకు కుమారుడు, ఆజేలు ఎలాశాకు కుమారుడు'' ( 'దినవృత్తాంతములు మొదటి గ్రంథం', 9 : 43)

## ఐదవ వైరుధ్యం:

'సమూయేలు రెండవ గ్రంథము' యొక్క 24వ అధ్యాయపు 9వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది :

**" అప్పుడు యోవాబు [155] జనసంఖ్య వెరసి రాజునకు అప్పగించెను; ఇశ్రాయేలు వారిలో కత్తి దూయగల యెనిమిది లక్షలమంది యోధులుండిరి; యూదావారిలో అయిదు లక్షలమంది యుండిరి "**

అయితే దీనికి విరుద్ధంగా 'దినవృత్తాంతములు మొదటి గ్రంథము' యొక్క 21వ అధ్యాయపు 4వ మరియు 5వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది :

**"అయినను యోవాబు మాట చెల్లక రాజు మాటయే చెల్లెను గనుక యోవాబు ఇశ్రాయేలు దేశమందంతట సంచరించి తిరిగి యెరూషలేమునకు వచ్చి జనుల సంఖ్య వెరసి దావీదునకు అప్పగించెను. ఇశ్రాయేలీయులందరిలో కత్తి దూయువారు పదకొండు లక్షల మందియు యూదావారిలో కత్తి దూయువారు నాలుగు లక్షల డెబ్బది వేలమందియు సంఖ్యకు వచ్చిరి"**

రెండు వాక్యాలూ ఇశ్రాయేలీయులు మరియు యూదావారి సంతానం సంఖ్య విషయంలో ఉన్న పెద్ద వైరుధ్యాన్ని వెల్లడిస్తున్నాయి. ఇశ్రాయేలు వారిలో కత్తి దూయగలవారి సంఖ్య విషయంలో 3 లక్షల భేధాన్ని, యూదావారిలో కత్తిదూయగల వారి సంఖ్య విషయంలో 30 వేల భేదాన్ని గమనించవచ్చు.

## ఆరవ వైరుధ్యం:

'సమూయేలు రెండవ గ్రంథము' యొక్క 24వ అధ్యాయపు 13వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది :

**" కావున గాదు [156] దావీదునొద్దకు వచ్చి యిట్లని సంగతి తెలియజెప్పెను- నీవు నీ[157] దేశమందు ఏడు సంవత్సరములు క్షామము కలుగుటకు ఒప్పుకొందువా?"**

**(అథఃసూచికలు)**

[155] యోవాబు (యోఆబ్) దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ) (దావీదు) యొక్క సైన్యాధిపతి.

[156] జాద్ (అ) తౌరాతు గ్రంథం ప్రకారం దైవప్రవక్త. ఆయనను 'గైబ్ బీన్' పేరుతో స్మరించడం జరిగింది.



అయితే 'దినవృత్తాంతములు మొదటి గ్రంథము' యొక్క 21వ అధ్యాయపు 12వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది :

**" మూడేండ్ల పాటు కరవు కలుగుట..."**

'సమూయేలు రెండవ గ్రంథము' యొక్క వాక్యంలో 'ఏడు సంవత్సరములు' అని పేర్కొనబడి ఉంటే 'దినవృత్తాంతములు మొదటి గ్రంథము' యొక్క వాక్యంలో 'మూడు సంవత్సరములు' అని పేర్కొనబడి ఉండడాన్ని మనం గమనించవచ్చు. క్రైస్తవ వ్యాఖ్యాతలు 'సమూయేలు రెండవ గ్రంథము' లోని వాక్యంలో పేర్కొనబడిన విషయం తప్పు అని తీర్మానించారు.

## 22 సంవత్సరాలా లేక 42 సంవత్సరాలా? ఏడవ వైరుధ్యం:

'రాజులు రెండవ గ్రంథము' యొక్క 8వ అధ్యాయపు 26వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది :

**" అహజ్యా యేలనారంభించినప్పుడు ఇరువది రెండ్లేండ్లవాడై యుండి యెరూషలేములో ఒక సంవత్సరము ఏలెను"**

అయితే 'దినవృత్తాంతములు రెండవ గ్రంథము' యొక్క 22వ అధ్యాయపు 2వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది :

**" అహజ్యా యేలనారంభించినప్పుడు నలువది రెండ్లేండ్లవాడై యెరూషలేములో ఒక సంవత్సరము ఏలెను"**

రెండు వాక్యాలలోనూ ఎంతటి తీవ్ర వైరుధ్యముందో చూడండి. రెండవ వాక్యం ('దినవృత్తాంతములు రెండవ గ్రంథము' లోని వాక్యం) నిశ్చయంగా తప్పుడు వాక్యం. క్రైస్తవ వ్యాఖ్యాతలు ఈ విషయాన్ని అంగీకరించారు. ఈ వాక్యం ఎందుకు తప్పు కాజాలదు? అహజ్యా తండ్రి అయిన యెహోరాము మరణించే సమయంలో నలభై సంవత్సరాల[158] వయస్సును కలిగియున్నాడు. తన తండ్రి మరణించిన వెంటనే అహజ్యా రాజయ్యాడు. ఈ విషయం 21వ అధ్యాయం ద్వారా మనకు తెలుస్తుంది. ఇటువంటి స్థితిలో ఒకవేళ 'దినవృత్తాంతములు రెండవ గ్రంథము'యొక్క వాక్యాన్ని సరియైనదిగా కుమారుడయిన అహజ్యా తన తండ్రి అయిన

**(అథఃసూచికలు)**

[157] 'అనగా మూడు విపత్తులలో ఏదో ఒకటి తప్పనిసరి. కరవు లేదా శత్రువులు దాడి చేయడం లేదా తెగులు అనే మూడింటిలో ఏదో ఒకదానిని స్వీకరించు. దేశం ఏడు సంవత్సరములపాటు లేదా మరి కొంతకాలం పాటు క్షామంలో ఉండడాన్ని నీవు ఒప్పుకుందువా?'

యెహోరాము కంటే రెండేండ్ల పెద్దవాడుగా అంగీకరించవలసి వస్తుంది.

## ఎనిమిదా లేదా  పద్దెనిమిదా? ఎనిమిదవ వైరుధ్యం:

'రాజులు రెండవ గ్రంథము' యొక్క 24వ అధ్యాయపు 8వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది :

**" యెహోయాకీను ఏలనారంభించినప్పుడు పదునెనిమిదేండ్లవాడై యెరూషలేమునందు మూడు మాసములు ఏలెను"**

అయితే 'దినవృత్తాంతములు రెండవ గ్రంథము' యొక్క 36 వ అధ్యాయపు 9 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది :

**" యెహోయాకీను ఏలనారంభించినప్పుడు ఎనిమిదేండ్లవాడై యెరూషలేములో మూడు నెలల పది దినములు ఏలెను"**

రెండు వాక్యాలలోనూ ఎంతటి తీవ్రస్థాయిలో  వైరుధ్యముందో చూడండి. రెండవ వాక్యం ('దినవృత్తాంతములు రెండవ గ్రంథము' లోని వాక్యం) నిశ్చయంగా తప్పుడు వాక్యం. క్రైస్తవ వ్యాఖ్యాతలు ఈ విషయాన్ని అంగీకరించారు. త్వరలోనే ఇదే గ్రంథం యొక్క రెండవ అధ్యాయంలో లక్ష్యం-1 ద్వారా పాఠకులకు ఈ విషయం గురించి విదితమవుతుంది.

## తొమ్మిదవ వైరుధ్యం, ప్రక్షిప్తాలు జరిగిన విషయంలో క్రైస్తవ పండితుల ఒప్పుకోలు:

'సమూయేలు రెండవ గ్రంథము' యొక్క 23వ అధ్యాయపు 8వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది :

**" దావీదు అనుచరులలో బలాఢ్యులెవరనగా యోషే బెష్షెబెతను ముఖ్యుడగు తక్మోనీయుడు; అతడు ఒక యుద్ధములో ఎనిమిది వందల మందిని హతము చేసెను "**

అయితే 'దినవృత్తాంతములు మొదటి గ్రంథము' యొక్క 11 వ అధ్యాయపు 11 వ

---

<u>**(అథఃసూచికలు)**</u>

158 'దినవృత్తాంతములు రెండవ గ్రంథము' యొక్క21వ అధ్యాయపు 20వ వాక్యంలో ఈవిధంగా పేర్కొనబడింది:  **" అతడు ఏలనారంభించినప్పుడు ముప్పది రెండేండ్లవాడు; యెరూషలేములో ఎనిమిది సంవత్సరములు ఏలి యెవరికిని ఇష్టము లేనివాడై అతడు చనిపోయెను"**



వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది :

**" దావీదునొద్దనున్న  ఆ పరాక్రమశాలుల పట్టీలోని వారు ముప్పదిమంది; వారిలో హక్మోనీ కుమారుడైన యాషాబాము ముఖ్యుడు; ఇతడు ఒక యుద్ధమందు మూడువందల మందిని చంపి వారిమీద ఈటె ఆడించినవాడు"**

రెండు వాక్యాలలోనూ  తీవ్రస్థాయిలో  వైరుధ్యముంది. ఈ రెండు వాక్యాల నడుమ ఉన్న వైరుధ్యమేమిటో ప్రత్యేకంగా వివరించనవసరం లేదు. ఆడమ్ క్లార్క్ 'సమూయేలు రెండవ గ్రంథము' లోని వాక్యం గురించి వ్యాఖ్యానిస్తూ ఈ విధంగా పేర్కొన్నారు:

" డాక్టర్ కనీకాట్ ' ఈ వాక్యంలో మూడు పెద్ద ప్రక్షిప్తాలు (మార్పులూచేర్పులు) జరిగాయి' అని పేర్కొన్నారు"

దీనినిబట్టి ఈ ఒక్క వాక్యంలోనే మూడు తప్పులున్నట్లుగా తెలుస్తోంది.

## పదవ వైరుధ్యం :

'సమూయేలు రెండవ గ్రంథము' యొక్క 5 వ మరియు 6 వ అధ్యాయాలలో దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ) (దావీదు) ఫిలిష్తీయులతో పోరాడిన తర్వాత దేవుని మందసమును[159] తీసుకొని వచ్చినట్లుగా పేర్కొనబడి ఉంది.

అయితే 'దినవృత్తాంతములు మొదటి గ్రంథము' యొక్క 13 వ మరియు 14 వ అధ్యాయాలలో[160] దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ) (దావీదు) ఫిలిష్తీయులతో పోరాడడానికి ముందు దేవుని మందసమును తీసుకొనివచ్చినట్లుగా పేర్కొనబడి ఉంది.

---

<u>**(అథఃసూచికలు)**</u>

159 'సమూయేలు రెండవ  గ్రంథము' యొక్క 5 వ అధ్యాయంలో ఫిలిష్తీయులతో జరిగిన పోరాటం గురించి పేర్కొనబడింది. 6 వ అధ్యాయంలో మందసమును తీసుకొనిరావడానికి సంబంధించిన ప్రస్తావన ఉంది.

160 'సమూయేలు రెండవ  గ్రంథము' యొక్క 5 వ మరియు 6 వ అధ్యాయాలలో పేర్కొనబడియున్న దానికి పూర్తిగా వ్యతిరేకంగా 'దినవృత్తాంతములు మొదటి గ్రంథము' యొక్క 13 వ మరియు 14 వ అధ్యాయాలలో పేర్కొనబడి  ఉంది. 13 వ అధ్యాయంలో దేవుని మందసమును తీసుకొనిరావడానికి సంబంధించిన అదే సంఘటన పేర్కొనబడి ఉంది. 14 వ అధ్యాయంలో ఫిలిష్తీయులతో పోరాటానికి సంబంధించిన ప్రస్తావన ఉంది.

వాస్తవానికి రెండు చోట్ల ప్రస్తావించబడిన సంఘటన ఒక్కటే. కనుక పేర్కొనబడిన అధ్యాయాలను అధ్యయనం చేసినవారికి ఈ వాక్యాల మధ్య ఉన్న వైరుధ్యమేమిటో స్పష్టమయిపోతుంది. ఆ రెండింటిలో ఏదో ఒకటి తప్పనిసరిగా తప్పుడు వాక్యం.

## పదకొండవ వైరుధ్యం :

'ఆదికాండము' యొక్క 6 వ అధ్యాయపు 19 వ మరియు 20 వ వాక్యాలలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" మరియు నీతో కూడ వాటిని బ్రదికించి యుంచుకొనుటకు సమస్త జీవులలో, అనగా సమస్త శరీరుల యొక్క ప్రతి జాతిలోనివి రెండేసి చొప్పున నీవు ఓడలోనికి తేవలెను; వాటిలో మగదియు ఆడుదియు నుండవలెను. నీవు వాటిని బ్రదికించి యుంచుకొనుటకై వాటి వాటి జాతుల ప్రకారము పక్షులలోను, వాటి వాటి జాతుల ప్రకారము జంతువులలోను, వాటి వాటి జాతుల ప్రకారము జంతువులలోను, వాటి వాటి జాతుల ప్రకారము నేలను ప్రాకు వాటన్నింటిలోను, ప్రతి జాతిలో రెండేసి చొప్పున నీ యొద్దకు అవి వచ్చును"**

'ఆదికాండము' యొక్క 7 వ అధ్యాయపు 8 వ మరియు 9 వ వాక్యాలలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" దేవుడు నోవహునకు ఆజ్ఞాపించిన ప్రకారము పవిత్ర జంతువులలోను అపవిత్ర జంతువులలోను, పక్షులలోను నేలను ప్రాకు వాటన్నింటిలోను, మగది, ఆడుది జతజతలుగా ఓడలోనున్న నోవహు నొద్దకు చేరెను"**

ఈ వాక్యాలను అధ్యయనం చేసినప్పుడు అల్లాహ్ (యెహోవా) తన ప్రవక్త అయిన నూహ్ (అ) (నోవహు) ను ' సమస్త జీవులలో, అనగా ప్రతి జాతిలోనూ రెండేసి చొప్పున, అనగా పక్షులన్నింటిలోనూ, జంతువులన్నింటిలోనూ, నేల మీద ప్రాకే వాటన్నింటిలోనూ ఒక్కొక్క జంటను, అనగా ప్రతి జంటలోనూ ఒక మగది, ఒక ఆడుది ఉండేలా తీసుకొని ఓడలో ఉంచుకోవాలి' అని ఆదేశించినట్లుగా బోధపడుతుంది.

అయితే 'ఆదికాండము' యొక్క 7 వ అధ్యాయపు 2 వ మరియు 3 వ వాక్యాలలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" పవిత్ర జంతువులలో ప్రతి జాతి పోతులు ఏడును పెంటులు ఏడును, పవిత్రములు కాని జంతువులలో ప్రతి జాతి పోతును పెంటియు రెండును ఆకాశ పక్షులలో ప్రతి జాతి మగవి యేడును ఆడువి యేడును, నీవు భూమి అంతటి మీద సంతతిని జీవముతో కాపాడునట్లు నీ యొద్ద ఉంచుకొనుము"**



ఈ వాక్యాల మధ్య ఎంతటి తీవ్రస్థాయిలో వైరుధ్యముందో గమనించవచ్చు. ఒకచోట ప్రతి జాతిలోనూ ఒక్కొక్క జంటను తీసుకోవలసిందిగా ఆదేశం, మరొకచోట ఏడు జతల చొప్పున తీసుకోవలసిందిగా ఆదేశం పేర్కొనబడి ఉన్నాయి.

## పన్నెండవ వైరుధ్యం :

'సంఖ్యాకాండము' యొక్క 31 వ అధ్యాయాన్ని అధ్యయనం చేసినప్పుడు ఇశ్రాయేలీయులు మిద్యానీయులను దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) (మోషే) జీవితకాలంలోనే అంతమొందించారని, వారిలోని యుక్తవయస్సుకు చేరుకున్న లేదా చేరుకోని ఏ పురుషుడినీ, చివరకు పాలు త్రాగే పసిబిడ్డను సైతం వారు విడచిపెట్టలేదని,[161] యుక్తవయస్సుకు చేరుకున్న (పురుష సంయోగము ఎరిగిన) ఏ మహిళనూ సజీవంగా విడచిపెట్టలేదని, అయితే పురుష సంయోగము ఎరుగని ఆడపిల్లలను తమ బానిసలుగా చేసుకున్నట్లుగా[162] తెలుస్తుంది.

అయితే దీనికి విరుద్ధంగా 'న్యాయాధిపతులు' గ్రంథం యొక్క 6 వ అధ్యాయం ద్వారా మిద్యానీయులు న్యాయాధిపతుల కాలంలో గొప్ప శక్తిసామర్థ్యాలను[163] కలిగియుండేవారని, చివరకు ఇశ్రాయేలీయులు వారి ముందు వివశులుగా, అశక్తులుగా ఉండేవారని తెలుస్తుంది. వాస్తవానికి రెండు కాలాలకు నడుమ వంద సంవత్సరాలకు మించి అంతరం లేదు.

---

**(అథఃసూచికలు)**

161 **" యెహోవా మోషేకు ఆజ్ఞాపించినట్లు వారు మిద్యానీయులతో యుద్ధము చేసి మగవారినందరిని చంపిరి"** (సంఖ్యాకాండము, 31 వ అధ్యాయపు 7 వ వాక్యము)

162 **" కాబట్టి మీరు పిల్లలలో ప్రతి మగవానిని పురుష సంయోగము ఎరిగిన ప్రతి స్త్రీని చంపుడి; పురుష సంయోగము ఎరుగని ప్రతి ఆడుపిల్లను మీ నిమిత్తము బ్రతుకనీయుడి"** (సంఖ్యాకాండము, 31 వ అధ్యాయపు 17 వ మరియు 18 వ వాక్యము)

163 **" మిద్యానీయుల చెయ్యి ఇశ్రాయేలీయుల మీద హెచ్చాయెను "** (న్యాయాధిపతులు, 6 వ అధ్యాయపు 2 వ వాక్యము)

**" ఇశ్రాయేలీయులు మిద్యానీయుల వలన మిక్కిలి హీనదశకు వచ్చినప్పుడు వారు యెహోవాకు మొఱ్ఱ పెట్టిరి "** (న్యాయాధిపతులు, 6 వ అధ్యాయపు 6 వ వాక్యము)

పరిశీలించదగిన విషయమేమిటంటే మిద్యానీయులు దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) (మోషే) కాలంలో నశించిపోయిన తర్వాత తిరిగి అత్యంత స్వల్పకాలంలోనే ఇశ్రాయేలీయులపై సైతం ఆధిపత్యం వహించేంత స్థాయిలో, ఏడు సంవత్సరాలపాటు వారిని అశక్తులుగా, వివశులుగా ఉంచేంత స్థాయిలో శక్తిసామర్థ్యాలను కలిగియున్నవారుగా ఎలా రూపొందారు?

## ఐగుప్తీయుల పశువులన్నీ చనిపోయాయా?

## పదమూడవ వైరుధ్యం :

'నిర్గమ కాండము' యొక్క 9 వ అధ్యాయపు 6 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" మరునాడు యెహోవా ఆ కార్యము చేయగా ఐగుప్తీయుల పశువులన్నియు చచ్చెను గాని ఇశ్రాయేలీయుల పశువులలో ఒకటియు చావలేదు "**

దీనినిబట్టి ఐగుప్తీయుల పశువులన్నీ చనిపోయినట్లుగా విదితమవుతుంది. అయితే అదే అధ్యాయపు 20 వ మరియు 21 వ వాక్యాలలో అందుకు విరుద్ధంగా ఈ విధంగా కూడా పేర్కొనబడింది :

**" ఫరో సేవకులలో యెహోవా మాటకు భయపడినవాడు తన సేవకులను తన పశువులను ఇండ్లలోనికి త్వరగా రప్పించెను. అయితే యెహోవా మాట లక్ష్యపెట్టనివాడు తన పనివారిని తన పశువులను పొలములో ఉండనిచ్చెను "**

చూడండి. ఎంత గొప్ప వైరుధ్యమో!

## దైవప్రవక్త హజ్రత్ నూహ్ (అ) (నోవహు) ఓడ ఎప్పుడు ఆగింది?

## పదునాల్గవ వైరుధ్యం :

'ఆదికాండము' యొక్క 8 వ అధ్యాయపు 4 వ మరియు 5 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది :

**" ఏడవ నెల ఇరవైయేడవ దినమున ఓడ ఆర్మేనియా కొండల మీద[164] నిలిచెను. నీళ్ళు పదియవ నెలవరకు క్రమముగా తగ్గుచువచ్చెను. పదియవ నెల మొదటి దినమున కొండల శిఖరములు కనబడెను "**



ఈ వాక్యంలో ఎంతటి తీవ్రస్థాయిలో వైరుధ్యముందో మనం పరిశీలించగలము. కొండల శిఖరాలు పదవ నెలలో కనబడనారంభించినప్పుడు ఏడవ నెలలో ఆర్మేనియా కొండల మీద (లేదా అరారాతు కొండల మీద) ఓడ నిలవడమనేది ఎలా సాధ్యపడుతుంది?

## 15 వ వైరుధ్యం నుంచి 26 వ వైరుధ్యం వరకు :

'సమూయేలు రెండవ గ్రంథము' యొక్క 8 వ అధ్యాయం మరియు 'దినవృత్తాంతములు మొదటి గ్రంథము' యొక్క 18 వ అధ్యాయం నడుమ మూల హెబ్రూ ప్రతిలో ఎన్నో వైరుధ్యాలున్నాయి, అనువాదకులు కొన్ని చోట్ల వాటిని సంస్కరించినప్పటికీ. మేము వాటిని ఆడమ్ క్లార్క్ యొక్క వ్యాఖ్యాన గ్రంథం యొక్క 2 వ సంపుటి (క్రింద పేర్కొనబడిన 'సమూయేలు గ్రంథము' నుంచి స్వీకరించబడిన విషయాల ద్వారా) నుంచి ఉల్లేఖిస్తున్నాము:-

| వాక్యం నెం. | 'సమూయేలు రెండవ గ్రంథము' 8 వ అధ్యాయంలోని వాక్యాలు | వాక్యం నెం. | 'దినవృత్తాంతములు మొదటి గ్రంథము' 18 వ అధ్యాయంలోని వాక్యాలు |
|---|---|---|---|
| 1 | **'దావీదు ఫిలిష్తీయులను ఓడించి లోపరచుకొని వారి వశములోనుండి మెతెగమ్మాను పట్టుకొనెను'** (ఇది తెలుగు బైబిల్ అనువాదంలోని వాక్యము. పాఠకులచే చదువబడుతున్న ఈ గ్రంథానికి మూలరచన అయిన 'ఇజ్హారుల్ హఖ్' అన్ని ప్రతుల్లోనూ 'దావీదు జిజ్యహ్ (కప్పము) కు సంబంధించిన అధికారాన్ని ఫిలిష్తీయుల నుంచి చేజిక్కించుకొనెను' అని పేర్కొనబడి ఉంది) | 1 | **'ఇదియైన తరువాత దావీదు ఫిలిష్తీయులను జయించి, వారిని లోపరచి, గాతు పట్టణమును దాని గ్రామములును ఫిలిష్తీయుల వశమున నుండకుండ వాటిని పట్టుకొనెను'** |

(అథఃసూచికలు)

[164] అన్ని ప్రతుల్లోనూ ఈ పదాలే పేర్కొనబడి ఉన్నాయి. అయితే మా వద్ద అందుబాటులో ఉన్న బైబిల్ ఉర్దూ, ఇంగ్లిష్ మరియు తెలుగు అనువాద గ్రంథాలలో **" ఏడవ నెల పదిహేడవ దినమున ఓడ అరారాతు కొండల మీద నిలిచెను. నీళ్ళు పదియవ నెలవరకు క్రమముగా తగ్గుచువచ్చెను. పదియవ నెల మొదటి దినమున కొండల శిఖరములు కనబడెను "** అని పేర్కొనబడి ఉంది.

| వాక్యం నెం. | 'సమూయేలు రెండవ గ్రంథము' 8 వ అధ్యాయంలోని వాక్యాలు | వాక్యం నెం. | 'దినవృత్తాంతములు మొదటి గ్రంథము' 18 వ అధ్యాయంలోని వాక్యాలు |
|---|---|---|---|
| 3 | 'హదదెజరు' | 3 | 'హదరెజెరు' |
| 4 | 'వెయ్యిన్ని యేడు వందల మంది గుఱ్ఱపు రౌతులను' | 4 | 'వెయ్యి రథములను ఏడువేల గుఱ్ఱపు రౌతులను' |
| 8 | 'మరియు బెతహు బేరోతై అను హదదెజెరు పట్టణములలో దావీదు రాజు విస్తారమైన యిత్తడిని పట్టుకొనెను' | 8 | 'హదదెజరు యొక్క పట్టణములైన టిబ్హాతులో నుండియు, కూనులో నుండియు దావీదు బహు విస్తారమైన యిత్తడిని తీసికొని వచ్చెను' |
| 10 | 'యోరాము' | 10 | 'హదోరము' |
| 12 | 'సిరియనుల యొద్ద నుండియు' | 11 | 'ఎదోమీయుల యొద్ద నుండియు' |
| 13 | 'సిరియనులగు పదునెనిమిది వేలమందిని' | 12 | 'ఎదోమీయులలో పదునెనిమిది వేలమందిని' |
| 17 | 'అబ్యాతారు కుమారుడగు అహీమెలెకును యాజకులు; శెరాయా లేఖికుడు' [165] | 17 | 'అబ్యాతారు కుమారుడైన అబీమెలెకును యాజకులు, షవ్షా శాస్త్రి' |

ఈ విధంగా ఈ రెండు అధ్యాయాలలో 12 వైరుధ్యాలు ఉన్నాయి.

(అథఃసూచికలు)

165 పాఠకులచే చదువబడుతున్న ఈ గ్రంథానికి మూలరచన అయిన 'ఇజ్‌హారుల్ హఖ్' యొక్క అన్ని ప్రతుల్లోనూ 'అహీమెలెకును, శెరాయాను లేఖకులు' అని పేర్కొనబడి ఉంది. అయితే మా వద్ద అందుబాటులో ఉన్న అనువాద గ్రంథాలన్నింటిలోనూ పైన పేర్కొనబడిన వాక్యాలు పేర్కొనబడి ఉన్నాయి.



## 27 వ వైరుధ్యం నుంచి 32 వ వైరుధ్యం వరకు :

'సమూయేలు రెండవ గ్రంథము' యొక్క 10 వ అధ్యాయం మరియు దినవృత్తాంతములు మొదటి గ్రంథం యొక్క 19 వ అధ్యాయం నడుమ ఉన్న వైరుధ్యం గురించి క్రైస్తవ వ్యాఖ్యాతలు ఉటంకించారు:

| వాక్యం నెం. | 'సమూయేలు రెండవ గ్రంథము' 10 వ అధ్యాయంలోని వాక్యాలు | వాక్యం నెం. | 'దినవృత్తాంతములు మొదటి గ్రంథము' 19 వ అధ్యాయంలోని వాక్యాలు |
|---|---|---|---|
| 16 | 'హదదెజరు సైన్యాధిపతియగు షోబకు వీరికి అధిపతిగాఉండెను' | 16 | 'హదరెజెరు యొక్క సైన్యాధిపతియైన షోపకు వారికి నాయకుడాయెను' |
| 17 | 'హేలామునకు వచ్చెను' | 17 | 'వారి సమీపమునకుచేరుకొనెను' |
| 18 | 'దావీదు సిరియనులలో ఏడు వందల మంది రథికులను నలువదివేల మంది గుఱ్ఱపు రౌతులను హతము చేసెను' | 18 | 'దావీదు సిరియనులలో ఏడు వేల రథికులను నలుబదివేల కాల్బలమును హతము చేసి' |
| 18 | 'మరియు వారి సైన్యాధిపతియగు షోబకు దావీదు చేతిలో ఓడిపోయి అచ్చటనే చచ్చెను' | 18 | 'సైన్యాధిపతియైన షోపకును చంపివేసెను' |

ఈ విధంగా ఈ రెండు అధ్యాయాలలో 6 వైరుధ్యాలు ఉన్నాయి.

## 40 వేలా లేక 4 వేలా? 33 వ వైరుధ్యం :

'రాజులు మొదటి గ్రంథము' యొక్క 4 వ అధ్యాయపు 26 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది :

**" సొలొమోను రథములకు నలువది వేల గుఱ్ఱపు శాలలును రౌతులకు పండ్రెండు వేల**

గుఱ్ఱములును ఉండెను"

అయితే 'దినవృత్తాంతములు రెండవ గ్రంథము' యొక్క 9 వ అధ్యాయపు 25 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది :

**" సొలొమోనునకు నాలుగువేల గుఱ్ఱపు సాలలును రథములును పండ్రెండు వేల గుఱ్ఱపు రౌతులును కలిగియుండెను"**

బైబిల్ పారసీక మరియు ఉర్దూ అనువాద గ్రంథాలలోనూ ఇదేవిధంగా పేర్కొనబడి ఉంది. అయితే బైబిల్ అరబీ అనువాదకుడు 'దినవృత్తాంతములు రెండవ గ్రంథము' యొక్క వాక్యాన్ని మార్చివేశాడు. అనగా ' నాలుగు వేల' అని పేర్కొనబడియున్న చోట 'నలుబది వేల' అని మార్చివేశాడు.[166]

క్రైస్తవ వ్యాఖ్యాత అయిన ఆడమ్ క్లార్క్ 'రాజులు మొదటి గ్రంథము' యొక్క 4 వ అధ్యాయపు 26 వ వాక్యం క్రింద అనువాదాలను, వ్యాఖ్యానాలను పేర్కొనడానికి ముందు ఈ విషయంలో చోటుచేసుకున్న వైరుధ్యం గురించి ఉల్లేఖించారు. ఆ తర్వాత ఆయన ఈ విధంగా పేర్కొన్నారు:

" ఈ వైరుధ్యాల దృష్ట్యా సంఖ్య వివరణ విషయంలో ప్రక్షిప్తం జరిగిందనే విషయాన్ని అంగీకరించడం ఉత్తమం "

# గుబ్బలా లేక ఎద్దులా లేక దోసకాయలా?

# 34 వ వైరుధ్యం :

'రాజులు మొదటి గ్రంథము' యొక్క 7 వ అధ్యాయపు 24 వ వాక్యానికీ, 'దినవృత్తాంతములు రెండవ గ్రంథము' యొక్క 4 వ అధ్యాయపు 3 వ వాక్యానికి నడుమ వైరుధ్యముంది. [167]

ఆడమ్ క్లార్క్ తన వ్యాఖ్యాన గ్రంథం యొక్క 2 వ సంపుటి లో 'దినవృత్తాంతములు

**(అథఃసూచికలు)**

166 మా వద్ద క్రీ.శ. 1865 లో ప్రచురించబడిన బైబిల్ అరబీ అనువాద గ్రంథంలో మాత్రం 'నాలుగువేలు' అని పేర్కొనబడి ఉంది. బైబిల్ ఇంగ్లిష్ అనువాద గ్రంథంలోనూ 'నాలుగు వేలు' అని పేర్కొనబడి ఉంది.



రెండవ గ్రంథము' యొక్క 4 వ అధ్యాయపు 3 వ వాక్యంలో పేర్కొనబడిన విషయం గురించి వ్యాఖ్యానిస్తూ ఈ విధంగా పేర్కొన్నారు:

" మహా మహా పరిశోధకుల అభిప్రాయమేమిటంటే ఈ విషయంలో 'రాజులు మొదటి గ్రంథము' లో పేర్కొనబడిన విషయాన్ని అంగీకరించాలి. 'బఖ్ఈమ్' అనే పదం 'బఖ్రీమ్' అనే పదం ఉపయోగించబడి ఉండేందుకు అవకాశముంది."

'బఖ్రీమ్' అంటే 'ఎద్దు' అని అర్థం. 'బఖ్ఈమ్' అంటే 'గుబ్బ' అని అర్థం. ఏదిఏమయినప్పటికీ ఈ వ్యాఖ్యాత 'దినవృత్తాంతములు రెండవ గ్రంథము' లోని విషయం ప్రక్షిప్తానికి గురయినట్లుగా అంగీకరించారు. కనుక ఆయన దృష్టిలో దినవృత్తాంతములు రెండవ గ్రంథంలో పేర్కొనబడిన విషయం తప్పు. హెన్రీ వాస్కాట్ వ్యాఖ్యాన గ్రంథం కూర్పుకర్తలు ఈ విధంగా పేర్కొన్నారు:

" ఇక్కడ అక్షరాలు మారిపోవడం వల్ల వ్యత్యాసం ఏర్పడింది "

**(అథఃసూచికలు)**

167 ఈ రెండు చోట్ల దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) (సొలొమోను) పోతపనితో రూపొందించిన ఒక సముద్రం గురించి పేర్కొనబడింది. దాని స్వరూపం గురించి 'రాజులు మొదటి గ్రంథము' యొక్క 7 వ అధ్యాయపు 24 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" దాని పై అంచునకు క్రింద చుట్టును గుబ్బలుండెను; మూరకు పది గుబ్బల చొప్పున ఆ గుబ్బలు సముద్రము చుట్టును ఆవరించియుండెను; అది పోత పోయబడినప్పుడు ఆ గుబ్బలు రెండు వరుసలుగా పోత పోయబడెను "**

అయితే 'దినవృత్తాంతములు రెండవ గ్రంథము' యొక్క 4 వ అధ్యాయపు 3 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది :

**" దాని క్రింది తట్టున ఎద్దులు రూపింపబడి యుండెను, అవి ఒక్కొక్క మూరకు పదేసియుండెను, అవి ఆ సముద్రపు తొట్టిని ఆవరించెను; ఎద్దులు రెండు వరుసలు తీరియుండెను, అవి తొట్టితో కూడనే పోతపోయబడెను "**

ఈ పదాలు ఉర్దూ, ఇంగ్లిష్ మరియు తెలుగు బైబిల్ అనువాద గ్రంథాలలో పేర్కొనబడి ఉన్నాయి. అయితే క్రీ.శ. 1865 లో ప్రచురించబడిన బైబిల్ అరబీ అనువాద గ్రంథంలో 'దినవృత్తాంతములు రెండవ గ్రంథము' యొక్క 4 వ అధ్యాయపు 3 వ వాక్యంలో 'ఎద్దులు' అని పేర్కొనబడియున్న చోట 'దోసకాయలు' అని పేర్కొనబడింది. గుబ్బలెక్కడ? ఎద్దులెక్కడ? దోసకాయలెక్కడ?

# పదకొండు సంవత్సరాల వయస్సులో కుమారుడు

## 35 వ వైరుధ్యం :

'రాజులు రెండవ గ్రంథము' యొక్క 16 వ అధ్యాయపు 2 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది :

**" ఆహాజు ఏలనారంభించినప్పుడు ఇరువది యేండ్లవాడై యెరూషలేమునందు పదునారు సంవత్సరములు ఏలెను"**

అయితే 'రాజులు రెండవ గ్రంథము' లోనే 18 వ అధ్యాయపు 2 వ వాక్యంలో ఆహాజు కుమారుడయిన హిజ్కియా స్థితిగతుల గురించిన ప్రస్తావన ఈ విధంగా ఉంది :

**" అతడు ఏలనారంభించినప్పుడు ఇరువది యయిదేండ్లవాడై యెరూషలేమునందు ఇరువది తొమ్మిది సంవత్సరములు ఏలెను"**

దీనినిబట్టి ఆహాజు పదకొండు సంవత్సరాల వయస్సులో ఉన్నప్పుడు ఆయన కుమారుడయిన హిజ్కియా ఆయనకు పుట్టినట్లుగా భావించవలసి ఉంటుంది.[168] ఇది ప్రకృతి విరుద్ధమయినది. కనుక ఈ రెండు వాక్యాలలో ఏదో ఒకటి తప్పనిసరిగా తప్పయి ఉండాలి. క్రైస్తవ వ్యాఖ్యాతలు మొదటి వాక్యంలో, అనగా 'రాజులు రెండవ గ్రంథము' యొక్క 16 వ అధ్యాయపు 2 వ వాక్యంలో పేర్కొనబడిన విషయం తప్పనే విషయాన్ని అంగీకరించారు.

---

**(అథఃసూచికలు)**

168 ఎందుకంటే 'రాజులు రెండవ గ్రంథము' యొక్క 16 వ అధ్యాయపు 2 వ వాక్యం ద్వారా ఆహాజు ముప్పై ఆరు సంవత్సరాల వయస్సులో మరణించినట్లుగా విదితమవుతుంది. అయితే 'రాజులు రెండవ గ్రంథము' లోనే 18 వ అధ్యాయపు 2 వ వాక్యం ద్వారా ఆయన కుమారుడయిన హిజ్కియా (తన తండ్రి మరణించిన వెనువెంటనే రాజుగా పట్టాభిషిక్తుడయ్యాడు) ఏలనారంభించినప్పుడు ఇరవైఐదు సంవత్సరాల వయస్సులో ఉన్నట్లుగా విదితమవుతుంది. అనగా దీనినిబట్టి 36 సంవత్సరాల వయస్సులో ఆహాజు మరణించినప్పుడు అతడి కుమారుడయిన హిజ్కియా 25 సంవత్సరాల వయస్సును కలిగియున్నట్లుగా భావించాలి. 36 లో నుంచి 25 తీసివేస్తే 11 అవుతుంది. అనగా 11 సంవత్సరాల వయస్సులో ఆహాజుకు హిజ్కియా పుట్టినట్లుగా భావించాలి. ఇది ఎలా సాధ్యం?



హెన్రీ వాస్కాట్ వ్యాఖ్యాన గ్రంథం కూర్పుకర్తలు 'రాజులు రెండవ గ్రంథము' యొక్క 16 వ అధ్యాయపు 2 వ వాక్యం గురించి వ్యాఖ్యానిస్తూ ఈ విధంగా పేర్కొన్నారు:

" బహుశా 'ముప్పై' అని పేర్కొనబడడానికి బదులు 'ఇరవై' అని పేర్కొనబడి ఉంటుంది. ఈ గ్రంథంలోని 18 వ అధ్యాయపు 2 వ వాక్యాన్ని అధ్యయనం చేయండి "

# పదకొండు సంవత్సరాల వయస్సులో కుమారుడు

## 36 వ వైరుధ్యం :

అదేవిధంగా 'దినవృత్తాంతములు రెండవ గ్రంథము' యొక్క 28 వ అధ్యాయపు 1 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది :

**" ఆహాజు ఏలనారంభించినప్పుడు ఇరువది సంవత్సరములవాడై యెరూషలేములో పదునారు సంవత్సరములు ఏలెను "**

అయితే 'దినవృత్తాంతములు రెండవ గ్రంథము' యొక్క 29 వ అధ్యాయపు 1 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది :

**" హిజ్కియా యేలనారంభించినప్పుడు ఇరువది యయిదేండ్లవాడై యిరువది తొమ్మిది సంవత్సరములు యెరూషలేములో ఏలెను "**

ఇక్కడ కూడా రెండు వాక్యాలలో ఏదో ఒకటి నిశ్చయంగా తప్పయి ఉండాలి. విస్పష్టమైన రీతిలో మొదటి వాక్యమే, అనగా 'దినవృత్తాంతములు రెండవ గ్రంథము' యొక్క 28 వ అధ్యాయపు 1 వ వాక్యమే తప్పయి ఉంటుందని విదితమవుతోంది.

## 37 వ వైరుధ్యం, ప్రక్షిప్తానికి పాల్పడవలసిందిగా సలహా :

'సమూయేలు రెండవ గ్రంథము' యొక్క 12 వ అధ్యాయపు 31 వ వాక్యంలో పేర్కొనబడిన విషయానికి, 'దినవృత్తాంతములు మొదటి గ్రంథము' యొక్క 20 వ అధ్యాయపు 3 వ వాక్యంలో పేర్కొనబడిన విషయానికి నడుమ ఎంతో వైరుధ్యముంది.

హోరన్ తన వ్యాఖ్యాన గ్రంథం యొక్క మొదటి సంపుటిలో ఈ విధంగా పేర్కొన్నారు:

" సమూయేలు గ్రంథంలో పేర్కొనబడిన విషయం సరియైనది. కనుక దినవృత్తాంతములు గ్రంథంలో పేర్కొనబడిన విషయాన్ని కూడా అదేవిధంగా మార్చివేయాలి"

దీనినిబట్టి ఆయన దృష్టిలో దినవృత్తాంతములు గ్రంథంలో పేర్కొనబడిన విషయం తప్పు. చూడండి. ఎంత ధైర్యంగా, నిస్సంకోచంగా ఆ తప్పుడు వాక్యాన్ని సంస్కరించవలసిందిగా, మార్చివేయవలసిందిగా ఉపదేశించడం జరుగుతోందో! [169] విచిత్రమైన విషయమేమిటంటే క్రీ.శ. **1844** లో ప్రచురించబడిన బైబిల్ అరబీ అనువాద గ్రంథంలో అనువాదకుడు ఇందుకు విరుద్ధంగా సమూయేలు గ్రంథంలో పేర్కొనబడిన విషయాన్ని దినవృత్తాంతములు గ్రంథంలో పేర్కొనబడిన విషయానికి అనుగుణంగా మార్చివేయడం జరిగింది. న్యాయవంతమైన విషయమేమిటంటే

**(అథఃసూచికలు)**

**169** ఆ ఉపదేశం ప్రకారం తర్వాత ఆచరించం జరిగింది కూడా. ప్రస్తుతం మన వద్ద అందుబాటులో ఉన్న బైబిల్ అనువాద గ్రంథాలన్నింటిలోనూ రెండు చోట్లా పేర్కొనబడిన విషయం ఎటువంటి వైరుధ్యమూ లేకుండా ఒకే విధంగా ఉంది.

'సమూయేలు రెండవ గ్రంథము' యొక్క 12 వ అధ్యాయపు 31 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది :

**" పట్టణములో ఉన్నవారిని బయటికి తెప్పించి రంపముల చేతను పదును గల యినుప పనిముట్ల చేతను ఇనుప గొడ్డండ్ల చేతను వారిని తుత్తునియలుగా చేయించి వారిని ఇటుక ఆవములో వేసెను. అమ్మోనీయుల పట్టణములన్నిటికి అతడు ఈలాగు చేసెను. ఆ తరువాత దావీదును జనులందరును తిరిగి యెరూషలేమునకు వచ్చిరి. "**

'దినవృత్తాంతములు మొదటి గ్రంథము' యొక్క 20 వ అధ్యాయపు 3 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది :

**" దానియందున్న జనులను అతడు వెలుపలికి కొనిపోయి, వారిలో కొందరిని రంపములతో కోయించెను, కొందరిని ఇనుపదంతెలతో చీరించెను; కొందరిని గొడ్డళ్ళతో నరికించెను. ఈ ప్రకారము అతడు అమ్మోనీయుల పట్టణము లన్నిటికిని చేసెను, అంతట దావీదును జనులందరును యెరూషలేమునకు తిరిగివచ్చిరి. "**

కేవలం గీత గీయబడియున్న విషయం తప్ప రెండుచోట్లా పేర్కొనబడిన విషయం ఒకే విధంగా ఉంది. అంతకుముందు రెండింటి మధ్య వైరుధ్యముండేది. అయితే హోరన్ ఉపదేశానికి అనుగుణంగా దినవృత్తాంతములు మొదటి గ్రంథంలోని విషయం మార్పుకు గురిచేయబడిన తర్వాత, అనగా సమూయేలు రెండవ గ్రంథంలోని విషయానికి అనుగుణంగా మార్చబడిన తర్వాత రెండింటిలోని విషయం ఒకే విధంగా రూపొందింది.



ఇందులో ఆశ్చర్యపోదగిన విషయమేమీ లేదు. ఎందుకంటే ఆ విధంగా ప్రక్షిప్తాలకు పాల్పడడం వారికి అలవాటే.

## 38 వ వైరుధ్యం, బయెషా యూదావారిపై దండెత్తడం :

'రాజులు మొదటి గ్రంథము' యొక్క 15 వ అధ్యాయపు 33 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది :

**" యూదారాజైన ఆసా యేలుబడిలో మూడవ సంవత్సరమందు అహీయా కుమారుడైన బయెషా తిర్సాయందు ఇశ్రాయేలువారినందరిని ఏలనారంభించి యిరువది నాలుగు సంవత్సరములు ఏలెను "**

అయితే 'దినవృత్తాంతములు రెండవ గ్రంథము' యొక్క 16 వ అధ్యాయపు 1 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది :

**" ఆసా యేలుబడియందు ముప్పది ఆరవ సంవత్సరమున ఇశ్రాయేలు రాజైన బయెషా యూదావారిమీద దండెత్తి బయలుదేరి యూదా రాజైన ఆసాయొద్దకు రాకపోకలు జరుగకుండునట్లు రామాను కట్టింపగా "**

ఈ రెండు వాక్యాలలో పేర్కొనబడిన విషయాల మధ్య వైరుధ్యముంది. రెండింటిలో ఒక్కటి నిశ్చయంగా తప్పు. ఎందుకంటే మొదటి వాక్యం ప్రకారం, అనగా 'రాజులు మొదటి గ్రంథము' యొక్క 15 వ అధ్యాయపు 33 వ వాక్యంలో పేర్కొనబడిన విషయం ప్రకారం బయెషా ఆసా ఏలుబడిలో ఇరవైఆరవ సంవత్సరంలో మరణించాడు. [170] ఆసా ఏలుబడిలో ముప్పై ఆరవ సంవత్సరంలో బయెషా మరణించి పది సంవత్సరాలయినట్లుగా భావించాలి. మరి ఆ సంవత్సరంలో బయెషా యూదావారి మీద దండెత్తడం ఎలా సాధ్యపడుతుంది?

**(అథఃసూచికలు)**

**170** ఎందుకంటే బయెషా 24 సంవత్సరాలు పరిపాలించాడు. ఆసా రాజయిన పిమ్మట రెండు సంవత్సరాలకు అతడు రాజయ్యాడు. ఆ విధంగా మొత్తం 26 సంవత్సరాలయ్యాయి.

'రాజులు మొదటి గ్రంథము' యొక్క 16 వ అధ్యాయపు 6 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది:

( మిగిలినభాగం తరువాతి పేజీలో )

హెన్రీ వాస్కాట్ వ్యాఖ్యాన గ్రంథం యొక్క కూర్పుకర్తలు దినవృత్తాంతములు గ్రంథంలో పేర్కొనబడిన విషయం గురించి వ్యాఖ్యానిస్తూ ఈ విధంగా పేర్కొన్నారు:

" విస్పష్టమైన రీతిలో ఇందులో పేర్కొనబడిన విషయం తప్పు"

గొప్ప క్రైస్తవ పండితుడిగా ప్రఖ్యాతిగాంచిన ఆషర్ ఈ విధంగా పేర్కొన్నారు:

" ఆ సంవత్సరం, అనగా ముప్పైఆరవ సంవత్సరం ఆసా ఏలుబడిలో ముప్పైఆరవ సంవత్సరం కాదు, యరొబాము[171] పరిపాలనా కాలంలో రాజ్య విభజన జరిగిన సంవత్సరం"

ఏదిఏమయినప్పటికీ 'దినవృత్తాంతములు రెండవ గ్రంథము' యొక్క 16 వ అధ్యాయపు 1 వ వాక్యంలో పేర్కొనబడిన విషయం తప్పని, అనగా 26 కు బదులు 36 అనే సంఖ్య వ్రాయబడింది లేదా 'రాజ్య విభజన' కు బదులుగా 'ఆసా ఏలుబడియందు' అని వ్రాయబడిందని పేర్కొని ఈ తప్పును ఈ క్రైస్తవ పండితులు అంగీకరించారు.

**(అథఃసూచికలు)**

**(170 వ అథఃసూచిక తరువాయి భాగం)**

**"బయెషా తన పితరులతో కూడ నిద్రించి తిర్సాలో సమాధి చేయబడెను".**

'రాజులు మొదటి గ్రంథము' యొక్క 16 వ అధ్యాయపు 8 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**"యూదారాజైన ఆసా యేలుబడిలో ఇరువదియారవ సంవత్సరమున బయెషా కుమారుడైన ఏలా తిర్సాయందు ఇశ్రాయేలువారినందరిని ఏలనారంభించి రెండు సంవత్సరములు ఏలెను."**

ఆసా ఏలుబడిలో ఇరవైఆరవ సంవత్సరంలో బయెషా మరణించిన వెంటనే అతడి కుమారుడయిన ఏలా రాజయినట్లుగా నిరూపితమయింది. కనుక ఆసా ఏలుబడిలో ముప్పైఆరవ సంవత్సరంలో అప్పటికే మరణించియున్న బయెషా యూదావారి మీద దండెత్తడం ఎలా సాధ్యపడుతుంది?

171 నెబాతు కుమారుడయిన యరొబాము తొలుత దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) (సొలొమోను) సేవకులుగా ఉండేవాడు. అయితే తర్వాత అతడు హజ్రత్ సులైమాన్ (అ) (సొలొమోను) పట్ల విద్రోహానికి పాల్పడ్డాడు. దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) (సొలొమోను)

( మిగిలినభాగం తరువాతి పేజీలో )



# 39 వ వైరుధ్యం :

'దినవృత్తాంతములు రెండవ గ్రంథము' యొక్క 15 వ అధ్యాయపు 19 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది :

**" ఆసా యేలుబడినందు ముప్పది యయిదవ సంవత్సరము వరకు యుద్ధములు జరుగలేదు "**

అయితే 'రాజులు మొదటి గ్రంథము' యొక్క 15 వ అధ్యాయపు 33 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది :

**" యూదారాజైన ఆసా యేలుబడిలో మూడవ సంవత్సరమందు అహీయా కుమారుడైన బయెషా తిర్సాయందు ఇశ్రాయేలువారినందరిని ఏలనారంభించి యిరువది నాలుగు సంవత్సరములు ఏలెను "**

అలాగే 'రాజులు మొదటి గ్రంథము' యొక్క 15 వ అధ్యాయపు 32 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది :

**" వారి దినములన్నిటను ఆసాకును ఇశ్రాయేలు రాజైన బయెషాకును యుద్ధము జరుగుచుండెను"**

ఈ విధంగా 'దినవృత్తాంతములు రెండవ గ్రంథము' యొక్క 15 వ అధ్యాయపు 19 వ వాక్యంలోని విషయానికి, 'రాజులు మొదటి గ్రంథము' యొక్క 15 వ అధ్యాయపు 32 వ వాక్యంలోని విషయానికి నడుమ వైరుధ్యమున్నట్లుగా విదితమయింది.

**(అథఃసూచికలు)**

**(171 వ అథఃసూచిక తరువాయి భాగం)**

పరమపదించినప్పుడు ఆయన కుమారుడయిన రెహబాము పట్టాభిషిక్తులయ్యారు. అప్పుడు యరొబాము తరచుగా ఇశ్రాయేలీయుల తోడ్పాటుతో ప్రత్యేకమైన రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. అలాగే అతడు అందులో ఒక బలిపీఠాన్ని నిర్మించాడు. రెహబాము మరియు యరొబాముకు నడుమ నిత్యం యుద్ధాలు కొనసాగాయి. యరొబాము ఇశ్రాయేలీయులను 22 సంవత్సరాలు పరిపాలించాడు. అతడి స్థితిగతులకు సంబంధించిన వివరాలు బైబిల్ పాతనిబంధన గ్రంథంలోని 'రాజులు మొదటి గ్రంథము' యొక్క 11 వ అధ్యాయం నుంచి 14 వ అధ్యాయం వరకు మరియు 'దినవృత్తాంతములు రెండవ గ్రంథము' యొక్క 12 వ అధ్యాయం నుంచి 13 వ అధ్యాయం వరకు పేర్కొనబడిన అంశాలలో లభ్యమవుతాయి.

## దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ)(సొలొమోను) కు చెందిన అధికారులు ఎంతమంది? 40 వ వైరుధ్యం :

'రాజులు మొదటి గ్రంథము' యొక్క 5 వ అధ్యాయపు 16 వ వాక్యంలో దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) (సొలొమోను) వద్ద ఉన్న పనివారి మీద అధికారుల సంఖ్య[172] మూడువేల మూడువందలు అని తెలుపబడింది.

అయితే 'దినవృత్తాంతములు రెండవ గ్రంథము' యొక్క 2 వ అధ్యాయపు 2 వ వాక్యంలో దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) (సొలొమోను) వద్ద ఉన్న అధిపతుల సంఖ్య మూడువేల ఆరువందలు అని తెలుపబడింది. గ్రీకు బైబిల్ అనువాదకులు రాజులు మొదటి గ్రంథంలో ప్రక్షిప్తానికి పాల్పడి 'మూడువేల మూడువందలు' అని పేర్కొనబడిన చోట 'మూడువేల ఆరువందలు' అని వ్రాశారు.

## రెండువేల విగ్రహాలా లేక మూడువేల కడవలా? 41 వ వైరుధ్యం :

'రాజులు మొదటి గ్రంథము' యొక్క 7 వ అధ్యాయపు 26 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది :

**(అథఃసూచికలు)**

[172] 'రాజులు మొదటి గ్రంథము' యొక్క 5 వ అధ్యాయపు 16 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది :

**" వీరు కాక పనిమీదనున్న సొలొమోను శిల్పకారులకు అధికారులు మూడువేల మూడువందలమంది; వీరు పనివారి మీద అధికారులై యుండిరి "**

'దినవృత్తాంతములు రెండవ గ్రంథము' యొక్క 2 వ అధ్యాయపు 2 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది :

**" బరువులు మోయుటకు డెబ్బది వేలమందిని, కొండల మీద మ్రానులు కొట్టుటకు ఎనుబది వేలమందిని ఏర్పరచుకొని వీరిమీద మూడువేల ఆరువందలమందిని అధిపతులుగా ఉంచెను "**



**" అది రెండువేల కడవలు పట్టేంత ఘనపరిమాణమును కలిగియున్నది "** (తెలుగు బైబిల్ లో **" అది తొమ్మిది గరిసెలు పట్టును "** అని పేర్కొనబడి ఉంది)

అయితే 'దినవృత్తాంతములు రెండవ గ్రంథము' యొక్క 4 వ అధ్యాయపు 5 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది :

**" అది మూడువేల కడవలు పట్టేంత ఘనపరిమాణమును కలిగియున్నది "**[173] (తెలుగు బైబిల్ లో **" అది ముప్పది పుట్ల నీళ్ళు పట్టును "** అని పేర్కొనబడి ఉంది)

అలాగే క్రీ.శ. 1838 లో ప్రచురితమయిన బైబిల్ పారసీక అనువాద గ్రంథంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" అది రెండువేల విగ్రహాలు పట్టేంత ఘనపరిమాణమును కలిగియున్నది "**

క్రీ.శ. 1845 లో ప్రచురితమయిన బైబిల్ పారసీక అనువాద గ్రంథంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" అది రెండువేల కడవలు పట్టేంత ఘనపరిమాణమును కలిగియున్నది "**

అయితే క్రీ.శ. 1838 లో ప్రచురితమయిన బైబిల్ పారసీక అనువాద గ్రంథంలో రెండవ వాక్యం ఈ విధంగా పేర్కొనబడింది:

**" అది మూడువేల విగ్రహాలు పట్టేంత ఘనపరిమాణమును కలిగియున్నది "**

అయితే క్రీ.శ. 1845 లో ప్రచురితమయిన బైబిల్ పారసీక అనువాద గ్రంథంలో ఈ విధంగా పేర్కొనబడింది: **" అది రెండువేల కడవలు పట్టేంత ఘనపరిమాణమును కలిగియున్నది "** ఈ రెండు వాక్యాలలోనూ సంఖ్యాపరంగా ఉన్న వ్యత్యాసం 'వెయ్యి'.

**(అథఃసూచికలు)**

[173] ఇది బైబిల్ అరబీ అనువాద గ్రంథంలో పేర్కొనబడియున్నదానికి తెలుగు అనువాదం. బైబిల్ ఉర్దూ అనువాద గ్రంథంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది :

**" అది రెండువేల విగ్రహాలు పట్టేంత ఘనపరిమాణమును కలిగియున్నది "**

(రాజులు మొదటి గ్రంథము' 7 : 26 )

**" అది మూడువేల విగ్రహాలు పట్టేంత ఘనపరిమాణమును కలిగియున్నది "**

(దినవృత్తాంతములు రెండవ గ్రంథము' 4 : 5 )

# బబులోను ఖైదు నుంచి విడుదలయినవారి సంఖ్య?

## 42 వ వైరుధ్యం :

‘ఎజ్రా’ గ్రంథం యొక్క 2 వ అధ్యాయాన్ని ‘నెహెమ్యా’ గ్రంథం యొక్క 7 వ అధ్యాయంతో పోల్చి అధ్యయనం చేసిన వ్యక్తి ఎన్నో చోట్ల రెండింటి మధ్య తీవ్రస్థాయిలో వైరుధ్యమున్నట్లుగా కనుగొంటాడు. ఒకవేళ మనం వైరుధ్యాన్ని పరిగణనలోకి తీసుకోకున్నప్పటికీ మరొక తప్పు[174] రెండింటిలోనూ గోచరిస్తుంది. అదేమిటంటే రెండు చోట్లా మొత్తం సంఖ్య ఒకే విధంగా పేర్కొనబడి ఉంది. అనగా బబులోను ఖైదు నుంచి విడుదలయిన తర్వాత యెరూషలేముకు చేరుకున్నవారి మొత్తం సంఖ్య ‘నలభైరెండు వేల మూడువందల అరవై’ అని రెండు చోట్లా పేర్కొనబడి ఉంది. కానీ మనం ఈ అధ్యాయాలలో పేర్కొనబడిన వ్యక్తుల సంఖ్యను కూడినప్పుడు ఆ సంఖ్య మొత్తంగా లభించదు. అనగా ఎజ్రా గ్రంథంలో పేర్కొనబడిన వ్యక్తుల సంఖ్యను కూడినా మొత్తం ‘నలభైరెండు వేల మూడువందల అరవై’ కాజాలదు, అలాగే నెహెమ్యా గ్రంథంలో పేర్కొనబడిన వ్యక్తుల సంఖ్యను కూడినా మొత్తం ఆ సంఖ్య కాజాలదు. ఎజ్రా గ్రంథంలో పేర్కొనబడిన వ్యక్తుల సంఖ్యను కూడినప్పుడు మొత్తం ‘ఇరవైతొమ్మిది వేల ఎనిమిది వేల పద్దెనిమిది’ అవుతుంది. నెహెమ్యా గ్రంథంలో పేర్కొనబడిన వ్యక్తుల సంఖ్యను కూడినప్పుడు మొత్తం ‘ముప్పైఒకటి వేల ఎనభైతొమ్మిది’ అవుతుంది.

విచిత్రమైన విషయమేమిటంటే ఈ ఏకీభవించబడిన మొత్తం సంఖ్య చరిత్రకారుల వివరణ ప్రకారం తప్పు. యూసీఫస్[175] తన చరిత్ర గ్రంథం సంపుటి నెం.11 యొక్క 1 వ అధ్యాయంలో ఈ విధంగా పేర్కొన్నారు:

**“ బబులోను నుంచి యెరూషలేముకు వచ్చినవారి సంఖ్య నలభైరెండువేల నాలుగు వందల అరవైరెండు ”**

**(అథఃసూచికలు)**

174 ఈ విషయానికి సంబంధించి రెండు అధ్యాయాలలోనూ వ్యక్తుల పేర్ల మధ్య ఉన్న వైరుధ్యాలను వదిలివేసినప్పటికీ కేవలం వారి సంఖ్య విషయంలో ఇరవై వైరుధ్యాలున్నాయి. వాటిలో కొన్నింటిని నమూనా కొరకు మేము ప్రక్కపేజీలో ఒక పట్టిక రూపంలో అందజేస్తున్నాము. అందులో బబులోను ఖైదు నుంచి విడుదలయినవారి సంఖ్య పేర్కొనబడింది.

175 ఇతడు ఒక యూదు జ్యోతిష్కుడు. ఇతడు తన కాలానికి చెందిర రాజులకు ఎంతో ఇష్టుడు. ఇతడు గ్రీకు భాషలో తన జాతికి చెందిన చరిత్రను వ్రాశాడు.



| వాక్యం నెం. | ‘ఎజ్రా గ్రంథము’ 2 వ అధ్యాయంలోని వాక్యాలు | వాక్యం నెం. | ‘నెహెమ్యా గ్రంథము’ 7 వ అధ్యాయంలోని వాక్యాలు |
|---|---|---|---|
| 6 | ‘పహత్మోయాబు వంశస్థులు యేషూవ యోవాబు వంశస్థులతో కూడ రెండు వేల ఎనిమిది వందల పండ్రెండుగురు’ | 11 | ‘ యేషూవయోవాబు సంబంధులైన పహత్మోయాబు వంశస్థులు రెండువేల ఎనిమిదివందల పదునెనిమిదిమందియు |
| 8 | ‘జత్తూ వంశస్థులు తొమ్మిదివందల నలువది యయిదుగురు’ | 13 | ‘జత్తూ వంశస్థులు ఎనిమిదివందల నలువది యయిదుగురు’ |
| 12 | ‘అజ్గాదు వంశస్థులు వెయ్యిన్ని రెండువందల ఇరువది యిద్దరు’ | 17 | ‘అజ్గాదు వంశస్థులు రెండువేల మూడువందల ఇరువది యిద్దరును’ |
| 15 | ‘ఆదీను వంశస్థులు నాలుగువందల ఏబది నలుగురు’ | 20 | ‘ఆదీను వంశస్థులు ఆరువందల ఏబది యయిదుగురు’ |
| 19 | ‘హాషుము వంశస్థులు రెండువందల ఇరువది ముగ్గురు’ | 22 | ‘హాషుము వంశస్థులు మూడువందల ఇరువది యెనమండుగురును’ |
| 28 | ‘బేతేలు హాయి మనుష్యులు రెండువందల ఇరువది యిద్దరు’ (తెలుగు బైబిల్ అనువాద గ్రంథము) | 32 | ‘బేతేలు హాయిలవారు నూట ఇరువది ముగ్గురును’ |

హెన్రీ వాస్కాట్ వ్యాఖ్యాన గ్రంథం యొక్క కూర్పుకర్తలు ‘ఎజ్రా’ గ్రంథంలో పేర్కొనబడిన విషయం గురించి వ్యాఖ్యానిస్తూ ఈ విధంగా పేర్కొన్నారు :

“ ఈ అధ్యాయంలోనూ, నెహెమ్యా గ్రంథంలోని అధ్యాయంలోనూ లేఖకుల తప్పు వల్ల ఎంతో పెద్ద వైరుధ్యమేర్పడింది. ఇంగ్లిష్ అనువాద గ్రంథం సంస్కరించబడినప్పుడు దానిలోని

ఎన్నో భాగాలను[176] ఇతర ప్రతులతో పోల్చి చూసిన తర్వాత సంస్కరించడం జరిగింది. మిగిలినవాటి విషయం గ్రీకు అనువాదం హెబ్రూ మూలప్రతి యొక్క వ్యాఖ్యానంలో నిర్ణయించబడింది"

దీనినిబట్టి ఇప్పుడు మీరు వారి (క్రైస్తవుల) పరిశుద్ధ గ్రంథాల పరిస్థితిని పరిశీలించండి. వారు (క్రైస్తవులు) 'సంస్కరణ' లేదా 'పరిష్కరణ' పేరుతో ఎంతటి స్థాయిలో ప్రక్షిప్తాలకు పాల్పడతారంటే శతాబ్దాల తరబడి ఆమోదించబడుతూవచ్చిన విషయం సైతం ఒక్క క్షణంలోనే చెత్త దులిపివేయబడినట్లుగా తొలగించివేయబడుతుంది. అయినప్పటికీ ఇంకా తప్పులు మిగిలే ఉన్నాయి.

న్యాయవంతమైన విషయమేమిటంటే ఈ గ్రంథాలు మూలం రీత్యానే తప్పులతో కూడుకొని ఉన్నట్టివి. వాటిని సంస్కరించేవారు లేదా పరిష్కరించేవారు చేసిన తప్పు ఏమిటంటే వారు ఆ తప్పులను సంస్కరించలేక వివశత్వానికి లోనయినప్పుడు వాటిని ఏ పాపం ఎరుగని లేఖకుల మీదికి మోపారు. అయితే లేఖకులకు తమపై మోపబడుతున్న నిందకు సంబంధించిన కుట్ర గురించి ఏమీ తెలియదు. ఇప్పటికీ ఏ వ్యక్తయినా 'ఎజ్రా' గ్రంథం యొక్క 2 వ అధ్యాయాన్ని, 'నెహెమ్యా' గ్రంథం యొక్క 7 వ అధ్యాయాన్ని పరిశీలించినప్పుడు వాటిలో ఉన్న తప్పులు మరియు వైరుధ్యాలు 20 కి మించి ఉన్నట్లుగా కనుగొంటాడు. ఇక ముమ్మందు వారు ఇంకా ఎటువంటి ప్రక్షిప్తాలకు పాల్పడతారో దేవుడికే ఎరుక.

## అబీయా తల్లి ఎవరు? 43 వ వైరుధ్యం :

'దినవృత్తాంతములు రెండవ గ్రంథము' యొక్క 13 వ అధ్యాయపు 2 వ వాక్యంలో అబీయా రాజు యొక్క తల్లి గురించి ఈ విధంగా పేర్కొనబడింది :

**" అతని తల్లి పేరు మీకాయా, ఆమె గిబియా ఊరివాడైన ఊరియేలు కుమార్తె "**

అయితే 'దినవృత్తాంతములు రెండవ గ్రంథము' లోనే 11 వ అధ్యాయపు[177] 20 వ వాక్యంలో అబీయా రాజు తల్లి అబ్షాలోము కుమార్తెయైన మయకా అని తెలుస్తుంది. అయితే

**(అథఃసూచికలు)**

[176] ఇప్పటికీ బైబిల్ ఇంగ్లిష్ అనువాద గ్రంథంలో దాదాపు ఇరవై వైరుధ్యాలు ఉన్నాయి. గమనించదగిన విషయమేమిటంటే 'ఎన్నో భాగాలను సంస్కరించిన తరువాత' ఈ పరిస్థితి ఉంటే ఇక అంతకు ముందు పరిస్థితి ఏమిటో!



అందుకు విరుద్ధంగా 'సమూయేలు రెండవ గ్రంథము' యొక్క 14 వ అధ్యాయపు 27 వ వాక్యం ద్వారా అబ్షాలోముకు ఒకే కుమార్తె అని, ఆమె పేరు 'తామారు'[178] అని తెలుస్తుంది.

## 44 వ వైరుధ్యం :

'యెహోషువ' గ్రంథము యొక్క 10 వ అధ్యాయం ద్వారా ఇశ్రాయేలీయులు యెరూషలేము రాజును హతమార్చినప్పుడు అతడి రాజ్యాన్ని ఆక్రమించినట్లుగా తెలుస్తుంది. అయితే అదే గ్రంథం యొక్క 15 వ అధ్యాయపు 63 వ వాక్యం ద్వారా ఇశ్రాయేలీయులు యెరూషలేమును ఆక్రమించుకోలేదని తెలుస్తుంది.[179]

## అల్లాహ్ (యెహోవా)యా లేక సాతానా? 45 వ వైరుధ్యం :

'సమూయేలు రెండవ గ్రంథము' యొక్క 24 వ అధ్యాయపు 1 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది :

**" ఇంకొకమారు యెహోవా కోపము ఇశ్రాయేలీయుల మీద రగులుకొనగా ఆయన దావీదును వారి మీదికి ప్రేరేపణచేసి - నీవు పోయి ఇశ్రాయేలువారిని యూదావారిని లెక్కించుమని అతనికి ఆజ్ఞ ఇచ్చెను "**

అయితే 'దినవృత్తాంతములు మొదటి గ్రంథము' యొక్క 21 వ అధ్యాయపు 1 వ

**(అథఃసూచికలు)**

[177] అలాగే 'రాజులు మొదటి గ్రంథము' యొక్క 15 వ అధ్యాయపు 2 వ వాక్యం లో ఈ విధంగా పేర్కొనబడి ఉంది: **" అతని తల్లి పేరు మయకా, ఆమె అబీషాలోము కుమార్తె "**

[178] **" అబ్షాలోమునకు ముగ్గురు కుమారులను తామారు అనునొక కుమార్తెయు పుట్టిరి; ఆమె బహు సౌందర్యవతి "** ( 'సమూయేలు రెండవ గ్రంథము' , 14 : 27 )

[179] **" యెరూషలేములో నివసించిన యెబూసీయులను యూదా వంశస్థులు తోలివేయలేకపోయిరి గనుక యెబూసీయులు నేటివరకు యెరూషలేములో యూదా వంశస్థులయొద్ద నివసించుచున్నారు"** ( 'యెహోషువ' , 15 : 63 )

వాక్యం ద్వారా దావీదును వారి మీదికి ప్రేరేపించినది యెహోవా కాదని, సాతాను[180] అని తెలుస్తుంది. అయితే క్రైస్తవుల విశ్వాసం ప్రకారం దేవుడు చెడుకు సృష్టికర్త కాడు గనుక ఇక్కడ గొప్ప వైరుధ్యమేర్పడింది.

## 46 వ వైరుధ్యం నుంచి 51 వ వైరుధ్యం వరకు :

ఏ వ్యక్తయితే మత్తయి సువార్తలో పేర్కొనబడిన ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా(అ)) యొక్క వంశావళిని లూకా సువార్తలో పేర్కొనబడిన వంశావళితో పోల్చి అధ్యయనం చేస్తాడో అతడు రెండింటి మధ్య గొప్ప వైరుధ్యాన్ని కనుగొంటాడు.

# దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) వంశావళి విషయంలో తీవ్రస్థాయిలో వైరుధ్యం

### మొదటి వైరుధ్యం :

మత్తయి సువార్త ద్వారా 'యాకోబు కుమారుడయిన యోసేపు' అని తెలుస్తుంది. అయితే లూకా సువార్త ద్వారా 'హేలీ కుమారుడయిన యోసేపు' అని తెలుస్తుంది.[181]

(అథఃసూచికలు)

180 **" తరువాత సాతాను ఇశ్రాయేలునకు విరోధముగా లేచి, ఇశ్రాయేలీయులను లెక్కించుటకు దావీదును ప్రేరేపింపగా "** ( 'సమూయేలు రెండవ గ్రంథము' , 14 : 27 )

181 ఇక్కడ 'యోసేపు' అంటే బైబిల్ లో హజ్రత్ మర్యమ్ (అ) (మరియ) భర్తగా పేర్కొనబడిన వ్యక్తి. **" యాకోబు మరియ భర్తయైన యోసేపును కనెను "** ( 'మత్తయి' , 1 : 16 )

**" ఆయన యోసేపు కుమారుడని యెంచబడెను. యోసేపు హేలీకి (కుమారుడు) "**

( 'లూకా' , 3 : 23, 24 )



### రెండవ వైరుధ్యం :

మత్తయి సువార్త [182] ద్వారా దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) దావీదు కుమారులయిన సొలొమోను (దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ)) సంతతికి చెందినవారని తెలుస్తుంది. అయితే లూకా సువార్త [183] ద్వారా ఆయన దావీదు కుమారులయిన నాతాను సంతతికి చెందినవారని విదితమవుతుంది.

### మూడవ వైరుధ్యం :

మత్తయి సువార్త ద్వారా దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) పూర్వీకులు దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ) (దావీదు) ద్వారా...... బబులోను బహిష్కరణ వరకు అందరూ ప్రసిద్ధ రాజులని తెలుస్తుంది. అయితే అందుకు విరుద్ధంగా లూకా సువార్త ద్వారా వారిలో దైవప్రవక్త దావూద్ (అ) (దావీదు) మరియు నాతాను తప్ప ఏ ఒక్క వ్యక్తీ రాజా కాడు, ప్రసిద్ధ వ్యక్తీ కాడు.[184]

### నాల్గవ వైరుధ్యం :

మత్తయి సువార్త ద్వారా షయల్తీయేలు యెకొన్యా కుమారుడని తెలుస్తుంది. అయితే లూకా సువార్త ద్వారా అతడు నేరి కుమారుడని తెలుస్తుంది.[185]

### ఐదవ వైరుధ్యం :

మత్తయి సువార్త ద్వారా జెరుబ్బాబెలు కుమారుని పేరు 'అబీహూదు' అని తెలుస్తుంది.

(అథఃసూచికలు)

182 'మత్తయి సువార్త' , 1 : 6

183 'లూకా సువార్త' , 3 : 31

184 మత్తయి సువార్తలో ప్రసిద్ధ రాజులందరి పేర్లు పేర్కొనబడి ఉన్నాయి. అయితే లూకా సువార్తలో ఆ పేర్ల స్థానంలో పూర్తిగా తెలియబడని, ప్రసిద్ధులు కాని వ్యక్తుల పేర్లు పేర్కొనబడి ఉన్నాయి.

185 'మత్తయి సువార్త' , 1 : 12 , 'లూకా సువార్త' , 3 : 27

అయితే లూకా సువార్త ద్వారా జెరుబ్బాబెలు కుమారుని పేరు 'రేసా' అని తెలుస్తుంది.[186] అయితే మరింత ఆసక్తికరమైన, విచిత్రమైన విషయమేమిటంటే 'దినవృత్తాంతములు మొదటి గ్రంథము' యొక్క 3 వ అధ్యాయంలో జెరుబ్బాబెలు యొక్క కుమారుల పేర్లు పేర్కొనబడి ఉన్నాయి. వాటిలో 'రేసా' అనే పేరూ లేదు, 'అబీహూదు' అనే పేరూ లేదు. కనుక వాస్తవానికి రెండూ (అనగా మత్తయి సువార్తలోనూ, లూకా సువార్తలోనూ ఈ అంశానికి సంబంధించి పేర్కొనబడిన విషయాలు) తప్పేనని విదితమవుతోంది.[187]

## దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ) (దావీదు) నుంచి దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) వరకు ఎన్ని తరాలు? ఆరవ వైరుధ్యం :

మత్తయి సువార్త ద్వారా దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ) (దావీదు) నుంచి దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) వరకు ఉన్న తరాల సంఖ్య 26. అయితే అందుకు విరుద్ధంగా లూకా సువార్తలో తరాల సంఖ్య 41 అని పేర్కొనబడింది. దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ) (దావీదు) కు, దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) కు నడుమ వెయ్యి సంవత్సరాల అంతరముంది. కనుక మొదటి ప్రస్తావన ప్రకారం, అనగా మత్తయి సువార్తలో పేర్కొనబడిన వివరణ ప్రకారం ప్రతి రెండు తరాలకు నడుమ 40 సంవత్సరాల అంతరమున్నట్లుగా భావించాలి. అలాగే రెండవ ప్రస్తావన ప్రకారం, అనగా లూకా సువార్తలో పేర్కొనబడిన వివరణ ప్రకారం ప్రతి రెండు తరాలకు నడుమ 25 సంవత్సరాల అంతరమున్నట్లుగా భావించాలి. రెండు వివరణల మధ్యా ఎంతటి

**(అథఃసూచికలు)**

186 'మత్తయి సువార్త' , 1 : 13 , 'లూకా సువార్త' , 3 : 27

187 'దినవృత్తాంతములు మొదటి గ్రంథము' యొక్క 3 వ అధ్యాయపు 19 వ మరియు 20 వ వాక్యాలలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" జెరెబ్బాబెలు కుమారులు మెషుల్లాము హనన్యా; షెలోమీతు వారికి సహోదరి. హషుబా ఓహెలు బెరెక్యా హసద్యా యూషబెస్హెదు అను మరి యయిదుగురుండిరి "**

ఈ విషయమే పాఠకులచే చదువబడుతున్న ఈ గ్రంథం యొక్క మూడవ ప్రకరణంలోని 'తప్పులు' అనే విభాగంలో తప్పు నెం. 48 లో కూడా పేర్కొనబడింది.

188 **Eichchorn** ఎయిఖోరన్ జర్మనీకి చెందిన ప్రసిద్ధ ప్రొటెస్టెంట్ క్రైస్తవ పండితుడు.



వైరుధ్యముందంటే సాధారణ స్థాయిలో పరిశీలించినప్పటికీ అది తేటతెల్లమయిపోతుంది. అందుకే క్రైస్తవ పండితులు ఈ రెండు సువార్తలు ప్రసిద్ధమయిన కాలం నుంచి నేటివరకు ఆశ్చర్యానికి, ఆందోళనకు గురయిన స్థితిలోనే ఉన్నారు. అలాగే వారు ఈ విషయంలో బలహీనమైన వివరణలను అందజేస్తూ ఉంటారు. అందుకే సత్యశోధకులకు చెందిన పెద్ద వర్గం, ఉదాహరణకు ఎయిఖోరన్ [188], కీన్‌రోహీస్, డియోట్, వైజ్ మరియు ఫరష్ మొదలయినవారు ఈ రెండు వివరణల నడుమ నిజంగానే అర్థవంతమైన వైరుధ్యముందని అంగీకరించారు. ఈ విషయం సత్యమైనది మరియు న్యాయానికి పూర్తిగా అనుగుణమైనది. ఎందుకంటే ఏవిధంగానయితే ఈ రెండు సువార్తల్లో వేరేచోట్ల తప్పులు, వైరుధ్యాలు ఉత్పన్నమయ్యాయో అదేవిధంగా ఇక్కడ కూడా ఈ వైరుధ్యం చోటుచేసుకుంది. ఒకవేళ ఈ రెండు సువార్తలూ ఇక్కడ తప్ప మిగిలిన చోట్ల తప్పులు, వైరుధ్యాలు లేకుండా సరిగ్గా ఉన్నట్లయితే నిస్సందేహంగా ఇక్కడ చోటుచేసుకున్న వైరుధ్యానికి గాను బలహీనమైన వివరణను అందజేయడం సముచితంగా భావించబడేది, అటువంటి వివరణ కూడా సత్యదూరమే అయినప్పటికీ.

ఆడమ్ క్లార్క్ లూకా సువార్త యొక్క 3 వ అధ్యాయానికి సంబంధించి అందించిన వ్యాఖ్యానంలో ఆ బలహీనమైన వివరణలను అయిష్టంగా ఉల్లేఖించినప్పటికీ ఆశ్చర్యాన్ని సైతం వ్యక్తం చేశారు. ఆ తర్వాత మిస్టర్ హార్మర్‌సీ యొక్క అసమంజసమైన, ఆమోదయోగ్యం కాని తప్పుడు వివరణను 5 వ సంపుటి యొక్క 408 వ పేజీలో ఈ విధంగా ఉల్లేఖించారు :

" వంశావళి సంబంధిత పత్రాలు యూదుల వద్ద అత్యుత్తమ రీతిలో భద్రంగా ఉండేవి. వివేకి అయిన ప్రతి వ్యక్తికీ మత్తయి మరియు లూకా దేవుని వంశావళి గురించి పేర్కొనడంలో ఎంతటి తీవ్రమైన వైరుధ్యానికి పాల్పడ్డారంటే దాని కారణంగా ప్రాచీన కాలానికి చెందిన మరియు నవీన కాలానికి చెందిన పండితులందరూ దిగ్భ్రమకు, కలవరపాటుకు గురయి దిక్కుతోచని స్థితికి చేరుకున్నారనే విషయం తెలుసు. అయితే ఏవిధంగానయితే కూర్పుకర్త పట్ల వేరేచోట్ల ఎన్నో అభ్యంతరాలు వ్యక్తమయినప్పటికీ కొంతకాలం గడచిన తర్వాత అవే అభ్యంతరాలు అతడికి మద్దతు తెలిపేందుకై సన్నద్ధమయ్యాయో అదేవిధంగా ఈ అభ్యంతరం కూడా కమ్ముకున్న మబ్బు తొలగిపోయినప్పుడు రచయితకు మద్దతు తెలిపేదిగా, సహకారిగా రూపొందుతుంది. కాలం ఆ విధంగా తప్పకుండా చేస్తుంది "

ఏదిఏమయినప్పటికీ 'ఈ వైరుధ్యం ఎంతటి తీవ్రమైన వైరుధ్యమంటే దీని విషయంలో ప్రాచీన కాలానికి చెందిన మరియు నవీన కాలానికి చెందిన సత్యశోధకులయిన పండితులు కలవరపాటుకు గురయ్యారు' అనే విషయాన్ని ఈయన అంగీకరించారు. అయితే 'వంశావళి సంబంధిత పత్రాలు యూదుల వద్ద అత్యుత్తమ రీతిలో భద్రంగా ఉండేవి' అని ఈయన పేర్కొన్న

విషయం మాత్రం పూర్తిగా తిరస్కరించదగిన తప్పుడు విషయం. ఎందుకంటే ఆ పత్రాలను ప్రమాదాల తుపానులు చెల్లాచెదురు చేసివేశాయి. ఆ కారణంగానే దైవప్రవక్త హజ్రత్ ఉజైర్ (అ) (ఎజ్రా) మరియు ఇద్దరు దైవప్రవక్తల ద్వారా వంశావళికి సంబంధించిన వివరణల్లో తప్పులు దొర్లాయి. పైన పేర్కొనబడిన వ్యాఖ్యాత కూడా ఈ విషయాన్ని అంగీకరించే విషయంలో వివశులయ్యారు. ఈ విషయం గురించి పాఠకులకు వారిచే చదువబడుతున్న ఈ గ్రంథం యొక్క 2 వ అధ్యాయంలోని లక్ష్యం-1 యొక్క ఋజువు నెం. 16 ద్వారా తెలుస్తుంది. మరి దైవప్రవక్త హజ్రత్ ఉజైర్ (అ) (ఎజ్రా) కాలంలో పరిస్థితి ఆ విధంగా ఉంటే దానినిబట్టి దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) శిష్యుల కాలంలో పరిస్థితి ఎలా ఉండేదో అంచనా వేయవచ్చు. అలాగే యాజకుల, ప్రభువుల వంశావళికి చెందిన పత్రాలు సైతం సురక్షితంగా ఉండలేకపోయినప్పుడు పేద వడ్రంగి అయిన యోసేపు[189] వంశావళికి చెందిన పత్రాలు సురక్షితంగా ఉంటాయని ఎలా భావించగలము?

బైబిల్ ప్రకారం ముగ్గురు విశ్వసనీయులైన దైవప్రవక్తల ద్వారా వంశావళిని పేర్కొనే విషయంలో ఇంతటి తప్పు జరిగే, వైరుధ్యం చోటుచేసుకునే అవకాశమున్నప్పుడు, తప్పొప్పుల విచక్షణా జ్ఞానం సైతం వారికి లేనట్లుగా భావించవలసి వచ్చినప్పుడు మత్తయి సువార్త అనువాదకుని గురించి మనం ఏమి భావించాలి? అసలు మత్తయి సువార్త అనువాదకుడు విశ్వసనీయుడా? కాడా? అనే విషయాన్ని, అలాగే అతడు దైవవాణిని గ్రహించే ఎన్నుకోబడిన వ్యక్తా? కాదా? అనే విషయాలను పక్కనబెడితే అసలు ఇంతవరకు అతడి పేరే తెలియరాలేదు. అదేవిధంగా నిశ్చయంగా ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) శిష్యుడే కానటువంటి, దైవవాణిని గ్రహించే దివ్య ప్రేరేపితుడో కాడో తెలియబడని లూకా విషయంలో ఎటువంటి అభిప్రాయాన్ని కలిగియుండగలము?

కనుక బహుశా వారిద్దరికీ (మత్తయి సువార్త మరియు లూకా సువార్త అనువాదకులకు) నజరేయుడైన యోసేపు వంశావళికి సంబంధించి రెండు విభిన్న పత్రాలు లభ్యమయి ఉండవచ్చు. అలాగే వాటిలోని తప్పొప్పుల మధ్య వ్యత్యాసాన్ని కనుగొనలేకపోయిన కారణంగా వారిలో ఒకరు తన ఆలోచన మరియు అంచనా ప్రకారం సముచితంగా తోచిన పత్రాన్ని విశ్వసించి ఉండవచ్చు,

**(అథఃసూచికలు)**

189 వడ్రంగి అయిన యోసేపు బైబిల్ లో అందజేయబడిన వివరణ ప్రకారం హజ్రత్ మర్యమ్ (అ) (మరియ) కాబోయే భర్త. ఆయన నజరేతు పట్టణంలో వడ్రంగిగా పనిచేసేవారు. ప్రాపంచికంగా ఆయన ప్రసిద్ధులు కారు.



మధ్య వ్యత్యాసాన్ని కనుగొనలేకపోయిన కారణంగా వారిలో ఒకరు తన ఆలోచన మరియు అంచనా ప్రకారం సముచితంగా తోచిన పత్రాన్ని విశ్వసించి ఉండవచ్చు, మరొకరు తన ఆలోచన మరియు అంచనా ప్రకారం సముచితంగా తోచిన మరొక పత్రాన్ని విశ్వసించి ఉండవచ్చు.

మిస్టర్ హార్‌మర్‌సీ " కాలం ఆ విధంగా తప్పకుండా చేస్తుంది " అని ఆశించడమనేది ఇన్‌షాఅల్లాహ్ ఎప్పటికీ నిజం కాజాలని స్వప్నమే. ఎందుకంటే పద్దెనిమిది వందల సంవత్సరాల సుదీర్ఘకాలంలో ఈ నింద తొలగిపోజాలనప్పుడు, ముఖ్యంగా యూరప్ దేశాలలో బుద్ధిపరమైన, ఉల్లేఖనాపరమైన విద్యల అభివృద్ధి గత మూడు శతాబ్దాలలో పరాకాష్ఠకు చేరుకున్నప్పుడు, మతపరమైన పరిశోధనలను సైతం తనలో ఇముడ్చుకునేంతటి స్థాయిలో పరిశోధనల పరిధి విస్తృతమయినప్పుడు, ఆ పరిశోధనల పర్యవసానంగా ముందుగా వారు మతంలో కొన్ని సంస్కరణలు చేపట్టారు. ఆ విధంగా సర్వసాధారణంగా గుర్తించబడుతూ వస్తున్న మతాన్ని మొదటి దెబ్బతోనే అసత్యమైనదిగా తీర్మానించేశారు.

అదేవిధంగా క్రైస్తవ సమాజమంతటికీ అతిపెద్ద నాయకునిగా పరిగణించబడే పోప్ మోసగాడని తీర్మానించేశారు. దానితో సంస్కరణల విషయంలో వారి మధ్య విభేదాలు, వైరుధ్యాలు తలెత్తాయి. అలాగే కొన్ని వర్గాలు ఉనికిలోకి వచ్చి రోజురోజుకూ మతం విషయంలో చోటుచేసుకున్న అపసవ్యతలను సంస్కరించసాగాయి. చివరకు వారికి చెందిన ఎంతోమంది సత్యశోధకులయిన పండితుల పరిశోధనల పర్యవసానంగా వారు సంస్కరణ విషయంలో తారాస్థాయికి చేరుకున్నారు. అలాగే వారు క్రైస్తవ మతాన్ని చివరకు అసత్యమైనదిగా, నిరాధారమైన కథల, గాథల, వ్యర్థమైన విషయాల, మూఢనమ్మకాల సముచ్ఛయంగా తీర్మానించేశారు. కనుక ఇప్పుడు మున్ముందు మరే యుగంలోనయినా ఈ నింద లేదా అభ్యంతరం తొలగిపోయేలా స్పష్టమైన వివరణ వెలువడగలదని ఆశించడం వ్యర్థం.

## క్రైస్తవుల తరఫు నుంచి ఈ వైరుధ్యానికి గాను అందించబడిన వివరణ, దానికి సమాధానం :

ఈ వైరుధ్యానికి గాను నేడు క్రైస్తవ వ్యాఖ్యాతల తరఫు నుంచి క్రింద పేర్కొనబడిన వివరణ ఎక్కువగా అందించబడుతోంది:

" బహుశా మత్తయి యోసేపు వంశావళి గురించి, లూకా మరియ వంశావళి గురించి పేర్కొని ఉండవచ్చు. అలాగే యోసేపు హేలీ అల్లుడయి ఉండవచ్చు. హేలీకి కుమారులెవరూ లేకపోయి ఉండవచ్చు. అందుకే యోసేపు హేలీ కుమారునిగా ఆపాదించబడి ఉండవచ్చు. ఆవిధంగా అతడు వంశావళి క్రమంలో పేర్కొనబడి ఉండవచ్చు." అయితే ఈ వివరణ కొన్ని కారణాల

రీత్యా తిరస్కరించదగినది.

**మొదటి** కారణమేమిటంటే ఈ వివరణను ఆమోదించిన పక్షంలో దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) నాతాను సంతతికి చెందినవారిగా పరిగణించబడతారే గానీ దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) (సొలొమోను) సంతతికి చెందినవారిగా పరిగణించబడరు. ఎందుకంటే ఆయనకు చెందిన వాస్తవిక వంశావళి క్రమం తల్లి తరపు నుంచి ఉంటుంది. ఆ విధంగా వడ్రంగి అయిన యోసేపు యొక్క వంశావళి క్రమం ఇక్కడ ఎంతమాత్రం పరిగణించబడదు. దాని పర్యవసానంగా ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) ఏసుగా మిగలరు.[190] అందుకే ప్రొటెస్టెంట్ వర్గానికి చెందిన పండితుడయిన కాల్విన్ ఈ వివరణను తిరస్కరిస్తూ ఈ విధంగా పేర్కొన్నారు:

" ఏ వ్యక్తయితే ఏసు వంశావళి క్రమం నుంచి సొలొమోనును తొలగిస్తాడో అతడు ఏసును ఏసుగా తొలగిస్తున్నట్లే. "

**రెండవ** కారణమేమిటంటే విశ్వసనీయమైన చారిత్రక ఆధారాల ద్వారా హజ్రత్ మర్యమ్ (అ) (మరియ) హేలీ కుమార్తెగా, నాతాను సంతతికి చెందినవారని ఋజువు కానంతవరకు ఈ వివరణ సరియైనదిగా పరిగణించబడజాలదు. ముఖ్యంగా ఆడమ్ క్లార్క్ వంటి సత్యశోధకులయిన పండితులు ఈ వివరణను తిరస్కరిస్తున్నప్పుడు మరియు వారి నాయకుడయిన కాల్విన్ సైతం దానిని నిరాకరించినప్పుడు ఈ విషయంలో కేవలం అంచనాలు మాత్రమే ప్రామాణికం కాజాలవు. ఈ రెండు విషయాలు ఏదయినా పటిష్ఠమైన ఆధారం ద్వారా నిరూపితమవడం సంగతి అటు ఉంది ఏ బలహీన ఆధారం ద్వారానూ నిరూపితం కాలేదు.

పైగా ఈ రెండు విషయాలకు విరుద్ధంగా ఋజువు ఉన్నది. ఎందుకంటే 'యాకోబు సువార్త' లో హజ్రత్ మర్యమ్ (అ) (మరియ) తల్లిదండ్రుల పేర్లు 'యెహోయాకీము మరియు ఆనా' అని పేర్కొనబడింది. ఈ సువార్త మన సమకాలికులయిన క్రైస్తవుల దృష్టిలో దైవప్రేరణ చే వ్రాయబడినదిగా, ఏసు శిష్యులయిన యాకోబుచే వ్రాయబడినదిగా పరిగణించబడనప్పటికీ అది వారి పూర్వీకులయిన క్రైస్తవ పండితులచే కల్పింపబడిన, వ్రాయబడిన అతి ప్రాచీన గ్రంథమనే విషయంలో మాత్రం ఎట్టి సందేహమూ లేదు. అలాగే 'యాకోబు సువార్త' ను వ్రాసిన వ్యక్తి

**(అధఃసూచికలు)**

190 ఎందుకంటే ఏ ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) రాకడ గురించయితే శుభవార్తలు, భవిష్యద్వాణులు పేర్కొనబడుతూ వచ్చాయో వాటిలో ఆయన దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) (సొలొమోను) సంతతికి చెందినవారయి ఉంటారనే వివరణ ఇమిడి ఉంది.



దైవప్రవక్త హజ్రత్ ఈసా(అ)(ఏసు) కాలానికి సమీప కాలంలో జీవించిన వ్యక్తి. అందుకే 'యాకోబు సువార్త' స్థాయి కనీసం విశ్వసనీయమైన చరిత్ర గ్రంథం స్థాయి కంటే ఎట్టి పరిస్థితుల్లోనూ తక్కువ కాజాలదు. అలాగే ఒక అప్రామాణికమైన శంక దానిని ఎదుర్కొనజాలదు.

ఆగస్టైన్ తన కాలంలో ఉనికిలో ఉన్న ఏదో పుస్తకంలో క్రింది వివరణ పేర్కొనబడి ఉందని పేర్కొన్నారు:

" మరియ (హజ్రత్ మర్యమ్ (అ)) లేవీ జాతీయురాలు"

ఇది ' హజ్రత్ మర్యమ్ (అ) (మరియ) నాతాను సంతతికి చెందినవారు' అనే విషయానికి విరుద్ధమైనది. అంతేగాకుండా బైబిల్ పాతనిబంధన గ్రంథంలోని సంఖ్యాకాండంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది :

**" మరియు ఇశ్రాయేలీయులకు వారి వారి పితరుల స్వాస్థ్యము కలుగునట్లు, ఇశ్రాయేలీయుల గోత్రములలో స్వాస్థ్యముగల ప్రతి కుమార్తెయు తన తండ్రి గోత్రవంశములోనే పెండ్లి చేసుకొనవలెను. స్వాస్థ్యము ఒక గోత్రములో నుండి వేరొక గోత్రమునకు పోకూడదు. ఇశ్రాయేలీయుల గోత్రములు వారి వారి స్వాస్థ్యములో నిలిచియుండవలెను "**

( 'సంఖ్యాకాండము' , 36 : 8, 9 )

అలాగే లూకా సువార్తలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" జెకర్యా అను ఒక యాజకుడుండెను. అతని భార్య అహరోను కుమార్తెలలో ఒకతె"**

( 'లూకా సువార్త' , 1 : 5 )

సువార్తల ద్వారా హజ్రత్ మర్యమ్ (అ) (మరియ) దైవప్రవక్త హజ్రత్ జకరియ్యా (అ) (జెకర్యా) సతీమణికి దగ్గరి బంధువనే విషయం కూడా మనకు తెలుస్తుంది. దీనినిబట్టి హజ్రత్ మర్యమ్ (అ) (మరియ) కూడా దైవప్రవక్త హజ్రత్ హారూన్ (అ)(అహరోను) సంతతికి చెందినవారని తెలుస్తోంది. తౌరాతు గ్రంథంలో పేర్కొనబడిన ఆదేశం ప్రకారం ఇశ్రాయేలీయులకు చెందిన స్త్రీ తన వంశానికి చెందిన పురుషుడినే వివాహం చేసుకోవాలి. కనుక హజ్రత్ మర్యమ్ (అ) (మరియ) కాబోయే భర్తగా పేర్కొనబడిన వ్యక్తి (అనగా వడ్రంగి అయిన యోసేపు) కూడా హజ్రత్ హారూన్ (అ)(అహరోను) సంతతికి చెందినవారిగా భావించవలసి ఉంటుంది. ఆ విధంగా రెండు సువార్తల్లో (మత్తయి సువార్త మరియు లూకా సువార్త) పేర్కొనబడిన వారి వంశావళి క్రమాలు తప్పుయినవిగా తేలుతాయి. బహుశా దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) ను దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ)(దావీదు) సంతతికి చెందినవారిగా నిరూపించే లక్ష్యంతోనే త్రిత్వ సిద్ధాంతాన్ని విశ్వసించేవారు ఆ వంశక్రమాలను కల్పించి ఉండవచ్చు. తద్వారా "వాగ్దానం చేయబడిన క్రీస్తు

ఈయన కారు. ఎందుకంటే ఈయన దైవప్రవక్త హజ్రత్ హారూన్ (అ)(అహరోను) సంతతికి చెందినవారు. వాస్తవానికి వాగ్దానం చేయబడిన క్రీస్తు దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ)(దావీదు) సంతతికి చెందినవారయి ఉండాలి." అని పేర్కొంటూ యూదులు ఏసును (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) వాగ్దానం చేయబడిన క్రీస్తు అనే విషయాన్ని తిరస్కరించలేని పరిస్థితి ఏర్పడాలనేది వారి లక్ష్యం.

ఈ ప్రమాదం నుంచి రక్షించబడేందుకై రెండు వేర్వేరు వర్గాలకు చెందినవారు రెండు వేర్వేరు వంశావళి క్రమాలను కల్పించారు. ఈ సువార్తలు క్రీస్తుశకం రెండవ శతాబ్దం చివరివరకు ప్రసిద్ధి చెందలేకపోయాయి. కనుక ఒక వంశావళి క్రమాన్ని కల్పించిన వ్యక్తికి రెండవ వర్గానికి చెందిన వ్యక్తి కల్పన పట్ల అవగాహన లేకుండాపోయింది. దాని పర్యవసానంగా వైరుధ్యం ఏర్పడింది.

**మూడవ** కారణమేమిటంటే ఒకవేళ హజ్రత్ మర్యమ్ (అ) (మరియ) హేలీ కుమార్తె అయిన పక్షంలో ఆ విషయం ప్రాచీన కాలానికి చెందిన క్రైస్తవ పండితులకు తెలియకుండా ఎలా ఉంటుంది? ఒకవేళ వారికి ఆ విషయం గురించి ఏమాత్రం తెలిసినా వారు ఇటువంటి అసత్యమైన, బలహీనమైన వివరణలను ఎంతమాత్రం అందజేసేవారు కాదు, వాటిని నవీన కాలానికి చెందిన క్రైస్తవ పండితులు నిరాకరించేవారు కాదు, వారిని తీవ్రస్థాయిలో విమర్శించేవారూ కాదు.

**నాల్గవ** కారణమేమిటంటే మత్తయి సువార్తలో ఈ విధంగా పేర్కొనబడింది :

**" యాకోబు మరియ భర్తయైన యోసేపును కనెను "** ( 'మత్తయి' , 1 : 16 )

అయితే లూకా సువార్తలో ఈ విధంగా పేర్కొనబడింది :

**" ఆయన యోసేపు కుమారుడని యెంచబడెను. యోసేపు హేలీకి (కుమారుడు) "**

( 'లూకా' , 3 : 23 )

ఈ రెండు వాక్యాలను పరిశీలించినప్పుడు మత్తయి మరియు లూకా ఇద్దరూ యోసేపు వంశావళి గురించి పేర్కొంటున్నట్లుగా విదితమవుతుంది.

**ఐదవ** కారణమేమిటంటే ఒకవేళ మనం హజ్రత్ మర్యమ్ (అ) (మరియ) హేలీ కుమార్తె అని అంగీకరించినట్లయితే యూదుల్లో అల్లుడి భార్యకు చెందిన సోదరుడెవరూ లేనట్లయితే అతడిని వంశావళి క్రమంలో చేర్చి, అతడిని కుమారుడి స్థానంలో వ్రాసే సంప్రదాయం నిజంగానే ఉండేదని నిరూపితం కానంతవరకు లూకా సువార్తలో పేర్కొనబడిన విషయం సరియైనదిగా పరిగణించబడదు. ఈ విషయం ఇంతవరకు విశ్వసనీయంగా ఋజువు కాలేదు. కనుక ప్రొటెస్టెంట్ వర్గానికి చెందిన కొందరు క్రైస్తవ పండితుల నిరాధార కోరికలు, బలహీనమైన మరియు అసత్యమైన



వివరణలు మాకు వ్యతిరేకంగా ఆధారం కాజాలవు.

మేము కూడా ఏ వ్యక్తయినా మరొక వైపుకు ఆపాదించబడడమనే విషయాన్ని పూర్తిగా నిరాకరించము. మా దృష్టిలో ఒక వ్యక్తి ఇతర వంశపరంపరకు లేదా నిమిత్తపూర్వక బంధువులకు చెందినవాడయితే లేదా అతడి గురువు ఉన్నట్లయితే మరియు ధార్మికంగా లేదా ప్రాపంచికంగా ప్రసిద్ధుడయినట్లయితే ఆ వ్యక్తి వైపుకు అతడు ఆపాదించబడడమనేది సాధ్యమే. అలాగే ఈ విధంగా పేర్కొనవచ్చు: " అతడు ఫలానా అధికారి యొక్క లేదా రాజు యొక్క సోదరుడి కుమారుడు లేదా అల్లుడు లేదా ఫలానా వ్యక్తి యొక్క శిష్యుడు లేదా ఫలానా వ్యక్తిని విశ్వసించిన అనుచరుడు" అయితే ఈ విధంగా ఆపాదించడమనేది వేరే విషయం. వంశపరంపరలో ఒక వ్యక్తిని చేర్చడమనేది పూర్తిగా వేరే విషయం. ఉదాహరణకు 'అతడు తన మామగారి కుమారుడు' అని పేర్కొనడం, అలాగే 'ఇది యూదుల రివాజుగా ఉండేది' అని పేర్కొనడమనేది వేరే విషయం. దీనిని మేము నిరాకరించము. అయితే యూదుల్లో అటువంటి రివాజు లేదా సంప్రదాయం ఉండేదని నిరూపించవలసి ఉంటుంది.

## మత్తయి సువార్త లూకా కాలంలో ప్రసిద్ధమైనదిగానూ, విశ్వసనీయమైనదిగానూ పరిగణించబడలేదు

మత్తయి సువార్త లూకా కాలంలో ప్రసిద్ధమైనదిగానూ, విశ్వసనీయమైనదిగానూ పరిగణించబడలేదు. లేకుంటే లూకా ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా(అ)) గురించి పేర్కొన్నప్పుడు, అనగా ఆయన వంశావళి గురించి పేర్కొన్నప్పుడు మత్తయి పేర్కొన్నదానికి విరుద్ధంగా పేర్కొనేందుకు ఎలా సాహసించగలరు? అది కూడా ప్రాచీన కాలానికి చెందిన మరియు నవీన కాలానికి చెందిన క్రైస్తవ పండితులందరినీ అలజడికి, కలవరపాటుకు గురిచేసేంతటి తీవ్రమైన స్థాయిలో వైరుధ్యంతో కూడిన వివరణను ఎలా అందించగలరు? అలాగే లూకా తన వివరణలో ఆ వైరుధ్యం తొలగిపోయేందుకు దోహదపడేలా ఒకటి రెండు అక్షరాలతో కూడిన వివరణను సైతం జోడించలేదు!

# 52 వ వైరుధ్యం మరియు 53 వ వైరుధ్యం :

ఏ వ్యక్తయితే మత్తయి సువార్త యొక్క 2 వ అధ్యాయాన్ని లూకా సువార్తతో పోల్చి అధ్యయనం చేస్తాడో అతడు రెండింటి మధ్య గొప్ప వైరుధ్యాన్ని కనుగొంటాడు. దీనినిబట్టి రెండింటిలో ఏ ఒక్కటీ దైవం తరఫు నుంచి అవతరించబడిన గ్రంథం కాదని నిశ్చయంగా విదితమవుతుంది. అయినప్పటికీ ఈ సందర్భంలో కేవలం రెండు వైరుధ్యాలను ఇక్కడ పేర్కొంటున్నాము:

## దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) పుట్టిన తర్వాత హజ్రత్ మర్యమ్ (అ) (మరియ) ఎక్కడ ఉన్నారు?

మత్తయి సువార్త ను అధ్యయనం చేసినప్పుడు దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) పుట్టిన తర్వాత ఆయన తల్లిదండ్రులు బేత్లెహేములోనే జీవించేవారని తెలుస్తుంది. అంతేగాకుండా మత్తయి సువార్తలోనే మరొకచోట పేర్కొనబడిన వివరణ ద్వారా వారు బేత్లెహేములో నివసించిన మొత్తం కాలం దాదాపు రెండు సంవత్సరాలని కూడా తెలుస్తుంది. అయితే అక్కడ అగ్ని ఆరాధకులు ఆధిపత్యం వహించడంతో ఆయన తల్లిదండ్రులు ఈజిప్టు (ఐగుప్తు) కు వెళ్ళిపోయారని[191], హేరోదు [192] జీవితకాలం వరకు ఈజిప్టులోనే గడిపేవారని తెలుస్తుంది. అయితే హేరోదు రాజు చనిపోయిన తర్వాత వారు ఈజిప్టు నుంచి వెనుదిరిగి వచ్చి నజరేతనే ఊరిలో స్థిరపడ్డారని తెలుస్తుంది. అయితే అందుకు విరుద్ధంగా లూకా సువార్త ద్వారా [193] దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) తల్లిదండ్రులు ఆయన పుట్టిన తర్వాత శుద్ధి చేసుకునే దినాలను పూర్తి చేసిన వెంటనే యెరూషలేముకు వెళ్ళిపోయినట్లుగా, అక్కడ దేవునికి బలిని అర్పించి (ఖుర్బానీ ఇచ్చి) నజరేతుకు తిరిగి వచ్చినట్లుగా తెలుస్తుంది. అలాగే అక్కడ (నజరేతను ఊరిలో) వారిద్దరూ

**(అథఃసూచికలు)**

191 **" అప్పుడతడు లేచి, రాత్రివేళ శిశువును తల్లిని తోడుకొని, ఐగుప్తునకు వెళ్ళి, ఐగుప్తులో నుండి నా కుమారుని పిలిచితిని అని ప్రవక్త ద్వారా ప్రభువు సెలవిచ్చిన మాట నెరవేర్చబడునట్లు హేరోదు మరణము వరకు అక్కడనుండెను "**

( 'మత్తయి' , 2 : 21 )

192 యూదయ రాజ్యానికి గవర్నర్‌గా ఉన్న హేరోదు దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) పుట్టిన కాలంలో రాజుగా ఇశ్రాయేలీయులను పరిపాలించేవాడు.

193 **" మోషే ధర్మశాస్త్రము చొప్పున వారు తమ్మును శుద్ధి చేసికొను దినములు గడచినప్పుడు -ప్రతి తొలిచూలు మగపిల్ల ప్రభువుకు ప్రతిష్ఠ చేయబడవలెను అని ప్రభువు ధర్మశాస్త్రమందు వ్రాయబడినట్లు ఆయనను ప్రభువుకు ప్రతిష్ఠించుటకును, ప్రభువు ధర్మశాస్త్రమందు**

( మిగిలినభాగం తరువాతి పేజీలో )



స్థిరంగా నివసించినట్లుగా, అయితే సంవత్సరానికొకమారు పస్కా పండుగ సందర్భంలో వారు యెరూషలేముకు వెళ్ళివచ్చేవారని తెలుస్తుంది. అయితే దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) పన్నెండు సంవత్సరాల వయస్సులో తన తల్లిదండ్రుల అనుమతిని తీసుకోకుండా, వారికి తెలుపకుండా యెరూషలేములో మూడు రోజులు గడిపినట్లుగా కూడా తెలుస్తుంది.[194] లూకా సువార్త ప్రకారమయితే అగ్ని ఆరాధకులు బేత్లెహేముకు రావడమనేది జరిగేందుకు అవకాశమే లేదు. ఒకవేళ వారి రాకను అంగీకరించే పక్షంలో వారు నజరేతుకు వచ్చియుండవచ్చునని భావించవలసి ఉంటుంది. ఎందుకంటే దారి మధ్యలో వారి రాక అనేది ఆమోదించలేని విషయం. అలాగే దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) తల్లిదండ్రులు ఈజిప్టుకు చేరుకున్నారని, అక్కడే స్థిరంగా కొంతకాలం గడిపారనే విషయం కూడా ఆమోదించదగిన విషయం కాదు. ఎందుకంటే లూకా సువార్త ద్వారా యోసేపు యూదయ ప్రాంతం నుంచి ఎన్నడూ బయటికే వెళ్ళలేదని, అనగా ఈజిప్టు వైపుకు గానీ, మరే ఇతర ప్రాంతం వైపుకు గానీ వెళ్ళలేదని తెలుస్తుంది.

## హేరోదు దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) శత్రువా?

మత్తయి సువార్తను అధ్యయనం చేసినప్పుడు యెరూషలేము వాసులకు, హేరోదు రాజుకు అగ్ని ఆరాధకులయిన జ్ఞానులు తెలిపేంతవరకు దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) పుట్టుకకు సంబంధించిన జ్ఞానం లేదని[195], హేరోదు రాజు దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) కు

**(అథఃసూచికలు)**

**(193 వ అథఃసూచిక తరువాయి భాగం)**

**చెప్పబడినట్టు గువ్వల జతనైనను రెండు పావురపు పిల్లలనైనను బలిగా సమర్పించుటకును, వారు ఆయనను యెరూషలేమునకు తీసికొనిపోయిరి "** ( 'లూకా' , 2 : 22 ,23, 24 )

**" అంతట వారు ప్రభువు ధర్మశాస్త్రము చొప్పున సమస్తము తీర్చిన పిమ్మట గలిలయ లోని నజరేతను తమ ఊరికి తిరిగి వెళ్ళిరి "** ( 'లూకా' , 2 : 39 )

**" పస్కా పండుగప్పుడు ఆయన తలిదండ్రులు ఏటేట యెరూషలేమునకు వెళ్ళుచుండువారు "** ( 'లూకా' , 2 : 41 )

194 'లూకా సువార్త' , 2 వ అధ్యాయంలో 42 వ వాక్యం నుంచి 51 వ వాక్యం వరకు

195 'మత్తయి సువార్త' , 2 వ అధ్యాయంలో 1 వ వాక్యం నుంచి 12 వ వాక్యం వరకు

పరమ శత్రువని తెలుస్తుంది.[196]

అయితే లూకా సువార్తను అధ్యయనం చేసినప్పుడు అందుకు విరుద్ధంగా దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) తల్లిదండ్రులు ఆయన పుట్టిన తర్వాత శుద్ధి చేసుకునే దినాలను పూర్తి చేసిన వెంటనే ఖుర్బానీ (దేవునికి అర్పించే జంతుబలి) విధిని నెరవేర్చేందుకై యెరూషలేముకు వెళ్ళిపోయినప్పుడు నీతిపరుడైన, భక్తిపరుడైన, సజ్జనుడైన, పరిశుద్ధాత్మ ఆవహింపబడినవానిగా చెప్పబడిన, ప్రభువు యొక్క క్రీస్తును చూడక మునుపు మరణము పొందడని పరిశుద్ధాత్మ చేత బయలుపరచబడిన సుమెయోను అనే వ్యక్తి అప్పటికి పసిబిడ్డగా ఉన్న దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) రెండు భుజాలనూ పట్టుకొని ఎత్తుకొని యూదు దేవాలయంలో ప్రజలందరి ఎదుట ప్రదర్శించి ఆయన గుణాలను గురించి స్తుతించినట్లుగా తెలుస్తుంది.[197]

అదేవిధంగా అన్న [198] అనే ప్రవక్త్రి ఆ సమయంలో దేవుని పవిత్రతను కొనియాడుతూ లేచి నిలబడింది. అలాగే ఆమె యెరూషలేములో క్రీస్తు కొరకు వేచిచూస్తున్న వారందరికీ దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) గురించిన సమాచారాన్ని అందజేసింది. కనుక ఒకవేళ యెరూషలేము వాసులను, హేరోదు రాజును దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) కు శత్రువులుగా భావించిన పక్షంలో సజ్జనుడైన, నీతిపరుడైన, పరిశుద్ధాత్మవశుడైన సుమెయోను యూదు దేవాలయం వంటి ప్రధానమైన, శత్రువులు అన్నివేళలా హాజరయి ఉండే ప్రదేశంలో దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) గురించిన సమాచారాన్ని ఇవ్వడం ఎలా సాధ్యపడుతుంది? అలాగే ప్రవక్త్రిగా పేర్కొనబడిన అన్న అనే మహిళ యెరూషలేము వంటి ప్రాంతంలో ఆ సంఘటన గురించి (ఏసు పుట్టుక గురించి) ఎలా పేర్కొనగలదు? ప్రసిద్ధ క్రైస్తవ పండితుడయిన టోర్టన్ బైబిల్‌ను సమర్థించేవారయినప్పటికీ ఈ అంశానికి సంబంధించి రెండు సువార్తల్లో పేర్కొనబడిన వివరణల మధ్య నిజమైన వ్యత్యాసమున్నట్లుగా అంగీకరించి మత్తయి సువార్తలోని వివరణ తప్పని, లూకా సువార్తలోని వివరణ సరియైనదని తీర్మానించారు.

**(అధఃసూచికలు)**

196 " హేరోదు ఆ శిశువును సంహరింపవలెనని ఆయనను వెదకబోవుచున్నాడు "

( 'మత్తయి' , 2 : 13 )

197 'లూకా సువార్త' , 2 వ అధ్యాయంలో 25 వ వాక్యం నుంచి 32 వ వాక్యం వరకు

198 'లూకా సువార్త' , 2 వ అధ్యాయంలో 36 వ వాక్యం నుంచి 38 వ వాక్యం వరకు



# 54 వ వైరుధ్యం :

మార్కు సువార్త యొక్క 4 వ అధ్యాయం ద్వారా తెలిసే విషయమేమిటంటే దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) తన వద్దకు వచ్చిన ప్రజలను ' ఉపమానరీతి బోధ' [199] ను అందజేసిన తర్వాత వెళ్ళిపోవలసిందిగా ఆదేశించారు. అప్పుడు సముద్రంలో తుపాను చెలరేగిన స్థితిలో ఎగసిపడుతోంది. అయితే మత్తయి సువార్త యొక్క 8 వ అధ్యాయం ద్వారా ఈ రెండు సంఘటనలు 'పర్వత బోధ' (సెర్మన్ ఆఫ్ ది మౌంట్) తర్వాత జరిగినట్లుగా తెలుస్తుంది.[200] మత్తయి ఉపమానరీతి బోధను 13 వ అధ్యాయంలో పేర్కొన్నారు. కనుక ఈ ప్రసంగం రెండు సంఘటనలు గడచిన తర్వాత ఎంతో కాలానికి వెలువరించబడినట్లుగా నిరూపితమవుతుంది. ఎందుకంటే రెండు ప్రసంగాలకూ లేదా బోధలకూ నడుమ ఎంతో కాలం అంతరముంది. కనుక రెండు వివరణల్లో ఒకటి నిశ్చయంగా తప్పని తేలిపోయింది. మత్తయి సువార్త ప్రకారం రెండు సంఘటనలు పర్వత బోధ తర్వాత జరిగినట్లుగా భావించినప్పుడు మరి మార్కు సువార్త ప్రకారం ఆ సంఘటనలు ఉపమానరీతి బోధ తర్వాత జరగడం ఎలా సాధ్యమవుతుంది? ఎవరయితే తమ వద్ద ఉన్న వాక్కును దైవవాణిగా తీర్మానిస్తారో లేదా ప్రజలు వారి వద్ద ఉన్న వాక్కును దైవవాణిగా భావిస్తున్నప్పుడు వారు సంఘటనల క్రమాన్ని మార్చి వివరణలను అందజేసినప్పుడు ఆ వివరణలు పరస్పర విరుద్ధాలుగా ఉన్నాయని తీర్మానించక తప్పదు.

# 55 వ వైరుధ్యం :

మార్కు సువా ర్త యొక్క 11 వ అధ్యాయంలో దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు)కు, యూదులకు నడుమ ఆయన (అ) యెరూషలేముకు చేరుకున్న మూడురోజుల తర్వాత గొప్ప

**(అధఃసూచికలు)**

199 బైబిల్ ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) ఒక సముద్ర తీరంలో ప్రజలకు అందజేసిన బోధన 'ఉపమానరీతి బోధ' గా ప్రఖ్యాతిగాంచింది. ఆ బోధలో ఆయన (అ) వాస్తవాలను పలు ఉపమానాల ద్వారా విపులీకరించారు. అలాగే ఆయన (అ) ఒక కొండమీదికెక్కి వెలువరించిన ప్రసంగం ' పర్వత బోధ' (సెర్మన్ ఆఫ్ ది మౌంట్) గా ప్రఖ్యాతిగాంచింది. ఈ ప్రసంగం మత్తయి సువార్త లోని 5వ, 6వ మరియు 7వ అధ్యాయాలలో పేర్కొనబడి ఉంది.

200 ( 'మత్తయి' , 8 : 23 వ వాక్యం నుంచి 27 వ వాక్యం వరకు )

సంవాదం జరిగినట్లుగా పేర్కొనబడి ఉంది.[201] అయితే అందుకు విరుద్ధంగా మత్తయి సువార్త యొక్క 21 వ అధ్యాయంలో ఈ సంఘటన దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) యెరూషలేముకు చేరుకున్న తర్వాత రెండవ రోజున జరిగినట్లుగా పేర్కొనబడి ఉంది.

కనుక నిశ్చయంగా రెండింటిలో ఒక వివరణ తప్పుడు వివరణ. ఈ వైరుధ్యంలోనూ, ఇంతకు ముందు పేర్కొనబడిన వైరుధ్యాలలోనూ ప్రస్తావించబడిన ఈ రెండు వైరుధ్యాల గురించి క్రీ.శ. 1822 లో ప్రచురించబడిన తన వ్యాఖ్యాన గ్రంథం యొక్క 4 వ సంపుటిలోని 275వ మరియు 276 వ పేజీలలో ఈ విధంగా పేర్కొన్నారు:

“ ఈ సంఘటనల మధ్య సామ్యాన్ని కనుగొనేందుకు అవకాశం ఎంతమాత్రం కనిపించడం లేదు”

## 56 వ వైరుధ్యం :

మత్తయి సువార్త యొక్క 8 వ అధ్యాయంలో పర్వత బోధ తర్వాత దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) కుష్ఠురోగిని శుద్ధునిగా చేయడానికి సంబంధించిన సంఘటన పేర్కొనబడి ఉంది.[202] అలాగే ఆ తర్వాత ఆయన (అ) కపెర్నహూము లోకి ప్రవేశించిన తర్వాత శతాధిపతి యొక్క దాసుడికి స్వస్థత చేకూర్చడానికి సంబంధించిన సంఘటన[203], ఆ తర్వాత పేతురు ఇంటిలోకి వచ్చి అతడి మద్దతుదారులకు స్వస్థత చేకూర్చడానికి సంబంధించిన సంఘటన పేర్కొనబడి ఉన్నాయి.[204]

**(అథఃసూచికలు)**

201 లూకా సువార్తలో దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) తన శిష్యులతో కలిసి యెరూషలేముకు చేరుకున్న తర్వాత జరిగిన సంఘటనలు క్రమంగా ప్రస్తావించబడిన తర్వాత మూడవ రోజు జరిగిన సంఘటనలలో భాగంగా ఆ సంవాదం గురించి పేర్కొనబడింది. అయితే మత్తయి సువార్తలో మాత్రం ఆ సంవాదం యెరూషలేముకు చేరుకున్న తర్వాత రెండవ రోజున జరిగినట్లుగా పేర్కొనబడింది.

202 ‘మత్తయి’ , 8 : 3

203 ‘మత్తయి’ , 8 : 13

204 ‘మత్తయి’ , 8 : 16



అయితే అందుకు విరుద్ధంగా లూకా సువార్తలో అన్నిటికంటే ముందు దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) పేతురు మద్దతుదారులకు స్వస్థతను చేకూర్చడానికి సంబంధించిన సంఘటన గురించి పేర్కొనబడి ఉంది.[205] ఆ తర్వాత 5 వ అధ్యాయంలో [206] కుష్ఠురోగికి స్వస్థతను చేకూర్చడానికి సంబంధించిన సంఘటన పేర్కొనబడి ఉంది. ఆ తర్వాత 7వ అధ్యాయంలో ఆయన (అ) శతాధిపతి యొక్క దాసునికి స్వస్థత [207] చేకూర్చడానికి సంబంధించిన సంఘటన పేర్కొనబడి ఉంది. నిశ్చయంగా రెండింటిలో ఒక వివరణ తప్పుడు వివరణ అని విశదమవుతుంది.

## ఏలీయా ఎవరు? 57 వ వైరుధ్యం :

యూదులు యాజకులను, లేవీయులను దైవప్రవక్త హజ్రత్ యహ్యా (అ) (యోహాను) వద్దకు ఆయనెవరో తెలుసుకునేందుకై పంపారు. వారు ఆయనను “ నీవు ఏలీయావా?” అని ప్రశ్నించగా “ నేను ఏలీయాను కాను” అని ఆయన (అ) సమాధానమిచ్చారు. ఈ సంఘటన గురించి యోహాను సువార్త యొక్క మొదటి అధ్యాయంలో [208] పేర్కొనబడి ఉంది.

అయితే అందుకు విరుద్ధంగా మత్తయి సువార్తలో 11 వ అధ్యాయపు 14 వ వాక్యంలో దైవప్రవక్త హజ్రత్ యహ్యా (అ) (యోహాను) గురించి దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) పలికిన విషయం గురించి ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**“ ఈ సంగతి నంగీకరించుటకు మీకు మనస్సుంటే రాబోవు ఏలీయా యితడే ”**

అలాగే మత్తయి సువార్తలో 17 వ అధ్యాయపు 10 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**(అథఃసూచికలు)**

205 లూకా సువార్త (4 : 38). గుర్తుంచుకోవలసిన విషయమేమిటంటే 38వ వాక్యంలో పేతురు పేరు ‘ సీమోను’ అని పేర్కొనబడింది. మేము ఇంతకుముందే ‘పేతురు’ మరియు ‘సీమోను’ అనేవి ఒకే వ్యక్తికి చెందిన రెండు పేర్లు అని పేర్కొనియున్నాము.

206 ‘లూకా సువార్త’ , 5 : 13

207 ‘లూకా సువార్త’ , 7 : 10

208 ‘యోహాను సువార్త’ , 1 వ అధ్యాయం, 19 వ వాక్యం నుంచి 21 వ వాక్యం వరకు

**“ అప్పుడాయన శిష్యులు- ఈలాగైతే ఏలీయా ముందుగా రావలెనని శాస్త్రులెందుకు[209] చెప్పుచున్నారని ఆయన నడిగిరి. అందుకాయన - ఏలీయా వచ్చి సమస్తమును చక్కపెట్టునను మాట నిజమే; అయినను ఏలీయా యిదివరకే వచ్చెను; వారతనిని ఎరుగక తమ కిష్టము వచ్చినట్టు అతని యెడల చేసిరి. మనుష్యకుమారుడు కూడ అలాగే వారి చేత శ్రమలు పొందబోవుచున్నాడని మీతో చెప్పుచున్నాననెను. అప్పుడాయన బాప్తిస్మమిచ్చు [210] యోహానును గూర్చి తమతో చెప్పెనని శిష్యులు గ్రహించిరి. ”**

(‘మత్తయి సువార్త’ , 17 వ అధ్యాయం, 10 వ వాక్యం నుంచి 13 వ వాక్యం వరకు)

మత్తయి సువార్త యొక్క 11 వ మరియు 17 వ అధ్యాయాలకు చెందిన ఈ రెండు వాక్యాల ద్వారా దైవప్రవక్త హజ్రత్ యహ్యా (అ) (యోహాను) వాగ్దానం చేయబడిన, రాబోయే ఏలీయా అని స్పష్టమవుతోంది. పర్యవసానంగా యోహాను సువార్త యొక్క మొదటి అధ్యాయంలో, మత్తయి సువార్త యొక్క 11 వ మరియు 17 వ అధ్యాయాలలో పేర్కొనబడిన విషయాల మధ్య స్పష్టమైన వైరుధ్యమున్నట్లుగా, అనగా దైవప్రవక్త హజ్రత్ యహ్యా (అ) (యోహాను) వ్యాఖ్యకు, దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) వ్యాఖ్యకు నడుమ వైరుధ్యమేర్పడినట్లుగా విదితమవుతుంది.

## క్రైస్తవుల గ్రంథాల ప్రకారం ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) వాగ్దానం చేయబడిన క్రీస్తుగా నిరూపించబడజాలరు

ఒకవేళ ఏ వ్యక్తయినా క్రైస్తవుల గ్రంథాలను పరిశీలనాత్మక దృష్టితో అధ్యయనం చేసినట్లయితే అతడు దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) యే వాగ్దానం చేయబడిన క్రీస్తుగా ఎంతమాత్రం విశ్వసించజాలడు. ఈ విషయాన్ని నిరూపించేందుకై మేము ఉపోద్ఘాతంగా నాలుగు విషయాలను ఇక్కడ పేర్కొంటున్నాము.

### మొదటి విషయం :

ఎప్పుడయితే యోషీయా కుమారుడయిన యెహోయాకీము దైవప్రవక్త హజ్రత్ ఇర్మియా

**(అథఃసూచికలు)**

209 యూదు పండితులను బైబిల్ లో ‘శాస్త్రులు’ అని పేర్కొనడం జరిగింది.

210 బైబిల్ లో దైవప్రవక్త హజ్రత్ యహ్యా (అ) ‘విశ్వసనీయుడయిన యోహాను’ అని కూడా పేర్కొనబడి ఉంది.



(అ) (యిర్మీయా) నోటి మాటలను బట్టి హజ్రత్ బారూఖ్ (అ) (బారూకు) వ్రాసిన పుస్తకాన్ని [211] కాల్చివేసినప్పుడు హజ్రత్ ఇర్మియా (అ) (యిర్మీయా) పై అల్లాహ్ తరపున ఈ వాక్కు అవతరించింది :

**“ అందుచేతను యూదా రాజైన యెహోయాకీమును గూర్చి యెహోవా ఈ మాట సెలవిచ్చుచున్నాడు - దావీదు యొక్క సింహాసనము మీద ఆసీనుడగుటకు అతనికి ఎవడును లేకపోవును”**

ఈ వాక్యము యిర్మీయా గ్రంథము యొక్క 36 వ అధ్యాయంలో పేర్కొనబడి ఉంది. ఈ వాక్యం ప్రకారమయితే యెహోయాకీము సంతతికి చెందినవారిగా చెప్పబడిన దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) దావీదు (దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ) యొక్క సింహాసనం మీద ఆసీనులు కారాదు. అయితే దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) దావీదు (దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ)) సింహాసనము మీద ఆసీనులవడం తప్పనిసరి అని మనకు లూకా సువార్త ద్వారా తెలుస్తుంది. లూకా దైవదూత అయిన హజ్రత్ జిబ్రయీల్ (అ) (గబ్రియేలు) పలుకులను ఇలా ఉల్లేఖించారు :

**“ ప్రభువైన దేవుడు ఆయన తండ్రియైన దావీదు సింహాసనమును ఆయనకిచ్చును ”**

(లూకా సువార్త, 1 : 32)

### రెండవ విషయం :

రెండవ విషయమేమిటంటే మసీహ్ (క్రీస్తు) రాకడ అనేది ‘ఆయన కంటే ముందు ఏలీయా అనే ప్రవక్త రాకడ తప్పనిసరి’ అనే షరతు మీద ఆధారపడి ఉంది. యూదులు దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) ను విశ్వసించకపోవడానికి గల ప్రధాన కారణం వారు ఏలీయా ప్రవక్త ప్రభవించలేదని, వాస్తవానికి ఆయన రాకడ ముందు సంభవించడమనేది తప్పనిసరి అని భావించడమే. స్వయంగా దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) సైతం ‘ముందుగా ఏలీయా

**(అథఃసూచికలు)**

211 హజ్రత్ ఇర్మియా (అ) (యిర్మీయా) తనపై అల్లాహ్ తరపు నుంచి అవతరించిన దివ్యవాణిని ఒక పుస్తకంలో వ్రాసి తన ప్రతినిధి అయిన హజ్రత్ బారూఖ్ (అ) (బారూకు) ను దానిని ప్రతిచోటా వినిపించవలసిందిగా ఆదేశించారు. ఆ పుస్తకంలో ఇశ్రాయేలీయులు తమ అకృత్యాల కారణంగా నెబుకద్నెజరు దాడి ద్వారా శిక్షించబడడానికి సంబంధించిన భవిష్యవాణి పేర్కొనబడి ఉంది. అప్పటి రాజు అయిన యెహోయాకీము ఆ విషయం గురించి విన్నప్పుడు ఆ పుస్తకాన్ని తగులబెట్టాడు. ఈ సంఘటన గురించే బైబిల్ పాతనిబంధన గ్రంథంలోని ‘యిర్మీయా గ్రంథము’ యొక్క 36 వ అధ్యాయంలో పేర్కొనబడింది.

ప్రవక్త రాకడ తప్పనిసరి’ అనే విషయాన్ని అంగీకరించారు. అయితే ఏలీయా ప్రవక్త అప్పటికే వచ్చియున్నారని, కానీ ప్రజలు ఆయనను గుర్తించలేదని ఆయన (అ) పేర్కొన్నారు. అయితే స్వయంగా ఏలీయా తాను ఏలీయా అనే విషయాన్ని నిరాకరించినట్లుగా యోహాను సువార్త యొక్క 19వ వాక్యం నుంచి 21 వ వాక్యం వరకు అధ్యయనం చేసినప్పుడు మనకు తెలుస్తుంది. బైబిల్ లో బాప్తిస్మమిచ్చు యోహానే ఏలీయా అని దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) పేర్కొన్నట్లుగా ఒకవైపు పేర్కొనబడి, బైబిల్ లోనే మరొకచోట బాప్తిస్మమిచ్చు యోహానే స్వయంగా తాను ఏలీయాను కానని పేర్కొన్నట్లుగా ప్రస్తావించబడిందని మనకు తెలుస్తుంది. మరి యోహాను (దైవప్రవక్త హజ్రత్ యహ్యా (అ)) ఏలీయా కాదనే విషయాన్ని సత్యంగా గ్రహించినట్లయితే ఏలీయా ప్రవక్తే రాలేదనే యూదుల భావనను సత్యంగా గ్రహించవలసి వస్తుంది. అప్పుడు ఏలీయా ప్రవక్త రాకడే సంభవించని కారణంగా ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) క్రీస్తు కారని బైబిల్ ద్వారా నిరూపితమయినట్లవుతుంది.

## మూడవ విషయం :

క్రైస్తవుల దృష్టిలో మహిమాన్విత కార్యాలు, అద్భుత కార్యాలు ఒక వ్యక్తి ద్వారా వెలువడడమనేది దైవదౌత్యానికి, ఇంకా చెప్పాలంటే దైవత్వానికి నిదర్శనమవడం సంగతి అటు ఉంచి, అసలు విశ్వాసానికి సైతం నిదర్శనం కాదు. ఈ విషయం మత్తయి సువార్త ద్వారా తెలుస్తుంది. మత్తయి సువార్త యొక్క 24 వ అధ్యాయపు 24 వ వాక్యంలో దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) వాక్కు ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**“ అబద్ధపు క్రీస్తులును అబద్ధపు ప్రవక్తలును వచ్చిన సాధ్యమైతే ఏర్పరచబడిన వారిని సహితము మోసపరచుటకై గొప్ప సూచక క్రియలను మహత్కార్యములను కనబరచెదరు ”**

అలాగే ‘అపొస్తలుడైన పౌలు థెస్సలొనీకయులకు వ్రాసిన రెండవ పత్రిక’ యొక్క 2 వ అధ్యాయపు 9 వ వాక్యంలో దజ్జాల్ (అబద్ధీకుడు) విషయంలో పౌలు వ్యాఖ్య ఈ విధంగా పేర్కొనబడి ఉంది :

**“ వాని రాక అబద్ధ విషయమైన సమస్త బలముతోను, నానావిధములైన సూచక క్రియలతోను, మహత్కార్యములతోను దుర్నీతిని పుట్టించు సమస్త మోసముతోను, నశించుచున్న వారిలో సాతాను కనుపరచు బలమును అనుసరించియుండును ”**

## నాల్గవ విషయం :

నాల్గవ విషయమేమిటంటే ఏ వ్యక్తయితే దైవేతరులను ఆరాధించే వైపుకు ఆహ్వానిస్తాడో, సందేశమిస్తాడో అతడు తౌరాతు గ్రంథంలో పేర్కొనబడిన దైవాదేశం ప్రకారం తప్పనిసరిగా



హతమార్చబడేందుకు అర్హుడు, అతడు ఎన్ని మహాద్భుత కార్యాలను ప్రదర్శించినప్పటికీ. అలాగే ఒకవేళ ఒక వ్యక్తి తనను తాను దేవునిగా ప్రకటించుకున్నట్లయితే అతడు మరింత దుర్మార్గుడిగా పరిగణించబడతాడు. ఎందుకంటే ఆ విధంగా ప్రకటన కావించి అతడు కూడా దైవేతరుడిని ఆరాధించవలసిందిగా సందేశమిచ్చినట్లే అవుతుంది. ఎందుకంటే అతడు కూడా నిశ్చయంగా దైవేతరుడే. (ఈ విషయం పాఠకులచే చదవబడుతున్న ఈ గ్రంథం యొక్క 4 వ అధ్యాయంలో ఆధారాలతో సహా పేర్కొనబడిన విపులమైన వివరణ ద్వారా బోధపడుతుంది) అలాగే అతడు తనను ఆరాధించవలసిందిగా కూడా సందేశమిచ్చినట్లే అవుతుంది.

ఈ నాలుగు విషయాల గురించి తెలుసుకున్న తర్వాత మేము చెప్పేదేమిటంటే దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) మత్తయి సువార్తలో పేర్కొనబడిన వంశావళి ప్రకారం యెహోయాకీము సంతతికి చెందినవారు. కనుక ఆయన (అ) మొదటి విషయం ప్రకారం దావీదు (దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ)) యొక్క సింహాసనం మీద ఆసీనులయ్యేందుకు అర్హులు కారు. అలాగే ఆయన (అ) కంటే ముందు ఏలీయా ప్రవక్త రాకడ కూడా సంభవించలేదని స్వయంగా యోహాను (దైవప్రవక్త హజ్రత్ యహ్యా (అ)) ‘నేను ఏలీయాను కాను’ అని అంగీకరించిన విషయాన్ని బట్టి తెలుస్తుంది. కనుక దీనికి విరుద్ధంగా పేర్కొనబడే ఏ విషయమయినా ఎంతమాత్రం అంగీకరించబడదు. ఏలీయా దైవప్రవక్త అయి ఉండీ, దైవవాణిని పొందుతూ కూడా తన గురించి స్వయంగా ఎరుకను కలిగియుండకపోవడమనేది బుద్ధికి ఎంతమాత్రం అంగీకారయోగ్యం కాదు. కనుక రెండవ విషయం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) వాగ్దానం చేయబడిన క్రీస్తు కాజాలరు. అలాగే క్రైస్తవులు ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) స్వయంగా తాను దైవత్వాన్ని కలిగియున్నట్లుగా ప్రకటించినట్లుగా విశ్వసిస్తారు. కనుక నాల్గవ విషయం ప్రకారం ఆయన తప్పనిసరిగా హతమార్చబడేందుకు అర్హులు (అల్లాహ్ క్షమించుగాక).

ఇక సువార్తల్లో పేర్కొనబడిన అద్భుత కార్యాలు ప్రత్యర్థుల దృష్టిలో సరియైనవి కావు. ఒకవేళ వాటన్నింటినీ సరియైనవిగా అంగీకరించినప్పటికీ అవి దైవదౌత్యానికి నిదర్శనాలవడం సంగతి అటు ఉంచి, అవి విశ్వాసానికి కూడా నిదర్శనం కాజాలవు. కనుక యూదులు ఏసును హతమార్చే విషయంలో (అల్లాహ్ క్షమించుగాక) ఎంతమాత్రం దోషులుగా తీర్మానించబడజాలరు.

మరొక విషయమేమిటంటే క్రైస్తవులచే విశ్వసించబడే క్రీస్తుకు, యూదుల దృష్టిలో క్రీస్తుగా పరిగణించబడిన క్రీస్తుకు నడుమ ఉన్న వ్యత్యాసమేమిటి? అలాగే మొదటి క్రీస్తు మాత్రం నిజమైన క్రీస్తు అని, రెండవ క్రీస్తు అబద్ధపు క్రీస్తు అని ఎలా తెలుస్తుంది? వాస్తవానికి ఇద్దరిలో ప్రతి ఒక్కరూ తమ యాదార్థ్యాన్ని ప్రకటించారు. అలాగే ఇద్దరూ ఆమోదిత రీతిలో అద్భుత కార్యాలను ప్రదర్శించారు కూడా. కనుక ప్రత్యర్థి కొరకు ఆధారంగా నిలిచే సంకేతమేదయినా ప్రత్యేకంగా ఉండడం అవసరం.

సర్వ సృష్టికర్త అయిన అల్లాహ్‌కు శతకోటి కృతజ్ఞతలు. ఆయనే తన ఆఖరి ప్రవక్త అయిన హజ్రత్ ముహమ్మద్ (స) ద్వారా ఇటువంటి ప్రమాదం నుంచి, వినాశనం నుంచి విముక్తిని ప్రసాదించాడు. అందుకే మేము 'హజ్రత్ మర్యమ్ (అ) కుమారులయిన దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) దేవుని నిజమైన ప్రవక్త మరియు వాగ్దానం చేయబడిన క్రీస్తు . ఆయన (అ) తనను తాను దేవునిగా ఎన్నడూ ప్రకటించుకోలేదు' అని విశ్వసిస్తాము. ఈ విషయంలో క్రైస్తవులే ఆయనపై స్పష్టమైన రీతిలో అపనింద మోపారు.

## 58 వ వైరుధ్యం నుంచి 63 వ వైరుధ్యం వరకు :

మత్తయి సువార్త యొక్క 11 వ అధ్యాయంలో, మార్కు సువార్త యొక్క 1వ అధ్యాయంలో మరియు లూకా సువార్త యొక్క 7 వ అధ్యాయంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" ఇదిగో నేను నా దూతను నీకు ముందుగా పంపుచున్నాను, అతడు నీ ముందర నీ మార్గమును సిద్ధపరచును "**

మూడు సువార్తల రచయితలూ క్రైస్తవ వ్యాఖ్యాతల వాదం ప్రకారం ఈ వాక్కును బైబిల్ పాతనిబంధన గ్రంథంలోని 'మలాకీ' గ్రంథం[212] యొక్క 3 వ అధ్యాయం యొక్క 1వ వాక్యం ద్వారా ఉల్లేఖించారు. ఆ వాక్యం క్రింద పేర్కొనబడింది:

**" ఇదిగో నాకు ముందుగా మార్గము సిద్ధపరచుటకై నేను నా దూతను పంపుచున్నాను "**

చూడండి. అసలయిన వాక్యానికి, ఉల్లేఖించబడిన వాక్యానికి నడుమ రెండు రకాలుగా తీవ్రమైన వైరుధ్యముంది. మొదటి వైరుధ్యమేమిటంటే ' నీకు ముందుగా' అనే పదాలు మూడు సువార్తల్లోనూ అధికంగా ఉన్నాయి. అయితే ఈ పదాలు మలాకీ గ్రంథంలో లేవనే విషయం విదితమయింది. మరొక వైరుధ్యమేమిటంటే మలాకీ గ్రంథంలో పేర్కొనబడిన వాక్యంలో 'నాకు ముందుగా' అని పేర్కొనబడి ఉంటే, మూడు సువార్తల్లోనూ 'నీ ముందర' అని పేర్కొనబడి ఉంది.

హోరన్ తన వ్యాఖ్యాన గ్రంథం యొక్క 2వ సంపుటిలో డాక్టర్ రాడ్లిఫ్ వ్యాఖ్యను ఉటంకిస్తూ

**(అథఃసూచికలు)**

212 అయితే మార్కు సువార్తలో మార్కు ఈ వాక్కు ప్రవక్త అయిన హజ్రత్ యస్ఇయాహ్ (అ) (యెషయా) యొక్క గ్రంథం ద్వారా గ్రహించబడిందని పేర్కొన్నారు. (మార్కు సువార్త, 1 : 2) మిగిలిన రెండు సువార్తలలో ఈ వాక్కుకు సంబంధించిన ఆధారాలేవీ పేర్కొనబడలేదు.



ఈ విధంగా పేర్కొన్నారు:

" వైరుధ్యానికి గల కారణాన్ని సులభంగా పేర్కొనడం సాధ్యం కాదు, ప్రాచీన ప్రతులలో కొన్ని ప్రక్షిప్తాలు చోటుచేసుకున్నాయని పేర్కొనడం తప్ప "

ఈ ఆరు వైరుధ్యాలు బైబిల్ క్రొత్తనిబంధన గ్రంథంలోని మూడు సువార్తల (మత్తయి, మార్కు మరియు లూకా సువార్తలు) నడుమ చోటుచేసుకున్నాయి.

## 64 వ వైరుధ్యం నుంచి 67 వ వైరుధ్యం వరకు :

మత్తయి సువార్త యొక్క 2 వ అధ్యాయపు 5 వ వాక్యం 'మీకా' గ్రంథం యొక్క 5వ అధ్యాయపు 2 వ వాక్యానికి [213] విరుద్ధంగా ఉంది. అలాగే 'అపొస్తలుల కార్యములు' [214] యొక్క 2వ అధ్యాయంలోని 25 వ వాక్యం నుంచి 28 వ వాక్యం వరకు గల 4 వాక్యాలు బైబిల్ అరబీ

**(అథఃసూచికలు)**

213 **" యూదయ దేశపు బేత్లెహేమా నీవు యూదా ప్రధానులలో ఎంతమాత్రమును అల్పమైనదానవు కావు; ఇశ్రాయేలను నా ప్రజలను పరిపాలించు అధిపతి నీలో నుండి వచ్చును "** (మత్తయి సువార్త, 2 : 5)

**" బేత్లెహేము ఎఫ్రాతా, యూదావారి కుటుంబములలో నీవు స్వల్పగ్రామమైనను నా కొరకు ఇశ్రాయేలీయులను ఏలబోవువాడు నీలోనుండి వచ్చును "** (మీకా, 5 : 2)

మీకా గ్రంథములో యూదయ దేశపు బేత్లెహేము అల్పమైనదిగా పేర్కొనబడితే మత్తయి సువార్త లో మాత్రం అది అల్పమైనది కాదని పేర్కొనబడిందని విదితమవుతోంది.

214 **" ఆయనను గూర్చి దావీదు ఇట్లనెను - నేనెల్లప్పుడు నా యెదుట ప్రభువును చూచుచుంటిని**
**ఆయన నా కుడి పార్శ్వమున నున్నాడు గనుక నేను కదల్చబడను**
**కావున నా హృదయము ఉల్లసించెను; నా నాలుక ఆనందించెను**
**మరియు నా శరీరము కూడ నిరీక్షణ గలిగి నిలకడగా ఉండును**
**నీవు నా ఆత్మను పాతాళములో విడిచిపెట్టవు**
**నీ పరిశుద్ధుని కుళ్ళుపట్టనియ్యవు**
**నాకు జీవమార్గములు తెలిపితివి**
**నీ దర్శన మనుగ్రహించి నన్ను ఉల్లాసముతో నింపెదవు"**
('అపొస్తలుల కార్యములు' , 2 వ అధ్యాయం, 25 వ వాక్యం నుంచి 28 వ వాక్యం వరకు)

అనువాద గ్రంథం ప్రకారం 'కీర్తనల గ్రంథం' యొక్క 15 వ కీర్తనకు చెందిన 4 వాక్యాలతోనూ, ఇతర బైబిల్ అనువాద గ్రంథాల ప్రకారం 'కీర్తనల గ్రంథం' [215] యొక్క 16 వ కీర్తనకు చెందిన 8వ వాక్యం నుంచి 11 వ వాక్యం వరకు గల నాలుగు వాక్యాలతోనూ వైరుధ్యాన్ని కలిగియున్నాయి. అలాగే 'అపొస్తలుడైన పౌలు హెబ్రీయులకు వ్రాసిన పత్రిక' యొక్క 10 వ అధ్యాయంలోని 5 వ వాక్యం నుంచి 7 వ వాక్యం వరకు గల మూడు వాక్యాలు (బైబిల్ అరబీ అనువాద గ్రంథాల దృష్ట్యా) 'కీర్తనల గ్రంథం' లోని 39 వ కీర్తనకు చెందిన లేదా ఇతర బైబిల్ అనువాద గ్రంథాల ప్రకారం 'కీర్తనల గ్రంథం' లోని 40 వ కీర్తనకు చెందిన 6 వ వాక్యం నుంచి 8 వ వాక్యం వరకు గల మూడు వాక్యాలతో వైరుధ్యాన్ని కలిగియున్నాయి.[216]

'అపొస్తలుల కార్యములు' యొక్క 15 వ అధ్యాయపు 16 వ మరియు 17 వ వాక్యాలు బైబిల్ పాతనిబంధన గ్రంథంలోని 'ఆమోసు' గ్రంథం యొక్క 9వ అధ్యాయపు 11 వ మరియు

---

**(అథఃసూచికలు)**

215 బైబిల్ పాతనిబంధన గ్రంథం లోని 'కీర్తనల గ్రంథము' యొక్క 16 వ కీర్తనలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" సదాకాలము యెహోవాయందు నా గురి నిలుపుచున్నాను**
**ఆయన నా కుడి పార్శ్వమందు ఉన్నాడు గనుక నేను కదల్చబడను**
**అందువలన నా హృదయము సంతోషించుచున్నది**
**నా ఆత్మ హర్షించుచున్నది**
**నా శరీరము కూడ సురక్షితముగా నివసించుచున్నది**
**ఎందుకనగా నీవు నా ఆత్మను పాతాళములో విడచిపెట్టవు**
**నీ పరిశుద్ధుని కుళ్ళుపట్టనియ్యవు జీవమార్గమును నీవు నాకు తెలియజేసెదవు**
**నీ సన్నిధిని సంపూర్ణ సంతోషము కలదు నీ కుడిచేతిలో నిత్యము సుఖములు కలవు. "**

('కీర్తనల గ్రంథము' , 16 వ కీర్తన, 8 వ వాక్యం నుంచి 11 వ వాక్యం వరకు)

214 వ మరియు 215 వ అథఃసూచికలలో క్రింద గీత గీయబడిన పదాల నడుమ వైరుధ్యముందనే విషయం సుస్పష్టం.



12 వ వాక్యాలకు [217] విరుద్ధంగా ఉన్నాయి. క్రైస్తవ వ్యాఖ్యాతలు ఈ వైరుధ్యాన్ని అంగీకరించారు. అలాగే బైబిల్ హెబ్రూ ప్రతిలో ప్రక్షిప్తం జరిగిందని అంగీకరించారు. ఇటువంటి వైరుధ్యాలు ఇంకా ఎన్నో ఉన్నాయి. అయితే సంక్షిప్తీకరించినప్పుడు ఆ వైరుధ్యాల సంఖ్య నాలుగు అవుతుంది.

---

**(అథఃసూచికలు)**

216 'అపొస్తలుడైన పౌలు హెబ్రీయులకు వ్రాసిన పత్రిక' యొక్క 10 వ అధ్యాయంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" - బలియు అర్పణయు నీవు కోరలేదు గాని నా కొక శరీరమును అమర్చితివి**
**పూర్ణ హోమములును పాప పరిహారార్థ బలులును నీకిష్టమైనవి కావు.**
**అప్పుడు నేను - గ్రంథపు చుట్టలో నన్ను గూర్చి**
**వ్రాయబడిన ప్రకారము, దేవా, నీ చిత్తము**
**నెరవేర్చుటకు ఇదిగో నేను వచ్చియున్నానంటిని "**

('అపొస్తలుడైన పౌలు హెబ్రీయులకు వ్రాసిన పత్రిక' , 10 వ అధ్యాయం, 5 వ వాక్యం నుంచి 7 వ వాక్యం వరకు)

బైబిల్ పాతనిబంధన గ్రంథం లోని 'కీర్తనల గ్రంథము' యొక్క 40 వ కీర్తనలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" బలులనైనను నైవేద్యములనైనను నీవు కోరుట లేదు**
**నీవు నాకు చెవులు నిర్మించియున్నావు**
**దహన బలులనైనను పాపపరిహారార్థ బలులనైనను నీవు తెమ్మనలేదు**
**అప్పుడు- పుస్తకపుచుట్టలో నన్ను గూర్చి వ్రాయబడిన ప్రకారము నేను వచ్చియున్నాను**
**నా దేవా, నీ చిత్తము నెరవేర్చుట నాకు సంతోషము**
**నీ ధర్మశాస్త్రము నా ఆంతర్యములోనున్నది "**

('కీర్తనల గ్రంథము' , 40 వ కీర్తన, 6 వ వాక్యం నుంచి 8 వ వాక్యం వరకు)

క్రింద గీత గీయబడిన పదాల నడుమ వైరుధ్యముందనే విషయం సుస్పష్టం.

## 68 వ వైరుధ్యం :

'అపొస్తలుడైన పౌలు కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక' యొక్క 2 వ అధ్యాయపు 9 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది :

**" ఇందును గూర్చి దేవుడు తన్ను ప్రేమించువారి కొరకు ఏవి సిద్ధపరచెనో అవి కంటికి కనబడలేదు, చెవికి వినబడలేదు, మనుష్య హృదయమునకు గోచరము కాలేదు అని వ్రాయబడియున్నది "**

క్రైస్తవ వ్యాఖ్యాతల పరిశోధన ప్రకారం ఇది బైబిల్ పాతనిబంధన గ్రంథంలోని యెషయా గ్రంథం యొక్క 64 వ అధ్యాయపు 4 వ వాక్యం ద్వారా ఉల్లేఖించబడింది. యెషయా గ్రంథంలోని వాక్యం ఈ విధంగా ఉంది :

---

**(అధఃసూచికలు)**

217 'అపొస్తలుల కార్యములు' యొక్క 15 వ అధ్యాయం యొక్క 16 వ వాక్యం నుంచి 17వ వాక్యం వరకు ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" ఆ తరువాత నేను తిరిగి వచ్చెదను; మనుష్యులలో కడమవారును**
**నా నామము ఎవరికి పెట్టబడెనో**
**ఆ సమస్తమైన అన్యజనులును ప్రభువును వెదకునట్లు**
**పడిపోయిన దావీదు గుడారమును తిరిగి కట్టెదను "**

బైబిల్ పాతనిబంధన గ్రంథం లోని 'ఆమోసు' యొక్క 9వ అధ్యాయపు 11 వ మరియు 12 వ వాక్యాలలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" పడిపోయిన దావీదు గుడారమును ఆ దినమున నేను లేవనెత్తి దాని గోడను బాగుచేసి దాని పోయిన చోట్లను బాగుచేసి, ఎదోము శేషమును నా నామము ధరించిన అన్యజనులందరిని నా జనులు స్వతంత్రించుకొనునట్లు పూర్వపు రీతిగా దానిని మరల కట్టుదును "**

'అపొస్తలుల కార్యములు' లో పేర్కొనబడిన వాక్యాలకు, 'ఆమోసు' గ్రంథంలో పేర్కొనబడిన వాక్యాలకు నడుమ ఈ విధంగా వైరుధ్యమున్నట్లుగా స్పష్టమవుతుంది.



**" తన కొరకు కనిపెట్టువాని విషయమై నీవు తప్ప తన కార్యము సఫలము చేయు మరి ఏ దేవునిని ఎవడు నేకాలమున చూచియుండలేదు. అట్టి దేవుడు కలడన్న సమాచారము మనుష్యులకు వినబడలేదు. అట్టి సంగతి వారికి తెలిసియుండలేదు "** (యెషయా, 64 : 4)

ఈ రెండు వాక్యాల నడుమ వైరుధ్యమున్న విషయం సుస్పష్టం. క్రైస్తవ వ్యాఖ్యాతలు ఈ వైరుధ్యాన్ని అంగీకరించారు. వారు యెషయా గ్రంథంలో పేర్కొనబడిన విషయమే ప్రక్షిప్తానికి గురయిందని పేర్కొంటారు.

## 69 వ వైరుధ్యం :

మత్తయి సువార్త లోని 20 వ అధ్యాయపు 29 వ వాక్యం నుంచి 34 వ వాక్యం వరకు పేర్కొనబడిన అంశాల సారాంశం ఈ విధంగా ఉంది :

**" ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) యెరికో నుంచి వెళ్ళుచుండగా త్రోవ ప్రక్కన కూర్చొనియున్న ఇద్దరు గ్రుడ్డివారిని చూశారు. అలాగే ఆయన వారికి కన్నులు ముట్టగా వెంటనే వారు దృష్టిని పొందారు "**

అయితే అందుకు విరుద్ధంగా మార్కు సువార్త లోని 10 వ అధ్యాయపు 46 వ వాక్యం నుంచి 52 వ వాక్యం వరకు పేర్కొనబడిన అంశాల సారాంశం ఈ విధంగా ఉంది :

**" ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) యెరికో నుండి బయలుదేరి వచ్చుచుండగా తీమయి కుమారుడయిన బర్తిమయి అనే గ్రుడ్డి భిక్షకుడు త్రోవ ప్రక్కన కూర్చొని ఉండెను"**

ఆ తర్వాత ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) ' నీవు వెళ్ళుము; నీ విశ్వాసము నిన్ను స్వస్థపరచెను' అని పలుకగా వెంటనే అతడికి చూపు వచ్చినట్లుగా పేర్కొనబడి ఉంది.

## 70 వ వైరుధ్యం :

మత్తయి సువార్త లోని 8 వ అధ్యాయపు 28 వ వాక్యం నుంచి 32 వ వాక్యం వరకు పేర్కొనబడిన అంశం యొక్క సారాంశం ఈ విధంగా ఉంది :

**" ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) గదరేనీయుల దేశము చేరగా ఆయన దయ్యములు పట్టిన ఇద్దరు మనుష్యులను కలుసుకున్నారు. అప్పుడు ఆయన ఆ ఇద్దరికీ స్వస్థతను**

**చేకూర్చారు"**

అయితే అందుకు విరుద్ధంగా మార్కు సువార్త లోని 5 వ అధ్యాయంలోనూ, లూకా సువార్త లోని 8 వ అధ్యాయంలోనూ [218] పేర్కొనబడిన అంశం యొక్క సారాంశం ఈ విధంగా ఉంది :

**" ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) దోనె దిగగానే అపవిత్రాత్మ పట్టినవాడొకడు సమాధులలో నుండి వచ్చి ఆయన కదురుపడెను. ఆయన అతడికి స్వస్థతను చేకూర్చారు"**

# 71 వ వైరుధ్యం :

మత్తయి సువార్త లోని 21 వ అధ్యాయపు 2 వ వాక్యంలో పేర్కొనబడిన అంశం యొక్క సారాంశం ఈ విధంగా ఉంది :

**" ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) తన ఇద్దరు శిష్యులను ఒక గాడిదను, దానితోన్ను ఒక గాడిదపిల్లను తన వద్దకు తోలుకొని రావలసిందిగా ఆదేశించి గ్రామం వైపుకు పంపారు. ఆయన ఆ రెండింటి మీద అధిరోహించారు"**

అయితే మిగిలిన మూడు సువార్తలలో [219] పేర్కొనబడిన అంశం యొక్క సారాంశం ఈ విధంగా ఉంది :

**" ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) తన ఇద్దరు శిష్యులను కేవలం ఒక గాడిదపిల్లను**

**(అథఃసూచికలు)**

218 మార్కు సువార్త, 5 : 2 లూకా సువార్త, 8 : 27

గుర్తుంచుకోవలసిన విషయమేమిటంటే తెలుగు బైబిల్ గ్రంథంలో మాత్రమే కాకుండా బైబిల్ ఉర్దూ అనువాద గ్రంథాలలోనూ ఈ వాక్యంలో 'అపవిత్రాత్మ పట్టినవాడు' అనియే పేర్కొనబడి ఉంది.

219 మార్కు సువార్త, 11 వ అధ్యాయం, 1 వ వాక్యం నుంచి 10 వ వాక్యం వరకు
లూకా సువార్త, 19 వ అధ్యాయం, 29 వ వాక్యం నుంచి 38 వ వాక్యం వరకు
యోహాను సువార్త, 12 వ అధ్యాయం, 14 వ వాక్యం



**తన వద్దకు తోలుకొని రావలసిందిగా ఆదేశించి గ్రామం వైపుకు పంపారు. వారు దానిని తీసుకురాగా ఆయన దాని మీద అధిరోహించారు"**

# 72 వ వైరుధ్యం :

మార్కు సువార్త లోని 1 వ అధ్యాయపు 6 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది :

**" (యోహాను, అనగా దైవప్రవక్త హజ్రత్ యహ్యా (అ)) అడవి తేనెను మిడుతలను తినువాడు"**

అయితే అందుకు విరుద్ధంగా మత్తయి సువార్త లోని 11 వ అధ్యాయం లోని 18 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది :

**" యోహాను (అనగా దైవప్రవక్త హజ్రత్ యహ్యా (అ)) తినకయు త్రాగకయు వచ్చెను"**

# 73 వ వైరుధ్యం నుంచి 75 వ వైరుధ్యం వరకు :

ఏ వ్యక్తయితే మార్కు సువార్త యొక్క 1వ అధ్యాయాన్ని, మత్తయి సువార్త యొక్క 4వ అధ్యాయాన్ని, యోహాను సువార్త యొక్క 1 వ అధ్యాయాన్ని తులనాత్మకంగా అధ్యయనం చేస్తాడో అతడు దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) శిష్యులు సత్యధర్మాన్ని (అనగా ఇస్లాంను) స్వీకరించే విషయంలో క్రింద పేర్కొనబడిన మూడు వైరుధ్యాలను గమనిస్తాడు :

మత్తయి సువార్తలో [220] మరియు మార్కు సువార్తలో [221] పేర్కొనబడిన వివరణల సారాంశం క్రింద పేర్కొనబడింది :

**" దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) పేతురును, అంద్రెయను, యాకోబును మరియు యోహానును గలిలయ సముద్ర తీరమున కలుసుకున్నారు. ఆయన (అ) వారిని ఇస్లాం వైపుకు ఆహ్వానించగా వారు ఆయనను అనుసరించారు"**

**(అథఃసూచికలు)**

220 మత్తయి సువార్త, 4 వ అధ్యాయం, 18 వ వాక్యం నుంచి 22 వ వాక్యం వరకు

221 మార్కు సువార్త, 1 వ అధ్యాయం, 16 వ వాక్యం నుంచి 20 వ వాక్యం వరకు

అయితే యోహాను సువార్తలో [222] పేర్కొనబడిన వివరణ యొక్క సారాంశం క్రింద పేర్కొనబడింది :

**" యాకోబును తప్ప మిగిలినవారిని యొర్దాను నదికి ఆవల కలుసుకున్నారు"**

మత్తయి మరియు మార్కు ఈ విధంగా పేర్కొంటున్నారు:

**" ముందుగా పేతురును మరియు అంద్రెయను గలిలయ సముద్ర తీరమున కలుసుకున్నారు. కొంత సమయం గడచిన తర్వాత యాకోబు మరియు యోహాను అదే సముద్ర తీరాన కలిసారు "**

అయితే యోహాను సువార్తలో పేర్కొనబడిన వివరణ యొక్క సారాంశం క్రింద పేర్కొనబడింది :

**" ముందుగా యోహానును, అంద్రెయను యొర్దాను నదికి ఆవల కలుసుకున్నారు. ఆ తర్వాత పేతురు తన సోదరుడయిన అంద్రెయ ఉపదేశం మేరకు హాజరయ్యారు. ఆ తర్వాత మరుసటి రోజు ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) గలిలయ వైపుకు వెళ్ళగోరినప్పుడు ఫిలిప్పు వచ్చి కలవడం జరిగింది. తర్వాత అతడి ఉపదేశం మేరకు నతనయేలు వచ్చి కలవడం జరిగింది** [223]

యోహాను సువార్తలో పేర్కొనబడిన ఈ వివరణలో యాకోబు (యాఖూబ్) ప్రస్తావన లేకపోవడాన్ని గమనించవచ్చు.

మత్తయి మరియు మార్కు ఈ విధంగా పేర్కొంటున్నారు:

**" ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) వారిని కలుసుకున్నప్పుడు వారు సముద్రములో వల వేయడంలో, దానిని సరిచేయడంలో నిమగ్నులయి ఉన్నారు "**

**(అథఃసూచికలు)**

[222] యోహాను సువార్త, 1 వ అధ్యాయం, 40 వ వాక్యం నుంచి 42 వ వాక్యం వరకు. ఎందుకంటే యోహాను (దైవప్రవక్త హజ్రత్ యహ్యా (అ)) వారిని కలుసుకోవడానికి సంబంధించిన సంఘటనను గలిలయకు వెళ్ళడానికి ముందు యొర్దాను నదికి ఆవలనున్నప్పుడు పేర్కొనడం జరిగింది

[223] యోహాను సువార్త, 1 వ అధ్యాయం, 42 వ వాక్యం నుంచి 51 వ వాక్యం వరకు.



అయితే యోహాను సువార్తలో వల ప్రస్తావన ఎంతమాత్రం లేదు. యోహాను సువార్తలో ఈ విధంగా పేర్కొనబడిన విషయం యొక్క సారాంశం క్రింద పేర్కొనబడింది:

**" యోహాను మరియు అంద్రెయ బాప్తిస్మమిచ్చు యోహాను ద్వారా ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) ఘనత గురించి విన్నారు. ఇద్దరూ స్వయంగా ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా(అ) సేవలో హాజరయ్యారు. తర్వాత పేతురు తన సోదరుడి ఉపదేశం మేరకు హాజరయ్యారు"**

# యువతిని బ్రతికించారా లేక స్వస్థత చేకూర్చారా?

# 76 వ వైరుధ్యం :

ఏ వ్యక్తయితే మత్తయి సువార్త యొక్క 9 వ అధ్యాయాన్ని అధికారి యొక్క కుమార్తెకు సంబంధించిన సంఘటన గురించి ప్రస్తావించబడియున్న మార్కు సువార్త యొక్క 5 వ అధ్యాయంతో పోల్చి అధ్యయనం చేసినప్పుడు రెండింటి నడుమ ఎంతో వైరుధ్యాన్ని కనుగొంటాడు.

మత్తయి సువార్త యొక్క 9 వ అధ్యాయపు 18 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది :

**" ఆయన ఈ మాటలు వారితో చెప్పుచుండగా, ఇదిగో ఒక అధికారి వచ్చి ఆయనకు మ్రొక్కి - నా కుమార్తె యిప్పుడే చనిపోయినది, అయినను నీవు వచ్చి నీ చెయ్యి ఆమె మీద ఉంచుము, ఆమె బ్రతుకుననెను "**

అయితే మార్కు సువార్త యొక్క 5 వ అధ్యాయపు 23 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది :

**" ఒక అధికారి వచ్చి ఇలా పలికాడు: 'నా చిన్నకుమార్తె చావనై యున్నది."**

అప్పుడు దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) అతడి వెంట వెళ్ళారు. వారు దారి మధ్యలో ఉన్నప్పుడు ఆ అధికారికి చెందినవారు కొందరు వచ్చి ఆ అధికారి కుమార్తె చనిపోయిందని తెలిపారు. (మార్కు, 5 : 35 )

ప్రాచీన కాలానికి చెందిన క్రైస్తవ పండితులు, సత్యశోధకులు ఇక్కడ అర్థం రీత్యా వైరుధ్యం చోటుచేసుకుందనే విషయాన్ని అంగీకరించారు. కొంతమంది మత్తయి సువార్తలో పేర్కొనబడిన విషయానికి ప్రాధాన్యతనిస్తే కొంతమంది మార్కు సువార్తలో పేర్కొనబడిన విషయానికి ప్రాధాన్యతనిచ్చారు. దీనినిబట్టి కొందరు 'మత్తయి సువార్త' లేఖకులు మత్తయి అయి ఉండరని, లేకుంటే ఆయన ఆ విధంగా నిర్ధారించబడని రీతిలో సందిగ్ధమైన వివరణను

అందజేయరని నిరూపితమవుతోందని పేర్కొన్నారు.

ఈ సంఘటనకు సంబంధించి లూకా సువార్తలో పేర్కొనబడిన వివరణ మార్కు సువార్తలో పేర్కొనబడిన వివరణకు అనుగుణంగా ఉంది. అయితే అధికారి ఇంటి నుంచి వచ్చి ఆ అధికారి యొక్క కుమార్తె చనిపోయిందనే సమాచారాన్ని ఒక వ్యక్తి అందజేసినట్లుగా లూకా సువార్తలో పేర్కొనబడి ఉంది. [224]

క్రైస్తవ వ్యాఖ్యాతల్లో ఆ యువతి మృత్యువు విషయం ఇప్పటివరకు సందిగ్ధంగానే ఉండిపోయింది. అలాగే ఆ యువతి నిజంగానే చనిపోయిందో లేదోననే విషయంలోనూ వారి మధ్య భేదాభిప్రాయాలున్నాయి. ప్రఖ్యాత క్రైస్తవ పండితుడయిన నీండర్ ఆ యువతి చనిపోయిందని అభిప్రాయపడలేదు. ఆమె కేవలం చనిపోయినట్లుగా కనిపించి ఉంటుందని, వాస్తవానికి ఆమె చనిపోయి ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు.

అలాగే బాష్, షీలీమేషర్ మరియు షాషన్ ఆ యువతి చనిపోయి ఉండదని, కేవలం స్పృహ కోల్పోయిన స్థితిలో ఉండి ఉంటుందని పేర్కొన్నారు. వారి ఈ వ్యాఖ్యకు దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) యొక్క 'ఆమె నిద్రించుచున్నదే గాని చనిపోలేదు' అనే వాక్కు మద్దతుగా నిలుస్తుంది. [225] కనుక వీరి వ్యాఖ్యల ప్రకారం ఈ సంఘటన ద్వారా దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) మరణించిన యువతిని బ్రతికించే అద్భుతకార్యం నిరూపితం కాదు.

---

**(అథఃసూచికలు)**

224 లూకా సువార్త, 8 వ అధ్యాయం, 49 వ వాక్యం .

మార్కు సువార్తలో మాత్రం ఆ విధంగా అధికారి ఇంటి నుంచి వచ్చి అతడి కుమార్తె చనిపోయిందనే సమాచారాన్ని కొంతమంది అందజేసినట్లుగా పేర్కొనబడియున్న విషయం ఇంతకు ముందే పేర్కొనబడింది

225 **" అందరును ఆమె నిమిత్తమై యేడ్చుచు రొమ్ము కొట్టుకొనుచుండగా, ఆయన వారితో - ఏడ్వవద్దు, ఆమె నిద్రించుచున్నదే గాని చనిపోలేదని చెప్పెను"** (లూకా, 8 : 53 )

**" మీరేల గొల్లుచేసి యేడ్చుచున్నారు? ఈ చిన్నది నిద్రించుచున్నదే గాని చనిపోలేదని వారితో చెప్పెను"** (మార్కు, 5 : 39)

**" స్థలమియ్యుడి; ఈ చిన్నది నిద్రించుచున్నదే గాని చనిపోలేదని వారితో చెప్పగా"** (మత్తయి, 9: 24)



# చేతికఱ్ఱను సిద్ధపరచుకోవడాన్ని వారించడం

## 77 వ వైరుధ్యం :

మత్తయి సువార్త యొక్క 10 వ అధ్యాయపు 9 వ వాక్యం ద్వారా మరియు లూకా సువార్త యొక్క 9 వ అధ్యాయపు 3 వ వాక్యం ద్వారా దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) తన శిష్యులను పంపుతున్న సమయంలో వారు చేతికఱ్ఱను సిద్ధపరచుకోరాదని వారించినట్లుగా తెలుస్తుంది. [225]

అయితే మార్కు సువార్త యొక్క 6 వ అధ్యాయపు 8 వ వాక్యం ద్వారా దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) తన శిష్యులకు చేతికఱ్ఱను సిద్ధపరచుకునేందుకు అనుమతించినట్లుగా తెలుస్తుంది. [226]

# దైవప్రవక్త హజ్రత్ యహ్యా (అ) (యోహాను) దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) ను ఎప్పుడు గుర్తించారు?

## 78 వ వైరుధ్యం :

మత్తయి సువార్త యొక్క 3 వ అధ్యాయం యొక్క 13 వ వాక్యం నుంచి 16 వ వాక్యం వరకు ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" ఆ సమయమున యోహాను చేత బాప్తిస్మము [227] పొందుటకు యేసు గలిలయ నుండి యొర్దాను దగ్గరనున్న అతనియొద్దకు వచ్చెను. అందుకు యోహాను- నేను నీచేత బాప్తిస్మము పొందవలసినవాడనై యుండగా నీవు నాయొద్దకు వచ్చుచున్నావా? అని ఆయనను నివారింపజూచెను**

---

**(అథఃసూచికలు)**

225 **" మీ సంచులలో బంగారమునైనను వెండినైనను రాగినైనను ప్రయాణము కొరకు జాలెనైనను రెండు అంగీలనైనను చెప్పులనైనను చేతికఱ్ఱనైనను సిద్ధపరచుకొనకుడి"** (మత్తయి, 10 : 9 )

226 **" ప్రయాణము కొరకు చేతికఱ్ఱను తప్ప రొట్టెనైనను జాలెనైనను సంచిలో సొమ్మునైనను తీసికొనక"** (మార్కు, 6 : 8 )

**గాని యేసు - ఇప్పటికి కానిమ్ము; నీతి యావత్తు ఈలాగు నెరవేర్చుట మనకు తగియున్నదని అతనికి ఉత్తరమిచ్చెను గనుక అతడాలాగు కానిచ్చెను. యేసు బాప్తిస్మము పొందిన వెంటనే నీళ్ళలో నుండి ఒడ్డునకు వచ్చెను; ఇదిగో ఆకాశము తెరవబడెను, దేవుని ఆత్మ పావురమువలె దిగి తన మీదికి వచ్చుట చూచెను "**

అయితే యోహాను సువార్త యొక్క ఒకటవ అధ్యాయపు 32 వ మరియు 33 వ వాక్యాలలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది :

**" మరియు యోహాను సాక్ష్యమిచ్చుచు - ఆత్మ పావురము వలె ఆకాశము నుండి దిగివచ్చుట చూచితిని; ఆ ఆత్మ ఆయన మీద నిలిచెను. నేను ఆయనను ఎరుగనైతిని గాని నీళ్ళలో బాప్తిస్మమిచ్చుటకు నన్ను పంపినవాడు- నీవెవని మీద ఆత్మ దిగివచ్చి నిలుచుట చూతువో ఆయనే పరిశుద్ధాత్మలో బాప్తిస్మమిచ్చువాడని నాతో చెప్పెను "**

అయితే మత్తయి సువార్త యొక్క 11 వ అధ్యాయపు 2 వ మరియు 3 వ వాక్యాలలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది :

**" క్రీస్తు చేయుచున్న కార్యములను గూర్చి యోహాను [228] చెరసాలలో విని - రాబోవు వాడవు నీవేనా, మేము మరియొకని కొరకు కనిపెట్టవలెనా? అని ఆయనను అడుగుటకు తన శిష్యులనంపెను "**

మొదటి వాక్యం (మత్తయి, 3 : 13-16) ద్వారా ఆత్మ దిగిరావడానికి ముందే దైవప్రవక్త

**(అథఃసూచికలు)**

227 'బాప్తిస్మము' **(Baptism)** అనేది క్రైస్తవుల యొక్క ఒకానొక ఆచారము. ఈ ఆచారం ప్రకారం ఒక ధర్మనిష్ఠాగరిష్ఠుడయిన మతాధిపతి ప్రజలను నీటిలో లేదా ఏదయినా రంగులో గానీ ముంచుతాడు. ఆ విధంగా చేయడం వల్ల పాపాలు కడిగివేయబడతాయని క్రైస్తవులు విశ్వసిస్తారు. అలాగే ఏ వ్యక్తయినా క్రొత్తగా క్రైస్తవాన్ని స్వీకరించినప్పుడు అన్నిటికంటే ముందు అతడికి బాప్తిస్మమివ్వడం జరుగుతుంది. ఉర్దూ బైబిల్ లో బాప్తిస్మము అనే ఆచరణ 'బప్తిస్మహ్' అని పేర్కొనబడింది. ఈ ఆచారానికి సంబంధించిన పూర్తి వివరణ ఈ పంక్తులను వ్రాస్తున్న రచయిత ద్వారా పాఠకులచే చదువబడుతున్న ఈ గ్రంథం యొక్క ముందుమాటలోనే అందించబడింది.

228 అనగా దైవప్రవక్త హజ్రత్ యహ్యా అలైహిస్సలామ్.



హజ్రత్ యహ్యా (అ)(యోహాను) దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) ను ఎరిగి ఉన్నారని [229] విదితమవుతోంది. అయితే అందుకు విరుద్ధంగా రెండవ వాక్యం (యోహాను, 1 : 32-33) ద్వారా ఆత్మ దిగిరావడానికి ముందు దైవప్రవక్త హజ్రత్ యహ్యా (అ)(యోహాను) దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) ను ఎంతమాత్రం ఎరుగరని, తరువాత ఆత్మ దిగి వచ్చినప్పుడు ఆ సూచన ద్వారా ఆయన (అ) ను గుర్తించారని విదితమవుతుంది.

అయితే మూడవ వాక్యం (మత్తయి, 11 : 2-3) ద్వారా ఆత్మ దిగివచ్చిన తర్వాత కూడా దైవప్రవక్త హజ్రత్ యహ్యా (అ) (యోహాను) దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) ను గుర్తించలేదని విదితమవుతుంది. [230]

'మీజానుల్ హఖ్' గ్రంథ రచయిత తన 'హల్లుల్ ఇష్కాల్' (అపార్థాలకు సమాధానం) అనే గ్రంథంలో 133 వ పేజీలో మొదటి రెండు వాక్యాలను (మత్తయి, 3 : 13-16, యోహాను, 1 : 32-33) సరియైనవిగా నిర్ధారించేందుకై మద్దతుగా అందజేసిన వివరణను 'ఇస్తిబ్షార్' గ్రంథ రచయిత సంపూర్ణమైన రీతిలో ఖండించారు. ఆ ఖండనతో కూడిన విశ్లేషణ నాకు చేరింది కూడా. అదేవిధంగా నేను కూడా దానిని ఖండిస్తూ నా 'ఇజాలతుష్షుకూక్' అనే గ్రంథంలో నా విశ్లేషణను అందజేశాను.[231] 'మీజానుల్ హఖ్' గ్రంథంలో అందజేయబడిన వివరణ ఎంతో బలహీనమైనది. అంతేగాకుండా దాని ద్వారా మత్తయి సువార్తలో పేర్కొనబడిన రెండు వాక్యాల మధ్య ఉన్న వైరుధ్యం ఎంతమాత్రం తొలగిపోదు. అందుకే గ్రంథవిస్తార భీతితో నేను దానిని ఇక్కడ పొందుపరచడం లేదు.

**(అథఃసూచికలు)**

229 ఎందుకంటే ఆయన (దైవప్రవక్త హజ్రత్ యహ్యా (అ), అనగా బైబిల్ లో యోహాను) ఈ కారణంగానే దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) కు బాప్తిస్మమిచ్చేందుకు నిరాకరించారు.

230 ఆ కారణంగానే తన శిష్యులను ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా(అ)) వద్దకు విచారించేందుకై పంపారు.

231 'ఇజాలతుష్షుకూక్' గ్రంథం యొక్క మొదటి సంపుటంలోని 383 వ పేజీలో పాఠకులచే ప్రస్తుతం చదువబడుతున్న ఈ గ్రంథ రచయిత అయిన మౌలానా రహ్మతుల్లాహ్ కైరాన్వీ (ర) గారు ఎంతో విలువయిన చర్చను పొందుపరిచారు. ఆసక్తిపరులు తప్పకుండా దానిని అధ్యయనం చేయగలరు.

## 79 వ వైరుధ్యం :

యోహాను సువార్త యొక్క 5 వ అధ్యాయం యొక్క 31 వ వాక్యంలో దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) యొక్క వాక్కు ఈ విధంగా ఉల్లేఖించబడి ఉంది :

**" నన్ను గూర్చి నేను సాక్ష్యము చెప్పుకొనినయెడల నా సాక్ష్యము సత్యము కాదు"**

అయితే యోహాను సువార్త యొక్క 8 వ అధ్యాయం యొక్క 14 వ వాక్యంలో దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) యొక్క వాక్కు ఈ విధంగా ఉల్లేఖించబడి ఉంది :

**" నన్ను గూర్చి నేను సాక్ష్యము చెప్పుకొనినను నా సాక్ష్యము సత్యమే"**

## 80 వ వైరుధ్యం :

మత్తయి సువార్త యొక్క 15 వ అధ్యాయం ద్వారా తన కుమార్తె ఆరోగ్యం కొరకు వేడుకొన్న స్త్రీ కనానుకు చెందినదనే విషయం తెలుస్తుంది. [232]

అయితే అందుకు విరుద్ధంగా మార్కు సువార్త యొక్క 7 వ అధ్యాయం ద్వారా ఆమె సురోఫెనికయ వంశమందు పుట్టిన గ్రీసు దేశస్థురాలని తెలుస్తుంది. [233]

## దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) ఎంతమందికి స్వస్థత చేకూర్చారు? 81 వ వైరుధ్యం :

మార్కు సువార్త యొక్క 7 వ అధ్యాయంలో 32 వ వాక్యం నుంచి 35 వ వాక్యం

**(అథఃసూచికలు)**

232 **" ఇదిగో ఆ ప్రాంతముల నుండి కనాను స్త్రీ యొకతె వచ్చి - ప్రభువా, దావీదు కుమారుడా, నన్ను కరుణింపుము; నా కుమార్తె దయ్యము పట్టి, బహు బాధపడుచున్నదని కేకలు వేసెను"**

(మత్తయి, 15 : 22)

233 **" ఆ స్త్రీ సురోఫెనికయ వంశమందు పుట్టిన గ్రీసు దేశస్థురాలు. ఆమె తన కుమార్తెలో నుండి ఆ దయ్యమును వెళ్ళగొట్టుమని ఆయనను వేడుకొనెను "**

(మార్కు, 7 : 26)



వరకు పేర్కొనబడిన విషయం యొక్క సారాంశం ఇది :

**" దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) చెవిటివాడయిన మరియు గ్రుడ్డివాడయిన ఒక్క వ్యక్తికి మాత్రమే స్వస్థతను చేకూర్చారు "**

అయితే అందుకు విరుద్ధంగా మత్తయి సువార్తలోని 15 వ అధ్యాయంలోని 30 వ వాక్యంలో దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) ఎంతోమందితో కూడిన సమూహానికి స్వస్థతను చేకూర్చినట్లుగా పేర్కొనబడి ఉంది. వాస్తవానికి రెండు చోట్లా ఒకే సంఘటన పేర్కొనబడి ఉంది. ఆ వాక్యం క్రింద పేర్కొనబడుతోంది :

**" బహుజన సమూహములు ఆయన యొద్దకు కుంటివారు గ్రుడ్డివారు మూగవారు అంగహీనులు మొదలైన అనేకులను తీసికొని వచ్చి ఆయన పాదముల యొద్ద పడవేసిరి; ఆయన వారిని స్వస్థపరచెను "**

## బైబిల్ యొక్క అసాధారణ అతిశయోక్తితో కూడిన వ్యక్తీకరణ :

యోహాను సువార్త ను వ్రాసిన వ్యక్తి సువార్తను చివర ఏవిధంగానయితే అతిశయోక్తితో కూడిన వాక్యంతో ముగించడం జరిగిందో అటువంటి అతిశయోక్తి వ్యక్తీకరణే ఇది కూడా. యోహాను సువార్త చివరి వాక్యం క్రింద పేర్కొనబడుతోంది:

**" యేసు చేసిన కార్యములు ఇంకను అనేకములు కలవు. వాటిలో ప్రతి దానిని వివరించి వ్రాసిన యెడల అట్లు వ్రాయబడిన గ్రంథములకు భూలోకమైనను చాలదని నాకు తోచుచున్నది "**

(యోహాను, 21 : 25)

సువార్త రచయితల ఊహాశక్తిని, అతిశయోక్తితో కూడిన కల్పనాచాతుర్యాన్ని పరిశీలించండి! మేమయితే అందుకు విరుద్ధంగా బైబిల్ లోని ఈ పుస్తకాలన్నీ ఒక చిన్న గదిలోని ఒక మూలలో పడతాయని పేర్కొంటాము. అయితే వీరు క్రైస్తవుల దృష్టిలో దివ్యవాణిచే ప్రేరేపితులయినవారిగా పరిగణించబడతారు గనుక, వారు పేర్కొనే ప్రతి విషయమూ దివ్యవాణిగా పరిగణించబడుతుంది గనుక వారికి ప్రతిగా ఎవరయినా ఏమి చెప్పగలరు?

## 82 వ వైరుధ్యం :

మత్తయి సువార్త యొక్క 26 వ అధ్యాయంలో 21 వ వాక్యం నుంచి 25 వ వాక్యం వరకు దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) తన శిష్యులతో ఈ విధంగా పలికినట్లుగా పేర్కొనబడింది :

" వారు భోజనము చేయుచుండగా ఆయన - మీలో ఒకడు నన్ను అప్పగించునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను. అందుకు వారు బహు దుఃఖపడి ప్రతి వాడును - ప్రభువా, నేనా? అని ఆయన నడుగగా ఆయన - నాతో కూడ పాత్రలో చెయ్యి ముంచినవాడెవడో వాడే నన్ను అప్పగించువాడు. .................... యూదా - బోధకుడా, నేనా? అని అడుగగా ఆయన - నీవన్నట్టే అనెను "

అయితే అందుకు విరుద్ధంగా యోహాను సువార్త యొక్క 13 వ అధ్యాయంలో ఈ సంఘటన ఈ విధంగా పేర్కొనబడింది :

" యేసు ఈ మాటలు పలికిన తరువాత ఆత్మలో కలవరపడి - మీలో ఒకడు నన్ను అప్పగించునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నానని రూఢిగా చెప్పెను. ఆయన యెవరిని గూర్చి యీలాగు చెప్పెనో అని శిష్యులు సందేహపడుచు ఒకరితట్టు ఒకరు చూచుకొనుచుండగా ఆయన శిష్యులలో యేసు ప్రేమించిన యొకడు యేసు రొమ్మున ఆనుకొనుచుండెను గనుక ఎవరిని గూర్చి ఆయన చెప్పెనో అది తమకు చెప్పుమని సీమోను పేతురు అతనికి సైగ చేసెను. అతడు యేసు రొమ్మున ఆనుకొనుచు - ప్రభువా, వాడెవడని ఆయనను అడిగెను. అందుకు యేసు- నేనొక ముక్క ముంచి యెవని కిచ్చెదనో వాడే అని చెప్పి, ఒక ముక్క ముంచి సీమోను కుమారుడగు ఇస్కరియోతు యూదాకిచ్చెను " (యోహాను, 13 : 21-26 )

## 83 వ వైరుధ్యం :

మత్తయి యూదా దైవప్రవక్త ఈసా (అ)(ఏసు) ను పట్టించి ఇవ్వడానికి సంబంధించిన సంఘటన గురించి ప్రస్తావిస్తూ 26 వ అధ్యాయంలో ఈ విధంగా పేర్కొన్నారు:

" ఆయనను అప్పగించువాడు - నేనెవరిని ముద్దుపెట్టుకుందునో ఆయనే యేసు; ఆయనను పట్టుకొనుడని వారికి గురుతు చెప్పి వెంటనే యేసు నొద్దకు వచ్చి - బోధకుడా, నీకు శుభమని చెప్పి ఆయనను ముద్దుపెట్టుకొనెను. యేసు - చెలికాడా, నీవు చేయవచ్చినది చేయుమని అతనితో చెప్పగా వారు దగ్గరకు వచ్చి ఆయన మీద పడి ఆయనను పట్టుకొనిరి "

(మత్తయి, 26 : 48 - 50 )

అయితే అందుకు విరుద్ధంగా యోహాను సువార్త యొక్క 18 వ అధ్యాయంలో ఈ విధంగా పేర్కొనబడింది :

" కావున యూదా సైనికులను, ప్రధాన యాజకులు పరిసయ్యులు పంపిన బంట్రౌతులను వెంటబెట్టుకొని, దివిటీలతోను దీపములతోను ఆయుధములతోను అక్కడికి వచ్చెను. యేసు



తనకు సంభవింపబోవున వన్నియు ఎరిగినవాడై వారి యొద్దకు వెళ్ళి - మీరెవని వెదకుచున్నారని వారిని అడిగెను. వారు - నజరేయుడైన యేసునని ఆయనకు ఉత్తరమియ్యగా యేసు- ఆయనను నేనే అని వారితో చెప్పెను; ఆయనను అప్పగించిన యూదాయు వారి యొద్ద నిలుచుండెను. ఆయన -నేనే ఆయనని వారితో చెప్పగా వారు వెనుకకు తగ్గి నేలమీద పడిరి. మరల ఆయన- మీరు ఎవనిని వెదకుచున్నారని వారిని అడిగెను. అందుకు వారు- నజరేయుడైన యేసునని చెప్పగా యేసు వారితో నేనే ఆయనని మీతో చెప్పితిని గనుక మీరు నన్ను వెదకుచున్న యెడల వీరిని పోనియ్యుడని చెప్పెను. ............................................................ అంతట సైనికులును సహస్రాధిపతియు, యూదుల బంట్రౌతులును యేసును పట్టుకొని ఆయనను బంధించి, మొదట అన్న యొద్దకు ఆయనను తీసికొనిపోయిరి. "

(యోహాను, 18 : 3 - 12 )

## పేతురు నిరాకరణ 84 వ వైరుధ్యం :

నాలుగు సువార్తల రచయితలూ దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) శిష్యులలో ఒకరయిన పేతురు ఆయనను గుర్తించ నిరాకరించడానికి [234] సంబంధించిన సంఘటన విషయంలో 8 రకాలుగా విభేదిస్తున్నారు.

**1.** మత్తయి [235] మరియు మార్కు[236] సువార్తల్లో పేర్కొనబడిన విషయాల ప్రకారం పేతురును

---

**(అథఃసూచికలు)**

[234] దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) బైబిల్ లో పేర్కొనబడినదాని ప్రకారం తాను పట్టుబడడానికి ఒకరోజు ముందు పేతురుతో ఈ విధంగా పలికారు: " నీవు కోడి కూయడానికి ముందు మూడు పర్యాయాలు నన్ను గుర్తించ నిరాకరిస్తావు." ఆ తర్వాత యూదులు దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) ను పట్టుకొని బంధించినప్పుడు పేతురు ఆయన వెనుకే వెళ్ళారు. ముగ్గురు యూదులు ఆయనను ఒక్కొక్క మారు అగ్ని వెలుతురులో చూసి 'ఈయన కూడా ఆయన సహచరుడే' అని పలికారు. అయితే ప్రతిసారీ పేతురు తాను దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) సహచరుడినేనే విషయాన్ని, తనకు ఆయన తెలుసనే విషయాన్ని నిరాకరించారు. అంతలో కోడి కూయనారంభించింది. అప్పుడు పేతురుకు దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) తనతో పలికిన మాటలు గుర్తుకొచ్చాయి. పాఠకులచే చదువబడుతున్న ఈ గ్రంథ రచయిత ఇక్కడ ఆ సంఘటన గురించే ప్రస్తావిస్తున్నారు.

దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) శిష్యునిగా నిర్ధారించిన ఇద్దరు పనికత్తెలు, దగ్గరగా నిలిచియున్న కొంతమంది అక్కడ ఉన్నారు. అయితే లూకా సువార్త [237] లో పేర్కొనబడిన విషయం ప్రకారం అక్కడ ఒక పనికత్తె, ఇద్దరు పురుషులు ఉన్నారు.

**2.** మొదటి పనికత్తె ప్రశ్నించినప్పుడు మత్తయి సువార్త ప్రకారం పేతురు వెలుపటి ముంగిట[238] కూర్చొని ఉన్నారు. అయితే లూకా సువార్త ప్రకారం ఆయన ఇంటిలో నడుముంగిట ఉన్నట్లుగా తెలుస్తుంది.[239] అయితే మార్కు సువార్త ప్రకారం ఆయన ఇంటి ముంగిటి క్రిందిభాగంలో ఉన్నట్లుగా తెలుస్తుంది.[240] అయితే యోహాను సువార్త ప్రకారం ఆయన ఇంటిలోపల ఉన్నట్లుగా తెలుస్తుంది.[241]

**3.** పేతురు ఏమని ప్రశ్నించబడ్డారు? అనే విషయంలో నాలుగు సువార్తల నడుమ వైరుధ్యముంది.[242]

**(అథఃసూచికలు)**

[235] మత్తయి సువార్త, 26 వ అధ్యాయం : 6 వ వాక్యం నుంచి 75 వ వాక్యం వరకు

[236] మార్కు సువార్త యొక్క 14 వ అధ్యాయంలోని 66 వ వాక్యం నుంచి 72 వ వాక్యం వరకు పేర్కొనబడిన విషయం ప్రకారం ఒక పనికత్తె వచ్చి రెండు మార్లు ఆ విధంగా పలికింది. చివరకు దగ్గర నిలిచియున్నవారు కూడా ఆమె పలికిన విషయాన్ని ధృవీకరించారు.

[237] లూకా సువార్త యొక్క 22 వ అధ్యాయంలోని 56 వ వాక్యం నుంచి 60 వ వాక్యం వరకు

[238] మత్తయి సువార్త యొక్క 26 వ అధ్యాయంలోని 69 వ వాక్యం

[239] లూకా సువార్త యొక్క 22 వ అధ్యాయంలోని 55 వ వాక్యం

[240] మార్కు సువార్త యొక్క 15 వ అధ్యాయంలోని 66 వ వాక్యం

[241] యోహాను సువార్త యొక్క 18 వ అధ్యాయంలోని 16 వ మరియు 17 వ వాక్యాలు



**4.** కోడి కూయడమనేది మత్తయి, లూకా మరియు యోహాను సువార్తల ద్వారా కేవలం ఒక్క పర్యాయం మాత్రమే సంభవించిందని, అయితే పేతురు మాత్రం ముదు పర్యాయాలు ఏసును (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) ను తాను ఎరుగనని పేర్కొన్నట్లుగా తెలుస్తుంది. అయితే మార్కు సువార్త ద్వారా కోడి రెండుసార్లు కూయడం జరిగిందని, ఒక పర్యాయం మొదటిసారి పేతురు నిరాకరించిన తరువాత, రెండవ పర్యాయం పేతురు రెండవమారు నిరాకరించిన తర్వాత జరిగిందని తెలుస్తుంది.

**5.** మత్తయి మరియు లూకా సువార్తలలో దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) కోడి కూయడానికి ముందు పేతురు తనను ఎరుగనని మూడుసార్లు పలుకుతారని సెలవిచ్చినట్లుగా పేర్కొనబడి ఉంది. [243] అయితే మార్కు సువార్తలో దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) కోడి రెండుసార్లు కూయడానికి ముందు పేతురు తనను ఎరుగనని మూడుసార్లు పలుకుతారని సెలవిచ్చినట్లుగా పేర్కొనబడి ఉంది.[244]

**(అథఃసూచికలు)**

[242] యోహాను సువార్త యొక్క 18 వ అధ్యాయపు 17 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది: **" నీవును ఈ మనుష్యుని శిష్యులలో ఒకడవు కావా?"**

లూకా సువార్త యొక్క 22 వ అధ్యాయపు 56 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది: **" అప్పుడొక చిన్నది ఆ మంట వెలుతురులో అతడు కూర్చుండుట చూచి అతని తేరిచూచి - వీడును అతనితో కూడ ఉండెనని చెప్పెను"** ఈ వాక్యాన్ని బట్టి పనికత్తె నేరుగా పేతురును సంబోధించి ఆ విధంగా పలకలేదని, దగ్గరగా నిలిచియున్నవారిని సంబోధించి ఆ విధంగా పలికిందని బోధపడుతుంది.

అయితే మత్తయి సువార్తలో 26 వ అధ్యాయపు 69 వ వాక్యంలో స్వయంగా పేతురును సంబోధించి **" నీవును గలిలయుడగు యేసుతో కూడ ఉంటివి గదా అనెను"** అని పనికత్తె ప్రశ్నించినట్లుగా పేర్కొనబడింది.

అయితే మార్కు సువార్తలో 15 వ అధ్యాయపు 67 వ వాక్యంలో స్వయంగా పేతురును సంబోధించి **" నీవును నజరేయుడగు ఆ యేసుతో కూడ ఉండినవాడవు కావా? అనెను"** అని పనికత్తె ప్రశ్నించినట్లుగా పేర్కొనబడింది.

[243] మత్తయి సువార్త , 26 : 34, లూకా సువార్త, 22 : 34

**6.** మొదటి పర్యాయం తనను ప్రశ్నించిన పనికత్తెకు పేతురు ఇచ్చిన సమాధానం మత్తయి సువార్త ప్రకారం ఈ విధంగా ఉంది: **" అందుకతడు- నేనుండలేదు; నీవు చెప్పు సంగతి నాకు తెలియదని అందరి యెదుట అనెను"** అయితే పేతురు ఇచ్చిన సమాధానం యోహాను సువార్త ప్రకారం ఈ విధంగా ఉంది: **" అతడు- నేను కాను, నేనెరుగననెను"** ఇక పేతురు ఇచ్చిన సమాధానం మార్కు సువార్త ప్రకారం ఈ విధంగా ఉంది: **" అందుకతడు- ఆయన ఎవడో నేనెరుగను; నీవు చెప్పినది నాకు బోధపడలేదని చెప్పి నడవలోనికి వెళ్ళెను"** అయితే పేతురు ఇచ్చిన సమాధానం లూకా సువార్త ప్రకారం ఈ విధంగా ఉంది: **" అందుకు పేతురు- అమ్మాయీ, నేనతని నెరుగననెను"**

**7.** మత్తయి సువార్త లో రెండవ ప్రశ్నకు సమాధానంగా పేతురు ఒట్టు పెట్టుకొని ఈ విధంగా పలికినట్లుగా పేర్కొనబడి ఉంది : **" నేనుండలేదు; ఆ మనుష్యుని నేనెరుగనని మరల చెప్పెను"** అయితే యోహాను సువార్తలో ఆయన ఈ విధంగా పలికినట్లుగా పేర్కొనబడి ఉంది: **" నేను కాను, నేనెరుగననెను "** అయితే మార్కు సువార్తలో కేవలం ఆయన నిరాకరించిన విషయం పేర్కొనబడి ఉండగా లూకా సువార్తలో ఆయన ఈ విధంగా పలికినట్లుగా పేర్కొనబడి ఉంది: **" అతడు మరల - నేను కాననెను "**

**8.** దగ్గరగా నిలిచియున్నవారు మార్కు సువార్త ప్రకారం పేతురు ప్రశ్నించినబడిన సమయంలో ఇంటి వెలుపల ఉన్నారు. అయితే లూకా సువార్త ప్రకారం వారు ఇంటి నడుముంగిట ఉన్నారు : **" నేనుండలేదు; ఆ మనుష్యుని నేనెరుగనని మరల చెప్పెను"**

## 85 వ వైరుధ్యం :

లూకా సువార్త యొక్క 23 వ అధ్యాయపు 26 వ వాక్యంలో [245] ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" వారాయనను (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు)ను) తీసికొని పోవుచుండగా పల్లెటూరి నుండి వచ్చుచున్న కురేనీయుడైన [246] సీమోనను ఒకని పట్టుకొని, యేసు వెంట సిలువను మోయుటకు అతని మీద దానిని పెట్టిరి "**

**(అథఃసూచికలు)**

[244] మార్కు సువార్త , 14 : 30



అయితే అందుకు విరుద్ధంగా యోహాను సువార్త యొక్క 19 వ అధ్యాయపు 17 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది: **" వారు యేసును తీసికొనిపోయిరి. ఆయన తన సిలువ మోసికొని కపాల స్థలమను చోటికి వెళ్ళెను. హెబ్రీ భాషలో దానికి గొల్గొతా అని పేరు "**

## 86 వ వైరుధ్యం :

మొదటి మూడు సువార్తల ద్వారా [247] ఏసు సుమారు 6 గంటల సమయంలో సిలువ మీద ఉన్నట్లుగా తెలుస్తుంది.

అయితే యోహాను సువార్త [248] ద్వారా ఆయన సరిగ్గా ఆ సమయంలో పొంతి పిలాతు[249] దర్బారులో హాజరయి ఉన్నట్లుగా తెలుస్తుంది.

**(అథఃసూచికలు)**

[245] అలాగే మత్తయి సువార్త 27 : 32 లోనూ, మార్కు సువార్త 15 : 21 లోనూ సీమోను అనబడే ఆ వ్యక్తి కపాల స్థలమను గొల్గొతా అనబడిన ప్రదేశం వరకు సిలువను మోసినట్లుగా పేర్కొనబడింది.

[246] ఆ వ్యక్తి 'కురేను' అనబడిన పట్టణానికి చెందినవాడు.

[247] బైబిల్ అరబీ మరియు ఇంగ్లీష్ అనువాద గ్రంథాలలో మత్తయి సువార్త 27 : 45 లోనూ, మార్కు సువార్త 15 : 33 లోనూ, లూకా సువార్త 23 : 44 లోనూ ఏసును సిలువ పైకి ఎక్కించిన తర్వాత ఆరు గంటల నుంచి అంధకారం అలుముకొని ఉన్నట్లుగా పేర్కొనబడి ఉంది. అయితే బైబిల్ ఉర్దూ మరియు తెలుగు బైబిల్ అనువాద గ్రంథాలలో ఈ ప్రదేశాలన్నింటిలోనూ ఆరు గంటలకు బదులు దాదాపు 'మధ్యాహ్నము మొదలుకొని' అనే పదాలు పేర్కొనబడి ఉన్నాయి.

[248] బైబిల్ ఉర్దూ మరియు తెలుగు అనువాద గ్రంథాలలో యోహాను సువార్త యొక్క 19 వ అధ్యాయపు 14 వ వాక్యంలో 'అప్పుడు ఉదయం ఆరు ఘంటలు కావచ్చెను' అని పేర్కొనబడి ఉంది.

[249] యూదయ రాజ్యానికి గవర్నర్‌గా, దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) ఆఖరి కాలంలో అధిపతిగా కొనసాగిన వ్యక్తి పేరే పిలాతు (**Pilot**)

## 87 వ వైరుధ్యం :

మత్తయి మరియు మార్కు [250] ఏసుతో పాటు సిలువ వేయబడిన ఇద్దరు దొంగల గురించి ఈ విధంగా పేర్కొన్నారు:

**" ఆయనతో కూడ సిలువ వేయబడిన బందిపోటు దొంగలును అలాగే ఆయనను నిందించిరి "**

అయితే లూకా సువార్త [251] లో మాత్రం ఒకడు ఏసును దూషించగా, రెండవవాడు ఆయనతో బిగ్గరగా ఈ విధంగా పలికినట్లుగా పేర్కొనబడి ఉంది:

**" యేసూ, నీవు నీ రాజ్యము లోనికి వచ్చునప్పుడు నన్ను జ్ఞాపకము చేసికొనుమనెను"** [252]

అప్పుడు ఏసు అతడికి ఈ విధంగా సమాధానమిచ్చినట్లుగా పేర్కొనబడి ఉంది:

**" నేడు నీవు నాతో కూడ పరదైసులో ఉందువని నిశ్చయముగా నీతో చెప్పుచున్నాను"**

క్రీ.శ.1839, క్రీ.శ.1840, క్రీ.శ.1844 మరియు క్రీ.శ. 1846 లలో ప్రచురించబడిన బైబిల్ ఉర్దూ అనువాద ప్రతుల అనువాదకులు మత్తయి సువార్త యొక్క 27 వ అధ్యాయపు 44 వ వాక్యంలోనూ మార్కు సువార్త యొక్క 15 వ అధ్యాయపు 32 వ వాక్యంలోనూ ప్రక్షిప్తానికి పాల్పడ్డారు. ఆ ప్రదేశాలలో ఏర్పడిన వైరుధ్యాన్ని తొలగించేందుకై ద్వివచనాన్ని ఏకవచనంగా మార్చివేశారు. [253] అనగా ఇద్దరు దొంగలు నిందించినట్లుగా కాకుండా ఒక్క దొంగ మాత్రమే

**(అథఃసూచికలు)**

[250] మత్తయి, 27 : 44, మార్కు, 15 : 32

[251] లూకా, 23 : 42, 43

[252] అంతేగాకుండా అంతకుముందు ఈ విధంగా కూడా పేర్కొనబడి ఉంది:

**" వ్రేలాడవేయబడిన ఆ నేరస్థులలో ఒకడు ఆయనను దూషించుచు - నీవు క్రీస్తువు గదా? నిన్ను నీవు రక్షించుకొనుము, మమ్మును కూడ రక్షించుమని చెప్పెను. అయితే రెండవవాడు వానిని గద్దించి - నీవు అదే శిక్షావిధిలో ఉన్నావు గనుక దేవునికి భయపడవా?"**

(లూకా, 23 : 39, 40)



ఏసును నిందించినట్లుగా వ్రాశారు. ఆ విధంగా సులువుగా ప్రక్షిప్తాలకు (మార్పులూచేర్పులకు) పాల్పడడమనేది

## 88 వ వైరుధ్యం :

మత్తయి సువార్త యొక్క 20 వ మరియు 21 వ అధ్యాయాల ద్వారా దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) యెరికో నుంచి బయలుదేరి యెరూషలేముకు చేరుకున్నట్లుగా తెలుస్తుంది. అయితే యోహాను సువార్త యొక్క 11 వ మరియు 12 వ అధ్యాయాల ద్వారా [254] దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) ఎఫ్రాయిమను ఊరి నుంచి బయలుదేరి బేతనియకు చేరుకొని అక్కడ ఒక రాత్రి బస చేసిన తర్వాత యెరూషలేముకు చేరుకున్నట్లుగా తెలుస్తుంది.

## దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) మృతులను సజీవులుగా చేయడం 89 వ వైరుధ్యం :

నాలుగు సువార్తల ద్వారా దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) దివ్యారోహణం కావించడానికి ముందు ముగ్గురు మృతులను బ్రతికించినట్లుగా తెలుస్తుంది. మొట్టమొదట ఆయన ధనవంతుని కుమార్తెను బ్రతికించడానికి సంబంధించిన సంఘటన పేర్కొనబడింది. ఈ సంఘటన మూడు సువార్తల్లోనూ పేర్కొనబడి ఉంది. ఇక రెండవమారు దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) మృతుని బ్రతికించినట్లుగా కేవలం లూకా మాత్రమే తన సువార్తలో 7 వ అధ్యాయపు 11 వ వాక్యం నుంచి 15 వ వాక్యం వరకు పేర్కొన్నారు. ఇక మూడవమారు లాజరు అనే మృతుని దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) బ్రతికించినట్లుగా కేవలం యోహాను మాత్రమే తన సువార్తలో 11 వ అధ్యాయపు 41 వ వాక్యం నుంచి 44 వ వాక్యం వరకు పేర్కొన్నారు.

అయితే 'అపొస్తలుల కార్యములు' యొక్క 26 వ అధ్యాయపు 23 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది :

**(అథఃసూచికలు)**

[253] అయితే వర్తమాన కాలంలో అందుబాటులో ఉన్న బైబిల్ ఉర్దూ అనువాద ప్రతులలో మాత్రం ద్వివచనమే ఉపయోగించబడి ఉంది. అనగా ఇద్దరు దొంగలు నిందించినట్లుగానే పేర్కొనబడి ఉంది.

[254] యోహాను సువార్త, 11 : 54

**" క్రీస్తు శ్రమపడి మృతుల పునరుత్థానము పొందువారిలో మొదటివాడగుట చేత, ఈ ప్రజలకును అన్యజనులకును వెలుగు ప్రచురింపబోవునని..."**

'అపొస్తలుడైన పౌలు కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక' యొక్క 15 వ అధ్యాయపు 20 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది :

**"ఇప్పుడైతే నిద్రించినవారిలో ప్రథమఫలముగా క్రీస్తు మృతులలో నుండి లేపబడియున్నాడు."**

అయితే 22 వ మరియు 23 వ వాక్యాలలో ఈ విధంగా పేర్కొనబడింది :

**" ఆదామునందు అందరు ఏలాగు మృతిపొందుచున్నారో, ఆలాగుననే క్రీస్తునందు అందరు బ్రదికింపబడుదురు. ప్రతివాడును తన తన వరుసలోనే బ్రతికింపబడును; ప్రథమ ఫలము క్రీస్తు; తరువాత క్రీస్తు వచ్చినపుడు ఆయనవారు బ్రదికింపబడుదురు"**

అలాగే 'అపొస్తలుడైన పౌలు కొలొస్సయులకు వ్రాసిన పత్రిక' యొక్క 1 వ అధ్యాయం యొక్క 18 వ వాక్యంలో దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) గుణగణాల ప్రస్తావనలో భాగంగా ఈ విధంగా పేర్కొనబడింది:

**"ఆయనకు అన్నిటిలో ప్రాముఖ్యము కలుగు నిమిత్తము, ఆయన ఆదియైయుండి మృతులలో నుండి లేచుటలో ఆదిసంభూతుడాయెను"**

ఈ వాక్కులన్నీ ఏసుకు ముందు మరణించిన తరువాత బ్రతికి లేచిన వ్యక్తి ఉన్నాడనే విషయాన్ని నిరాకరిస్తున్నాయి. ఒకవేళ ఆయనకు ముందు కూడా ఎవరయినా మరణించిన తర్వాత తిరిగి బ్రతికినట్లుగా అంగీకరించే పక్షంలో ఏసు మృతులలో నుండి లేచినవారిలో అందరికంటే ప్రథముడు కాజాలరు, ఈ విషయంలో అందరికంటే ఆయనకు ప్రాముఖ్యత లభించదు. అలా కాని పక్షంలో, అనగా ఏసుకు ముందు మరణించిన తరువాత బ్రతికి లేచిన వ్యక్తులు కూడా ఉన్నారని అంగీకరించే పక్షంలో క్రింద పేర్కొనబడిన పౌలు వాక్కులు ఏవిధంగా సత్యమైనవి కాగలవు?

(1) ఆయన (ఏసు) మృతులలో అందరికంటే ముందుగా లేచి నిలుచును

(2) నిద్రించినవారిలో ఆదిసంభూతుడగును

(3) క్రీస్తు ఆదిసంభూతుడు. అలాగే ఆయన మృతులలో ప్రథముడు

అలాగే ఏసుకు ముందు మరణించిన తరువాత బ్రతికి లేచిన వ్యక్తులు కూడా ఉన్నారని అంగీకరించే పక్షంలో 'యోహాను వ్రాసిన ప్రకటన గ్రంథము' యొక్క 1 వ అధ్యాయపు 5 వ



వాక్యంలో క్రిందివిధంగా పేర్కొనబడిన విషయం ఏవిధంగా సత్యం కాగలదు?

**" నమ్మకమైన సాక్షియు, మృతులలో నుండి ఆదిసంభూతుడుగా లేచినవాడును"**

అలాగే ఏసుకు ముందు మరణించిన తరువాత బ్రతికి లేచిన వ్యక్తులు కూడా ఉన్నారని అంగీకరించే పక్షంలో బైబిల్ పాతనిబంధన గ్రంథములోని 'యోబు' గ్రంథం యొక్క 7వ అధ్యాయపు 9 వ మరియు 10వ వాక్యాలలో క్రిందివిధంగా పేర్కొనబడిన విషయం సత్యమైనది ఎలా కాగలదు?

**" మేఘము విడిపోయి అదృశ్యమగునట్లు పాతాళమునకు దిగిపోయినవాడు మరి ఎప్పుడును రాడు. అతడు ఇక ఎన్నడును తన యింటికి రాడు. అతని స్థలము అతని మరల నెరుగదు"**

అలాగే క్రీ.శ. 1885 లో ప్రచురించబడిన బైబిల్ పారసీక అనువాద గ్రంథంలో ఈ క్రిందివిధంగా పేర్కొనబడి ఉంది:

**" మేఘము ఏవిధంగానయితే చెల్లాచెదరయి అదృశ్యమతుందో అదేవిధంగా ఏ వ్యక్తయితే సమాధిలోకి వెళ్తాడో అతడు ఇక తిరిగిరాడు. అతడి ఇంటి లోనికి మరెవడూ రాడు. అలాగే అతడి స్థలము అతడిని తప్ప మరెవరినీ గుర్తించదు"**

యోబు గ్రంథంలోనే 14 వ అధ్యాయపు 12 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" ఆలాగుననే నరులు పండుకొని తిరిగి లేవరు. ఆకాశము గతించిపోవువరకు వారు మేలుకొనరు. ఎవరును వారిని నిద్ర లేపజాలరు"**

యోబు గ్రంథంలోనే 14 వ అధ్యాయపు 14 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" మరణమైన తరువాత నరులు బ్రతుకుదురా? "**

అలాగే క్రీ.శ. 1838 లో ప్రచురించబడిన బైబిల్ పారసీక అనువాద గ్రంథంలో 12 వ వాక్యం ఈ క్రిందివిధంగా పేర్కొనబడి ఉంది:

**" మానవుడు నిద్రించి తిరిగి లేవడు. ఆకాశము గతించిపోవువరకు అతడు మేలుకొనడు, నిద్రలేవడు"**

అలాగే 14 వ వాక్యం ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" మానవుడు మరణించిన తర్వాత తిరిగి అతడు బ్రతుకుతాడా?"**

బైబిల్ లోని ఈ వాక్యాల ద్వారా దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) ద్వారా మృతులను

బ్రతికించడమనే అద్భుతకార్యం వెలువడలేదని తెలుస్తుంది. ఇక ధనవంతుడి కుమార్తెను బ్రతికించడానికి సంబంధించిన కార్యం విషయంలో క్రైస్తవ పండితుల విభేదాల గురించి ఇంతకుముందే వైరుధ్యం-76 లో పేర్కొనబడింది.

అలాగే యోబు గ్రంథంలోని వాక్యాల ద్వారా [255] ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) మృతులలో నుండి బ్రతికి లేవడమనేది అసత్యమని తెలుస్తుంది. అలాగే వాటిద్వారా ఆయన మరణించడం, సిలువ శిక్ష విధించబడడానికి సంబంధించిన సంఘటన అనేవి క్రైస్తవ రచయితలచే సువార్తలలో కల్పించబడిన విషయాలే తప్ప మరేమీ కావు.

ఇక్కడ ఈ గ్రంథ పాఠకులు గుర్తుంచుకోవలసిన విషయమేమిటంటే దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) మృతులను బ్రతికించడమనే అద్భుతకార్యాన్ని ప్రదర్శించారనే విషయాన్ని నిరాకరిస్తూ ఏయే విషయాలనయితే మేము ఇక్కడ పేర్కొన్నామో అవన్నీ వాస్తవానికి ప్రొటెస్టెంట్ వర్గం తరపున వెలువడిన ఆరోపణలే. ఈ విషయం ఈ గ్రంథ ప్రారంభంలోనే పాఠకులకు తెలియజేయబడింది.

## దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) మరణించిన తర్వాత తిరిగి లేవడం 90 వ వైరుధ్యం :

మత్తయి సువార్త ద్వారా మగ్దలేనే మరియయు[256], వేరొక మరియయు[257] సమాధి వద్దకు చేరుకున్నప్పుడు ఒక దైవదూత పరలోకము నుండి దిగిరావడం జరిగిందని, రాయి సమాధి నుంచి దొర్లిపోయిందని, దానిమీద దైవదూత కూర్చొనడం జరిగిందని, అలాగే వారిని భయపడకుండా

(అథఃసూచికలు)

255 అయితే యోబు గ్రంథంలోనే ఒకచోట అద్భుతకార్యానికి సంబంధించిన ఏదయినా ప్రత్యేక రీతికి ఈ విషయంలో మినహాయింపు ఉందని పేర్కొనబడింది. అనగా దైవప్రవక్తల ద్వారా దైవం తరపున ఎప్పుడయినా అటువంటి అద్భుతకార్యాలు వెలువడేందుకు అవకాశముంది. కనుక దానివల్ల వైరుధ్యం ఏర్పడదు. ఏదిఏమయినప్పటికీ బైబిల్‌లో పేర్కొనబడిన వాక్యాల మధ్య ఇన్నిరకాలుగా వైరుధ్యాలు ఉండడమనేది ఆమోదయోగ్యం కాదు.

256 ఈ ఇద్దరూ సువార్తల ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) శిష్యురాండ్రు. వారు ఆయన సమాధిని చూసేందుకు వచ్చారు.



వెంటనే వెళ్ళిపోవలసిందిగా పలికినట్లుగా తెలుస్తుంది.[258]

అయితే మార్కు సువార్త ద్వారా వారిద్దరును, సలోమేయు సమాధి వద్దకు చేరుకున్నప్పుడు రాయి పొర్లింపబడియుండుటను చూసారని, సమాధి లోనికి ప్రవేశించినప్పుడు తెల్లని నిలువుటంగీ ధరించుకొనియున్న ఒక పడుచువాడు సమాధి లోపల కుడివైపున కూర్చొనియుండటాన్ని చూసారని[259] తెలుస్తుంది.

అయితే లూకా సువార్త ద్వారా వారు సమాధి వద్దకు చేరుకున్నప్పుడు సమాధి ముందర ఉండిన రాయి దొరలింపబడియుండడాన్ని చూసి లోపలికి వెళ్ళి ఏసు దేహం కనిపించని కారణంగా కలవరపడ్డారని, అప్పుడు అకస్మాత్తుగా ప్రకాశమానమైన వస్త్రములు ధరించిన ఇద్దరు వ్యక్తులు వారివద్ద నిలబడియుండడాన్ని వారు చూసారని [260] తెలుస్తుంది.

(అథఃసూచికలు)

257 ఈమె మత్తయి సువార్త యొక్క 27 వ అధ్యాయపు 56 వ వాక్యంలో 'యాకోబు యోసే అనువారి తల్లి' అని పేర్కొనబడింది. లూకా సువార్త యొక్క 24 వ అధ్యాయపు 10 వ వాక్యంలో ఈమె ' యాకోబు తల్లి' అని పేర్కొనబడింది.

258 మత్తయి సువార్త యొక్క 28 వ అధ్యాయపు 5 వ వాక్యం నుంచి 7 వ వాక్యం వరకు దైవదూత పలుకులు క్రిందివిధంగా పేర్కొనబడి ఉన్నాయి:

**“ దూత ఆ స్త్రీలను చూచి - మీరు భయపడకుడి, సిలువ వేయబడిన యేసును మీరు వెదకుచున్నారని నాకు తెలియును; ఆయన ఇక్కడ లేడు; తాను చెప్పినట్టే ఆయన లేచియున్నాడు; రండి ప్రభువు పండుకొనిన స్థలము చూచి త్వరగా వెళ్ళి, ఆయన మృతులలో నుండి లేచియున్నాడని ఆయన శిష్యులకు తెలియజేయుడి”**

259 మార్కు సువార్త, 16 వ అధ్యాయపు 4, 5 వాక్యాలు. అప్పుడు మత్తయి సువార్త యొక్క 28 వ అధ్యాయపు 5 వ వాక్యం ద్వారా పైన ఉల్లేఖించబడిన మాటలనే దైవదూత పలికినట్లుగా పేర్కొనబడి ఉంది.

260 లూకా సువార్త, 24వ అధ్యాయం, 2 వ వాక్యం నుంచి 4 వ వాక్యం వరకు

## 91 వ వైరుధ్యం :

మత్తయి సువార్త ద్వారా దైవదూత ఇద్దరు స్త్రీలకు క్రీస్తు సజీవుడయ్యాడని తెలియజేసినప్పుడు వారిద్దరూ వెనుదిరిగారని, దారిలో వారికి ఏసు కనిపించారని, ఏసు వారికి శుభమని చెప్పి - ‘ మీరు వెళ్ళి నా సహోదరులు గలిలయకు వెళ్ళవలెననియు వారక్కడ నన్ను చూతురనియు వారికి తెలుపడు’ అని పలికినట్లుగా తెలుస్తుంది. [261]

అయితే లూకా సువార్త [262] ద్వారా ఆ ఇద్దరు మహిళలు సమాధి లోపల ఇద్దరు ప్రకాశమానమైన వ్యక్తుల ద్వారా ఆ సమాచారాన్ని విని వెనుదిరిగారని, ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) యొక్క పదకొండు మంది ప్రధాన శిష్యులకు, ఇంకా ఇతర శిష్యులందరికీ ఆ సంఘటన గురించి తెలియజేశారని, అయితే వారు ఆ మహిళల ప్రకటనను విశ్వసించలేదని తెలుస్తుంది.

అయితే యోహాను సువార్త ద్వారా ఏసు మగ్దలేనే మరియను సమాధి వద్ద కలుసుకున్నారని తెలుస్తుంది.[263]

# ఒక వ్యక్తి మరియొకడి పాపాలను మోస్తాడా?

## 92 వ వైరుధ్యం :

లూకా సువార్త యొక్క 11 వ అధ్యాయపు 51 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**“ కాబట్టి లోకము పుట్టినది మొదలుకొని, అనగా హేబెలు రక్తము మొదలుకొని బలిపీఠమునకును మందిరమునకును మధ్యను నశించిన జెకర్యా రక్తము వరకు చిందింపబడిన ప్రవక్తలందరి రక్తము నిమిత్తము ఈ తరము వారు విచారింపబడుదురు; నిశ్చయముగా ఈ తరమువారు ఆ రక్తము నిమిత్తము విచారింపబడుదురని మీతో చెప్పుచున్నాను”**

**(అథఃసూచికలు)**

261 మత్తయి సువార్త, 28 వ అధ్యాయంలో 8 వ వాక్యం నుంచి 10 వ వాక్యం వరకు.

262 లూకా సువార్త, 24 : 9

263 యోహాను సువార్త, 20 వ అధ్యాయంలో 13 వ వాక్యం నుంచి 15 వ వాక్యం వరకు



అయితే యెహెజ్కేలు గ్రంథం యొక్క 18 వ అధ్యాయం ద్వారా ఏ వ్యక్తీ మరొక వ్యక్తి యొక్క పాపాలకు గాను ప్రశ్నించబడడని, పట్టుకోబడడని తెలుస్తుంది. [264]

అదేవిధంగా తౌరాతులో (బైబిల్ లో తౌరాతుగా ప్రసిద్ధమయిన పుస్తకాలలో)ఎన్నోచోట్ల సంతానం మూడు లేదా నాలుగు తరాల వరకు తమ పూర్వీకుల పాపాలకు గాను పట్టుబడతారని పేర్కొనబడి ఉంది.

## 93 వ వైరుధ్యం :

‘అపొస్తలుడైన పౌలు తిమోతికి వ్రాసిన మొదటి పత్రిక’ యొక్క 2 వ అధ్యాయంలోని 3వ మరియు 4 వ వాక్యాలలో ఈ విధంగా పేర్కొనబడింది:

**“ ఇది [265] మంచిదియు మన రక్షకుడగు దేవుని దృష్టికి అనుకూలమైనదియునై యున్నది. ఆయన, మనుష్యులందరు రక్షణ పొంది సత్యమును గూర్చిన అనుభవజ్ఞానము గలవారై యుండవలెనని యిచ్ఛయించుచున్నాడు ”**

అయితే ‘అపొస్తలుడైన పౌలు థెస్సలొనీకయులకు వ్రాసిన రెండవ పత్రిక’ యొక్క 2 వ అధ్యాయంలోని 11వ మరియు 12 వ వాక్యాలలో ఈ విధంగా పేర్కొనబడింది:

**“ ఇందుచేత సత్యమును నమ్మక దుర్నీతియందు అభిలాషగల వారందరును శిక్షావిధి పొందుటకై, అబద్ధమును నమ్మునట్లు మోసము చేయు శక్తిని దేవుడు వారికి పంపుచున్నాడు”**

చూడండి. మొదటి వాక్యం ద్వారా మానవులందరూ రక్షణ లేదా ముక్తిని పొందాలనేది, సత్యాన్ని గుర్తించేంతగా అనుభవజ్ఞానాన్ని పొందాలనేది దేవుని లక్ష్యం అని తెలుస్తుంది. అయితే రెండవ వాక్యం ద్వారా దేవుడు వారిపై మార్గభ్రష్టత్వపు ప్రభావాన్ని లేదా శక్తిని పంపుతాడని, తద్వారా వారు అబద్ధాన్ని నిజమైనదిగా భావించనారంభిస్తారని, అప్పుడు ఆయన అందుకు గాను

**(అథఃసూచికలు)**

264 **“ పాపము చేయువాడే మరణము నొందును; తండ్రి యొక్క దోష శిక్షను కుమారుడు మోయుట లేదని కుమారుని దోష శిక్షను తండ్రి మోయడు ”** (యెహెజ్కేలు, 18 : 20)

265 అనగా మానవులు సంపూర్ణ భక్తిని, మాన్యతను కలిగియుండి ధర్మనిష్ఠతో జీవితం గడపడం. (‘అపొస్తలుడైన పౌలు తిమోతికి వ్రాసిన మొదటి పత్రిక’, 2 : 2 )

వారిని శిక్షిస్తాడని తెలుస్తుంది. వాస్తవానికి ప్రొటెస్టెంట్ వర్గానికి చెందిన క్రైస్తవ పండితులు సరిగ్గా ఈ దోషాన్నే ఇతర మతాల నుంచి వెలికితీసి విమర్శిస్తూ ఉంటారు. "దేవుడు మొదట ప్రజలను మార్గభ్రష్టులుగా చేసి, తర్వాత వారిని శిక్షించడమనేది మీ దృష్టిలో ముక్తిని (రక్షణను) మరియు దేవుడిని గుర్తించడానికి సంబంధించిన ఏదయినా విధానమా?" అని ఆ విధంగా ఇతర మతాల నుంచి దోషాన్ని వెలికితీసి ఆరోపించేవారిని ప్రశ్నించడం తప్ప మరేమి చేయగలము? [266]

## పౌలు క్రైస్తవుడిగా మారడానికి సంబంధించిన సంఘటన

## 94 వ వైరుధ్యం నుంచి 96 వ వైరుధ్యం వరకు:

'అపొస్తులుల కార్యములు' యొక్క 9 వ అధ్యాయంలోనూ, 22 వ అధ్యాయంలోనూ, 26 వ అధ్యాయంలోనూ పౌలు క్రీస్తును విశ్వసించడానికి సంబంధించిన సంఘటన పేర్కొనబడి ఉంది.[267] మూడు అధ్యాయాలలోనూ పేర్కొనబడిన విషయాల మధ్య ఎన్నో రకాల వైరుధ్యాలున్నాయి. మేము ఈ పుస్తకంలో కేవలం మూడు రకాల వైరుధ్యాల గురించి పేర్కొంటున్నాము. అయితే మేము మా 'ఇజాలతుష్షుకూక్' అనే గ్రంథంలో పది రకాల వైరుధ్యాల గురించి పేర్కొన్నాము.

**(అథఃసూచికలు)**

[266] ఇక్కడ పాఠకులచే చదువబడుతున్న ఈ గ్రంథ రచయిత ప్రత్యేకంగా ప్రొటెస్టెంట్ వర్గానికి చెందిన క్రైస్తవ పండితులను ఎందుకు ఆరోపిస్తున్నారంటే వారు దేవుడిని చెడుకు సృష్టికర్తగా విశ్వసించరు. వారు రోమన్ కేథొలిక్ వర్గానికి చెందిన క్రైస్తవులను, ముస్లింలను ఈ విధంగా ఆరోపిస్తూ ఉంటారు : " దేవుడు సన్మార్గాన్ని ప్రసాదించడానికి బదులు ప్రజలను మార్గభ్రష్టులుగా చేస్తూ ఉంటాడనే దోషాన్ని మీ మతం కలిగియున్నది"

[267] ఈ వైరుధ్యం గురించి బాగా అర్థం చేసుకునేందుకై ముందుగా పౌలు క్రైస్తవుడిగా మారడానికి సంబంధించి బైబిల్ లో పేర్కొనబడిన విషయాన్ని అర్థం చేసుకోవాలి. పౌలు యూదుడిగా ఉన్నప్పుడు క్రైస్తవులకు కష్టం కలిగించే ఉద్దేశ్యంతో దమస్కు కు వెళ్తుండగా దారిలో ఒక వెలుగు అతడి చుట్టూ ప్రకాశించిందని, అతడికి ఏసు స్వరం వినబడిందని, అతడిని క్రైస్తవునిగా మారిపోవలసిందిగా ఆ స్వరం ద్వారా ఉపదేశం అందగా అతడు క్రైస్తవుడిగా మారిపోయాడని బైబిల్ లో పేర్కొనబడి ఉంది.



**1.** 'అపొస్తులుల కార్యములు' యొక్క 9 వ అధ్యాయంలోని 7 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" అతనితో ప్రయాణము చేసిన మనుష్యులు ఆ స్వరము వినిరి గాని యెవనిని చూడక మానులై నిలువబడిరి. "**

అయితే 'అపొస్తులుల కార్యములు' యొక్క 22 వ అధ్యాయంలోని 9 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" నాతో కూడ నున్నవారు ఆ వెలుగును చూచిరి గాని నాతో మాటలాడినవాని స్వరము వారు వినలేదు "**

మొదటి వాక్యంలో ' ఆ స్వరము వినిరి గాని' అని పేర్కొనబడియుండగా, రెండవ వాక్యంలో 'స్వరము వారు వినలేదు' అని పేర్కొనబడియున్నది. రెండు వాక్యాలూ పరస్పరం ఎంతగా విరుద్ధంగా ఉన్నాయో చూడండి.

**2.** 'అపొస్తులుల కార్యములు' యొక్క 9 వ అధ్యాయంలోని 6 వ వాక్యంలో పౌలుకు దారిలో కనిపించిన ఏసు పౌలుతో ఈ విధంగా పలికినట్లుగా పేర్కొనబడి ఉంది:

**" లేచి పట్టణములోనికి వెళ్ళుము, అక్కడ నీవు ఏమి చేయవలెనో అది నీకు తెలుపబడునని చెప్పెను"**

అలాగే 'అపొస్తులుల కార్యములు' యొక్క 22 వ అధ్యాయంలోని 10 వ వాక్యంలో కూడా ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" అప్పుడు నేను - ప్రభువా, నేనేమి చేయవలెనని అడుగగా, ప్రభువు- నీవు లేచి దమస్కులోనికి వెళ్ళుము; అక్కడ నీవు చేయుటకు నియమింపబడినవన్నియు నీకు చెప్పబడునని నాతో అనెను "**

అయితే 'అపొస్తులుల కార్యములు' యొక్క 26 వ అధ్యాయంలో 16 వ వాక్యం నుంచి 18 వ వాక్యం వరకు ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" నీవు నన్ను చూచియున్న సంగతిని గూర్చియు నేను నీకు కనబడబోవు సంగతిని గూర్చియు నిన్ను పరిచారకునిగాను సాక్షిని గాను నియమించుటకై కనబడియున్నాను. నీవు లేచి నీ పాదములు మోపి నిలువుము; నేను ఈ ప్రజల వలనను అన్యజనుల వలనను హాని కలుగకుండ నిన్ను కాపాడెదను; వారు చీకటిలో నుండి వెలుగులోనికిని సాతాను అధికారము నుండి దేవుని**

**వైపుకును తిరిగి, నా యందలి విశ్వాసము చేత పాపక్షమాపణను, పరిశుద్ధపరచబడినవారిలో స్వాస్థ్యమును పొందునట్లు వారి కన్నులు తెరచుటకై నేను నిన్ను వారియొద్దకు పంపెదనని చెప్పెను"**

చూడండి. 9 వ మరియు 22 వ అధ్యాయాల ద్వారా పౌలుపై ఏ కార్యాల బాధ్యత అయితే మోపబడియున్నదో దానికి సంబంధించిన వివరాలు పట్టణంలోనికి వెళ్ళిన తర్వాత తెలియజేయబడతాయని పేర్కొనబడినట్లుగా తెలుస్తుంది. అయితే 26 వ అధ్యాయంలోని, పైన పేర్కొనబడిన వాక్యం ద్వారా పౌలు ఏసు స్వరాన్ని ఎక్కడయితే వినడం జరిగిందో అక్కడే అతడు పట్టణంలోకి వెళ్ళి చేయవలసిన పనులకు, బాధ్యతలకు సంబంధించిన సమాచారం అందజేయబడినట్లుగా తెలుస్తుంది.

**3.** 'అపొస్తలుల కార్యములు' యొక్క 9 వ అధ్యాయం ద్వారా పౌలుతో పాటు ఉన్నవారు వారు మౌనంగా నిలుచుండిపోయినట్లుగా తెలుస్తుంది. అయితే 26 వ అధ్యాయం ద్వారా వారు నేల మీద పడిపోయినట్లుగా తెలుస్తుంది.[268] అయితే 22 వ అధ్యాయంలో అందజేయబడిన వివరణ ద్వారా వారు నిలుచుండిపోయినదీ తెలియదు, నేల మీద పడిపోయినదీ తెలియదు.

## 22 వేలా లేక 24 వేలా? 97 వ వైరుధ్యం :

'అపొస్తలుడైన పౌలు కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక' యొక్క 10 వ అధ్యాయం లోని 8 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది :

**" మరియు వారివలె మనము వ్యభిచరింపక యుందము; వారిలో కొందరు[269] వ్యభిచరించినందున ఒక్క దినముననే యిరువది మూడువేలమంది కూలిరి "**

అయితే 'సంఖ్యాకాండము' యొక్క 25 వ అధ్యాయం లోని 9 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది :

**" ఇరువది నాలుగువేల మంది ఆ తెగులు చేత చనిపోయిరి "**

రెండింటి మధ్య ఉన్న భేదం వెయ్యి. కనుక రెండు వాక్యాలలో ఒకటి తప్పనిసరిగా

**(అథఃసూచికలు)**

268 **" మేమందరమును నేలపడినప్పుడు - సౌలా సౌలా, నన్నెందుకు హింసించుచున్నావు? మునికోలలకు ఎదురు తన్నుట నీకు కష్టమని హెబ్రీ భాషలో ఒక స్వరము నాతో పలుకుట వింటిని"** ( 'అపొస్తలుల కార్యములు' 26 : 14 )



తప్పుడు వాక్యమయి ఉండాలి.

## దైవప్రవక్త హజ్రత్ యూసుఫ్ (అ) వంశస్థుల సంఖ్య

## 98 వ వైరుధ్యం:

'అపొస్తలుల కార్యములు' యొక్క 7 వ అధ్యాయం లోని 14 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది :

**" యోసేపు తన తండ్రియైన యాకోబును తన స్వజనులందరిని పిలువనంపెను; వారు డెబ్బదియయిదుగురు "**

ఈ వాక్యం ద్వారా దైవప్రవక్త హజ్రత్ యూసుఫ్ (అ)(యోసేపు) మరియు ఆయన సంతానం ఆయన తన తండ్రిని, స్వజనులందరినీ పిలిపించడానికి ముందే ఈజిప్టులో ఉన్నారు గనుక వారు డెబ్బదియయిదుగురిలో భాగంగా పరిగణించబడరని తెలుస్తుంది. కనుక 'దైవప్రవక్త హజ్రత్ యూసుఫ్ (అ) (యోసేపు) మరియు ఆయన సంతానం తప్ప ఆయన తండ్రి అయిన దైవప్రవక్త హజ్రత్ యాఖూబ్ (అ) (యాకోబు) మరియు ఆయనకు చెందిన మిగిలిన సంతానం సంఖ్య డెబ్బదియయిదు' అని ఈ వాక్యం ద్వారా అర్థం చేసుకోవాలి.

అయితే 'ఆదికాండము' యొక్క 46 వ అధ్యాయం లోని 27 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది :

**" ఐగుప్తునకు వచ్చిన యాకోబు కుటుంబపు వారందరు డెబ్బదిమంది "**

దైవప్రవక్త హజ్రత్ యూసుఫ్ (అ) (యోసేపు) మరియు ఆయన సంతానం డి.ఐలీ మరియు చర్డ్‌మంట్ ల వ్యాఖ్యానం ప్రకారం ఆ డెబ్బదిమందిలో చేరియున్నారు. లేయా సంతానం 32 మంది, జిల్పా సంతానం 16 మంది, రాహేలు సంతానం 11 మంది, బిల్హా సంతానం 7 మంది. వీరందరూ కలిసి 66 మంది అవుతారు. వీరితో పాటు దైవప్రవక్త హజ్రత్ యాఖూబ్

**(అథఃసూచికలు)**

269 బైబిల్ వ్యాఖ్యాతలందరూ ఏకాభిప్రాయంతో ఈ వాక్యం 'సంఖ్యాకాండము' యొక్క 25 వ అధ్యాయంలోని 9 వ వాక్యంలో పేర్కొనబడిన సంఘటనను సూచిస్తున్నదని పేర్కొన్నారు. సంఖ్యాకాండము లోని 25 వ అధ్యాయంలో ఇశ్రాయేలీయులు షిత్తీములో దిగియుండగా ప్రజలు మోయాబురాండ్రతో వ్యభిచారం చేయసాగారని, ఆ కారణంగా వారిలో ఇరవైనాలుగు వేలమంది హతమార్చబడ్డారని పేర్కొనబడి ఉంది.

(అ) (యాకోబు)ను, దైవప్రవక్త హజ్రత్ యూసుఫ్ (అ) (యోసేపు) ను మరియు ఆయన ఇద్దరు కుమారులను కలుపుకున్నట్లయితే వారందరి సంఖ్య 70 అవుతుంది. దీనినిబట్టి బైబిల్ క్రొత్తనిబంధన గ్రంథంలోని 'అపొస్తలుల కార్యములు' యొక్క 7వ అధ్యాయంలోని 14 వ వాక్యం తప్పని తెలుస్తుంది.

## శాంతియా లేక యుద్ధమా? 99 వ వైరుధ్యం:

'మత్తయి సువార్త' యొక్క 5 వ అధ్యాయంలోని 9 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది : **" సమాధానపరచువారు ధన్యులు;[270] వారు దేవుని కుమారులనబడుదురు "**

అయితే అందుకు విరుద్ధంగా 'మత్తయి సువార్త' యొక్క 10 వ అధ్యాయంలోని 34 వ వాక్యంలో దైవప్రవక్త హజ్రత్ ఈసా(అ)(ఏసు) యొక్క వాక్కు ఈవిధంగా పేర్కొనబడి ఉంది:

**" నేను భూమి మీదికి సమాధానమును పంపవచ్చితినని తలంచకుడి; ఖడ్గమునే గాని సమాధానమును పంపుటకు నేను రాలేదు."**

రెండు వాక్యాలూ పరస్పరం ఎంత విరుద్ధంగా ఉన్నాయో చూడండి. ఒకవేళ పైన పేర్కొనబడిన రెండు వాక్యాలను సత్యమైనవిగా భావించినట్లయితే వాటి ప్రకారం స్వర్గలోకపు శుభవార్తను పొందిన ధన్యులలో దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) చేరరని తేలుతుంది (అల్లాహ్ క్షమించుగాక). అలాగే మొదటి వాక్యం ప్రకారం ఆయన దేవుని కుమారులుగా పరిగణించబడజాలరు.

## ఇస్కరియోతు యూదా మృత్యువు 100 వ వైరుధ్యం:

ఇస్కరియోతు యూదా [271] మృత్యువుకు సంబంధించిన సంఘటనను మత్తయి తన సువార్త యొక్క 27 వ అధ్యాయంలో పేర్కొన్నారు. అయితే లూకా ఆ సంఘటనను 'అపొస్తలుల కార్యములు' యొక్క 1 వ అధ్యాయంలో పేతురు ద్వారా ఉల్లేఖించడం జరిగింది. అయితే

(అధఃసూచికలు)

[270] బైబిల్ అరబీ అనువాద గ్రంథంలో 'తూబా లహుమ్' అని పేర్కొనబడి ఉంది. 'తూబా లహుమ్' అనగా 'ధన్యులు' అనే అర్థంతో పాటు 'వారికి స్వర్గం లభిస్తుంది' అనే అర్థం కూడా వర్తించే అవకాశముంది.



రెండు వివరణల్లోనూ రెండు రకాలుగా తీవ్రస్థాయిలో వైరుధ్యముంది.

మొదటి వైరుధ్యమేమిటంటే మత్తయి సువార్తలోని 27 వ అధ్యాయపు 5 వ వాక్యంలో ఇస్కరియోతు యూదా తనను తాను ఉరి వేసుకున్నట్లుగా పేర్కొనబడింది. అయితే 'అపొస్తలుల కార్యములు' యొక్క 1 వ అధ్యాయంలోని 18 వ వాక్యంలో యూదా తలక్రిందుగా పడి నడిమికి బద్దలైనందున అతని పేగులన్నీ బయటికి వచ్చాయని అతి స్పష్టంగా పేర్కొనబడి ఉంది.

ఇక రెండవ వైరుధ్యమేమిటంటే మత్తయి సువార్తలోని 27 వ అధ్యాయం ద్వారా యూదా ప్రధాన యాజకులకు, పెద్దలకు తాను తీసుకున్న ముప్పది వెండి నాణేలను తిరిగి ఇచ్చిన తర్వాత ప్రధాన యాజకులు వాటితో ఒక పొలాన్ని కొన్నట్లుగా విదితమవుతుంది.[272]

అయితే 'అపొస్తలుల కార్యములు' యొక్క 1 వ అధ్యాయం ద్వారా యూదా స్వయంగా తన కొరకు ఆ వెండి నాణేలతో ఒక పొలాన్ని కొనుగోలు చేసినట్లుగా తెలుస్తుంది.[273] అయితే ఆ విధంగా పేర్కొన్న పేతురు మరొక విషయాన్ని కూడా క్రిందివిధంగా పేర్కొన్నట్లుగా ఉల్లేఖించబడి ఉంది:

(అధఃసూచికలు)

[271] దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) యొక్క పన్నెండు మంది శిష్యులలో ఒకడయిన ఇస్కరియోతు యూదా చివరగా విద్రోహానికి పాల్పడి ముప్పది వెండినాణెములకు ఆశపడి ఆయనను అప్పగించినట్లుగా బైబిల్‌లో పేర్కొనబడింది. ఆ తర్వాత ఇస్కరియోతు యూదా తాను చేసిన తప్పుకు పశ్చాత్తాపపడి తాను తీసుకున్న ముప్పది వెండినాణెములను తిరిగి ప్రధాన యాజకులకు, పెద్దలకు ఇచ్చివేశాడని కూడా బైబిల్ లో చెప్పబడింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాల కొరకు ఇదే గ్రంథంలోని '83 వ వైరుధ్యం' లో పేర్కొనబడిన విషయాలను పఠించగలరు.

[272] **" ప్రధానయాజకులు ఆ వెండి నాణెములు తీసికొని - ఇవి రక్త క్రయధనము గనుక వీటిని కానుక పెట్టెలో వేయతగదని చెప్పుకొనిరి. కాబట్టి వారు ఆలోచన చేసి వాటినిచ్చి, పరదేశులను పాతిపెట్టుటకు కుమ్మరి వాని పొలము కొనిరి "** (మత్తయి సువార్త, 27 వ అధ్యాయంలోని 6 వ మరియు 7 వ వాక్యాలు)

[273] **" ఈ యూదా ద్రోహము వలన సంపాదించిన రూకలనిచ్చి యొక పొలము కొనెను"**

(అపొస్తలుల కార్యములు, 1 : 18)

" ఈ సంగతి యెరూషలేములో కాపురమున్న వారికందరికి తెలియవచ్చెను"

ఈ విషయంలో మత్తయి సువార్తలోని వివరణ తప్పుడు వివరణగా, లూకా అందించిన వివరణ సరియైనదిగా [274] తెలుస్తోంది. మత్తయి సువార్తలోని వివరణ తప్పుడు వివరణ అని నిరూపించేందుకు దోహదపడే ఐదు అంచనాలు క్రింద పేర్కొనబడుతున్నాయి.

**1.** మత్తయి సువార్త యొక్క 27 వ అధ్యాయంలో యూదా మరణించడానికి ముందు తాను ఏసును అపరాధిగా పట్టించినందువల్ల ఆయనకు శిక్ష విధించబడడం పట్ల పశ్చాత్తాపం చెందినట్లుగా పేర్కొనబడి ఉంది. వాస్తవానికి ఇది తప్పు. ఎందుకంటే ఆ సంఘటన జరుగుతున్న సమయానికి ఏసుకు ఇంకా శిక్ష విధించబడలేదు. ఆయన అప్పటికి ఇంకా పిలాతు దర్బారులోనే ఉన్నారు.

**2.** మత్తయి సువార్త యొక్క 27 వ అధ్యాయంలో యూదా తాను పుచ్చుకున్న ముప్పై వెండి నాణేలను తిరిగి ప్రధాన యాజకులకు, పెద్దలకు అందజేసినట్లుగా పేర్కొనబడి ఉంది. వాస్తవానికి ఇది కూడా తప్పే. ఎందుకంటే ఆ సమయంలో ప్రధాన యాజకులు, పెద్దలు అందరూ పిలాతు వద్ద ఉన్నారు. వారందరూ పిలాతు యొక్క ఆరాధనామందిరంలో ఆ సమయంలో ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) కు వ్యతిరేకంగా ఫిర్యాదు చేస్తూ ఉన్నారు. అంతేగానీ వారు దేవాలయం

**(అధఃసూచికలు)**

[274] క్రైస్తవులకు చెందిన ప్రసిద్ధ పండితుడయిన ఎ.లూకిన్ విలియమ్స్ (**A.Lukyn Williams**) ఇస్కరియోతు యూదా విషయంలో ఏర్పడిన ఈ రెండు పరస్పర విరుద్ధ వివరణల గురించి ప్రస్తావించారు. యూదా పుచ్చుకున్న ముప్పది వెండి నాణేల విషయంలో మత్తయి సువార్తలో మరియు 'అపొస్తలుల కార్యములు' లో పేర్కొనబడిన విషయాల మధ్య ఏర్పడిన వైరుధ్యం విషయానికొస్తే ఆయన 'అపొస్తలుల కార్యములు' లో పేర్కొనబడిన విషయానికే ప్రాధాన్యతనిచ్చారు. అనగా అందులో పేర్కొనబడిన విషయమే సరియైనదిగా తీర్మానించాడు. ఇక రెండవ వైరుధ్యం విషయానికొస్తే ఆయన స్పష్టమైన రీతిలో ఈ విధంగా వ్యాఖ్యానించారు: "మత్తయి సువార్త యొక్క 27 వ అధ్యాయంలోని 5 వ వాక్యంలో పేర్కొనబడిన విషయానికి, 'అపొస్తలుల కార్యములు' యొక్క ఒకటవ అధ్యాయంలో పేర్కొనబడిన విషయానికి మధ్య వైరుధ్యముంది. మత్తయి సువార్తలో యూదా ఉరివేసుకొని చనిపోయినట్లుగా పేర్కొనబడియుంటే, 'అపొస్తలుల కార్యములు' లో అతడు తలక్రిందుగా పడి చనిపోయినట్లుగా పేర్కొనబడి ఉంది. ఈ రెండు వివరణల మధ్య పొంతన కుదర్చడమనేది కష్టమే కాదు, అతి కష్టమైన కార్యం.''

(బ్రిటానికా ఎన్‌సైక్లోపీడియా, 168 వ పేజీ, 12 వ సంపుటము, **'Judas Iscariot'** అనే అంశం)



వద్ద ఆ సమయంలో లేరు.

**3.** మత్తయి సువార్త యొక్క 27 వ అధ్యాయంలో 3 వ వాక్యం నుంచి 10 వ వాక్యం వరకు పేర్కొనబడిన విషయాన్ని గమనిస్తే అది 2 వ వాక్యానికి, 11 వ వాక్యానికి నడుమ ఎంతమాత్రం పొసగని, సంబంధం లేని విషయంగా తెలుస్తుంది.

**4.** మత్తయి సువార్త యొక్క 27 వ అధ్యాయంలో ఇస్కరియోతు యూదా మృత్యువు ఏసు బంధించబడిన రాత్రి తరువాతి ఉదయాన సంభవించినట్లుగా పేర్కొనబడి ఉంది. అయితే అంత స్వల్పకాలంలోనే, అనగా ఒక్క రాత్రిలోనే అతడు తన చర్యకు గాను పశ్చాత్తాపం చెంది తనను తాను ఉరివేసుకొని మరణించడమనేది అసంబద్ధంగా తోస్తుంది. ఎందుకంటే ఏసును పట్టివ్వడానికి ముందే యూదులు ఆయనను హతమారుస్తారనే విషయం అతడికి తెలుసు

**5.** మత్తయి సువార్త యొక్క 27 వ అధ్యాయంలోని 9 వ వాక్యంలో స్పష్టమైన తప్పు ఉంది. దానిగురించి పాఠకులకు సవివరంగా వారిచే చదవబడుతున్న ఈ గ్రంథం యొక్క 2 వ అధ్యాయంలో [275] తెలుస్తుంది.

## పరిహారం ఎవరు? 101 వ వైరుధ్యం:

'యోహాను వ్రాసిన మొదటి పత్రిక' యొక్క 2 వ అధ్యాయంలోని 1వ మరియు 2వ వాక్యాలలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" ఎవడైనను పాపము చేసినయెడల నీతిమంతుడైన యేసుక్రీస్తు అను ఉత్తరవాది తండ్రి యొద్ద మనకున్నాడు. ఆయనే మన పాపములకు శాంతికరమై (ప్రాయశ్చిత్తమై) యున్నాడు; మన పాపములకు మాత్రమే కాదు, సర్వలోకమునకును శాంతికరమై (ప్రాయశ్చిత్తమై) యున్నాడు"**

అయితే అందుకు విరుద్ధంగా 'సామెతలు' యొక్క 21 వ అధ్యాయంలోని 18 వ వాక్యంలో దుర్మార్గులు మంచివారి పాపాలకు పరిహారమవుతారంటూ ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**(అధఃసూచికలు)**

[275] చూడండి : ఈ గ్రంథం యొక్క 2వ అధ్యాయంలోని లక్ష్యం-2 యొక్క ఋజువు నెం. 28

" నీతిమంతుని కొరకు భక్తిహీనులు ప్రాయశ్చిత్తమగుదురు. యథార్థవంతులకు ప్రతిగా విశ్వాసఘాతకులు కూలుదురు"

## 102 వ వైరుధ్యం:

'అపోస్తలుడైన పౌలు హెబ్రీయులకు వ్రాసిన పత్రిక' యొక్క 7 వ అధ్యాయంలోని 18వ వాక్యం ద్వారా మరియు 8 వ అధ్యాయంలోని 7 వ వాక్యం ద్వారా మోషే ధర్మశాస్త్రం (దైవప్రవక్త హజ్రత్ మూసా (అ)కు దైవం తరఫున అందజేయబడిన ధర్మశాస్త్రం) ఎంతో బలహీనంగా ఉందని, ప్రయోజనరహితంగా [276] ఉందని తెలుస్తుంది. అయితే 'కీర్తనల గ్రంథం' లోని 18 వ కీర్తన [277] యొక్క 7 వ వాక్యం ద్వారా అది దోషరహితంగా, సత్యమైనదిగా [278] ఉందని తెలుస్తుంది.

(అధఃసూచికలు)

[276] **" ఆ ధర్మశాస్త్రము దేనికిని సంపూర్ణ సిద్ధి కలుగజేయలేదు గనుక ముందియ్యబడిన ఆజ్ఞ బలహీనమైనందునను నిష్ ప్రయోజనమైనందునను అది నివారణ చేయబడియున్నది "**
(అపోస్తలుడైన పౌలు హెబ్రీయులకు వ్రాసిన పత్రిక, 7 : 18 )

[277] అన్ని ప్రతుల్లోనూ ఇదేవిధంగా ఉంది. అయితే మాకు ఈ వాక్యం 'కీర్తనల గ్రంథం' లోని 19 వ కీర్తనలో లభ్యమయింది. కీర్తనల కూర్పులో ఎన్నో అవకతవకలు జరిగిన కారణంగా బహుశా పాఠకులచే చదవబడుతున్న ఈ గ్రంథ రచయిత అయిన హజ్రత్ మౌలానా రహ్మతుల్లాహ్ కైరాన్వీ (ర) గారి వద్ద ఉన్న ప్రతిలో బహుశా ఇది 18 వ కీర్తన అయి ఉంటుంది. (అల్లాహ్‌కే ఎరుక) బైబిల్ తెలుగు అనువాద గ్రంథంలోనూ 19 వ కీర్తన యొక్క 7 వ వాక్యంలోనే ఈ విషయం పేర్కొనబడి ఉంది (తెలుగు అనువాదకుడు).

[278] **" యెహోవా నియమించిన ధర్మశాస్త్రము యథార్థమైనది**
**అది ప్రాణమును తెప్పరిల్లజేయును యెహోవా శాసనము నమ్మదగినది**
**అది బుద్ధిహీనులకు జ్ఞానము పుట్టించును**
**యెహోవా ఉపదేశములు నిర్దోషమైనవి, అవి హృదయమును సంతోషపరచును "**
('కీర్తనల గ్రంథం' : 19 : 7-8 )

ఈ వాక్యములలో పేర్కొనబడిన విషయం 'అపోస్తలుడైన పౌలు హెబ్రీయులకు వ్రాసిన పత్రిక' యొక్క 7 వ అధ్యాయంలోని 18వ వాక్యానికి విరుద్ధమైనది అనేందుకు మరొక కారణమేమిటంటే అందులో ' ఆ ధర్మశాస్త్రము దేనికిని సంపూర్ణ సిద్ధి కలుగజేయలేదు'' అని పేర్కొనబడి ఉంది.



## 103 వ వైరుధ్యం:

మార్కు సువార్త యొక్క 16 వ అధ్యాయం ద్వారా ఎందరో మహిళలు[279] సూర్యోదయం కాగానే సమాధి వద్దకు చేరుకున్నారని తెలుస్తుంది.[280] అయితే యోహాను సువార్త యొక్క 20 వ అధ్యాయం ద్వారా ఆ సమయంలో అంధకారం అలుముకొని ఉన్నదని, సమాధి వద్దకు చేరుకున్నది కేవలం ఒకే మహిళ అని తెలుస్తుంది.[281]

## సిలువపై వేలాడదీయబడిన ప్రకటన 104 వ వైరుధ్యం:

పిలాతు వ్రాసి సిలువ మీద వేలాడదీయించిన ప్రకటన విషయంలో నాలుగు సువార్తల్లోనూ వేర్వేరు వివరణలు ఉన్నాయి. మత్తయి సువార్తలో [282] ఈ విధంగా పేర్కొనబడి ఉంది :

**" ఇతడు యూదుల రాజైన యేసు"**

అయితే మార్కు సువార్తలో [283] **" యూదుల రాజు"** [284] అని పేర్కొనబడింది. లూకా సువార్తలో [285] **" యూదుల రాజు"** అని పేర్కొనబడింది.

(అధఃసూచికలు)

[279] అనగా మగ్దలేనే మరియ మొదలయినవారు. 90 వ వైరుధ్యంలో పేర్కొనబడిన సంఘటనే ఇది కూడా.

[280] మార్కు సువార్త, 16 : 2

[281] **" ఆదివారమున ఇంకను చీకటిగా ఉన్నప్పుడు మగ్దలేనే మరియ పెందలకడ సమాధి యొద్దకు వచ్చి..."** (యోహాను సువార్త, 20 : 1 )

[282] మత్తయి సువార్త, 27 : 37

[283] మార్కు సువార్త, 15 : 26

[284] తెలుగు బైబిల్ లో మార్కు సువార్త, 15 : 26 లో 'యూదుల రాజైన యేసు' అని వ్రాయబడి ఉంది.

అయితే యోహాను సువార్తలో [286] **“ యూదుల రాజైన నజరేయుడగు యేసు”** అని పేర్కొనబడింది.

విచిత్రమైన విషయమేమిటంటే ఇంత చిన్న, మామూలు విషయాన్ని సైతం సువార్తల రచయితలు గుర్తుంచుకోలేకపోయారు. మరి పెద్ద పెద్ద, సుదీర్ఘ విషయాలకు సంబంధించి వారి జ్ఞాపకశక్తిపై ఎలా నమ్మకముంచగలము? ఒకవేళ ఒక పాఠశాలకు చెందిన ఒక విద్యార్థి కేవలం ఒక్క పర్యాయం ఆ విషయాన్ని చూసినట్లయితే అతడు ఎన్నటికీ దానిని మరువలేడు

## దైవప్రవక్త హజ్రత్ యహ్యా (అ)(యోహాను) బంధించబడడానికి కారణం 105 వ వైరుధ్యం:

మార్కు సువార్త యొక్క 6 వ అధ్యాయం ద్వారా హేరోదు దైవప్రవక్త హజ్రత్ యహ్యా (అ) (యోహాను) సత్యసంధత పట్ల విశ్వాసము గలవాడయి, ఆయన పట్ల సంతుష్టుడయి ఉండేవాడని తెలుస్తుంది.[287] అలాగే ఆయన ప్రసంగాలను సైతం వినేవాడని తెలుస్తుంది. అలాగే అతడు దైవప్రవక్త హజ్రత్ యహ్యా (అ) (యోహాను) ను హింసించినది కేవలం హేరోదియ ప్రసన్నతను పొందే ఉద్దేశ్యంతోనేనని తెలుస్తుంది.[288]

**(అథఃసూచికలు)**

[285] లూకా సువార్త, 23 : 38

[286] యోహాను సువార్త, 19 : 19

[287] **“ ఎందుకనగా యోహాను నీతిమంతుడును పరిశుద్ధుడునగు మనుష్యుడని హేరోదు ఎరిగి, అతనికి భయపడి అతని కాపాడుచు వచ్చెను. మరియు అతని మాటలు వినినప్పుడు, ఏమి చేయను తోచకపోయినను సంతోషముతో వినుచుండెను ”** (మార్కు సువార్త, 6 : 20 )

[288] హేరోదియ మొదట హేరోదు సోదరుడయిన ఫిలిప్పు భార్య. అయితే హేరోదు ఆమెను వివాహం చేసుకోవడంతో అది ధర్మసమ్మతం కాదని దైవప్రవక్త హజ్రత్ యహ్యా (అ)(యోహాను) అతడిని వారించారు. దానితో హేరోదు ఆయనను పట్టి తెప్పించి చెరసాలలో బంధించాడు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాల కొరకు మార్కు సువార్త యొక్క 6 వ అధ్యాయంలోని 17 వ మరియు 18 వ వాక్యాలను అధ్యయనం చేయగలరు.



అయితే అందుకు విరుద్ధంగా లూకా సువార్త యొక్క 3 వ అధ్యాయం ద్వారా హేరోదు దైవప్రవక్త హజ్రత్ యహ్యా (అ) (యోహాను) ను కేవలం హేరోదియ ప్రసన్నతను పొందే ఉద్దేశ్యంతోనే కాకుండా స్వయంగా తాను సంతుష్టుడయ్యే ఉద్దేశ్యంతోనూ హింసించినట్లు తెలుస్తుంది. ఎందుకంటే అతడు తన దుర్మార్గాల విషయంలో దైవప్రవక్త హజ్రత్ యహ్యా (అ)(యోహాను) పట్ల నిరసనను కలిగియుండేవాడు. [289]

## దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) శిష్యుల సంఖ్య 106 వ వైరుధ్యం:

మత్తయి, మార్కు, మరియు లూకా దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) యొక్క పదకొండు మంది శిష్యుల పేర్ల విషయంలో ఏకాభిప్రాయాన్ని కలిగియున్నారు. ఆ పదకొండు మంది శిష్యుల పేర్లు ఇవి:

పేతురు, అంద్రెయ, జెబెదయి కుమారుడయిన యాకోబు, యోహాను, ఫిలిప్పు, బర్తొలొమయి, తోమా, మత్తయి, అల్ఫయి కుమారుడగు యాకోబు, కనానీయుడైన సీమోను, ఇస్కరియోతు యూదా.

అయితే పన్నెండవ శిష్యుని విషయంలో ఈ సువార్తలన్నింటిలోనూ వైరుధ్యాలున్నాయి. మత్తయి సువార్తలో అతడి పేరు ‘తద్దయి యను మారు పేరు గల లెబ్బయి’ [290] అని పేర్కొనబడింది. అయితే మార్కు సువార్తలో ‘తద్దయి’ అని పేర్కొనబడి ఉంది.[291]

**(అథఃసూచికలు)**

[289] **“ అయితే చతుర్థాధిపతియైన హేరోదు చేసిన సకల దుష్కార్యముల నిమిత్తమును, అతని సోదరుని భార్యయైన హేరోదియ నిమిత్తమును, యోహాను అతనిని గద్దించినందుకు”**
(లూకా సువార్త, 3 : 19 )

[290] బైబిల్ అరబీ మరియు ఇంగ్లిష్ అనువాద గ్రంథాలలో ఈ విధంగానే పేర్కొనబడి ఉంది. అయితే బైబిల్ ఉర్దూ అనువాద గ్రంథంలో మాత్రం కేవలం ‘తద్దయి’ అని పేర్కొనబడింది.
(మత్తయి సువార్త, 10 : 3 )

[291] బైబిల్ ఉర్దూ మరియు తెలుగు అనువాద గ్రంథాలలో ‘తద్దయి’ అని పేర్కొనబడింది.
(మార్కు సువార్త, 3 : 18 )

అయితే లూకా సువార్తలో అతడి పేరు 'యాకోబు సహోదరుడయిన యూదా' [292] అని పేర్కొనబడింది.

## 107 వ వైరుధ్యం:

మత్తయి, మార్కు, మరియు లూకా సువార్తల రచయితలు సుంకపు మెట్టు వద్ద కూర్చొనియున్న వ్యక్తి పరిస్థితి గురించి పేర్కొన్నారు. దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) ఆ వ్యక్తితో ఈ క్రింద పేర్కొనబడిన విధంగా పలుకగా అతడు ఆయనను అనుసరించినట్లుగా పేర్కొనబడి ఉంది:

**" నన్ను వెంబడించుమని అతనితో చెప్పగా అతడు లేచి ఆయనను వెంబడించెను"**

అయితే ఆ వ్యక్తి యొక్క పేరు విషయంలో సువార్తల ఉల్లేఖకుల మధ్య తీవ్రస్థాయిలో వైరుధ్యాలున్నాయి. మత్తయి సువార్త యొక్క 9 వ అధ్యాయంలో [293] ఆ వ్యక్తి పేరు 'మత్తయి' అని పేర్కొనబడి ఉంది. మార్కు సువార్త యొక్క 2 వ అధ్యాయంలో [294] ఆ వ్యక్తి పేరు 'అల్ఫయి కుమారుడగు లేవి' అని పేర్కొనబడి ఉంది. ఇక లూకా సువార్త యొక్క 5 వ అధ్యాయంలో [295] ఆ వ్యక్తి పేరు తండ్రి పేరుతో కలిసి కాకుండా కేవలం 'లేవి' అని పేర్కొనబడింది.

**(అథఃసూచికలు)**

[292] బైబిల్ అరబీ మరియు ఇంగ్లిష్ అనువాద గ్రంథాలలో ఈ విధంగానే పేర్కొనబడి ఉంది. అయితే బైబిల్ ఉర్దూ అనువాద గ్రంథంలో మాత్రం కేవలం 'యాకోబు కుమారుడగు యూదా' అని పేర్కొనబడింది. (లూకా సువార్త, 6 : 16 )

'అపొస్తలుల కార్యములు' యొక్క 1 వ అధ్యాయంలోని 13 వ వాక్యంలోనూ ఈ పేర్లు పేర్కొనబడియున్నాయి. అక్కడ పన్నెండవ శిష్యుని పేరు లూకా సువార్తలో పేర్కొనబడినదానికి అనుగుణంగా ఉంది.

బైబిల్ తెలుగు అనువాద గ్రంథంలో 'అపొస్తలుల కార్యములు' 1 : 13 లో 'యాకోబు కుమారుడగు యూదా' అని పేర్కొనబడి అథఃసూచికలో 'లేక సహోదరుడగు' అని పేర్కొనబడి ఉంది. (తెలుగు అనువాదకుడు)

[293] మత్తయి సువార్త, 9 : 9

[294] మార్కు సువార్త, 2 : 14

[295] లూకా సువార్త, 5 : 27



అయితే తరువాతి అధ్యాయాలలో ఎక్కడయితే వారు (సువార్తల రచయితలు) పన్నెండుమంది శిష్యుల పేర్లను ప్రస్తావించారో అక్కడ అందరూ 'మత్తయి' [296] పేరునే పేర్కొన్నారు. అలాగే అల్ఫయి కుమారుని పేరును 'యాకోబు' అని పేర్కొన్నారు.

# శిష్యులందరిలోకెల్లా గొప్పవాడా లేక సాతానా?

## 108 వ వైరుధ్యం:

మత్తయి తన సువార్త యొక్క 16 వ అధ్యాయంలో [297] దైవప్రవక్త హజ్రత్ ఈసా(అ)(ఏసు) పేతురుకు క్రింద పేర్కొన్నవిధంగా పలికి 'శిష్యులందరిలోకెల్లా గొప్పవాడు' [298] అని కితాబునిచ్చినట్లుగా పేర్కొన్నారు:

**" మరియు నీవు పేతురువు; ఈ బండ మీద నా సంఘమును కట్టుదును, పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువనేరవని నేను నీతో చెప్పుచున్నాను. పరలోకరాజ్యము యొక్క తాళపుచెవులు నీకిచ్చెదను, నీవు భూలోకమందు దేని బంధించుదువో అది పరలోకమందును బంధింపబడును, భూలోకమందు దేని విప్పుదువో అది పరలోకమందును విప్పబడునని అతనితో చెప్పెను"**

**(అథఃసూచికలు)**

[296] గుర్తుంచుకోవలసిన విషయమేమిటంటే సుంకపు మెట్టు వద్ద కూర్చొనియున్న వ్యక్తి తర్వాత దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) శిష్యులలో చేరిపోయాడు. మత్తయి సువార్తలో 'సుంకరియైన మత్తయి' అని పేర్కొనబడింది. అతడి పేరు సువార్తలన్నింటిలోనూ 'మత్తయి' గానే పేర్కొనబడింది.

[297] మత్తయి సువార్త, 16 : 18, 19

[298] అందుకే క్రైస్తవులకు చెందిన రోమన్ కేథొలిక్ వర్గం పేతురును దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) యొక్క పన్నెండుమంది శిష్యులందరిలోకెల్లా గొప్పవాడని తీర్మానిస్తుంది. అయితే క్రైస్తవులకు చెందిన ప్రొటెస్టెంట్ వర్గానికి చెందినవారు మాత్రం పేతురును పన్నెండుమంది శిష్యులందరిలోకెల్లా గొప్పవాడిగా అంగీకరించరు.

అయితే అదే అధ్యాయంలో [299] తర్వాత పేతురు గురించి దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) ఈ విధంగా పలికినట్లుగా పేర్కొనబడి ఉంది:

**" అయితే ఆయన పేతురు వైపు తిరిగి- సాతానా, నా వెనుకకు పొమ్ము; నీవు నాకు అభ్యంతర కారణమైయున్నావు; నీవు మనుష్యుల సంగతులనే తలంచుచున్నావు గాని దేవుని సంగతులను తలంపకయున్నావని పేతురుతో చెప్పెను"**

ప్రొటెస్టెంట్ వర్గానికి చెందిన క్రైస్తవ పండితులు తమ పుస్తకాలలో పేతురు పట్ల విమర్శకు సంబంధించి ప్రాచీన క్రైస్తవ పండితులకు చెందిన ఏయే వ్యాఖ్యలనయితే ఉల్లేఖించారో వాటనన్నింటి సారాంశాన్ని యోహాను తన మత్తయి వ్యాఖ్యాన గ్రంథంలో పేర్కొంటూ పేతురు అహంకారి అని పేర్కొన్నారు. అలాగే ఆయన పేతురును తీవ్రస్థాయిలో విమర్శిస్తూ ఈ విధంగా పేర్కొన్నారు: " పేతురు అల్పమైన బుద్ధిని కలిగియున్న వ్యక్తి"

ప్రసిద్ధ క్రైస్తవ తత్వవేత్త అయిన ఆగస్టైన్ ఈ విధంగా పేర్కొన్నారు:

" ఈ వ్యక్తి (పేతురు) స్థిరచిత్తుడు, పటిష్ట విశ్వాసం కలవాడు కాడు. కొన్ని సందర్భాలలో ధృవీకరించేవాడు, కొన్ని సందర్భాలలో సందేహించేవాడు"

ఇటువంటి గుణాలను కలిగియున్నవానిగా పరిగణించబడిన వ్యక్తి పరలోకరాజ్యము యొక్క తాళపుచెవులకు యజమాని కాగలడా? పాతాళలోక (నరకలోక) ద్వారములు సైతం ఆధిపత్యం వహించజాలని సాతాను కూడా ఉంటాడా?

## 109 వ వైరుధ్యం:

లూకా తన సువార్త యొక్క 9 వ అధ్యాయంలో [300] యాకోబు మరియు యోహాను దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) ను ఈ విధంగా ప్రశ్నించినట్లుగా ఉల్లేఖించారు:

**" శిష్యులయిన యాకోబును యోహానును అది చూచి- ప్రభువా, ఆకాశము నుండి అగ్ని దిగి వీరిని [301] నాశనము చేయునట్లు మేమాజ్ఞాపించుట నీకిష్టమా అని అడుగగా"**

అందుకు సమాధానంగా దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) ఈ విధంగా

**(అధఃసూచికలు)**

299 23 వ వాక్యం     300 54 వ వాక్యం నుంచి 56 వ వాక్యం వరకు



పలికినట్లుగా పేర్కొనబడింది:

**" మీరు ఎటువంటి ఆత్మకు చెందినవారో మీరెరుగరు. ఎందుకంటే మనుష్యకుమారుడు ప్రజల ప్రాణములను నశింపజేయుటకు కాదు, రక్షించుటకు వచ్చెను"**

అయితే లూకా సువార్తలోనే 12 వ అధ్యాయంలో [302] దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) ఈ విధంగా పలికినట్లుగా పేర్కొనబడింది:

**" నేను భూమిమీద అగ్ని వేయ వచ్చితిని; అది ఇదివరకే రగులుకొని మండవలెనని యెంతో కోరుచున్నాను"**

## 110 వ వైరుధ్యం:

బైబిల్ ప్రకారం మత్తయి, మార్కు మరియు లూకా ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) పై పరిశుద్ధాత్మ [303] అవతరించిన సమయంలో ఆకాశం నుంచి వెలువడిన స్వరం గురించి ఉల్లేఖించారు. అయితే దానికి చెందిన పదాలను పేర్కొనే విషయంలో ముగ్గురి మధ్య వైరుధ్యం ఉంది.

మత్తయి సువార్త యొక్క 3 వ అధ్యాయపు 17 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది: **" మరియు- ఇదిగో ఈయనే నా ప్రియ కుమారుడు, ఈయన యందు నేనానందించుచున్నానని యొక శబ్దము ఆకాశము నుండి వచ్చెను"**

మార్కు సువార్త యొక్క 1 వ అధ్యాయపు 11 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది: **" నీవు నా ప్రియకుమారుడవు; ఈయన యందు నేనానందించుచున్నాను"** [304]

**(అధఃసూచికలు)**

301 అనగా సమరయులను.     302 49 వ వాక్యము.

303 ఈ సంఘటనకు సంబంధించిన సమాచారం కొరకు తరువాతి పుటలలో '119వ వైరుధ్యం' ను అధ్యయనం చేయగలరు.

304 ఇది బైబిల్ అరబీ అనువాద గ్రంథంలోని వాక్యం. బైబిల్ ఉర్దూ అనువాద గ్రంథంలో ఈ వాక్యం లూకా సువార్తలో పేర్కొనబడిన వాక్యానికి పూర్తిగా అనుగుణంగా ఉంది. బైబిల్ తెలుగు అనువాద గ్రంథంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది: **" మరియు- నీవు నా ప్రియకుమారుడవు; నీయందు నేనానందించుచున్నానని యొక శబ్దము ఆకాశమునుండి వచ్చెను"**

లూకా సువార్త యొక్క 3 వ అధ్యాయపు 22 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది: **" నీవు నా ప్రియకుమారుడవు, నీయందు నేనానందించుచున్నానని యొక శబ్దము ఆకాశము నుండి వచ్చెను"**

## 111 వ వైరుధ్యం:

మత్తయి తన సువార్త యొక్క 20 వ అధ్యాయంలో జెబెదయి కుమారుల తల్లి [305] ఈ విధంగా మనవి చేసుకున్నట్లుగా ఉల్లేఖించారు:

**" నీ రాజ్యమందు ఈ నా యిద్దరు కుమారులలో ఒకడు నీ కుడివైపునను ఒకడు నీ యెడమ వైపునను కూర్చుండ సెలవిమ్మని ఆయనతో అనెను "** (మత్తయి సువార్త, 20 : 21 )

అయితే మార్కు తన సువార్త యొక్క 10 వ అధ్యాయంలో ఆ విధంగా స్వయంగా జెబెదయి కుమారులే మనవి చేసుకున్నట్లుగా ఉల్లేఖించారు.[306]

## అంజూరపు చెట్టు ఎండిపోయిన సంఘటన

## 112 వ వైరుధ్యం:

మత్తయి సువార్త యొక్క 21 వ అధ్యాయంలో 18 వ వాక్యం నుంచి 20 వ వాక్యం వరకు ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" ఉదయమందు పట్టణమునకు మరల వెళ్ళుచుండగా ఆయన ఆకలిగొనెను. అప్పుడు త్రోవ ప్రక్కను ఉన్న యొక అంజూరపు చెట్టును చూచి, దానియొద్దకు రాగా, దానియందు ఆకులు తప్ప మరేమియు కనబడలేదు గనుక దానిని చూచి - ఇక మీదట ఎన్నటికిని నీవు కాపు కాయకుందువు గాక అని చెప్పెను; తక్షణమే ఆ అంజూరపు చెట్టు ఎండిపోయెను. శిష్యులది**

(అథఃసూచికలు)

[305] **" అప్పుడు జెబెదయి కుమారుల తల్లి తన కుమారులతో ఆయన యొద్దకు వచ్చి నమస్కారము చేసి యొక మనవి చేయబోగా"** (మత్తయి సువార్త, 20 : 20 )

[306] **" జెబెదయి కుమారులైన యాకోబును యోహానును ఆయన యొద్దకు వచ్చి - బోధకుడా, మేము అడుగునదెల్ల నీవు మాకు చేయ గోరుచున్నామని చెప్పగా"** (మార్కు సువార్త, 10 : 35)



**చూచి ఆశ్చర్యపడి - అంజూరపు చెట్టు ఎంత త్వరగా ఎండిపోయెనని చెప్పుకొనిరి"**

అందుకు దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) సమాధానమిచ్చినట్లుగా పేర్కొనబడింది. అయితే అందుకు విరుద్ధంగా మార్కు సువార్త యొక్క 11 వ అధ్యాయంలో [307] ఈ సంఘటన ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" ఆకులు గల ఒక అంజూరపు చెట్టును దూరము నుండి చూచి, దాని మీద ఏమైనను దొరకునేమో అని వచ్చెను. దానియొద్దకు వచ్చి చూడగా, ఆకులు తప్ప మరేమియు కనబడలేదు; ఏలయనగా అది అంజూరపు పండ్లకాలము కాదు. అందుకాయన- ఇక మీదట ఎన్నటికిని నీ పండ్లు ఎవరును తినకుందురు గాక అని చెప్పెను; ఇది ఆయన శిష్యులు వినిరి "**

ఆ తర్వాత ఆయన (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) యెరూషలేముకు వెళ్ళిపోయినట్లుగా పేర్కొనబడి ఉంది. అలాగే సాయంకాలమైనప్పుడు పట్టణంలో నుండి ఆయన బయలుదేరినట్లుగా పేర్కొనబడి ఉంది. ఆ తర్వాత ఉదయం వేళ ఆయన తిరిగి అదే అంజూరపు చెట్టు వైపు నుంచి కొనసాగుతుండగా జరిగిన సంఘటన గురించి ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" ప్రొద్దున వారు మార్గమున పోవుచుండగా ఆ అంజూరపు చెట్టు [308] వేళ్ళు మొదలుకొని యెండియుండుట చూచిరి. అప్పుడు పేతురు ఆ సంగతి జ్ఞాపకమునకు తెచ్చుకొని- బోధకుడా, యిదిగో నీవు శపించిన అంజూరపు చెట్టు ఎండిపోయెనని ఆయనతో చెప్పెను"**

అందుకు దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) సమాధానమిచ్చినట్లుగా పేర్కొనబడింది. రెండు వాక్యాల నడుమ ఎంతటి తీవ్రమైన వైరుధ్యమున్నదో చూడండి. వైరుధ్యం మాత్రమే కాకుండా ఇక్కడ గమనించదగిన మరొక ముఖ్య విషయముంది. అదేమిటంటే ఆ చెట్టు యొక్క ఫలాన్ని తినేందుకు దాని యజమాని అనుమతిని తీసుకోకుండా తినే అధికారం దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) కు ఎక్కడ ఉంది? అలాగే చెట్టును శపించడమంటే నేరుగా దాని యజమానికి నష్టం కలిగించడమే అవుతుంది. ఆ విధంగా చేయడమనేది నిస్సందేహంగా బుద్ధికి వ్యతిరేకమే అవుతుంది. అలాగే కాలం కాని కాలంలో పండ్లచెట్టు నుంచి పండ్లను ఆశించడం, పండ్లు

(అథఃసూచికలు)

[307] మార్కు సువార్త, 11వ అధ్యాయం : 13 వ మరియు 14 వ వాక్యాలు

[308] మార్కు సువార్త, 11వ అధ్యాయం : 20 వ మరియు 21 వ వాక్యాలు

లభించని కారణంగా శపించడం లేదా ఆగ్రహించడమనేది కూడా బుద్ధికి, ఔన్నత్యానికి వ్యతిరేకమైనది. ఆ సందర్భంలో వాస్తవానికి ఆ చెట్టు వెనువెంటనే పండ్లను ఇచ్చేలా దాని కొరకు ప్రార్థించడం, ఆ తర్వాత ఆ పండ్లచెట్టు యజమాని అనుమతితో వాటిని ఆరగించడమే ఆయన ఔన్నత్యానికి తార్కాణంగా నిలుస్తుంది. ఆ విధంగా చేయడం వల్ల ఆ పండ్ల యజమానికి కూడా ప్రయోజనం చేకూరుతుంది.

దీనినిబట్టి దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) దేవుడు కారనే విషయం స్పష్టమవుతుంది. ఎందుకంటే ఒకవేళ ఆయన దేవుడే అయిన పక్షంలో ఆ పండ్లచెట్టు పండ్లను ఇవ్వడం లేదనే విషయం ఆయనకు ముందే తెలిసి ఉండేది. అలాగే అది పండ్లు కాసే కాలమూ కాదు. కనుక ఆయన దాని పట్ల ఆగ్రహించేవారూ కాదు, శపించేవారూ కాదు.

## ద్రాక్షతోటను నాటించే వ్యక్తి ఉపమానం

## 113 వ వైరుధ్యం:

మత్తయి సువార్త యొక్క 21 వ అధ్యాయంలో ద్రాక్షతోటను నాటించే వ్యక్తికి సంబంధించిన ఉపమానం [309] పేర్కొనబడిన తర్వాత ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**“ కాబట్టి ఆ ద్రాక్షతోట యజమానుడు వచ్చినప్పుడు ఆ కాపుల నేమి చేయుననెను. అందుకు వారు- ఆ దుర్మార్గులను కఠినముగా సంహరించి, వాటి వాటి కాలములయందు తనకు పండ్లను చెల్లించునట్టి ఇతర కాపులకు ఆ ద్రాక్షతోట గుత్తకిచ్చునని ఆయనతో చెప్పిరి”** [310]

**(అధఃసూచికలు)**

309 ఈ ఉపమానాన్ని దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) తన శిష్యులకు అందజేసారు. దాని సారాంశం ఇది : ఒక వ్యక్తి ఒక ద్రాక్షతోటను నాటించి, దానిని కాపులకు గుత్తమిచ్చి వెళ్ళిపోయాడు. పండ్లకాలము సమీపించినప్పుడు అతడు రెండు పర్యాయాలు తన దాసులను పండ్లను తీసుకొని వచ్చేందుకై కాపుల వద్దకు పంపాడు. అయితే ప్రతిసారీ ఆ కాపులు అతడి దాసులను కొట్టి పంపివేశారు. మూడవ పర్యాయం అతడు తన కుమారుడిని పంపగా ఆ ద్రాక్షతోట కాపులు అతడి కుమారుడిని కూడా చంపేశారు. (మత్తయి, 21 : 33 వ వాక్యం నుంచి 39 వ వాక్యం వరకు)

310 మత్తయి సువార్త, 22 : 40 వ వాక్యం మరియు 41 వ వాక్యం.



అయితే అందుకు విరుద్ధంగా లూకా సువార్త 20 వ అధ్యాయంలో [311] ఈ ఉపమానం గురించి పేర్కొనబడిన తర్వాత ఈ విధంగా పేర్కొనబడింది:

**“ ద్రాక్షతోట యజమానుడు వారికేమి చేయును? అతడు వచ్చి ఆ కాపులను సంహరించి తన ద్రాక్షతోటను ఇతరులకు ఇచ్చునని ఆయన చెప్పగా వారు విని - అట్లు కాకపోవును గాకనిరి”**

రెండు వాక్యాల మధ్య స్పష్టమైన వైరుధ్యమున్నట్లుగా విశదమవుతోంది. ఎందుకంటే మొదటి వాక్యంలో వారు ‘యజమానుడు వారిని కఠినంగా శిక్షించి సంహరిస్తాడు’ అని పలికినట్లుగా పేర్కొనబడి ఉంది. అయితే రెండవ వాక్యం ద్వారా వారు నిరాకరించినట్లుగా స్పష్టమవుతోంది.[312]

## దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) తల మీద అత్తరు వేయడానికి సంబంధించిన సంఘటన

## 114 వ వైరుధ్యం:

దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) తలపై అత్తరు బుడ్డిని ఒలకబోసిన ఒక మహిళకు సంబంధించిన సంఘటన [313] గురించి మత్తయి సువార్త యొక్క 26 వ అధ్యాయంలోనూ, మార్కు సువార్త యొక్క 14 వ అధ్యాయంలోనూ, యోహాను సువార్త యొక్క 12 వ అధ్యాయంలోనూ అధ్యయనం చేసిన వ్యక్తికి వాటి మధ్య ఆరు రకాల వైరుధ్యాలు గోచరిస్తాయి:

**(అధఃసూచికలు)**

311 లూకా సువార్త, 20 : 16

312 బైబిల్ అరబీ అనువాద గ్రంథంలో ‘ఖాలూ అహాషా’ అని పేర్కొనబడి ఉంది.

313 ఈ సంఘటన మత్తయి సువార్త ప్రకారం క్లుప్తంగా ఈ విధంగా ఉంది: పస్కా పండుగకు రెండు రోజుల ముందు దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) బేతనియలో భోంచేస్తున్న సమయంలో ఒక మహిళ అతి విలువయిన అత్తరు బుడ్డి తీసుకొని ఆయన వద్దకు వచ్చి దానిని ఆయన తల మీద ఒలకపోసింది. అప్పుడు శిష్యులు అనవసరంగా ఒక విలువయిన వస్తువు వృధా అయినది, లేకుంటే అది పేదవారికి పనికివచ్చేదంటూ ఆమె పట్ల ఆగ్రహానికి లోనయ్యారు. దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) అది విని ‘బీదలెల్లప్పుడు మీతో కూడ ఉన్నారు, గాని నేనెల్లప్పుడు మీతో కూడ ఉండను’ అని పలుకుతూ వారిని మందలించారు. (ఈ సంఘటన మత్తయి సువార్త యొక్క 26 వ అధ్యాయంలో 6 వ వాక్యం నుంచి 13 వ వాక్యం వరకు పేర్కొనబడి ఉంది)

**1.** మార్కు సువార్తలో [314] ఆ సంఘటన పస్కా పండుగకు [315] రెండు రోజుల ముందు [316] జరిగిందని పేర్కొనబడి ఉంది. అయితే యోహాను సువార్తలో ఆ సంఘటన పస్కా పండుగకు ఆరు రోజుల ముందు[317] జరిగిందని పేర్కొనబడి ఉంది. అయితే మత్తయి పస్కా పండుగకు ఎన్ని రోజులు ముందు [318] ఆ సంఘటన జరిగిందో ప్రస్తావించలేదు.

**(అథఃసూచికలు)**

314 అలాగే మత్తయి సువార్త యొక్క 26 వ అధ్యాయంలోని 2 వ వాక్యంలోనూ ఆ సంఘటన పస్కా పండుగకు రెండు రోజుల ముందు సంభవించినట్లుగా పేర్కొనబడి ఉంది.

315 'పస్కా పండుగ' **(Passover)** అనేది యూదులకు చెందిన ఒక మతపరమైన పండుగ. అది ఏప్రిల్ 14వ తేదీన జరుపుకోబడేది. వాస్తవానికి అది ఇశ్రాయేలీయులు ఐగుప్తీయుల నుంచి విముక్తులయిన సంఘటన సంస్మరణ దినంగా జరుపుకోబడేది. ఎందుకంటే అదే తేదీన దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) [ మోషే ] ఈజిప్టు (ఐగుప్తు) నుంచి నిష్క్రమించారు. పస్కా పండుగను ఉర్దూలో 'ఈదె ఫసహ్' అంటారు. 'ఫసహ్' అంటే 'గొఱ్ఱె' అని అర్థం. ఈ పండుగ జరుపుకోబడే రోజు ఒక గొఱ్ఱె బలి ఇవ్వబడేది. కనుక ఈ పండుగను 'ఈదె ఫసహ్' (పస్కా పండుగ) అంటారు. ఈ పండుగను జరుపుకోవడానికి సంబంధించిన వివరణాత్మక ఆదేశాలు బైబిల్ లోని 'నిర్గమ కాండము' యొక్క 23 వ అధ్యాయపు 15 వ వాక్యంలో , 'లేవీయ కాండము' యొక్క 23 వ అధ్యాయంలో 5వ వాక్యం నుంచి 8వ వాక్యం వరకు మరియు 'సంఖ్యా కాండము' యొక్క 28 వ అధ్యాయపు 16వ వాక్యం నుంచి 25 వ వాక్యం వరకు పేర్కొనబడి ఉన్నాయి.

316 మార్కు సువార్త, 14 : 1

317 **"కాబట్టి యేసు తాను మృతులలో నుండి లేపిన లాజరు ఉన్న బేతనియకు పస్కా పండుగకు ఆరు దినములు ముందుగా వచ్చెను"** (యోహాను, 12 : 1 )

318 అయితే మా వద్ద ఉన్న అన్ని బైబిల్ అనువాద ప్రతుల్లోనూ మత్తయి ఆ సంఘటన పస్కా పండుగకు రెండు రోజుల ముందు జరిగినట్లుగా పేర్కొన్నట్లుగా వ్రాయబడి ఉంది. (మత్తయి, 26 : 2) బహుశా ఈ గ్రంథ రచయిత అయిన హజ్రత్ మౌలానా రహ్మతుల్లాహ్ కైరాన్వీ (ర) గారి వద్ద ఉన్న బైబిల్ ప్రతిలో ఈ విషయం పేర్కొనబడి ఉండకపోవచ్చు.



**2.** మత్తయి మరియు మార్కు ఆ సంఘటన కుష్ఠరోగియైన సీమోను ఇంటిలో సంభవించిందని పేర్కొన్నారు. అయితే యోహాను సువార్తలో ఆ సంఘటన జరిగిన ప్రదేశం మర్యమ్ ఇల్లు అని పేర్కొనబడి ఉంది. [319]

**3.** మత్తయి మరియు మార్కు[320] మరియ అత్తరును దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) తల మీద ఒలకబోసినట్లుగా పేర్కొన్నారు. అయితే యోహాను సువార్తలో మాత్రం మరియ దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) పాదములకు[321] పూసినట్లుగా పేర్కొనబడి ఉంది.

**4.** మార్కు సువార్తలో మరియు దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) తల మీద అత్తరును ఒలకబోయడం పట్ల అక్కడ హాజరయి ఉన్నవారిలో కొందరు[322] అభ్యంతరాన్ని వ్యక్తం చేసినట్లుగా పేర్కొనబడి ఉంది. అయితే మత్తయి సువార్తలో ఆ విధంగా అభ్యంతరాన్ని వ్యక్తం చేసినది స్వయంగా దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) శిష్యులేనని పేర్కొనబడి ఉంది. అయితే యోహాను సువార్తలో మాత్రం ఆ విధంగా యూదా అభ్యంతరాన్ని వ్యక్తం చేసినట్లుగా పేర్కొనబడి ఉంది. [323]

**5.** 'యోహాను సువార్త' రచయత ఆ అత్తరు బుడ్డి ఖరీదు మూడు వందల దీనార్లు (దేనారములు) అని పేర్కొన్నారు. అయితే మార్కు మాత్రం అతిశయోక్తిగా దాని ఖరీదు మూడు వందల దీనార్ల కంటే ఎక్కువ అని పేర్కొనడం జరిగింది. అయితే 'మత్తయి సువార్త' రచయిత మాత్రం దాని

**(అథఃసూచికలు)**

319 బైబిల్ లో 'లాజరు ఉన్న ఇల్లు' అని పేర్కొనబడియున్నప్పటికీ లాజరు మరియ సోదరుడే అయిన కారణంగా అతడి ఇంటిని 'మరియ యొక్క ఇల్లు' అని కూడా పేర్కొనవచ్చు.

320 మత్తయి, 26 : 8, మార్కు, 14 : 3

321 **" యేసు పాదములకు పూసి"** యోహాను, 12 : 3

322 **" అయితే కొందరు కోపపడి- ..."** మార్కు, 14 : 4

323 అనగా 'ఇస్కరియోతు యూదా.' యోహాను, 12 : 4

ఖరీదు విషయాన్ని ఖచ్చితంగా తెలియజేయకుండా కేవలం గొప్ప ఖరీదు గలదిగా పేర్కొన్నారు.

**6.** మత్తయి సువార్త, మార్కు సువార్త మరియు యోహాను సువార్తల రచయితలు ఆ సంఘటన జరిగిన సమయంలో దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) పలికిన మాటలను వేర్వేరు రకాలుగా ఉల్లేఖించారు.

అయితే మూడు సువార్తల్లోనూ వేర్వేరు సంఘటనల గురించి పేర్కొనబడియున్నట్లుగా భావించడానికి ఎంతమాత్రం అవకాశం లేదు.[324] ఎందుకంటే ఈ సంఘటన పలుమార్లు జరిగినట్లుగా భావించిన పక్షంలో ప్రతి పర్యాయమూ అత్తరు పూసినది మహిళే అయి ఉండడం, ప్రతి సంఘటనలోనూ దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) భోజనం కొరకు కూర్చున్నప్పుడే ఆ విధంగా జరగడం, ప్రతి పర్యాయమూ ఆ సంఘటన భోజనపు విందు ఇవ్వబడిన సమయంలోనే జరగడం, అలాగే ప్రతి సందర్భంలోనూ మరియ ప్రవర్తన పట్ల అభ్యంతరాన్ని వ్యక్తం చేసినవారు, ముఖ్యంగా దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) శిష్యులు రెండు మార్లు అభ్యంతరాన్ని వ్యక్తం చేయడం (వాస్తవానికి వారు మొదటి పర్యాయం కొన్నిరోజుల క్రితం దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) ద్వారా ఆ మహిళ యొక్క ఆచరణ సంస్కరించబడడం గురించి వినియున్నారు), ప్రతి సంఘటనలోనూ ఆ అత్తరు బుడ్డి ఖరీదు మూడువందల దీనార్లు లేదా అంతకంటే కొంచెం ఎక్కువగానే పేర్కొనబడడమనేది విచిత్రమైన విషయం.

మరొక విషయమేమిటంటే దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) రెండు పర్యాయాలు ఆ మహిళ (మరియ) వృధా ఖర్చును పుణ్యప్రదమైనదిగా పేర్కొనడం, అనగా ఆ విధంగా ఆరువందల కంటే మించిన దీనార్లను వృధాగా ఖర్చు చేయడాన్ని సరియైన చర్యగా పేర్కొనడమనేది స్వయంగా వృధా అయిన చర్యగా భావించబడుతుంది. వాస్తవమేమిటంటే ఆ సంఘటన ఒక్కసారి మాత్రమే సంభవించింది. అయితే ఈ వైరుధ్యమనేది సువార్తల రచయితల స్వాభావిక అలవాటు ఫలితమే తప్ప మరొకటి కాదు.

**(అథఃసూచికలు)**

324 అనగా ఈ వైరుధ్యాన్ని తొలగించేందుకై మరియ దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) పై అత్తరును ఒలకబోయడమనే సంఘటన పలుమార్లు సంభవించిందని, ప్రతి సువార్తలోనూ ప్రత్యేకమైన సంఘటన పేర్కొనబడియున్నదని పేర్కొనడానికి ఎంతమాత్రం అవకాశం లేదు.



## ప్రభువు రాత్రి భోజనము ( Lord's Supper) సంబంధిత సంఘటన 115 వ వైరుధ్యం:

దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) బైబిల్ ప్రకారం తాను పట్టుబడడానికి ఒక రాత్రి ముందు తన శిష్యులతో కలిసి పస్కా భోజనాన్ని ఆరగించారు. ఆ భోజనాన్ని 'ప్రభువు రాత్రి భోజనం' (**Lord's Supper**)[325] అని పిలుస్తారు. అయితే ఆ సంఘటన గురించి ఏ వ్యక్తయితే లూకా సువార్త యొక్క 22 వ అధ్యాయాన్ని మత్తయి సువార్త యొక్క 26 వ అధ్యాయంతోనూ, మార్కు సువార్త యొక్క 14 వ అధ్యాయంతోనూ పోల్చి అధ్యయనం చేస్తాడో అతడికి రెండు వైరుధ్యాలు గోచరిస్తాయి.

**(అథఃసూచికలు)**

325 'ప్రభువు రాత్రి భోజనం' (**Lord's Supper**) లేదా (**Eucharist**) అనేది క్రైస్తవులకు చెందిన ఒక ప్రసిద్ధ ఆచారం పేరు. బైబిల్ లోని నాలుగు సువార్తల ప్రకారం దీనికి మూలం ఈ విధంగా ఉంది:

బైబిల్ ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) తాను పట్టుబడడానికి ఒక రాత్రి ముందు తన శిష్యులతో కలిసి రాత్రి భోజనాన్ని ఆరగించసాగారు. అప్పుడు ఆయన (అ) ఒక గిన్నెను తీసుకొని శుభం కొరకు ప్రార్థించారు లేదా కృతజ్ఞతాస్తుతులు చెల్లించారు. అలాగే దానిని తన శిష్యులకు అందజేసి 'దీనిని పరస్పరం పంచుకోండి' అని పలికారు. ఆ తర్వాత ఆయన (అ) ఒక రొట్టెను తీసుకొని దానిలోనూ శుభం కొరకు ప్రార్థించారు. ఆ తర్వాత దానిని 'ఇది మీ కొరకు ఇవ్వబడుతున్న నా శరీరము. నా స్మరణ నిమిత్తం ఈ విధంగానే చేయండి' అని పలికి తన శిష్యులకు అందజేశారు.

ఆ తరువాత నుంచి క్రైస్తవులలో అది ఒక ఆచారంగా వ్యాప్తిలోకి వచ్చింది (తెలుగు మాట్లాడే క్రైస్తవులలో ఆ ఆచారం 'బల్ల ఆరాధన' గా ప్రసిద్ధమయి ఉంది). ఈ ఆచారం ప్రకారం క్రైస్తవులు ఒక గిన్నెలో ద్రాక్షరసాన్ని తీసుకొని తాగి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుకుంటారు. అలాగే రొట్టెను విరిచి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుకుంటారు. ప్రొటెస్టెంట్ వర్గానికి చెందిన క్రైస్తవులు ఈ ఆచారాన్ని ఇక్కడివరకే అంగీకరిస్తారు. ఈ ఆచారం ద్వారా వాటిని (ద్రాక్షరసాన్ని, రొట్టెను) పుచ్చుకునే వ్యక్తి పాపపరిహారంలో భాగస్వామి అయి తనకు ఏసు ద్వారా ముక్తి లభిస్తుందని సంపూర్ణంగా విశ్వాసాన్ని ప్రకటించడం జరుగుతుంది. ఆ విధంగా పాపపరిహార సిద్ధాంతం పట్ల

**(మిగిలిన భాగం తరువాయి పేజీలో)**

**1.** లూకా తన సువార్తలో రెండు గిన్నెల గురించి ప్రస్తావించారు. ఒకటి భోంచేసే సమయంలో, మరొకటి భోంచేసిన తర్వాత [326] అయితే మత్తయి మరియు మార్కు కేవలం ఒక గిన్నె

**(అథఃసూచికలు)**

(325 వ అథఃసూచిక తరువాయి భాగం)

విశ్వాసాన్ని ప్రకటించడానికి సంబంధించిన ఆచారానికి వారు తెలిపే ఆధారమేమిటంటే ఒక సందర్భంలో దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) తన గురించి ఈ విధంగా పేర్కొన్నారు: **" పరలోకము నుండి దిగివచ్చిన జీవాహారమును నేనే. ఎవడైనను ఈ ఆహారము భుజించితే వాడెల్లప్పుడును జీవించును. "** (యోహాను, 6 : 51 ) దీనికి ఈ విధంగా అర్థాన్ని గ్రహించడం జరిగింది : ఏవిధంగానయితే ఒక వ్యక్తి రొట్టెను తిని జీవాన్ని పొందుతాడో అదేవిధంగా దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) (అల్లాహ్ క్షమించుగాక) సమస్త జాతి ప్రజల కొరకు బలయిపోయారు. దానితో సమస్త జాతికి చెందిన పాపాలకు పరిహారం ఇవ్వబడినట్లవుతుంది. కనుక ఈ రొట్టెలను విరిచి తినే ఆచారం (బల్ల ఆరాధన) ఈ విశ్వాసాన్నే తాజాగా సజీవమొనరిస్తుంది" అయితే ఈ అర్థం పూర్తిగా తప్పు.

అయితే రోమన్ కేథొలిక్ వర్గానికి చెందిన క్రైస్తవులు ఈ ఆచారానికి సంబంధించిన విశ్వాసంలో మరికొన్ని చేర్పులకు పాల్పడ్డారు. వారు ఈ రొట్టెలు విరిచి తినే ఆచారం (బల్ల ఆరాధన లేదా 'ప్రభువు రాత్రి భోజనము' (**Lord's Supper**) లేదా (**Eucharist**) ) లేదా ఆచరణ కారణంగా తినబడే, త్రాగబడే పదార్థాల స్వరూపం సైతం మారిపోతుందని పేర్కొంటారు. అనగా చర్చి ఫాదర్ ఈ ఆచారం ( బల్ల ఆరాధన) పాటించబడే రోజున రొట్టెను విరిచి ప్రజలకు ఇస్తూ 'ఇది నా శరీరం' అని పలకగానే ఆ రొట్టె ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) యొక్క మాంసం అయిపోతుందని, అలాగే ప్రజలకు అందించబడిన ద్రాక్షరసం వెనువెంటనే ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) యొక్క రక్తమయిపోతుందని, అయితే ఆ రొట్టెను తినేవారికి, ఆ ద్రాక్షరసాన్ని త్రాగేవారికి ఆ విషయం అనుభూతిలోకి రాదని వారు పేర్కొంటారు. ఈ ఆచరణకు 'ప్రభువు రాత్రి భోజనం' అని పౌలు నామకరణం కావించాడు. ఈ విషయం మనకు 'అపొస్తలుడైన పౌలు కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక' యొక్క 11 వ అధ్యాయపు 20 వ వాక్యం ద్వారా తెలుస్తుంది. ఈ విషయానికి సంబంధించిన వివరాలు 'బ్రిటానికా ఎన్‌సైక్లోపేడియా' లోని **'Eucharist'** అనే ఆర్టికల్ ద్వారా, ఫాదర్ హెచ్.ఎస్. నజ్‌బట్ వ్రాసిన 'హఖాయిఖె బైబిల్ ఒ బిద్‌ఆతె రూమ్' (బైబిల్ వాస్తవాలు, రోమన్ కేథొలిక్కుల కల్పిత ఆచారాలు) అనే పుస్తకంలోని 17 వ మరియు 18 వ పేజీల నుంచి గ్రహించబడ్డాయి. తరువాతి అధ్యాయంలో ఆధారాలతో సహా అందించబడిన వివరణ ద్వారా ఈ విశ్వాసం పూర్తిగా తప్పుడు విశ్వాసమనే విషయాన్ని పాఠకులు గ్రహిస్తారు.



గురించి మాత్రమే పేర్కొన్నారు.

బహుశా ఈ అంశానికి సంబంధించి మత్తయి మరియు మార్కు పేర్కొన్న విషయం సరయినది అయి ఉండవచ్చు, లూకా పేర్కొన్న విషయం తప్పయి ఉండవచ్చు. లేకుంటే రోమన్ కేథొలిక్ వర్గానికి చెందిన క్రైస్తవుల విశ్వాసం సందేహాస్పదమయిపోతుంది. ఎందుకంటే వారు రొట్టె మరియు ద్రాక్షరసం పూర్తిగా ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) అస్తిత్వంగా మారిపోతుందని విశ్వసిస్తారు. కనుక ఒకవేళ లూకా సువార్తలో పేర్కొనబడిన విషయాన్ని సత్యమైనదిగా భావించిన పక్షంలో ప్రతి గిన్నె పూర్తిగా ఏసు అస్తిత్వాన్ని పొందినట్లుగా భావించవలసి ఉంటుంది. త్రిత్వం ప్రకారం రొట్టె మరియు ద్రాక్షరసం ద్వారా ముగ్గురు క్రీస్తులు ఉనికిలో ఉన్నట్లుగా భావించవలసి వస్తుంది. అలాగే మొదటి క్రీస్తుతో కలుపుకొని మొత్తం నలుగురు క్రీస్తులు అయిపోతారు.

అంతేగాకుండా దానివల్ల క్రైస్తవులకు వ్యతిరేకంగా మరొక ఆరోపణ కూడా ఎదురవుతుంది. అదేమిటంటే వారు ఈ ఆచరణను ఎందుకు విడచిపెట్టారు? [327] ఒక దానితోనే (ఒక గిన్నెతోనే) ఎందుకు సంతృప్తి చెందారు?

**2.** లూకా సువార్త లో ఈ అంశానికి సంబంధించి అందజేయబడిన వివరణ తెలిపేదేమిటంటే ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) యొక్క శరీరం శిష్యుల కొరకు అర్పితమయింది. [328] అయితే మార్కు సువార్తలో అందజేయబడిన వివరణ తెలిపేదేమిటంటే ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) యొక్క రక్తం ఎందరి కొరకో ప్రవహించబడింది. [329] అయితే మత్తయి సువార్తలో అందజేయబడిన వివరణ ద్వారా[330] ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) యొక్క శరీరం ఎవరి కొరకూ అర్పితమవలేదని, ఆయన రక్తం ఎవరి కొరకూ చిందించబడలేదని, ఏదయితే చిందించబడుతుందో అది కేవలం 'క్రొత్త నిబంధన' అని తెలుస్తుంది. వాస్తవానికి నిబంధన అనేది చిందించే లేదా చిందింపజేయబడే వస్తువు కాదు.

విచిత్రమైన విషయమేమిటంటే యోహాను సుగంధ ద్రవ్యాలు పూయబడడం, ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) గాడిదను అధిరోహించి వెళ్ళడం మరియు ఇతర మామూలు సంఘటనల గురించి ప్రస్తావించారే గానీ క్రైస్తవానికి మౌలికమైనవిగా భావించబడే విషయాలను గురించి మాత్రం ప్రస్తావించనే లేదు.

**(అథఃసూచికలు)**

326 భోజనమయిన తర్వాత దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) **"ఈ గిన్నె మీ కొరకు చిందింపబడుచున్న నా రక్తము వలన నైన క్రొత్త నిబంధన "** (లూకా, 22 : 20 )

## 116 వ వైరుధ్యం:

మత్తయి సువార్త యొక్క 7 వ అధ్యాయపు 14 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" జీవమునకు పోవు ద్వారము ఇరుకును ఆ దారి సంకుచితమునై యున్నది, దాని కనుగొనువారు కొందరే "**

అయితే మత్తయి సువార్త యొక్క 11 వ అధ్యాయంలో [331] ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" మీమీద నా కాడి ఎత్తికొని నా యొద్ద నేర్చుకొనుడి; అప్పుడు మీ ప్రాణములకు విశ్రాంతి దొరకును. ఏలయనగా నా కాడి సుళువుగాను నా భారము తేలికగాను ఉన్నవి"**

ఈ రెండు వాక్కులను కలపడం ద్వారా దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) ను అనుసరించడమనేది జీవమునకు కొనిపోయే మార్గం కాదని తెలుస్తుంది. [332]

**(అథఃసూచికలు)**

[327] అనగా 'కేవలం ఒక గిన్నె ద్వారా 'ప్రభువు రాత్రి భోజనము' (బల్ల ఆరాధన) అనే ఆచారాన్ని ఎందుకు పాటిస్తున్నారు? రెండు గిన్నెల ద్వారా ఎందుకు పాటించడం లేదు?' అనే ఆరోపణ.

[328] **" ఇది మీ కొరకు ఇయ్యబడుచున్న నా శరీరము "** (లూకా, 22 : 19 )

[329] **" అప్పుడాయన - ఇది నిబంధన విషయమై అనేకుల కొరకు చిందించబడుతున్న నా రక్తము"** (మార్కు, 14 : 24 )

[330] అయితే మా వద్ద ఉన్న అనువాద ప్రతులన్నింటిలోనూ 'నిబంధన రక్తము' అని పేర్కొనబడి ఉంది. ఈ గ్రంథ రచయిత అయిన మౌలానా రహ్మతుల్లాహ్ కైరాన్వీ (ర) గారి వద్ద ఉన్న ప్రతిలో కేవలం 'నిబంధన' అని ఉండి ఉంటుంది.

[331] 29 వ మరియు 30 వ వాక్యములు. ఇది దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) పలికిన వాక్యము.

[332] ఎందుకంటే ఆ మార్గము, అనగా జీవమునకు కొనిపోయే మార్గం ఎంతో ఇరుకయినది. అయితే దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) మాత్రం తన భారాన్ని తేలికయినదిగా

(మిగిలినభాగం తరువాతి పేజీలో)



## 117 వ వైరుధ్యం:

మత్తయి సువార్త యొక్క 4 వ అధ్యాయంలో అపవాది (సాతాను (షైతాన్) దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) ను మొదట పరిశుద్ధ పట్టణానికి తీసుకెళ్ళినట్లుగా, అక్కడ ఆయనను దేవాలయ శిఖరం మీద నిల్చోబెట్టాడని [333], తర్వాత ఒక ఎత్తయిన కొండ మీదికి తీసుకెళ్ళాడని [334], దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) గలిలయకు తిరిగి వెళ్ళారని, నజరేతును విడిచి సముద్ర తీరంలో [335] ఉన్న కపెర్నహూముకు వచ్చి జీవించసాగారని పేర్కొనబడి ఉంది.

అయితే అందుకు విరుద్ధంగా లూకా సువార్త యొక్క 4 వ అధ్యాయంలో అపవాది (సాతాను (షైతాన్)) మొదట దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) కొండ మీదికి తీసుకెళ్ళాడని[336], తర్వాత యెరూషలేముకు తీసుకువచ్చి దేవాలయ శిఖరం మీద నిల్చోబెట్టాడని[337], తర్వాత దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) గలిలయకు తిరిగి వచ్చి అక్కడి సమావేశాలలో బోధించనారంభించారని[338], తర్వాత తాను పోషించబడిన[339] నజరేతుకు చేరుకున్నారని పేర్కొనబడి ఉంది.

**(అథఃసూచికలు)**

(332 వ అథఃసూచిక తరువాయి భాగం)

పేర్కొంటున్నారు. అయితే ఈ వాదన పట్ల అభ్యంతరం వ్యక్తమయ్యేందుకు అవకాశముంది. ఎందుకంటే రెండు వాక్యాల మధ్య సమన్వయాన్ని ఏర్పరచే ఉద్దేశ్యంతో " మొదటి వాక్కులో ఏ ద్వారం ఇరుకయినదిగా పేర్కొనడం జరిగిందో అది ప్రాపంచిక ఇరుకు, అయితే దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) పరలోక సంబంధిత సౌలభ్యం గురించి పేర్కొంటున్నారు'' అని పేర్కొనేందుకు అవకాశముంది.

[333] 5 వ వాక్యము.

[334] 8 వ వాక్యము.

[335] 12 వ వాక్యము.

[336] 5 వ వాక్యము.

[337] 9 వ వాక్యము.

[338] 13 వ వాక్యం నుంచి 15 వ వాక్యం వరకు

[339] 16 వ వాక్యము

# శతాధిపతి యొక్క దాసునికి ఆరోగ్యాన్ని ప్రసాదించడం

## 118 వ వైరుధ్యం:

మత్తయి సువార్త యొక్క 8 వ అధ్యాయం ద్వారా శతాధిపతి స్వయంగా దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) వద్దకు వచ్చినట్లుగా, క్రిందివిధంగా పలికి తన దాసుని ఆరోగ్యం కొరకు అర్థించినట్లుగా తెలుస్తుంది:

**" ప్రభువా, నీవు నా యింటిలోనికి వచ్చుటకు నేను పాత్రుడను కాను; నీవు మాటమాత్రము సెలవిమ్ము, అప్పుడు నా దాసుడు స్వస్థపరచబడును "** (మత్తయి, 8 : 8 )

అప్పుడు దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) అతడిని ప్రశంసించి ఈ విధంగా పలికినట్లుగా తెలుస్తుంది:

**" ఇక వెళ్ళుము; నీవు విశ్వసించిన ప్రకారము నీకు అవునుగాకని శతాధిపతితో చెప్పెను. ఆ గడియలోనే అతని దాసుడు స్వస్థతనొందెను "** (మత్తయి, 8 : 13 )

అయితే లూకా సువార్త యొక్క 7 వ అధ్యాయం ద్వారా శతాధిపతి స్వయంగా ఎన్నడూ దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) వద్దకు రానేలేదని, యూదుల పెద్దలను [340] ఆయన వద్దకు పంపినట్లుగా, అప్పుడు దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) వారితో కలిసి వెళ్ళినట్లుగా తెలుస్తుంది. అలాగే వారు అతడి ఇంటివద్దకు చేరుకున్నప్పుడు,

**" శతాధిపతి తన స్నేహితులను చూచి- మీరాయన యొద్దకు వెళ్ళి- ప్రభువా, శ్రమ పుచ్చుకొనవద్దు; నీవు నా యింటిలోనికి వచ్చుటకు నేను పాత్రుడను కాను. అందుచేత నీ యొద్దకు వచ్చుటకు పాత్రుడనని నేను ఎంచుకొనలేదు; అయితే మాటమాత్రము సెలవిమ్ము, అప్పుడు నా దాసుడు స్వస్థపరచబడును [341] "**

అప్పుడు దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) అతడిని ప్రశంసించినట్లుగా, ఆ శతాధిపతిచే పంపబడినవారు ఇంటికి (శతాధిపతి ఇంటికి) తిరిగివచ్చినప్పుడు అతడి దాసుడు ఆరోగ్యవంతుడయి ఉన్నట్లుగా కనుగొన్నారని మనకు తెలుస్తుంది.

---

**(అథఃసూచికలు)**

[340] 3 వ వాక్యము [341] 6 వ వాక్యము నుంచి 8 వ వాక్యము వరకు



# ప్రకాశవంతమైన మేఘము సంబంధిత సంఘటన

## 119 వ వైరుధ్యం:

మత్తయి సువార్త యొక్క 8 వ అధ్యాయంలో దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) ను ఒక శాస్త్రి ఈ విధంగా అభ్యర్థించినట్లుగా పేర్కొనబడింది:

**" బోధకుడా నీవెక్కడికి వెళ్ళినను నీ వెంట వచ్చెదనని ఆయనతో చెప్పెను" [342]**

ఆ తర్వాత మరొక వ్యక్తి దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) తో క్రిందివిధంగా పలికినట్లుగా పేర్కొనబడింది:

**" ప్రభువా, నేను మొదట వెళ్ళి, నా తండ్రిని పాతిపెట్టుటకు నాకు సెలవిమ్మని ఆయనను అడుగగా"**

మత్తయి సువార్తలో ఇంకా ఎన్నో స్థితిగతుల గురించి, సంఘటనల గురించి ప్రస్తావించబడిన తర్వాత ప్రకాశవంతమైన మేఘానికి సంబంధించిన సంఘటన [343] 17 వ అధ్యాయంలో పేర్కొనబడింది. అయితే లూకా సువార్తలో మాత్రం శాస్త్రి అభ్యర్థన, మరొక వ్యక్తి అర్థింపు 9 వ అధ్యాయంలో [344] ప్రకాశవంతమైన మేఘం సంబంధిత సంఘటన [345] గురించి ప్రస్తావించబడిన తర్వాత పేర్కొనబడ్డాయి. కనుక నిశ్చయంగా ఈ రెండింటిలో ఒకటి తప్పు.

---

**(అథఃసూచికలు)**

[342] ఈ సంఘటన దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) గదరేనీయుల దేశానికి వెళ్తుండగా సంభవించింది.

[343] బైబిల్ ప్రకారం ప్రకాశవంతమైన మేఘానికి సంబంధించిన సంఘటన క్లుప్తంగా క్రింద పేర్కొనబడుతోంది:

దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) తన శిష్యులయిన పేతురును, యాకోబును, యోహానును వెంటబెట్టుకొని ఒక ఎత్తయిన కొండ మీదికి చేరుకున్నారు. అక్కడ శిష్యుల ఎదుట ఆయన ముఖం మార్పు చెంది కనిపించింది. ఆయన ముఖం సూర్యుని వలె ప్రకాశించసాగింది. దైవప్రవక్తలయిన హజ్రత్ మూసా (అ)(మోషే) మరియు హజ్రత్ ఇలియాస్ (అ)(ఏలియా)లు

(మిగిలినభాగం తరువాతి పేజీలో)

## దయ్యం పట్టిన మూగవానికి సంబంధించిన సంఘటన

## 120 వ వైరుధ్యం:

మత్తయి సువార్త యొక్క 9 వ అధ్యాయంలో [346] ఒక దయ్యం పట్టిన మూగవానికి సంబంధించిన సంఘటన గురించి పేర్కొనబడింది.[347] అయితే తర్వాత 10 వ అధ్యాయంలో దైవప్రవక్త ఈసా (అ)(ఏసు) తన శిష్యులకు దయ్యములను వెళ్ళగొట్టే, వ్యాధిగ్రస్తులకు స్వస్థతను కలుగజేసే శక్తిని ప్రసాదించడం, వారిని తన అపొస్తలులుగా చేసుకోవడం వంటి విషయాలు పేర్కొనబడ్డాయి. తర్వాతి అధ్యాయాలలో పలు సంఘటనల గురించి పేర్కొనబడిన తర్వాత ప్రకాశవంతమైన మేఘం సంబంధిత సంఘటన 17 వ అధ్యాయంలో పేర్కొనబడింది. అయితే లూకా సువార్త యొక్క 9 వ అధ్యాయంలో మొదట దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) తన శిష్యులకు దయ్యములను వెళ్ళగొట్టే శక్తిని ప్రసాదించడానికి సంబంధించిన సంఘటన [348], తర్వాత ప్రకాశవంతమైన మేఘం సంబంధిత సంఘటన [349] , తర్వాత అదే అధ్యాయంలోనూ, 10 వ అధ్యాయంలోనూ, 11 వ అధ్యాయం ప్రారంభంలోనూ ఇతర సంఘటనల గురించి పేర్కొనబడిన తర్వాత దయ్యం పట్టిన మూగవానికి సంబంధించిన సంఘటన పేర్కొనబడింది.[350]

**(అథఃసూచికలు)**

(343 వ అథఃసూచిక తరువాయి భాగం)

ఆయనతో మాట్లాడుతూ కనిపించారు. అప్పుడు అకస్మాత్తుగా ప్రకాశవంతమైన ఒక మేఘం వారిని కమ్ముకొన్నది. "ఇదిగో ఈయన నా ప్రియ కుమారుడు, ఈయునయందు నేనానందించుచున్నాను" అని ఒక శబ్దం ఆ మేఘంలో నుండి పుట్టింది. దీనినే క్రైస్తవ సోదరులు 'పరిశుద్ధాత్మ అవతరణ' అంటూ పేర్కొంటారు.

[344] 57 వ వాక్యం నుంచి 60 వ వాక్యం వరకు

[345] లూకా సువార్త, 9 : 28 [346] మత్తయి సువార్త, 9 : 32

[347] అనగా దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) ఆ వ్యక్తికి స్వస్థతను చేకూర్చారని పేర్కొనబడింది.

[348] 1 వ వాక్యము [349] 28 వ వాక్యము [350] లూకా సువార్త, 11 : 14



## 121 వ వైరుధ్యం:

మార్కు సువార్త యొక్క 15 వ అధ్యాయంలోని 25 వ వాక్యంలో యూదులు ఏసును 3 గంటల సమయంలో [351] శిలువ వేసినట్లుగా పేర్కొనబడింది. అయితే యోహాను సువార్తలో యొక్క 9 వ అధ్యాయపు 14 వ వాక్యంలో అందుకు విరుద్ధంగా స్పష్టంగా ఏసు ఉదయం ఆరుగంటల వరకు పిలాతు వద్ద ఉన్నారని [352] పేర్కొనబడింది.

## సిలువ వేయబడిన సమయంలో ఏసు ఆక్రందన

## 122 వ వైరుధ్యం:

మత్తయి సువార్త యొక్క 27 వ అధ్యాయంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" ఇంచుమించు మూడు గంటలప్పుడు యేసు- ఏలీ, ఏలీ, లామా సబక్తానీ అని బిగ్గరగా కేక వేసెను. ఆ మాటకు నా దేవా, నా దేవా నన్నెందుకు చెయ్యి విడిచితివని అర్థము"** [353]

అయితే మార్కు సువార్త యొక్క 15 వ అధ్యాయంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది: [354]

**" ఎలోయీ, ఎలోయీ, లామా సబక్తానీ అని బిగ్గరగా కేక వేసెను; ఆ మాటకు నా దేవా, నా దేవా, నన్ను ఎందుకు చెయ్యి విడిచితివని అర్థం"**

**(అథఃసూచికలు)**

[351] బైబిల్ అరబీ మరియు ఇంగ్లీష్ అనువాద గ్రంథాలలో ఈ విధంగానే పేర్కొనబడింది. అయితే బైబిల్ ఉర్దూ అనువాద గ్రంథంలో మాత్రం 'పొద్దెక్కిన తర్వాత' అని పేర్కొనబడి ఉంది. అయితే బైబిల్ తెలుగు అనువాద గ్రంథంలో 'ఆయనను సిలువ వేసినప్పుడు పగలు తొమ్మిది గంటలాయెను' అని పేర్కొనబడి ఉంది.

[352] ఈ వైరుధ్యానికి సంబంధించిన మరిన్ని వివరాలు 86 వ వైరుధ్యంలోనూ, దాని క్రింద పేర్కొనబడిన అథఃసూచికల లోనూ పేర్కొనబడ్డాయి.

[353] మత్తయి సువార్త, 27 : 46 [354] మార్కు సువార్త, 15 : 34

అయితే అందుకు విరుద్ధంగా లూకా సువార్త యొక్క 23 వ అధ్యాయంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది : [355]

**" అప్పుడు యేసు గొప్ప శబ్దముతో కేక వేసి - తండ్రీ, నీ చేతికి నా ఆత్మను అప్పగించుకొనుచున్నాననెను "** [356]

## 123 వ వైరుధ్యం:

మత్తయి మరియు మార్కు సువార్తలలో ఏసును అపహసించినది, అంగీ తొడిగించినది హేరోదు సైనికులు కాదని, పిలాతు యొక్క సైనికులని తెలుస్తుంది. [357] అయితే లూకా సువార్తలో అందుకు విరుద్ధమైన అంశం పేర్కొనబడియున్నట్లుగా తెలుస్తుంది. [358]

**(అథఃసూచికలు)**

355 46 వ వాక్యము.

356 ఈ వైరుధ్యం అభ్యంతరకరమైనది. ఎందుకంటే మత్తయి మరియు మార్కు సువార్తల ద్వారా ఏసు రెండు సార్లు పెద్దగా కేక వేసినట్లుగా తెలుస్తుంది. అయితే మత్తయి మరియు మార్కు సువార్తలలో కేవలం ఏసు మొదటి పర్యాయం కేక వేసినప్పుడు పలికిన మాటలు మాత్రమే ప్రస్తావించబడ్డాయి. ఏసు రెండవమారు కేక వేయడం గురించి క్లుప్తంగా పేర్కొనబడిన తర్వాత ఆయన ప్రాణం విడిచినట్లుగా పేర్కొనబడి ఉంది. అయితే లూకా సువార్తలో మాత్రం మొదటి కేక గురించి ప్రస్తావించబడలేదు. కేవలం రెండవమారు ఏసు కేక వేస్తూ పలికిన మాటలు మాత్రమే ప్రస్తావించబడి, తర్వాత ఏసు ప్రాణం విడిచినట్లుగా పేర్కొనబడింది. కనుక న్యాయవంతమైన విషయమేమిటంటే ఈ విషయంలో ఎటువంటి వైరుధ్యమూ లేదు. బహుశా ఈ గ్రంథ రచయిత అయిన మౌలానా రహ్మతుల్లాహ్ కైరాన్వీ (ర) గారు మత్తయి మరియు మార్కు సువార్తలలో ఏసు రెండవమారు కేక వేయడం గురించి పేర్కొనబడియున్న విషయాన్ని గమనించి ఉండరు.
(అల్లాహ్‌కే సర్వం ఎరుక)

357 మత్తయి సువార్త, 27 : 27, మార్కు సువార్త, 15 : 16

358 అయితే మా వద్ద ఉన్న అన్ని బైబిల్ ప్రతుల్లోనూ కేవలం 'సైనికులు' అనే పదం మాత్రమే పేర్కొనబడి ఉన్నది. 'హేరోదు సైనికులు' అని గానీ 'పిలాతు సైనికులు' అని గానీ పేర్కొనబడలేదు.
(లూకా సువార్త, 23 :11 )



## 124 వ వైరుధ్యం:

మార్కు సువార్త ద్వారా [359] వారు (సైనికులు) ఏసుకు బోళము కలిపిన ద్రాక్షరసాన్ని ఇచ్చినట్లుగా, అయితే ఆయన దానిని త్రాగలేదని పేర్కొనబడి ఉంది. అయితే అందుకు విరుద్ధంగా మిగిలిన మూడు సువార్తల్లోనూ (మత్తయి, లూకా, యోహాను సువార్తల్లో) [360] వారు ఏసుకు చిరకాను ఇచ్చినట్లుగా పేర్కొనబడి ఉంది. మత్తయి సువార్తలోనూ, యోహాను సువార్తలోనూ ఏసు ఆ చిరకాను సేవించినట్లుగా పేర్కొనబడి ఉంది.[361]

**(అథఃసూచికలు)**

359 మార్కు సువార్త, 15 : 23 అయితే బైబిల్ ఉర్దూ అనువాద గ్రంథంలో 'మిర్ కలుపబడియున్న ద్రాక్షరసం' అని పేర్కొనబడి ఉంది.

360 మత్తయి సువార్త, 27 : 34, లూకా సువార్త, 23 : 36, యోహాను సువార్త, 19 : 30

361 ఇది బైబిల్ అరబీ అనువాద గ్రంథం ఆధారంగా పేర్కొనబడిన విషయం. బైబిల్ ఉర్దూ అనువాద గ్రంథంలో మత్తయి సువార్త యొక్క 27 వ అధ్యాయపు 34 వ వాక్యంలో ద్రాక్షరసానికి బదులు 'పిత్తరసం కలుపబడియున్న మద్యం' అని పేర్కొనబడి ఉంది. అయితే యోహాను సువార్తలో ఈ సంఘటన అసలు పేర్కొనబడనే లేదు. యోహాను సువార్తలో ఏసుకు చిరకా అందించబడడానికి సంబంధించిన ప్రస్తావన వేరే సంఘటనకు సంబంధించినది. ఆ సంఘటన విషయంలో (ఏసుకు రెల్లులో ముంచబడిన చిరకా అందించబడడానికి సంబంధించిన సంఘటన విషయంలో) మత్తయి, మార్కు, లూకా మరియు యోహాను సువార్తలన్నీ ఏకీభవించాయి.

# మూడవ ప్రకరణం

# తప్పులు

### వలతత్‌రిఫన్నహుమ్ ఫీ లహ్‌నిల్ ఖౌల్

రెండవ ప్రకరణంలో 'వైరుధ్యాలు' పేరుతో పేర్కొనబడిన తప్పులు కాకుండా మిగిలిన తప్పులు ఈ ప్రకరణంలో పేర్కొనబడుతున్నాయి.

## మొదటి తప్పు:

బైబిల్ పాతనిబంధన గ్రంథంలోని 'నిర్గమ కాండము' యొక్క 12 వ అధ్యాయపు 40 వ వాక్యంలో ఈజిప్టు (ఐగుప్తు) లో ఇశ్రాయేలీయులు నివసించిన కాలం 430 సంవత్సరాలని[362] పేర్కొనబడింది. ఇది పూర్తిగా తప్పు. ఎందుకంటే వాస్తవానికి వారు నివసించిన కాలం 215 సంవత్సరాలు. అందుకే క్రైస్తవ వ్యాఖ్యాతలు మరియు చరిత్రకారులు కూడా ఈ తప్పును అంగీకరించారు. ఈ విషయం పాఠకులకు వారిచే చదువబడుతున్న ఈ గ్రంథం యొక్క 2వ అధ్యాయంలోని లక్ష్యం-3, ఋజువు నెం.1 ద్వారా తెలుస్తుంది.

## రెండవ తప్పు:

'సంఖ్యాకాండము' యొక్క 1 వ అధ్యాయంలో ఇశ్రాయేలీయులలో 20 సంవత్సరాల ప్రాయంలో ఉన్నవారి సంఖ్య లేవీయులు కాకుండా 6 లక్షలని, లేయా సంతతికి చెందిన మొత్తం పురుషులు మరియు స్త్రీలు, అదేవిధంగా మిగిలిన తెగలన్నింటికీ చెందిన 100 సంవత్సరాల కంటే తక్కువ వయస్సును కలిగియున్న స్త్రీ పురుషులు ఈ సంఖ్యలో భాగంగా లెక్కించబడలేదని పేర్కొనబడింది. ఇది పూర్తిగా తప్పు. ఈ విషయం మీకు ఇదే గ్రంథంలోని మొదటి ప్రకరణంలో తౌరాతు గ్రంథం స్థితిగతులకు సంబంధించిన వివరణలో భాగంగా పేర్కొనబడిన 10 వ ఆధారం ద్వారా విదితమయింది.

**(అథఃసూచికలు)**

362 **" ఆ నాలుగు వందల ముప్పది సంవత్సరములు గడచిన తర్వాత జరిగినదేమనగా, ఆ దినమందే యెహోవా సేనలన్నియు ఐగుప్తు దేశములో నుండి బయలుదేరిపోయెను"**



## మూడవ తప్పు:

'ద్వితీయోపదేశ కాండము' యొక్క 23 వ అధ్యాయపు 2 వ వాక్యము తప్పు.[363]

## నాల్గవ తప్పు:

'ఆదికాండము' యొక్క 46 వ అధ్యాయపు 15 వ వాక్యంలో పేర్కొనబడిన 'ముప్పదిముగ్గురు' అనే పదం పూర్తిగా తప్పు. నిజానికి 'ముప్పది నలుగురు' అనేదే సరియైనది.[364]

## ఐదవ తప్పు:

'సమూయేలు మొదటి గ్రంథము' యొక్క 6 వ అధ్యాయపు 19 వ వాక్యంలో పేర్కొనబడిన 'ఏబది వేల' అనే పదం తప్పు. ఈ విషయం పాఠకులకు వారిచే చదువబడుతున్న ఈ గ్రంథం యొక్క 2 వ అధ్యాయంలోని లక్ష్యం-2 ద్వారా విదితమవుతుంది. [365]

## ఆరవ మరియు ఏడవ తప్పు:

'సమూయేలు రెండవ గ్రంథము' యొక్క 15 వ అధ్యాయపు 7 వ వాక్యంలో పేర్కొనబడిన 'నలువది' [366] అనే పదం తప్పు. అలాగే 9 వ వాక్యంలో పేర్కొనబడిన 'హెబ్రోను' అనేది కూడా

**(అథఃసూచికలు)**

363 దీనికి సంబంధించిన వివరాలను ఇదే గ్రంథం యొక్క 49 వ పేజీలో అధ్యయనం చేయగలరు.

364 దీనికి సంబంధించిన వివరాలను కూడా ఇదే గ్రంథం యొక్క 48 వ పేజీలో అధ్యయనం చేయగలరు.

365 దీనికి సంబంధించిన వివరాలను కూడా ఇదే గ్రంథం యొక్క 2 వ అధ్యాయంలోని ఋజువు నెం. 25 ద్వారా అధ్యయనం చేయగలరు.

366 అయితే బైబిల్ తెలుగు అనువాద గ్రంథంలో 'నాలుగు' అని పేర్కొనబడి, దానికి సంబంధించిన అథఃసూచికలో 'పాఠాంతరము, నలువది' అని పేర్కొనబడింది.

తప్పే. వాస్తవానికి 'నలువది' కి బదులు 'నాలుగు' అని పేర్కొనబడడమే సరియైనది. అలాగే 'హెబ్రోను' కు బదులు ఎదోము అని పేర్కొనబడడమే సరియైనది. ఈ విషయం పాఠకులకు వారిచే చదువబడుతున్న ఈ గ్రంథం యొక్క 2 వ అధ్యాయంలోని లక్ష్యం-1 ద్వారా విదితమవుతుంది.[367] బైబిల్ అరబీ అనువాదకులు 'నలువది' అనే పదానికి బదులు 'నాలుగు' అని పేర్కొన్నారు.

## దైవమందిరం ఎదుటనున్న ముఖమంటపం ఎత్తు

## ఎనిమిదవ తప్పు:

'దినవృత్తాంతములు రెండవ గ్రంథము' యొక్క 3 వ అధ్యాయపు 4 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" మందిరపు[368] ముఖమంటపము మందిరపు పొడుగును బట్టి యిరువది మూరలు వెడల్పు, నూట ఇరువది మూరలు ఎత్తు"**

ఇందులో నూట ఇరవై అనేది పూర్తిగా తప్పు. ఎందుకంటే ముఖమంటపము ఎత్తు కేవలం ముప్పై మూరలు మాత్రమే. ఈ విషయానికి సంబంధించిన వివరణ మనకు 'రాజులు మొదటి గ్రంథము' యొక్క 6 వ అధ్యాయంలోని 2 వ వాక్యంలో [369] లభిస్తుంది. మరి గోడల పైకప్పు ఎత్తు ఇరవై మూరలు ఎలా కాగలదు? ఆడమ్ క్లార్క్ తన వ్యాఖ్యాన గ్రంథము యొక్క రెండవ అధ్యాయంలో అతిస్పష్టంగా దీనిని తప్పుగా పేర్కొన్నారు. సుర్యానీ మరియు అరబీ అనువాదకులు ఇక్కడ ప్రక్షిప్తానికి పాల్పడి 'నూట' అనే పదాన్ని తొలగించి దాని ఎత్తును ఇరవై మూరలుగా పేర్కొన్నారు.

**(అధఃసూచికలు)**

367 దీనికి సంబంధించిన వివరాలను ఇదే గ్రంథం యొక్క రెండవ సంపుటిలో బుజువు నెం. 13 మరియు బుజువు నెం.14 ) అధ్యయనం చేయగలరు.

368 అనగా దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) చే ప్రారంభించబడిన దైవమందిర నిర్మాణం.

369 రాజైన సొలొమోను యెహోవాకు కట్టించిన మందిరము అరువది మూరల పొడుగును ఇరువది మూరల వెడల్పును ముప్పది మూరల ఎత్తును గలదై యుండెను.



## బెన్యామీను సంతానానికి చెందిన సరిహద్దులు

## తొమ్మిదవ తప్పు:

'యెహోషువ గ్రంథము' యొక్క 18 వ అధ్యాయపు 14 వ వాక్యంలో బెన్యామీను సంతానానికి చెందిన సరిహద్దు గురించి తెలుపుతూ ఈ విధంగా పేర్కొనబడింది:

**" మరియు సముద్రం [370] ముందు నుంచి వంగుతుంది, మరలుతుంది "**

ఇందులో 'సముద్రం ముందు నుంచి' అనే పదాలు తప్పు. ఎందుకంటే వారికి చెందిన సరిహద్దులో సముద్రతీరం చేరియుండలేదు. అలాగే దాని సరిహద్దుకు సమీపంలో సముద్రమూ లేదు. బైబిల్ వ్యాఖ్యాతలయిన డి.ఐలీ మరియు రిచర్డ్ మేంట్ ఈ పదాలు తప్పు అనే విషయాన్ని అంగీకరించారు. ఇద్దరూ ఈ విధంగా పేర్కొన్నారు:

**" అది హెబ్రూ పదం. అది 'సముద్రం' అని అనువదించబడింది. ఆ పదానికి అసలయిన అర్థం 'పడమర'. "**

**(అధఃసూచికలు)**

370 ఇది బైబిల్ అరబీ గ్రంథంలో పేర్కొనబడిన వాక్యానికి తెలుగు అనువాదం. ప్రస్తుతం అందుబాటులో ఉన్న బైబిల్ ఇంగ్లిష్ అనువాదం యొక్క సారాంశమూ ఇదే. అయితే బహుశా ఉర్దూ అనువాదకునికి బైబిల్ వ్యాఖ్యాతలయిన డి.ఐలీ మరియు రిచర్డ్ మేంట్ ల వివరణకు సంబంధించిన సమాచారం అంది ఉంటుంది. అందుకే ప్రస్తుత బైబిల్ ఉర్దూ అనువాద గ్రంథంలో 'సముద్రం' అనే పదానికి బదులు 'పడమర' అనే పదం ఉపయోగించబడి ఉంది. అనగా " కొండ నుంచి పడమరగా దక్షిణమునకు తిరిగి" అని పేర్కొనబడి ఉంది. అయితే బైబిల్ ఇంగ్లిష్ అనువాద గ్రంథంలో ఇప్పటికీ 'sea' అనే పదం ఉపయోగించబడింది. బహుశా తరువాతి ఎడిషన్లలో 'sea' అనే పదం 'West' అనే పదంగా మార్చివేయబడవచ్చు.

బైబిల్ తెలుగు అనువాద గ్రంథంలోనూ 'సముద్రం' అనే పదానికి బదులు 'పడమర' అనే పదమే ఉపయోగించబడి ఉంది. బైబిల్ తెలుగు అనువాద గ్రంథంలో 'యెహోషువ గ్రంథము' యొక్క 18 వ అధ్యాయపు 14 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది (తెలుగు అనువాదకుడు):

**" అక్కడ నుండి దాని సరిహద్దు దక్షిణమున బెత్‌హోరోనుకును ఎదురుగానున్న కొండ నుండి పడమరగా దక్షిణమునకు తిరిగి అక్కడ నుండి యూదా వంశస్థుల పట్టణమైన కిర్యాత్బాలు అనగా కిర్యత్యారీము వరకు వ్యాపించెను, అది పడమటి దిక్కు "**

అయితే ఈ అర్థాన్ని మేము ఏ అనువాద గ్రంథంలోనూ చూడలేదు. బహుశా అది పరిష్కరణ లక్ష్యంతో ఈ ఇద్దరు వ్యాఖ్యాతలు సృష్టించిన పదం కావచ్చు.

## యూదా కు చెందిన సరిహద్దు పదవ తప్పు:

'యెహోషువ గ్రంథము' యొక్క 19 వ అధ్యాయపు 34 వ వాక్యంలో నఫ్తాలీయుల పక్షమునకు వచ్చిన సరిహద్దు గురించి ఈ విధంగా పేర్కొనబడింది:

**" ... తూర్పున యొర్దాను నొద్ద యూదా వరకు వ్యాపించెను"**

ఇది కూడా తప్పే. ఎందుకంటే యూదా వంశస్థులకు చెందిన సరిహద్దు దక్షిణ దిక్కు వైపుకు ఎంతో దూరం వరకు ఉంది. ఆడమ్ క్లార్క్ పైన పేర్కొనబడిన వాక్యం తప్పు అనే విషయాన్ని అంగీకరించారు. ఈ విషయం పాఠకులకు వారిచే చదువబడుతున్న ఈ గ్రంథం యొక్క 2 వ అధ్యాయం ద్వారా తెలుస్తుంది.

## పదకొండవ తప్పు:

బైబిల్ వ్యాఖ్యాత అయిన హార్స్లే యెహోషువ గ్రంథము యొక్క 3 వ అధ్యాయానికి చెందిన 7 వ మరియు 8 వ వాక్యాలు తప్పని [371] పేర్కొన్నారు.

## పన్నెండవ తప్పు:

'న్యాయాధిపతులు గ్రంథము' యొక్క 17 వ అధ్యాయపు 7 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" యూదా బేత్లెహేములో నుండి వచ్చిన యూదా వంశస్థుడైన ఒక యౌవనుడుండెను. అతడు లేవీయుడు, అతడు అక్కడ నివసించెను. "**

ఈ వాక్యంలో 'అతడు లేవీయుడు' అనేది పూర్తిగా తప్పు. ఎందుకంటే యూదా వంశస్థుడయిన వ్యక్తి లేవీయుడు ఎలా కాగలడు? అందుకే బైబిల్ వ్యాఖ్యాత అయిన హార్స్లే ఇది తప్పు అనే విషయాన్ని అంగీకరించారు. ఇక హ్యూబీ కాంట్ అయితే 'అతడు లేవీయుడు' అనే పదాలను మూల ప్రతి నుంచే తొలగించివేశారు.

**(అథఃసూచికలు)**

371 ఈ రెండు వాక్యాలు ఎందుకు తప్పో మాకు తెలియరాలేదు.



## పదమూడవ తప్పు:

'దినవృత్తాంతములు రెండవ గ్రంథము' యొక్క 13 వ అధ్యాయపు 3 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" అబీయాకును యరొబామునకును యుద్ధము కలుగగా అబీయా నాలుగు లక్షలమంది పరాక్రమశాలుల సైన్యము ఏర్పరచుకొని యుద్ధమునకు సిద్ధము చేసెను; యరొబామును ఎనిమిది లక్షలమంది పరాక్రమశాలులను ఏర్పరచుకొని అతనికి ఎదురుగా వారిని యుద్ధమునకు వ్యూహపరచెను "**

అయితే 17 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" అబీయాయును అతని జనులను వారిని ఘోరముగా సంహరించిరి. ఇశ్రాయేలు వారిలో అయిదు లక్షలమంది పరాక్రమశాలులు హతులైరి. "**

ఈ రెండు వాక్యాలలో పేర్కొనబడిన సంఖ్యల వివరం తప్పుడు వివరం. క్రైస్తవ వ్యాఖ్యాతలు ఈ తప్పును అంగీకరించారు. లాటిన్ బైబిల్ అనువాదకులు దీనిని సంస్కరిస్తూ 4 లక్షలను 40 వేలుగా, 8 లక్షలను 80 వేలుగా, 5 లక్షలను 50 వేలుగా మార్చివేశారు. ఈ విషయం పాఠకులకు వారిచే చదువబడుతున్న ఈ గ్రంథం యొక్క 2 వ అధ్యాయంలో [372] తెలుస్తుంది.

## పదునాల్గవ తప్పు స్పష్టమైన ప్రక్షిప్తం :

'దినవృత్తాంతములు రెండవ గ్రంథము' యొక్క 28 వ అధ్యాయపు 19 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" యెహోవా ఇశ్రాయేలు రాజైన ఆహాజు చేసిన దానిని బట్టి యూదావారిని హీనపరచెను "**

ఈ వాక్యంలో 'ఇశ్రాయేలు' అనేది నిశ్చయంగా తప్పు. ఎందుకంటే అతడు ఇశ్రాయేలు రాజు కాడు[373], యూదా రాజ్యానికి రాజు. అందుకే గ్రీకు మరియు లాటిన్ బైబిల్ అనువాదకులు

**(అథఃసూచికలు)**

372 దీనికి సంబంధించిన వివరాలను ఇదే గ్రంథం యొక్క రెండవ సంపుటిలోని లక్ష్యం-1, ఋజువు నెం. 18 ద్వారా అధ్యయనం చేయగలరు.

373 దినవృత్తాంతములు రెండవ గ్రంథము, 28 : 1 వ వాక్యం మరియు 2 వ వాక్యం.

‘ఇశ్రాయేలు’ అనే పదాన్ని ‘యూదా’ అనే పదంగా మార్చివేశారు. ఇది సంస్కరణా లేక ప్రక్షిప్తమా? అనే విషయాన్ని పాఠకులు పరిశీలించగలరు.

## పదిహేనవ తప్పు :

‘దినవృత్తాంతములు రెండవ గ్రంథము’ యొక్క 36 వ అధ్యాయపు 10 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**“ అతని సహోదరుడైన సిద్కియాను యూదా మీదను యెరూషలేము మీదను రాజుగా నియమించెను [374] ”**

ఈ వాక్యంలో ‘అతని సహోదరుడైన’ అనేది తప్పు. ‘అతని పినతండ్రి’ అనేది సరియైనది[375] అందుకే గ్రీకు మరియు అరబీ బైబిల్ అనువాదకులు ‘సహోదరుడైన’ అనే పదాన్ని ‘పినతండ్రియైన’ అని మార్చివేశారు. అయితే ఇది పరిష్కరణగా, ప్రక్షిప్తంగా పరిగణించబడుతుంది. వార్డ్ కేథొలిక్ తన పుస్తకంలో ఈ విధంగా పేర్కొన్నారు:

“ అది (‘సహోదరుడైన’ అనేది) తప్పు అయిన కారణంగా గ్రీకు బైబిల్ అనువాద గ్రంథంలోనూ, ఇతర బైబిల్ అనువాద గ్రంథాలలోనూ దానిని (‘సహోదరుడైన’ అనే పదాన్ని) ‘పినతండ్రియైన’ అని మార్చివేయబడింది.

## పదహారవ తప్పు :

‘సమూయేలు రెండవ గ్రంథము’ యొక్క 10 వ అధ్యాయంలో 16 వ వాక్యం నుంచి

**(అథఃసూచికలు)**

374 అనగా బబులోను రాజయిన నెబుకద్నెజరు యెహోయాకీను స్థానంలో అతడి సోదరుడిని రాజుగా చేసివేశాడు.

375 ‘రాజులు రెండవ గ్రంథము’ యొక్క 24 వ అధ్యాయపు 17 వ వాక్యంలో ‘అతని పినతండ్రియైన’ అని పేర్కొనబడింది. ఇదే సరియైనది. ఎందుకంటే యెహోయాకీను యోషీయా కుమారుడయిన యెహోయాకీము యొక్క కుమారుడు. ఒకవేళ సిద్కియా యెహోయాకీము సోదరుడయినట్లయితే అతడు ‘యెహోయాకీము కుమారుడయిన సిద్కియా’ అని పేర్కొనబడవలసినది. అయితే అతడు ‘యోషీయా కుమారుడయిన సిద్కియా’ అని పేర్కొనబడ్డాడు. (చూడండి: ‘యిర్మీయా గ్రంథము’, 26 : 1, 27 : 1 )



19 వ వాక్యం వరకు మూడుచోట్ల, అదేవిధంగా ‘దినవృత్తాంతములు మొదటి గ్రంథము’ యొక్క 18వ అధ్యాయపు 3 వ మరియు 5 వ వాక్యం నుంచి 10 వ వాక్యం వరకు ఏడు చోట్ల ‘హదరెజెరు’ [376] అనే పదం ఉపయోగించబడింది. వాస్తవానికి నిజమైన పదం ‘హదదెజరు’ (‘దె’ అనే అక్షరంతో).

## పదిహేడవ తప్పు :

‘యెహోషువ గ్రంథము’ యొక్క 7 వ అధ్యాయం యొక్క 18 వ వాక్యంలో ‘ఆకాను’ అనే పదం ‘ను’ అనే ఆఖరి అక్షరాన్ని కలిగియున్నది. అయితే సరియైన పదం ‘ఆకారు’ [377] (‘రు’ అనే ఆఖరి అక్షరాన్ని కలిగియున్న పదం)

## పద్దెనిమిదవ తప్పు :

‘దినవృత్తాంతములు మొదటి గ్రంథము’ యొక్క 3 వ అధ్యాయం యొక్క 5 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది :

**“ అమ్మీయేలు కుమార్తెయైన బత్షెబ [378] వలన....”** వాస్తవానికి ‘ఏలీయాము కుమార్తెయైన బత్షెబ’ అనేది సరియైనది. [379]

**(అథఃసూచికలు)**

376 ఇది ఒక వ్యక్తి యొక్క పేరు. దీనికి సంబంధించిన సమాచారం 107 వ పేజీలో అందించబడింది.

అయితే బైబిల్ తెలుగు అనువాద గ్రంథంలో ‘సమూయేలు రెండవ గ్రంథము’ యొక్క 10 వ అధ్యాయంలో 16 వ వాక్యం నుంచి 19 వ వాక్యం వరకు మూడుచోట్ల ‘హదదెజరు’ అనే పదమే ఉపయోగించబడింది. (తెలుగు అనువాదకుడు)

377 ఇది యూదా సంతతికి చెందిన ఒక వ్యక్తి పేరు. ‘దినవృత్తాంతములు మొదటి గ్రంథము’ యొక్క 2 వ అధ్యాయపు 7 వ వాక్యంలో ‘ఆకారు’ అనే పేర్కొనబడి ఉంది.

అయితే బైబిల్ తెలుగు అనువాద గ్రంథంలో మాత్రం ‘దినవృత్తాంతములు మొదటి గ్రంథము’ యొక్క 2 వ అధ్యాయపు 7 వ వాక్యంలో ‘ఆకాను’ అని పేర్కొనబడి ఉంది.

## పందొమ్మిదవ తప్పు :

'రాజులు రెండవ గ్రంథము' యొక్క 14 వ అధ్యాయం యొక్క 21 వ వాక్యంలో 'అజర్యా' [380] అనే పదం ఉపయోగించబడింది. ఇది తప్పు. సరియైన పదం 'ఉజ్జియా' [381]

## ఇరవయ్యవ తప్పు :

'దినవృత్తాంతములు రెండవ గ్రంథము' యొక్క 21 వ అధ్యాయం యొక్క 17 వ వాక్యంలో 'యెహోయాహాజు' అనే పదం ఉపయోగించబడింది. ఇది పూర్తిగా తప్పు. సరియైన పదం 'అహజ్యా' [382] బైబిల్ వ్యాఖ్యాత అయిన హోరన్ తన వ్యాఖ్యాన గ్రంథం యొక్క మొదటి సంపుటిలో తొలుత 'పదహారవ తప్పు' నుంచి 'ఇరవయ్యవ తప్పు' వరకు పేర్కొనబడిన వాక్యాలలోని

**(అథఃసూచికలు)**

378 బత్షెబ ఊరియా భార్య. తౌరాతు గ్రంథంలో (అనగా బైబిల్ పాతనిబంధన గ్రంథంలో 'తౌరాతు' గా పరిగణించబడే తొలి ఐదు గ్రంథాలలో) దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ) (దావీదు) ఆవిడతో (అల్లాహ్ మన్నించుగాక) వ్యభిచరించారని, తర్వాత ఊరియాను చంపించి ఆవిడను వివాహం చేసుకున్నారని, వారిద్దరికీ దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) జన్మించారని ఒక అపవాదు పేర్కొనబడి ఉంది.

379 'సమూయేలు రెండవ గ్రంథము' యొక్క 11 వ అధ్యాయపు 3 వ వాక్యం ద్వారా ఈ విషయం తెలుస్తుంది.

380 యెరూషలేముకు చెందిన ఒక రాజు పేరు

381 'దినవృత్తాంతములు రెండవ గ్రంథము' యొక్క 26 వ అధ్యాయపు 1 వ వాక్యం ద్వారా, 'రాజులు రెండవ గ్రంథము' యొక్క 15 వ అధ్యాయపు 13 వ, 30 వ, 32 వ, 34 వ వాక్యాల ద్వారా ఈ విషయం తెలుస్తుంది.

382 అదే గ్రంథంలో, అనగా 'దినవృత్తాంతములు రెండవ గ్రంథము' యొక్క 22 వ అధ్యాయపు 1 వ వాక్యం ద్వారా, 'రాజులు రెండవ గ్రంథము' యొక్క 8 వ అధ్యాయపు 25 వ వాక్యం ద్వారా ఈ విషయం తెలుస్తుంది. (ఈ వ్యక్తి యూదా రాజ్యానికి రాజుగా కొనసాగాడు)



వ్యక్తుల పేర్లు తప్పుగా పేర్కొనబడ్డాయని అంగీకరించారు. ఆ తర్వాత ఆయన ఈ విధంగా పేర్కొన్నారు:

" ఇదేవిధంగా వేరేచోట్ల కూడా వ్యక్తుల పేర్ల విషయంలో తప్పులు దొర్లాయి. ఇంతకంటే ఎక్కువ విపులంగా వివరాలను తెలుసుకోగోరేవారు డాక్టర్ కనీకాట్ వ్రాసిన పుస్తకం లో 23 వ పేజీ నుంచి 62 వ పేజీ వరకు అధ్యయనం చేయగలరు."

నిజమైన విషయమేమిటంటే ఈ పుస్తకాలలో (బైబిల్ లోని పుస్తకాలలో) తరచుగా వ్యక్తుల పేర్లు తప్పుడు రీతిలో పేర్కొనబడ్డాయి. సరియైన రీతిలో పేర్కొనబడిన వ్యక్తుల పేర్లు తక్కువ సంఖ్యలోనే ఉన్నాయి.

# యెహోయాకీము ఖైదు చేయబడ్డాడా లేక హతమార్చబడ్డాడా?

## 21 వ తప్పు :

'దినవృత్తాంతములు రెండవ గ్రంథము' యొక్క 36 వ అధ్యాయంలో బబులోను రాజయిన నెబుకద్నెజరు యెహోయాకీమును గొలుసులతో బంధించి బబులోనుకు తీసుకుపోయాడని పేర్కొనబడింది. ఇది పూర్తిగా తప్పు. నిజమైన సంఘటన ఏమిటంటే నెబుకద్నెజరు యెహోయాకీమును యెరూషలేములో హతమార్చివేసి అతడి శవాన్ని నగర ప్రాకారం వెలుపల పడవేయవలసిందిగా, ఎంతమాత్రం ఖననం చేయకూడదని[383] ఖచ్చితంగా ఆదేశించాడు.

చరిత్రకారుడయిన యూసీఫీన్ తన చరిత్ర గ్రంథం యొక్క 10 వ సంపుటిలోని 6 వ అధ్యాయంలో ఈ విధంగా పేర్కొన్నారు:

" బబులోను రాజు గొప్ప సైన్యాన్ని తీసుకువచ్చాడు. అతడు యుద్ధం చేయకుండానే నగరాన్ని ఆక్రమించాడు. నగరంలోకి ప్రవేశించిన తర్వాత అతడు యువకులందరినీ హతమార్చివేశాడు. ఆ విధంగా హతమార్చబడినవారిలో యెహోయాకీము కూడా ఉన్నాడు. అతడి శవం నగర ప్రాకారం వెలుపల పడవేయబడింది. అతడి కుమారుడయిన యెహోయాకీను పట్టాభిషిక్తుడయినప్పుడు మూడువేల మంది పురుషులను బంధించాడు. వారిలో దైవప్రవక్త అయిన

**(అథఃసూచికలు)**

383 గుర్తుంచుకోవలసిన విషయమేమిటంటే ఈ సంఘటన నెబుకద్నెజరు దాడికి సంబంధించిన ప్రసిద్ధ సంఘటన జరగడానికి కొంతకాలం ముందు సంభవించింది. ఇశ్రాయేలీయులు దేశబహిష్కార శిక్షకు గురి అయ్యే సంఘటన ఆ తర్వాత కొంతకాలానికి సంభవించింది.

హజ్రత్ హిజ్ఖియాల్ (అ) (యెహెజ్కేలు) కూడా చేరియున్నారు.

## ఎఫ్రాయిము మీద అష్షూరు రాజు దాడి

## 22 వ తప్పు :

'యెషయా గ్రంథము' యొక్క 7 వ అధ్యాయపు 8 వ వాక్యానికి క్రీ.శ. 1671 లో మరియు క్రీ.శ. 1831 లో ప్రచురించబడిన బైబిల్ అరబీ అనువాద గ్రంథంలో అందించబడిన అనువాదం ఈ క్రిందివిధంగా ఉంది:

"65 సంవత్సరముల తరువాత అరాము[384] నాశనమగును"

క్రీ.శ. 1838 లో ప్రచురించబడిన బైబిల్ పారశీక (ఫార్సీ) అనువాద గ్రంథంలో అందించబడిన అనువాదం ఈ క్రిందివిధంగా ఉంది:

"65 సంవత్సరముల తరువాత ఎఫ్రాయిము పరాజితమగును"

వాస్తవానికి ఇది పూర్తిగా తప్పు. ఎందుకంటే ఎఫ్రాయిము మీద అష్షూరు రాజు దాడి హిజ్కియా ఏలుబడిలో ఆరవ సంవత్సరంలో సంభవించింది. ఈ విషయానికి సంబంధించిన వివరణ 'రాజులు రెండవ గ్రంథము' యొక్క 17 వ మరియు 18 వ అధ్యాయాలలో లభ్యమవుతుంది.[385] ఆ విధంగా అరాము ఆ తర్వాత 21 సంవత్సరాల కాలపరిమితిలో [386]

**(అథఃసూచికలు)**

[384] అనగా 'సిరియా' **(Syria)** దేశం. మా వద్ద ఉన్న ఏ బైబిల్ అనువాద గ్రంథంలోనూ 'అరాము' అనే పదం లేదు, 'ఎఫ్రాయిము' అనే పదమే పేర్కొనబడి ఉంది. " అరువదియయిదు సంవత్సరములు కాక మునుపు ఎఫ్రాయిము జనము కాకుండ నాశనమగును" అని పేర్కొనబడింది. అనగా ఇది అష్షూరు రాజు (షల్మనేసరు) దాడిని సూచిస్తుంది. ఈ విషయం మనకు ఇదే అధ్యాయంలోని 17 వ వాక్యం ద్వారా తెలుస్తుంది.

[385] **" హిజ్కియా యేలుబడిలో ఆరవ సంవత్సరమందు, ఇశ్రాయేలు రాజైన హోషేయ యేలుబడిలో తొమ్మిదవ సంవత్సరమందు షోమ్రోను పట్టణము పట్టబడెను. తమ దేవుడైన యెహోవా సెలవిచ్చిన మాట విననివారై ఆయన నిబంధనకును ఆయన సేవకుడైన మోషే ఆజ్ఞాపించిన దానంతటికిని లోబడక అతిక్రమించియుండిరి. అష్షూరు రాజు ఇశ్రాయేలు వారిని అష్షూరు దేశములోనికి తీసికొనిపోయి గోజాను నది దగ్గరనున్న హాలహు హాబోరు అను పట్టణములలోను మాదీయుల పట్టణములలోను వారిని ఉంచెను" ('రాజులు రెండవ గ్రంథము', 18 : 10, 11, 12)**



నశించింది.

క్రైస్తవులకు చెందిన ప్రామాణిక పండితునిగా ఖ్యాతి గాంచిన వట్‌రంగా ఈ విధంగా పేర్కొన్నారు:

" ఇక్కడ ఉల్లేఖించే విషయంలో తప్పు దొర్లింది. వాస్తవానికి 16 మరియు 5 అని పేర్కొనబడాలి. అతడు (ఉల్లేఖకుడు) ఈ కాలవ్యవధిని ఆహాజు పరిపాలనా కాలం 16 సంవత్సరాలుగా, హిజ్కియా పరిపాలనాకాలం 5 సంవత్సరాలుగా విభజించాడు."

ఈ అభిప్రాయం పూర్తిగా మొండివాదనను కలిగియున్నట్టిది. అయినప్పటికీ కనీసం ఆయన యెషయా గ్రంథంలో ఈ విషయానికి సంబంధించి ప్రస్తుతం పేర్కొనబడియున్న విషయం తప్పు అనే విషయాన్ని అంగీకరించారు. క్రీ.శ. 1843 లో ప్రచురించబడిన బైబిల్ ఉర్దూ అనువాద గ్రంథం అనువాదకుడు యెషయా గ్రంథం యొక్క 7 వ అధ్యాయపు 8 వ వాక్యం విషయంలో ప్రక్షిప్తానికి (మార్పుకు) పాల్పడడం జరిగింది. వారు (బైబిల్ అనువాదకులు) తమ స్వాభావిక అలవాటు (అనగా ప్రక్షిప్తాలకు పాల్పడడమనే అలవాటు) ను వదులుకోలేకపోతున్నారు. సర్వసృష్టికర్త అయిన అల్లాహ్ వారికి సన్మార్గాన్ని, సద్బుద్ధిని ప్రసాదించుగాక!

## దైవప్రవక్త హజ్రత్ ఆదమ్ (అ) (ఆదాము) కు నిషిద్ధ వృక్ష ఫలం తినే విషయంలో నిషేధం 23 వ తప్పు :

'ఆదికాండము' యొక్క 2 వ అధ్యాయపు 17 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" అయితే మంచిచెడ్డల తెలివినిచ్చు వృక్ష ఫలములను తినకూడదు; నీవు వాటిని తిను దినమున నిశ్చయముగా చచ్చెదవని [387] నరుని కాజ్ఞాపించెను "**

**(అథఃసూచికలు)**

[386] ఎందుకంటే ఈ భవిష్యద్వాణి దైవప్రవక్త అయిన హజ్రత్ అష్ఇయా (అ)(యెషయా) నోట ఆహాజు కాలంలో వెలువడింది. (యెషయా, 7 : 1) ఆహాజు పట్టాభిషిక్తుడయినప్పటి నుంచి ఇశ్రాయేలు రాజయిన హోషేయ పట్టాభిషిక్తుడయ్యేంత వరకు పన్నెండు సంవత్సరాల కాల వ్యవధి ఉంది. ('రాజులు రెండవ గ్రంథము', 17 : 1) అతడు పట్టాభిషిక్తుడయిన తర్వాత తొమ్మిదవ సంవత్సరంలో ఎఫ్రాయిముపై దాడి సంభవించింది. (ఈ విషయం ఇంతకు ముందు పేర్కొనబడిన 'రాజులు రెండవ గ్రంథము' లోని 18 వ అధ్యాయపు 10 వ వాక్యం ద్వారా మనకు విదితమయింది) ఈ విధంగా మొత్తం ఇరవై ఒకటి (21) సంవత్సరాలయ్యాయి.

ఇది కూడా తప్పే. ఎందుకంటే దైవప్రవక్త హజ్రత్ ఆదమ్ (అ) (ఆదాము) ఆ వృక్ష ఫలాన్ని తిన్నారు.[388] వాస్తవానికి ఆయన దానిని తిన్న దినమున మరణించలేదు. ఆ తర్వాత 900 సంవత్సరాల కంటే ఎక్కువ కాలం వరకు ఆయన జీవించారు.

## 24 వ తప్పు :

'ఆదికాండము' యొక్క 6 వ అధ్యాయపు 3 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" అప్పుడు యెహోవా - నా ఆత్మ నరులతో ఎల్లప్పుడును వాదించదు; వారు తమ అక్రమ విషయములో నరమాత్రులై యున్నారు; అయినను వారి దినములు నూట ఇరువది యేండ్లగుననెను"**

ఇక్కడ 'వారి దినములు నూట ఇరువదియేండ్లగుననెను' అనే యెహోవా పలికెననే విషయం పూర్తిగా తప్పు. ఎందుకంటే పూర్వకాలానికి చెందిన ప్రజల ఆయుష్షులు ఎంతో సుదీర్ఘంగా ఉండేవి. దైవప్రవక్త హజ్రత్ నూహ్ (అ) (నోవహు) ఆయుష్షు 950 సంవత్సరాలు. ఆయన కుమారుడయిన 'సామ్' (షేము) ఆయుష్షు 600 సంవత్సరాలు. అలాగే అర్ఫఖషజ్ (అష్కనజు) ఆయుష్షు 338 సంవత్సరాలు. అయితే నేటికాలంలో 70, 80 సంవత్సరాల వరకు చేరుకోవడమే అరుదుగా ఉంది.

## 25 వ తప్పు :

'ఆదికాండము' యొక్క 17 వ అధ్యాయపు 8 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" నీకును [389] నీ తరువాత నీ సంతతికిని నీవు పరదేశివైయున్న దేశమును, అనగా కనానను దేశమంతటిని నిత్యస్వాస్థ్యముగా ఇచ్చి వారికి దేవుడనై యుందునని అతనితో చెప్పెను."**

ఇది కూడా పూర్తిగా తప్పు. ఎందుకంటే సమస్త కనాను భూభాగం దైవప్రవక్త హజ్రత్

(అథఃసూచికలు)

[387] తౌరాతు గ్రంథం ప్రకారం సృష్టికర్త తన ప్రవక్త అయిన హజ్రత్ ఆదమ్ (అ) (ఆదాము) ను సంబోధించి పలికిన పలుకులివి. 'వృక్షము' అంటే 'నిషిద్ధ వృక్షము' గా ప్రసిద్ధి చెందిన వృక్షము. ఈ విషయం మనకు 'ఆదికాండము' యొక్క 3 వ అధ్యాయపు 3 వ వాక్యం ద్వారా తెలుస్తుంది.

[388] ఆదికాండము, 3 : 6



ఇబ్రాహీమ్ (అ) (అబ్రాహాము) కు ఎన్నటికీ లభించలేదు. అలాగే ఆయన సంతతికి రాజ్యాధికారం, స్థిరమైన ప్రభుత్వాధికారం ప్రాప్తమవలేదు. పైగా ఆ భూభాగంలో ఎంతటి స్థాయిలో లెక్కలేనన్ని విప్లవాలు చోటుచేసుకున్నాయో అంతటి స్థాయిలో మరే ఇతర దేశంలోనూ చోటుచేసుకోలేదు. అలాగే సుదీర్ఘకాలం తర్వాత ఇశ్రాయేలీయుల ప్రభుత్వం ఆ భూభాగం నుంచి పూర్తిగా అంతరించిపోయింది.

## 26 వ , 27 వ మరియు 28వ తప్పు

## యూదుల దేశబహిష్కరణ

'యిర్మీయా' గ్రంథం యొక్క 25 వ అధ్యాయపు మొదటి వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" యోషీయా కుమారుడును యూదా రాజునైన యెహోయాకీము నాలుగవ సంవత్సరమున, అనగా బబులోను రాజైన నెబుకద్రెజరు మొదటి సంవత్సరమున యూదా ప్రజలందరిని గూర్చి యిర్మీయాకు ప్రత్యక్షమైన వాక్కు."**

అయితే 'యిర్మీయా' గ్రంథం యొక్క 25 వ అధ్యాయపు 11 వ మరియు 12 వ వాక్యాలలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" ఈ దేశమంతయు పాడుగాను నిర్జనముగాను ఉండును; ఈ జనులు డెబ్బది సంవత్సరములు బబులోను రాజునకు దాసులుగా ఉందురు. యెహోవా వాక్కు ఇదే - డెబ్బది సంవత్సరములు గడచిన తరువాత వారి దోషములను బట్టి నేను బబులోను రాజును ఆ జనులను కల్దీయుల దేశమును శిక్షింతును; ఆ దేశము ఎప్పుడు పాడుగనుండునట్లు నియమింతును"**

అయితే 'యిర్మీయా' గ్రంథం యొక్క 29 వ అధ్యాయపు 1 వ మరియు 2 వ మరియు 3 వ వాక్యాలలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" రాజైన యెకోన్యా[390] తల్లియగు రాణియు, రాజ పరివారమును, యూదాలోను యెరూషలేములోనున్న అధిపతులును, శిల్పకారులును, కంసాలులును యెరూషలేమును విడిచి వెళ్ళిన తరువాత ప్రవక్తయైన యిర్మీయా పత్రికలో లిఖించి, యూదా రాజైన సిద్కియా**

(అథఃసూచికలు)

[389] దైవం తన ప్రవక్త అయిన హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) (అబ్రాహాము) ను సంబోధిస్తూ పలికిన వాక్కు ఇది.

**బబులోనులోనున్న బబులోను రాజైన నెబుకద్రెజరు నొద్దకు పంపిన షాపాను కుమారుడైన ఎల్యాశా చేతను, హిల్కీయా కుమారుడైన గెమర్యా చేతను, యెరూషలేములో నుండి చెరపట్టబడిపోయిన వారి పెద్దలలో శేషించినవారికిని యాజకులకును ప్రవక్తలకును యెరూషలేము నుండి బబులోనునకు అతడు చెరగొనిపోయిన జనులకందరికిని పంపించిన మాటలు ఇవే "**

అయితే 'యిర్మీయా' గ్రంథం యొక్క 29 వ అధ్యాయపు 10 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" యెహోవా ఈ ఆజ్ఞ ఇచ్చుచున్నాడు - బబులోను రాజ్యమునకు డెబ్బది సంవత్సరములు గతించిన తరువాతనే మిమ్మును గూర్చి నేను పలికిన శుభవార్త నెరవేర్చి యీ స్థలమునకు మిమ్మును తిరిగి రప్పించునట్లు నేను మిమ్మును దర్శింతును"**

ఈ 10 వ వాక్యం క్రీ.శ. 1838 లో ప్రచురించబడిన ఫార్సీ బైబిల్ అనువాద గ్రంథంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**"  బబులోను రాజ్యమునకు డెబ్బది సంవత్సరములు గతించిన తరువాతనే మీ వైపుకు అభిముఖుడనగుదును"**

అయితే ఈ  వాక్యం క్రీ.శ. 1845 లో ప్రచురించబడిన ఫార్సీ బైబిల్ అనువాద గ్రంథంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**"  బబులోను రాజ్యములో డెబ్బది సంవత్సరములు గతించిన తరువాత నేను మరల మీ వైపుకు అభిముఖుడనగుదును"**

'యిర్మీయా' గ్రంథం యొక్క  52 వ అధ్యాయంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" నెబుకద్రెజరు తన యేలుబడియుందు ఏడవ సంవత్సరమున మూడువేల ఇరువది ముగ్గురు యూదులను చెరగొనిపోయెను. నెబుకద్రెజరు ఏలుబడియందు పదునెనిమిదవ సంవత్సరమున అతడు యెరూషలేము నుండి ఎనిమిది వందల ముప్పది యిద్దరిని చెరగొనిపోయెను.. నెబుకద్రెజరు ఏలుబడియందు ఇరువది మూడవ సంవత్సరమున రాజదేహ సంరక్షకుల యధిపతియగు నెబూజరదాను యూదులలో ఏడువందల నలుబడి యయిదుగురు మనుష్యులను చెరగొనిపోయెను; ఆ మనుష్యుల సంఖ్య వెరసి నాలుగువేల ఆరువందలు"**

(28 వ వాక్యం నుంచి 30 వ వాక్యం వరకు)

**(అథఃసూచికలు)**

390 ఈయన యెహోయాకీము కుమారుడైన యెకోన్యా. ఇతడు నెబుకద్రెజరు దాడి సమయంలో యూదారాజుగా ఉన్నాడు. (చూడండి: 'యిర్మీయా గ్రంథము, 24 : 1 )



ఈ విభిన్న వాక్యాల ద్వారా మూడు విషయాలు వెల్లడవుతున్నాయి:

**1)** నెబుకద్రెజరు యెహోయాకీము పట్టాభిషిక్తుడయిన నాల్గవ సంవత్సరాన పట్టాభిషిక్తుడయ్యాడు. ఇదే సరియైనది కూడా. ప్రసిద్ధ చరిత్రకారుడయిన యూదుడయిన యూసీఫస్ తన చరిత్ర గ్రంథం యొక్క 10వ సంపుటిలో ఈ విషయం గురించి వ్యాఖ్యానిస్తూ ఈ విధంగా పేర్కొన్నాడు:

"నెబుకద్రెజరు యెహోయాకీము పట్టాభిషిక్తుడయిన నాల్గవ సంవత్సరం బబులోను రాజయ్యాడు''

ఒకవేళ ఏ వ్యక్తయినా మా వివరణకు వ్యతిరేకంగా వాదించిన పక్షంలో నిశ్చయంగా అతడి వాదన తప్పే. అలాగే అతడి వాదన దైవప్రవక్త హజ్రత్ ఇర్మియా (యిర్మీయా) వాక్కుకు వ్యతిరేకమైనది అవుతుంది. నెబుకద్రెజరు పట్టాభిషిక్తుడయిన సంవత్సరం తప్పనిసరిగా యెహోయాకీము పట్టాభిషిక్తుడయిన నాల్గవ సంవత్సరం అయి ఉండాలి.

**2)** దైవప్రవక్త హజ్రత్ ఇర్మియా (యిర్మీయా) యూదుల వద్దకు యెకోన్యా రాజు మరియు యూదాలోనున్న అధిపతులును, ఇతర నిపుణులు వెళ్ళిపోయిన తర్వాత గ్రంథమును పంపారు.

**3)** మూడు పర్యాయాలు దేశబహిష్కరణకు గురయినప్పుడు ఖైదీల మొత్తం సంఖ్య నాలుగువేల ఆరువందలు. అలాగే మూడవ దేశబహిష్కరణకు సంబంధించిన సంఘటన ముప్పయ్యవ సంవత్సరంలో జరిగింది. ఇక్కడ మూడు పెద్ద తప్పులు ఉన్నాయని మేము పేర్కొంటున్నాము:

1. యెకోన్యా రాజు, యూదాలోనున్న అధిపతులు మరియు వివిధ నిపుణుల దేశబహిష్కరణకు సంబంధించిన సంఘటన చరిత్రకారుల వ్యాఖ్యానం ప్రకారం క్రీస్తు పుట్టుకకు ఐదువందల తొంభైతొమ్మిది సంవత్సరాల పూర్వం సంభవించింది.

అదేవిధంగా 'మీజానుల్ హఖ్' రచయిత క్రీ.శ. 1849 న ప్రచురించబడిన ప్రతి యొక్క 60 వ పేజీలో ఈ విధంగా వ్యాఖ్యానించారు: " ఆ బహిష్కరణ క్రీస్తు పుట్టుకకు ఆరువందల సంవత్సరాల పూర్వం సంభవించింది. ఇక దైవప్రవక్త హజ్రత్ ఇర్మియా (యిర్మీయా) వారి వద్దకు గ్రంథాన్ని పంపడమనేది వారు వెళ్ళిపోయిన తర్వాత జరిగిన సంఘటన. బైబిల్ ప్రకారమయితే యూదులు బబులోనులో నిలిచియున్న కాలం 70 సంవత్సరాలు కావాలి. అయితే అది పూర్తిగా తప్పు. ఎందుకంటే యూదులకు ఇరాన్ రాజయిన ఖోరస్ ఆదేశానుసారం క్రీస్తు పుట్టుకకు 536 సంవత్సరాల పూర్వం స్వాతంత్ర్యం ప్రసాదించబడింది. ఆ లెక్కన బబులోనులో వారు నిలిచియున్న కాలం 63 సంవత్సరాలవుతుందే [391] గానీ 70 సంవత్సరాలు కాజాలదు.

మేము ఈ చారిత్రక వివరాలను  క్రీ.శ. 1852 లో బీరూత్ నుంచి ప్రచురించబడిన

'ముర్షదుత్తాలిబీన్ ఇలా కితాబుల్ ముఖద్దస్ అస్సమీన్' అనే గ్రంథం ద్వారా ఉల్లేఖించాము. అయితే ఈ ప్రతి క్రైస్తవుల సర్వసాధారణ వైఖరి మేరకు క్రీ.శ. 1840 లో ప్రచురించబడిన ప్రతితో ఎన్నో చోట్ల వైరుధ్యాలను కలిగి ఉంది. ఎవరయితే ఉల్లేఖన సవరణను కోరుకుంటున్నారో వారు క్రీ.శ. 1862 లో [392] ప్రచురించబడిన ప్రతిలోని ఉల్లేఖనంతో ఈ ఉల్లేఖనాన్ని పోల్చిచూసుకోవలసి ఉంటుంది. ఈ ప్రతి ఆస్తానహ్ కు చెందిన జామిత్ బా యజీద్ యొక్క గ్రంథాలయంలో ఉంది. 'కితాబె ముఖద్దస్ కీ తారీఖ్' అనే గ్రంథం యొక్క మొదటి సంపుటిలో 2 వ భాగంలోని 20 వ అధ్యాయంలో క్రీ.శ. 1852 లో ప్రచురించబడిన ప్రతిలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

| క్రీస్తు పుట్టుకకు పూర్వపు సంవత్సరం | సంఘటనలు | ప్రపంచం యొక్క సంవత్సరం |
|---|---|---|
| 599 | దైవప్రవక్త హజ్రత్ ఇర్మియా (యిర్మీయా) గ్రంథం బబులోనులో ఖైదు చేయబడియున్న యూదుల పేర | 3405 |
| 536 | ఖోష్ మేనమామ అయిన దాదరియూస్ మరణం, ఖోష్ అతడి స్థానంలో 'మావా', 'ఇరాన్' మరియు 'బబులోను' రాజు అవడం, అతడు యూదులకు స్వాతంత్ర్యాన్ని ప్రసాదించి యూదాకు వెనుదిరిగి వెళ్ళిపోయేందుకై అనుమతించడం | 3468 |

**(అథఃసూచికలు)**

391 ఒకవేళ 'మీజానుల్ హఖ్' రచయిత వ్యాఖ్యను పరిగణనలోకి తీసుకున్నట్లయితే 64 సంవత్సరాలవుతుంది. ఎందుకంటే 599 లో నుంచి 536 సంవత్సరాలను తీసివేసినట్లయితే 63 సంవత్సరాలు మిగులుతాయి. ఒకవేళ 600 లో నుంచి 536 సంవత్సరాలను తీసివేసినట్లయితే 64 సంవత్సరాలు మిగులుతాయి.

392 అన్ని ప్రతుల్లోనూ ఈ విధంగానే ఉంది. అయితే ఇది ఉపదేశపూర్వకంగా తప్పు. క్రీ.శ. 1852 సరియైనది.



2. రెండవ తప్పు ఏమిటంటే మూడు పర్యాయాలు దేశబహిష్కరణకు సంబంధించిన సంఘటనలలో ఖైదీల సంఖ్య నాలుగువేల ఆరువందలు (4600) అని పేర్కొనబడింది. అయితే 'రాజులు రెండవ గ్రంథము' యొక్క 24 వ అధ్యాయపు 14 వ వాక్యంలో పదివేలమంది అధిపతులు మరియు పరాక్రమశాలులు ఒకే దేశబహిష్కరణ సంఘటనలో చేరియున్నారని పేర్కొనబడింది. వారు కాకుండా కంసాలివారు, కమ్మరివారు విడిగా [393] ఉన్నారు.

3. మూడవ తప్పు ఏమిటంటే దీనినిబట్టి మూడవ దేశబహిష్కరణ[394] సంఘటన నెబుకద్రెజరు పట్టాభిషిక్తుడయిన 23 వ సంవత్సరంలో జరిగిందని విదితమవుతుంది. వాస్తవానికి రాజులు రెండవ గ్రంథంలోని 25 వ అధ్యాయం ద్వారా నెబుకద్రెజరు పట్టాభిషిక్తుడయిన 19 వ సంవత్సరంలో ఆ సంఘటన జరిగిందని విదితమవుతుంది.[395]

# నెబుకద్నెజరు ద్వారా తూరు పట్టణ వినాశనానికి సంబంధించిన తప్పుడు భవిష్యద్వాణి

# 29వ తప్పు

యెహెజ్కేలు గ్రంథము యొక్క 26 వ అధ్యాయంలోని మొదటి వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది: **" మరియు పదకొండవ సంవత్సరము నెల మొదటి దినమున యెహోవా వాక్కు నాకు ప్రత్యక్షమై యీలాగు సెలవిచ్చెను "**

**(అథఃసూచికలు)**

393 **" అదియుగాక అతడు దేశపు జనులలో అతిబీదలైనవారు తప్ప మరి ఎవరును లేకుండ యెరూషలేము పట్టణమంతటిలోనున్న అధిపతులను పరాక్రమశాలులను పదివేలమందిని, వీరు గాక కంసాలివారిని కమ్మరివారిని చెరతీసికొని పోయెను "**

('రాజులు రెండవ గ్రంథము', 24 : 14)

394 అనగా **నెబూజరదాను** కు సంబంధించినది.

395 **" మరియు బబులోను రాజైన నెబుకద్నెజరు ఏలుబడిలో పందొమ్మిదవ సంవత్సరమందు అయిదవ నెల యేడవ దినమున ...." (చివరి వరకు)** ('రాజులు రెండవ గ్రంథము', 25 : 8)

ఆ తర్వాత 7 వ వాక్యం నుంచి 12 వ వాక్యం వరకు ఈ విధంగా పేర్కొనబడింది:

**“ ప్రభువైన యెహోవా సెలవిచ్చునదేమనగా - రారాజగు బబులోను రాజైన నెబుకద్రెజరును నేను తూరు పట్టణము మీదికి [396] రప్పించుచున్నాను, అతడు గుఱ్ఱములతోను రథములతోను రౌతులతోను గుంపులు గుంపులుగానున్న సైన్యముతోను ఉత్తర దిక్కు నుండి వచ్చి బయటి పొలములోని నీ కుమార్తెలను ఖడ్గముతో చంపి, నీ కెదురుగా బురుజులు కట్టించి దిబ్బ వేయించి నీ కెదురుగా డాలునెత్తును. మరియు అతడు నీ ప్రాకారములను పడగొట్టుటకై యంత్రములు సంధించి గొడ్డండ్రతో నీ కోటలను పడగొట్టును. (అతనికి గుఱ్ఱములు బహు విస్తారముగా ఉన్నవి, అవి ధూళి యెగరగొట్టగా అది నిన్ను కమ్మును, బీటసందులు గల పట్టణములోనికి సైనికులు చొరబడినట్లు అతడు నీ కోటలలో ప్రవేశించునప్పుడు రౌతుల యొక్కయు చక్రముల యొక్కయు రథముల యొక్కయు ధ్వనిచేత నీ ప్రాకారములు కంపించును. అతడు తన గుఱ్ఱముల డెక్కల చేత [397] ) నీ వీధులన్నియు అణగద్రొక్కించును, నీ జనులను ఖడ్గముతో హతము చేయును, నీ ప్రభావమునకు చిహ్నములైన స్తంభములు నేలను కూలును. వారు నీ ఐశ్వర్యమును దోచుకుందురు, నీ వర్తకమును అపహరింతురు, నీ ప్రాకారములను పడగొట్టుదురు, నీ విలాస మందిరములను పాడు చేయుదురు, నీ రాళ్ళను నీ కలపను నీ మంటిని నీళ్ళలో ముంచివేయుదురు. ”**

ఇది ఖచ్చితంగే తప్పు. ఎందుకంటే నెబుకద్రెజరు తూరు పట్టణాన్ని ముట్టడించడాన్ని పదమూడు సంవత్సరాల పాటు కొనసాగించాడు. దానిపై విజయం సాధించేందుకై తీవ్రమైన స్థాయిలో కృషి చేశాడు. అయినప్పటికీ దానిపై అతడు విజయం సాధించలేకపోయాడు. అపజయంతోనే అతడు వెనుదిరిగాడు. [398] ఈ సంఘటన అసలు తప్పుడు సంఘటన అయిన కారణంగా (అల్లాహ్ క్షమించుగాక) హజ్రత్ హిజ్ఖీల్ (అ) (యెహెజ్కేలు) గారికి తమ సంజాయిషీ ఇచ్చుకోవలసిన ఆవశ్యకత ఏర్పడింది. యెహెజ్కేలు గ్రంథము యొక్క 29 వ అధ్యాయంలో

**(అథఃసూచికలు)**

[396] ‘తూరు పట్టణము’ (Tyre) అనేది ప్రాచీన అజ్మినకు చెందిన, సముద్ర తీరంలో వెలసిన ఒకానొక పట్టణం. అది సూరియా సరిహద్దుల్లో ఉండేది. సముద్ర తీరాన ఉండే కారణంగా అది రక్షణపరంగా ఎంతో పటిష్ఠంగా ఉండేది. నేటికాలంలో ఆ ప్రాంతం లెబనాన్ లో ఉంది.

[397] కుండలీకరణాల (బ్రాకెట్ల) మధ్యలో ఉన్న వాక్యాలు పాఠకులచే చదవబడుతున్న ఈ గ్రంథం యొక్క మూలప్రతిలో పేర్కొనబడలేదు.



ఆయన ఈ విధంగా పేర్కొన్నారు:

**“ ఇరువదియేడవ సంవత్సరము మొదటి నెల మొదటి దినమున యెహోవా వాక్కు నాకు ప్రత్యక్షమై యీలాగు సెలవిచ్చెను. నరపుత్రుడా, తూరు పట్టణము మీద బబులోను రాజైన నెబుకద్రెజరు తన సైన్యము చేత బహు ఆయాసకరమైన పని చేయించెను, వారందరి తలలు బోడివాయెను, అందరి భుజములు కొట్టుకొనిపోయెను; అయినను తూరుపట్టణము మీద అతడు చేసిన కష్టమును బట్టి అతనికైనను, అతడి సైన్యమునకైనను కూలి యెంతమాత్రమును దొరకకపోయెను. కాబట్టి ప్రభువైన యెహోవా సెలవిచ్చునదేమనగా ఐగుప్తు దేశమును బబులోను రాజైన నెబుకద్రెజరునకు నేను అప్పగించుచున్నాను, అతడు దాని ఆస్తిని పట్టుకొని దాని సొమ్మును దోచుకొని కొల్లపెట్టును, అది అతని సైన్యమునకు జీతమగును. తూరు పట్టణము మీద అతడు చేసినది నా నిమిత్తమే చేసెను గనుక అందుకు బహుమానముగా దానిని అప్పగించుచున్నాను; ఇదే యెహోవా వాక్కు.”** (యెహెజ్కేలు గ్రంథము, 29 వ అధ్యాయంలో 17 వ వాక్యం నుంచి 20 వ వాక్యం వరకు)

ఇందులో ఉన్న వివరణ ఏమిటంటే నెబుకద్రెజరుకు, అతడి సైన్యానికి తూరు పట్టణాన్ని ముట్టడించే మార్గమేదీ కనిపించని కారణంగా దేవుడు అతడికి ఈజిప్టు (ఐగుప్తు) ను స్వాధీనపరుస్తానని వాగ్దానం చేశాడు. ఆ వాగ్దానం కూడా మునుపటి వాగ్దానాల వంటిదో లేక నెరవేర్చబడిన వాగ్దానమో [399] తెలియదు. ఇది ఎంతో శోచనీయమైన విషయం. దేవుని వాగ్దానాలు ఈ విధంగా ఉంటాయా? దేవుడు కూడా తన వాగ్దానాలను నెరవేర్చలేని స్థితికి లోనవుతాడా?

**(అథఃసూచికలు)**

[398] ‘క్రీస్తుపూర్వం ఆరవ శతాబ్దంలో’ చూడండి : బ్రిటానికా ఎన్‌సైక్లోపేడియా, సంపుటి: 22, పేజీ: 653, ‘తూరు పట్టణము’ (Tyre) అనే వ్యాసం.

[399] బహుశా ఈ వాగ్దానం కూడా నెరవేర్చబడలేదు. ఎందుకంటే నెబుకద్రెజరు జీవిత విశేషాలను పరిశీలించినట్లయితే క్రీస్తుపూర్వం 605 లో అతడు ఈజిప్టు మీదికి దండెత్తినట్లుగానయితే తెలుస్తుంది. అయితే తూరు పట్టణం మీద అతడు దాడి చేసిన తర్వాత అతడు యెరూషలేము మీదికి దండెత్తడానికి సంబంధించి ప్రస్తావించిన తర్వాత చరిత్ర గ్రంథాలు అతడు ఈజిప్టు మీదికి దండెత్తడం గురించి ప్రస్తావించకుండానే మిన్నకుండిపోతాయి.

# మరొక తప్పుడు భవిష్యద్వాణి 30 వ తప్పు

క్రీ.శ. 1839 లో ప్రచురించబడిన ఫార్శీ బైబిల్ అనువాద గ్రంథంలో 'దానియేలు' గ్రంథము యొక్క 8 వ అధ్యాయపు 13 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**అనువాదము: " అప్పుడు [400] పరిశుద్ధులలో ఒకడు మాటలాడగా వింటిని; అంతలో మాటలాడుచున్న ఆ పరిశుద్ధునితో మరియొక పరిశుద్ధుడు ఈ విధముగా ప్రశ్నించెను: అనుదిన బలిని గూర్చియు, అతిక్రమము జరిగినందున సంభవించు వినాశనమునకు సంబంధించిన, అనగా ఆలయ స్థానమును, జనసమూహమును కాళ్ళ క్రింద త్రొక్కబడడానికి సంబంధించిన యీ దర్శనము నెరవేరుటకు ఎన్నాళ్ళు పట్టును? అందుకతడు రెండు వేల మూడు వందల దినముల వరకు యని, ఆ తరువాత ఆలయము పరిశుద్ధపరచబడునని నాతో చెప్పెను "**

క్రీ.శ. 1844 లో ప్రచురించబడిన అరబీ బైబిల్ అనువాద గ్రంథంలో 'దానియేలు' గ్రంథము యొక్క 8 వ అధ్యాయపు 13 వ వాక్యం ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**అనువాదము: " అప్పుడు పరిశుద్ధులలో ఒకడు నేను ఎరుగని మరియొక పరిశుద్ధునితో మాటలాడుచున్న సందర్భములో నేను ఈ విధముగా వింటిని; ఏమనగా, దర్శనము మరియు అనుదిన బలి, నాశనకరమైన పాపము వలన ఈ ఆలయస్థానమును దళమును నశింపబడుట అనేవి ఎప్పటివరకు కొనసాగును? 'రెండువేల మూడు వందల దినముల వరకు. ఆ తరువాత ఆలయము బహిర్గతమయిపోవును' అని అతడు సమాధానమిచ్చెను "**

యూదు మరియు క్రైస్తవ పండితులందరూ ఈ భవిష్యద్వాణి యొక్క నెరవేర్పు గురించి ఎంతగానో ఆందోళన చెందుతున్నారు. ఇరువర్గాలకు చెందిన బైబిల్ వ్యాఖ్యాతలందరూ ఈ భవిష్యద్వాణి నెరవేర్పుకు సంబంధించిన సంఘటన రోమ్ రాజయిన ఇంతియోకస్ క్రీ.పూ.161 లో యెరూషలేము మీదికి దండెత్తడానికి సంబంధించినదేననే అభిప్రాయానికే అధిక

**(అధఃసూచికలు)**

[400] ఇది క్రీ.శ. 1839 లో ప్రచురించబడిన ఫార్శీ బైబిల్ అనువాద గ్రంథంలో 'దానియేలు' గ్రంథము యొక్క 8 వ అధ్యాయపు 13 వ వాక్యానికి తెలుగు అనువాద వాక్యము. అయితే బైబిల్ తెలుగు అనువాద గ్రంథములో ఈ వాక్యము కొంచెం వేరుగా ఉంటుంది. అయితే అరబీ అనువాదపు వాక్యం ఏదయితే ఉన్నదో అది మేము స్వయంగా అనువదించిన వాక్యము. (హజ్రత్ మౌలానా ముహమ్మద్ తఖీ ఉస్మాన్ సాహెబ్)



ప్రాధాన్యతనిచ్చారు. అలాగే 'దినములు' అంటే నేటి సూర్యమాన కేలండర్ ప్రకారపు దినములేనని వారు అభిప్రాయపడ్డారు. 'యూసీఫస్' అనే వ్యాఖ్యాత సైతం ఈ అభిప్రాయాన్నే స్వీకరించారు.

అయితే ఇక్క ఒక పెద్ద అభ్యంతరం ఉత్పన్నమవుతుంది. అదేమిటంటే ఆలయము మరియు దళములు నశింపబడడానికి సంబంధించిన సంఘటన మూడున్నర సంవత్సరముల వరకు కొనసాగింది. దానికి సంబంధించిన వివరణను యూసీఫస్ తన చరిత్ర గ్రంథం యొక్క 5 వ సంపుటిలోని 9 వ అధ్యాయంలో అందజేశారు. వాస్తవానికి సూర్యమాన కేలండర్ ప్రకారం 2300 దినములు దాదాపుగా 6 సంవత్సరముల మూడు నెలల 19 దినములకు సమానమవుతాయి. ఈ కారణంగానే ఇస్హాఖ్ న్యూటన్ ఈ భవిష్యద్వాణి నెరవేర్పు ఇంతియోకస్ దాడికి సంబంధించిన సంఘటన అనే విషయాన్ని నిరాకరించారు.

థామస్ న్యూటన్ బైబిల్ లో పేర్కొనబడిన భవిష్యద్వాణులకు సంబంధించి ఒక వ్యాఖ్యాన గ్రంథాన్ని వ్రాశారు. ఆ గ్రంథం యొక్క క్రీ.శ. 1803 లో లండన్ నుంచి ప్రచురితమైన ప్రతి యొక్క మొదటి సంపుటిలో తొలుత బైబిల్ వ్యాఖ్యాతలందరి అభిప్రాయాలను ఉల్లేఖించిన తర్వాత ఇస్హాఖ్ న్యూటన్ వలెనే ఈ విషయాన్ని నిరాకరిస్తూ (అనగా ఈ భవిష్యద్వాణి ఇంతియోకస్ దాడికి సంబంధించిన సంఘటన అనే విషయాన్ని) ఈ విధంగా పేర్కొన్నారు : " ఈ భవిష్యద్వాణిలో పేర్కొనబడిన దాడికి సంబంధించిన సంఘటన ఇంతియోకస్ దాడికి సంబంధించిన సంఘటన ఎంతమాత్రం కాజాలదు" ఆ తర్వాత ఆయన ఈ భవిష్యద్వాణి నెరవేర్పు రోమన్ చక్రవర్తులతోనూ, పోప్‌లతోనూ సంబంధాన్ని కలిగియున్నదనే తన వాదాన్ని పొందుపరిచారు.

సనల్ జాన్సీ కూడా జరగబోయే సంఘటనలకు సంబంధించిన భవిష్యద్వాణులకు సంబంధించి ఒక వ్యాఖ్యాన గ్రంథాన్ని వ్రాశారు. ఆయన 'నేను ఇందులో యాభై వ్యాఖ్యాన గ్రంథాల సారాంశాన్ని ఇమిడ్చి సమర్పించాను'' అని ప్రకటించారు. ఆ వ్యాఖ్యాన గ్రంథం క్రీ.శ. 1838 లో ప్రచురించబడింది. ప్రస్తుతం చర్చించబడుతున్న భవిష్యద్వాణి గురించి వ్యాఖ్యానిస్తూ ఆయన ఈ విధంగా పేర్కొన్నారు: [401]

" ఈ భవిష్యద్వాణి ప్రారంభకాలాన్ని నిర్ణయించే విషయంలో ప్రాచీన కాలానికి చెందిన క్రైస్తవ పండితులు ఎంతో సందిగ్ధతకు లోనయ్యారు. ఇరాన్ రాజులకు చెందిన నాలుగు శాసనములు వెలువడిన నాలుగు కాలాలలో ఏదో ఒక కాలం ఈ భవిష్యద్వాణి ప్రారంభకాలం తప్పకుండా అయి ఉంటుందనే అభిప్రాయానికి ఎక్కువమంది పండితులు అధిక ప్రాధాన్యతనిచ్చారు.

నెం. 1. క్రీస్తుపూర్వం 636 నాటి కాలం. ఆ కాలంలో కోరెషు రాజు యొక్క శాసనం వెలువడింది.

నెం. 2. క్రీస్తుపూర్వం 518 నాటి కాలం. ఆ కాలంలో దారా రాజు యొక్క శాసనం వెలువడింది.

నెం. 3. క్రీస్తుపూర్వం 458 నాటి కాలం. ఆ కాలంలో అర్దషీర్ తాను పట్టాభిషిక్తుడయిన ఏడవ సంవత్సరంలో దైవప్రవక్త హజ్రత్ ఉజ్జా (అ) పేర ఒక శాసనాన్ని వెలువరించాడు.

నెం. 4. క్రీస్తుపూర్వం 444 నాటి కాలం. ఆ కాలంలో అర్దషీర్ తాను పట్టాభిషిక్తుడయిన ఇరవయ్యవ సంవత్సరంలో నెహెమ్యా పేర ఒక శాసనాన్ని వెలువరించాడు.

ఇక 'దినములు' అంటే 'సంవత్సరములు' అని భావం. ఈ విధంగా ఈ భవిష్యద్వాణి ముగిసే కాలం క్రింద పేర్కొనబడిన వివరణ ప్రకారం ఉంటుంది:

| | |
|---|---|
| నెం. 1 ప్రకారం క్రీ.శ. 1764. | నెం. 2 ప్రకారం క్రీ.శ. 1782 |
| నెం. 3 ప్రకారం క్రీ.శ. 1843 | నెం. 4 ప్రకారం క్రీ.శ. 1856 |

ఈ వివరణ ప్రకారం మొదటి మరియు రెండవ కాలాలు ముగిసిపోయాయి. మూడవ మరియు నాల్గవ కాలాలు ఇంకా మిగిలియున్నాయి (సనల్ జాన్సీ ఈ వివరణను తన గ్రంథంలో అందించే కాలానికి పైన పేర్కొనబడిన మూడవ, నాల్గవ కాలాలు ఇంకా ఉనికిలోకి రాలేదు). మూడవ కాలం నిశ్చితమనే అభిప్రాయం బలంగా ఉంది. నా దృష్టిలో అయితే అది నిశ్చితమే. అయితే కొందరు పండితుల దృష్టిలో అది రోమన్ చక్రవర్తి ఆసియా మీద దాడి చేసే సంఘటన నుంచి ప్రారంభమవుతుంది. ఈ అభిప్రాయం రీత్యా ఈ భవిష్యద్వాణి ముగింపు కాలానికి చెందిన సంవత్సరం క్రీ.శ. 1966 గా తేలుతుంది.

అయితే ఈ వ్యాఖ్య పలు కారణాల రీత్యా తప్పయినది.

**(అథఃసూచికలు)**

401 మున్ముందు రాబోతున్న సనల్ జాన్సీ వ్యాఖ్య యొక్క సారాంశం నేను అర్థం చేసుకున్నదాని ప్రకారం ఇది : ఆయన దృష్టిలో దానియేలు గ్రంథంలోని పైన పేర్కొనబడిన భవిష్యద్వాణిలో క్రీస్తు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) రెండవ రాకడకు సంబంధించిన సమయం పేర్కొనబడి ఉంది. ఈ విషయం గురించి ఆయన ఈ విధంగా వ్యాఖ్యానించాడు: " రెండువేల మూడువందల దినములు అంటే రెండువేల మూడువందల సంవత్సరాలని భావం. వాటిని యూదుల అధీనంలో నుంచి యెరూషలేము తొలగిపోయిన ఏదో ఒక కాలం ద్వారా గణించాలి." దీనికొరకు ఆయన ఐదు సంభావ్యతలను పేర్కొన్నారు. అలాగే వాటి ద్వారా ఆయన క్రీస్తు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) భూమి మీదికి రెండవ మారు అరుదెంచే కాలాన్ని వెలికితీశారు. ((హజ్రత్ మౌలానా ముహమ్మద్ తఖీ ఉస్మాన్ సాహెబ్)



**1)** ఈ భవిష్యద్వాణి ప్రారంభ కాలాన్ని నిర్ణయించడం ఎంతో కష్టమని పేర్కొనడం పూర్తిగా తప్పు. ఎందుకంటే దాని ప్రారంభం నిశ్చయంగా స్పష్టం దర్శించిన సమయం అవుతుందే తప్ప తరువాతి సమయాలు కావు.

**2)** ఇక 'దినములు' అంటే 'సంవత్సరములు' అని భావం అని పేర్కొనడం మొండివాదనే అవుతుంది. ఎందుకంటే 'దినములు' అనే పదానికి నిజమైన అర్థం అందరికీ సుపరిచితమైన, ప్రసిద్ధమైన అర్థమే. బైబిల్ పాతనిబంధన గ్రంథంలోనూ, క్రొత్త నిబంధన గ్రంథంలోనూ ఎక్కడెక్కడయితే 'దినములు' అని పేర్కొనబడిందో అది దాని వాస్తవిక అర్థంలోనే ఉపయోగించబడి పేర్కొనబడింది. బైబిల్ లో ఏయే ప్రదేశాలలోనయితే ఏదయినా విషయపు కాలపరిమితి గురించి తెలిపేందుకై 'దినములు' అనే పదం ఉపయోగించబడిందో అక్కడ అది 'సంవత్సరములు' అనే అర్థంలో ఎంతమాత్రం ఉపయోగించబడలేదు. ఒకవేళ బైబిల్ లో మరెక్కడయినా అరుదయిన రీతిలో 'దినములు' అనే పదం 'సంవత్సరములు' అనే అర్థంలో ఉపయోగించబడిందని మనం అంగీకరించినప్పటికీ నిశ్చయంగా ఆ ప్రయోగం ఔపచారికమైనదే అవుతుంది. అందుకై ఏదయినా దృష్టాంతం ఉండవలసిన ఆవశ్యకత ఉంది. ఈ భవిష్యద్వాణి పేర్కొనబడిన చోట 'దినములు' అనే పదం కాలపరిమితిని సూచించేందుకు మాత్రమే ఉపయోగించబడింది. ఔపచారిక అర్థానికి సంబంధించిన దృష్టాంతమేదీ ఇక్కడ లేదు. కనుక ఇక్కడ ఔపచారిక అర్థం సూచించబడిందని ఎలా అంచనాకు రాగలము? అందుకే బైబిల్ పండితులందరూ ఇక్కడ నిజమైన అర్థంలోనే ఈ పదం ఉపయోగించబడిందని తీర్మానించారు. దీనిని సరియైనదిగా మలిచేందుకై ఎటువంటి తప్పుడు వివరణలు అందజేయబడ్డాయంటే వాటిని తిరస్కరించవలసిన, రద్దు చేయవలసిన ఆవశ్యకత ఇన్హాఖ్ న్యూటన్, థామస్ న్యూటన్ మరియు ఆఖరి కాలానికి చెందిన ఇతర పండితులందరికీ (వారిలో ఈ వ్యాఖ్యాత కూడా చేరియున్నారు) ఏర్పడింది.

**3)** ఒకవేళ మనం ఇక్కడ పేర్కొనబడిన రెండు అభ్యంతరాలను పక్కనబెట్టినప్పటికీ మొదటి మరియు రెండవ నెంబర్లలో పేర్కొనబడిన భవిష్యద్వాణి ప్రారంభకాలాలు తప్పయినవిగా అసత్యమయినవిగా స్వయంగా ఆయన (సనల్ జాన్సీ) జీవితకాలంలోనే ఋజువయ్యాయి. ఈ విషయాన్ని స్వయంగే ఆయనే అంగీకరించారు కూడా. ఇక మూడవ నెంబర్‌లో పేర్కొనబడిన కాలం కూడా తప్పయినదిగా, అసత్యమయినదిగా నేడు ఋజువయింది. అయితే మూడవ నెంబర్‌లో పేర్కొనబడిన కాలమే భవిష్యద్వాణి యొక్క ప్రారంభకాలమనే విషయం పట్ల ఆయన ప్రగాఢ విశ్వాసాన్ని కలిగియుండేవారు. అదేవిధంగా నాల్గవ నెంబర్‌లో పేర్కొనబడిన కాలం విషయానికొస్తే అది కూడా తప్పయినదిగా, అసత్యమయినదిగా ఋజువవడమనేది ప్రాచీన కాలానికి చెందిన పండితులందరి వివరణ కంటే మించినట్టిది. ఇక ఇప్పుడు కేవలం ఐదవ సంభావ్యత

మాత్రమే మిగిలిపోతుంది. [402] అయితే ఈ సంభావ్యతకు సంబంధించిన అభిప్రాయం లేదా వివరణ స్వయంగా ఎంతోమంది పండితుల దృష్టిలో బలహీనమైనది. ఈ సంభావ్యత విషయంలోనూ ఇంతకుముందు పేర్కొనబడిన రెండు రకాల అభ్యంతరాలు వర్తిస్తాయి. ఆ కారణంగా అది సైతం అవిశ్వసనీయమైనదిగా తెలుతుంది. దైవం తలిస్తే ఈ ఐదవ సంభావ్యత (అనగా భవిష్యద్వాణి ప్రారంభకాలం క్రీ.శ. 1966 అనే సంభావ్యత) కాలంలో జీవించియుండేవారు అది కూడా తప్పనే, అసత్యమనే విషయాన్ని తెలుసుకుంటారు.

ఇక ఆ తర్వాత పాస్టర్ యూసుఫ్ గారు రంగప్రవేశం చేశారు. ఆయన క్రీ.శ. 1833 లో, అనగా హిజ్రీశకం 1248 లో లక్నో నగరంలో ఈ భవిష్యద్వాణి మరియు తన అసత్య దర్శనం ద్వారా వాదించనారంభించారు. ఆయన ఈ విధంగా తమ వాదనను వినిపించారు: " ఈ భవిష్యద్వాణి నెరవేర్పు దైవప్రవక్త హజ్రత్ దానియాల్ (అ) (దానియేలు) గారి మరణం నుంచి మొదలవుతుంది. ఇక 'దినములు' అంటే 'సంవత్సరములు' అని భావం. దైవప్రవక్త హజ్రత్ దానియాల్ (అ) (దానియేలు) గారి మరణం క్రీస్తుపూర్వం 453 లో సంభవించింది. మనం 2300 లో నుంచి ఈ కాలాన్ని తీసివేసినట్లయితే 1847 మిగులుతాయి. ఆ విధంగా క్రీస్తు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) యొక్క రెండవ రాకడ కాలం క్రీ.శ. 1847 అవుతుంది. ఆ పాస్టర్‌కు, కొంతమంది ఇస్లామీయ పండితులకు నడుమ సంవాదం కూడా జరిగింది. ఏదిఏమయినప్పటికీ ఆయన వాదన కొన్ని కారణాల రీత్యా తప్పయినది, అసత్యమయినది. అయితే ఆ వాదం అసత్యమయినదిగా, తప్పయినదిగా ఋజువయిపోయింది కూడా. ఎందుకంటే క్రీ.శ. 1847 వ సంవత్సరం తర్వాత 17 సంవత్సరాలు గడచిపోయినప్పటికీ (పాఠకులచే ప్రస్తుతం చదవబడుతున్న ఈ గ్రంథం రచనాకాలం నాటికి) ఇంకా దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (క్రీస్తు)

**(అథఃసూచికలు)**

[402] అనగా క్రీ.శ. 1966 వ సంవత్సరమే ఈ భవిష్యద్వాణి యొక్క ప్రారంభకాలం అనే విషయం. యాదృచ్ఛికంగా పాఠకులచే ప్రస్తుతం చదువబడుతున్న 'సత్యప్రకటన' అనే ఈ తెలుగు గ్రంథానికి మూలగ్రంథమయిన 'ఇజ్‌హారుల్ హఖ్' అనే అరబీ గ్రంథం యొక్క ఉర్దూ అనువాద ప్రతి క్రీ.శ. 1966 లో ప్రచురించబడింది. అయితే ఇప్పటివరకు దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (క్రీస్తు) రెండవ రాకడ సంభవించలేదు. కనుక ఈ ఐదవ సంభావ్యత కూడా పాఠకులచే ప్రస్తుతం చదువబడుతున్న గ్రంథం యొక్క మూల రచయిత యొక్క అంచనా ప్రకారం కేవలం ఒక అర్థరహితమైన విషయంగా ఋజువయింది. (హజ్రత్ మౌలానా ముహమ్మద్ తఖీ ఉస్మాన్ సాహెబ్)



రెండవ రాకడ సంభవించలేదు. కనుక ఈ వాదం తప్పని పేర్కొంటూ మరింతగా వివరణను అందజేస్తూ విషయాన్ని అకారణంగా మరింతగా పొడిగించనవసరం లేదు. బహుశా పాస్టర్ యూసుఫ్ గారికి ద్రాక్ష మద్యం మత్తులో ఆ విధంగా కనిపించి ఉంటుంది. దానినే ఆయన దివ్యదర్శనంగా ప్రకటించివేశారు.

డి.ఐలీ మరియు రిచర్డ్ మేంట్ యొక్క వ్యాఖ్యాన గ్రంథంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది: " ఈ భవిష్యద్వాణి యొక్క ప్రారంభకాలాన్ని మరియు ముగింపు కాలాన్ని నెరవేర్పుకు ముందే నిర్ణయించడమనేది ఎంతో కష్టసాధ్యమయినది. ఈ భవిష్యద్వాణి నెరవేరినప్పుడు తత్సంబంధిత సంఘటలే దానికి సంబంధించిన వివరణను అందజేస్తాయి"

ఈ వివరణ ఎంతో బలహీనమైనది, హాస్యాస్పదమైనది. ఒకవేళ ఈ వివరణ సైతం సముచితమైనదేనని ఒప్పుకునే పక్షంలో ప్రతి దుర్మార్గుడు లేదా పాపాత్ముడు సైతం ప్రారంభకాలాన్ని, ముగింపు కాలాన్ని పేర్కొనకుండా ఇటువంటి లెక్కలేనన్ని భవిష్యద్వాణులను పేర్కొని అవి నెరవేరినప్పుడే తత్సంబంధిత సంఘటనలు అందుకు వివరణలను అందజేస్తూ వాటిని ఋజువు చేస్తాయని ప్రకటించే హక్కును కలిగియుంటాడు.

న్యాయవంతమైన విషయమేమిటంటే వీరు (అనగా ఈ భవిష్యద్వాణి నెరవేర్పు గురించి వ్యాఖ్యానించినవారందరూ) పాపం బొత్తిగా బలహీనులు. ఎందుకంటే ఈ భవిష్యద్వాణి నెరవేర్పుకు సంబంధించిన విషయం అసలు మూలం రీత్యానే తప్పయినది. అయితే దాని గురించి వ్యాఖ్యానించే ప్రతి వ్యాఖ్యాతా దాని విషయంలో ఎంతగానో ఊహాత్మక వివరణలను అందజేస్తూపోవడం జరిగింది. దేనినయితే కాలమే చెడగొట్టివేసిందో దానిని సౌగంధికుడు సైతం ఏవిధంగా సంస్కరించగలడు?

## 31 వ తప్పు

బైబిల్ పాతనిబంధన గ్రంథంలోని 'దానియేలు' గ్రంథము యొక్క 12 వ అధ్యాయపు 11 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" అనుదిన బలి నిలుపు చేయబడిన కాలము మొదలుకొని నాశనము కలుగజేయు హేయమైనదానిని నిలువ బెట్టువరకు వెయ్యిన్ని రెండువందల తొంబది దినములగును. వెయ్యిన్ని మూడువందల ముప్పదియైదు [403] దినములు తాళుకొని కనిపెట్టుకొనువాడు ధన్యుడు."**

ఇది కూడా ఇంతకుముందు పేర్కొనబడిన భవిష్యద్వాణుల వలె తప్పయినది, అసత్యమయినది. ఈ కాలపరిమితిలో క్రైస్తవులు ఎదురుచూసిన క్రీస్తూ ప్రభవించలేదు, యూదులు ఎదురుచూసిన క్రీస్తూ (మెస్సయ్యా) ప్రభవించలేదు.

# దానియేలు గ్రంథంలోని మరొక తప్పుడు భవిష్యద్వాణి

## 32 వ తప్పు

బైబిల్ పాతనిబంధన గ్రంథంలోని 'దానియేలు' గ్రంథము యొక్క 9 వ అధ్యాయపు 24 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" తిరుగుబాటును మాన్పుటకును, పాపమును నివారణ చేయుటకును, దోషము నిమిత్తము ప్రాయశ్చిత్తము చేయుటకును, యుగాంతము వరకుండునట్టి నీతిని బయలుపరచుటకును, దర్శనమును ప్రవచనమును ముద్రించుటకును, అతి పరిశుద్ధ స్థలమును అభిషేకించుటకును [404], నీ జనమునకును పరిశుద్ధ పట్టణమునకును డెబ్బది వారములు విధింపబడెను."**

క్రీ.శ. 1839 లో ప్రచురించబడిన ఫార్సీ బైబిల్ అనువాద గ్రంథంలో ఈ వాక్యం ఈ విధంగా అనువదించబడి ఉంది:

**అనువాదము: " నీ జాతి ప్రజల కొరకు మరియు పరిశుద్ధ పట్టణము కొరకు డెబ్బది వారములు నిర్ణయించబడినవి, దుష్కార్యములు అంతరించుటకు, పాపముల మన్నింపు కొరకు, అతిక్రమణల విషయములో పరిహారము చెల్లించుట కొరకు, అలాగే శాశ్వతమగు సత్యమును బయలుపరచుటకు, దర్శనములను, దైవదౌత్యమును అంతమొందించుటకు, అతి పరిశుద్ధ స్థలమును అభిషేకించుటకు"**

ఇది కూడా తప్పే. ఎందుకంటే ఈ నిర్ణీత కాలంలోనూ ఇద్దరు క్రీస్తులలో (వాస్తవానికి క్రీస్తు ఒకరే అయినప్పటికీ, క్రైస్తవులు ఎదురుచూసిన క్రీస్తును యూదులు అంగీకరించకుండా తాము ఎదురుచూస్తున్న క్రీస్తు మరొకరంటూ వాదించిన నేపథ్యంలో ఇక్కడ 'ఇద్దరు క్రీస్తులలో' అని పేర్కొనడం జరిగింది) ఒక్కరూ ప్రభవించడం జరగలేదు. ఇంకా చెప్పాలంటే యూదులు ఏ క్రీస్తు (మెస్సయ్యా) కొరకయితే ఎదురుచూశారో నేటికీ ఆ క్రీస్తు (మెస్సయ్యా) ప్రభవించలేదు

**(అథఃసూచికలు)**

403 బైబిల్ వ్యాఖ్యాతల దృష్టిలో ఇది క్రీస్తు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) యొక్క రెండవ రాకడకు సంబంధించిన శుభవార్త.

404 బైబిల్ వ్యాఖ్యాతల దృష్టిలో ఇది కూడా క్రీస్తు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) యొక్క రెండవ రాకడను సూచించే వాక్యమే.



(అనగా ప్రభవించలేదని యూదులు భావిస్తున్నారు). వాస్తవానికి ఈ నిర్ణీత కాలం నుంచి మొదలుకొని నేటికి రెండువేల సంవత్సరాల కంటే ఎక్కువ కాలమే గడిచింది. ఇక్కడ ఈ విషయానికి సంబంధించి క్రైస్తవ పండితుల తరపున పరిష్కరించబడినట్లుగా భావించబడి అందజేయబడిన వివరణలు కొన్ని కారణాల రీత్యా తిరస్కరించదగినవి.

**1)** 'దినము' అనే పదాన్ని కాలపరిమితి గురించి తెలియజేసే ఔపచారిక అర్థంలో గ్రహించడమనేది అందుకు ఎటువంటి దృష్టాంతమూ లేని కారణంగా స్వీకారయోగ్యం కాదు.

**2)** ఒకవేళ మనం ఈ భవిష్యద్వాణిలో 'డెబ్బది వారములు' అనే కాలసూచక పదానికి ఔపచారిక లేదా ఆలంకారిక అర్థమేదో ఉండి ఉంటుందని ఆమోదించినప్పటికీ ఇద్దరు క్రీస్తులలో ఏ ఒక్కరిపైనయినా ఈ భవిష్యద్వాణి సత్యమయినదిగా నిరూపితం కాజాలదు. ఎందుకంటే కోరెషు పట్టాభిషిక్తుడయిన మొదటి సంవత్సరానికి (ఆ సంవత్సరంలోనే యూదులకు స్వాతంత్ర్యం ప్రసాదించబడింది. ఈ విషయమే 'ఎజ్రా' గ్రంథం యొక్క మొదటి అధ్యాయంలో పేర్కొనబడి ఉంది), దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (క్రీస్తు) రాకడకు మధ్య గల కాలపరిమితి చరిత్రకారుడయిన యూసీఫస్ రచించిన చరిత్ర గ్రంథం ప్రకారం దాదాపుగా 600 సంవత్సరాలు. ఇక సనల్ జాన్సీ పరిశోధన ప్రకారమయితే 536 సంవత్సరాలు. ఈ విషయం '30 వ తప్పు' యొక్క వివరణ క్రింద పేర్కొనబడిన అంశం ద్వారా మనకు విదితమయింది. అదేవిధంగా క్రీ.శ. 1852 లో ప్రచురించబడిన 'మూర్షదుత్తాలిబీన్ ' అనే గ్రంథ రచయిత యొక్క పరిశోధన ప్రకారం కూడా ఈ విషయం విదితమయింది. (ఈ విషయం '26 వ తప్పు' యొక్క వివరణ క్రింద పేర్కొనబడిన అంశం ద్వారా మనకు విదితమయింది)

'మూర్షదుత్తాలిబీన్' గ్రంథ రచయిత రెండవ భాగం యొక్క 20 వ అధ్యాయంలో ఈ విధంగా పేర్కొన్నారు: " యూదులు ఖైదు నుంచి విడుదల చేయబడి తమ స్వస్థలానికి తిరిగి వెళ్ళిపోవడం, యూదుల ప్రధాన దేవాలయంలో బలుల ఆచారమును పునరుజ్జీవింపజేయడం అనే సంఘటనలు సైతం వారికి స్వాతంత్ర్యం లభించిన సంవత్సరమే, అనగా క్రీస్తుపూర్వం 536 లోనే సంభవించాయి. వాస్తవానికి 'డెబ్బది వారములు' అంటే కేవలం నాలుగు వందల తొంభై సంవత్సరాలు మాత్రమే అవుతాయి. అదేవిధంగా యూదులు ఎదురుచూస్తున్న క్రీస్తు (మెస్సయ్యా) కొరకు సైతం ఇది వర్తించడం లేదనే విషయం సుస్పష్టం.

**3)** మూడవ కారణమేమిటంటే ఒకవేళ ఈ భవిష్యద్వాణిని మనం నిజమైనదిగా అంగీకరించినట్లయితే క్రీస్తుపై (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) పై దైవదౌత్య (దైవప్రవక్త పదవి) పరంపర ముగిసిపోవడం తప్పనిసరి అవుతుంది. ఆ విధంగా క్రీస్తు యొక్క అపోస్తలులు ఎట్టి

పరిస్థితుల్లోనూ ప్రవక్తలుగా పరిగణించబడజాలరు. అయితే ఇది క్రైస్తవ మతానికి పూర్తిగా విరుద్ధమైన విషయం. ఎందుకంటే క్రైస్తవుల దృష్టిలో అపోస్తలులు దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) (మోషే) కంటే, అలాగే ఇశ్రాయేలీయులలో ప్రభవించిన ఇతర దైవప్రవక్తలందరికంటే శ్రేష్ఠులు. వారి శ్రేష్ఠత కొరకు ఇస్కరియోతు యూదా పరిస్థితిని పరిశీలించినట్లయితే సరిపోతుంది.[405] (ఇతడు పరిశుద్ధాత్మతో నిండియున్న మానవులలో ఒకడు)

**4)** నాల్గవ విషయమేమిటంటే ఒకవేళ మనం ఈ భవిష్యద్వాణి సరియైనదని, సత్యమయినదని ఆమోదించే పక్షంలో దర్శనముల పరంపర ముగిసిపోయిందని మనం అంగీకరించవలసి వస్తుంది. వాస్తవాని మంచి స్వప్నాలు దర్శించడమనేది నేటికీ కొనసాగుతోంది. కనుక దర్శనముల పరంపర ముగిసిపోవడమనేది అంగీకరింపబడని విషయం.

**5)** వాట్సన్ తన పుస్తకం యొక్క 3 వ సంపుటిలో డాక్టర్ క్రేబ్ యొక్క లేఖను పొందుపరిచారు. అందులో ఈ విధంగా వివరణ పేర్కొనబడి ఉంది:

" యూదులు ఈ భవిష్యద్వాణి విషయంలో ఎంతటి ప్రక్షిప్తానికి పాల్పడ్డారంటే దాని తర్వాత ఇక క్రీస్తు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) కు ఈ భవిష్యద్వాణి ఎంతమాత్రం వర్తించజాలదు"

ఇక్కడ గుర్తించవలసిన విషయమేమిటంటే క్రైస్తవులకు చెందిన ప్రసిద్ధ పండితుని ఒప్పుకోలు ద్వారా ప్రస్ఫుటమవుతున్న విషయమేమిటంటే ఈ భవిష్యద్వాణి నిజమైన దానియేలు గ్రంథం ప్రకారం (అనగా యూదులచే ప్రక్షిప్తానికి గురయినట్లుగా ఎన్నటికీ ఆరోపించబడని, యూదుల వద్ద నేటికీ సురక్షితంగా ఉన్న దానియేలు (గ్రంథం) క్రీస్తు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) కు ఎంతమాత్రం వర్తించదు. ప్రొటెస్టెంట్ వర్గానికి చెందిన పండితులు యూదులు అందులో ప్రక్షిప్తాలకు పాల్పడ్డారని వాదించడం తప్పు. కనుక మూల గ్రంథం సురక్షితంగా ఉనికిలో ఉన్నప్పుడు క్రైస్తవ పండితులు దాని అనువాద ప్రతుల ద్వారా తమ వాదనకు అనుగుణంగా వివరణలను అందజేస్తూ వాదించడమనేది పూర్తిగా అర్థరహితం, అసమంజసం.

**6)** ఇక 'క్రీస్తు' (అభిషిక్తుడు) అంటే ఇప్పటివరకు చర్చించిన ఇద్దరు క్రీస్తులే అవడం తప్పనిసరి

**(అథఃసూచికలు)**

[405] బైబిల్ ప్రకారం ఇస్కరియోతు యూదా క్రీస్తు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) యొక్క అపోస్తలులలో ఒకడయినప్పటికీ స్వయంగా క్రీస్తు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) ను పట్టించి ఇచ్చిన వ్యక్తి. (మత్తయి, 26 : 27)



ఏమీ కాదు. ఎందుకంటే ఈ పదం యూదులకు చెందిన ప్రతి రాజు కొరకు ఉపయోగించబడుతూ వచ్చింది, ఆ రాజు సజ్జనుడయినా, దుర్మార్గుడయినా. బైబిల్ పాతనిబంధన గ్రంథములోని 'కీర్తనల గ్రంథము' యొక్క 18 వ కీర్తన యొక్క 50 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" నీవు నియమించిన రాజునకు గొప్ప రక్షణ కలుగజేయువాడవు. అభిషేకించిన దావీదునకును అతని సంతానమునకును నిత్యము కనికరము చూపువాడవు"**

అదేవిధంగా 'కీర్తనల గ్రంథము' యొక్క 132 వ కీర్తనలో 'అభిషిక్తుడు' అనే పదం దైవప్రవక్త మరియు సజ్జనుడయిన రాజయిన హజ్రత్ దావూద్ (అ) (దావీదు) ను ఉద్దేశించి ఉపయోగించబడింది. అలాగే 'సమూయేలు మొదటి గ్రంథము' యొక్క 24 వ అధ్యాయంలో దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ) యొక్క వాక్కు యూదులకు చెందిన దుర్మార్గుడయిన రాజుగా ప్రసిద్ధి చెందిన 'సౌలు' [406] విషయంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" ఇతడు యెహోవా చేత అభిషేకము నొందినవాడు గనుక యెహోవా చేత అభిషిక్తుడైన నా ప్రభువునకు నేను ఈ కార్యము చేయను, యెహోవాను బట్టి అతని నేను చంపను అని తన జనులతో చెప్పెను."** ( 'సమూయేలు మొదటి గ్రంథము', 24 వ అధ్యాయం, 6 వ వాక్యము)

ఇంతేగాకుండా 'సమూయేలు మొదటి గ్రంథము' యొక్క 26 వ అధ్యాయంలోనూ, 'సమూయేలు రెండవ గ్రంథము' యొక్క మొదటి అధ్యాయంలోనూ 'అభిషిక్తుడు' అనే పదం సౌలు కొరకు ఉపయోగించబడడాన్ని మనం గమనించవచ్చు. అలాగే 'అభిషిక్తుడు' అనే పదం కేవలం యూదులకు చెందిన రాజుల కొరకు మాత్రమే పరిమితం కాలేదు. ఇతరుల కొరకు సైతం ఈ పదం ఉపయోగించబడుతూ వచ్చింది. బైబిల్ పాతనిబంధన గ్రంథములోని 'యెషయా

**(అథఃసూచికలు)**

[406] 'సౌలు'గా బైబిల్ లో పేర్కొనబడిన ఈ రాజు పేరు ఖుర్ఆన్‌లో 'తాలూత్' అని పేర్కొనబడింది. ఇశ్రాయేలీయుల రాజుగా అతడిని స్వయంగా ఎంపిక చేసాడనే విషయం పట్ల తౌరాతు గ్రంథం మరియు ఖుర్ఆన్ గ్రంథం ఏకీభవిస్తున్నాయి. ఆ విధంగా ఎంపిక చేయబడిన తరువాతి స్థితిగతుల గురించి ఖుర్ఆన్‌లో పేర్కొనబడలేదు. ఇక తౌరాతు గ్రంథం సౌలు యొక్క దురాగతాల గురించి పేర్కొన్నది. అలాగే అతడిని రాజుగా చేసి అల్లాహ్ పశ్చాత్తాపపడ్డాని (అల్లాహ్ క్షమించుగాక) పేర్కొనబడింది. ('సమూయేలు మొదటి గ్రంథము', 15 : 10-14)

గ్రంథము' యొక్క 45 వ అధ్యాయపు మొదటి వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**“ అతని పక్షమున జనములను జయించుటకు నేను అతని కుడిచేతిని పట్టుకొనియున్నాను. నేను రాజుల నడికట్లను విప్పెదను, ద్వారములు అతని యెదుట వేయబడకుండ తలుపులు తీసెదను. అని యెహోవా తాను అభిషేకించిన కోరెషును గురించి సెలవిచ్చుచున్నాడు ”**

ఈ వాక్యంలో 'అభిషిక్తుడు' (క్రీస్తు) అనే పదం ఇరాన్ రాజయిన కోరెషు కొరకు ఉపయోగించబడింది. కోరెషు యూదులకు ఖైదు నుంచి విడిపించి స్వాతంత్ర్యాన్ని ప్రసాదించాడు. అలాగే యూదులు తమ ప్రధాన దేవాలయమును (హైకల్‌ను) నిర్మించుకునేందుకై అనుమతిని ప్రసాదించాడు.

## ఇశ్రాయేలీయులను పరిరక్షించడానికి సంబంధించిన వాగ్దానం

## 33 వ తప్పు

బైబిల్ పాతనిబంధన గ్రంథంలోని 'సమూయేలు రెండవ గ్రంథము' యొక్క 7 వ అధ్యాయపు 10 వ వాక్యంలో హజ్రత్ నాతన్ (అ) (నాతాను) ద్వారా క్రింద పేర్కొనబడిన దేవుని వాగ్దానం వెలువరించబడింది:

**“ మరియు ఇశ్రాయేలీయులను నా జనులు ఇకను కదిలింపబడకుండ తమ స్వస్థలమందు నివసించునట్లు దానియందు వారిని నాటి, పూర్వము ఇశ్రాయేలీయులను నా జనుల మీద నేను న్యాయాధిపతులను నియమించిన తరువాత జరుగుచు వచ్చినట్లు దుర్బుద్ధి గల జనులు ఇకను వారిని కష్టపెట్టకయుండునట్లుగా చేసి నీ శత్రువుల మీద నీకు జయమిచ్చి నీకు నెమ్మది కలుగజేసియున్నాను ”** ('సమూయేలు రెండవ గ్రంథము', 7 వ అధ్యాయము, 10 వ మరియు 11 వ వాక్యాలు)

క్రీ.శ. 1838 లో ప్రచురించబడిన బైబిల్ ఫార్సీ అనువాద గ్రంథంలోనూ, క్రీ.శ. 1845 లో ప్రచురించబడిన బైబిల్ ఫార్సీ అనువాద గ్రంథంలోనూ ఇదే విధంగా పేర్కొనబడింది.

ఈ వాక్యాల ప్రకారం దేవుడు ఇశ్రాయేలీయులను శాంతితో అదే ప్రదేశంలో ఉండేలా చేస్తానని, దుర్బుద్ధి గల జనుల కారణంగా వారికి ఎటువంటి కష్టమూ కలుగకుండా చూస్తానని వాగ్దానం చేశాడు. ఇశ్రాయేలీయులు స్థిరపడిన ఆ ప్రదేశం యెరూషలేము. అయితే దేవుని ఆ వాగ్దానం వారి విషయంలో నెరవేరలేదు. పైగా ఆ ప్రదేశంలో వారు ఎంతగానో వేధించబడ్డారు. బబులోను రాజు మూడు పర్యాయాలు వారికి ఎంతగానో కష్టం కలుగజేశాడు, వారిని



సంహరించాడు, ఖైదు చేశాడు, దేశబహిష్కరణ శిక్షనూ విధించాడు. అదేవిధంగా ఇతర రాజులు కూడా వారికి కష్టం కలుగజేశారు. 'టైటస్' [407] అనే రోమన్ చక్రవర్తి అయితే వారికి కష్టం కలుగజేసే విషయంలో పరాకాష్ఠకు చేరుకున్నాడు. చివరకు అతడి దాడి కారణంగా పదిలక్షల మంది యూదులు సంహరించబడ్డారు, లక్షమంది హతమార్చబడ్డారు, ఉరిశిక్షకు గురయ్యారు, తొంభైతొమ్మిది వేలమంది ఖైదు చేయబడ్డారు. అలాగే వారి సంతతికి చెందినవారు నేటివరకు ప్రపంచవ్యాప్తంగా అప్రతిష్ఠపాలవుతూ హీనస్థాయిలో సంచరిస్తున్నారు.

## దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ) (దావీదు) సంతతిలో రాజ్యాధికారాన్ని నిలిపియుంచడానికి సంబంధించిన వాగ్దానం

## 34 వ తప్పు

బైబిల్ పాతనిబంధన గ్రంథంలోని 'సమూయేలు రెండవ గ్రంథము' యొక్క 7 వ అధ్యాయపు 12 వ వాక్యంలో హజ్రత్ నాతన్ (అ) (నాతాను) ద్వారా దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ) (దావీదు) కొరకు క్రింద పేర్కొనబడిన వాగ్దానం వెలువరించబడింది:

**“ నీ దినములు సంపూర్ణములగునప్పుడు నీవు నీ పితరులతో కూడ నిద్రించిన తరువాత నీ గర్భములో నుండి వచ్చిన నీ సంతతిని హెచ్చించి, రాజ్యమును అతనికి స్థిరపరచెదను. అతడు నా నామ ఘనత కొరకు ఒక మందిరమును కట్టించును; అతని రాజ్య సింహాసనమును నేను నిత్యముగా స్థిరపరచెదను; నేనతనికి తండ్రినై యుందును. అతడు నాకు కుమారుడై యుండును; అతడు పాపము చేసిన యెడల నరుల దండముతోను మనుష్యులకు తగులు దెబ్బలతోను అతని శిక్షింతును గాని నిన్ను స్థాపించుటకై నేను కొట్టి వేసిన సౌలునకు [408] నా కృప దూరమైనట్లు అతనికి నా కృప దూరము చేయను. నీ మట్టుకు నీ సంతానమును నీ రాజ్యమును నిత్యము స్థిరమగును. నీ సింహాసనము నిత్యము స్థిరపరచబడును అనెను”**

('సమూయేలు రెండవ గ్రంథము', 7 వ అధ్యాయము, 12 వ వాక్యం నుంచి 16 వ వాక్యం వరకు)

---

**(అధఃసూచికలు)**

[407] రోమన్ చక్రవర్తి అయిన టైటస్ (Titus) (క్రీ.శ. 40 నుంచి క్రీ.శ. 81 వరకు) క్రీ.శ. 70 సెప్టెంబర్ లో సుదీర్ఘకాలం పాటు యెరూషలేమును ముట్టడించిన తర్వాత దానిపై విజయం సాధించి తీవ్రస్థాయిలో వినాశనానికి పాల్పడ్డాడు, యూదులను ఊచకోత కోసాడు.

అంతేగాకుండా బైబిల్ పాతనిబంధన గ్రంథంలోని 'దినవృత్తాంతములు మొదటి గ్రంథము' యొక్క 22 వ అధ్యాయపు 9 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" నీకు పుట్టబోవు ఒక కుమారుడు సమాధానకర్తగా నుండును; చుట్టు ఉండు అతని శత్రువులనందరిని నేను తోలివేసి అతనికి సమాధానము కలుగజేతును; అందువలన అతనికి సొలొమోను అను పేరు పెట్టబడును; అతని దినములలో ఇశ్రాయేలీయులకు సమాధానమును విశ్రాంతియు దయచేయుదును. అతడు నా నామమునకు ఒక మందిరమును కట్టించును, అతడు నాకు కుమారుడై యుండును, నేనతనికి తండ్రినై యుందును, ఇశ్రాయేలీయుల మీద అతని రాజ్య సింహాసనమును నిత్యము స్థిరపరచుదును "**

('దినవృత్తాంతములు మొదటి గ్రంథము' , 22 వ అధ్యాయం : 9-10)

ఈ వాక్యాల ప్రకారం దేవుడు తన ప్రవక్త అయిన హజ్రత్ దావూద్ (అ) (దావీదు) యొక్క సంతతిలో రాజ్యాధికారాన్ని ప్రళయదినం వరకు తొలగించనని వాగ్దానం చేశాడు. అయితే శోచనీయమైన విషయమేమిటంటే ఆ వాగ్దానం నెరవేరలేదు. దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ)(దావీదు) సంతతి యొక్క రాజ్యాధికారం అంతరించి సుదీర్ఘకాలం గడచిపోయిన విషయం అందరికీ తెలిసిందే.

# 35 వ తప్పు

క్రైస్తవుల దృష్టిలో అత్యంత గౌరవనీయుడయిన పౌలు దైవదూతలపై దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) కలిగియున్న విశిష్టతను వెల్లడిస్తూ హెబ్రీయులకు వ్రాసిన లేఖ యొక్క మొదటి అధ్యాయపు 5 వ వాక్యంలో దేవుని వాక్కును ఈ విధంగా ఉల్లేఖించాడు:

**" నేను ఆయనకు తండ్రినైయుందును, ఆయన నాకు కుమారుడైయుండును"** [409]

క్రైస్తవ పండితులు ఇది బైబిల్ పాతనిబంధన గ్రంథంలోని 'సమూయేలు రెండవ గ్రంథము' యొక్క 7 వ అధ్యాయపు 14 వ వాక్యాన్ని సూచిస్తుందనే వివరణను పేర్కొంటారు. ( ఈ విషయం '34 వ తప్పు' కు సంబంధించిన వివరణలో ఇంతకుముందే అందించబడింది) అయితే వారి ఈ వాదం కొన్ని కారణాల రీత్యా తప్పు. ఆ కారణాలు క్రింద పేర్కొనబడుతున్నాయి:

**(అథఃసూచికలు)**

408 అనగా ఖుర్‌ఆన్ ప్రకారం 'తాలూత్'.



**1)** 'దినవృత్తాంతములు మొదటి గ్రంథము' యొక్క 22వ అధ్యాయపు 9 వ వాక్యంలో **'అతనికి సొలొమోను అను పేరు పెట్టబడును'** అని పేర్కొనబడింది.

**2)** రెండు గ్రంథాలలోనూ **'అతడు నా నామమునకు ఒక మందిరమును కట్టించును'** అని పేర్కొనబడి ఉంది. కనుక ఆ 'కుమారుడు' ఆ దైవగ్రహము (మందిరము) యొక్క స్థాపకుడయి ఉండడం తప్పనిసరి. ఈ విశిష్టత దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) (సొలొమోను) లో తప్ప మరెవరిలోనూ కనిపించదు. అందుకు విరుద్ధంగా దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) ఆ మందిరం నిర్మించబడిన తర్వాత వెయ్యి సంవత్సరాల మూడు సంవత్సరాల తర్వాత జన్మించారు. ఆయన ఆ మందిరము నిర్మానుష్యంగా పడియుండడం గురించి తెలియజేస్తూ ఉండేవారు. ఈ విషయానికి సంబంధించిన వివరణ బైబిల్ క్రొత్త నిబంధన గ్రంథంలోని మత్తయి సువార్త యొక్క 24 వ అధ్యాయంలో పొందుపరచబడి ఉంది. అలాగే పాఠకులచే చదవబడుతున్న ఈ గ్రంథంలోనే '79 వ తప్పు' క్రింద అందజేయబడే వివరణ ద్వారా కూడా ఈ విషయం స్పష్టమవుతుంది.

**3)** రెండు గ్రంథాలలోనూ ఆయన రాజు అవుతాడనే విషయం పేర్కొనబడింది. అయితే అందుకు విరుద్ధంగా దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) పేదవారుగా జీవితం గడిపారు. చివరకు ఆయన (అ) తన గురించి ఈ విధంగా పేర్కొన్నారు:

**" నక్కలకు బొరియలును ఆకాశ పక్షులకు నివాసములు కలవు గాని మనుష్య కుమారునికి తలవాల్చుకొనుటకైనను స్థలము లేదని అతనితో చెప్పెను "**

('మత్తయి సువార్త', : 8 - 20 )

**4)** 'సమూయేలు రెండవ గ్రంథము' లో స్పష్టంగా ఆ వ్యక్తి గురించి ఈ విధంగా పేర్కొనబడింది:

**"అతడు పాపము చేసిన యెడల నరుల దండముతోను మనుష్యులకు తగులు దెబ్బలతోను అతని శిక్షింతును గాని..."**

**(అథఃసూచికలు)**

409 పౌలు పేర్కొన్న విషయం పూర్తిగా ఈ విధంగా ఉంది: దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) దైవదూతల కంటే ఉత్తములనే విషయాన్ని నిర్ధారించేందుకై పౌలు హెబ్రీయులకు వ్రాసిన పత్రికలో ఈ విధంగా పేర్కొన్నాడు : **" ఏలయనగా - నీవు నా కుమారుడవు, నేను నేడు నిన్ను కనియున్నాను అనియు, ఇదియుగాక - నేను ఆయనకు తండ్రినైయుందును, ఆయన నాకు కుమారుడైయుండును అనియు ఆ దూతలలో ఎవనితోనైన ఎప్పుడైనను చెప్పెనా? "**

కనుక ఆ వ్యక్తి పాపరహితుడిగా కాక పాప కార్యానికి పాల్పడేందుకు అవకాశమున్న వ్యక్తి అయి ఉండడం తప్పనిసరి అని తెలుస్తోంది. దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) (సొలొమోను) క్రైస్తవుల దృష్టిలో ఆ విధంగా పాపకార్యాలకు పాల్పడిన వ్యక్తే (అల్లాహ్ క్షమించుగాక). ఎందుకంటే ఆయన (క్రైస్తవుల అభిప్రాయం ప్రకారం) జీవితపు ఆఖరి దశలో ధర్మం నుంచి మరలిపోయి విగ్రహారాధనకు కూడా పాల్పడ్డారు. అలాగే ఆయన విగ్రహాలయాలను సైతం స్థాపించారు. ఆ విధంగా ఆయన దైవప్రవక్త పదవి (దైవదౌత్యం) అనే మహోన్నత పదవి నుంచి దిగజారి బహుదైవారాధన (షిర్క్) కు సంబంధించిన నైచ్యపు అగాధంలోకి కూరుకుపోయారు. ఈ విషయానికి సంబంధించిన వివరణ క్రైస్తవులకు చెందిన పరిశుద్ధ గ్రంథాలలో ఉన్నది.[410] బహుదైవారాధన (షిర్క్) కు మించిన అపరాధం మరేది కాగలదు? అయితే అందుకు విరుద్ధంగా దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) పాపరహితులుగా జీవితం గడిపారు. క్రైస్తవుల విశ్వాసం ప్రకారం ఆయన ద్వారా పాపం జరగడమనేది అసాధ్యం.

**5)** 'దినవృత్తాంతములు మొదటి గ్రంథము' లో ఈ విధంగా పేర్కొనబడింది:

**" నీకు పుట్టబోవు ఒక కుమారుడు సమాధానకర్తగా నుండును; చుట్టు ఉండు అతని శత్రువులనందరిని నేను తోలివేసి అతనికి సమాధానము కలుగజేతును"**

అయితే దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) కు బాల్యం నుంచి ( క్రైస్తవుల విశ్వాసం ప్రకారం) హతమార్చబడే వరకు ఏనాడూ సుఖశాంతులు లభించలేదు. పైగా రాత్రింబవళ్ళూ యూదుల బృందం ఆయన మీద దాడి చేస్తూనే ఉండేది. సాధారణంగా ఆయన వారి భయం కారణంగా అటూఇటూ తిరుగుతూనే ఉండేవారు. చివరకు వారు ఆయనను బంధించారు, తీవ్రస్థాయిలో అవమానించారు మరియు శిలువపైకి ఎక్కించారు. అయితే అందుకు విరుద్ధంగా దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) (సొలొమోను) లో ఈ గుణం (అనగా సమాధానకర్తగా ఉండడం, శత్రువుల నుంచి దేవుని రక్షణను పొంది సురక్షితంగా ఉండడం) సంపూర్ణ స్థాయిలో ఉంది.

**6)** అలాగే 'దినవృత్తాంతములు మొదటి గ్రంథము' లో **'అతని దినములలో ఇశ్రాయేలీయులకు సమాధానమును విశ్రాంతియు దయచేయుదును.'** అని పేర్కొనబడి ఉంది.

---

**(అథఃసూచికలు)**

410 చూడండి : 'రాజులు మొదటి గ్రంథము' యొక్క 11 వ అధ్యాయం మరియు 'నెహెమ్యా గ్రంథము' యొక్క 13 వ అధ్యాయపు 26 వ వాక్యము.



దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) కాలంలో యూదులు రోమన్ చక్రవర్తుల పరిపాలనలో బానిసలుగా, వివశులుగా ఎంతటి హీన స్థాయిలో ఉండేవారో పరిశీలించదగినది.

**7)** దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) (సొలొమోను) స్వయంగా ఈ భవిష్యద్వాణి తన గురించే పేర్కొనబడిందని ప్రకటించారు. దీనికి సంబంధించిన వివరణ 'దినవృత్తాంతములు రెండవ గ్రంథము' యొక్క 6 వ అధ్యాయంలో లభిస్తుంది.[411]

క్రైస్తవులు ఈ భవిష్యద్వాణి దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) (సొలొమోను) కే వర్తిస్తుందని ఒప్పుకున్నప్పటికీ ఈ విధంగా పలుకుతారు: " వాస్తవానికి అది ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) కు సంబంధించినట్టిది. ఎందుకంటే ఆయన కూడా సొలొమోను (దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) సంతతికి చెందినవారే'' అయితే ఇది కూడా తప్పని మేము పేర్కొంటాము. ఎందుకంటే ఏ వ్యక్తి గురించయితే భవిష్యద్వాణి పేర్కొనబడుతుందో ఆ భవిష్యద్వాణిలో పేర్కొనబడిన గుణగణాలను, లక్షణాలను ఆ వ్యక్తి కలిగియుండడం తప్పనిసరి. అయితే ప్రస్తుతం చర్చించబడుతున్న భవిష్యద్వాణికి సంబందించిన వాక్యంలో ఏయే లక్షణాలయితే పేర్కొనబడ్డాయో అవి దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) లో లేవు. ఒకవేళ ఆ లక్షణాల విషయాన్ని పక్కనబెట్టినప్పటికీ ఆఖరి కాలానికి చెందిన క్రైస్తవ పండితులందరి అభిప్రాయం ప్రకారం అది సరికాదు. ఎందుకంటే వారు మత్తయి సువార్త మరియు లూకా సువార్తలలో దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) వంశావళికి సంబంధించి ఏర్పడిన వైరుధ్యాన్ని పరిష్కరించే [412] ఉద్దేశ్యంతో ఈ విధంగా పేర్కొన్నారు: ' మత్తయి వడ్రంగి అయిన యోసేపు కు చెందిన వంశావళి గురించి పేర్కొనగా లూకా మరియ (హజ్రత్ మర్యమ్ (అ)) యొక్క వంశావళి గురించి పేర్కొనడం

---

**(అథఃసూచికలు)**

411 **" అయితే యెహోవా నా తండ్రియైన దావీదుతో సెలవిచ్చినదేమనగా - నా నామ ఘనత కొరకు మందిరమును కట్టింపవలెనని నీవు ఉద్దేశించిన యుద్దేశము మంచిదే గాని నీవు ఆ మందిరమును కట్టరాదు, నీకు పుట్టబోవు నీ కుమారుడే నా నామమునకు ఆ మందిరమును కట్టును. అప్పుడు తాను అట్లు చెప్పియున్న మాటను యెహోవా ఇప్పుడు నెరవేర్చియున్నాడు. యెహోవా సెలవు ప్రకారము నేను నా తండ్రియైన దావీదునకు ప్రతిగా రాజునై ఇశ్రాయేలీయుల రాజాసనమందు కూర్చుండి ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవాకు మందిరమును కట్టించి "**

('దినవృత్తాంతములు రెండవ గ్రంథము' యొక్క 6 వ అధ్యాయంలోని 8, 9, 10 వాక్యాలు)

జరిగింది.'' 'మీజానుల్ హఖ్' గ్రంథ రచయిత కూడా ఈ అభిప్రాయాన్నే ఇష్టపడ్డారు, స్వీకరించారు. అయితే దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) వడ్రంగి అయిన యోసేపు కుమారులు ఎంతమాత్రం కాజాలరు. వడ్రంగి అయిన యోసేపు వైపుకు ఆయనను ఆపాదించడమనేది పూర్తిగా అర్థరహితమైనది, నిరాధారమైనది. వాస్తవానికి దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) హజ్రత్ మర్యమ్ (అ) (మరియ) కుమారులు. ఆ విధంగా ఆయన (అ) ఎట్టి పరిస్థితిలోనూ దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) (సొలొమోను) సంతతికి చెందినవారు కాజాలరు. ఆయన (అ) వాస్తవానికి దావీదు కుమారుడయిన నాతాను సంతతికి చెందినవారు. కనుక దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) (సొలొమోను) విషయంలో దేవుని తరఫున పేర్కొనబడిన భవిష్యద్వాణి ఏసుకు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) దైవప్రవక్త అయినప్పటికీ ఎంతమాత్రం వర్తించదు. అది కేవలం దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) (సొలొమోను) కు మాత్రమే పూర్తిగా వర్తిస్తుంది.

## కాకులా? లేక అరబ్బులా?

## 36 వ తప్పు

'రాజులు మొదటి గ్రంథము' యొక్క 17 వ అధ్యాయంలో దైవప్రవక్త హజ్రత్ ఇలియాస్ (అ) (ఏలీయా) విషయంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" పిమ్మట యెహోవా వాక్కు అతనికి ప్రత్యక్షమై - నీవు ఇచ్చట నుండి తూర్పు వైపునకు పోయి యొర్దానునకు ఎదురుగానున్న కెరీతు వాగు దగ్గర దాగియుండుము; ఆ వాగు నీరు నీవు త్రాగుదువు, అచ్చటికి నీకు ఆహారము తెచ్చునట్లు నేను కాకోలములకు ఆజ్ఞాపించితినని అతనికి తెలియజేయగా అతడు పోయి యెహోవా సెలవు చొప్పున యొర్దానునకు ఎదురుగానున్న కెరీతు వాగు దగ్గర నివాసము చేసెను. అక్కడ కాకోలములు ఉదయమందు రొట్టెను మాంసమును అస్తమయమందు రొట్టెను మాంసమును అతని యొద్దకు తీసికొని వచ్చుచుండెను; అతడు వాగు నీరు త్రాగుచు వచ్చెను. "** ('రాజులు మొదటి గ్రంథము' యొక్క 17 వ అధ్యాయం, 4, 5, 6 వాక్యములు)

జెరోమ్ తప్ప మిగిలిన బైబిల్ వ్యాఖ్యాతలందరూ 'ఓరీమ్' [413] అనే పదం గురించి వ్యాఖ్యానిస్తూ దానిని 'కాకోలములు' (కాకులు) అని అనువదించారు. అయితే జెరోమ్ ఈ

(అథఃసూచికలు)

412 దీనికి సంబంధించిన వివరణ ఇదే గ్రంథంలోని 124 వ పేజీలో పొందుపరచబడి ఉంది.



పదాన్ని 'అరబ్బులు' అని అనువదించారు. అయితే ఈ విషయంలో ఆయన యొక్క అభిప్రాయం బలహీనమయినదిగా పరిగణించబడినందున అతడి అనుయాయులు తమ అలవాటు ప్రకారం లాటిన్ అనువాద ప్రతులలో ప్రక్షిప్తానికి పాల్పడి తిరిగి 'అరబ్బులు' అనే పదాన్ని 'కాకోలములు' (కాకులు) గా మార్చివేశారు. ఈ చర్య క్రైస్తవ సమాజ వ్యతిరేకుల కొరకు పరిహసించేందుకు ఒక అవకాశం కల్పించినట్లయింది. వారు ఈ చర్య పట్ల నవ్వుకుంటూ ఉంటారు. ప్రొటెస్టెంట్ వర్గానికి చెందిన పరిశోధకుడయిన హోరన్ ఈ విషయం పట్ల ఆందోళన చెంది ఈ పొరపాటును సరిదిద్దేందుకు ప్రయత్నిస్తూ జెరోమ్ అభిప్రాయం వైపుకే మొగ్గుచూపడం జరిగింది. ప్రాయోభావముతో ఆయన ఈ విధంగా పేర్కొన్నారు: " 'ఓరీమ్' అంటే 'అరబ్బులు' అని భావం. అంతేగానీ 'కాకోలములు' కాదు" ఆయన మూడు కారణాల రీత్యా ఈ విషయంలో వ్యాఖ్యాతలను, అనువాదకులను మూర్ఖులుగా తీర్మానించారు. ఆయన తన వ్యాఖ్యాన గ్రంథం యొక్క మొదటి సంపుటంలోని 639 వ పేజీలో ఈ విధంగా పేర్కొన్నారు:

" కొంతమంది తిరస్కారులు ' అపవిత్రమైన పక్షులు (కాకులు) ఒక దైవప్రవక్తను సంరక్షించడం, ఆయన కొరకు ఆహారాన్ని తీసుకురావడమనేది ఎంతవరకు సమంజసమవుతుంది? విశ్వసనీయమవుతుంది?' అంటూ విమర్శించారు, నిందాపూర్వకంగా పరిహసించారు. అయితే వారు మూలప్రతిలో ఉన్న పదాన్ని పరిశీలించి ఉన్నట్లయితే ఆ విధంగా విమర్శించి ఉండేవారు కాదు. ఎందుకంటే మూలప్రతిలో ఉన్న అసలయిన పదం 'ఓరీమ్'. ఈ పదానికి 'అరబ్బులు' (అరబీయులు) అని భావం. ఈ పదం ఈ అర్థంలో 'దినవృత్తాంతములు రెండవ గ్రంథం' యొక్క 21 వ అధ్యాయపు 16 వ వాక్యంలోనూ, 'నెహెమ్యా గ్రంథము' యొక్క 4 వ అధ్యాయపు 7 వ వాక్యంలోనూ ఉపయోగించబడింది. అలాగే 'ప్రేషత్‌రుబా' ('ఆదికాండము' కు యూదు పండితులు వ్రాసిన వ్యాఖ్యాన గ్రంథం) ద్వారా ఈ దైవప్రవక్త బతషాన్ ప్రాంతంలోనున్న ఒక బస్తీలో దాగియుండవలసిందిగా ఆదేశించబడ్డారని విదితమవుతుంది.'' జెరోమ్ ఇంకా ఈ విధంగా పేర్కొన్నారు: " 'ఓరీమ్' అంటే అరేబియా సరిహద్దుల్లో ఉన్న ప్రాంతంలో నివసించేవారు. వారు ఈ దైవప్రవక్తకు ఆహారమిచ్చేవారు.''

జెరోమ్ యొక్క ఈ సాక్ష్యం ఎంతో విలువయినది. లాటిన్ అనువాద ప్రతుల్లో 'కాకోలములు' అనే పదం వ్రాయబడినప్పటికీ 'దినవృత్తాంతములు మొదటి గ్రంథము' లోనూ,

(అథఃసూచికలు)

413 మూల హిబ్రూ ప్రతిలో 'కాకోలములు' అనే పదం ఉన్న చోట 'ఓరీమ్' అని పేర్కొనబడి ఉంది.

'నెహెమ్యా గ్రంథము' లోనూ 'అరబీయులు' అనే పదమే ఉపయోగించబడింది. అలాగే జేరోమ్ 'ఓరీమ్' అనే పదాన్ని 'అరబీయులు' అని అనువదించారు. బైబిల్ అరబ్బీ అనువాద గ్రంథం ద్వారా కూడా ఈ పదం మానవులనే సూచిస్తుందని, కాకులను సూచించదని విదితమవుతుంది. ప్రసిద్ధ యూదు వ్యాఖ్యాత అయిన జార్జీ సైతం ఈ పదాన్ని 'అరబీయులు' అనే అనువదించారు. అపవిత్రమైన పక్షుల ద్వారా ధర్మశాస్త్రానికి విరుద్ధంగా ధర్మశాస్త్రానికి అనుగుణంగా నడచుకోవడంలో ఎంతో నిష్ఠాగరిష్ఠుడయిన, ధర్మశాస్త్ర పరిరక్షకుడయిన పవిత్రుడయిన దైవప్రవక్తకు మాంసాన్ని, రొట్టెలను దైవం చేరవేయడమనే విషయం ఎలా సరియైనదవుతుంది? అలాగే ఆ అపవిత్రమైన పక్షులు ఆ మాంసాన్ని తీసుకురావడానికి ముందు ఏదో ఒక మృత పశువు కళేబరం మీదికి వాలియుండవనే విషయం ఆయనకు ఎలా తెలుస్తుంది. అంతేగాకుండా ఆ విధంగా మాంసం మరియు రొట్టెలు దైవప్రవక్త హజ్రత్ ఇలియాస్ (అ) (ఏలీయా) కు ఒక సంవత్సర కాలం పాటు అందజేయబడ్డాయి. మరి అటువంటి సేవను అపవిత్రమైన పక్షులయినటువంటి కాకుల వైపుకు ఆపాదించడం ఎలా సరయినదవుతుంది? బహుశా 'ఓరబ్' లేదా 'అర్‌బూ' అనే ప్రాంతానికి చెందినవారు ఈ సేవను అందించి ఉంటారు.

ఇప్పుడు ఈ పరిశోధకుని మాటను స్వీకరించి మిగిలిన బైబిల్ వ్యాఖ్యాతలందరినీ, అనువాదకులందరినీ మూర్ఖులుగా తీర్మానిస్తారో లేక ఇతర వ్యాఖ్యాతలను, అనువాదకులను మూర్ఖులుగా పరిగణించే ఈ పరిశోధకుడినే మూర్ఖునిగా పరిగణించి మిగిలిన బైబిల్ వ్యాఖ్యాతలు మరియు అనువాదకుల అనువాదమే సరయినదని అంగీకరిస్తూ అపవిత్రమైన పక్షులు ఒక పవిత్రుడయిన దైవప్రవక్తకు సేవలు అందజేసాయనే విషయం పూర్తిగా తప్పయినదని, బుద్ధిపరంగా ఆమోదయోగ్యం కానిదని, పరిహసించేందుకు అవకాశం కల్పించేదని, అయితే జేరోమ్ పేర్కొన్న మూడు కారణాల రీత్యా అసాధ్యమని అంగీకరిస్తారో ప్రొటెస్టెంట్ వర్గానికి చెందిన పండితులకే వదిలివేయడం జరిగింది. మా తరపున వారికి ఈ రెండు మార్గాల్లో దేనినయినా అవలంబించేందుకు పూర్తి స్వేచ్ఛ ఉంది.

## దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) (సొలొమోను) దైవమందిర నిర్మాణాన్ని ఎప్పుడు ప్రారంభించారు? 37 వ తప్పు

'రాజులు మొదటి గ్రంథము' యొక్క 6 వ అధ్యాయపు మొదటి వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" అయితే ఇశ్రాయేలీయులు ఐగుప్తు దేశములో నుండి బయలుదేరి వచ్చిన నాలుగు వందల ఎనుబదియవ సంవత్సరమందు, అనగా సొలొమోను ఇశ్రాయేలును ఏలిన నాలుగవ**



**సంవత్సరమందు జీవ్ అను రెండవ మాసమున అతడు యెహోవా మందిరమును కట్టింపనారంభించెను."**

ఈ విషయం చరిత్రకారుల దృష్టిలో తప్పయినది. ప్రసిద్ధ వ్యాఖ్యాత అయిన ఆడమ్ క్లార్క్ తన వ్యాఖ్యాన గ్రంథం యొక్క 2 వ సంపుటిలోని 1293 వ పేజీలో పైన పేర్కొనబడిన వాక్యం గురించి వ్యాఖ్యానిస్తూ ఈ విధంగా పేర్కొన్నారు:

" చరిత్రకారులు ఈ కాలం విషయంలో క్రింద పేర్కొనబడిన వివరణ ప్రకారం విభేదించారు:

హిబ్రూ ప్రతిలో 480 , గ్రీకు ప్రతిలో 440 , క్లీకాస్ దృష్టిలో 330, మలీకోర్‌కానూస్ దృష్టిలో 590, యూసీఫస్ దృష్టిలో 592, సల్పీసియూస్ సవేర్డస్ దృష్టిలో 588, క్లీమ్‌నస్ ఇస్కందరియానూస్ దృష్టిలో 570, సీదర్‌నీస్ దృష్టిలో 672, కోదర్‌మానూస్ దృష్టిలో 598, అదాసీబూస్ మరియు వకాయానూస్ దృష్టిలో 580, సరార్‌పూస్ దృష్టిలో 680, నికొలస్ ఇబ్రాహీమ్ దృష్టిలో 527, మస్తలీనూస్ దృష్టిలో 592, పతియాదయూస్ దవాల్థీరూస్ దృష్టిలో 520 గా ఆ సంఖ్య పేర్కొనబడి ఉంది.

ఒకవేళ హిబ్రూప్రతిలో పేర్కొనబడిన 480 అనే సంఖ్య సరియైనదిగా, దేవుని వాక్కుగా భావించబడే పక్షంలో గ్రీకు అనువాదకుడు మరియు గ్రంథవహులకు చెందిన చరిత్రకారులు దానిపట్ల ఎందుకు విభేదించేవారు? అలాగే యూసీఫస్ మరియు క్లీమ్‌నస్ ఇస్కందరియానూస్ లు గ్రీకు ప్రతిలో పేర్కొనబడిన సంఖ్య పట్ల సైతం విభేదించారు. వాస్తవానికి వీరిద్దరూ గొప్ప మతవాదులుగా ప్రఖ్యాతిగాంచినవారు. దీనినిబట్టి విదితమవుతున్న విషయమేమిటంటే ఈ గ్రంథాలు (బైబిల్ లోని పుస్తకాలు) వారి దృష్టిలో ఇతర చరిత్ర గ్రంథాల కంటే ఎక్కువ విలువయినవేమీ కావు. అదేవిధంగా వారు వాటిని (బైబిల్ లోని పుస్తకాలను) దైవం తరపున అవతరించిన వాణులుగా విశ్వసించలేదు. ఒకవేళ విశ్వసించినట్లయితే వారు ఇటువంటి విషయాలలో ఎందుకు విభేదించేవారు?

## దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) వంశావళి 38 వ తప్పు

క్రీ.శ. 1860 లో ప్రచురించబడిన బైబిల్ అరబీ అనువాద గ్రంథం ప్రకారం క్రొత్త నిబంధనగ్రంథం లోని మత్తయి సువార్త యొక్క మొదటి అధ్యాయపు 17 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" ఇట్లు అబ్రాహాము మొదలుకొని దావీదు వరకు తరములన్నియు పదునాలుగు తరములు. దావీదు మొదలుకొని యూదులు బబులోనుకు కొనిపోబడిన కాలము వరకు పదునాలుగు**

**తరములు; బబులోనుకు కొనిపోబడినది మొదలుకొని క్రీస్తు వరకు పదునాలుగు తరములు"**

దీనినిబట్టి దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) యొక్క వంశావళికి సంబంధించిన వివరణ మూడు రకాలుగా అందజేయబడుతుందని విదితమవుతుంది. అలాగే ప్రతి రకమూ పదునాలుగు తరములను కూడియున్నదని విదితమవుతుంది. అయితే ఇది పూర్తిగా తప్పు. ఎందుకంటే మొదటి రకానికి చెందిన క్రమం దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ) (దావీదు) తో ముగుస్తుంది. మరి దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ) (దావీదు) ఈ క్రమంలో చేరియున్నప్పుడు తప్పనిసరిగా రెండవ క్రమంలో చేరియుండరు. ఇక రెండవ రకానికి చెందిన క్రమం దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) (సొలొమోను) తో ప్రారంభమయి యెకొన్యా తో ముగుస్తుంది. యెకొన్యా ఈ క్రమంలో చేరియున్నప్పుడు తప్పనిసరిగా మూడవ క్రమం నుంచి తొలగిపోవడం జరుగుతుంది. మూడవ క్రమం షయల్తీయేలు తో మొదలయి క్రీస్తు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) తో ముగుస్తుంది. దీని పర్యవసానమేమిటంటే ఈ మూడవ రకానికి చెందిన వంశావళి క్రమంలో 14 తరాలకు బదులు 13 తరాలు అవుతాయి. [414]

ఈ విషయం పట్ల పూర్వకాలానికి చెందిన మరియు నవీనకాలానికి చెందిన పండితులందరూ అభ్యంతరం వ్యక్తం చేశారు, ఆక్షేపించారు. బోరెఫ్రీ క్రీస్తుశకం మూడవ శతాబ్దంలో అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. క్రైస్తవ పండితులు ఎంతో బలహీనమైన సమాధానాలను ఈ విషయానికి సంబంధించి అందజేస్తూ ఉంటారు. అవి ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాజాలవు.

## దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) వంశావళి విషయంలో నాలుగు తప్పులు మరియు విస్పష్టమైన ప్రక్షిప్తాలు 39 వ తప్పు నుంచి 42 వ తప్పు వరకు

క్రీ.శ. 1844 లో ప్రచురించబడిన బైబిల్ అరబీ అనువాద గ్రంథం ప్రకారం క్రొత్త నిబంధన గ్రంథంలోని మత్తయి సువార్త యొక్క మొదటి అధ్యాయపు 11 వ వాక్యంలో ఈ

**(అథఃసూచికలు)**

414 ఒకవేళ యెకొన్యాను పరిగణనలోకి తీసుకోనట్లయితే మూడవ రకానికి చెందిన వంశావళి క్రమం ఈ విధంగా ఉంటుంది: (1) షయల్తీయేలు (2) జెరుబ్బాబెలు (3) అబీహూదు (4) ఎల్యాకీము (5) అజోరు (6) సాదోకు (7) ఆకీము (8) ఎలీహూదు

(మిగిలిన భాగం తరువాతి పేజీలో)



విధంగా పేర్కొనబడి ఉంది:

**" యూదులు బబులోనుకు కొనిపోబడిన కాలములో యోషీయా యెకొన్యాను అతని సహోదరులను కనెను"**

దీనినిబట్టి యెకొన్యా మరియు అతడి సహోదరుల పుట్టుక యోషీయా బబులోనుకు కొనిపోబడిన కాలంలో సంభవించిందని విదితమవుతుంది. అదే నిజమయిన పక్షంలో యోషీయా ఆ దేశబహిష్కరణ కావించబడి బబులోనుకు కొనిపోబడిన కాలంలో సజీవునిగా ఉండడం తప్పనిసరి అవుతుంది. అయితే ఇది నాలుగు కారణాల రీత్యా తప్పు.

**1)** యూదులు బబులోనుకు కొనిపోబడిన సంఘటన జరగడానికి 12 సంవత్సరాల ముందే యోషీయా మరణించాడు. ఎందుకంటే అతడు మరణించిన తర్వాత యెహో యాహాజు పట్టాభిషిక్తుడయి మూడు నెలలు పరిపాలించాడు. ఆ తర్వాత అతడి రెండవ కుమారుడయిన యెహోయాకీము 11 నెలలు పరిపాలించాడు. ఆ తర్వాత యెహోయాకీము కుమారుడయిన యెకొన్యా మూడు మాసాల పాటు రాజుగా కొనసాగాడు. అతడిని నెబుకద్నెజరు బంధించి ఇతర ఇశ్రాయేలీయులతో పాటు బబులోనుకు కొనిపోవడం జరిగింది.[415]

**2)** యెకొన్యా యోషీయా మనవడే గానీ, కుమారుడు కాదు. ఈ విషయం పైన నెంబర్. 1 లో అందజేయబడిన వివరణ ప్రకారం విదితమవుతుంది.

**3)** యెకొన్యా వయస్సు [416] యూదులు బబులోనుకు కొనిపోబడుతున్న సమయంలో 18

**(అథఃసూచికలు)**

(414 వ అథఃసూచిక తరువాయి భాగం)

(9) ఎలియాజరు (10) మత్తాను (11) యాకోబు (12) యోసేపు (13) ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ). ఒకవేళ యెకొన్యాను కూడా ఈ క్రమంలో పరిగణనలోకి తీసుకున్న పక్షంలో రెండవ రకానికి చెందిన వంశావళి క్రమంలో మొత్తం 13 తరాలు మాత్రమే మిగిలిపోతాయి.

(మౌలానా ముహమ్మద్ తఖీ ఉస్మానీ సాహెబ్)

415 క్రమానుగతంగా చూడండి:

దినవృత్తాంతములు రెండవ గ్రంథము, 35 : 23, 36: 1, 2, 5, 9
రాజులు రెండవ గ్రంథము, 23 : 30, 31, 36, 24 : 8

సంవత్సరాలు. మరి యూదులు బబులోనుకు కొనిపోబడుతున్న కాలంలో అతడు యోషీయాకు పుట్టడానికి అర్థమేమిటి?

**4)** యెకొన్యా కు మరెవరూ సహోదరులు లేరు. అయితే అతడి తండ్రి ముగ్గురు సోదరులను కలిగియున్నాడనే విషయం వాస్తవం.

ఈ తప్పు విషయంలోనూ, ఇంతకుముందు పేర్కొనబడిన తప్పు విషయంలోనూ ఏర్పడిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వ్యాఖ్యాత అయిన ఆడమ్ క్లార్క్ తన వ్యాఖ్యాన గ్రంథంలో ఈ విధంగా పేర్కొన్నారు:

" కామత్ 11 వ వాక్యాన్ని **" యోషీయా యెహోయాకీము మరియు అతని సహోదరులను కనెను, యెహోయాకీము యెకొన్యాను యూదులు బబులోనుకు కొనిపోబడిన కాలములో కనెను"**

ఎంతటి స్పష్టమైన రీతిలో ప్రక్షిప్తానికి పాల్పడవలసిందిగా ఆదేశం ఇవ్వబడుతోందో చూడండి!!! [417] ఈ వాక్యం విషయంలో ఎదురయిన అభ్యంతరాల నుంచి, విమర్శల నుంచి రక్షించబడేందుకై ఈ వాక్యంలో 'యెహోయాకీము' అనే పదాన్ని జోడించవలసిందిగా సలహా ఇవ్వబడుతోంది. ఒకవేళ ఆ విధంగా ఈ వాక్యంలో ప్రక్షిప్తానికి పాల్పడినప్పటికీ 3 వ నెంబర్ లో పేర్కొనబడిన అభ్యంతరం దూరం కాజాలదు. అనగా యోషీయా యెహోయాకీమును కనగా, యెహోయాకీము యెకొన్యాను కనినట్లుగా పేర్కొన్నప్పటికీ యెహోయాకీము యెకొన్యాను యూదులు బబులోనుకు కొనిపోబడుతున్న కాలంలో కన్నట్లయితే, మరి 'రాజులు రెండవ గ్రంథము' యొక్క 24 వ అధ్యాయపు 8 వ వాక్యంలో ఆ సమయంలో యెకొన్యా (యెహోయాకీను) పదునెనిమిదేండ్లవాడై యుండెననే వాక్యం మాటేమిటి? ఆ సమయంలో పదునెనిమిదేండ్ల వయస్సు కలిగిన యెకొన్యా యెహోయాకీముకు జన్మించడం ఎలా సాధ్యపడుతుంది?

మా అభిప్రాయమేమిటంటే వాస్తవానికి మత్తయి సువార్త యొక్క మొదటి అధ్యాయం

**(అథఃసూచికలు)**

[416] 'రాజులు రెండవ గ్రంథము' యొక్క 24 వ అధ్యాయపు 8వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది: **"యెహోయాకీను ఏలనారంభించినప్పుడు పదునెనిమిందేండ్లవాడై యెరూషలేము నందు మూడు మాసములు ఏలెను. "**

ఇక్కడ 'యెహో యాకీను' యొక్క మరొక పేరు 'యెకొన్యా' అని గుర్తుంచుకోవాలి. ఈ విషయానికి ఆధారం కొరకు యిర్మీయా గ్రంథం యొక్క 22 వ అధ్యాయపు 24 వ వాక్యాన్ని పరిశీలించవచ్చు.



లోని 11 వ వాక్యంలో 'యెహోయాకీము' అనే పదం ఉండే ఉంటుంది. అయితే కొంతమంది 'నీతిమంతు'లయిన క్రైస్తవ పండితులు ఉద్దేశ్యపూర్వకంగానే ఈ వాక్యంలో నుంచి 'యెహోయాకీము' అనే పదాన్ని తొలగించి ఉంటారు. తద్వారా " క్రీస్తు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) యెహోయాకీము సంతతికి చెందినవారయినప్పుడు ఆయన దావీదు సింహాసనాన్ని అధిష్ఠించేందుకు అధికారాన్ని కలిగియుండరు గదా! [418] అలాగే అటువంటి పక్షంలో ఆయన క్రీస్తు కూడా కాజాలరు'' అనే అభ్యంతరం తలెత్తకుండా ఉంటుందని వారు భావించారు. అయితే ఈ వాక్యం నుంచి 'యెహోయాకీము' అనే పదాన్ని తొలగించడం వల్ల అది మరిన్ని తప్పులకు ఆస్కారం కల్పిస్తుందనే విషయం వారికి తెలియదు. మత్తయి పై ఈ తప్పుల దోషం మోపబడడమనేది ఈ పెద్ద చెడుగుతో పోలిస్తే సులభమైనదని వారు భావించి ఉంటారు.

**(అథఃసూచికలు)**

[417] ఆ తర్వాత ఈ ఆదేశానికి అనుగుణంగా పాక్షికంగా నడుచుకోవడం జరిగింది. కామత్ గారు ఈ విషయంలో సలహాలు ఇచ్చేవారు. ఒకటి ఏమిటంటే మధ్యలో యెహోయాకీము అనే పదాన్ని చేర్చాలి. రెండవది ఏమిటంటే 'బబులోనుకు కొనిపోబడుతున్న సందర్భంలో' అని కాకుండా 'బబులోనుకు కొనిపోబడుతున్న కాలంలో' అని మార్చాలి. వీటిలో మొదటి సలహా ప్రకారం ఆచరించడం కొంచెం క్లిష్టమైనది. అయితే రెండవ సలహా ప్రకారం ఆచరించడం ఎంతో సులభం. ఎందుకంటే ఆ విధంగా మార్చడమనేది మార్చినట్లు తెలియని రీతిలో సులభంగా జరిగిపోతుంది. అందుకే ప్రస్తుతం మన వద్ద ఉన్న అన్ని బైబిల్ అనువాద ప్రతుల్లో ' యూదులు బబులోనుకు కొనిపోబడిన కాలములో" అని పేర్కొనబడి ఉంది. ఇక ఇంగ్లిష్ అనువాదకుడయితే మరొక పదాన్ని సైతం జోడించి పాఠకులచే ప్రస్తుతం చదవబడుతున్న ఈ గ్రంథ రచయిత నెంబర్. 3 లో (వెనుకటి పేజీలో పేర్కొనబడిన 3 వ కారణం) లేవనెత్తిన అభ్యంతరానికి సైతం అవకాశం లేకుండా చేసివేయడం జరిగింది. మత్తయి సువార్త యొక్క మొదటి అధ్యాయపు 11 వ వాక్యానికి గాను ఆ ఇంగ్లిష్ అనువాదకుని ఇంగ్లిష్ అనువాదం క్రింద పేర్కొనబడుతోంది:

" and Josiah begat Jeconiah and his brethern, about the time they were carried away to Babylon."

(మిగిలిన భాగం తరువాతి పేజీలో)

# 43 వ తప్పు

యూదా [419] నుంచి శల్మాను [420] వరకు గల కాలం దాదాపు మూడువందల సంవత్సరాలు.

(అథఃసూచికలు)

(417 వ అథఃసూచిక తరువాయి భాగం)

**అనువాదం: " యూదులు బబులోనుకు కొనిపోబడిన కాలానికి సమీప కాలంలో యోషీయా యెకొన్యాను అతని సహోదరులను కనెను"**

ఇక్కడ 'సమీప కాలంలో' అనే పదబంధాన్ని క్రొత్తగా చేర్చి బైబిల్‌కు ఎంతటి మహోన్నత సేవను అందజేయడం జరిగిందో మనం పరిశీలించగలము.

ఇక క్రీ.శ. 1961 లో బ్రిటీషు ద్వీపాలలోని చర్చీలన్నింటికి చెందిన ప్రతినిధులందరూ కలిసి ఒక క్రొత్త బైబిల్ ఇంగ్లీష్ అనువాద గ్రంథాన్ని వెలుగులోకి తీసుకొచ్చారు. ఆ ప్రతిలో ఈ సమస్యను, అనగా మత్తయి సువార్త యొక్క మొదటి అధ్యాయపు 11 వ వాక్యానికి సంబంధించిన సమస్యను మరొక క్రొత్త రీతిలో పరిష్కరించడం జరిగింది. అందులో ఈ వాక్యం ఈ క్రింది విధంగా అనువదించబడింది:

" and Josiah was the father of Jeconiah and his brethern at the time of the deportition to Babylon."

**అనువాదం: " యూదులు బబులోనుకు కొనిపోబడిన కాలంలో యోషీయా యెకొన్యాకు, అతని సహోదరులకు తండ్రిగా నుండెను"**

చూడండి. ఇక యెకొన్యా ఎప్పుడు పుట్టాడనే వివాదమే దీనితో సమసిపోతుంది. 'యూదులు బబులోనుకు కొనిపోబడిన కాలంలో యోషియా యెకొన్యాకు తండ్రి' అని పేర్కొని యెకొన్యాను అతడు ఎప్పుడు కన్నాడనే విషయాన్నే ప్రస్తావించకుండా వివాదమే తలెత్తకుండా జాగ్రత్తపడడం జరిగింది. ఈ గ్రంథాలనే దైవంచే అవతరించబడిన దివ్యగ్రంథాలుగా అంగీకరించవలసిందిగా , వాటిలోని ప్రతి ఒక్క విషయాన్ని సరియైనదిగా భావించవలసిందిగా చెప్పడం జరుగుతూ ఉంటుంది.

మరి హిబ్రూ మరియు గ్రీకు భాషలను అర్థం చేసుకోలేని సామాన్య వ్యక్తి పాపం ఈ 'పరిశుద్ధ తండ్రులు' పేర్కొనే ఏ విషయం పట్లయినా అభ్యంతరాన్ని వ్యక్తం చేసేందుకు, తప్పు పట్టేందుకు అధికారమెక్కడిది? ' మీ మహిమాన్విత సృజనాత్మక సౌందర్యంతో మీకు తోచినట్లు చేయండి' అని వారితో పేర్కొనడం తప్పు.



అలాగే శల్మాను నుంచి దావీదు (దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ)) వరకు గల కాలం నాలుగు వందల సంవత్సరాలు. కానీ మత్తయి తన సువార్తలో మొదటి కాలంలో ఏడు తరాల[421] గురించి, రెండవ కాలంలో ఐదు తరాల [422] గురించి వ్రాశారు. అయితే ఇది తప్పు. ఎందుకంటే పూర్వకాలానికి చెందిన ప్రజల ఆయుష్షులు తరువాతి కాలానికి చెందిన ప్రజల ఆయుష్షుల కంటే ఎక్కువగా ఉంటాయి.

# 44 వ తప్పు

మత్తయి తన సువార్తలో పేర్కొన్న మూడు రకాలలో [423] రెండవ రకానికి చెందిన మొత్తం తరాల సంఖ్య వాస్తవానికి 14 కాదు, 18. ఈ విషయం మనకు 'దినవృత్తాంతములు మొదటి గ్రంథము' యొక్క మూడవ అధ్యాయం[424] ద్వారా మనకు తెలుస్తుంది. ఈ కారణంగానే న్యూసన్ ఎంతో విచారం వ్యక్తం చేస్తూ ఈ విధంగా పేర్కొన్నారు: " ఇప్పటివరకయితే క్రైస్తవంలో

(అథఃసూచికలు)

418 ఎందుకంటే 'యిర్మీయా గ్రంథము' యొక్క 36 వ అధ్యాయపు 30 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది : **" అందుచేతను యూదారాజైన యెహోయాకీము గూర్చి యెహోవా ఈ మాట సెలవిచ్చుచున్నాడు - దావీదు యొక్క సింహాసనము మీద ఆసీనుడగుటకు అతనికి ఎవడును లేకపోవును"**

419 అనగా దైవప్రవక్త హజ్రత్ యాఖూబ్ (అ) (యాకోబు) కుమారుడయిన యూదా.

420 అనగా ఈయన నయస్సో కుమారుడయిన శల్మాను. దైవప్రవక్త హజ్రత్ హారూన్ (అ) (అహరోను) వీరికి మామ (మేనత్త భర్త). ('నిర్గమకాండము', 6 వ అధ్యాయపు 23 వ వాక్యము)

421 ఆ ఏడు తరాలు ఇవి: (1) యూదా (2) పెరెసు (3) ఎస్రోము (4) అరాము (5) అమ్మీనాదాబు (6) నయస్సో (7) శల్మాను

422 ఆ ఐదు తరాలు ఇవి: (1) శల్మాను (2) బోయజు (3) ఓబేదు (4) యెష్షయి (5) దావీదు

ఒకటి మరియు మూడుల ఏకత్వాన్ని విశ్వసించడం తప్పనిసరిగా భావించబడేది. ఇక ఇప్పుడు 18 మరియు 14 ల ఏకత్వాన్ని కూడా అంగీకించవలసి ఉంటుంది. ఎందుకంటే పరిశుద్ధ గ్రంథంలో తప్పుకు ఆస్కారం లేదు.

## 45 వ మరియు 46 వ తప్పులు

మత్తయి సువార్త యొక్క మొదటి అధ్యాయపు 8 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" యెహోరాము ఉజ్జియాను కనెను"**

ఈ విషయం రెండు కారణాల రీత్యా తప్పు.

---

**(అథఃసూచికలు)**

[423] అనగా ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) యొక్క వంశావళికి చెందిన ఒక క్రమం, అనగా దావీదు (దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ)) వరకు, రెండవది ఆయన (దావీదు) నుంచి యూదులు బబులోనుకు కొనిపోబడినంతవరకు మరియు మూడవది ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) వరకు గల వంశావళి క్రమం.

[424] 'దినవృత్తాంతములు మొదటి గ్రంథము' యొక్క 3 వ అధ్యాయం ప్రకారమయితే దావీదు (దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ)) నుంచి యెకొన్యా వరకు గల వంశావళి క్రమం ఈ క్రిందివిధంగా ఉంటుంది:

(0) దావీదు (దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ). (1) సొలొమోను (దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) (2) రెహబాము (3) అబీయా (4) ఆసా (5) యెహోషాపాతు (6) యెహోరాము (7) అహజ్యా (8) యోవాషు (9) అమజ్యా (10) ఉజ్జియా (11) యోతాము

(12) ఆహాజు (13) హిజ్కియా (14) మనష్షే (15) ఆమోను (16) యోషీయా

(17) యెహోయాకీము (18) యెకొన్యా

మత్తయి మాత్రం కేవలం 13 తరాలను మాత్రమే పేర్కొనడం జరిగింది. ఆయన 'అహజ్యా', ' యోవాషు', ' అమజ్యా' మరియు 'యెహోయాకీము' అనేవారి గురించి పేర్కొనలేదు. మత్తయి అందించిన వివరణ ఎందుకు తప్పంటే, 'దినవృత్తాంతములు మొదటి గ్రంథము' లో పేర్కొనబడిన రాజుల పేర్లను, వారి కార్యాలను తొలగించివేయనంతవరకు దానిని సరియైనదిగా పరిగణించడం కుదరదు.



**(1)** దీనినిబట్టి ఉజ్జియా యెహోరాము కుమారుడని విదితమవుతోంది. వాస్తవానికి ఇది తప్పు. ఎందుకంటే యెహోరాము కుమారుడు అహజ్యా, అహజ్యా కుమారుడు యోవాషు, యోవాషు కుమారుడు అమజ్యా. అమజ్యా కుమారుడు ఉజ్జియా. కనుక మత్తయి అందజేసిన వివరణలో మూడు తరాలు తొలగించివేయబడ్డాయి. 'అహజ్యా', 'యోవాషు', ' అమజ్యా' అనే ముగ్గురు వ్యక్తులూ ప్రసిద్ధ రాజులు. వారి స్థితిగతుల గురించి 'రాజులు రెండవ గ్రంథము' యొక్క 8 వ , 12 వ మరియు 14 వ అధ్యాయాలలోనూ, 'దినవృత్తాంతములు రెండవ గ్రంథము' యొక్క 22 వ, 24 వ మరియు 25 వ అధ్యాయాలలోనూ పేర్కొనబడింది. ఈ ముగ్గురి పేర్లను తొలగించివేయడానికి సముచితమైన కారణమేమిటో తెలియదు. ఆ ముగ్గురికి సంబంధించిన వివరణ తప్పు అని పేర్కొనడం తప్ప మార్గాంతరం లేదు. ఎందుకంటే ఒక చరిత్రకారుడు ఏదయినా నిర్ణీత కాలం గురించి వ్యాఖ్యానిస్తూ ఆ కాలంలో ఇన్ని తరాలు గడిచాయని పేర్కొని కొన్ని తరాలను పొరపాటుగానో, ఉద్దేశ్యపూర్వకంగానో తొలగించివేసినట్లయితే అతడు తప్పుకు పాల్పడ్డాడని పేర్కొనడం తప్ప మరేమి చేయగలము?

**(2)** అతడి పేరు 'ఊజియా' [425] కాదు, 'ఉజ్జియా'. ఈ విషయం మనకు 'దినవృత్తాంతములు మొదటి గ్రంథము' యొక్క 3 వ అధ్యాయంలోనూ, 'రాజులు రెండవ గ్రంథము' యొక్క 14 వ మరియు 15 వ అధ్యాయాలలోనూ పేర్కొనబడింది.

## 47 వ తప్పు

మత్తయి సువార్త యొక్క మొదటి అధ్యాయపు 12 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" షయల్తీయేలు జెరుబ్బాబెలును కనెను "**

ఇది కూడా తప్పే. ఎందుకంటే సరియైన విషయమేమిటంటే జెరుబ్బాబెలు షయల్తీయేలు సోదరుడయిన పెదాయా కుమారుడు. ఈ విషయానికి సంబంధించిన వివరణ మనకు 'దినవృత్తాంతములు మొదటి గ్రంథము' యొక్క 3 వ అధ్యాయంలో [426] లభ్యమవుతుంది.

---

**(అథఃసూచికలు)**

[425] ఇప్పుడు ఉర్దూ మరియు తెలుగు బైబిల్ అనువాద గ్రంథాలలో 'ఉజ్జియా' గానే ఈయన పేరు పేర్కొనబడి ఉంది.

## 48 వ తప్పు

మత్తయి సువార్త యొక్క మొదటి అధ్యాయపు 13 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది: **" జెరుబ్బాబెలు అబీహూదును కనెను "**

ఇది కూడా తప్పే. ఎందుకంటే జెరుబ్బాబెలుకు ఐదుగురు కుమారులు. దీనికి సంబంధించిన వివరణ మనకు 'దినవృత్తాంతములు మొదటి గ్రంథము' యొక్క 3 వ అధ్యాయంలో [427] లభ్యమవుతుంది. అక్కడ పేర్కొనబడిన ఐదుగురు కుమారులలో ఏ ఒక్కరి పేరు కూడా 'అబీహూదు' కాదు.

ఈ 11 తప్పులు మత్తయి ద్వారా కేవలం ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) యొక్క వంశావళి విషయంలో దొర్లాయి. పాఠకులు ఈ గ్రంథంలో 'వైరుధ్యాలు' పేరుతో వ్రాయబడిన రెండవ ప్రకరణంలో మత్తయి కు, లూకా కు మధ్య ఏర్పడిన వైరుధ్యాలను[428] గురించి చదివే ఉన్నారు. ఒకవేళ ఆ వైరుధ్యాలను సైతం ఇక్కడ పేర్కొనబడిన తప్పులతో కలుపుకున్నట్లయితే తప్పుల సంఖ్య 17 కు చేరుకుంటుంది. ఆ విధంగా కేవలం ఒకే ఒక విషయానికి సంబంధించి 17 రకాలుగా వైరుధ్యాలు, తప్పులు దొర్లినట్లవుతుంది.

## 49 వ తప్పు

మత్తయి తన సువార్త యొక్క 2 వ అధ్యాయంలో ఒక సంఘటన గురించి ఈ

**(అథఃసూచికలు)**

426 'దినవృత్తాంతములు మొదటి గ్రంథము' యొక్క 3 వ అధ్యాయంలోని 17 వ వాక్యం నుంచి 19 వ వాక్యం వరకు. ఎందుకంటే ఈ వాక్యాలలో షయల్తీయేలు మరియు పెదాయా లు యెకొన్యా కుమారులు అని పేర్కొనబడింది. అలాగే పెదాయా కుమారులలో జెరుబ్బాబెలు ఒకడని కూడా పేర్కొనబడింది.

427 'దినవృత్తాంతములు మొదటి గ్రంథము' యొక్క 3 వ అధ్యాయంలోని 19 వ వాక్యం నుంచి 20 వ వాక్యం వరకు ఈ విధంగా పేర్కొనబడింది :

**" జెరుబ్బాబెలు కుమారులు మెషుల్లాము హనన్యా; షెలోమీతు వారికి సహోదరి. హషుబా**

(మిగిలిన భాగం తరువాతి పేజీలో)



విధంగా ప్రస్తావించారు: " కొంతమంది తూర్పుదేశపు జ్ఞానులు (అగ్ని ఆరాధకులు) తూర్పు దిక్కున క్రీస్తు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) పుట్టుకకు సంబంధించిన శుభవార్తను సూచించే ఒక నక్షత్రమును చూశారు. దానిని చూసి వారు యెరూషలేముకు చేరుకున్నారు. ఆ నక్షత్రం వారికి మార్గనిర్దేశనం కావించింది. వారు చూసిన ఆ నక్షత్రము ఆ శిశువు ఉండిన చోటికి మీదుగా వచ్చి నిలుచువరకు వారికి ముందుగా నడిచెను"

అయితే ఈ సంఘటన తప్పు. ఎందుకంటే గ్రహాల యొక్క చలనం, అలాగే కొన్ని తోకచుక్కల చలనదిశ పడమర నుంచి తూర్పు వైపుకు ఉంటుంది. అదేవిధంగా కొన్ని తోకచుక్కల చలన దిశ తూర్పు నుంచి పడమర వైపుకు ఉంటుంది. ఈ రెండు రకాల చలనాల ప్రకారం ఈ సంఘటన నిశ్చయంగా తప్పయినది, అసత్యమయినది. ఎందుకంటే బేత్లెహేము[429] యెరూషలేము కు దక్షిణాన ఉంది. అయితే కొన్ని తోకచుక్కల చలనమార్గం కొంచెం ఉత్తర దిశ నుంచి దక్షిణ దిశ వైపుకు మళ్ళి ఉంటుందనే విషయం సత్యమే. అయితే ఆనాటి క్రైస్తవ తత్త్వవేత్తల అంచనా ప్రకారం భూమి భ్రమణ వేగం కంటే అటువంటి తోకచుక్కల భ్రమణ వేగం ఎంతో మందకొడిగా, తక్కువగా ఉంటుంది. అటువంటి మందకొడి చలనవేగమనేది ఎంతో దూరం వరకు ప్రయాణించిన తర్వాత మాత్రమే అనుభూతిలోకి వస్తుంది. అయితే తక్కువ దూరాన్ని వేగంగా ప్రయాణించినప్పుడయితే ఆ వేగం అనుభూతిలోకి వస్తుంది. కనుక మానవుని వేగం అటువంటి నక్షత్ర వేగం కంటే ఎంతో ఎక్కువ (అటువంటి నక్షత్ర చలనవేగం భూమి చలనవేగం కంటే తక్కువ అయిన కారణంగా) అయిన కారణంగా ఆ నక్షత్రం ఆ తూర్పుదేశపు జ్ఞానుల కంటే ముందుగా నడవడమనేది ఆమోదయోగ్యం కాదు.

ఇక రెండవ విషయమేమిటంటే నడుస్తున్న మానవునికి ఒక నక్షత్రం చలిస్తూ చలిస్తూ నిలిచిపోవడమనేది ముందుగా కనిపించడం, ఆ తర్వాత మానవుడు స్వయంగా నిలిచిపోవడమనేది దర్శనశాస్త్రానికి విరుద్ధమైనది. వాస్తవానికి మానవుడు ముందుగా నిలిచిపోయినప్పుడు తర్వాత

**(అథఃసూచికలు)**

427 వ అథఃసూచిక తరువాయి భాగం)

**ఓహెలు బెరెక్యా హసద్యా యూషబెస్హెదు అను మరి యయిదుగురుండరి. "**

428 ఈ వైరుధ్యాలను ఇదే గ్రంథంలోని 123 వ మరియు 124 వ పేజీలలో చూడవచ్చు.

429 బేత్లెహేములోనే ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) పుట్టుక సంభవించింది.

నక్షత్రం కూడా నిలిచిపోవడమనేది దర్శనమిస్తుంది. [430]

## దైవప్రవక్త హజ్రత్ అష్ఇయా బిన్ ఆమూస్ (అ) (యెషయా) యొక్క భవిష్యద్వాణి యొక్క నెరవేర్పు మరియు 'కన్యక' అనే పదానికి సంబంధించి పరిశోధన 50 వ తప్పు

మత్తయి సువార్త యొక్క మొదటి అధ్యాయంలో [431] ఈ విధంగా పేర్కొనబడింది:

**" ఇదిగో కన్యక గర్భవతియై కుమారుని కనును. ఆయనకు ఇమ్మానుయేలను పేరు పెట్టుదురు అని ప్రభువు తన ప్రవక్త ద్వారా పలికిన మాట నెరవేరునట్లు ఇదంతయు జరిగెను"**

ఈ వాక్యంలో 'ప్రవక్త' అనే పదం హజ్రత్ అష్ఇయా (అ) (యెషయా) ను సూచిస్తుందనేది క్రైస్తవుల అభిప్రాయం. ఎందుకంటే యెషయా గ్రంథము యొక్క 7 వ అధ్యాయపు 14 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" కాబట్టి ప్రభువు తానే యొక సూచన మీకు చూపును ఆలకించుడి, కన్యక గర్భవతియై కుమారుని కని అతనికి ఇమ్మానుయేలను పేరు పెట్టును"**

అయితే ఈ విషయం కొన్ని కారణాల రీత్యా తప్పు అని మేము పేర్కొంటున్నాము.

**(1)** మొదటి కారణమేమిటంటే ఏ పదాన్నయితే మత్తయి మరియు యెషయా గ్రంథ అనువాదకులు 'కన్యక' అని అనువదించారో అది వాస్తవానికి స్త్రీ లింగ పదం. యూదు పండితుల దృష్టిలో ఈ

**(అథఃసూచికలు)**

[430] అయితే ఈ అభ్యంతరం మా అభిప్రాయం ప్రకారం ఎంతో బలహీనమైనది. ఎందుకంటే దైవం తరఫున ఒక మహిమాన్విత కార్యంగా ఒక దైవప్రవక్త కొరకు అటువంటి అద్భుత కార్యం వెలువడడమనేది విచిత్రమైన, అసాధ్యమయిన విషయమేమీ కాదు. (అల్లాహ్‌కే సర్వం ఎరుక)

(హజ్రత్ మౌలానా ముహమ్మద్ తఖీ ఉస్మానీ సాహెబ్ (అథఃసూచికల కూర్పుకర్త))

[431] 22 వ వాక్యంలో ఈ విషయం పేర్కొనబడింది. తెలుసుకోవలసిన విషయమేమిటంటే మత్తయి సువార్తలో పేర్కొనబడిన ఈ విషయం ఈ భవిష్యద్వాణి ఏసుక్రీస్తు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) ను ఉద్దేశించినదేనని వెల్లడిస్తుంది.



పదానికి 'యువతి' అని అర్థం, ఆమె కన్యక అయిపోయినా, కాకపోయినా. అలాగే ఈ పదం 'సామెతలు గ్రంథము' యొక్క 30 వ అధ్యాయంలో [432] కూడా ఉపయోగించబడిందని పేర్కొంటారు. అక్కడ ఈ పదం వివాహితురాలయిన యువతి కొరకు ఉపయోగించబడింది. హజ్రత్ అష్ఇయా (అ) (యెషయా) వాక్కులో 'అలమహ్' అనే పదం మూడు గ్రీకు బైబిల్ అనువాద గ్రంథాలలోనూ (అనగా 'ఏకోయిలా', 'థియోడోషన్ ' మరియు 'సమీకస్' అనే మూడు గ్రీకు బైబిల్ అనువాద గ్రంథాలలో) 'యువతి' అని అనువదించబడింది. ఈ అనువాద గ్రంథాలు వారి దృష్టిలో అన్నింటికంటే ప్రాచీనమైనవి. మొదటి గ్రీకు అనువాద గ్రంథం క్రీ.శ. 129 లో వెలువడిందని, రెండవ గ్రీకు అనువాద గ్రంథం. క్రీ.శ. 175 లో వెలువడిందని, మూడవ గ్రీకు అనువాద గ్రంథం క్రీ.శ. 200 లో వెలువడిందని వారు పేర్కొంటారు. ఆ మూడు అనువాద గ్రంథాలూ ప్రాచీన కాలానికి చెందిన క్రైస్తవ పండితుల దృష్టిలో ఎంతో విశ్వసనీయమైనవి, ముఖ్యంగా థియోడోషన్ అనువాద గ్రంథం. కనుక యూదు పండితుల వ్యాఖ్యానాల దృష్ట్యా మరియు ఈ మూడు గ్రీకు అనువాద గ్రంథాల వివరణ దృష్ట్యా మత్తయి సువార్తలో ఈ అంశానికి సంబంధించి పేర్కొనబడిన విషయం తప్పని ఋజువవుతోంది.

ఫెర్రీ తాను హిబ్రూ భాష పదాలకు సంబంధించి వ్రాసిన, ప్రొటెస్టెంట్ క్రైస్తవ వర్గానికి చెందిన పండితుల ద్వారా బహుధా విశ్వసనీయమైనదిగా ప్రశంసించబడిన గ్రంథంలో ఈ విధంగా పేర్కొన్నారు: " ఇది ఎజ్రా మరియు యువతికి సంబంధించినట్టిది. " ఫెర్రీ వ్యాఖ్య ప్రకారం ఈ పదం రెండు అర్థాలనూ సూచిస్తుంది.

అయితే అతడి వ్యాఖ్య హిబ్రూ భాషీయులయిన యూదు పండితుల వ్యాఖ్యానాలతో పోలిస్తే ఆమోదించబడదు. అతడి వ్యాఖ్యను అంగీకరించిన తర్వాత కూడా ఈ పదం యూదు పండితుల వ్యాఖ్యానాలకు, ప్రాచీన అనువాద గ్రంథాలకు విరుద్ధంగా 'కన్యక' అనే అర్థంలో ఉపయోగించబడిందని నిరూపించేందుకై ఏదయినా ఆధారాన్ని, ప్రమాణాన్ని చూపవలసిన ఆవశ్యకత ఏర్పడుతుంది. 'మీజానుల్ హఖ్' గ్రంథ రచయిత తన ' హల్లుల్ ఇష్కాల్ ' అనే గ్రంథంలో ' ఈ పదానికి 'కన్యక' అనే అర్థం తప్ప మరొక అర్థమేదీ లేదు'' అని పేర్కొన్నారు. అయితే ఆయన వ్యాఖ్య తప్పని నిరూపించేందుకై మేము పైన అందించిన వివరణ సరిపోతుంది.

**(2)** ఏసు ను (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)ను) ఎన్నడూ ఏ వ్యక్తి కూడా 'ఇమ్మానుయేలు'

**(అథఃసూచికలు)**

[432] బహుశా అది 23 వ వాక్యం అయి ఉండవచ్చు. 23 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది: **" కంటకురాలై యుండి పెండ్లియైన స్త్రీ ..... "**

అని పిలువలేదు. ఆ విధంగా ఆయనకు ఆయన తల్లీ పేరు పెట్టలేదు, తండ్రీ (క్రైస్తవుల విశ్వాసం ప్రకారం వడ్రంగి అయిన యోసేపు) పేరు పెట్టలేదు. ఆయన పేరు 'ఏసు' అని నిర్ణయించబడింది. అలాగే దైవదూత ఆయన తండ్రి [433] కి కలలో కనిపించి ఆయనకు యేసు అని పేరు పెట్టవలసిందిగా సూచించినట్లుగా పేర్కొనబడింది. దీనికి సంబంధించిన వివరణ మత్తయి సువార్త యొక్క మొదటి అధ్యాయంలో ఉంది. [434]

దైవదూత గాబ్రియేలు (హజ్రత్ జిబ్రయీల్ (అ)) కూడా ఆయన మాతృమూర్తి అయిన మరియ (హజ్రత్ మర్యమ్ (అ)) తో ఈ విధంగా పలికారు:

**" ఇదిగో నీవు గర్భము ధరించి కుమారుని కని ఆయనకు యేసు అను పేరు పెట్టుదువు"**

దీనికి సంబంధించిన వివరణ లూకా సువార్త యొక్క మొదటి అధ్యాయంలో ఉంది. [435]

ఏ సంఘటనకు సంబంధించిన వాక్యంలోనయితే ఈ పదం ఉపయోగించబడిందో అది దాని నెరవేర్పు ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) ద్వారా జరిగిందనే విషయాన్ని నిరాకరిస్తోంది. అసలు జరిగిన సంఘటన ఏమిటంటే యూదా రాజైన ఉజ్జియా మనుమడును యోతాము కుమారుడునైన ఆహాజు దినములలో సిరియా రాజైన రెజీనును ఇశ్రాయేలు రాజును రెమల్యా కుమారుడునైన పెకహును యుద్ధము చేయవలెనని యెరూషలేముకు చేరుకున్నారు. యూదా రాజు వారిద్దరూ ఏకమవడం పట్ల ఎంతగానో భయపడ్డాడు. అయితే దేవుడు యెషయా (హజ్రత్ అష్ఇయా (అ)) వద్దకు ఈ విధంగా తన వాణిని పంపాడు: " నీవు ఆహాజుకు సాంత్వన చేకూర్చేందుకై అతడితో ఈ విధంగా పలుకు: ' నీవు ఎంతమాత్రం భయపడవద్దు. వారిద్దరూ కలిసి కూడా నీ పై ప్రాబల్యం వహించలేరు. అతిత్వరలోనే వారి సామ్రాజ్యాలు అంతరించిపోతాయి.'' అలాగే వారి సామ్రాజ్యాలు అంతరించడానికి సంబంధించిన సూచనగా ఒక యువతి గర్భవతి అయి పిల్లవాడిని కంటుందని, ఆ పిల్లవాడు విచక్షణా జ్ఞానాన్ని పొందే

(అథఃసూచికలు)

433 అనగా (క్రైస్తవుల విశ్వాసం ప్రకారం వడ్రంగి అయిన యోసేపు)

434 మత్తయి, 1 వ అధ్యాయపు 21 వ వాక్యము.

435 లూకా, 1 వ అధ్యాయపు 31 వ వాక్యము.



వయస్సుకు చేరుకోవడానికి ముందే ఆ ఇద్దరు రాజులకు చెందిన సామ్రాజ్యాలు అంతరించిపోతాయని దేవుడు తెలియజేశాడు.[436]

నిశ్చితమయిన విషయమేమిటంటే పెకహు కు చెందిన సామ్రాజ్యం ఈ భవిష్యద్వాణి వెలువడిన తర్వాత సరిగ్గా 21 సంవత్సరాలకు అంతరించిపోయింది. కనుక ఆ పిల్లవాడు ఆ కాలానికి ముందే పుట్టడమనేది తప్పనిసరి అవుతుంది. అలాగే ఆ పిల్లవాడు యుక్తవయస్సుకు చేరుకోవడానికి ముందే ఆ సామ్రాజ్యం అంతరించిపోవడం జరగాలి. అయితే ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) పెకహు యొక్క సామ్రాజ్యం అంతరించిపోయిన తర్వాత సరిగ్గా 721 సంవత్సరాలకు ప్రభవించారు.

గ్రంథవహులు ( క్రైస్తవులు మరియు యూదులు) స్వయంగా ఈ భవిష్యద్వాణి (లేఖనము) యొక్క నెరవేర్పు విషయంలో భిన్నాభిప్రాయాలను కలిగియున్నారు. కొంతమంది **" యువతి అంటే తన సతీమణి అనేది యెషయా అభిప్రాయము. ఆయన ఈ విధంగా పేర్కొన్నారు: 'ఆమె త్వరలోనే గర్భవతి అయి ఒక పిల్లవాడిని కంటుంది. ఏ ఇద్దరు రాజుల విషయంలోనయితే ప్రజలు భయభ్రాంతులకు లోనయి ఉన్నారో వారి సామ్రాజ్యాలు ఆ పిల్లవాడు విచక్షణా జ్ఞానాన్ని కలిగియుండే వయస్సుకు చేరుకోవడానికి ముందే అంతరించిపోతాయి"** అనే అభిప్రాయానికి అధిక ప్రాధాన్యతనిచ్చారు. దీనికి సంబంధించిన వివరణను డాక్టర్ హట్సన్ అందజేశారు. నిజానికి ఈ అభిప్రాయం ఆమోదయోగ్యమైనదే, అంచనాకు అందే పరిధిలోనే ఉంది.

## 51 వ తప్పు స్పష్టమైన రీతిలో ప్రక్షిప్తం

మత్తయి సువార్త యొక్క 2 వ అధ్యాయపు 15 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" అప్పుడతడు లేచి, రాత్రివేళ శిశువును తల్లిని తోడుకొని, ఐగుప్తునకు వెళ్ళి 'ఐగుప్తులో నుండి నా కుమారుని పిలిచితిని అని ప్రవక్త ద్వారా ప్రభువు సెలవిచ్చిన మాట నెరవేర్చబడునట్లు హేరోదు[437] మరణము వరకు అక్కడ నుండెను."**

ఈ వాక్యంలో ప్రవక్త అంటే హజ్రత్ యూషఅ బిన్ నూన్ (అ) (యెహోషువ)[438].

(అథఃసూచికలు)

436 చూడండి : యెషయా 7 వ అధ్యాయము, 1 వ వాక్యం నుంచి 16 వ వాక్యం వరకు

మత్తయి సువార్త రచయిత ఆయన యొక్క గ్రంథం యొక్క 11 వ అధ్యాయపు 1 వ వాక్యం వైపుకు సూచించడం జరిగింది. అయితే అది పూర్తిగా తప్పు. ఎందుకంటే ఈ వాక్యానికి దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) తో ఎటువంటి సంబంధమూ లేదు. ఎందుకంటే ఆ వాక్యం ఈ విధంగా ఉంది:

**" ఇశ్రాయేలు బాలుడైయుండగా నేను అతనియెడల ప్రేమ గలిగి వాని సంతానమును ఐగుప్తు దేశములో నుండి పిలిచితిని"**

క్రీ.శ. 1811 లో ప్రచురించబడిన అరబీ బైబిల్ అనువాద గ్రంథంలో ఈ విధంగానే పేర్కొనబడి ఉంది. కనుక ఈ వాక్యం వాస్తవానికి దేవుడు ఇశ్రాయేలీయులకు దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) (మోషే) కాలంలో చేసిన మేలకు సంబంధించిన వ్యక్తీకరణ. మత్తయి ఈ వాక్యంలో బహువచన పదాన్ని ఏకవచన పదంగా, ప్రథమ పరుష పదాన్ని ఉత్తమ పురుషగా మార్చివేసి ఈ విధంగా పేర్కొన్నారు: " నేను నా కుమారుని పిలిచితిని' దీనిని అనుసరిస్తూ క్రీ.శ. 1544 లో ప్రచురించబడిన బైబిల్ అరబీ అనువాద ప్రతి యొక్క అనువాదకుడు అదేవిధంగా ప్రక్షిప్తానికి పాల్పడడం జరిగింది.[439]

అయితే ఆ అనువాదకుడు ప్రక్షిప్తానికి పాల్పడిన విషయాన్ని హోషేయ గ్రంథం యొక్క

**(అథఃసూచికలు)**

[437] అనగా వడ్రంగి అయిన యోసేపు దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) ను, ఆయన మాతృమూర్తిని తీసుకొని హేరోదు ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) ను హతమార్చకుండా ఉండేందుకై ఈజిప్టు (ఐగుప్తు) కు వెళ్ళిపోయారు. తర్వాత హేరోదు మరణించేంతవరకు వారు అక్కడే ఉన్నారు.

[438] పాఠకులచే చదువబడుతున్న ఈ గ్రంథం యొక్క అన్ని ప్రతుల్లోనూ హజ్రత్ యూషత్ బిన్ నూన్ (అ) (యెహోషువ) అని పేర్కొనబడింది. వాస్తవానికి మత్తయి సువార్త యొక్క 2 వ అధ్యాయపు 15 వ వాక్యంలో 'ప్రవక్త' అనే పదం హోషేయ ను సూచిస్తుందని పేర్కొనబడాలి. ఎందుకంటే హోషేయ గ్రంథం యొక్క 11 వ అధ్యాయం ప్రారంభంలోనే రాబోయే వాక్యం పేర్కొనబడి ఉంది. (మౌలానా ముహమ్మద్ తఖీ ఉస్మానీ సాహెబ్)

[439] ఆ తర్వాతి కాలానికి చెందిన అనువాదకులందరూ అదేవిధంగా ప్రక్షిప్తానికి పాల్పడ్డారు. మా వద్ద ఉన్న అనువాద ప్రతులన్నింటిలోనూ ఈ వాక్యంలో 'నా కుమారుని' అని పేర్కొనబడి ఉంది.



11 వ అధ్యాయాన్ని పూర్తిగా అధ్యయనం చేసే వ్యక్తి తప్పకుండా గుర్తిస్తాడు. ఎందుకంటే హోషేయ గ్రంథం యొక్క 11 వ అధ్యాయపు మొదటి వాక్యంలో ఎవరి గురించయితే పేర్కొనడం జరిగిందో వారి గురించి రెండవ వాక్యంలో ఈ విధంగా పేర్కొనడం జరిగింది [440] :

**" ప్రవక్తలు వారిని పిలిచినను బయలు దేవతలకు వారు బలులనర్పించిరి "**

ఈ విషయాలు ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) కు ఎంతమాత్రం వర్తించవు. అలాగే ఆయన కాలంలో ఉండిని యూదులకు సైతం ఇవి వర్తించవు. అలాగే ఆయన పుట్టుకకు 500 సంవత్సరాల పూర్వం వరకు ఉనికిలో ఉండిన యూదులకు సైతం ఇవి వర్తించవు. ఎందుకంటే యూదులు ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) పుట్టుకకు 536 సంవత్సరాల పూర్వమే (బబులోను ఖైదు నుంచి స్వాతంత్ర్యాన్ని పొందిన తర్వాత) విగ్రహారాధన పట్ల పశ్చాత్తాపం చెందుతూ దైవం వైపుకు మరలారు. ఆ తర్వాత వారు ఎన్నడూ విగ్రహారాధన కొరకు సంకల్పించలేదు. దీనికి సంబంధించిన వివరణ మనకు చరిత్ర గ్రంథాలలో లభ్యమవుతుంది. కనుక హోషేయ గ్రంథం యొక్క 11 వ అధ్యాయపు మొదటి వాక్యంలో వాస్తవానికి ' నేను అతడి (అనగా ఇశ్రాయేలు యొక్క) సంతానమును (అనగా యూదులను) ఐగుప్తు దేశములో నుండి పిలిచితిని' అని దేవుడు పలికినట్లుగా వ్రాయబడి ఉండాలి. అయితే ప్రక్షిప్తానికి గురయిన కారణంగా 'నేను అతని యెడల ప్రేమ గలిగి నా కుమారుని ఐగుప్తు దేశములో నుండి పిలిచితిని' అని ప్రస్తుత బైబిల్ అనువాద గ్రంథాలలో పేర్కొనబడి ఉంది.

# హేరోదు పిల్లలను హతమార్చడం 52 వ తప్పు

మత్తయి సువార్త యొక్క 2 వ అధ్యాయపు 16 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" ఆ జ్ఞానులు తన్ను అపహసించిరని హేరోదు గ్రహించి బహు ఆగ్రహము తెచ్చుకొని, తాను జ్ఞానుల వలన వివరముగా తెలిసికొనిన కాలమును బట్టి, బేత్లెహేములోను దాని సకల ప్రాంతములలోను, రెండు సంవత్సరములు మొదలుకొని తక్కువ వయస్సు గల మగపిల్లలనందరిని వధించెను."**

ఈ విషయం కూడా తార్కికంగానూ, ఉల్లేఖనపూర్వకంగానూ తప్పే. ఉల్లేఖనపూర్వకంగా ఎందుకు తప్పంటే విశ్వసనీయులయిన, ప్రామాణికులయిన, క్రైస్తవులు కాని చరిత్రకారులెవరూ

**(అథఃసూచికలు)**

[440] హోషేయ, 11 : 2

హేరోదు కాలంలో ఆ విధంగా పిల్లలు వధించబడ్డారనే విషయం గురించి పేర్కొనలేదు. చరిత్రకారుడయిన యూసీఫస్ సైతం ఆ సంఘటన గురించి వ్రాయలేదు. అలాగే హేరోదు యొక్క దోషాలను రంధ్రాన్వేషణ చేస్తూ వెలికితీసి వ్యాఖ్యానించే, అతడి అకృత్యాలను బహిర్గతం చేసే యూదు పండితులు సైతం దానిగురించి పేర్కొనలేదు. వాస్తవానికి ఆ విధంగా ఎంతోమంది పిల్లలను వధించడమనేది ఎంతో ఘోరమైన నేరం. అలాగే అది హేయమైన దోషం. ఒకవేళ ఆ సంఘటన వాస్తవికతకు సంబంధించిన ఏదయినా ఆధారమున్నట్లయితే వారు వెంటనే దానిని అందిపుచ్చుకొని ఆ సంఘటనను మరింత భయానకంగా మసాలా జోడించి వ్యాఖ్యానించేవారు. ఒకవేళ యాదృచ్ఛికంగా ఏ క్రైస్తవ చరిత్రకారుడయినా ఆ సంఘటన గురించి పేర్కొన్నట్లయితే అతడి ప్రస్తావనకు బైబిల్ లో మత్తయి సువార్తలో పేర్కొనబడిన విషయమే ఆధారమయి ఉండే కారణంగా అతడి వ్యాఖ్య విశ్వసనీయమైనది కాజాలదు.

అంతేగాకుండా తార్కికంగానూ ఆ సంఘటన విశ్వసనీయమైనదిగా గోచరించదు. ఎందుకంటే ఆ కాలంలో బేత్లెహేము ఒక చిన్న బస్తీగా ఉండేది. అది యెరూషలేము సమీపంలో ఉండేది. యెరూషలేము కు, బేత్లెహేముకు మధ్య గల దూరం ఎంతో తక్కువ. అలాగే బేత్లెహేమును సైతం హేరోదు రాజే పరిపాలించేవాడు, మరే ఇతర రాజూ పరిపాలించేవాడు కాదు. తూర్పు దేశపు జ్ఞానులు బేత్లెహేములో ఎవరెవరి ఇళ్ళకు వెళ్ళారు?[441] ఎవరెవరి ఇళ్ళలో బస చేశారు? ఎవరెవరి కొరకు కానుకలను, నజరానాలను తీసుకొచ్చారు? అనే విషయాలను గురించి ఆరా తీయడమనేది అతడి కొరకు ఎంతో సులభసాధ్యమయిన విషయం. కనుక పసిబాలురను వధించవలసిన అవసరం అతడికి ఉండేది కాదు.

**(అధఃసూచికలు)**

**441** వాస్తవానికి ఆ సంఘటన బైబిల్ లో ఈ విధంగా పేర్కొనబడింది: తూర్పు దేశపు జ్ఞానులు హేరోదు రాజు వద్దకు వచ్చి అతడి రాజ్యంలో ఒక బాలుడు పుట్టాడని, వానికి సంబంధించిన నక్షత్రాన్ని తాము తూర్పు దిక్కున చూశామని, తాము ఆ బాలునికి సాగిలపడేందుకు వచ్చామని, ఆ శుభవార్తను అందజేయడానికే అక్కడికి వచ్చామని తెలియజేయగా ఆ బాలుడు కనిపించగానే తనకు సైతం తెలియజేయమని, తాను కూడా ఆ బాలుడికి సాగిలపడతానని చెప్పి హేరోదు ఆ జ్ఞానులను పంపివేశాడు. అయితే ఆ జ్ఞానులు ఆ బాలునికి సంబంధించిన సమాచారాన్ని హేరోదుకు అందజేయకుండానే తిరిగి వెళ్ళిపోవడంతో హేరోదు కోపోద్రిక్తుడయి రెండు సంవత్సరాల లోపు గల పిల్లలందరినీ వధింపజేశాడు.



## 53 వ తప్పు

మత్తయి సువార్త యొక్క 2 వ అధ్యాయపు 17 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" రాహేలు తన పిల్లల విషయమై యేడ్చుచు వారు లేనందున ఓదార్పు పొందనొల్లక యుండెను అని ప్రవక్తయైన యిర్మీయా ద్వారా చెప్పబడిన వాక్యము నెరవేరెను"**

ఇది కూడా పూర్తిగా తప్పే. ఇది సువార్తను వ్రాసిన వ్యక్తి యొక్క ప్రక్షిప్తమే ('ప్రక్షిప్తము' అనగా మార్పులూచేర్పులకు పాల్పడడమని అర్థము). ఎందుకంటే ఈ విషయం 'యిర్మీయా గ్రంథము' యొక్క 31 వ అధ్యాయపు 15 వ వాక్యంలో పేర్కొనబడి ఉంది. ఏ వ్యక్తయితే ఈ వాక్యానికి ముందరి వాక్యాలను మరియు తరువాతి వాక్యాలను పఠిస్తాడో [442] అతడు ఈ విషయం హేరోదుకు సంబంధించిన సంఘటనతో ఎటువంటి సంబంధాన్నీ కలిగి లేదని సులభంగా గ్రహిస్తాడు. ఈ విషయం నెబుకద్నెజరు కు సంబంధించిన, యిర్మీయా కాలంలో జరిగిన సంఘటనతో సంబంధాన్ని కలిగియున్నదని కూడా అతడు గ్రహిస్తాడు. ఆ సంఘటన జరిగినపుడు వేలాదిమంది యూదులు హతమార్చబడ్డారు, వేలాదిమంది బంధించబడి బబులోను వైపుకు బహిష్కరించబడి కొనిపోబడ్డారు. వారిలో ఎంతోమంది రాహేలు సంతతికి చెందినవారయిన కారణంగా ఆమె ఆత్మ ఆత్మల లోకంలో చింతాక్రాంతమయింది. ఆ కారణంగానే దేవుడు ఆమె సంతతికి చెందినవారిని వారి శత్రువుల దేశం నుంచి వెలికితీసి వారి స్వదేశానికి తరలింపజేస్తానని వాగ్దానం చేశాడు.

## ఒక ప్రత్యేక విషయం:

యిర్మీయా గ్రంథంలో పేర్కొనబడిన విషయం ద్వారా మరియు మత్తయి సువార్త దానిని ధృవీకరించిన విషయం ద్వారా ఆత్మల లోకంలో మృతులకు ఇహలోకంలోని తమ బంధుమిత్రుల స్థితిగతులు వెల్లడవుతాయని, వారి కష్టాలకు, ఇబ్బందులకు సంబంధించిన

**(అధఃసూచికలు)**

**442** యిర్మీయా గ్రంథం యొక్క 31వ అధ్యాయపు 17 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది: **" రాబోవు కాలము నందు నీకు మేలు కలుగునను నమ్మికయున్నది, నీ పిల్లలు తిరిగి తమ స్వదేశమునకు వచ్చెదరు; ఇదే యెహోవా వాక్కు."**

పరిస్థితుల గురించి తెలియడం వల్ల వారికి దుఃఖం కలుగుతుందని విదితమవుతోంది. అయితే ఈ విషయం ప్రొటెస్టెంట్ క్రైస్తవ వర్గానికి చెందిన విశ్వాసాలకు పూర్తిగా విరుద్ధమైనది.

## 54 వ తప్పు

మత్తయి సువార్త యొక్క 2 వ అధ్యాయపు 23 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" నజరేతను ఊరికి వచ్చి అక్కడ కాపురముండెను. ఆయన [443] నజరేయుడనబడునని ప్రవక్తలు చెప్పినమాట నెరవేరునట్లు (ఈలాగు జరిగెను)"**

ఇది కూడా ఖచ్చితంగా తప్పే. ఈ విషయం ఏ ప్రవక్తకు చెందిన ఏ గ్రంథములోనూ మనకు లభ్యం కాదు. యూదులు సైతం ఈ విషయాన్ని తీవ్రస్థాయిలో వ్యతిరేకిస్తారు. వారి దృష్టిలోనయితే ఇది పూర్తిగా అసత్యం మరియు ఆరోపణ. అందుకు విరుద్ధంగా వారి విశ్వాసం ఏమిటంటే ఏ దైవప్రవక్తయినా గలిలయ లో ప్రభవించడం జరగదు. నజరేతులోనూ ప్రభవించడం జరగదు. ఈ విషయం గురించి యోహాను సువార్త యొక్క 7 వ అధ్యాయపు 52 వ వాక్యంలో స్పష్టమైన రీతిలో పేర్కొనబడింది[444]. ఈ విషయానికి సంబంధించి క్రైస్తవ పండితులు ఎంతో బలహీనమైన సంజాయిషీలతో కూడిన వివరణలను అందజేస్తూ ఉంటారు. అవి ఆమోదయోగ్యమైనవి కావు.[445] పాఠకులు మత్తయి సువార్త యొక్క కేవలం మొదటి మరియు రెండవ అధ్యాయాలలోనే 17 తప్పులుండటాన్ని ఇప్పటికే గమనించి ఉంటారు.

**(అథఃసూచికలు)**

[443] అనగా ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)).

[444] " **వారు - నీవును గలిలయుడవా? విచారించి చూడుము, గలిలయలో ఏ ప్రవక్తయు పుట్టడనిరి** " (యోహాను సువార్త, 7 : 52)

[445] ఇటీవలి కాలానికి చెందిన బైబిల్ వ్యాఖ్యాతలలో ఆర్.ఏ. నాక్స్ ఈ విషయానికి సంబంధించి బైబిల్ వ్యాఖ్యాతలు అందజేసిన పలు వివరణలను గురించి ప్రస్తావించిన తర్వాత ఈ విధంగా పేర్కొన్నారు: " వాస్తవమేమిటంటే బైబిల్ పాతనిబంధనలో ఏ ఒక్కచోట కూడా ఏసు కొరకు

(మిగిలినభాగం తరువాతి పేజీలో)



# యోహాను (హజ్రత్ యహ్యా (అ)) ఎప్పుడు విచ్చేశారు?

## 55 వ తప్పు

క్రీ.శ. 1671 లోనూ, క్రీ.శ.1821 లోనూ, క్రీ.శ. 1826 లోనూ, క్రీ.శ. 1854 లోనూ, క్రీ.శ. 1880 లోనూ ప్రచురించబడిన బైబిల్ అరబీ అనువాద ప్రతులలో మత్తయి సువార్త యొక్క 3 వ అధ్యాయపు 1 వ వాక్యం ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" ఆ దినములందు బాప్తిస్మమిచ్చు యోహాను వచ్చి యూదయ అరణ్యములో ప్రకటించుచుండెను" [446]**

అలాగే క్రీ.శ. 1816 లోనూ, క్రీ.శ.1828 లోనూ, క్రీ.శ. 1841 లోనూ, క్రీ.శ. 1842 లోనూ ప్రచురించబడిన బైబిల్ ఫార్సీ (పారశీక) అనువాద ప్రతులలో మత్తయి సువార్త యొక్క 3 వ అధ్యాయపు 1 వ వాక్యం ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" ఆ దినములందే బాప్తిస్మమిచ్చు యోహాను యూదయ అరణ్యములో వ్యక్తమయ్యెను"**

మత్తయి సువార్త యొక్క 2 వ అధ్యాయంలో హేరోదు మరణించిన తర్వాత అతడి కుమారుడయిన అర్కెలాయు యూదాకు రాజయ్యెననియు, వడ్రంగి అయిన యోసేపు తన భార్యను, కుమారుడిని వెంటబెట్టుకొని గలిలియ ప్రాంతములకు వెళ్ళి, నజరేతను ఊరికి వచ్చి అక్కడ కాపురముండెననియు పేర్కొనబడింది. కనుక పైన పేర్కొనబడిన వాక్యములో 'ఆ దినములయందు' అంటే నిశ్చయంగా ఈ సంఘటనలు జరిగిన కాలంలోనేయని విదితమవుతోంది. కాబట్టి హేరోదు కుమారుడయిన అర్కెలాయు పట్టాభిషిక్తుడయిన, వడ్రంగియైన

**(అథఃసూచికలు)**

( 445 వ అథఃసూచిక తరువాయి భాగం )

ఆయన నజరేయుడయి ఉంటారనే సూచనను పేర్కొనడమనేది జరగలేదు"

('Commentory on New Testament', క్రీ.శ. 1953 లో లండన్ నుంచి ప్రచురితం, సంపుటి : 1, పేజీ : )

[446] ఇది క్రీ.శ. 1958 లో ప్రచురించబడిన బైబిల్ ఉర్దూ అనువాద గ్రంథంలోని వాక్యానికి తెలుగు అనువాదము.

యోసేపు నజరేతులో నివాసమేర్పరచుకున్న కాలంలోనే యోహాను (దైవప్రవక్త హజ్రత్ యహ్యా (అ)) విచ్చేయడం నిశ్చితమవుతుంది. అయితే ఇది పూర్తిగా తప్పు. ఎందుకంటే యోహాను (దైవప్రవక్త హజ్రత్ యహ్యా (అ)) ఆ సంఘటనలు జరిగిన 28 సంవత్సరాల తర్వాత విచ్చేశారు[447].

## హేరోదియ భర్త పేరు 56 వ తప్పు

మత్తయి సువార్త యొక్క 14 వ అధ్యాయపు 3 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" ఏలయనగా - నీవు నీ సోదరుడైన ఫిలిప్పు భార్యయగు హేరోదియను ఉంచుకొనుట న్యాయము కాదని యోహాను చెప్పగా, హేరోదు ఆమె నిమిత్తము యోహానును పట్టుకొని బంధించి చెరసాలలో వేయించియుండెను"**

ఇది కూడా తప్పే. ఎందుకంటే హేరోదియ భర్త పేరు ఫిలిప్పు కాదు. ఆమె భర్త పేరు కూడా హేరోదు అని చరిత్రకారుడయిన యూసీఫస్ తన చారిత్రక గ్రంథం యొక్క 8 వ సంపుటి లోని 5 వ అధ్యాయంలో పేర్కొన్న విషయం ద్వారా మనకు తెలుస్తుంది.

(అథఃసూచికలు)

[447] లూకా సువార్త యొక్క 3 వ అధ్యాయపు 1 వ వాక్యంలో తిబెరికైసరు (Tiberius) ఏలుబడిలో పదిహేనవ సంవత్సరంలో యూదయ రాజ్యానికి పొంతిపిలాతు అధిపతిగా ఉన్న కాలంలో యోహాను (దైవప్రవక్త హజ్రత్ యహ్యా (అ) యూదయ అరణ్యములో విచ్చేసి దేవుని వాక్కును వినిపించారనే విషయం పేర్కొనబడింది. ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) పుట్టుక సంభవించిన 14 సంవత్సరాల తర్వాత తిబెరికైసరు పట్టాభిషిక్తుడయ్యాడు. (బ్రిటానికా ఎన్‌సైక్లోపేడియా, సంపుటి : 22, పేజీ : 1760, ఆర్టికల్ : తిబెరికైసరు) కనుక ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) పుట్టుక సంభవించిన 29 సంవత్సరాలకు యోహాను (దైవప్రవక్త హజ్రత్ యహ్యా (అ) విచ్చేయడం జరిగిందని విదితమవుతుంది. అర్కెలాయు ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) పుట్టుక సంభవించిన ఏడవ సంవత్సరంలో యూదా రాజ్యాధికారాన్ని కోల్పోయాడు. (బ్రిటానికా ఎన్‌సైక్లోపేడియా, సంపుటి : 2, పేజీ : 246, ఆర్టికల్ : అర్కెలాయు) ఒకవేళ అర్కెలాయు ప్రభుత్వపు ప్రారంభం, వడ్రంగి అయిన యోసేపు నజరేతులో స్థిరపడడం అనే సంఘటనలు ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) పుట్టుకకు ముందే సంభవించినట్లుగా భావించిన పక్షంలో అవి జరిగిన 28 సంవత్సరాల తర్వాత యోహాను (దైవప్రవక్త హజ్రత్ యహ్యా (అ)) విచ్చేసినట్లుగా నిరూపితమవుతుంది. ( మౌలానా ముహమ్మద్ తఖీ ఉస్మానీ సాహెబ్ )



## 57 వ తప్పు

మత్తయి సువార్త యొక్క 12 వ అధ్యాయపు 3 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" ఆయన వారితో ఇట్లనెను - తానును తనతో కూడ నున్నవారును ఆకలిగొని యుండగా దావీదు చేసిన దాని గూర్చి మీరు చదువలేదా? అతడు దేవుని మందిరములో ప్రవేశించి, యాజకులే తప్ప తానైనను తనతో కూడ ఉన్నవారైనను తినకూడని సముఖపు రొట్టెలు తినెను. "**

(మత్తయి, 12 : 3, 4 వాక్యాలు)

ఈ వాక్యంలో 'తనతో కూడ ఉన్నవారైనను' అనే పదబంధం తప్పు. ఈ విషయం పాఠకులకు ఇదే గ్రంథంలో '92 వ తప్పు' అనే మకుటం క్రింద పేర్కొనబడిన వివరణ ద్వారా త్వరలోనే తెలుస్తుంది.

## 58 వ తప్పు

మత్తయి సువార్త యొక్క 27 వ అధ్యాయపు 10 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" అప్పుడు - విలువ కట్టబడినవాని, అనగా ఇశ్రాయేలీయులలో కొందరు విలువ కట్టినవాని క్రయధనమైన ముప్పది వెండి నాణెములు తీసికొని ప్రభువు నాకు నియమించిన ప్రకారం వాటిని కుమ్మరి వాని పొలమున కిచ్చిరి అని ప్రవక్తయైన యిర్మీయా ద్వారా చెప్పబడిన మాట నెరవేరెను"**

ఇది కూడా తప్పే. ఈ విషయం పాఠకులకు వారిచే చదువబడుతున్న ఈ గ్రంథం యొక్క రెండవ సంపుటిలోని రెండవ అధ్యాయపు లక్ష్యం -2, బుజువు- 29 ద్వారా విదితమవుతుంది.[448]

## ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) శిలువ శిక్షకు గురయినప్పుడు (అల్లాహ్ మన్నించుగాక) భూమి కంపించడం 59 వ తప్పు

మత్తయి సువార్త యొక్క 27 వ అధ్యాయపు 52 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి

(అథఃసూచికలు)

[448] ఈ గ్రంథము యొక్క రెండవ సంపుటిలోని రెండవ అధ్యాయంలో దీనికి సంబంధించిన వివరణను పొందగలరు.

ఉంది:

**" అప్పుడు దేవాలయపు తెర పైనుండి క్రింది వరకు రెండుగా చినిగెను; [449] భూమి వణకెను; బండలు బద్దలాయెను; సమాధులు తెరవబడెను; నిద్రించిన అనేకమంది పరిశుద్ధుల శరీరములు లేచెను. వారు సమాధుల లోనుండి బయటికి వచ్చి ఆయన లేచిన తరువాత పరిశుద్ధ పట్టణములో ప్రవేశించి అనేకులకు అగపడిరి. "**

ఈ వాక్యాలు పూర్తిగా అసత్యమైనవి. పండితుడయిన టోర్టన్ బైబిల్‌కు మద్దతు తెలిపినప్పటికీ పైన పేర్కొనబడిన వాక్యాలు అసత్యమైనవిగా నిరూపించేందుకై తన గ్రంథంలో ఆధారాలను, ప్రమాణాలను పేర్కొంటూ ఈ విధంగా పేర్కొన్నారు:

" ఈ సంఘటన పూర్తిగా అసత్యమైనది. బహుశా యెరూషలేము నాశనమయిపోయి నిర్మానుష్యమయిపోయిన కాలంలో యూదులలో ఇటువంటి గాథలు, వర్ణనలు వ్యాపించి ఉంటాయి. బహుశా ఏ వ్యక్తో మత్తయి సువార్త యొక్క హిబ్రూ ప్రతిలో అథఃసూచికల వద్ద ఈ వాక్యాలను వ్రాసి ఉంటాడు. ఆ తర్వాత అథఃసూచికలలో వ్రాయబడియున్న ఈ వాక్యాలు మూల వాక్యాలతో పాటు కలిపి వ్రాయబడి ఉంటాయి. ఆ తర్వాత ఆ మూలప్రతి అనువాదకుడి వద్దకు చేరుకొని ఉంటుంది. అతడు ఆ ప్రతిలో వ్రాయబడియున్న వాటిని యథాతథంగా అనువదించి ఉంటాడు". [450]

ఈ వాక్యాలు అసత్యమయినవిగా, తప్పయినవిగా నిరూపించేందుకై ఎన్నో ప్రమాణాలు ఉన్నాయి.

**(1)** యూదులు ఏసుకు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)కు) శిలువ వేయబడిన (క్రైస్తవుల విశ్వాసం ప్రకారం) తరువాతి రోజు పిలాతు వద్దకు చేరుకొని ఈ విధంగా పలికారు:

---

**(అథఃసూచికలు)**

[449] అనగా ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) కు ( క్రైస్తవుల విశ్వాసం ప్రకారం) శిలువ వేయబడిన (అల్లాహ్ క్షమించుగాక) సమయంలో

[450] ఆర్. ఏ. నాక్స్ బైబిల్ క్రొత్తనిబంధన గ్రంథానికి తాను వ్రాసిన వ్యాఖ్యాన గ్రంథంలో దాదాపు ఇదేవిధంగా ఈ విషయాన్ని అంగీకరించారు. ఆయన ఈ విషయానికి సంబంధించి ఈ విధంగా పేర్కొన్నారు: " మత్తయి స్థానికంగా వ్యాపించియున్న వదంతులను ఇతరుల కంటే ఎక్కువగా విశ్వసించారు." **( Commentory on New Testament, Volume-1, Page: 70)**



**" మరునాడు అనగా సిద్ధపరచు దినమునకు మరుసటి దినమున ప్రధాన యాజకులును పరిసయ్యులును పిలాతు నొద్దకు కూడివచ్చి - అయ్యా, ఆ వంచకుడు సజీవుడై యుండినప్పుడు - మూడు దినములైన తరువాత నేను లేచెదనని చెప్పినది మాకు జ్ఞాపకమున్నది. కాబట్టి మూడవ దినము వరకు సమాధిని భద్రము చేయనాజ్ఞాపించుము.." [451]**

అలాగే మత్తయి ఈ అధ్యాయంలో [452] అతి స్పష్టంగా పిలాతు మరియు అతడి భార్య ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) ను శిలువ వేసి హతమార్చడం పట్ల సుముఖంగా లేరనే విషయాన్ని వెల్లడించారు. ఒకవేళ మత్తయి సువార్త యొక్క 27 వ అధ్యాయపు 52 వ వాక్యంలో పేర్కొనబడిన విషయాలు నిజంగానే జరిగియున్న పక్షంలో వారు ఆయన వద్దకు వెళ్ళేవారే కాదు. దేవాలయపు తెర పై నుండి క్రిందివరకు రెండుగా చినగడం, భూమి వణకడం, బండలు బద్దలు కావడం, సమాధులు తెరవబడడం, మృతులు సజీవులయి లేవడం మొదలయిన సంఘటనలన్నీ పిలాతు భావనకు మద్దతు చేకూరుస్తున్నాయి.

కనుక అటువంటి పరిస్థితుల్లో వారు (ప్రధాన యాజకులు, పరిసయ్యులు) పిలాతు వద్దకు వెళ్ళి ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) వంచకుడని (అల్లాహ్ క్షమించుగాక) పేర్కొన్నట్లయితే అతడు నిశ్చయంగా వారి శత్రువుగా మారిపోయి ఉండేవాడు. అలాగే " నేను ముందు నుంచే ఇందుకు సుముఖంగా లేను. ఇప్పుడయితే ఆయన (ఏసు) సత్యసంధతకు తార్కాణంగా ఈ సంకేతాలన్నీ బహిర్గతమయ్యాయి కూడా" అని పిలాతు వారితో పేర్కొని ఉండేవాడు.

**(2)** మత్తయి సువార్త యొక్క 27 వ అధ్యాయపు 52 వ వాక్యంలో పేర్కొనబడిన విషయాలు ఎంతో మహిమాన్వితమయిన అద్భుత కార్యాలు. ఒకవేళ అవన్నీ నిజంగానే జరిగియున్న పక్షంలో సహజంగానే ఎందరో రోమన్లు మరియు యూదులు క్రీస్తును (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)ను) విశ్వసించేవారు. బైబిల్‌లో ఒకచోట ఈ విధంగా పేర్కొనబడి ఉంది: పరిశుద్ధాత్మ ఏసు శిష్యులపై అవతరించినప్పుడు వారు వివిధ భాషల్లో మాట్లాడగా ప్రజలు ఎంతగానో ఆశ్చర్యచకితులయ్యారు.

---

**(అథఃసూచికలు)**

[451] మత్తయి సువార్త యొక్క 27 వ అధ్యాయం : 62 మరియు 63 వాక్యాలు

[452] మత్తయి సువార్త యొక్క 27 వ అధ్యాయం : 18 మరియు 19 వాక్యాలు.

అదే సమయంలో మూడువేల మంది విశ్వసించారు. ఈ విషయానికి సంబంధించిన వివరణ బైబిల్ క్రొత్తనిబంధన గ్రంథంలోని 'అపోస్తలుల కార్యములు' గ్రంథం యొక్క 2 వ అధ్యాయంలో [453] లభ్యమవుతాయి. అయితే మత్తయి సువార్త యొక్క 27 వ అధ్యాయపు 52 వ వాక్యంలో పేర్కొనబడిన విషయాలు వివిధ భాషల్లో మాట్లాడగలగడం కంటే గొప్పవి, మహిమాన్వితమైనవి.

**(3)** ఈ సంఘటనలు (అనగా మత్తయి సువార్త యొక్క 27 వ అధ్యాయపు 52 వ వాక్యంలో పేర్కొనబడిన విషయాలు) అంతగా ప్రసిద్ధమయిన సంఘటనలే అయిన పక్షంలో మత్తయి తప్ప ఆ కాలానికి చెందిన మరే ఇతర చరిత్రకారుడూ వాటి గురించి కనీసం ఒక్క పదమయినా వ్రాయకపోవడమనేది చాలా విచిత్రమైన విషయం. అదేవిధంగా ఆ కాలానికి సమీప కాలానికి చెందిన చరిత్రకారులు సైతం వాటి గురించి ఏమాత్రం ప్రస్తావించకపోవడం గమనార్హం. ఒకవేళ కేవలం శత్రుభావం కారణంగా, వ్యతిరేకత కారణంగా క్రైస్తవేతరులయిన చరిత్రకారులు వాటిగురించి ప్రస్తావించలేదని ఒకవేళ క్రైస్తవులు పేర్కొనే పక్షంలో కనీసం క్రైస్తవులయిన చరిత్రకారులు సైతం వాటిగురించి తప్పకుండా వ్రాసి ఉండాలి, ముఖ్యంగా లూకా. ఎందుకంటే ఆయనకు అద్భుత విషయాల గురించి వ్రాయడం పట్ల ఇతరుల కంటే ఎక్కువ ఆసక్తి ఉంది. ఆయన ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) ద్వారా వెలువడిన అద్భుత కార్యాలన్నింటి గురించి అన్వేషించి వాటి గురించి వ్రాసేవారు. ఈ విషయం ఆయన సువార్త యొక్క ఒకటవ అధ్యాయం ద్వారా మరియు 'అపోస్తలుల కార్యములు' యొక్క మొదటి అధ్యాయం ద్వారా విదితమవుతుంది. సువార్తీకులందరూ లేదా వారిలో ఎక్కువమంది ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) కు సంబంధించిన సాధారణ విషయాలన్నింటి గురించి పేర్కొని ఇంతటి మహిమాన్వితమైన అద్భుత సంఘటనల గురించి మాత్రం ఎంతమాత్రం పేర్కొనకపోవడమనేది విచిత్రమైన విషయం. మార్కు మరియు లూకా లు కేవలం దేవాలయపు తెర చినిగిపోవడం గురించి మాత్రమే ప్రస్తావించారు. మిగిలిన సంఘటనల గురించి వారు ఎంతమాత్రం ప్రస్తావించలేదు.

**(4)** ఆ దేవాలయపు తెర వెండితో చేయబడినది, ఎంతో మృదువయినది. మరి ఆ తెర ఆ దుఃఖం కారణంగా (అనగా ఏసు శిలువ వేయబడడానికి సంబంధించిన దుఃఖం) పై నుంచి క్రిందివైపుకు రెండుగా చిరిగిపోవడమేమిటో బోధపడలేదు. ఒకవేళ అది అటువంటి సంఘటన

**(అథఃసూచికలు)**

[453] అపోస్తలుల కార్యములు, 2 వ అధ్యాయం : 1 వ వాక్యం నుంచి 4 వ వాక్యం వరకు



కారణంగా చిరిగిపోగలిగినప్పుడు మరి దేవాలయం మాత్రం యథాతథంగా సురక్షితంగా ఉండిపోవడానికి కారణమేమిటి? ఈ అభ్యంతరం మూడు సువార్తల విషయంలో (అనగా మత్తయి, లూకా, మార్కు సువార్తలు) ఉమ్మడిగా లేవనెత్తబడుతుంది.

**(5)** అనేకమంది పరిశుద్ధులు సమాధులలో నుంచి సజీవులయి లేవడమనేది పౌలు వ్యాఖ్యకు పూర్తిగా వ్యతిరేకమైనట్టిది. ఎందుకంటే అతడు ఎంతో స్పష్టంగా ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) మృతులలో సజీవుడయి లేచిన, జాగృతమయిన మొట్టమొదటి వ్యక్తి అని పేర్కొన్నాడు. ఈ విషయం పాఠకులచే చదువబడుతున్న ఈ గ్రంథంలోని 'వైరుధ్యం నెం - 89' క్రింద పేర్కొనబడిన వివరణ ద్వారా విదితమవుతుంది. [454]

కనుక పండితుడయిన టోర్టన్ పేర్కొన్న విషయమే సత్యమయినది. ఆయన వ్యాఖ్య ద్వారా సువార్తలను అనువదించిన వ్యక్తి కేవలం అంచనాల ప్రాతిపదికన తన కార్యాన్ని నిర్వహించాడని, తప్పొప్పుల, మంచీచెడుల విచక్షణను అతడు కలిగియుండలేదని, మూలప్రతిలో ఏది కనిపించినా, అది సరియైనదయినా, తప్పయిన విషయమయినా అనువదించడమే తన పనిగా అనువదించుకుంటూపోయాడనే విషయమూ విదితమవుతుంది. మరి అటువంటి వ్యక్తి పేర్కొన్న విషయం ఆమోదయోగ్యమవుతుందా? దైవసాక్షిగా! ఎంతమాత్రమూ కాదు.

## ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) మూడు రోజుల తర్వాత సజీవులయి లేవడం 60 వ తప్పు నుంచి 62 వ తప్పు వరకు

మత్తయి సువార్త యొక్క 12 వ అధ్యాయపు 39 వ వాక్యం నుంచి 40 వ వాక్యం వరకు ఈ విధంగా పేర్కొనబడింది:

**" ఆయన ఇట్లనెను. - వ్యభిచారులైన చెడ్డ తరమువారు సూచక క్రియను అడుగుచున్నారు. ప్రవక్తయైన యోనాను గూర్చిన సూచక క్రియయే గాని మరి ఏ సూచక క్రియయైనను వారికి అనుగ్రహింపబడదు. యోనా [455] మూడు రాత్రింబగళ్ళు తిమింగలము కడుపులో ఏలాగుండెనో**

**(అథఃసూచికలు)**

[454] 166 వ పేజీలో

[455] అనగా దైవప్రవక్త హజ్రత్ యూనుస్ (అ) (యోనా)

**ఆలాగు మనుష్య కుమారుడు[456] మూడు రాత్రింబగళ్ళు భూగర్భములో ఉండును"**

మత్తయి సువార్త యొక్క 16 వ అధ్యాయపు 4 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" వ్యభిచారులైన చెడ్డతరము వారు సూచక క్రియ నడుగుచున్నారు, అయితే యోనాను గూర్చిన సూచక క్రియయే గాని మరి ఏ సూచక క్రియయైన వారికనుగ్రహింపబడదని వారితో చెప్పి వారిని విడిచి వెళ్ళిపోయెను"**

ఇక్కడ కూడా యోనా (దైవప్రవక్త హజ్రత్ యూనుస్ (అ)) ను గూర్చిన సూచక క్రియ అంటే ఇంతకు ముందు పేర్కొనబడిన వాక్యంలోని సూచక క్రియయే అని అర్థం చేసుకోవాలి. అదేవిధంగా మత్తయి సువార్త యొక్క 27 వ అధ్యాయపు 63 వ వాక్యంలో ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) గురించి యూదులు పలికిన వాక్కు క్రిందివిధంగా పేర్కొనబడి ఉంది:

**" ఆ వంచకుడు సజీవుడై యుండినప్పుడు - మూడు దినములైన తరువాత నేను లేచెదనని చెప్పినది మాకు జ్ఞాపకమున్నది.**

ఈ వాక్కులన్నీ ఎందుకు తప్పంటే ఏసుకు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)కు) సువార్తలలో పేర్కొనబడినదాని ప్రకారం శుక్రవారం నాడు దాదాపు మధ్యాహ్నవేళ శిలువ వేయబడింది. ఈ విషయం మనకు యోహాను సువార్త యొక్క 19 వ అధ్యాయం ద్వారా తెలుస్తుంది. అలాగే ( క్రైస్తవుల విశ్వాసం ప్రకారం) రాత్రి 9 గంటల వేళ ఆయన మృతి సంభవించింది. యోసేపు సాయంత్రవేళ పిలాతును ఆయన మృతదేహాన్ని తనకు అందజేయవలసిందిగా కోరడం జరిగిందని, ఆ తర్వాత అంతిమసంస్కారాలను పూర్తి కావించారని మనకు తెలుస్తుంది. ఈ విషయం మార్కు సువార్త [457] లో స్పష్టంగా పేర్కొనబడి ఉంది. కనుక తప్పనిసరిగా ఆయన శుక్రవారం నాడు రాత్రివేళ ఖననం చేయబడి ఉండాలి. ఆయన మృతదేహం ఆదివారం నాడు సూర్యోదయానికి ముందే అంతర్ధానమయిపోయింది. దీనికి సంబంధించిన వివరాలు మనకు

---

**(అథఃసూచికలు)**

[456] బైబిల్ లో ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) తనను తాను తరచుగా 'మనుష్య కుమారుడు' అని ప్రకటించుకున్నట్లుగా పేర్కొనబడి ఉంది. ఇక్కడ కూడా 'మనుష్య కుమారుడు' అంటే స్వయంగా ఏసుయే నని మనం అర్థం చేసుకోవాలి.

[457] మార్కు సువార్త, 15 వ అధ్యాయం: 42 వ వాక్యం నుంచి 46 వ వాక్యం వరకు



యోహాను సువార్తలో [458] మనకు లభ్యమవుతాయి. ఆ విధంగా ఆయన యొక్క మృతదేహం భూగర్భంలో మూడు పగళ్ళు మరియు మూడు రాత్రుల పాటు ఉండడం జరగలేదు. కేవలం ఒక పగలు మరియు రెండు రాత్రుల పాటు మాత్రమే సమాధిలో భూగర్భంలో ఉండడం జరిగింది. అనగా శుక్రవారం నాటి రాత్రి మరియు శనివారం నాటి రాత్రి కలిపి రెండు రాత్రులవుతాయి. శనివారం నాటి పగలు కేవలం ఒక్క పగలు మాత్రమే అవుతుంది. ఈ విధంగా మూడు రాత్రింబగళ్ళు భూగర్భంలో యోనా (దైవప్రవక్త హజ్రత్ యూనుస్ (అ)) వలె ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) కూడా ఉన్నారనే విషయం పూర్తిగా తప్పని, అసత్యమయినదని నిరూపితమయింది. ఈ విధంగా మూడు తప్పులు ఈ మూడు వాక్యాలలో పేర్కొనబడి ఉన్నాయి.

ఈ మూడు వాక్యాలు తప్పయిన కారణంగా బాస్ మరియు షానర్ అనే వ్యాఖ్యాతలు వాటిని మత్తయి యొక్క స్వంత వ్యాఖ్యానంగానే పరిగణించాలని, ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) యొక్క వాక్కులుగా పరిగణించలేమని పేర్కొన్నారు. ఇరువురూ క్రిందివిధంగా పేర్కొన్నారు:

" నీనెవె ప్రజలు [459] ఏవిధంగానయితే యోనా ప్రసంగమును మాత్రమే విని విశ్వసించారో, సూచక క్రియలను కోరలేదో అదేవిధంగా తన ప్రజలు సైతం సూచక క్రియలను తన నుంచి కోరకుండా కేవలం తన వాక్కులను విని విశ్వసించాలనేదే ఏసు ఉద్దేశ్యం. "

ఈ ఇద్దరి వ్యాఖ్యల కారణంగా ఈ తప్పులకు కారణం మత్తయి తప్పుడు అవగాహనేనని విదితమవుతుంది. అలాగే మత్తయి తన సువార్తను దైవప్రేరణతో వ్రాయలేదనే విషయం కూడా దీనిద్వారా నిరూపితమవుతోంది. ఏవిధంగానయితే ఈ సందర్భంలో మత్తయి ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) యొక్క ఉద్దేశ్యాన్ని అర్థం చేసుకొనలేకపోయారో, పొరబొడ్డారో అదేవిధంగా ఆయన ఇతర విషయాలకు సంబంధించి కూడా తప్పుడు అవగాహనకు లోనయి ఉండేందుకు , ఆ కారణంగా తప్పుడు విషయాలనే వ్రాసియుండేందుకు ఎక్కువగా అవకాశముంది. మరి పరిస్థితి ఇది అయినప్పుడు ఆయన (మత్తయి) రచనను దైవప్రేరేపణచే వ్రాయబడిన దివ్యరచనగా,

---

**(అథఃసూచికలు)**

[458] యోహాను సువార్త యొక్క 20 వ అధ్యాయపు 1 వ వాక్యంలో ఈ విషయం పేర్కొనబడి ఉంది. వారం యొక్క మొదటిరోజు బైబిల్ పరిభాషలో 'ఆదివారం' అని అర్థం చేసుకోవాలి.

[459] అనగా యోనా (దైవప్రవక్త హజ్రత్ యూనుస్ (అ)) జాతి ప్రజలు.

విశ్వసనీయమైనదిగా ఎలా భావించగలము? దైవప్రేరేపణచే వ్రాయబడిన గ్రంథం యొక్క పరిస్థితి ఈ విధంగా ఉంటుందా?

## ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) రెండవ రాకడకు సంబంధించిన భవిష్యద్వాణి 63 వ తప్పు

మత్తయి సువార్త యొక్క 16 వ అధ్యాయపు 27 వ వాక్యం నుంచి 28 వ వాక్యం వరకు ఈ విధంగా పేర్కొనబడింది:

**" మనుష్య కుమారుడు తన తండ్రి మహిమ గలవాడై తన దూతలతో కూడ రాబోవుచున్నాడు.[460] అప్పుడాయన ఎవని క్రియల చొప్పున వానికి ఫలమిచ్చును. ఇక్కడ నిలిచియున్న వారిలో కొందరు, మనుష్య కుమారుడు తన రాజ్యముతో వచ్చుట చూచువరకు మరణము రుచి చూడరని నిశ్చయముగా మీతో చెప్పుచున్నానెను. "**

ఇది కూడా తప్పుడు వాక్యమే. ఎందుకంటే అక్కడ ఆ సమయంలో నిలుచొని ఉన్నవారిలో ప్రతి ఒక్కరూ మరణం రుచి చూసారు, గతించి కుళ్ళిన ఎముకలుగా మారిపోయి మట్టిలో కలిసిపోయారు. వారు మరణం రుచి చూసి ఒక వెయ్యి పదునెనిమిది వందల సంవత్సరాల కంటే మించిన సమయం గడచిపోయింది. ( ఇది ఈ గ్రంథ మూల రచయిత యొక్క కాలం వరకు గల లెక్క. అయితే మూల గ్రంథానికి తెలుగు అనువాద గ్రంథమయిన ఈ గ్రంథం వెలువడే సమయానికి రెండువేల సంవత్సరాల కంటే మించిన సమయం గడచిపోయింది - తెలుగు అనువాదకుడు) కానీ వారిలో ఏ ఒక్కరూ ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) తన రాజ్యముతో రావడాన్ని చూడలేదు. [461]

---

**(అథఃసూచికలు)**

[460] బైబిల్ ప్రకారం ఇది స్వయంగా ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) పలికిన వాక్యం. ఈ వాక్యం ఆయన ప్రళయదినానికి సమీపకాలంలో, అనగా ఆఖరికాలంలో రెండవమారు భువిలోకి విచ్చేయడానికి సంబంధించిన సంఘటనను సూచిస్తుంది.

[461] అనగా ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) యొక్క రెండవ రాకడ ఇంకా సంభవించలేదు.



## 64 వ తప్పు

మత్తయి సువార్త యొక్క 10 వ అధ్యాయపు 23 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" వారు ఈ పట్టణములో మిమ్మును హింసించునప్పుడు మరియొక పటణమునకు పారిపోవుడి; [462] మనుష్య కుమారుడు వచ్చువరకు మీరు ఇశ్రాయేలు పట్టణములలో సంచారము చేసియుండరని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను"**

ఇది కూడా తప్పే. ఎందుకంటే ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) శిష్యులు ఇశ్రాయేలుకు చెందిన పట్టణములన్నింటిలో సంచరించడానికి సంబంధించిన బాధ్యతను పూర్తిగా ఇప్పటికే నిర్వర్తించియున్నారు. చివరకు వారి మృత్యువు సైతం సంభవించియున్నది. వారు గతించిన తర్వాత దాదాపు ఇరవై శతాబ్దాల కంటే మించిన సమయం ఇప్పటికే గడచిపోయింది. అయినప్పటికీ ఇంకా మనుష్య కుమారుడు (అనగా ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) తన రాజ్యముతో సహా విచ్చేయడమనేది జరగలేదు. ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) యొక్క ఈ రెండు వాక్కులు ఆయన దివ్యారోహణ కావించడానికి ముందరి కాలానికి సంబంధించినవి. ఇక ఆయన దివ్యారోహణం కావించిన తర్వాతి కాలానికి సంబంధించిన వాక్కులు క్రింద పేర్కొనబడుతున్నాయి.

## 65 వ తప్పు నుంచి 68 వ తప్పు వరకు

బైబిల్ క్రొత్తనిబంధన గ్రంథము లోని ప్రకటనల గ్రంథము యొక్క 3 వ అధ్యాయపు 12 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" నేను త్వరగా వచ్చుచున్నాను"**

ప్రకటనల గ్రంథము యొక్క 22 వ అధ్యాయపు 7 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" ఇదిగో త్వరగా వచ్చుచున్నాను "**

---

**(అథఃసూచికలు)**

[462] ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) తన శిష్యులను సంబోధించి పలికిన మాట ఇది.

ప్రకటనల గ్రంథము యొక్క 22 వ అధ్యాయపు 10 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" ఈ గ్రంథమందున్న ప్రవచన వాక్యములకు ముద్ర వేయవలదు; కాలము సమీపమైయున్నది"**

ప్రకటనల గ్రంథము యొక్క 22 వ అధ్యాయపు 20 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" అవును, త్వరగా వచ్చుచున్నాను"**

ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) యొక్క వాక్కులుగా చెప్పబడుతున్న, పైన పేర్కొనబడిన వాక్యాలను బట్టి క్రైస్తవులకు చెందిన మొదటి తరానికి చెందినవారు తమ కాలంలో ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) రెండవ రాకడ సంభవిస్తుందని, ప్రళయం సమీపంలోనే ఉన్నదని, తాము పూర్తిగా ఆఖరి కాలంలో ఉన్నామని విశ్వసించేవారు. ఈ గ్రంథం యొక్క 4 వ ప్రకరణం ద్వారా క్రైస్తవ పండితులు తాము అటువంటి విశ్వాసాన్నే కలిగియున్నామని, అందుకే వారు తమ రచనల్లో ఈ విషయాలకు సంబంధించి సూచించడం జరిగిందని అంగీకరించారనే విషయం తెలుస్తుంది.

## 69 వ తప్పు నుంచి 75 వ తప్పు వరకు

**(1)** బైబిల్ క్రొత్తనిబంధన గ్రంథము లోని యాకోబు వ్రాసిన పత్రిక యొక్క 5 వ అధ్యాయపు 8 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" ప్రభువు రాక సమీపించుచున్నది గనుక మీరును ఓపిక కలిగియుండుడి, మీ హృదయములను స్థిరపరచుకొనుడి"**

**(2)** బైబిల్ క్రొత్తనిబంధన గ్రంథము లోని పేతురు వ్రాసి మొదటి పత్రిక యొక్క 4 వ అధ్యాయపు 7 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" అయితే అన్నిటి అంతము సమీపమైయున్నది. కాగా మీరు స్వస్థ బుద్ధి గలవారై, ప్రార్థనలు చేయుటకు మెలకువగా ఉండుడి "**

**(3)** బైబిల్ క్రొత్తనిబంధన గ్రంథము లోని యోహాను వ్రాసిన మొదటి పత్రిక యొక్క 2 వ అధ్యాయపు 18 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" చిన్నపిల్లలారా, యిది కడవరి గడియ"**



**(4)** బైబిల్ క్రొత్తనిబంధన గ్రంథము లోని అపొస్తలుడైన పౌలు థెస్సలొనీకయులకు వ్రాసిన మొదటి పత్రిక యొక్క 4 వ అధ్యాయపు 15 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" మేము ప్రభువు మాటను బట్టి మీతో చెప్పునదేమనగా, ప్రభువు రాకడ వరకు సజీవులమై నిలిచియుండు మనము నిద్రించినవారి కంటే ముందుగా ఆయన సన్నిధి చేరము. ఆర్భాటముతోను, ప్రధాన దూత శబ్దముతోను, దేవుని బూరతోను పరలోకము నుండి ప్రభువు దిగివచ్చును; క్రీస్తు నందుండి మృతులైన వారు మొదట లేతురు. ఆ మీదట సజీవులమై నిలిచియుండు మనకు వారితో కూడ ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశమండలమునకు మేఘముల మీద కొనిపోబడుదుము. కాగా మనము సదాకాలము ప్రభువుతో కూడ ఉందుము"**

(అపొస్తలుడైన పౌలు థెస్సలొనీకయులకు వ్రాసిన మొదటి పత్రిక, అధ్యాయం : 4, 15 వ వాక్యం నుంచి 17 వ వాక్యం వరకు)

**(5)** బైబిల్ క్రొత్తనిబంధన గ్రంథము లోని అపొస్తలుడైన పౌలు ఫిలిప్పీయులకు వ్రాసిన మొదటి పత్రిక యొక్క 4 వ అధ్యాయపు 5 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" ప్రభువు సమీపముగా ఉన్నాడు "**

**(6)** బైబిల్ క్రొత్తనిబంధన గ్రంథము లోని అపొస్తలుడైన పౌలు కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక యొక్క 10 వ అధ్యాయపు 11 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" ఈ సంగతులు దృష్టాంతములుగా వారికి సంభవించి, యుగాంతమందున్న మనకు బుద్ధి కలుగుటకై వ్రాయబడెను"**

**(7)** బైబిల్ క్రొత్తనిబంధన గ్రంథము లోని అపొస్తలుడైన పౌలు కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక యొక్క 15 వ అధ్యాయపు 51 వ వాక్యం నుంచి 52 వ వాక్యం వరకు ఈ విధంగా పేర్కొనబడింది:

**" ఇదిగో మీకు ఒక మర్మము తెలుపుచున్నాను; మనమందరము నిద్రించము గాని నిమిషములో, ఒక రెప్పపాటున, కడబూర మ్రోగగానే మనమందరము మార్పు పొందుదుము, బూర మ్రోగును; అప్పుడు మృతులు అక్షయులుగా లేపబడుదురు, మనము మార్పు పొందుదుము"**

ఈ 7 వాక్కులు మా వాదానికి ప్రమాణములైయున్నవి. వారి విశ్వాసం అదేవిధంగా ఉండేది. అందుకే ఈ వాక్కులు ఔపచారిక లేదా ఆలంకారిక అర్థంలో కాకుండా స్పష్టమైన బాహిర అర్థంలోనే ఉపయోగించబడ్డాయని భావించడం జరుగుతుంది.[463] అలాగే ఈ వాక్యాలు

ఏదో ప్రత్యేకమైన అర్థంలో ఉపయోగించబడ్డాయనే వాదం ఆమోదించబడదు. కనుక ఈ విధంగా ఈ వాక్కులన్నీ తప్పయినవిగా నిరూపితమయ్యాయి. ఇవి మొత్తం 17 తప్పులు.

## 76 వ తప్పు నుంచి 78 వ తప్పు వరకు

బైబిల్ క్రొత్తనిబంధన గ్రంథము లోని మత్తయి సువార్త యొక్క 24 వ అధ్యాయంలో ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) ఒలీవల కొండ మీద కూర్చొని ఉన్నప్పుడు ప్రజలు ఆయన వద్దకు వచ్చి ప్రధాన దేవాలయము (బైతుల్ ముఖద్దిస్) ఎప్పుడు నాశనమవుతుందని, ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) ఆకాశం నుంచి ఎప్పుడు తిరిగి దిగివస్తారని, యుగ సమాప్తి (ప్రళయం) ఎప్పుడు సంభవిస్తుందని ప్రశ్నించగా ఆయన (అ) అన్నిరకాల సూచనల గురించి పేర్కొన్నారు. యూదుల ప్రధాన దేవాలయం ఎప్పుడు నాశనమవుతుందనే విషయం గురించి ఆయన (అ) తెలియజేశారు. ఆ తర్వాత ఆయన (అ) ఈ విధంగా పేర్కొన్నారు: "ఆ సంఘటన జరిగిన వెంటనే అదేకాలంలో నా రాకడ సంభవిస్తుంది, ప్రళయం సంభవిస్తుంది"

ఈ అధ్యాయంలో 28 వ వాక్యం వరకు బైతుల్ ముఖద్దిస్ (యూదుల ప్రధాన దేవాలయం) వినాశనానికి సంబంధించిన ప్రస్తావన ఉంది. ఇక 29 వ వాక్యం నుంచి అధ్యాయం చివరి వరకు ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) యొక్క రెండవ రాకడకు మరియు ప్రళయం సంభవించడానికి సంబంధించిన ప్రస్తావన ఉంది. ఈ అభిప్రాయాన్నే పండితుడైన పౌలు, స్టార్ మరియు ఇతర క్రైస్తవ పండితులు ఇష్టపడ్డారు. ఈ వాక్యాల నేపథ్యం ద్వారా ఈ విషయమే వెల్లడవుతుంది. ఈ అభిప్రాయాన్ని కాకుండా ఈ విషయంలో ఇతర అభిప్రాయాలను ఎవరయితే కలిగియున్నారో వారు తప్పుడు అభిప్రాయాన్ని, తప్పుడు అవగాహనను కలిగియున్నట్లే. వారి వ్యాఖ్య ఆమోదయోగ్యం కాజాలదు. క్రీ.శ. 1820 లో ప్రచురించబడిన బైబిల్ అరబీ అనువాద గ్రంథంలో ఈ అధ్యాయానికి చెందిన కొన్ని వాక్యాలు క్రింద పేర్కొనబడిన విధంగా ఉన్నాయి:

**" ఆ దినముల శ్రమ ముగిసిన వెంటనే [464] చీకటి సూర్యుని కమ్మును, చంద్రుడు కాంతిని ఇయ్యడు, ఆకాశము నుండి నక్షత్రములు రాలును, ఆకాశమందలి శక్తులు**

**(అథఃసూచికలు)**

[463] అనగా 'ఈ వాక్కులన్నీ ఉపమానపూర్వకంగా, ఔపచారిక అర్థాలలో ఉపయోగించబడ్డాయని, ఈ వాక్యాలలో 'త్వరగా' అంటే వెనువెంటనే అని కాకుండా కాలానికి సంబంధించిన వేగిరపాటు అని అర్థం చేసుకోవాలి' అని వాదించేందుకు వీలులేదు.



**కదలింపబడును. అప్పుడు మనుష్య కుమారుని సూచన ఆకాశమందు కనబడును. అప్పుడు మనుష్య కుమారుడు ప్రభావముతోను మహామహిమతోను ఆకాశ మేఘారూఢుడై వచ్చుట చూచి, భూమి మీద నున్న సకల గోత్రములవారు రొమ్ము కొట్టుకొందరు. మరియు ఆయన గొప్ప బూరతో తన దూతలను పంపును. వారు ఆకాశము యొక్క ఈ చివర నుండి ఆ చివర వరకు నలుదిక్కుల నుండి ఆయన ఏర్పరచుకొనినవారిని పోగుచేతురు."**

మత్తయి సువార్త యొక్క 24 వ అధ్యాయంలోని 34 వ మరియు 35 వ వాక్యాలలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" ఇవన్నియు జరుగువరకు ఈ తరము గతింపదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను. ఆకాశమును భూమియు గతించును గాని నా మాటలు ఏమాత్రమును గతింపవు."**

క్రీ.శ. 1844 లో ప్రచురించబడిన బైబిల్ అరబీ అనువాద గ్రంథం లోనూ [465] ఇదేవిధంగా పేర్కొనబడింది.

ఇక క్రీశ. 1816 లోనూ, క్రీ.శ. 1828 లోనూ, క్రీ.శ. 1841 లోనూ మరియు క్రీ.శ. 1842 లోనూ ప్రచురించబడిన బైబిల్ ఫార్సీ అనువాద గ్రంథాలలో ఈ విషయం ఈ విధంగా పేర్కొనబడింది: 29 వ వాక్యము:

**" ఆ దినముల శ్రమ ముగిసిన వెంటనే చీకటి సూర్యుని కమ్మును"**

**(అథఃసూచికలు)**

[464] బైబిల్ అరబీ అనువాద గ్రంథంలో ఈ వాక్యాలకు గాను అందజేయబడిన అనువాదానికి బైబిల్ ఉర్దూ అనువాద గ్రంథంలోని అనువాదం సమానంగా ఉన్న కారణంగా పాఠకులచే చదవబడుతున్న ఈ గ్రంథం యొక్క ఉర్దూ ప్రతిలో ఆ ఉర్దూ అనువాదం అందజేయబడింది. అయితే ఆ ఉర్దూ అనువాదానికి తెలుగు బైబిల్ అనువాద ప్రతిలోని అనువాదమూ సమానంగానే ఉన్న కారణంగా బైబిల్ తెలుగు అనువాద ప్రతిలో ఉన్న, అనగా 'బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా', బెంగుళూరు వారు ప్రచురించిన పరిశుద్ధ గ్రంథంలోని అనువాదమే ఇక్కడ పేర్కొనబడుతోంది.

(తెలుగు అనువాదకుడు)

[465] గ్రంథ విస్తార భీతిచే అందులో పేర్కొనబడిన వాక్యాలను ఇక్కడ పేర్కొనడం లేదు. (మౌలానా ముహమ్మద్ తఖీ ఉస్మానీ సాహెబ్ (అథఃసూచికల కూర్పుకర్త)

34 వ వాక్యం ఈ విధంగా పేర్కొనబడింది:

**“ ఇవన్నియు జరుగువరకు ఈ తరము గతింపదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను.”**

కనుక ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) రెండవ రాకడ మరియు ప్రళయం రాకడ అనేవి బైతుల్ ముఖద్దిస్ (యెరూషలేములోని ప్రధాన ఆరాధనా మందిరము) నాశనమయ్యే కాలంలోనే వెనువెంటనే సంభవించడం తప్పనిసరి. ఈ విషయానికి ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) “ ఆ దినముల శ్రమ ముగిసిన వెంటనే” అని పలికిన మాటలే సాక్ష్యంగా నిలుస్తాయి. అదేవిధంగా ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) యొక్క సమకాలికులు ఈ మూడు సంఘటనలను ప్రత్యక్షంగా తిలకించడమనేది కూడా తప్పనిసరి అవుతుంది. ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) యొక్క శిష్యులు మరియు మొదటి తరానికి చెందిన క్రైస్తవులు ఆ విధంగానే విశ్వాసాన్ని కలిగియుండేవారు. తద్వారా ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) వాక్కు సత్యమైనదిగా నిలిచియుండే అవకాశముంటుంది. అయితే శోచనీయమైన విషయమేమిటంటే ఆయన (అ) వాక్కు సత్యమైనదిగా నిలవలేదు. భూమ్యాకాశాలు సైతం ఇంకా గతించిపోకుండా నిలిచే ఉన్నాయి. అవి పూర్వమున్న స్థితిలోనే నిలిచి ఉన్నాయి. అయితే సత్యం అసత్యమయిపోయింది---- అల్లాహ్ రక్షించుగాక!

ఇక మార్కు సువార్త యొక్క13 వ అధ్యాయంలోనూ, లూకా సువార్త యొక్క 21 వ అధ్యాయంలోనూ ఇటువంటి విషయమే పేర్కొనబడి ఉంది. కనుక ఈ రెండు సువార్తలలో పేర్కొనబడిన అంశం విషయంలోనూ తప్పు దొర్లింది. ఆ విధంగా ముగ్గురు సువార్తికులూ ఈ తప్పుడు అంశం గురించి వ్రాసే విషయంలో ఒకరితో మరొకరు ఏకీభవించారు. ఆ విధంగా ముగ్గురూ ఏకీభవించడం వల్ల మొత్తం మూడు తప్పులు జరిగాయి.

## యూదుల ప్రధాన దేవాలయం పునాదుల మీద మరొక నిర్మాణం సాధ్యం కాజాలదు 79 వ తప్పు నుంచి 81 వ తప్పు వరకు

బైబిల్ క్రొత్తనిబంధన గ్రంథము లోని మత్తయి సువార్త యొక్క 24 వ అధ్యాయపు 2 వ వాక్యంలో ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) యొక్క వాక్కు ఈ విధంగా ఉల్లేఖించబడి ఉంది:

**“ రాతిమీద రాయి యొకటియైనను ఇక్కడ నిలిచియుండకుండ పడద్రోయబడునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నానని వారితో అనెను ”**



ఇశ్రాయేలు లోని యూదుల ప్రధాన దేవాలయం పునాదుల మీద ఏ నిర్మాణం జరిగినా అది కూలిపోతుందని, ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) పేర్కొన్నట్లుగానే అది మిగిలియుండడం ఎంతమాత్రం సాధ్యపడదని ప్రొటెస్టెంట్ క్రైస్తవ వర్గానికి చెందిన పండితులు వివరణను పేర్కొన్నారు. 'తహ్ఖీఖె దీనుల్ హఖ్' గ్రంథ రచయిత ఈ విధంగా ప్రకటించారు: “ఇది మున్ముందు జరగబోవు సంఘటనలకు సంబంధించి ఏసు ప్రకటించిన మహాగొప్ప భవిష్యద్వాణుల్లో ఒకటి” ఆయన క్రీ.శ. 1946 లో ప్రచురించబడిన తన పుస్తకంలోని 394 వ పేజీలో ఈ విధంగా పేర్కొన్నారు:

“ ఏసు తర్వాత మూడు వందల సంవత్సరాలకు రాజయిన, క్రైస్తవ మతం నుంచి తొలగిపోయిన జోలీన్ యూదుల ప్రధాన దేవాలయాన్ని (హైకల్‌ను) తిరిగి నిర్మించి తద్వారా ఏసు పలికిన భవిష్యద్వాణి తప్పయినదిగా నిరూపితం కావాలని సంకల్పించాడు. అతడు దేవాలయ నిర్మాణాన్ని ఆరంభించగానే దాని పునాదులలో నుంచి ఒక అగ్ని వెలువడింది. దానిపట్ల భయపడి కార్మికులందరూ పారిపోయారు. ఆ తర్వాత **'ఆకాశమును భూమియు గతించును గాని నా మాటలు ఏమాత్రమును గతింపవు'** అని పలికిన ఆ సత్యసంధుని వాక్కును తప్పయినదిగా నిరూపించే సాహసానికి ఎవరూ పాల్పడలేకపోయారు.”

ఫాదర్ డాక్టర్ కీట్ క్రీస్తు వ్యతిరేకులను ఖండిస్తూ ఒక పుస్తకాన్ని ఆంగ్లభాషలో రచించారు. దానిని ఫాదర్ మరీక్ ఫార్శీ భాషలో అనువదించారు. ఆ అనువాద గ్రంథానికి ఆయన 'కష్ఫుల్ ఆసార్ ఫీ ఖససి బనీ ఇస్రాయీల్' అని పేరు పెట్టాడు. ఆ పుస్తకం ఎడిన్‌బర్గ్ ప్రభుత్వ కార్యాలయం ద్వారా క్రీ.శ. 1846 లో ప్రచురించబడింది. మేము ఆ గ్రంథంలో ఆయన పేర్కొన్న విషయం యొక్క అనువాదాన్ని ఇక్కడ పొందుపరుస్తున్నాము. 70 వ పేజీలో ఆయన ఈ విధంగా పేర్కొన్నాడు:

“ జోలీన్ రాజు యూదులకు యెరూషలేమును నిర్మించుకునేందుకై, ప్రధాన దేవాలయాన్ని తిరిగి నిర్మించుకునేందుకై అనుమతిని ప్రసాదించాడు. అలాగే యూదులకు తమ పూర్వీకుల పట్టణంలో నిలిచియుండేలా చేస్తానని కూడా అతడు యూదులకు వాగ్దానం చేశాడు. యూదులు సైతం ఆ విషయం పట్ల జోలీన్ రాజు వలెనే ఆసక్తిని కనబరచారు. దానితో వారు తమ ప్రధాన దేవాలయ నిర్మాణంలో నిమగ్నులయ్యారు. అయితే అది ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) పలికిన భవిష్యద్వాణికి పూర్తిగా విరుద్ధమైనది గనుక యూదులు ఎంతటి తీవ్రస్థాయిలో కృషి చేసినప్పటికీ, రాజు ఎంతటి శ్రద్ధతో పర్యవేక్షించినప్పటికీ ఆ కార్యాన్ని వారు నెరవేర్చలేకపోయారు. విగ్రహారాధకులయిన చరిత్రకారులు ఆ ప్రదేశంలో నుంచి భయంకరమైన అగ్నికీలలు వెలువడ్డాయని, అవి దేవాలయ పునఃనిర్మాణం కొరకు ఉద్యుక్తులయిన కార్మికులను కాల్చివేసిందని,

ఆ కారణంగా వారు తమ కార్యాన్ని విరమించుకున్నారని పేర్కొన్నారు"

ఈ విషయం కూడా మత్తయి సువార్త యొక్క 24 వ అధ్యాయంలోనే తర్వాత పేర్కొనబడిన మరొక భవిష్యద్వాణి [466] ఏవిధంగా తప్పో అదేవిధంగా తప్పయినది. థామస్ న్యూటన్ బైబిల్ పాతనిబంధన మరియు క్రొత్త నిబంధనలలో పేర్కొనబడిన భవిష్యద్వాణుల గురించి ఒక వ్యాఖ్యాన గ్రంథాన్ని వ్రాశారు. ఆ వ్యాఖ్యాన గ్రంథం క్రీ.శ. 1803 లో లండన్ నుంచి ప్రచురించబడింది. ఆ గ్రంథం యొక్క 2 వ సంపుటిలోని 63 వ మరియు 64 వ పేజీలలో ఆయన ఈ విధంగా పేర్కొన్నారు:

" సమస్త భూభాగంపై అలజడిని సృష్టించిన రెండవ ఖలీఫా అయిన ఉమర్ (రజి). ఆయన పరిపాలనా కాలం పదిన్నర సంవత్సరాలు. ఆ కాలపరిమితిలో అన్ని అరబ్బు దేశాలపైన, సిరియా పైన, ఇరాన్ పైన మరియు ఈజిప్టు పైన ఆయన పరిపాలనాధికారాన్ని చేజిక్కించుకున్నారు. అలాగే ఆయన స్వయంగా యెరూషలేమును ముట్టడించారు. క్రీ.శ. 637 లో సుదీర్ఘ ముట్టడితో విసిగిపోయిన క్రైస్తవులతో ఆయన సంధి చేసుకున్నారు. క్రైస్తవులు నగరాన్ని ఉమర్ (రజి) కు అప్పగించారు. (హజ్రత్) ఉమర్ (రజి) క్రైస్తవుల ముందు గౌరవనీయ షరతులను ముందుంచారు. ఆయన క్రైస్తవులకు చెందిన ఏ చర్చినీ ఆక్రమించుకోలేదు. అలాగే ఆయన క్రైస్తవ మతపెద్దలను అక్కడ మస్జిద్‌ను నిర్మించేందుకై స్థలాన్ని కోరారు. చర్చి పెద్ద యోకోబు (దైవప్రవక్త హజ్రత్ యాఖూబ్ (అ)) గదిని మరియు సొలొమోను(దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) నిర్మించిన దైవమందిరం) యొక్క దైవమందిరమును సూచించారు. ఆ పవిత్రమైన ప్రదేశాన్ని క్రైస్తవులు యూదుల పట్ల గల శత్రుత్వంతో పేడ మరియు గజాశ్వాదుల పురీషము ద్వారా అపవిత్రం కావించియున్నారు. అప్పుడు హజ్రత్ ఉమర్ (రజి) స్వయంగా తమ చేతులతో ఆ ప్రదేశంలోని మాలిన్యాన్నంతటినీ తొలగించి ఆ ప్రదేశాన్ని శుభ్రం కావించారు. ఆయన పర్యవేక్షణలో పెద్ద పెద్ద సైనికాధికారులు ఆయన అడుగుజాడల్లో నడుచుకుంటూ ఆ కార్యాన్ని దైవారాధనగా భావించి అందులో విరివిగా పాలుపంచుకుని మస్జిద్‌ను నిర్మించారు. అదే యెరూషలేములో నిర్మించబడిన మొట్టమొదటి మస్జిద్. ఆ మస్జిద్ లోనే ఉమర్ (రజి) ను ఒక బానిస హతమార్చాడని కొంతమంది

(అథఃసూచికలు)

[466] అనగా ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) ఒలీవల కొండ మీద కూర్చొని పలికిన భవిష్యద్వాణి. '76 వ తప్పు' అనే మకుటం క్రింద ఇంతకుముందే ఆ భవిష్యద్వాణి గురించి పేర్కొనబడింది.



చరిత్రకారులు పేర్కొన్నారు. పన్నెండవ ఖలీఫహ్ అయిన అబ్దుల్ మలిక్ బిన్ మర్వాన్ తన పరిపాలనా కాలంలో ఆ మస్జిద్‌ను అభివృద్ధిపరిచాడు"

ఈ వ్యాఖ్యాత అందజేసిన వివరణలో కొన్ని తప్పులున్నప్పటికీ ఈయన దైవప్రవక్త హజ్రత్ సులైమాన్ (అ) (సొలొమోను) నిర్మించిన దైవమందిరము (హైకలె సులైమానీ) ఉన్న స్థానంలో మొట్టమొదటి మస్జిద్‌ను హజ్రత్ ఉమర్ (రజి) నిర్మించారనే విషయాన్ని అంగీకరించారు. అలాగే దానిని ఖలీఫహ్ అయిన అబ్దుల్ మలిక్ బిన్ మర్వాన్ అభివృద్ధిపరిచారనే విషయాన్ని సైతం ఆయన అంగీకరించారు. ఆ విధంగా అభివృద్ధిపరచబడిన మస్జిద్ నేటికీ నిలిచియున్నది. ఆ మస్జిద్ నిర్మించబడి 1200 సంవత్సరాలు దాటిపోయింది. మరి ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) వెలువరించినట్లుగా చెప్పబడుతున్న భవిష్యద్వాణి ఎందుకు సత్యమైనదిగా నిరూపితం కాలేదు? ఆయన (అ) వాక్కు ఎందుకు అసత్యమైనదిగా ఋజువయింది? అలాగే భూమ్యాకాశాలు సైతం నశించిపోలేదు. ఈ వాక్కు మార్కు సువార్త యొక్క 13 వ అధ్యాయంలోనూ, లూకా సువార్త యొక్క 21 వ అధ్యాయంలోనూ పేర్కొనబడి ఉంది. కనుక ఆ రెండు సువార్తల ప్రకారం కూడా ఈ భవిష్యద్వాణి తప్పయినదిగా, అసత్యమైనదిగా నిరూపితమయింది. ఆ విధంగా ముగ్గురు సువార్తీకుల ద్వారా మూడు తప్పులు జరిగాయి.

## ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) యొక్క 12 మంది శిష్యులూ ముక్తిని పొందారు 82 వ తప్పు

బైబిల్ క్రొత్తనిబంధన గ్రంథము లోని మత్తయి సువార్త యొక్క 19 వ అధ్యాయపు 28 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" యేసు వారితో ఇట్లనెను - (ప్రపంచ) పునర్జన్మమందు మనుష్య కుమారుడు తన మహిమ గల సింహాసనము మీద ఆసీనుడై యుండునపుడు నన్ను వెంబడించిన మీరును పన్నెండు సింహాసనముల మీద ఆసీనులై ఇశ్రాయేలు పన్నెండు గోత్రముల వారికి తీర్పు తీర్చుదురు"**

ఈ వాక్యంలో ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) తన పన్నెండు మంది శిష్యులూ పరలోకంలో ముక్తిని, సాఫల్యాన్ని పొంది పన్నెండు సింహాసనముల మీద ఆసీనులవుతారని పేర్కొన్నట్లుగా చెప్పబడింది. అయితే ఇది తప్పయినదిగా నిరూపితమయింది. ఎందుకంటే పన్నెండు మంది శిష్యులలో ఒకడయిన ఇస్కరియోతు యూదా క్రైస్తవుల విశ్వాసం ప్రకారం ధర్మం నుంచి మరలిపోయిన వ్యక్తి. [467] ఆ స్థితిలోనే అతడి మరణం కూడా సంభవించింది. ఆ విధంగా అతడు

నరకవాసిగా మారాడు. మరి అతడు పన్నెండవ సింహాసనం మీద కూర్చోవడం ఎలా సాధ్యపడుతుంది?

## ఆకాశం తెరుచుకోవడం, దైవదూతలు అవతరించడం

## 83 వ తప్పు

బైబిల్ క్రొత్తనిబంధన గ్రంథము లోని యోహాను సువార్త యొక్క 1 వ అధ్యాయపు 51 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" మరియు ఆయన - మీరు ఆకాశము తెరవబడుటయు, దేవుని దూతలు మనుష్య కుమారుని పైగా ఎక్కుటయును దిగుటయును చూతురని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను"**

ఇది కూడా తప్పే. ఎందుకంటే ఇది బాప్తీస్మము తీసుకున్న మరియు పరిశుద్ధాత్మ అవతరణ తర్వాత పలుకబడిన మాట.[468] వాస్తవానికి ఈ రెండు సంఘటనలు జరిగిన తర్వాత ఏ ఒక్కరూ ఆకాశం తెరువబడడాన్ని, దేవుని దూతలు ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) పైగా ఎక్కడాన్ని గానీ, దిగడాన్ని గానీ చూడలేదు. అనగా రెండు వాగ్దానాలూ పూర్తిగా తప్పయినవిగా నిరూపితమయ్యాయి.

## ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) తప్ప మరెవరూ ఆకాశం మీదికి ఆరోహణ కావించలేదా? 84 వ తప్పు

బైబిల్ క్రొత్తనిబంధన గ్రంథము లోని యోహాను సువార్త యొక్క 3 వ అధ్యాయపు 13 వ వాక్యంలో [469] ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

(అథఃసూచికలు)

[467] చూడండి : మత్తయి సువార్త, 26 : 14, 47 . 27 : 3

[468] ఈ రెండు సంఘటనలకు సంబంధించిన వివరాలు ఇదే గ్రంథంలో ఇంతకుముందే పేర్కొనబడ్డాయి. ఈ సంఘటనల గురించి యోహాను సువార్త లోనే ఈ వాక్కు కంటే ముందు 32 వ వాక్యంలో పేర్కొనబడింది.



**" మరియు పరలోకము నుండి దిగివచ్చినవాడే, అనగా పరలోకములో ఉండు మనుష్య కుమారుడే తప్ప పరలోకమునకు ఎక్కిపోయినవాడెవడును లేడు"**

ఇది కూడా తప్పే. ఎందుకంటే హనోకు (హజ్రత్ హనూక్ (అ)) మరియు ఏలీయా (హజ్రత్ ఇలియాస్ (అ)) లు ఆకాశం పైకి తీసుకుపోబడ్డారు, ఎక్కిపోయారు. దీనికి సంబంధించిన వివరాలు మనకు బైబిల్ పాతనిబంధన లోని 'ఆదికాండము' యొక్క 5 వ అధ్యాయంలోనూ[470] , 'రాజులు రెండవ గ్రంథము' యొక్క 2 వ అధ్యాయంలోనూ లభ్యమవుతాయి.[471]

## క్రైస్తవుల మహిమాన్విత కార్యాలు 85 వ తప్పు

బైబిల్ క్రొత్తనిబంధన గ్రంథము లోని మార్కు సువార్త యొక్క 11 వ అధ్యాయపు 23 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" ఎవడైనను ఈ కొండను చూచి- నీవు ఎత్తబడి సముద్రములో పడవేయబడుమని చెప్పి, తన మనస్సులో సందేహింపక తాను చెప్పినది జరుగునని నమ్మినయెడల వాడు చెప్పినది జరుగునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను"**

మార్కు సువార్త యొక్క 16 వ అధ్యాయపు 17 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" నమ్మినవారి వలన ఈ సూచక క్రియలు కనబడును; ఏవనగా, నా నామమున దయ్యములను వెళ్ళగొట్టుదురు, క్రొత్త భాషలు మాటలాడుదురు, పాపములను ఎత్తి పట్టుకొందురు,**

(అథఃసూచికలు)

[469] ఇది బైబిల్ ప్రకారం ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) యొక్క వాక్కు.

[470] **" హనోకు దేవునితో నడిచిన తరువాత దేవుడతని తీసికొనిపోయెను గనుక అతడు లేకపోయెను."** ( ఆదికాండము, 5 వ అధ్యాయపు 24 వ వాక్యము)

[471] **" వారు ఇంక వెళ్ళుచు మాటలాడుచుండగా ఇదిగో అగ్ని రథమును అగ్ని గుఱ్ఱములును కనబడి వీరిద్దరిని వేరు చేసెను; అప్పుడు ఏలీయా సుడిగాలి చేత ఆకాశమునకు ఆరోహణమాయెను."** ( రాజులు రెండవ గ్రంథము, 2 వ అధ్యాయపు 11 వ వాక్యము)

**మరణకరమైనదేది త్రాగినను అది వారికి హాని చేయదు, రోగుల మీద చేతులుంచినప్పుడు వారు స్వస్థత నొందుదురని వారితో చెప్పెను.”**

యోహాను సువార్త యొక్క 14 వ అధ్యాయపు 12 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**“ నేను తండ్రియొద్దకు వెళ్ళుచున్నాను గనుక నేను చేయు క్రియలు నాయందు విశ్వాసముంచువాడును చేయును, వాటికంటె మరి గొప్పవియు అతడు చేయునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను ”**

మార్కు సువార్త యొక్క 11 వ అధ్యాయపు 23 వ వాక్యంలో **‘ఎవడైనను ఈ కొండను చూచి’** అనే వాక్యం సర్వసామాన్యమైనది. అది ఏ ఒక్క వ్యక్తికో ప్రత్యేకమైనది కాదు. అలాగే అది ఏ ఒక్క ప్రత్యేక కాలం కొరకో పరిమితమైనది కాదు. ఇంకా చెప్పాలంటే ఏసును (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)ను) విశ్వసించేవారి కొరకు కూడా పరిమితం కాదు.

అదేవిధంగా ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) **‘నాయందు విశ్వాసముంచువాడును’** అనే వాక్యం కూడా ఏ ఒక్క వ్యక్తి కొరకో లేక ఏ ఒక్క కాలం కొరకో ప్రత్యేకమైనది కాదు, పరిమితమైనది కాదు. ఒకవేళ ఏ వ్యక్తయినా ‘ఈ కార్యాలు క్రైస్తవులకు చెందిన మొదటి తరానికి చెందినవారి కొరకు ప్రత్యేకమైనవి’ అని పేర్కొన్నట్లయితే ఆ ప్రకటన నిరాధారమైనదిగా పరిగణించబడుతుంది. కనుక నేటికాలంలో సైతం ఏ వ్యక్తయినా కొండను ఉద్దేశించి ‘నీవు ఎత్తబడి సముద్రంలో పడవేయబడుమని చెప్పి తన మనసులో సందేహించకుండా ఆ విధంగానే తప్పకుండా జరుగుతుందని భావించినట్లయితే అదేవిధంగా తప్పకుండా జరుగుతుంది. అలాగే ఈ కాలంలో ఏసును (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)ను) విశ్వసించేవారికి సంబంధించిన సంకేతం కూడా ఇటువంటి మహిమాన్విత కార్యమే అయి ఉంటుంది. కనుక ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)ను) విశ్వసించినవారు సైతం ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) చూపిన అద్భుత కార్యాలనే చూపవలసి ఉంటుంది. ఇంకా చెప్పాలంటే వాటికంటే గొప్ప ఘనకార్యాలను చూపవలసి ఉంటుంది.

అయితే ఇది వాస్తవికతకు, జరిగిన సంఘటనలకు విరుద్ధంగా ఉంది. మా జ్ఞానం ప్రకారం ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) ప్రదర్శించిన అద్భుత కార్యాల కంటే మించిన స్థాయిలో అద్భుత కార్యాలను ప్రదర్శించిన క్రైస్తవుడు ఎవరూ లేరు, క్రైస్తవులకు చెందిన మొదటి తరంలోనూ లేరు, తరువాతి తరంలోనూ లేరు. కనుక ‘వాటికంటె మరి గొప్పవియు అతడు చేయునని...’’ ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) చెప్పినట్లుగా పేర్కొనబడిన వాక్యం తప్పయినదిగా నిరూపితమయింది. ఈ వాక్యంలో పేర్కొనబడిన లక్షణాలు క్రైస్తవులకు చెందిన



ఏ వర్గంలోనూ కనబడలేదు. ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) చూపినటువంటి అద్భుత కార్యాలను ఆయన శిష్యులు సైతం చూపలేకపోయారు. అలాగే వారి తరువాతి తరాలకు చెందిన క్రైస్తవులు సైతం చూపలేకపోయారు.

ప్రొటెస్టెంట్ వర్గానికి చెందిన క్రైస్తవ పండితులు క్రైస్తవులకు చెందిన మొదటి తరం తర్వాత ఏ వ్యక్తి ద్వారానయినా మహిమాన్విత అద్భుత కార్యాలు వెలువడ్డాయనే విషయం పటిష్ఠమైన ఆధారాలతో సహా నిరూపించబడలేదు. మేము మా భారతదేశంలో దైవజనులుగా ప్రఖ్యాతిగాంచిన క్రైస్తవ పండితులను, అనగా ప్రొటెస్టెంట్ వర్గానికి చెందిన మరియు కేథొలిక్ వర్గానికి చెందిన క్రైస్తవ పండితులనెందరినో చూశాము. దయ్యములను వెళ్ళగొట్టడం, పాములను ఎత్తి పట్టుకోవడం, విషం త్రాగివేయడం, వ్యాధిగ్రస్తులను స్వస్థతను చేకూర్చడం కాదు గదా కనీసం వారు ఎన్నో సంవత్సరాలపాటు ఉర్దూ భాషను నేర్చుకునే ప్రయత్నం చేసినప్పటికీ ఉర్దూను సరియైన రీతిలో ఉచ్చరించగల సామర్థ్యాన్ని సైతం పుణికి పుచ్చుకోలేదు. స్త్రీ లింగ పదం ఉన్నచోట వారు పురుష లింగ పదాన్ని ఉచ్చరిస్తారు. వారు కనీసం ఉర్దూను సైతం సంవత్సరాల తరబడి కృషి జరిపిన మీదట సైతం వారు నేర్చుకోలేకపోయారు.

వాస్తవానికి మన కాలానికి చెందిన క్రైస్తవులు కనీసం నిజమైన అర్థంలో నిజమైన క్రైస్తవులు కూడా కాదనే విషయం విదితమవుతోంది. అందుకే వారి ద్వారా ఇటువంటి అద్భుత కార్యాలు వెలువడడం లేదు. వారికి చెందిన కొంతమంది పెద్దలు కొన్ని సందర్భాలలో అటువంటి అద్భుత కార్యాలను తాము ప్రదర్శించగలమని బూటకపు ప్రకటనలను వెలువరించారు. అయితే వారి ప్రకటనలు అసత్యమయినవిగా నిరూపితమయ్యాయి.

## షైతాను (సాతాను) లూథర్ పై ప్రాబల్యం వహించాడు

ఈ సందర్భంగా మహోన్నతులుగా ప్రఖ్యాతిగాంచిన ప్రొటెస్టెంట్ వర్గానికి చెందిన ఇద్దరు పండితులకు చెందిన స్థాయిని వెల్లడించే రెండు ఆసక్తికరమైన సంఘటనలు ఈ సందర్భంగా గుర్తుకొస్తున్నాయి. వాటిని మేము ‘మిర్ఆతుస్సిద్ఖ్’ అనే పుస్తకం నుంచి ఉల్లేఖిస్తున్నాము. ఆ పుస్తకాన్ని గొప్ప కేథొలిక్ క్రైస్తవ పండితుడయిన ఫాదర్ థామస్ ఇంగ్లిస్ ఉర్దూలో అనువదించారు. ఆ పుస్తకం క్రీ.శ. 1851 లో ప్రచురించబడింది. ఫాదర్ థామస్ ఆ పుస్తకంలోని 105 వ, 106 వ మరియు 107 వ పేజీలలో ఈ విధంగా పేర్కొన్నారు:

“ లూథర్ క్రీ.శ. 1543 డిసెంబర్ మాసంలో మసీనా కుమారునిలో నుంచి దయ్యమును వెళ్ళగొట్టాలని సంకల్పించుకున్నాడు. అయితే షైతాన్‌ను తొలగించివేసేందుకై సంకల్పించిన యూదులకు ఎదురయిన అనుభవమే ఆయనకూ ఎదురయింది. యూదులకు సంబంధించిన ఆ సంఘటన బైబిల్ క్రొత్తనిబంధన గ్రంథంలోని అపొస్తలుల కార్యములు అనే గ్రంథం యొక్క

19 వ అధ్యాయపు 16 వ వాక్యంలో పేర్కొనబడింది. షైతాను (సాతాను) లూథర్ మీద దాడి చేయడం జరిగింది. ఆయనను, ఆయన యొక్క సన్నిహితులను షైతాను గాయపరచడం జరిగింది. సతాఫీలస్ తన గురువయిన లూథర్ మెడను షైతాను నొక్కిపట్టియుంచడాన్ని గమనించినప్పుడు ఆయన గొంతు షైతాను ద్వారా నులమబడే అవకాశముందని గ్రహించినప్పుడు పారిపోవాలని ప్రయత్నించాడు. అయితే అతడు అప్పటికే ఇంద్రియాలపై పట్టును కోల్పోయిన కారణంగా తలుపుకు వేసియున్న తాళాన్ని తెరవేలకపోయాడు. అయితే కిటికీ ద్వారా అతడి సేవకుడు అందజేసిన సుత్తితో తలుపులు పగులగొట్టుకొని అతడు బయటపడ్డాడు.

## కాల్విన్ దౌష్ట్యం, అతడి గుణపాఠం గరిపే పర్యవసానం

ఇక చరిత్రకారుడయిన హెల్సిక్ వాయిల్ సీరస్ లూథర్ వలె ప్రొటెస్టెంట్ క్రైస్తవ వర్గంలో గొప్ప వ్యక్తిగా ప్రఖ్యాతిగాంచిన ఫాదర్ కాల్విన్ కు సంబంధించిన రెండవ సంఘటన గురించి ఈ విధంగా పేర్కొన్నారు. కాల్విన్ బేరోమస్ కు కొంత డబ్బును లంచంగా ఇచ్చి " నీవు వెల్లకిలా పడుకొని శ్వాసను కొంచెం సేపు నిలిపివేసి మృతుని వలె నటించు. నేను వచ్చి ' ఓ మృతుడివయిన బేరోమస్! బ్రతికి లేచి నిలబడు' అని పలికినప్పుడు నీవు బ్రతికి లేచినట్లుగా లేచి నిలబడు. అనగా అంతకు ముందు వరకు నీవు మృతుడిగా ఉండి అప్పుడే బ్రతికి లేచినట్లుగా నీవు లేవాలి." అని పేర్కొన్నాడు. అలాగే బేరోమస్ భార్యను ఉద్దేశించి ఫాదర్ కాల్విన్ ఈ విధంగా పలికాడు: " నీ భర్త మృతునిగా నటిస్తున్నప్పుడు నీవు బిగ్గరగా పెడబొబ్బలు పెడుతూ రోదించు"

ఆ భార్యాభర్తలు ఆ విధంగానే వ్యవహరించారు. బేరోమస్ భార్య తన భర్త ముందు కూర్చొని బిగ్గరగా పెడబొబ్బలు పెడుతూ రోదించడాన్ని చూసి సానుభూతిపరులయిన మహిళలు అక్కడికి చేరుకున్నారు. అప్పుడు ఫాదర్ కాల్విన్ అక్కడికి చేరుకొని బేరోమస్ భార్యను ఉద్దేశించి ఈ విధంగా పలికాడు: " నీవు ఏడవవద్దు. నేను అతడిని బ్రతికించి లేపుతాను"

అప్పుడు ఆయన కొన్ని ప్రార్థనాపూర్వక పదాలను ఉచ్చరించాడు. ఆ తర్వాత బేరోమస్ చేతిని పట్టుకొని ఈ విధంగా పలికాడు: " దేవుని నామమున నీవు లేచి నిలబడు " అయితే అతడి మోసపూరిత పథకం విఫలమయింది. ఎందుకంటే అప్పటికే బేరోమస్ నిజంగానే మరణించియున్నాడు. ఆ విధంగా దేవుడు ఫాదర్ కాల్విన్ యొక్క నిజమైన దైవప్రేరిత అద్భుత కార్యాల పట్ల అవహేళనతో కూడినటువంటి మోసపూరిత వ్యూహాన్ని బట్టబయలు చేసివేసి బదులు తీర్చుకున్నాడు. కాల్విన్ ప్రార్థనలన్నీ ప్రభావరహితమయినవిగా ఋజువయ్యాయి, బేరోమస్‌ను రక్షించలేకపోయాయి. ఆ విధంగా కథ అడ్డం తిరగడాన్ని చూసిన అతడి భార్య పెడబొబ్బలు పెడుతూ నిజంగానే ఏడవనారంభించింది. ఆమె బిగ్గరగా ఈ విధంగా పలికింది: " నా భర్త అయితే వాగ్దాన సమయంలో బ్రతికిన స్థితిలో ఉన్నాడు. ఇప్పుడు అతడు రాయి వలె మృతుడిగా,



చల్లగా మారిపోయాడు"

క్రైస్తవ మతపెద్దల అద్భుత కార్యాలకు సంబంధించిన నమూనా ఎలా ఉన్నదో చూశారా? ఈ ఇద్దరు మతపెద్దలు తమ తమ కాలాలలో పౌలు వలె మహోన్నతులుగా, పరిశుద్ధులుగా ప్రఖ్యాతిగాంచియున్నారు. మరి వారి పరిస్థితే ఈ విధంగా ఉన్నప్పుడు వారి అనుయాయుల, అనుచరుల పరిస్థితి ఏవిధంగా ఉంటుందో సులభంగా అంచనా వేయవచ్చు. రోమన్ చర్చికి అధినాయకునిగా, రోమన్ కేథొలిక్ వర్గానికి చెందినవారి దృష్టిలో భువి మీద దేవుని ప్రతినిధిగా పరిగణించబడిన పోప్ ఆరవ అలెగ్జాండర్ మరొక వ్యక్తి కొరకు ఉంచిన విషాన్ని స్వయంగా తాగారు. దానితో ఆయన మరణం సంభవించింది. అప్పుడు చర్చి పర్యవేక్షకుడయిన, దేవుని ప్రతినిధి అయిన వ్యక్తి పరిస్థితే ఈ విధంగా ఉన్నప్పుడు అనుయాయులయిన ప్రజల పరిస్థితి ఏవిధంగా ఉంటుందో సులభంగా అంచనా వేయవచ్చు. ఈ విధంగా క్రైస్తవ ప్రపంచంలోని రోమన్ కేథొలిక్ మరియు ప్రొటెస్టెంట్ వర్గాలకు చెందిన మహోన్నతులుగా పరిగణించబడినవారే ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) చూపిన అద్భుత కార్యాలను చూపలేకపోయారు

## 86 వ తప్పు

బైబిల్ క్రొత్తనిబంధన గ్రంథము లోని లూకా సువార్త యొక్క 3 వ అధ్యాయపు 27 వ వాక్యంలో [472] ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" యోదా యోహన్నకు, యోహన్న రేసాకు, రేసా జెరుబ్బాబెలుకు, జెరుబ్బాబెలు షయల్తీయేలుకు, షయల్తీయేలు నేరికి "**

ఈ వాక్యంలో మూడు తప్పులు ఉన్నాయి: -

**(1)** జెరుబ్బాబెలు సంతతికి సంబంధించిన వివరం మనకు 'దినవృత్తాంతములు మొదటి గ్రంథము' యొక్క 3 వ అధ్యాయంలో మనకు లభ్యమవుతుంది. అక్కడ ఈ పేరుతో ఒక్క కుమారుడయినా ఉన్నట్లుగా పేర్కొనబడలేదు.[473] అంతేగాకుండా ఇది మత్తయి అందజేసిన వివరణకు సైతం విరుద్ధమైనది.

---

**(అథఃసూచికలు)**

[472] అనగా ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) యొక్క వంశావళిని గురించిన వివరణను అందజేసే క్రమంలో ఈ వాక్యం పేర్కొనబడింది.

**(2)** జెరుబ్బాబెలు షయల్తీయేలు కుమారుడు కాడు, పెదాయా కుమారుడు. అయితే జెరుబ్బాబెలు షయల్తీయేలు సోదరుని కుమారుడనే విషయం నిజం.[474]

**(3)** షయల్తీయేలు నేరి కుమారుడు కాడు, యెకొన్యా కుమారుడు. ఈ విషయం గురించి మత్తయి సైతం తన సువార్తలో వివరణను అందజేశారు. .[475]

## 87 వ తప్పు

బైబిల్ క్రొత్తనిబంధన గ్రంథము లోని లూకా సువార్త యొక్క 3 వ అధ్యాయంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" హెబెరు షేలహుకు, షేలహు కేయినానుకు, కేయినాను అర్పక్షదుకు,"**

ఇది కూడా తప్పే. ఎందుకంటే 'షేలహు కేయినానుకు కుమారుడైయుండను' అని ఈ వాక్యంలో చెప్పబడింది. అయితే వాస్తవానికి షేలహు అర్పక్షదుకు మనవడు కాడు, కుమారుడు. ఈ విషయానికి సంబంధించిన వివరణ మనకు బైబిల్ పాతనిబంధన గ్రంథం లోని ఆదికాండము యొక్క 11 వ అధ్యాయంలోనూ[476], 'దినవృత్తాంతములు మొదటి గ్రంథం' యొక్క మొదటి అధ్యాయంలోనూ లభ్యమవుతుంది.[477] ప్రొటెస్టెంట్ వర్గానికి చెందిన క్రైస్తవుల దృష్టిలో హెబ్రూ

**(అథఃసూచికలు)**

[473] ఇదే గ్రంథంలోని 427 వ అథఃసూచికను పరిశీలించగలరు.

[474] ఇదే గ్రంథంలోని 426 వ అథఃసూచికను పరిశీలించగలరు.

[475] **" యెకొన్యా షయల్తీయేలును కనెను "** ( మత్తయి సువార్త, 1 : 12 )

[476] **" అర్పక్షదు ముప్పది యైదేండ్లు బ్రదికి షేలహును కనెను "** ( ఆదికాండము 11 : 12 ) లూకా సువార్త యొక్క 3 వ అధ్యాయంలో అర్పక్షదు కేయినాను కనగా, కేయినాను షేలహును కనినట్లుగా పేర్కొనబడింది. అయితే అర్పక్షదు కేయినాను ను కాకుండా షేలహును కనినట్లుగా ఆదికాండము యొక్క ఈ వాక్యం ద్వారా విదితమవుతుంది. కనుక ఈ విధంగా పైన పేర్కొనబడిన లూకా సువార్తలోని 3 వ అధ్యాయం యొక్క వాక్యం తప్పని నిరూపితమయింది.



ప్రతితో పోలిస్తే దాని అనువాద ప్రతులలో పేర్కొనబడిన విషయాలు విశ్వసనీయమైనవి కావు.[478] కనుక ఏదయినా బైబిల్ అనువాద గ్రంథం కేవలం అది లూకా సువార్తకు అనుగుణంగా ఉన్నంతమాత్రాన స్వయంగా క్రైస్తవుల దృష్టిలోనూ మరియు మా దృష్టిలోనూ ఆమోదయోగ్యం కాజాలదు. పైగా ఆ అనువాద గ్రంథంలోనే క్రైస్తవులు ప్రక్షిప్తాలకు పాల్పడ్డారని మేము పేర్కొంటాము. తద్వారా వాటిని (బైబిల్ పాతనిబంధన గ్రంథంలోని ఆదికాండం మరియు దినవృత్తాంతములు గ్రంథాలను) తమ సువార్తలకు అనుగుణంగా మార్చుకోవాలనేది వారి అభిమతం.

## ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) పుట్టుకకు ముందరి కాలానికి చెందిన జనాభా లెక్క 88 వ తప్పు

బైబిల్ క్రొత్తనిబంధన గ్రంథము లోని లూకా సువార్త యొక్క 2 వ అధ్యాయపు 1 వ వాక్యం నుంచి 2 వ వాక్యం వరకు ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" ఆ దినములలో సర్వలోకమునకు ప్రజాసంఖ్య[479] వ్రాయవలెనని కైసరౌగుస్తు వలన ఆజ్ఞ ఆయెను. ఇది కురేనియు సురియ దేశమునకు అధిపతియైయున్నప్పుడు జరిగిన మొదటి ప్రజాసంఖ్య"**

ఇది కూడా తప్పే. ఎందుకంటే 'సర్వలోకమునకు ప్రజాసంఖ్య' అంటే సమస్త రోమన్ సామ్రాజ్యానికి చెందిన జనాభా లెక్క అని విదితమవుతోంది. లేదా సమస్త యూదా రాజ్యానికి చెందిన జనాభా లెక్క అని విదితమవుతోంది. ప్రాచీన గ్రీకు చరిత్రకారులు, అనగా లూకా కు సమకాలికులుగా ఉన్న లేదా ఆయన కంటే ముందరి కాలానికి చెందిన చరిత్రకారులలో ఏ ఒక్కరూ ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) పుట్టుకకు ముందరి కాలంలో ఆ విధంగా

**(అథఃసూచికలు)**

[477] **" షేము అర్పక్షదు షేలహు ... "** ( దినవృత్తాంతములు మొదటి గ్రంథము, 1 : 24 )

[478] కొన్ని బైబిల్ అనువాద ప్రతులలో ఆదికాండమును మరియు దినవృత్తాంతములు గ్రంథమును లూకా సువార్తకు అనుగుణంగా మార్చివేయడం జరిగిన కారణంగానే బహుశా పాఠకులచే చదవబడుతున్న ఈ గ్రంథ రచయిత బహుశా ఈ విధంగా పేర్కొని ఉంటారు. (మౌలానా ముహమ్మద్ తఖీ ఉస్మానీ సాహెబ్ (అథఃసూచికల కూర్పుకర్త)

జనాభా లెక్కల సేకరణకు సంబంధించిన కార్యం నిర్వహించబడినట్లుగా పేర్కొనలేదు. ఒకవేళ లూకా తర్వాతి కాలానికి చెందిన చరిత్రకారులలో ఏ ఒక్క వ్యక్తయినా ఆ విషయాన్ని ప్రస్తావించినప్పటికీ అది ప్రమాణంగా, ఆధారంగా పరిగనించబడజాలదు. ఎందుకంటే అతడు లూకా వాక్కునే ఉల్లేఖించినట్లుగా భావించబడుతుంది. ఒకవేళ ఈ విషయాన్ని విస్మరించినప్పటికీ అసలు ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) పుట్టుక సంభవించిన పదిహేను సంవత్సరాలకు కురేనియు సురియ దేశమునకు అధిపతి అయినప్పుడు ఏసు పుట్టుకకు పదిహేను సంవత్సరాల పూర్వమే జరిగిన సంఘటన, అనగా జనాభా లెక్క సేకరణకు సంబంధించిన సంఘటన తిరిగి ఎలా జరగగలదు? అదేవిధంగా అతడి కాలంలో ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) పుట్టుక ఎలా సంభవించగలదు? హజ్రత్ మర్యమ్ (అ) (మరియ) గర్భం పదిహేను సంవత్సరాల పాటు నిరంతరాయంగా కొనసాగిందా? ఎందుకంటే లూకా తన సువార్త యొక్క మొదటి అధ్యాయంలో జెకర్యా (దైవప్రవక్త హజ్రత్ జకరియ్యా (అ)) సతీమణి హేరోదు కాలంలో గర్భం దాల్చారని, మరియ (హజ్రత్ మర్యమ్ (అ)) ఆ తర్వాత ఆరునెలలకు గర్భం దాల్చారని అంగీకరించారు[480]. ఇలా ఏవిధంగానూ ఈ సమస్య పరిష్కరించబడకపోవడాన్ని గమనించిన క్రైస్తవ పండితులు లూకా సువార్తలో పేర్కొనబడిన రెండవ వాక్యం వాస్తవానికి లూకాచే రచించబడలేదని, అది కల్పితమైన, లూకాకు ఆపాదించబడిన వాక్యమని పేర్కొని చేతులు దులుపుకున్నారు.

**(అథఃసూచికలు)**

[479] పాఠకులచే చదవబడుతున్న ఈ గ్రంథ రచయిత పొందుపరచిన బైబిల్ అరబీ అనువాద ప్రతిలోని అనువాదంలో కేవలం 'ప్రజాసంఖ్య' అని మాత్రమే పేర్కొనబడి ఉంది. అయితే బైబిల్ ఉర్దూ అనువాద ప్రతిలోనూ, బైబిల్ తెలుగు అనువాద ప్రతిలోనూ 'సర్వలోకమునకు' అనే పదం కూడా చేర్చబడి ఉంది.

[480] హేరోదు కాలం కురేనియు కాలం కంటే పదిహేను సంవత్సరాలు ముందు కొనసాగింది. అనగా కురేనియ కాలం హేరోదు కాలానికి పదిహేను సంవత్సరాల తరువాతి కాలం. మరి ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) పుట్టుక హేరోదు కాలంలో సంభవించినప్పుడు ఆయన (అ) ప్రభవించిన తర్వాత పదిహేను సంవత్సరాలకు కురేనియు కాలం ప్రారంభమయిందని విదితమవుతుంది. మరి ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) ముందరి కాలానికి చెందిన జనాభా లెక్కల సేకరణకు సంబంధించిన సంఘటన ఆయన (అ) పుట్టుక సంభవించిన 15 సంవత్సరాల తరువాతి కాలానికి చెందిన కురేనియు సురియ దేశమునకు అధిపతియై యున్న కాలంలో ఎలా జరగగలదు? అనే ప్రశ్నకు క్రైస్తవ పండితుల వద్ద సమాధానం లేదు.



## 89 వ తప్పు

బైబిల్ క్రొత్తనిబంధన గ్రంథము లోని లూకా సువార్త యొక్క 3 వ అధ్యాయపు 1 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" తిబెరికైసరు ఏలుబడి పదునైదవ సంవత్సరమందు యూదైయకు పొంతిపిలాతు అధిపతిగాను, గలిలైయకు హేరోదు చతుర్థాధిపతిగాను, ఇతూరయ త్రకోనీతి దేశములకతని తమ్ముడైన ఫిలిప్పు చతుర్థాధిపతిగాను, అబిలేనే దేశమునకు లుసానియ అధిపతిగాను[481] "** (కొన్ని అనువాదాలలో 'అబీలేనే' అనే పదానికి బదులుగా 'అబిలియా' అని పేర్కొనబడి ఉంది. అయితే ఈ రెండూ ఒకే దేశాన్ని సూచిస్తాయి)

చరిత్రకారుల దృష్టిలో ఈ వాక్యం ఎందుకు తప్పంటే 'లుసానియ' అనే పేరు గల ఏ వ్యక్తీ పొంతిపిలాతు మరియు హేరోదు ల సమకాలికునిగా అబిలేనే దేశము యొక్క చతుర్థ భాగమునకు అధిపతిగా కొనసాగియుండలేదు.

## 90 వ తప్పు

లూకా సువార్త యొక్క 3 వ అధ్యాయపు 19 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" అయితే చతుర్థాధిపతియైన హేరోదు తన తమ్ముని భార్యయైన హేరోదియ నిమిత్తమును, తాను చేసిన సకల దుష్కార్యముల నిమిత్తమును యోహాను తన్ను గద్దించినందుకు"**

ఇది కూడా పూర్తిగా తప్పే. ఈ విషయం గురించి '56 వ తప్పు' అనే మకుటం క్రింద వివరణ అందజేయబడింది.[482] క్రైస్తవ వ్యాఖ్యాతలు సైతం దీనిని తప్పుగా అంగీకరించారు.

**(అథఃసూచికలు)**

[481] ఈ వాక్యంలో ' **అధిపతి** " అనే పదం ' **షత్రారిఖ్** ' అనే గ్రీకు పదానికి అనువాదం. ఈ పదానికి 'దేశంలోని చతుర్థ భాగమునకు అధిపతి' అని అర్థం. అనువాదకుడు పొందుపరచిన అథఃసూచిక ద్వారా మనకు ఈ విషయం తెలుస్తుంది.

[482] పాఠకులచే చదవబడుతున్న ఈ గ్రంథం యొక్క 267 వ పేజీలో పేర్కొనబడిన '56 వ తప్పు' ను అధ్యయనం చేయగలరు.

లేఖకుడు ఇక్కడ తప్పుగా వ్రాశాడని వారు పేర్కొంటారు. ఈ విషయం గురించి పాఠకులచే చదవబడుతున్న ఈ గ్రంథం యొక్క 2 వ భాగంలోని లక్ష్యం - 2, ఋజువు నెం - 27 ద్వారా మరింతగా విదితమవుతుంది. వాస్తవమేమిటంటే ఈ విషయంలో తప్పు లూకాదే గానీ పాపం లేఖకునిది కాదు.

## 91 వ తప్పు

మార్కు సువార్త యొక్క 6వ అధ్యాయపు 17 వ మరియు 18 వ వాక్యాలలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" హేరోదు తన సహోదరుడగు ఫిలిప్పు భార్యయైన హేరోదియను పెండ్లి చేసికొనినందున యోహాను - నీ సహోదరుని భార్యను చేర్చుకొనుట నీకు న్యాయము కాదని హేరోదుతో చెప్పెను గనుక ఇతడామె నిమిత్తము యోహానును పట్టి తెప్పించి చెరసాలలో బంధించియుండెను"**

ఇది కూడా పూర్తిగా తప్పే. ఈ విషయం గురించి పాఠకులకు ఇప్పటికే విదితమయి ఉన్నది. ఇక్కడ ముగ్గురు సువార్తికులూ తప్పుకు పాల్పడ్డారు. ఆ విధంగా ఈ తప్పు చేసే విషయంలో త్రిత్వం పూర్తయింది. క్రీ.శ. 1821 లో మరియు క్రీ.శ. 1844 లో ప్రచురించబడిన బైబిల్ అరబీ అనువాద గ్రంథాలలో అనువాదకుడు మత్తయి సువార్తలోనూ మరియు లూకా సువార్తలోనూ ఈ వాక్యంలో ప్రక్షిప్తానికి పాల్పడి 'ఫిలిప్పు' అనే పదాన్నే తొలగించివేశాడు. అయితే ఇతర అనువాదకులు ఈ విషయంలో అతడిని అనుసరించలేదు. ఈ వైఖరి (ప్రక్షిప్తానికి పాల్పడే వైఖరి) గ్రంథవహుల సహజ నైజంగా మారిపోయినందున ఈ ' చిన్న ' అంశం విషయంలో మేము వారి పట్ల అసలు ఫిర్యాదే చేయడం లేదు.

## దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ) (దావీదు) సముఖపు రొట్టెలు తినడం

## 92 వ తప్పు నుంచి 94 వ తప్పు వరకు

మార్కు సువార్త యొక్క 2వ అధ్యాయపు 25 వ మరియు 26 వ వాక్యాలలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" అందుకాయన వారితో ఇట్లనెను- తానును తనతో కూడనున్నవారును ఆకలిగొనినందున దావీదుకు అవసరము వచ్చియున్నప్పుడు అతడు చేసినది మీరెన్నడును చంపలేదా? అబ్యాతారు ప్రధాన యాజకుడై యుండగా దేవమందిరములోకి వెళ్ళి, యాజకులే గాని యితరులు తినకూడని సముఖపు రొట్టెలు తాను తిని తనతో కూడ ఉన్నవారికిచ్చెను గదా అని చెప్పెను"**



ఇది కూడా పూర్తిగా తప్పే. ఎందుకంటే దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ) (దావీదు) ఆ సందర్భంలో ఒంటరిగా ఉన్నారు. ఆ సమయంలో ఆయనతో పాటు మరెవరూ లేరు. కనుక 'తనతో కూడనున్నవారు' అనే పదాలు తప్పు.

అలాగే 'తనతో కూడ ఉన్నవారికి' అనే పదాలు కూడా తప్పే. అలాగే ఆ కాలంలో ప్రధాన యాజకునిగా [483] అహీమెలెకు ఉండెను గానీ అబ్యాతారు కాదు. అబ్యాతారు అహీమెలెకు కుమారుడు. కనుక **'అబ్యాతారు ప్రధాన యాజకుడై యుండగా'** అనే పదాలు కూడా తప్పే. ఈ విధంగా ఈ రెండు వాక్యాలలో మార్కు మొత్తం మూడు తప్పులకు పాల్పడడం జరిగింది. మూడవ తప్పును స్వయంగా క్రైస్తవ పండితులు కూడా అంగీకరించారు. ఈ విషయం గురించి పాఠకులచే చదవబడుతున్న ఈ గ్రంథం యొక్క రెండవ సంపుటిలోని లక్ష్యం-2, ఋజువు నెం.29 లో తెలుస్తుంది. అలాగే ఈ రెండు వాక్యాలలోని మూడు విషయాలు తప్పనే విషయం బైబిల్ పాతనిబంధన గ్రంథంలోని 'సమూయేలు మొదటి గ్రంథము' యొక్క 21 వ మరియు 22 వ అధ్యాయాల ద్వారా కూడా విదితమవుతుంది.[484]

---

**(అథఃసూచికలు)**

483 'ప్రధాన యాజకుడు' (High Priest) అనేది ఇశ్రాయేలీయులలో ఒక మతపరమైన పదవి పేరు. ఈ పదవిని మొట్టమొదట దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) (మోషే) తన సోదరుడయిన దైవప్రవక్త హజ్రత్ హారూన్ (అ) (అహరోను) కు ఇచ్చినట్లుగా తౌరాతు గ్రంథంలో పేర్కొనబడి ఉంది. ఈ పదవికి సంబంధించిన ప్రత్యేకమైన చిహ్నం, వస్త్రధారణ ఉంటాయి. అలాగే ప్రధాన యాజకునికి కొన్ని ప్రత్యేకమైన విధులు అప్పగించబడతాయి. మరిన్ని వివరాల కొరకు చూడండి : 'నిర్గమ కాండము' యొక్క 28 వ మరియు 29 వ అధ్యాయాలు, 'లేవీయ కాండము' యొక్క 8 వ మరియు 16 వ అధ్యాయాలు.

484 **" దావీదు నోబులో యాజకుడైన అహీమెలెకు నొద్దకు వచ్చెను; అయితే అహీమెలెకు దావీదు రాకకు భయపడి నీవు ఒంటరిగా వచ్చితివేమని అతని నడుగగా "** (సమూయేలు మొదటి గ్రంథము, 21 : 1)

ఆ తర్వాత రొట్టెలకు సంబంధించిన సంఘటన గురించి పేర్కొనబడింది.

**" అయితే అహీటూబు కుమారుడైన అహీమెలెకు కుమారులలో అబ్యాతారు అనునొకడు తప్పించుకొని పారిపోయి దావీదునొద్దకు వచ్చి"** (సమూయేలు రెండవ గ్రంథము, 22 : 20)

## 95 వ తప్పు మరియు 96 వ తప్పు

లూకా సువార్త యొక్క 6వ అధ్యాయపు 3 వ మరియు 4 వ వాక్యాలలో ఈ సంఘటన గురించిన ప్రస్తావనలో

**" తాను తనతో కూడ ఉన్నవారును ఆకలిగొనినప్పుడు దావీదు ఏమిచేసెనో అదియైన మీరు చదవలేదా? అతడు దేవుని మందిరములో ప్రవేశించి, యాజకులు తప్ప మరి ఎవరును తినకూడని సముఖపు రొట్టెలు తీసికొని తిని, తనతో కూడ ఉన్నవారికి ఇచ్చెను గదా అనెను"** అని పేర్కొనబడి ఉంది.

ఈ వాక్యాలలోనూ 'తాను తనతో కూడ ఉన్నవారును' అనే పదాలు మరియు 'తనతో కూడ ఉన్నవారికి' అనే పదాలు ఇంతకుముందు పేర్కొనబడిన వివరణ ప్రకారం తప్పు.

## 97 వ తప్పు

'అపొస్తలుడైన పౌలు కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక' యొక్క 15 వ అధ్యాయపు 5 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" ఆయన కేఫాకును తరువాత పన్నెండుగురికిని కనబడెను "** [485]

ఇది కూడా తప్పే. ఎందుకంటే ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) యొక్క పన్నెండు మంది శిష్యులలో ఒకడైన ఇస్కరియోతు యూదా అంతకుముందే మరణించాడు. కనుక శిష్యుల సంఖ్య 13 మాత్రమే అవుతుంది. ఈ కారణంగానే మార్కు తన సువార్త యొక్క 16 వ

**(అథఃసూచికలు)**

[485] ఇక్కడ ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) (క్రైస్తవుల విశ్వాసం ప్రకారం) మరణించిన తర్వాత తిరిగి సజీవునిగా లేవడానికి సంబంధించిన సంఘటన గురించి ప్రస్తావించబడుతోంది. అనగా ఆయన మొదట కేఫాకు, తర్వాత ఆయన యొక్క పన్నెండు మంది శిష్యులకు కనబడ్డారని పేర్కొనబడింది. వ్యాఖ్యాత అయిన హోరన్ ఇక్కడ ఉద్దేశ్యపూర్వకంగా ప్రక్షిప్తానికి పాల్పడడం జరిగిందనే విషయాన్ని అంగీకరించారు. ఈ విషయం గురించి పాఠకులచే చదవబడుతున్న ఈ గ్రంథం యొక్క రెండవ సంపుటిలో మరిన్ని వివరాలు పేర్కొనబడ్డాయి. వాటిని పాఠకులు అధ్యయనం చేయగలరు.



అధ్యాయంలో [486] ఈ విధంగా పేర్కొన్నారు: **" ఇంకొక సమయమున పదకొండుమంది శిష్యులు భోజనమునకు కూర్చున్నప్పుడు ఆయన వారికి ప్రత్యక్షమై, "**

## ఏసు శిష్యులు తప్పు చేయజాలరు

## 98 వ తప్పు నుంచి 102 వ తప్పు వరకు

మత్తయి సువార్త యొక్క 10 వ అధ్యాయపు 19 వ వాక్యంలో మరియు 20 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" వారు మిమ్మును అప్పగించుచున్నప్పుడు, - ఏలాగు మాటలాడుదుము? ఏమి చెప్పుదుము? అని చింతింపకుడి; మీరేమి చెప్పవలెనో అది ఆ గడియలోనే మీకనుగ్రహింపబడును. మీ తండ్రి ఆత్మ మీలో ఉండి మాటలాడుచున్నాడే గాని మాటలాడు వారు మీరు కారు"**

లూకా సువార్త యొక్క 12 వ అధ్యాయపు 11 వ వాక్యంలో మరియు 12 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" వారు సమాజ మందిరముల పెద్దల యొద్దకును అధిపతుల యొద్దకును అధికారుల యొద్దకును మిమ్మును తీసికొనిపోవునప్పుడు మీరు - ఏలాగు ఏమి ఉత్తరమిచ్చెదమా, యేమి మాటలాడుదమా అని చింతింపకుడి; మీరేమి చెప్పవలసినది పరిశుద్ధాత్మ ఆ గడియలోనే మీకు నేర్పువనెను."**

మార్కు సువార్త యొక్క 13 వ అధ్యాయంలోనూ ఈ విషయం పేర్కొనబడి ఉంది. క్రైస్తవుల త్రిత్వపు విశ్వాసం ప్రకారం ఈ వాక్కుకు సంబంధించి ముగ్గురు సువార్తికుల వివరణ ఏమిటంటే ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) తన శిష్యులకు 'మీరు అధికారుల ముందు ఏదయితే పలుకుతారో అది పరిశుద్ధాత్మ దివ్యవాక్కు అయి ఉంటుంది, మీ వాక్కు ఎంతమాత్రం కాజాలదు' అని వాగ్దానం చేశారు. అయితే ఇది పూర్తిగా తప్పు. ఎందుకంటే 'అపొస్తలుల కార్యములు' గ్రంథం యొక్క 23 వ అధ్యాయపు ఒకటవ వాక్యం నుంచి 5 వ వాక్యం వరకు ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" పౌలు మహా సభవారిని తేరిచూచి - సహోదరులారా, నేను నేటివరకు కేవలము**

**(అథఃసూచికలు)**

[486] 14 వ వాక్యంలో

**మంచి మనస్సాక్షి గలవాడనై దేవుని యెదుట నడుచుకొనుచుంటినని చెప్పెను. అందుకు ప్రధాన యాజకుడైన అననీయ - అతని నోటిమీద కొట్టుడని దగ్గర నిలిచియున్న వారికి ఆజ్ఞాపింపగా పౌలు అతని చూచి - సున్నము కొట్టిన గోడా, దేవుడు నిన్ను కొట్టును; నీవు ధర్మశాస్త్రము చొప్పున నన్ను విమర్శింప కూర్చుండి, ధర్మశాస్త్రమునకు వ్యతిరిక్తముగా నన్ను కొట్ట నాజ్ఞాపించుచున్నావా అనెను. దగ్గర నిలిచియున్నవారు - నీవు దేవుని ప్రధాన యాజకుని దూషించెదవా అని అడిగిరి.** **పౌలు అతని చూచి - సున్నము కొట్టిన గోడా, దేవుడు నిన్ను కొట్టును; నీవు ధర్మశాస్త్రము చొప్పున నన్ను విమర్శింప కూర్చుండి, ధర్మశాస్త్రమునకు వ్యతిరిక్తముగా నన్ను కొట్ట నాజ్ఞాపించుచున్నావా అనెను. దగ్గర నిలిచియున్నవారు - నీవు దేవుని ప్రధాన యాజకుని దూషించెదవా అని అడిగిరి.** **అందుకు పౌలు సహోదరులారా, యీతడు ప్రధాన యాజకుడని నాకు తెలియలేదు- నీ ప్రజల అధికారిని నిందింపవద్దు అని వ్రాయబడియున్నదనెను"**

ఒకవేళ మత్తయి సువార్తలోనూ, లూకా సువార్తలోనూ పేర్కొనబడిన విషయం సత్యమే అయి ఉన్న పక్షంలో క్రైస్తవులకు అత్యంత పవిత్రుడయిన, వారి దృష్టిలో ఆత్మిక సహచర్యం రీత్యా ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) శిష్యుడయిన పౌలు (ఈ విషయంలో అతడికి మాత్రమే ఈ గౌరవం లభించింది. అతడు స్వయంగా తన గురించి ఏసు శిష్యులలో అందరికంటే గొప్పవాడయిన పేతురుతో సమానమైన స్థాయిని కలిగియున్నట్లుగా ప్రకటించుకున్నాడు.[487] ) , ప్రొటెస్టెంట్ వర్గానికి చెందిన క్రైస్తవుల దృష్టిలో పేతురు కంటే గొప్ప స్థాయిని కలిగియున్న పౌలు అధికారుల ముందు ఎలా తప్పుకు పాల్పడగలడు? క్రైస్తవుల దృష్టిలో పరిశుద్ధునిగా పరిగణించబడిన పౌలు స్వయంగా తన వాక్కు విషయంలో తప్పుకు పాల్పడడమనేది ఆ వాక్కు తప్పు అని స్పష్టపరుస్తోంది. పరిశుద్ధాత్మ సైతం తప్పుకు పాల్పడుతుందా? ఎందుకంటే **'మీరేమి చెప్పవలసినది పరిశుద్ధాత్మ ఆ గడియలోనే మీకు నేర్పుననెను.'** అని లూకా సువార్తలో చెప్పబడియున్నది కదా!

ఈ గ్రంథాన్ని చదువుతున్న పాఠకులకు త్వరలోనే క్రైస్తవ పండితులు స్వయంగా ఈ చోట వైరుధ్యముందని, తప్పు ఉందని అంగీకరించారనే విషయం నాల్గవ ప్రకరణంలో విదితమవుతుంది. ఈ తప్పు కూడా మూడు సువార్తల్లోనూ పేర్కొనబడి ఉన్నది గనుక ఈ విషయానికి సంబంధించి మూడు తప్పులు సువార్తల్లో చోటుచేసుకున్నట్లయింది.

---

**(అథఃసూచికలు)**

[487] **" నేనైతే మిక్కిలి శ్రేష్ఠులైన యీ అపొస్తలుల కంటే లేశమాత్రమును తక్కువవాడను కానని**

(మిగిలినభాగం తరువాతి పేజీలో)



లూకా సువార్త యొక్క 4 వ అధ్యాయపు 25 వ వాక్యంలోనూ, 'యాకోబు వ్రాసిన పత్రిక' యొక్క 5 వ అధ్యాయపు 17 వ వాక్యంలోనూ దైవప్రవక్త అయిన హజ్రత్ ఏలియా కాలంలో మూడున్నర సంవత్సరాల వరకు భూమి మీద వర్షం కురవలేదని పేర్కొనబడింది.[488]

ఇది కూడా తప్పే. ఎందుకంటే 'రాజులు మొదటి గ్రంథము' యొక్క 18 వ అధ్యాయం ద్వారా మూడవ సంవత్సరం వర్షం కురిసినట్లుగా విదితమవుతుంది. [489] ఈ తప్పు లూకా సువార్తలో ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) యొక్క వాక్కులో ఉంటే, యాకోబు వ్రాసిన పత్రికలో యాకోబు యొక్క వాక్కులో ఉన్నది. ఈ విధంగా వాస్తవానికి ఈ విషయంలో రెండు తప్పులు చోటుచేసుకున్నాయి.

## ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) దావీదు (దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ) సింహాసనాన్ని అధిష్ఠిస్తారు. 103 వ తప్పు

లూకా సువార్త యొక్క మొదటి అధ్యాయంలో దైవదూత అయిన హజ్రత్ జిబ్రయీల్ (అ) (గాబ్రియేలు దూత) హజ్రత్ మర్యమ్ (అ) (మరియ) కు ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) పుట్టుకకు సంబంధించిన శుభవార్తను అందజేస్తూ ఈ విధంగా పలికినట్లుగా పేర్కొనబడి ఉంది:

---

**(అథఃసూచికలు)**

(487 వ అథఃసూచిక తరువాయి భాగం)

**తలంచుకొనుచున్నాను. "**

(అపొస్తలుడైన పౌలు కొరింథీయులకు వ్రాసిన రెండవ పత్రిక', 11 : 5)

[488] **" ఏలీయా దినములయందు మూడేండ్ల ఆరునెలలు ఆకాశము మూయబడి దేశమందంతటను గొప్ప కరవు సంభవించినప్పుడు ...."**

(లూకా సువార్త, 4 వ అధ్యాయము, 25 వ వాక్యము)

**" ఏలీయా మనవంటి స్వభావము గల మనుష్యుడే; వర్షింపకుండునట్లు అతడు ఆసక్తితో ప్రార్థన చేయగా మూడున్నర సంవత్సముల పర్యంతము భూమి మీద వర్షింపలేదు"**

(యాకోబు వ్రాసిన పత్రిక, 5 వ అధ్యాయము, 17 వ వాక్యము)

**" ఆయన గొప్పవాడై సర్వోన్నతుని కుమారుడనబడును; ప్రభువైన దేవుడు ఆయన తండ్రియైన దావీదు సింహాసనమును ఆయన కిచ్చును. ఆయన యాకోబు వంశస్థులన యుగయుగముల నేలును; ఆయన రాజ్యము అంతము లేనిదై యుండునని ఆమెతో చెప్పెను"**

(లూకా సువార్త, 1 వ అధ్యాయము, 32 వ వాక్యము నుంచి 33 వ వాక్యము వరకు)

ఇది కూడా రెండు కారణాల రీత్యా తప్పు:

మొదటి కారణమేమిటంటే ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) మత్తయి సువార్తలో పేర్కొనబడిన దాని ప్రకారం యెహోయాకీము సంతతికి చెందినవారు. యెహోయాకీము సంతతికి చెందినవారిలో ఏ ఒక్కరికీ దావీదు (దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ)) యొక్క సింహాసనంపై కూర్చునే అధికారం ప్రాప్తం కాదు. ఈ విషయానికి సంబంధించిన వివరాలు 'యిర్మీయా గ్రంథము' యొక్క 36 వ అధ్యాయంలో [490] లభ్యమవుతాయి.

రెండవ కారణమేమిటంటే ఏసుకు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)కు) ఒక్క క్షణం సైతం దావీదు (దైవప్రవక్త హజ్రత్ దావూద్ (అ)) యొక్క సింహాసనాన్ని అధిష్టించే అవకాశం ప్రాప్తం కాలేదు. అలాగే ఆయనకు యాకోబు వంశస్థులను పరిపాలించే అవకాశమూ ప్రాప్తం కాలేదు. పైగా అందుకు విరుద్ధంగా వారు ఆయనకు శత్రువులుగా మారి ఆయనను పట్టించి పిలాతు ముందు హాజరుపరిచారు. అతడు ఆయనను కొట్టించి, అవమానించి యూదులకు అప్పగించగా వారు ఆయన (క్రైస్తవుల విశ్వాసం ప్రకారం) కు శిలువ వేశారు.

---

**(అథఃసూచికలు)**

[489] **" అనేక దినములైన తరువాత మూడవ సంవత్సరమందు.... యెహోవా వాక్కు ఏలీయాకు ప్రత్యక్షమై నేను భూమి మీద వర్షము కురిపింపబోవుచున్నాను; నీవు వెళ్ళి అహాబును దర్శించుమని సెలవియ్యగా ."**

(రాజులు మొదటి గ్రంథము, 18 వ అధ్యాయము, 15 వ వాక్యము)

[490] **" అందుచేతను యూదారాజైన యెహోయాకీమును గూర్చి యెహోవా ఈ మాట సెలవిచ్చుచున్నాడు. దావీదు యొక్క సింహాసనము మీద ఆసీనుడగుటకు అతనికి ఎవడును లేకపోవును...."**

(యిర్మీయా గ్రంథము, 36 వ అధ్యాయము, 30::: వ వాక్యము)



అంతేగాకుండా యోహాను సువార్త యొక్క 6 వ అధ్యాయం ద్వారా ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) రాజ్యాధికారాన్ని ఇష్టపడేవారు కాదనే విషయం విదితమవుతుంది[491] అయితే (క్రైస్తవుల విశ్వాసం ప్రకారం) ఏ కార్యం కొరకయితే ఆయనను దేవుడు పంపడం జరిగిందో ఆ కార్యాన్నే ఆయన నిరసించడానికి గల కారణమేమిటో బోధపడదు.

## 104 వ తప్పు

మార్కు సువార్త యొక్క 10 వ అధ్యాయంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" అందుకు యేసు ఇట్లనెను - నా నిమిత్తమును సువార్త నిమిత్తమును ఇంటినైనను అన్నదమ్ములనైనను అక్కచెల్లెండ్లనైనను తలిదండ్రులనైనను పిల్లలనైనను భూములనైనను విడిచినవాడు ఇప్పుడు ఇహమందు హింసలతో కూడ నూరంతలుగా ఇండ్లను అన్నదమ్ములను అక్కచెల్లెండ్లను తల్లులను పిల్లలను భూములను రాబోవు లోకమందు నిత్యజీవమును పొందునని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను"**

(మార్కు సువార్త యొక్క 10 వ అధ్యాయం, 29 వ వాక్యం నుంచి 30 వ వాక్యం వరకు)

లూకా సువార్త యొక్క 18 వ అధ్యాయంలో ఇదే విషయం ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" ఆయన - దేవుని రాజ్యము నిమిత్తమై యింటినైనను భార్యనైనను అన్నదమ్ములనైనను తలిదండ్రులనైనను పిల్లలనైనను విడిచిపెట్టినవాడెవడును, ఇహమందు చాలరెట్లును పరమందు నిత్యజీవమును పొందకపోడని నిశ్చయముగా మీతో చెప్పుచున్నానని వారితో అనెను"**

వాస్తవానికి ఇది తప్పు. ఎందుకంటే ఒక వ్యక్తి ఒక భార్యను విడచిపెట్టినట్లయితే అదే కాలంలో అతడికి వంద భార్యలు లభ్యమవడమనేది అసాధ్యం. ఎందుకంటే క్రైస్తవుల ప్రకారం ఒక వ్యక్తి ఒకరిని మించిన స్త్రీలను వివాహమాడడం నిషిద్ధం. ఒకవేళ ఇక్కడ ఆడవారంటే ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) ను విశ్వసించిన స్త్రీలని భావమని, వారిని వివాహమాడకుండానే

---

**(అథఃసూచికలు)**

[491] **"రాజుగా చేయుటకు వారు వచ్చి తన్ను బలవంతముగా పట్టుకొనబోవుచున్నారని యేసు ఎరిగి, మరల కొండకు ఒంటరిగా వెళ్ళెను "**

(యోహాను సువార్త, 6 వ అధ్యాయము, 15 వ వాక్యము)

ఉంచుకోవచ్చునని గ్రహించాలని పేర్కొనే పక్షంలో ఈ విషయం మరింత హేయమైనదిగా, చెడ్డదిగా మారిపోతుంది.

అంతేగాకుండా మార్కు సువార్తలోని వాక్యంలో **'హింసలతో కూడ"** అనే వాక్కు పూర్తిగా అర్థరహితమైనది, అసమంజసమైనది. ఎందుకంటే ఇక్కడ అత్యుత్తమ ప్రతిఫలం ప్రసాదించబడడం గురించి చర్చించబడుతోంది. మరి వాటి ప్రస్తావన సందర్భలో 'హింసలతో కూడ' అని పేర్కొనవలసిన అవసరమేముంది?

## పిచ్చివానికి స్వస్థతను చేకూర్చడం 105 వ తప్పు

మార్కు సువార్త యొక్క 5 వ అధ్యాయంలో పిచ్చివాని శరీరం నుంచి ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) దురాత్మలను వెళ్ళగొట్టడానికి సంబంధించిన సంఘటన గురించి ఈ విధంగా పేర్కొనబడింది:

**" గనుక - ఆ పందులలో ప్రవేశించునట్లు మమ్మును వాటియొద్దకు పంపుమని ఆ దయ్యములు ఆయనను బతిమాలుకొనెను. యేసు వాటికి సెలవియ్యగా ఆ అపవిత్రాత్మలు వాని విడిచి పందులలో ప్రవేశించెను. ప్రవేశింపగా ఇంచుమించు రెండు వేల సంఖ్యగల ఆ మంద ప్రపాతము నుండి సముద్రపు దారిని వడిగా పరుగెత్తుకొనిపోయి సముద్రములో పడి ఊపిరి తిరుగక చచ్చెను"** ( 12 వ వాక్యం నుంచి 13 వ వాక్యం వరకు)

ఇది కూడా తప్పే. ఎందుకంటే పంది యూదుల దృష్టిలో నిషిద్ధ జంతువు. ఇక పందులను ఆ కాలంలో తినే క్రైస్తవులు విస్తృత సంపదకు యజమానులేమీ కారు. మరి అంత పెద్ద పందుల మందకు యజమాని ఎవరు? మరొక విషయమేమిటంటే ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) తలచుకుంటే ఆ పిచ్చివానికి ఆ పందులను (క్రైస్తవుల దృష్టిలో పందులు సైతం మేకలు, పొట్టేళ్ళ వలె ధర్మసమ్మతమైన జంతువులు) నశింపజేయకుండానే స్వస్థతను కలుగజేయగల సామర్థ్యాన్ని కలిగియున్నారు లేదా ఒక్క వ్యక్తి నుంచి దయ్యములను వెళ్ళగొట్టే పక్షంలో ఒక్క పందిలోనే వాటిని ప్రవేశింపజేయగల సామర్థ్యాన్నీ కలిగియున్నారు. మరి ఆ విధంగా ఆయన (అ) చేయకుండా ఆ పందుల యజమానులకు అంత నష్టాన్ని ఎందుకు కలిగించినట్లు?

## 106 వ తప్పు

మత్తయి సువార్త యొక్క 26 వ అధ్యాయంలో [492] ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) యూదులతో సంభాషించే సమయంలో వెలువరించే వాక్కు ఈ విధంగా పేర్కొనబడింది.



**" ఇది మొదలుకొని మనుష్యకుమారుడు సర్వశక్తుని కుడిపార్శ్వమున కూర్చుండుటయు, ఆకాశ మేఘారూఢుడై వచ్చుటయు మీరు చూతురని చెప్పగా "**

ఇది కూడా తప్పే. ఎందుకంటే యూదులు ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) ఆకాశ మేఘారూఢుడై వచ్చుటను ఆయన (అ) మరణానికి (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) ముందు గానీ, తర్వాత గానీ ఎంతమాత్రం చూడలేదు.

## శిష్యుడు గురువును మించజాలడు 107 వ తప్పు

లూకా సువార్త యొక్క 6 వ అధ్యాయపు 40 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" శిష్యుడు తన బోధకుని కంటె అధికుడు కాడు; సిద్ధుడైన ప్రతివాడును తన బోధకుని వలె ఉండును "**

ఇది కూడా విస్పష్టమైన రీతిలో తప్పే. ఎందుకంటే ఎందరో శిష్యులు సామర్థ్యాన్ని పుణికి పుచ్చుకున్న తర్వాత తమ గురువులను మించిపోయిన దృష్టాంతాలెన్నో చరిత్రలో ఉన్నాయి.

## తల్లిదండ్రులను గౌరవించాలా? ద్వేషించాలా? 108 వ తప్పు

లూకా సువార్త యొక్క 14 వ అధ్యాయంలో [493] ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) యొక్క వాక్కు ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" బహు జనసమూహములు ఆయనతో కూడ వెళ్ళుచున్నప్పుడు ఆయన వారి తట్టు తిరిగి- ఎవడైనను నా యొద్దకు వచ్చి తన తండ్రిని తల్లిని భార్యను పిల్లలను అన్నదమ్ములను అక్కచెల్లెండ్లను తన ప్రాణమును సహా ద్వేషింపకుంటే వాడు నా శిష్యుడు కానేరడు "**

ఈ మర్యాద ఎంతో విచిత్రమైనది. ఇటువంటి మర్యాద గురించి బోధించడమనేది

---

**(అథఃసూచికలు)**

[492] 64 వ వాక్యం.

[493] 26 వ వాక్యం.

ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) స్థాయికి శోభించనట్టిది. వాస్తవానికి ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) స్వయంగా యూదులను మందలిస్తూ ఒక సందర్భంలో ఈ విధంగా పేర్కొని ఉన్నారు: " దేవుడు ఈ విధంగా చెప్పెను: నీవు నీ తల్లిదండ్రులను గౌరవించాలి. ఏ వ్యక్తయితే తన తండ్రిని లేదా తల్లిని దూషిస్తాడో అతడు తప్పకుండా వధించబడాలి" ఈ విషయానికి సంబంధించిన వివరం మనకు మత్తయి సువార్త యొక్క 14 వ అధ్యాయపు 4 వ వాక్యంలో [494] లభ్యమవుతుంది. మరి ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) ఏవిధంగా తల్లిదండ్రులను ద్వేషించవలసిందిగా బోధించగలరు?

## 109 వ తప్పు

యోహాను సువార్త యొక్క 11 వ అధ్యాయంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" అయితే వారిలో కయప అను ఒకడు ఆ సంవత్సరము ప్రధాన యాజకుడై యుండి - మీకేమియు తెలియదు. (మన) జనమంతయు నశింపకుండునట్లు ఒక మనుష్యుడు ప్రజల కొరకు చనిపోవుట మీకు ఉపయుక్తమని మీరు ఆలోచించుకొనరు అని వారితో చెప్పెను. తనంతట తానే యీలాగు చెప్పలేదు గాని ఆ సంవత్సరము ప్రధాన యాజకుడై యుండెను గనుక యేసు ఆ జనము కొరకును, ఆ జనము కొరకు మాత్రమే గాక చెదరిపోయిన దేవుని పిల్లలను ఏకముగా సమకూర్చుటకును, చావనైయున్నాడని ప్రవచించెను."**

(49 వ వాక్యం నుంచి 52 వ వాక్యం వరకు)

ఇది కూడా పలు కారణాల రీత్యా తప్పు:

ఒకటవ ఏమిటంటే యూదుల ప్రధాన యాజకుడు దైవప్రవక్త అయి ఉండాలని ఈ వాక్యం కోరుతుంది. అయితే ఇది నిశ్చయంగా తప్పు.

రెండవ కారణమేమిటంటే ఒకవేళ ఆ ప్రధాన యాజకుడు దైవప్రవక్తగా దేవుని వాణిని వినిపిస్తూ ఈ మాటలను పలికినట్లుగా అంగీకరించే పక్షంలో ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా

(అధఃసూచికలు)

494 **" తల్లిదండ్రులను ఘనపరచుమనియు, తండ్రినైనను తల్లినైనను దూషించువాడు తప్పక మరణము పొందవలెననియు దేవుడు సెలవిచ్చెను "**

(మత్తయి సువార్త, 15 వ అధ్యాయము, 4 వ వాక్యము)



(అ)) మరణాన్ని కేవలం యూదుల తరఫున [495] మాత్రమే పరిహారంగా [496] పరిగణించాలే గానీ సమస్త ప్రపంచం తరఫున కాదు. ఒకవేళ సమస్త ప్రపంచం తరఫున అని భావించినట్లయితే అది క్రైస్తవుల విశ్వాసాలకు, సిద్ధాంతాలకు, ప్రకటనలకు విరుద్ధమవుతుంది.

అలాగే యోహాను సువార్తీకుని తరఫున ఈ వాక్యంలో **'ఆ జనము కొరకు మాత్రమే గాక '** అనే వాక్యభాగం పూర్తిగా అర్థరహితమైనది మరియు దైవదౌత్యానికి వ్యతిరేకమైనది. ఎందుకంటే తాను కేవలం పన్నెండు గోత్రముల కొరకు మాత్రమే వచ్చానని ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) చెప్పియున్నారు.

మూడవ కారణమేమిటంటే యోహాను సువార్తీకుని దృష్టిలో ప్రవక్తగా పరిగణించబడిన వ్యక్తి ఏసును (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) ను) (క్రైస్తవుల విశ్వాసం ప్రకారం) బంధించి శిలువ శిక్ష విధించబడిన సమయంలో యూదుల ప్రధాన యాజకునిగా ఉన్నాడు. ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) హతమార్చబడాలని, ఆయన అసత్యవాది అని, అవిశ్వాసి అని ప్రకటించినది, ఆయన (అ) కొట్టబడినప్పుడు, అగౌరవపరచబడినప్పుడు సంతోషించినది ఆ వ్యక్తే.

మత్తయి సువార్త యొక్క 26 వ అధ్యాయపు 57 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" యేసును పట్టుకొనినవారు ప్రధాన యాజకుడైన కయప యొద్దకు ఆయనను తీసికొనిపోగా అక్కడ శాస్త్రులును పెద్దలును కూడియుండిరి "**

మత్తయి సువార్త యొక్క 26 వ అధ్యాయపు 63 వ వాక్యం నుంచి 68 వ వాక్యం వరకు ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" అందుకు ప్రధాన యాజకుడు ఆయనను చూచి - నీవు దేవుని కుమారుడవైన క్రీస్తువైతే**

(అధఃసూచికలు)

495 బహుశా ఎందుకంటే 'దేవుని పిల్లలు' అని యూదులే పిలువబడేవారు.

496 'పరిహారము' అనేది క్రైస్తవులకు చెందిన ప్రసిద్ధ విశ్వాసం. ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) కష్టాలను భరించి మానవులందరికి చెందిన జన్మపాపమునకు పరిహారంగా తమ ప్రాణాన్ని ధారపోసారనేదే క్రైస్తవులకు చెందిన పాపపరిహారపు విశ్వాసం. మరిన్ని వివరాల కొరకు పాఠకులచే చదవబడుతున్న ఈ గ్రంథం యొక్క 'ప్రవేశిక' ను అధ్యయనం చేయగలరు. (మౌలానా ముహమ్మద్ తఖీ ఉస్మానీ సాహెబ్ - అధఃసూచికల కూర్పుకర్త)

**ఆ మాట మాతో చెప్పుమని జీవము గల దేవుని తోడని నీకు ఆనబెట్టుచున్నాననెను. అందుకు యేసు - నీవన్నట్టే. ఇది మొదలుకొని మనుష్యకుమారుడు సర్వశక్తుని కుడిపార్శ్వమున కూర్చుండుటయు, ఆకాశ మేఘారూఢుడై వచ్చుటయు మీరు చూతురని చెప్పగా ప్రధాన యాజకుడు తన వస్త్రము చింపుకొని - వీడు దేవదూషణ చేసెను; మనకిక సాక్షులతో పని ఏమి? ఇదిగో ఈ దూషణ మాట మీరు ఇప్పుడు విన్నారు గాదా; మీకేమి తోచుచున్నదని అడిగెను. అందుకు వారు- వీడు మరణమునకు పాత్రుడనిరి. అప్పుడు వారు ఆయన ముఖము మీద ఉమ్మివేసి ఆయనను గుద్దిరి; కొందరు ఆయనను అరచేతులతో కొట్టి - క్రీస్తూ, నిన్ను కొట్టినవాడెవడు మాతో చెప్పుమనిరి.**

యోహాను సువార్తను వ్రాసిన వ్యక్తి సైతం తన సువార్త యొక్క 18 వ అధ్యాయంలో

497 ఈ విధంగా అంగీకరించడం జరిగింది:

**" మొదట అన్న యొద్దకు ఆయనను తీసికొనిపోయిరి. అతడు ఆ సంవత్సరము ప్రధాన యాజకుడైన కయపకు మామ. కయప - ఒక మనుష్యుడు ప్రజల కొరకు చనిపోవుట ప్రయోజనకరమని యూదులకు ఆలోచన చెప్పినవాడు.**

ఇప్పుడు మేము చెప్పేదేమిటంటే ఒకవేళ ఈ వాక్కు ప్రవక్తగా (కయప) చెప్పినదే అయిన పక్షంలో, దాని అర్థం కూడా సువార్తికుడు గ్రహించినదే అయిన పక్షంలో మరి అతడు (కయప) ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) సంహరించబడాలనే తీర్పును ఎందుకు వెలువరించాడు? అలాగే ఆయనను అసత్యవాదిగా, అవిశ్వాసిగా ఎందుకు తీర్మానించాడు? అలాగే ఆయన (అ) అగౌరవపరచడం పట్ల, కొట్టబడడం పట్ల ఎందుకు సంతోషించాడు? ఏ ప్రవక్త అయినా తన దేవుడు సంహరించబడాలనే తీర్పును వెలువరిస్తాడా? అలాగే దైవత్వపు ప్రకటన విషయంలో అసత్యవాదానికి పాల్పడినట్లుగా తీర్మానిస్తాడా? అలాగే ఒక ప్రవక్త తన దేవుడిని అవిశ్వాసిగా తీర్మానించి అగౌరవపరచగలడా?

ఒకవేళ దైవదౌత్యపు విస్తృత అర్థంలో ఈ చెడుగులన్నీ ఇమిడిపోగలిగిన పక్షంలో మేము అటువంటి దైవదౌత్యం పట్ల, అటువంటి దైవప్రవక్త పట్ల నిరసనను కలిగియున్నాము. కయపను ప్రవక్తగా అంగీకరించి దివ్యప్రేరణతోనే ఆ విధంగా తీర్మానించాడని అంగీకరించిన పక్షంలో బుద్ధిపరంగా నిరూపితమయ్యే విషయం ఇది:

---

**(అథఃసూచికలు)**

497 యోహాను సువార్త, 18 వ అధ్యాయము, 12 వ, 13 వ మరియు 14 వ వాక్యాలు



**" ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) ఒక దైవప్రవక్త. అయితే ఆయన మార్గభ్రష్టత్వపు మార్గంలో పయనించారు (అల్లాహ్ క్షమించుగాక) గనుక ధర్మం నుంచి మరలిపోయి తనను తాను దైవంగా ప్రకటించుకున్నారు, దేవుని మీద అసత్య విషయాన్ని ఆపాదించారు. కనుక ఈ ప్రత్యేకమైన పరిస్థితి నేపథ్యంలో ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) పరిశుద్ధత పట్ల ప్రకటన ఆమోదయోగ్యం కాదు."**

వాస్తవమేమిటంటే ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) ఏవిధంగానయితే దైవత్వపు ప్రకటన విషయంలో పవిత్రులో అదేవిధంగా ఆయన (అ) శిష్యుడయిన యోహాను సైతం ఇటువంటి అర్థరహితమైన ఉల్లేఖనాలకు అతీతులు, పవిత్రులు. ఇటువంటి అర్థరహితమైన వాక్కులకు, వాక్యాలకు సంబంధించిన ప్రహసనమంతా త్రిత్వపు విశ్వాసాన్ని కలిగియున్నవారి అభూత కల్పనే తప్ప మరేమీ కాదు.

ఒకవేళ కయప వాక్కును సరియైనదిగా అంగీకరించినప్పటికీ దాని సరియైన భావం ఈ విధంగా ఉంటుంది: **" ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) శిష్యులు, విశ్వసించినవారు ఏసే అందరిచే ఎదురుచూడబడుతున్న, దైవంచే వాగ్దానం చేయబడిన క్రీస్తు అనే భావనను, విశ్వాసాన్ని ప్రకటించినప్పుడు సామాన్య ప్రజలు ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) నిజంగానే వాగ్దానం చేయబడిన క్రీస్తు అయిన పక్షంలో ఆయన మహోన్నతుడయిన యూదుల రాజు కావడం తప్పనిసరి అనే విశ్వాసాన్ని కలిగియుండేవారు. ఆ సమయంలో స్వయంగా కయపకు మరియు యూదులలోని పెద్దలకు ఒకవేళ ఆ భావన (ఏసే వాగ్దానం చేయబడిన క్రీస్తు అనే భావన) ప్రచారంలోకి వచ్చినట్లయితే అది అలజడికి, అప్పుడు పరిపాలిస్తున్న రోమన్ చక్రవర్తి ఆగ్రహానికి, తదనంతర వినాశనానికి కారణభూతమయ్యే ప్రమాదం స్ఫురించింది. అలాగే పర్యవసానంగా తాము అనవసరంగా ఆపదలో చిక్కుకుపోతామని వారు భయపడ్డారు. ఆ కారణంగానే కయప 'ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) అంతమొందించబడడంలోనే సమస్త జాతిప్రజల రక్షణ ఇమిడి ఉన్నది' అని ప్రకటించాడు."**

ఇదీ సరియైన భావం. అంతేగానీ ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) అంతమొందించబడడం వల్ల తొలి ప్రవక్త అయిన హజ్రత్ ఆదమ్ (అ) (ఆదాము) నిషిద్ధ ఫలాన్ని ఆరగించిన కారణంగా క్రీస్తు పుట్టుకకు వేలాది సంవత్సరాల ముందే క్రమానుగతంగా మానవులందరిలోనూ క్రమానుగతంగా సంక్రమిస్తూ వస్తున్నట్లుగా విశ్వసించబడుతున్న జన్మపాపం నుంచి మానవులందరూ రక్షించబడతారనేది దీని భావం కాదు. ఎందుకంటే జన్మపాపం అనేది కేవలం ఒక ఊహ మాత్రమే, కల్పన మాత్రమే. దానిని యూదులు విశ్వసించరు. బహుశా ఈ సువార్తీకునికి (యోహాను సువార్తను వ్రాసిన వ్యక్తికి) ఈ తప్పు గురించి తర్వాత స్ఫురించి

ఉంటుంది. ఆ కారణంగానే అతడు తర్వాత 18 వ అధ్యాయంలో 'ఒక ప్రవక్తగా పలికెను' అనే పదాలకు బదులుగా 'ఆలోచన చెప్పినవాడు' అనే పదాలను చేర్చడం జరిగింది. ఎందుకంటే ఏదయినా విషయం గురించి ఆలోచన చెప్పడం (సలహా ఇవ్వడం) వేరు, ఒక ప్రవక్తగా పలకడమనే విషయం వేరు.

ఏదిఏమయినప్పటికీ స్వయంగా తన చేతులతో తన కాళ్ళను గొడ్డలితో నరుక్కున్నప్పటికీ పరిహారపూర్వక చర్యలకు ఈ సువార్తను వ్రాసిన వ్యక్తి బాగానే పాల్పడడం జరిగింది. అనగా తాను పేర్కొన్న విషయానికి విరుద్ధమైన విషయాన్ని స్వయంగా పేర్కొనడమనే చర్యకు పాల్పడడం జరిగింది.

## 110 వ తప్పు

'అపొస్తలుడైన పౌలు హెబ్రీయులకు వ్రాసిన పత్రిక' యొక్క 9 వ అధ్యాయంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" ధర్మశాస్త్ర ప్రకారము మోషే ప్రతి యాజ్ఞను ప్రజలతో చెప్పిన తరువాత, ఆయన నీళ్ళతోను, రక్తవర్ణము గల గొర్రెబొచ్చుతోను, హిస్సోపుతోను, కోడెల యొక్కయు మేకల యొక్కయు రక్తమును తీసికొని - దేవుడు మీ కొరకు విధించిన నిబంధన రక్తమిదే అని చెప్పుచు, గ్రంథము మీదను ప్రజలందరి మీదను ప్రోక్షించెను. అదేవిధముగా గుడారము మీదను సేవపాత్రలన్నింటి మీదను ఆ రక్తమును ప్రోక్షించెను "**

( 19 వ వాక్యం నుంచి 21 వ వాక్యం వరకు)

ఈ వాక్యాలలో మూడు కారణాల రీత్యా తప్పులు ఉన్నాయి:

మొదటి కారణమేమిటంటే ఆ రక్తం కోడెలది, మేకలది కాదు, కేవలం ఆవులది.

రెండవ కారణమేమిటంటే ఆ సందర్భంలో రక్తంతో పాటు నీరు, రక్తవర్ణము గల గొర్రె బొచ్చు, హిస్సోపు చేరియుండలేదు. కేవలం రక్తాన్ని మాత్రమే ప్రోక్షించడం జరిగింది.

మూడవ కారణమేమిటంటే మోషే (దైవప్రవక్త హజ్రత్ మూసా (అ)) స్వయంగా ఆ రక్తాన్ని గ్రంథం మీద, పాత్రల మీద ప్రోక్షించలేదు. ఆయన (అ) ఆ రక్తంలో సగభాగాన్ని బలిపీఠం మీద, సగభాగాన్ని జాతిప్రజల మీద ప్రోక్షించారు. ఈ విషయానికి సంబంధించిన వివరణ మనకు బైబిల్ పాతనిబంధన గ్రంథం యొక్క 'నిర్గమ కాండము' యొక్క 24 వ అధ్యాయంలో లభ్యమవుతుంది. 24 వ అధ్యాయంలో 3 వ వాక్యం నుంచి 8 వ వాక్యం వరకు ఈ విషయం



గురించి ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" మోషే వచ్చి యెహోవా మాటలన్నిటిని విధులన్నిటిని ప్రజలతో వివరించి చెప్పెను. ప్రజలందరు యెహోవా చెప్పిన మాటలన్నిటి ప్రకారము చేసెదమని యేక శబ్దముతో ఉత్తరమిచ్చిరి. మరియు మోషే యెహోవా మాటలన్నిటిని వ్రాసి ఉదయమందు లేచి ఆ కొండ దిగువను బలిపీఠమును ఇశ్రాయేలు పండ్రెండు గోత్రములు చొప్పున పండ్రెండు స్తంభములను కట్టి ఇశ్రాయేలీయులలో యౌవనస్థులను పంపగా వారు దహనబలుల నర్పించి యెహోవాకు సమాధాన బలులుగా కోడెలను వధించిరి. అప్పుడు మోషే వాటి రక్తములో సగము తీసికొని పళ్ళెములలో పోసి ఆ రక్తములో సగము బలిపీఠము మీద ప్రోక్షించెను. అతడు నిబంధన గ్రంథమును తీసికొని ప్రజలకు వినిపింపగా వారు యెహోవా చెప్పినవన్నియు చేయుచు విధేయులమై యుండుమనిరి. అప్పుడు మోషే రక్తమును తీసికొని ప్రజల మీద ప్రోక్షించి ఇదిగో యీ సంగతులన్నిటి విషయమై యెహోవా మీతో చేసిన నిబంధన రక్తము ఇదే అని చెప్పెను."**

మా భావన ఏమిటంటే ఇక్కడ పాఠకులకు తెలుపబడిన ఈ చెడుగుల కారణంగానే రోమన్ కేథొలిక్ చర్చి సామాన్య ప్రజలు ఈ గ్రంథాలు చదవడాన్ని నిషేధించింది. అలాగే వీటిని చదవడం వల్ల కలిగే ప్రయోజనం కంటే చెడు ఎక్కువ ఉంటుందని కూడా పేర్కొనేవారు. ఈ విషయానికి సంబంధించి వారి సలహా పూర్తిగా సరియైనదే. నిజంగానే ఈ గ్రంథాలలోని దోషాలు, చెడుగులు అవి ప్రచురించబడని కారణంగా వాటి వ్యతిరేకుల దృష్టిలో పడకుండా మరుగునే ఉండిపోయాయి. అయితే క్రైస్తవులలో ప్రొటెస్టెంట్ వర్గం ఉనికిలోకి వచ్చినప్పుడు, వారు ఈ గ్రంథాలను పరిశోధించి వెలికితీసినప్పుడు యూరోపియన్ దేశాలలో ఎటువంటి ప్రతిస్పందన వెలువడినదో ప్రపంచానికంతటికీ తెలుసు. క్రీ.శ. 1849 లో బీరూత్ నుంచి ప్రచురించబడిన 'కితాబుస్సలాసు అష్రహ్'' యొక్క 13 వ సంచిక యొక్క 417 వ పేజీలో మరియు 418 వ పేజీలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

" ఇప్పుడు మనం ట్రేడెన్ట్నే సభ ద్వారా క్రోడీకరించబడిన చట్టాన్ని పరిశీలించవలసి ఉంటుంది. ఆ చట్టం పోప్ చే ధృవీకరించబడింది కూడా. ఆ చట్టం ఈ విధంగా తెలియజేస్తుంది: అనుభవాల ద్వారా విదితమయిన విషయమేమిటంటే సామాన్య ప్రజలు ఈ గ్రంథాలను అధ్యయనం చేసినట్లయితే దానివల్ల జరిగే నష్టాలు ప్రయోజనాల కంటే మించినవయి ఉంటాయి. ఈ కారణంగా పాస్టర్ లేదా న్యాయమూర్తి తన వీలునుబట్టి పెద్ద మతపెద్ద (ఫాదర్) లేదా బోధకుని ద్వారా సలహా మేరకు ఎవరికయితే ఈ గ్రంథాలలోని ఇటువంటి విషయాలను చదవడం ద్వారా ప్రయోజనం చేకూరుతుందనే అంచనా ఉన్నదో వారికి మాత్రమే ఈ గ్రంథాలలోని ఇటువంటి విషయాలను చదివేందుకు అనుమతిని ప్రసాదించాలి. అలాగే ఆ గ్రంథం ఎవరో ఒక కేథొలిక్

గురువు దృష్టిలో పడడమనేది తప్పనిసరి. అలాగే దానిపై అనుమతిని ప్రసాదించేవారి సంతకాలు చేయబడి ఉండడమూ తప్పనిసరే. ఒకవేళ ఏ వ్యక్తయినా ఆ విధంగా అనుమతిని పొందకుండా ఆ గ్రంథాలను చదివేందుకు లేదా తీసుకునేందుకు సాహసించినట్లయితే ఆ గ్రంథం మతాధికారి వద్దకు తీసుకుపోబడనంతవరకు అతడిని చూసీచూడనట్లుగా క్షమించే చర్యకు ఎంతమాత్రం పాల్పడరాదు. ”



# నాల్గవ ప్రకరణం

# బైబిల్ గ్రంథాలు దైవప్రోక్తాలు కావు

## ఈ విషయానికి సంబంధించిన ఆధారాలు

బైబిల్ పాతనిబంధన లోని మరియు బైబిల్ క్రొత్తనిబంధన లోని గ్రంథాలన్నీ దేవుని అవతరించబడిన గ్రంథాలని, దివ్యప్రేరణ ద్వారా వ్రాయబడినవని, వాటిలో పేర్కొనబడిన సంఘటనలన్నీ దైవప్రేరణచే వ్రాయబడినవేనని ప్రకటించుకునేందుకు గ్రంథవహులకు (యూదులకు మరియు క్రైస్తవులకు) ఎటువంటి అధికారమూ లేదని స్పష్టపరచడమే ఈ ప్రకరణం యొక్క లక్ష్యం. ఎందుకంటే అటువంటి ప్రకటన పూర్తిగా తప్పయినది. అటువంటి ప్రకటన తప్పు అని నిరూపించేందుకై ఎన్నో ఆధారాలు, ప్రమాణాలు ఉన్నప్పటికీ ఈ సందర్భంగా మేము వాటిలో నుంచి కేవలం 17 ఆధారాలను పేర్కొనడంతో సరిపుచ్చుతున్నాము.

## అర్థపరమైన వైరుధ్యాల విస్తృతి, మొదటి ఆధారం

ఈ గ్రంథాలలో (బైబిల్ పాతనిబంధనలోని మరియు క్రొత్త నిబంధనలోని గ్రంథాలలో) అర్థపరమైన వైరుధ్యాలు ఎన్నో ఉన్నాయి. క్రైస్తవ పరిశోధకులు మరియు వ్యాఖ్యాతలు ఆ వైరుధ్యాలను తొలగించలేక వివశులయిపోయారు. అందుకే కొన్ని వైరుధ్యాల విషయంలో ఒక వాక్కు సరియైనదయితే మిగిలిన వాక్కులన్నీ అసత్యమైనవని, వాటి విషయంలో ఉద్దేశ్యపూర్వకంగా ప్రక్షిప్తానికి పాల్పడడం జరిగియుంటుందని లేదా లేఖకుని తప్పు అందుకు కారణమయి ఉంటుందని వారు అంగీకరించారు. అలాగే పలు వైరుధ్యాల విషయంలో ఎటువంటి వ్యర్థమయిన, అర్థరహితమైన వివరణలను వారు అందజేశారంటే వాటిని సవ్యమైన బుద్ధి ఎంతమాత్రం అంగీకరించేందుకు సిద్ధపడజాలదు. రెండవ ప్రకరణంలో వందకు మించిన సంఖ్యలో అటువంటి వైరుధ్యాలు ప్రస్ఫుటం కావించబడ్డాయి.

## తప్పుల విస్తృతి

ఈ గ్రంథాలలో (బైబిల్ పాతనిబంధనలోని మరియు క్రొత్త నిబంధనలోని గ్రంథాలలో) ఎన్నో తప్పులు చోటుచేసుకొని ఉన్నాయి. మూడవ ప్రకరణంలో వందకు మించిన సంఖ్యలో

పేర్కొనబడిన తప్పులను ఇప్పటికే ఈ గ్రంథ పాఠకులు అధ్యయనం చేసియున్నారు. వాస్తవానికి దైవగ్రంథంగా పరిగణించబడే గ్రంథం తప్పులకు అతీతంగా ఉండడం మరియు అర్థపరమైన వైరుధ్యాలకు అతీతంగా సురక్షితంగా ఉండడమనేది ఎంతో అవసరం.

## ప్రక్షిప్తాల విస్తృతి

ఈ గ్రంథాలలో (బైబిల్ పాతనిబంధనలోని మరియు క్రొత్త నిబంధనలోని గ్రంథాలలో) ఉద్దేశ్యపూర్వకంగా పాల్పడబడిన ప్రక్షిప్తాలూ ఉన్నాయి, అవగాహనారాహిత్యంతో పాల్పడబడిన లెక్కించడం కష్టసాధ్యమయిన సంఖ్యలో ప్రక్షిప్తాలూ ఉన్నాయి. వాటిని నిరాకరించడమనేది క్రైస్తవులకు ఎంతమాత్రం సాధ్యం కాదు. విస్పష్టమైన విషయమేమిటంటే ఎక్కడెక్కడయితే ప్రక్షిప్తాలు చోటుచేసుకున్నాయనే విషయం నిశ్చితమయిపోయిందో అవి క్రైస్తవుల దృష్టిలోనూ ఎంతమాత్రం దైవప్రేరణచే వ్రాయబడిన దివ్యవాక్కులుగా పరిగణించబడజాలవు. రెండవ అధ్యాయంలో ఆ విధంగా వంద చోట్ల చోటుచేసుకున్న ప్రక్షిప్తాల గురించి ఇన్‌షా అల్లాహ్ తెలియజేయడం జరుగుతుంది.

## ఎన్నో గ్రంథాల విషయంలో స్వయంగా క్రైస్తవుల ఒప్పుకోలు

'బారూకు గ్రంథము', 'తూబియా గ్రంథము', **Judith** గ్రంథము, సొలొమోను జ్ఞానము గ్రంథము, చర్చి హితోపదేశాలు, మకాబీయులు మొదటి గ్రంథము మరియు మకాబీయులు రెండవ గ్రంథము, ఎస్తేరు గ్రంథము యొక్క 11 వ అధ్యాయం, 16 వ అధ్యాయం మరియు 10 వ అధ్యాయంలోని పది వాక్యాలు..... 'దానియేలు గ్రంథము' లోని మూడవ అధ్యాయంలోని 'ముగ్గురు పిల్లల గీతము', అదే గ్రంథంలోని 13 వ మరియు 14 వ అధ్యాయము కేథొలిక్ వర్గం దృష్టిలో పాతనిబంధనకు చెందిన భాగాలు.

అయితే ప్రొటెస్టెంట్ వర్గానికి చెందినవారు ఎన్నో ఆధారాల ద్వారా ఇవి దైవగ్రంథాలూ కావని, తప్పనిసరిగా ఆమోదించవలసినవీ కావని నిరూపించారు. కనుక అవి అసత్యమైనవని నిరూపించే అవసరం మాకు లేదు. ఈ విషయానికి సంబంధించిన ఆధారాలను గురించి తెలుసుకోగోరేవారు వారి (ప్రొటెస్టెంట్ వర్గానికి చెందిన) గ్రంథాలను అధ్యయనం చేయవచ్చు. ఈ గ్రంథాలను యూదులు సైతం దైవగ్రంథాలుగా పరిగణించరు.

అదేవిధంగా ఎజ్రా (దైవప్రవక్త హజ్‌రత్ ఉజ్‌రా (అ)) గ్రంథము యొక్క 3 వ భాగం గ్రీకు చర్చి దృష్టిలో పాతనిబంధన గ్రంథంలోని భాగం. అయితే కేథొలిక్ వర్గానికి చెందిన పండితులు



మరియు ప్రొటెస్టెంట్ వర్గానికి చెందిన పండితులు స్పష్టమైన ఆధారాల ద్వారా అది దైవప్రేరణచే వ్రాయబడినటది కాదని నిరూపించారు. ఈ విషయానికి సంబంధించిన ఆధారాలను గురించి అధ్యయనం చేయగోరేవారు కేథొలిక్ మరియు ప్రొటెస్టెంట్ వర్గానికి చెందినవారు వ్రాసిన గ్రంథాలను అధ్యయనం చేయగలరు.

ఇక 'న్యాయాధిపతులు' గ్రంథం, దానిని ఫీనిహాసు రచనగా పరిగణించేవారి లేదా హిజ్కియా రచనగా పరిగణించేవారి దృష్టి ప్రకారం దైవగ్రంథం కాదు.

అదేవిధంగా 'రూతు గ్రంథం', దానిని హిజ్కియా రచనగా పరిగణించబడేవారి దృక్పథం ప్రకారం లేదా క్రీ.శ. 1819 లో స్టార్‌బర్గ్ తరఫున ప్రచురించబడిన బైబిల్ ప్రతి సంపాదకుల వ్యాఖ్య ప్రకారం దైవగ్రంథం కాదు. అలాగే నెహెమ్యా గ్రంథం, ముఖ్యంగా అందులోని 12 వ అధ్యాయం యొక్క ప్రారంభపు 26 వాక్యాలు పండితులందరి ఉమ్మడి అభిప్రాయం ప్రకారం దైవప్రేరణచే వ్రాయబడలేదు.

అలాగే యోబు గ్రంథం కూడా రబ్‌మానీదీజ్ , మైకాయిలస్ , సేలర్ వాస్టీనాక్ మరియు తహ్వీడౌలహ్, అలాగే ప్రొటెస్టెంట్ వర్గానికి చెందిన ప్రధాన నాయకుడయిన లూథర్ అభిప్రాయం ప్రకారం దైవగ్రంథం కాదు. అలాగే ఈ గ్రంథాన్ని ఎలీహూ లేదా ఇలాహ్‌కు చెందిన ఏ వ్యక్తి రచనగానో లేదా ఏ అనామక వ్యక్తి రచనగానో పరిగణించేవారి వ్యాఖ్య ప్రకారం కూడా ఈ గ్రంథం దైవగ్రంథం కాదు.

అలాగే 'సామెతల గ్రంథం' యొక్క 31 వ అధ్యాయం కూడా దైవప్రేరణచే వ్రాయబడినట్టిది కాదు. అలాగే 'తెలీమూదీ' విశ్వవిద్యాలలయ పండితుల వ్యాఖ్య ప్రకారమూ ఇది దైవప్రేరణచే వ్రాయబడినదిగా పరిగణించబడజాలదు. అలాగే 'పరమ గీతము' గ్రంథం థియోడోర్, సైమన్, లీక్లర్క్, విస్టన్, సీమ్లర్ మరియు కాస్తల్సియోలీస్ వ్యాఖ్యల ప్రకారం దైవగ్రంథము కాదు.

అలాగే యెషయా గ్రంథంలోని 27 అధ్యాయాలు జర్మనీకి చెందిన పండితుడయిన స్టాహిలిన్ వ్యాఖ్య ప్రకారం దైవప్రేరణచే వ్రాయబడినట్టివి కావు. అలాగే మత్తయి సువార్త ప్రాచీన కాలానికి చెందిన క్రైస్తవ పండితుల అభిప్రాయం ప్రకారం మరియు ఆఖరి (ఆధునిక) కాలానికి చెందిన క్రైస్తవ పండితుల వ్యాఖ్య ప్రకారం, అనగా 'వాస్తవానికి మత్తయి సువార్త హిబ్రూ భాషలో, హిబ్రూ లిపిలో వ్రాయబడింది. అది ఇప్పుడు కనుమరుగయిపోయింది. ఇప్పుడు ఏదయితే ఉనికిలో ఉందో అది కేవలం దాని అనువాదం మాత్రమే.' అనే వ్యాఖ్య ప్రకారం కనుక అది ఎంతమాత్రం దివ్యప్రేరణచే వ్రాయబడినట్టిదిగా, దైవగ్రంథంగా పరిగణించబడజాలదు. ఇక యోహాను సువార్త విషయానికొస్తే స్టాయిడిలిన్ మరియు పరిశోధకుడయిన బరతషీందర్ ల వ్యాఖ్యల ప్రకారం

దైవగ్రంథంగా పరిగణించబడజాలదు. అలాగే అందులోని ఆఖరి అధ్యాయం బైబిల్ పరిశోధకులయిన కర్వీట్స్ వ్యాఖ్య ప్రకారం దివ్యప్రేరణచే వ్రాయబడినట్టిది కాదు.

అదేవిధంగా యోహాను వ్రాసిన పత్రికలన్నీ పరిశోధకులయిన బర్తషీందర్ మరియు ఉలూజీన్ వర్గం యొక్క వ్యాఖ్యల ప్రకారం దైవగ్రంథాలు కాజాలవు. అలాగే పేతురు వ్రాసిన రెండవ పత్రిక మరియు యూదా వ్రాసిన పత్రిక, అలాగే యాకోబు వ్రాసిన పత్రిక, యోహాను వ్రాసిన రెండవ పత్రిక మరియు మూడవ పత్రిక, ప్రకటనల గ్రంథం ఎందరో పండితుల దృష్టిలో దైవగ్రంథాలు కావు.

## హోరన్ ఒప్పుకోలు

హోరన్ క్రీ.శ. 1822 లో ప్రచురించబడిన తన వ్యాఖ్యాన గ్రంథం యొక్క మొదటి సంపుటిలోని 131 వ పేజీలో ఈ విధంగా పేర్కొన్నాడు:

“ ఒకవేళ మనం దైవప్రవక్తలకు చెందిన పలు గ్రంథాలు కనుమరుగయిపోయాయనే విషయాన్ని అంగీకరించినట్లయితే అవి దైవప్రేరణచే అసలు వ్రాయబడలేదని పేర్కొనవలసి ఉంటుంది. సెయింట్ ఆగస్టైన్ పటిష్టమైన ఆధారాలతో ఈ విషయాన్ని నిరూపించారు. ఆయన ఈ విధంగా పేర్కొన్నారు: ‘ నేను ఎన్నో విషయాలకు సంబంధించిన ప్రస్తావనను యూదా చక్రవర్తులకు చెందిన గ్రంథాలలోనూ, ఇశ్రాయేలీయులకు చెందిన గ్రంథాలలోనూ చూశాను. అయితే వాటికి సంబంధించిన వివరణ ఆ గ్రంథాలలో లభ్యం కాలేదు. వాటి వివరణకు సంబంధించిన సూచన ఇతర ప్రవక్తలకు సంబంధించిన గ్రంథాలలో అందజేయబడింది. కొన్నిచోట్ల ఆ దైవప్రవక్తల పేర్లు కూడా ప్రస్తావించబడ్డాయి. ఈ గ్రంథాలు చర్చి తప్పనిసరిగా ఆమోదించవలసిందిగా పేర్కొన్న నిబంధనల్లో లేవు. అందుకు కారణాన్ని సైతం అది పేర్కొనలేకపోయింది. అది కేవలం ఈ విధంగా మాత్రమే పేర్కొన్నది: “ ఏ దైవప్రవక్తలకయితే పరిశుద్ధాత్మ తరఫున మతానికి సంబంధించిన పెద్ద పెద్ద విషయాల గురించి దివ్యప్రేరణ అందజేయబడేదో వారి రచన రెండు రకాలుగా ఉండేది. ఒక రకం ధర్మపరాయణులయిన చరిత్రకారుల విధానాన్ని పోలి ఉండేది, అనగా దివ్యప్రేరణతో సంబంధం లేనిదిగా. ఇక రెండవ రకం దివ్యప్రేరణను కలిగియున్నట్టిది. రెండు రకాల మధ్య ఉన్న వ్యత్యాసమేమిటంటే మొదటి రకం వారి వైపుకు ఆపాదించబడితే రెండవ రకం దైవం వైపుకు ఆపాదించబడుతుంది. మొదటి రకానికి చెందిన రచన ఉద్దేశ్యం మన అవగాహన మరియు జ్ఞానంలో పెంపుదల అయితే రెండవ రకానికి చెందినది క్రైస్తవ సమాజం మరియు ధర్మశాస్త్రం కొరకు ప్రమాణంగా నిలిచేందుకై ఉద్దేశించబడి ఉంటుంది.”



ఆ తర్వాత మొదటి సంపుటిలోని 133 వ పేజీలో బైబిల్ పాతనిబంధనలోని సంఖ్యాకాండము యొక్క 21 వ అధ్యాయపు 14 వ వాక్యంలో [498] పేర్కొనబడిన దేవుని అక్షరాలు మాయమయిపోవడానికి సంబంధించి హోరన్ ఈ విధంగా పేర్కొన్నారు:

“ ఆ విధంగా కనుమరుగయిపోయిన గ్రంథం బహుశా గొప్ప పరిశోధకులయిన డాక్టర్ లైట్‌ఫుట్ [499] పరిశోధన ప్రకారం మోషే (దైవప్రవక్త హజ్రత్ మూసా (అ)) దేవుని ఆదేశం ప్రకారం అమాలఖహ్ ఓడిపోయిన తర్వాత యెహోషువకు ఉపదేశించేందుకై వ్రాసిన గ్రంథమే అయి ఉంటుంది. ఆ పుస్తకం ఆ విజయానికి సంబంధించిన పరిస్థితుల మీద, ముమ్ముందు జరగబోయే యుద్ధాలకు సంబంధించిన ఉపాయాల మీద వ్రాయబడినట్టిది. కనుక అది దైవప్రేరణచే వ్రాయబడిన గ్రంథమూ కాదు, శాసనాలకు సంబంధించిన గ్రంథాల యొక్క భాగమూ కాదని విదితమవుతోంది.”

ఆ తర్వాత మొదటి సంపుటి యొక్క అనుబంధంలో ఆయన ఈ విధంగా పేర్కొన్నారు:

“ పరిశుద్ధ గ్రంథాలు (బైబిల్ పాతనిబంధన మరియు క్రొత్త నిబంధన గ్రంథాలు) దేవుని తరఫున ప్రోక్తం కావించబడ్డాయని పేర్కొన్నప్పుడు దాని అర్థం అందులోని ప్రతి పదమూ మరియు పూర్తి వాక్యం దైవం తరఫున అవతరించబడినదని అంగీకరించకూడదు. వాటి రచయితలు ఉపయోగించిన నుడికారాలలోనూ మరియు వారి వివరణల్లోనూ చోటుచేసుకున్న వైరుధ్యాల ద్వారా వారికి తమ నైజం మరియు అలవాటు చొప్పున, తమ తమ అవగాహనల మేరకు వ్రాసేందుకై అనుమతి ప్రసాదించబడిందని తెలుస్తుంది. దివ్యజ్ఞానమనేది ఆ విధంగానే అనగా ప్రాపంచిక విద్యలు ఏవిధంగానయితే ఉపయోగించబడతాయో అదేవిధ:లో ఉపయోగించబడింది.. కనుక వారు పేర్కొన్న ప్రతి విషయమూ దైవప్రేరణ ద్వారానే అందజేయబడిందా? లేక వారు

**(అథఃసూచికలు)**

**498** సంఖ్యాకాండంలో దేవునికి చెందిన ఒక యుద్ధప్రకటన గురించి సూచించబడి ఒక విషయం పేర్కొనబడింది. ఆ యుద్ధప్రకటనలోని కొన్ని పదాలయితే అందులో పేర్కొనబడి ఉన్నాయి గానీ మిగిలిన భాగం కనుమరుగయిపోయింది.

**499** జోసెఫ్ బార్బర్ లైట్‌ఫుట్ (క్రీ.శ. 1828 లో జననం, క్రీ.శ. 1889 లో మరణం) ప్రసిద్ధ ఆంగ్లేయ పండితుడు మరియు బిషప్. ఆయన ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) శిష్యుల లేఖల మీద ఒక వ్యాఖ్యాన గ్రంథాన్ని సైతం రచించారు.

పేర్కొన్న ప్రతి ఆదేశమూ దైవప్రేరణచే జారీ చేయబడినదేనా? అనే విషయాన్ని నిగ్గుతేల్చడం ఎంతో కష్టం.

ఆ తర్వాత ఆయన ఈ విధంగా పేర్కొన్నారు:

" అయితే పాతనిబంధనలోని చారిత్రక గ్రంథాల రచయితలకు కొన్ని సమయాలలో దైవం తరఫున దివ్యమైన రీతిలో విషయాలు అందజేయబడేవనే విషయం సత్యం.

## అల్‌గజీదర్ ఒప్పుకోలు

హెన్రీ వాస్కాట్ వ్యాఖ్యాన గ్రంథం కూర్పుకర్తలు వ్యాఖ్యాన గ్రంథం యొక్క ఆఖరి సంపుటిలో అల్‌గజీదర్ కీనన్, అనగా అల్‌గజీదర్ గ్రంథంలో పేర్కొనబడిన విశ్వాసపు మూలసూత్రాల ద్వారా ఈ విధంగా ఉల్లేఖించారు:

" దైవప్రవక్త పలికిన ప్రతి మాటా దైవప్రేరణచే పలుకబడినది, శాసన సంబంధితమైనది కావడం తప్పనిసరి ఏమీ కాదు. అలాగే సొలొమోను యొక్క కొన్ని గ్రంథాలు దైవప్రేరణచే వ్రాయబడినవయినంత మాత్రాన ఆయన ఏదయితే వ్రాశారో అదంతా దైవప్రేరణతోనే వ్రాశారని భావించనవసరం లేదు. గుర్తుంచుకోవలసిన విషయమేమిటంటే దైవప్రవక్తలకు మరియు వారి అనుయాయులకు ప్రత్యేక భావాలకు సంబంధించి దివ్యప్రేరణ ద్వారా సమాచారమందేది"

'అల్‌గజీదర్' అనేది ప్రొటెస్టెంట్ వర్గానికి చెందిన క్రైస్తవుల దృష్టిలో ఎంతో విశ్వసనీయమైన గ్రంథం. ఆ కారణంగానే ప్రొటెస్టెంట్ పండితుడయిన వారన్ కేథొలిక్ అయిన కార్‌కరన్‌ను ఎదుర్కొంటూ బైబిల్ స్వచ్ఛత మరియు స్వచ్ఛతలేమి విషయంలో ఈ గ్రంథం ద్వారానే ఆధారాలను పేర్కొనడం జరిగింది. ఈ వ్యాఖ్యాన గ్రంథం క్రైస్తవుల దృష్టిలో విశ్వసనీయమైనదిగా పరిగణించబడుతుందనే విషయాన్ని ప్రత్యేకంగా పేర్కొననవసరం లేదు.

## ఎన్‌సైక్లోపీడియా ఒప్పుకోలు

బ్రిటానికా ఎన్‌సైక్లోపీడియా అనేది బ్రిటన్‌కు చెందిన ఎందరో పండితుల ఉమ్మడి కూర్పు మరియు వారికి ఎంతగానో ప్రీతికరమైన గ్రంథం. వారు 11 వ సంపుటి యొక్క 274 వ పేజీలో 'దైవప్రేరణ' అనే అంశం గురించి చర్చిస్తూ ఈ విధంగా పేర్కొన్నారు:

" బైబిల్ పాతనిబంధన మరియు క్రొత్తనిబంధన గ్రంథాలలో పేర్కొనబడిన ప్రతి విషయమూ దైవప్రేరణచే వ్రాయబడినదేనా? కాదా? అనే విషయంలో వివాదం కొనసాగుతూ



వస్తోంది. అదేవిధంగా వాటిలో పేర్కొనబడిన సంఘటనలు, వృత్తాంతాల విషయంలో పేర్కొనబడిన ప్రతి విషయమూ దైవప్రేరణచే పేర్కొనబడినట్టిది కాదని[500] జెరోమ్, క్రోటీస్, ప్రోకోబిస్ మరియు ఇంకా ఎందరో పండితులు పేర్కొన్నారు.

బ్రిటానికా ఎన్‌సైక్లోపీడియా 19 వ సంపుటి లోని 20 వ పేజీలో వారు ఈ విధంగా పేర్కొన్నారు:

"పరిశుద్ధ గ్రంథంలో పేర్కొనబడిన ప్రతి విషయమూ దైవం తరఫున అవతరించబడినదని వాదించేవారు తమ వాదనను సులభంగా నిరూపించలేరు"

ఆ తర్వాత వారు ఇంకా ఈ విధంగా పేర్కొన్నారు:

" ఒకవేళ ఎవరయినా పరిశోధనాత్మక దృక్పథంతో మమ్మల్ని ' మీరు క్రొత్తనిబంధన గ్రంథంలోని ఏ భాగాన్ని దైవప్రేరణచే వ్రాయబడినట్లుగా విశ్వసిస్తారు?' అని ప్రశ్నించినట్లయితే మేము ఈ విధంగా సమాధానమిస్తాము: ' ధార్మిక నియమాలు మరియు ఆదేశాలు, అలాగే మున్ముందు జరగబోయే విషయాలకు సంబంధించి పేర్కొనబడిన క్రైస్తవ మతానికి పునాదులయినటువంటి భవిష్యద్వాణులు అనేవి దైవప్రేరణచే వ్రాయబడినవి కావని చెప్పడానికి వీలులేదు. ఇక ఇతర సంఘటనలకు, స్థితిగతులకు సంబంధించిన వివరాల విషయానికొస్తే వాటి గురించి పేర్కొనేందుకై ఏసు (దైవప్రవక్త హజ్‌రత్ ఈసా (అ)) శిష్యుల యొక్క జ్ఞాపకశక్తి చాలు"

## రీస్ పరిశోధన

పరిశోధకుడయిన రీస్ ఎందరో సత్యశోధకులయిన పండితుల సహకారంతో ఒక పుస్తకాన్ని రచించారు. అది 'ఎన్‌సైక్లోపీడియా రీస్' గా ప్రసిద్ధమయింది. ఆ గ్రంథం యొక్క 19 వ అధ్యాయంలో ఈ విధంగా వ్రాయబడి ఉంది: " ప్రజలు పరిశుద్ధ గ్రంథాలలో పేర్కొనబడిన విషయాలు దైవప్రేరణచే వ్రాయబడినట్టివేనా అనే విషయంలో అభిప్రాయ భేదాలను కలిగియున్నారు. ఆ గ్రంథాల కూర్పుకర్తల వ్యాఖ్యలలోనూ, కార్యాలలోనూ తప్పులు మరియు వైరుధ్యాలు

**(అథఃసూచికలు)**

**500** బ్రిటానికా ఎన్‌సైక్లోపీడియా ప్రస్తుత ఎడిషన్‌లో మాకు ఈ వాక్యం కనిపించలేదు. అయినప్పటికీ బైబిల్ పాతనిబంధన మరియు క్రొత్తనిబంధన గ్రంథాలలో పేర్కొనబడిన ప్రతి పదమూ దైవప్రేరణచే వ్రాయబడినట్టిది కాదని వారు అంగీకరించిన విషయం 12 వ సంపుటిలో పేర్కొనబడింది.

చోటుచేసుకున్నాయి. ఉదాహరణకు మత్తయి సువార్త యొక్క 10 వ అధ్యాయపు 19 వ మరియు 20 వ వాక్యాలను, అలాగే మార్కు సువార్త యొక్క 13 వ అధ్యాయపు 11 వ వాక్యాన్ని అపొస్తలుల కార్యములు గ్రంథం యొక్క 23 వ అధ్యాయపు ప్రారంభపు 6 వాక్యాలతో పోల్చి చూసినట్లయితే స్పష్టమైన వైరుధ్యం గోచరిస్తుంది.[501]

అలాగే ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) శిష్యులు స్వయంగా ఒకరిపై అవతరించిన దివ్యవాణిని మరొకరు విశ్వసించేవారు కాదు. ఈ విషయం యెరూషలేము సభలో వారి చర్చల ద్వారా మరియు పౌలు పేతురుపై నింద మోపడానికి సంబంధించిన సంఘటన ద్వారా విదితమవుతుంది.

అలాగే ప్రాచీన కాలానికి చెందిన క్రైస్తవ పండితులు వారిని తప్పులకు అతీతంగా భావించేవారు కారనే విషయమూ చెప్పబడుతుంది. ఎందుకంటే కొన్ని సందర్భాలలో వారు వారి కార్యాలను విమర్శించడం జరిగింది. అపొస్తలుల కార్యములు గ్రంథం [502] యొక్క 11 వ అధ్యాయం లోని 2 వ మరియు 3 వ వాక్యాలను మరియు 21 వ అధ్యాయం లోని 20 వ వాక్యం నుంచి 24 వ వాక్యం వరకు అధ్యయనం చేయగలరు.

అలాగే పౌలు తనను తాను ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) శిష్యుల కంటే తక్కువగా భావించేవాడు కాడనే విషయమూ చెప్పబడింది. (చూడండి : అపొస్తలుడైన పౌలు కొరింథీయులకు వ్రాసిన రెండవ పత్రిక యొక్క 11 వ అధ్యాయపు 5 వ వాక్యము మరియు 12 అధ్యాయపు 11 వ వాక్యము) అలాగే పౌలు తన స్థితిగతుల గురించి ఏవిధంగా తెలియజేశాడంటే అతడు అన్నివేళలా తనను తాను దైవప్రేరేపితునిగా భావించేవాడు కాడనే విషయం స్పష్టమవుతుంది.

**(అథఃసూచికలు)**

501 ఈ వైరుధ్యం గురించి వివరంగా పాఠకులచే చదవబడుతున్న ఈ గ్రంథం యొక్క 298 వ మరియు 299 వ పేజీలలో పేర్కొనబడి ఉంది.

502 **" పేతురు యెరూషలేముకు వచ్చినప్పుడు సున్నతి పొందినవారు - నీవు సున్నతి పొందనివారి యొద్దకు పోయి వారితో కూడ భోజనము చేసితివని అతనితో వాదము పెట్టుకొనిరి."**

(అపొస్తలుల కార్యములు, 11: 2, 3 )



(చూడండి : [503] అపొస్తలుడైన పౌలు కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక యొక్క 7 వ అధ్యాయపు 10 వ, 12 వ, 15 వ మరియు 40 వ వాక్యాలు. అలాగే అపొస్తలుడైన పౌలు కొరింథీయులకు వ్రాసిన రెండవ పత్రిక యొక్క 11 వ అధ్యాయపు 17 వ వాక్యము)

అపొస్తలులు ఎప్పుడయితే మాట్లాడడం ప్రారంభిస్తారో అప్పుడు వారు ఆ మాటలను దైవప్రేరణతో పేర్కొంటున్నట్లుగా మనకు అనిపించదు.

ఆయన ఇంకా ఈ విధంగా పేర్కొన్నారు:

" మైకేల్స్ ఇరుపక్షాలకు చెందిన ప్రమాణాలను, ఆధారాలను బాగా విశ్లేషించి నిగ్గు తేల్చారు. ఆ విధంగా చేయడం ఈ మహోన్నతమైన విషయాన్ని అర్థం చేసుకునేందుకై అత్యంత ఆవశ్యకం. ఆయన ఈ విధంగా తీర్మానించారు: 'దైవప్రేరణ అనేది పత్రికల విషయంలో ఎంతగానో ప్రయోజనదాయకమైనది. ఇక సువార్తలు మరియు అపొస్తలుల కార్యములు వంటి చారిత్రక గ్రంథాల విషయంలో ఒకవేళ మనం దైవప్రేరణ విషయాన్ని పక్కనబెట్టినప్పటికీ మనకు నష్టం ఏమీ జరగదు. ఇంకా చెప్పాలంటే ఎంతో కొంత ప్రయోజనం చేకూరుతుంది. ఒకవేళ మనం చారిత్రక సంఘటనలను వివరించే విషయంలో అపొస్తలుల సాక్ష్యం ఇతర చరిత్రకారుల వంటిదేనని మనం అంగీకరించినట్లయితే (ఏసు సైతం ఒక సందర్భంలో ' మీరునూ సాక్షులుగా నిలవండి. ఎందుకంటే ప్రారంభం నుంచి మీరు నా వెంట ఉన్నారు' అని పేర్కొని ఉన్నారు, ఈ విషయానికి సంబంధించిన వివరణను యోహాను సైతం తన సువార్త యొక్క 15 వ అధ్యాయపు 17 వ వాక్యంలో [504] అందజేసి ఉన్నారు) కూడా మనకు ఎక్కువ నష్టమేమీ జరగదు. అలాగే ఏ వ్యక్తయినా క్రైస్తవ సమాజ తిరస్కారిని ఎదుర్కొనే సందర్భంలో దాని సత్యసంధతను నిరూపించేందుకై ఎన్నోరకాల విషయాలను అంగీకరింపజేయడం ద్వారా నిరూపించే ప్రయత్నం చేయజాలడు. అందుకై అత్యంత ఆవశ్యకమైన విషయమేమిటంటే అతడు ఏసు మరణించి తిరిగి సజీవునిగా లేవడం మరియు ఇతర అద్భుత కార్యాల విషయంలో సువార్తీకులు

**(అథఃసూచికలు)**

503 ఆ వాక్యాలలో ఒక వాక్యం ఇక్కడ పేర్కొనబడుతోంది:

**" మరియు పెండ్లియైనవారికి నేను కాదు ప్రభువే ఆజ్ఞాపించునదేమనగా, భార్య భర్తను ఎడబాయకూడదు"**

(అపొస్తలుడైన పౌలు కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక, 7 : 10 )

చరిత్రకారులుగా తమ వివరణలను అందజేసారనే విషయాన్ని అంగీకరిస్తూ తన వాదనను నిరూపించే ప్రయత్నం చేయాలి. ఇక ఏ వ్యక్తయితే తన విశ్వాసపు ప్రాతిపదికలను పరీక్షించుకోవాలనుకుంటున్నాడో అతడు ఈ సంఘటనల విషయంలో వారి సాక్ష్యాన్ని ఇతర వ్యక్తుల సాక్ష్యం వంటిదిగా భావించడం తప్పనిసరి. ఎందుకంటే సువార్తల్లో పేర్కొనబడిన సంఘటనల యాథార్థ్యాన్ని నిరూపించడమనేది అవి దైవప్రేరణచే వ్రాయబడినదిగా పరిగణించబడే గ్రంథంలోని భాగాలయిన కారణంగా పరస్పరాధారిత నిరూపణ సమస్య[505] ఏర్పడుతుంది. ఎందుకంటే సువార్తలు దైవప్రేరణచే వ్రాయబడిన విషయమనేది వాటిలో పేర్కొనబడిన సంఘటనల ద్వారా మాత్రమే నిరూపితం కాగలదు. కనుక ఆ సంఘటనల విషయంలో వారి సాక్ష్యాన్ని ఇతర వ్యక్తుల సాక్ష్యం వంటిదిగా భావించడమనేది తప్పనిసరి. ఒకవేళ మనం చారిత్రక సంఘటనల

---

**(అథఃసూచికలు)**

504 పాఠకులచే చదవబడుతున్న ఈ గ్రంథం యొక్క అన్ని ప్రతుల్లోనూ 17 వ వాక్యంలో అని పేర్కొనబడి ఉంది. అయితే వాస్తవానికి ఈ విషయం 27 వ వాక్యంలో పేర్కొనబడి ఉంది. (మౌలానా ముహమ్మద్ తఖీ ఉస్మానీ సాహెబ్ - అథఃసూచికల కూర్పుకర్త)

505 'పరస్పరాధారిత నిరూపణ సమస్య' అనేది తర్కశాస్త్రానికి సంబంధించిన ఒక పారిభాషిక పదం. దీనికి అర్థం ఇది: ఒక వస్తువును నిరూపించడమనేది రెండవ వస్తువు మీద ఆధారపడి ఉండి, ఆ రెండవ వస్తువును నిరూపించడమనేది మొదటి వస్తువు మీద ఆధారపడి ఉన్నట్లయితే ఆ విధంగా నిరూపితమవడమనేది పూర్తిగా అసాధ్యం, అసత్యమైనది అని ప్రాచీన కాలానికి చెందిన తర్కశాస్త్ర కోవిదులు మరియు తత్త్వవేత్తలు అభిప్రాయపడ్డారు. రీస్ ఈ విషయంలో చెప్పేదేమిటంటే ఒకవేళ సువార్తల్లో పేర్కొనబడిన సంఘటనలు సత్యమైనవిగా నిరూపితమయ్యేందుకు ఆధారమేమిటని ప్రశ్నించినప్పుడు అవి దైవప్రేరణతో వ్రాయబడిన సువార్తలలో అవి పేర్కొనబడడమే ఆధారమని పేర్కొనడం జరిగి, మరి సువార్తలు దైవ ప్రేరణచే వ్రాయబడ్డాయని భావించేందుకు ఆధారమేమిటని ప్రశ్నించినప్పుడు అవి దైవప్రేరణచే వ్రాయబడినట్లుగా అందులో పేర్కొనబడిన సంఘటనలలో పేర్కొనబడియున్నది గదా అని సమాధానమిచ్చే పక్షంలో అది పరస్పరాధారిత నిరూపణ సమస్యగా పరిగణించబడుతుంది. అది అసాధ్యం గనుక సువార్తలలో పేర్కొనబడిన సంఘటనలను సాధారణ చరిత్రకారులచే పేర్కొనబడే చారిత్రక సంఘటనల స్థాయిని కలిగియున్నట్లుగా భావించడం తప్పనిసరి. (మౌలానా ముహమ్మద్ తఖీ ఉస్మానీ - అథఃసూచికల కూర్పుకర్త)



గురించి ప్రస్తావించే సమయంలో ఈ ప్రమాణాన్ని దృష్టిలో ఉంచుకున్న పక్షంలో క్రైస్తవ సమాజంలో ఎటువంటి చెడుగుకూ సంబంధించిన ప్రమాదమేదీ సంభవించజాలదు. అలాగే ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) యొక్క శిష్యుల అనుభవంలోకి వచ్చిన సాధారణ పరిస్థితులు, వేటినయితే లూకా తన పరిశోధన ద్వారా అనుభూతించడం జరిగిందో ఆ సంఘటనలకు సంబంధించిన వివరణలు దైవప్రేరణచే వ్రాయబడ్డాయని పేర్కొంటూ స్పష్టంగా వ్రాయబడియుండడమనేది మనకు ఎక్కడా కనిపించదు. ఒకవేళ కొంతమంది సువార్తీకులు కొన్ని తప్పులకు సైతం పాల్పడ్డారని, అయితే యోహాను తర్వాత వాటిని సంస్కరించడం జరిగిందని భావించేందుకు మనకు అనుమతి లభించినట్లయితే సువార్తలను పరిష్కరించే విషయానికి సంబంధించి గొప్ప ప్రయోజనం మనకు చేకూరుతుంది. మిస్టర్ కడల్ కూడా తన పుస్తకం యొక్క 2 వ అధ్యాయంలో మైకేల్స్ వ్యాఖ్యకు మద్దతు తెలిపారు. ఇక అపొస్తులుల శిష్యులు వ్రాసిన పుస్తకాల విషయానికొస్తే ఉదాహరణకు మార్కు మరియు లూకా సువార్తలు లేదా అపొస్తలుల కార్యములు అనే గ్రంథాల విషయానికొస్తే అవి దైవప్రేరణచే వ్రాయబడ్డాయా? లేదా? అనే విషయానికి సంబంధించి మైకేల్స్ ఎటువంటి తీర్పునూ వెలువరించలేదు. "

# వాట్సన్ ఒప్పుకోలు

వాట్సన్ తన 'రిసాలతుల్ ఇల్హామ్' అనే గ్రంథం యొక్క, డాక్టర్ బేన్సన్ వ్యాఖ్యాన గ్రంథం ద్వారా సంకలించబడిన 4 వ సంపుటిలో ఈ విధంగా వివరణను అందజేశారు:

" లూకా సువార్త దైవప్రేరణచే వ్రాయబడలేదనే విషయం స్వయంగా లూకా తన సువార్త యొక్క ఉపోద్ఘాతంలో పేర్కొన్న విషయం ద్వారా వెల్లడవుతుంది. " లూకా తన ఉపోద్ఘాతంలో ఈ విధంగా పేర్కొన్నారు:

**" ఘనత వహించిన థెయొఫిలా, ఆరంభము నుండి కన్నులార చూచి వాక్య సేవకులైనవారు మనకు అప్పగించిన ప్రకారము మన మధ్యను నెరవేరిన కార్యములను గూర్చి వివరముగ వ్రాయుటకు అనేకులు పూనుకొన్నారు గనుక నీకు ఉపదేశింపబడిన సంగతులు నిశ్చయముగా జరిగినవని నీవు తెలిసికొనుటకై వాటినన్నిటిని మొదట నుండి తరచి పరిష్కారముగా తెలిసికొనియున్న నేనును నీ పేరిట వాటిని గూర్చి వరుసగా రచించుట యుక్తమని యెంచితిని "**

వాట్సన్ ఇంకా ఈ విధంగా పేర్కొన్నారు:

" క్రైస్తవ మతానికి చెందిన ప్రాచీన పండితులు కూడా ఈ విధంగానే వ్రాశారు. ఆరీనూస్ ఈ విధంగా పేర్కొన్నారు: లూకా ఏసు శిష్యుల ద్వారా నేర్చుకొని మన వద్దకు చేరవేసిన

అంశాల విషయానికొస్తే జెరోమ్ ఈ విధంగా పేర్కొన్నారు: 'లూకా విద్యార్జన అనేది ఏసు యొక్క శారీరక సహచర్య భాగ్యాన్ని పొందని పౌలు మీద మాత్రమే ఆధారపడియుండలేదు. ఆయన (లూకా) సువార్తలకు సంబంధించిన జ్ఞానాన్ని పౌలు ద్వారా మాత్రమే కాకుండా ఏసు యొక్క ఇతర శిష్యుల ద్వారా కూడా పొందడం జరిగింది.''

**ఆ తర్వాత ఆ పుస్తకంలో ఆయన ఇంకా ఈ విధంగా పేర్కొన్నారు:**

" ఏసు శిష్యులు ధర్మానికి సంబంధించిన ఏదయినా విషయం గురించి మాట్లాడే సమయంలో లేదా వ్రాసే సమయంలో వారి వద్ద ఉండిన దైవప్రేరణకు సంబంధించిన ఖజానా వారిని పరిరక్షించేది. ఏదిఏమయినప్పటికీ వారు మానవులు, బుద్ధిని కలిగియున్నవారు, దైవప్రేరణను పొందేవారు కూడా. ఏవిధంగానయితే ఇతరులు సంఘటనల గురించి తెలియజేసే సమయంలో దైవప్రేరణ లేకుండానే మాట్లాడతారో లేదా వ్రాస్తారో అదేవిధంగా సాధారణ సంఘటనల గురించి తెలియజేసే విషయంలో ఏసు శిష్యులు కూడా అదేవిధంగా వ్యవహరించేవారు. అందుకే పౌలు తిమోతికి దైవప్రేరణ లేకుండానే **" ఇక మీదట నీళ్ళే త్రాగక నీ కడుపు జబ్బుకునే తరచుగా వచ్చు బలహీనతల కోసరమును ద్రాక్ష రసమును కొంచెముగా పుచ్చుకొనుము"** అని వ్రాయడం సాధ్యమయింది. ఈ విషయం మనకు 'అపొస్తలుడైన పౌలు తిమోతికి వ్రాసిన మొదటి పత్రిక' యొక్క 5 వ అధ్యాయపు 23 వ వాక్యం ద్వారా తెలుస్తుంది. అలాగే పౌలు తిమోతికి దైవప్రేరణ లేకుండానే **" నీవు వచ్చునప్పుడు నేఁ త్రోయలో[506] కర్పు నొద్ద ఉంచి వచ్చిన అంగీని పుస్తకములను, ముఖ్యముగా చర్మపు కాగితములను తీసికొని రమ్ము "** అని వ్రాయడం సాధ్యమయింది. ఈ విషయం మనకు 'అపొస్తలుడైన పౌలు తిమోతికి వ్రాసిన రెండవ పత్రిక' యొక్క 4 వ అధ్యాయపు 13 వ వాక్యం ద్వారా తెలుస్తుంది. అలాగే పౌలు ఫిలేమోనుకు దైవప్రేరణ లేకుండానే **" అంతేకాదు, నీ ప్రార్ధనల మూలముగా నేను నీకు అనుగ్రహింపబడుదునని నిరీక్షించుచున్నాను గనుక నా నిమిత్తము బస సిద్ధము చేయుము"** అని వ్రాయడం సాధ్యమయింది. ఈ విషయం మనకు 'అపొస్తలుడైన పౌలు ఫిలేమోనుకు వ్రాసిన పత్రిక' యొక్క 22 వ వాక్యం ద్వారా తెలుస్తుంది. అలాగే అలాగే పౌలు తిమోతికి దైవప్రేరణ లేకుండానే **" ఎరస్తు కొరింథిలో**

**(అథఃసూచికలు)**

506 త్రోయ అనేది సమర కు ఉత్తరాన ఆస్తియ కు చెందిన ఒక ఓడరేవు పేరు. ఈ వాక్యంలో 'కర్పు' అనేది ఒక వ్యక్తి పేరు. (మౌలానా ముహమ్మద్ తఖీ ఉస్మానీ సాహెబ్ - అథఃసూచికల కూర్పుకర్త)



**నిలిచిపోయెను. త్రోఫిము రోగియైనందున అతని మిలేతులో విడిచివచ్చితిని "** అని వ్రాయడం సాధ్యమయింది. ఈ విషయం మనకు 'అపొస్తలుడైన పౌలు తిమోతికి వ్రాసిన రెండవ పత్రిక' యొక్క 4 వ అధ్యాయపు 20 వ వాక్యం ద్వారా తెలుస్తుంది. ఈ సంఘటనలన్నీ నాకు సంబంధించినవి కావు, పరిశుద్ధుడయిన పౌలుకు సంబంధించిన సంఘటనలు, స్థితిగతులు. పౌలు కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక యొక్క 7 వ అధ్యాయపు 10 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొన్నాడు: **" మరియు పెండ్లియైన వారికి నేను కాదు ప్రభువే ఆజ్ఞాపించునదేమనగా, భార్య భర్తను ఎడబాయకూడదు"** అలాగే 12 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొన్నాడు:

**" ప్రభువు కాదు నేనే తక్కినవారితో చెప్పునదేమనగా "** అలాగే 25 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొన్నాడు : **" కన్యకల విషయమై ప్రభువు యొక్క ఆజ్ఞ నేను పొందలేదు గాని నమ్మకమైనవాడనై యుండుటకు ప్రభువు వలన కనికరము పొందినవాడనై నా తాత్పర్యము చెప్పుచున్నాను. "**

అలాగే అపొస్తలుల కార్యములు గ్రంథం యొక్క 16 వ అధ్యాయపు 6 వ మరియు 7 వ వాక్యాలలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" ఆసియలో వాక్యము చెప్పకూడదని పరిశుద్ధాత్మ వారినాటంకపరచినందున వారు ఫ్రుగియ గలతీయ ప్రదేశముల ద్వారా వెళ్ళిరి. ముసియ దగ్గరకు వచ్చి బితునియకు వెళ్ళుటకు ప్రయత్నము చేసిరి గాని యేసు యొక్క ఆత్మ వారిని వెళ్ళనియ్యలేదు "**

దీనినిబట్టి అపొస్తలుల కార్యములకు రెండు ప్రాతిపదికలు ఉన్నాయి. ఒకటి బుద్ధి అయితే రెండవది దైవప్రేరణ. మొదటి ప్రాతిపదిక ప్రకారం వారు సాధారణమైన సంఘటనల గురించి మాట్లాడేవారు. ఇక రెండవ ప్రాతిపదిక ప్రకారం వారు క్రైస్తవ సమాజం విషయంలో మాట్లాడేవారు. అందుకే అపొస్తలులు తమ ఇంటి విషయాలలోనూ మరియు తమ సంకల్పాల విషయంలోనూ ఇతర సాధారణ మానవుల వలె తప్పులకు పాల్పడేవారు. ఈ విషయానికి సంబంధించిన వివరణ మనకు అపొస్తలుల కార్యములు గ్రంథం యొక్క 23 వ అధ్యాయపు 3 వ వాక్యంలో లభ్యమవుతుంది. అలాగే అపొస్తలుడైన పౌలు రోమీయులకు వ్రాసిన పత్రిక లోని 15 వ అధ్యాయపు 24 వ వాక్యంలోనూ మరియు 28 వ వాక్యంలోనూ లభ్యమవుతుంది. అలాగే అపొస్తలుడైన పౌలు కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక యొక్క 16 వ అధ్యాయపు 5 వ , 6 వ మరియు 8 వ వాక్యాలలోనూ లభ్యమవుతుంది. అలాగే అపొస్తలుడైన పౌలు కొరింథీయులకు వ్రాసిన రెండవ పత్రిక యొక్క 11 వ అధ్యాయపు 15 వ, 16 వ, 17 వ మరియు 18 వ వాక్యాలలోనూ లభ్యమవుతుంది.

ఎన్‌సైక్లోపీడియా రీస్ అనే గ్రంథం యొక్క 19 వ అధ్యాయంలో డాక్టర్ బన్సన్ కు సంబంధించిన స్థితిగతుల ప్రస్తావనలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది: " ఆయన దైవప్రేరణ విషయంలో ఏదయితే పేర్కొనడం జరిగిందో అది ఎంతో సులభగ్రాహ్యమైనది, సమీప అంచనా మరియు పరీక్ష విషయంలో అనుపమానమైనది"

## బాసూబర్లియాఫాన్ ఒప్పుకోలు

బాసూబర్లియాఫాన్ ఈ విధంగా పేర్కొన్నారు: " ఏ పరిశుద్ధాత్మ బోధన మరియు సహకారం ద్వారానయితే సువార్తీకులు మరియు అపోస్తలులు వ్రాయడం జరిగిందో అది వారి కొరకు ఒక ప్రత్యేకమైన భాషనేదీ నిర్ణయించలేదు. వాస్తవానికి పరిశుద్ధాత్మ వారి హృదయాలలో కేవలం అంశాలకు సంబంధించిన ప్రేరణను కలుగజేయడం జరిగింది. అలాగే తప్పులకు పాల్పడకుండా వారిని రక్షించడం జరిగింది. అలాగే పరిశుద్ధాత్మ వారికి తమపై ప్రోక్తమయిన వాక్కును తమ స్వీయ నుడికారం ప్రకారం, రచన ప్రకారం వెలువరించేందుకై అనుమతిని సైతం ప్రసాదించింది. మనం ఏవిధంగానయితే బైబిల్ పాతనిబంధన గ్రంథంలోని గ్రంథాల కూర్పుకర్తల రచనల్లో వారి నుడికారాలలో వ్యత్యాసాలను, వైరుధ్యాలను గుర్తిస్తామో, (వాస్తవానికి ఆ వైరుధ్యాలకు, వ్యత్యాసాలకు కారణం వారి నైజాలు మరియు సామర్థ్యాల మధ్య ఉన్న వైరుధ్యాలే) అదేవిధంగా ఏ వ్యక్తయితే మూలభాషపై పట్టును కలిగియుంటాడో అతడు మత్తయి, లూకా, పౌలు మరియు యోహాను ల నుడికారాలలో వ్యత్యాసాన్ని గుర్తిస్తాడు.

ఒకవేళ పరిశుద్ధాత్మ అపోస్తలుల హృదయాలలో పదాలను సైతం ప్రోక్తం కావించి ఉండినట్లయితే అటువంటి వైరుధ్యాలు తలెత్తేందుకు నిశ్చయంగా అవకాశముండేది కాదు. ఇంకా చెప్పాలంటే అటువంటి పరిస్థితిలో బైబిల్ లోని గ్రంథాలన్నింటిలోని నుడికారం ఒకేవిధంగా ఉండేది. అంతేగాకుండా కొన్ని పరిస్థితులు ఏవిధంగా చోటుచేసుకున్నాయంటే వాటి వ్యక్తీకరణ కొరకు దైవప్రేరణ అవసరం లేదు. ఉదాహరణకు వారు స్వయంగా కళ్ళారా చూసినటువంటి లేదా విశ్వసనీయులయిన సాక్షుల ద్వారా విన్నటువంటి ఏదయినా సంఘటన గురించి ప్రస్తావించవలసి వచ్చినప్పుడు వాటి వ్యక్తీకరణ కొరకు వారికి దైవప్రేరణ అవసరం ఏర్పడలేదు. లూకా తాను సువార్తను వ్రాయాలని సంకల్పించినప్పుడు తాను ఆసియాకు సంబంధించిన స్థితిగతులను వాటిని కళ్ళారా చూసియున్నవారి ఆధారంగా వ్రాశానని పేర్కొన్నారు. ఆయనకు వాటి పట్ల అవగాహన ఉంది. అందుకే ఆయన వాటిని తరువాతి తరాల వరకు చేర్చడం సముచితమని భావించారు. ఇక పరిశుద్ధాత్మ ద్వారా ఆ సంఘటనలకు సంబంధించిన సమాచారాన్ని గ్రహించిన రచయిత తన అలవాటు చొప్పున ఈ విధంగా పేర్కొంటాడు : " నేను ఈ సంఘటనలను వాటి గురించి



నాకు పరిశుద్ధాత్మ బోధించిన రీతిలోనే ప్రస్తావించాను" ఇక పౌలు యొక్క విశ్వాసం ఎంతో విచిత్రమైనదయినప్పటికీ దైవం తరఫున అనుగ్రహించబడినది. అయినప్పటికీ లూకాకు తన వివరణ కొరకు పౌలు సాక్ష్యం లేదా తన సహచరుల సాక్ష్యం అవసరం ఏర్పడిందే తప్ప మరెవరి అవసరమూ ఆయనకు ఏర్పడలేదు. అందుకే ఎంతోకొంత వ్యత్యాసమున్నదే గానీ వైరుధ్యం లేదు"

వీరు క్రైస్తవ పండితులలో మహోన్నతులుగా ప్రసిద్ధి గాంచిన ఇద్దరు పండితులు. ఇద్దరికి చెందిన గ్రంథాలు కూడా క్రైస్తవ ప్రపంచంలో ఎంతగానో విశ్వసనీయమైనవిగా ప్రసిద్ధిగాంచాయి. ఈ విషయానికి సంబంధించిన వివరణను హోరన్ మరియు వాట్సన్ అందజేసి ఉన్నారు.

## తౌరాతు గ్రంథం విషయంలో క్రైస్తవుల ఒప్పుకోలు

హోరన్ తన గ్రంథం యొక్క రెండవ సంపుటిలో **798** వ పేజీలో అతిస్పష్టంగా ఈ విధంగా పేర్కొన్నారు:

" మోషే (దైవప్రవక్త హజ్రత్ మూసా (అ)) పై దైవవాణి అవతరించిందనే విషయాన్ని నిరాకరించే జర్మనీకి చెందిన పండితులలో అక్‌హోరన్ ఒకరు"

ఆ తర్వాత **818** వ పేజీలో ఆయన ఈ విధంగా పేర్కొన్నారు:

" షలజ్, వాథ్, రోజన్ మిల్లర్ మరియు డాక్టర్ జదస్ ఈ విధంగా పేర్కొన్నారు: ' మోషే పై ఏవిధమైన దైవవాణీ అవతరించేది కాదు. ఇంకా చెప్పాలంటే బైబిల్ పాతనిబంధన లోని మొదటి ఐదు గ్రంథాలు ఆ కాలానికి చెందిన ప్రసిద్ధ ఉల్లేఖనాలన్నింటి సముచ్చయం మాత్రమే. నేడు జర్మనీకి చెందిన క్రైస్తవ పండితులలో ఈ భావన శరవేగంగా వ్యాపిస్తోంది"

హోరన్ ఇంకా ఈ విధంగా పేర్కొన్నారు:

" యూసీబీస్ మరియు ఆయన తర్వాత వెలుగులోకి వచ్చిన ఎందరో పరిశోధకులు ఈ విధంగా పేర్కొన్నారు : ' మోషే ఆదికాండాన్ని ఆయన మద్యన్‌లో తన మామగారి మేకలను కాసే సమయంలో వ్రాశారు"

మేము విజ్ఞప్తి చేసేదేమిటంటే మోషే (దైవప్రవక్త హజ్రత్ మూసా (అ)) ఆదికాండాన్ని దైవప్రవక్త పదవి దైవం తరఫు నుంచి లభించడానికి ముందే వ్రాసినప్పుడు ఆ గ్రంథం కూడా ఈ సత్యశోధక పండితుల దృష్టిలో దైవగ్రంథం కాజాలదు. ఆ విధంగా ఆదికాండం కూడా ఆ కాలానికి చెందిన ప్రసిద్ధ ఉల్లేఖనాల సముచ్చయం మాత్రమే అవుతుంది. ఎందుకంటే ఒక దైవప్రవక్త దైవప్రవక్త పదవిని పొందిన తర్వాత వ్రాసిన గ్రంథాలే దైవగ్రంథాలు కానప్పుడు, ఆ విధంగా సత్యశోధకులయిన

హోరన్ వంటి పండితులు అంగీకరించినప్పుడు మోషే (దైవప్రవక్త హజ్రత్ మూసా (అ)) దైవప్రవక్త పదవి లభించడానికి ముందు వ్రాసిన గ్రంథం (ఆదికాండం) దైవగ్రంథం ఎలా అవుతుంది? వార్డ్ కేథొలిక్ క్రీ.శ. 1841 లో ప్రచురించబడిన తన గ్రంథంలోని 38 వ పేజీలో ఈ విధంగా పేర్కొన్నారు:

" లూథర్ తన గ్రంథం యొక్క మూడవ సంపుటి యొక్క 40 వ మరియు 41 వ పేజీలలో ఈ విధంగా పేర్కొన్నారు: ' మేము మోషే మాటలూ వినము, ఆయన వైపుకు అభిముఖులూ కాము. ఎందుకంటే ఆయన కేవలం యూదుల కొరకు మాత్రమే వచ్చిన వ్యక్తి. మాకు ఆయనతో ఏ విషయంలోనూ ఎటువంటి సంబంధమూ లేదు "

మరొక గ్రంథంలో ఆయన ఈ విధంగా పేర్కొన్నారు: " మేము మోషేను విశ్వసించము, తౌరాతు గ్రంథాన్నీ విశ్వసించము. ఎందుకంటే ఆయన (మోషే) ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) కు శత్రువు."

ఆయన ఇంకా ఈ విధంగా పేర్కొన్నారు: " ఆయన క్రూరులకు గురువు." ఆయన ఇంకా ఈ విధంగా పేర్కొన్నారు: " పది ఆజ్ఞలకు క్రైస్తవులతో ఎటువంటి సంబంధమూ లేదు. మేము ఆ పది ఆజ్ఞలను తొలగించివేస్తాము. తద్వారా ప్రతి కల్పిత ఆచారమూ సమసిపోతుంది. ఎందుకంటే అవే (మోషే తెచ్చిన పది దైవాజ్ఞలు) అన్ని కల్పిత దురాచారాలకూ మూలం"

ఆయన శిష్యుడయిన అస్లీబీస్ ఈ విధంగా పేర్కొన్నారు: " ఆ పది ఆజ్ఞలు చర్చీలలో ఎవరికీ తెలియదు." ఎంటీనోమీనస్ వర్గం ఈ వ్యక్తి నుంచే ఉనికిలోకి వచ్చింది. ఈ వర్గానికి చెందిన విశ్వాసం ఇది: " తౌరాతు గ్రంథం దైవగ్రంథంగా విశ్వసించబడే అర్హతను కలిగి లేదు." అలాగే వారు " ఒకవేళ ఏ వ్యక్తయినా వ్యభిచారానికి పాల్పడినట్లయితే లేదా ఇతర దుర్మార్గాలకు పాల్పడినట్లయితే కూడా అతడు నిశ్చయంగా ముక్తిని పొందేందుకు అర్హుడే, అతడు పాపకార్యాలలో ఎంతగా నిమగ్నుడయి ఉన్నప్పటికీ, వాటికి పాల్పడే విషయంలో పరాకాష్ఠకు చేరుకున్నప్పటికీ, అతడు విశ్వాసి అయినట్లయితే అతడు సుఖసౌఖ్యాలలో ఉంటాడు. ఇక ఎవరయితే ఈ పది ఆజ్ఞల వైపుకు అభిముఖులవుతారో వారు షైతాన్ (సాతాను) తో సంబంధాన్ని కలిగియున్నట్లే. అటువంటి వారే ఏసుకు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) కు శిలువ శిక్షను విధించారు" అనే విశ్వాసాన్ని సైతం కలిగియుండేవారు.

ప్రొటెస్టెంట్ వర్గ నాయకుని మరియు అతడి శిష్యుడయిన రషీద్ యొక్క ఈ వ్యాఖ్యలను పరిశీలించండి. వారిరువురూ దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) (మోషే) ను మరియు తౌరాతు గ్రంథాన్ని అగౌరవపరుస్తూ ఏవిధంగా వ్యాఖ్యానించారో చూడండి.

ఇక్కడ ఉత్పన్నమయ్యే ప్రశ్న ఏమిటంటే మోషే (దైవప్రవక్త హజ్రత్ మూసా (అ)) ఏసు



(దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) శత్రువు అయినప్పుడు, క్రూరులకు గురువు అయినప్పుడు, కేవలం యూదుల కొరకే ప్రభవించినవారు అయినప్పుడు, తౌరాతు గ్రంథం దైవగ్రంథమే కానప్పుడు, మోషే (దైవప్రవక్త హజ్రత్ మూసా (అ)) తోనూ, తౌరాతు గ్రంథంతోనూ, దేవుని పది ఆజ్ఞలతోనూ క్రైస్తవులకు ఎటువంటి సంబంధమూ లేనప్పుడు, దేవుని పది ఆజ్ఞలు పరిశుద్ధ గ్రంథం నుంచి తొలగించబడేందుకు యోగ్యమయినది అయినప్పుడు, అలాగే అవి కల్పిత దురాచారాలన్నింటికీ మూలం కూడా అయినప్పుడు, వాటితో సంబంధాన్ని కలిగియుండేవారందరూ షైతాన్ (సాతాను) తో సంబంధాన్ని కలిగియుండేవారు అయినప్పుడు ఈ వర్గ నాయకుడిని అనుసరించేవారు తౌరాతు గ్రంథాన్ని మరియు మోషే ను (దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) ను) తిరస్కరించినవారిగా పరిగణించబడడం తప్పనిసరి అవుతుంది. అలాగే దేవునికి సాటి కల్పించడం (షిర్క్), విగ్రహారాధన, తల్లిదండ్రులను అగౌరవపరచడం, పొరుగువారికి కష్టం కలిగించడం, దొంగతనానికి పాల్పడడం, వ్యభిచారం చేయడం, హత్య చేయడం, అబద్ధపు సాక్ష్యం పలకడం అనే చర్యలన్నీ ప్రొటెస్టెంట్ వర్గానికి చెందినవారి కొరకు తప్పనిసరి అయిపోతాయి. ఎందుకంటే ఈ చర్యలన్నీ మోషే పై (దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) పై) అవతరించిన, (ప్రొటెస్టెంట్ వర్గ నాయకుల అభిప్రాయం ప్రకారం) అన్నిరకాల కల్పిత దురాచాలకు మూలమయిన పది ఆజ్ఞలకు వ్యతిరేకమైనవి. మరి పది ఆజ్ఞలను తిరస్కరించేవారు వాటికి వ్యతిరేకమైన ఈ చర్యలన్నింటికీ పాల్పడడం తప్పనిసరి అవుతుంది గదా! (అల్లాహ్ క్షమించుగాక)

ఈ వర్గానికి చెందిన కొంతమంది మాతో ఈ విధంగా కూడా పేర్కొన్నారు: " మా దృష్టిలో మోషే దైవప్రవక్త కూడా కారు. ఆయన ఒక తెలివయిన వ్యక్తి, శాసనాలను క్రోడీకరించే వ్యక్తి." మరికొంతమంది ఈ విధంగా కూడా పేర్కొన్నారు: " మోషే మా దృష్టిలో ఒక దొంగ, దోచుకునే వ్యక్తి" మేము " దేవునికి భయపడండి" అని పేర్కొన్నాము. అప్పుడు వారు ఈ విధంగా పేర్కొన్నారు: " ఎందుకు భయపడాలి? ఎందుకంటే ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) స్వయంగా ఈ విధంగా పేర్కొని ఉన్నారు: ' నాకు ముందు వచ్చినవారందరు దొంగలును దోచుకొనువారునై యున్నారు, గొర్రెలు వారి శబ్దము వినలేదు' ఈ విషయానికి సంబంధించిన వివరణ యోహాను సువార్త యొక్క 10 వ అధ్యాయపు 8 వ వాక్యంలో పేర్కొనబడి ఉంది. కనుక ' నాకు ముందు వచ్చినవారందరు ' అనే వాక్యభాగం మోషే ను మరియు ఇతర ఇశ్రాయేలీయులలో ప్రభవించిన ప్రవక్తలన సూచిస్తుంది."

మా అభిప్రాయమేమిటంటే బహుశా ప్రొటెస్టెంట్ వర్గ నాయకుడు మరియు ఆయన శిష్యుడయిన రషీద్ లు మోషే ను (దైవప్రవక్త హజ్రత్ మూసా (అ)ను) మరియు తౌరాతు గ్రంథాన్ని విమర్శించేందుకై ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) యొక్క ఈ వాక్కునే

ఆధారంగా చేసుకొని ఉంటారు.

## యాకోబు వ్రాసిన పత్రిక మరియు ప్రకటనల గ్రంథం విషయంలో క్రైస్తవ పండితుల ఒప్పుకోలు

ప్రొటెస్టెంట్ వర్గ నాయకుడయిన లూథర్ యాకోబు వ్రాసిన పత్రిక గురించి ఈ విధంగా పేర్కొన్నారు:

" ఈ గ్రంథం పరిగణించబడేందుకు యోగ్యమైనది కాదు. ఏసు శిష్యుడయిన యాకోబు తన పత్రిక యొక్క 5 వ అధ్యాయంలో ఈ విధంగా ఆదేశించారు: ' **మీలో ఎవడైనను రోగియైయున్నాడా? అతడు సంఘపు పెద్దలను పిలిపింపవలెను; వారు ప్రభువు నామమున అతనికి నూనె రాచి అతని కొరకు ప్రార్థన చేయవలెను"**

లూథర్ తన గ్రంథం యొక్క 2 వ సంపుటిలో ఈ విషయం పట్ల అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తూ ఈ విధంగా పేర్కొన్నారు:

"ఒకవేళ ఈ షరతు యాకోబు విధించినదయితే నా సమాధానమేమిటంటే ఏసు శిష్యులలో ఎవరికైనను తన తరఫున ఏదయినా ధర్మశాస్త్రీయ ఆదేశమును నిర్ణయించే అధికారం లేదు. ఎందుకంటే ఆ అధికారమును కేవలం ఏసు మాత్రమే కలిగియుండేవారు"

కనుక లూథర్ దృష్టిలో బైబిల్ క్రొత్త నిబంధన గ్రంథంలోని 'యాకోబు వ్రాసిన పత్రిక' దైవగ్రంథం కాదు. అదేవిధంగా ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] శిష్యులు ఆదేశాలు సైతం దైవప్రేరణతో జారీ చేయబడినట్టివి కావు. అలాకాకుంటే ' ఆ అధికారమును కేవలం ఏసు మాత్రమే కలిగియుండేవారు' అని లూథర్ పేర్కొనవలసిన అవసరం ఏర్పడేది కాదు.

వార్డ్ కేథొలిక్ క్రీ.శ. 1841 లో ప్రచురించబడిన తన గ్రంథం యొక్క 37 వ పేజీలో ఈ విధంగా పేర్కొన్నారు:

" ప్రొటెస్టెంట్ వర్గానికి చెందిన గొప్ప పండితునిగా ప్రఖ్యాతి గాంచిన, లూథర్ శిష్యుడు కూడా అయిన పొమరన్ ఈ విధంగా పేర్కొన్నారు: ' యాకోబు తన పత్రికను అసందర్భ ప్రలాపనలతో, నిరర్థక విషయాలతో ముగిస్తాడు. అలాగే ఆయన గ్రంథాల నుంచి పరిశుద్ధాత్మతో ఎటువంటి సంబంధమూ లేని విషయాలను ఉల్లేఖిస్తాడు. కనుక అటువంటి గ్రంథం దైవగ్రంథంగా పరిగణించబడజాలదు''

ప్రొటెస్టెంట్ వర్గానికి చెందిన నరమ్బర్గ్లో ప్రసంగీకుడిగా బాధ్యతలను నిర్వహించిన



వాయితస్ థియోడోరస్ ఈ విధంగా పేర్కొన్నారు: " మేము విషయం తెలుసుకున్న తర్వాత యోహాను యొక్క ప్రకటనల గ్రంథాన్ని విసర్జించాము. అదేవిధంగా యాకోబు వ్రాసిన పత్రికను కూడా విసర్జించాము. అయితే యాకోబు వ్రాసిన పత్రికలో ఎక్కడెక్కడయితే విశ్వాసంతో పాటు ఆచరణలను అభివృద్ధిపరచుకోవడం గురించి ప్రస్తావించబడియున్నదో వాటి విషయంలో విమర్శించబడదగినవాడు కాదు. ఆ పత్రికలో ధార్మిక నియమాలు మరియు అర్థాలు పరస్పర విరుద్ధమైనవిగా చోటుచేసుకున్నాయి. మకీడీ బర్జన్ సన్తియోరఖస్ ఈ విధంగా పేర్కొన్నారు: "యాకోబు వ్రాసిన పత్రిక ఒకచోట ఏసు శిష్యుల ధార్మిక నియమాల విషయంలో విభిన్నంగా ఉంది." ఆయన ఇంకా ఈ విధంగా పేర్కొన్నారు: ' ముక్తి అనేది కేవలం విశ్వాసం మీదే ఆధారపడి లేదు, ఆచరణల మీద కూడా ఆధారపడి ఉంది." ఒకచోట ఆయన ఈ విధంగా పేర్కొన్నారు: "తౌరాతు గ్రంథం స్వేచ్ఛకు సంబంధించిన శాసనం"

ఈ వ్యాఖ్యల ద్వారా పెద్ద పెద్ద పండితులు సైతం తమ నాయకుడు ఆమోదించని రీతిలోనే యాకోబు వ్రాసిన పత్రికను దైవగ్రంథంగా ఆమోదించరని విదితమవుతోంది.

## కలీమీషీస్ ఒప్పుకోలు

కలీమీషీస్ ఈ విధంగా పేర్కొన్నారు:

" మత్తయి మరియు మార్కు తమ రచనల్లో పరస్పరం విరుద్ధంగా ఉన్నారు. అయితే ఏదయినా విషయంలో వీరిరువురూ ఏకీభవించినట్లయితే వారిరువురి మాటకు లూకా మాట కంటే అధిక ప్రాధాన్యత లభిస్తుంది"

మేము పేర్కొనేదేమిటంటే దీనినిబట్టి రెండు విషయాలు నిరూపితమవుతున్నాయి. ఒకటి ఏమిటంటే మత్తయి మరియు మార్కు సువార్తలలో అర్థపరమైన వైరుధ్యాలు చోటుచేసుకొని ఉన్నాయి. రెండవది ఏమిటంటే వీరిరువురూ ఏదయినా విషయంలో ఏకీభవించినప్పుడు వీరి మాటకు లూకా మాట కంటే అధిక ప్రాధాన్యత లభిస్తుంది. ఎందుకంటే పదాల విషయంలో ఏకీభావమనేది ఏ సంఘటనకు సంబంధించిన వివరణలోనూ ఈ సువార్తలలో కానరాదు.

ఈ మూడు సువార్తలూ (మత్తయి సువార్త, మార్కు సువార్త మరియు లూకా సువార్త) దైవగ్రంథాలు కావని ఈ విధంగా నిరూపితమవుతోంది. లేకుంటే మొదటి రెండు సువార్తలు ఏదయినా విషయంలో ఏకీభవించినప్పుడు వాటికి మూడవ సువార్త అయిన లూకా సువార్తపై అధిక ప్రాధాన్యత లభిస్తుందని భావించవలసిన, పేర్కొనవలసిన అగత్యం ఏర్పడేది కాదు. సత్యశోధకుడయిన పేలీ ప్రమాణాల విషయంలో ఒక పుస్తకం వ్రాశారు. ఈయన ప్రొటెస్టెంట్

వర్గానికి చెందిన విశ్వసనీయులయిన పండితులలో ఒకరుగా ప్రఖ్యాతిగాంచారు. ఆయన పుస్తకం క్రీ.శ. 1850 లో ప్రచురించబడింది. ఆ పుస్తకంలోని 323 వ పేజీలో ఆయన ఈ విధంగా పేర్కొన్నారు:

" ప్రాచీన కాలానికి చెందిన క్రైస్తవ పండితులు ప్రళయదినం అత్యంత సమీపంలోనే ఉందని విశ్వసించేవారనే విషయాన్ని వారికి ఆపాదించడం జరిగింది. ఆ విధంగా వారికి ఆపాదించబడిన రెండవ తప్పుడు విషయమిది. వాస్తవానికి నేను అభ్యంతరాన్ని వ్యక్తం చేయడానికి ముందు మరొక ఉదాహరణను పేర్కొనదలుచుకున్నాను. అదేమిటంటే మనదేవుడు (ఏసు) యోహాను గురించి పేతురుతో ఈ విధంగా పలికారు[507] : **' నేను వచ్చువరకు అతడుండుట నాకిష్టమైతే అది నీకేమి? '** ఈ వాక్కును దాని లక్ష్యానికి విరుద్ధంగా 'యోహాను మరణించడు' అనే అర్థాన్ని గ్రహించడం జరిగింది. ఆ తర్వాత ఆ సమాచారం ప్రజల్లో వ్యాపించిపోయింది.[508] ఆలోచించండి. ఆ విషయం సామాన్య ప్రజల్లో వ్యాప్తి చెంది ప్రజాభిప్రాయంగా మారిన తర్వాత మన వద్దకు చేరినప్పుడు, ఈ భయంకరమైన తప్పు ఏర్పడడానికి గల కారణమేమిటో తెలియబడనప్పుడు, నేడు ఏ వ్యక్తయినా క్రైస్తవ సమాజాన్ని ఖండించేందుకై ఈ తప్పుడు విషయాన్ని ఆధారంగా చేసుకొని వాదించినట్లయితే ఆ చర్య మన వద్దకు చేరుకొన్న ఈ విషయం దృష్ట్యా ఎంతో అన్యాయమైన దాడిగా పరిగణించబడుతుంది. అలాగే ఎవరయితే ఏసు శిష్యులు మరియు ప్రాచీన కాలానికి చెందిన క్రైస్తవ పండితులు తమ కాలంలోనే ప్రళయం సంభవిస్తుందని విశ్వసించేవారనే విషయం నిశ్చయంగా పరిశుద్ధ గ్రంథం ద్వారా నిరూపితమవుతోందని పేర్కొంటారో వారు ఈ పురాతనమైన, అశాశ్వతమైన తప్పు విషయంలో మేము పేర్కొన్న ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. ఈ తప్పు వారిని మోసం చేయకుండా రక్షించనయితే రక్షించింది గానీ ఇప్పుడు మరొక ప్రశ్న ఉత్పన్నమవుతుంది. అదేమిటంటే ఏసు శిష్యులు ఏదయినా అంశానికి సంబంధించి అభిప్రాయపడే విషయంలోనూ తప్పు జరిగేందుకు అవకాశముందని మనం అంగీకరించే పక్షంలో మరి ఏదయినా విషయంలో వారి మాటను విశ్వసించడం ఏవిధంగా

**(అథఃసూచికలు)**

507 చూడండి : యోహాను సువార్త, 21 : 22

508 **"అయితే చావడని యేసు అతనితో చెప్పలేదు గాని- నేను వచ్చువరకు అతడుండుట నాకిష్టమైతే అది నీకేమని చెప్పెను."** (యోహాను సువార్త, 21 : 23)



సాధ్యపడుతుంది? ఈ ప్రశ్నకు సమాధానంగా క్రైస్తవ సమాజపు మద్దతుదారులు తిరస్కారులకు ప్రతిగా ఈ విధంగా పలికితే సరిపోతుంది: " మాకు ఏసు శిష్యుల సాక్ష్యమే కావాలి. స్వయంగా వారు కలిగియుండే అభిప్రాయంతో మాకు ఎటువంటి సంబంధమూ లేదు. అసలయిన లక్ష్యం అవసరమున్న విషయమే అయి ఉంటుంది. అది పర్యవసానం రీత్యా సురక్షితంగా ఉంది. అయితే దీనికి సమాధానమిచ్చే సమయంలో రెండు విషయాలను దృష్టిలో ఉంచుకోవలసి ఉంటుంది. తద్వారా ప్రమాదం మొత్తం తొలగిపోతుంది.

మొదటిది ఏమిటంటే ఏసు శిష్యులు పంపబడడానికి సంబంధించిన లక్ష్యమేమిటో ముందు స్పష్టమవాలి. వారి వ్యక్తీకరణ ద్వారా అపరిచితమైన విషయమో లేక దానితో యాదృచ్ఛికంగానో మిళితమయిన విషయమో నిరూపితమయిపోయింది. ధర్మంతో స్పష్టమైన రీతిలో ఎటువంటి సంబంధాన్నీ కలిగియుండని అంశాల విషయంలో ఏదయినా పేర్కొనే అవసరం లేదు. అయితే ఏయే విషయాలయితే లక్ష్యంతో యాదృచ్ఛికంగా మిళితమయిపోయాయో వాటిగురించి ఏదో ఒకటి పేర్కొనవలసి వస్తుంది. అటువంటి విషయాలలో జిన్నాతులు మానవులను ఆవహించడం కూడా ఒకటి. ఈ తప్పుడు అభిప్రాయం ఆ కాలంలో జనసామాన్యంలోకి వ్యాపించిన కారణంగా సువార్తల రచయితలు మరియు ఆ కాలానికి చెందిన యూదులు సైతం అందులో నిమగ్నులయ్యారని ఎవరయితే భావించారో దానివల్ల 'క్రైస్తవ సమాజం' యొక్క యాథార్థ్యం విషయంలో ఎటువంటి ప్రమాదమూ ఏర్పడదనే విషయాన్ని అంగీకరించవలసి ఉంటుంది. ఎందుకంటే ఈ సమస్య ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] తీసుకు వచ్చిన విషయాలకు సంబంధించినట్టిది కాదు. అది వాస్తవానికి క్రైస్తవ ఉల్లఖనాలతో పాటు ఆ దేశంలోని ప్రజాభిప్రాయంగా మారిపోయిన కారణంగా యాదృచ్ఛికంగా మిళితమయిపోయింది. ఇక దురాత్మల ప్రభావం విషయంలో ప్రజల భావాలను సంస్కరించడమనేది ఆయన సందేశ కార్యపు భాగమూ కాదు, సాక్ష్యంతో దానికి ఎటువంటి సంబంధమూ లేదు.

రెండవది ఏమిటంటే వారు (అనగా ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] శిష్యులు) పేర్కొన్న ధర్మశాస్త్రీయ నియమాలకు, ప్రమాణాలకు మధ్య వ్యత్యాసాన్ని గుర్తించవలసిన ఆవశ్యకత ఉంది. విస్పష్టమైన విషయమేమిటంటే వారు పేర్కొన్న ధర్మశాస్త్రీయ విషయాలయితే దైవప్రేరణ తోనే పేర్కొనబడ్డాయి. అయితే వారు తమ వాక్కులకు వివరణను అందజేసే, బలాన్ని చేకూర్చుకునే ప్రయత్నంలో కొన్ని ప్రమాణాలను, మద్దతుపూర్వక వివరణలను పొందుపరచడం జరుగుతూ ఉంటుంది. ఉదాహరణకు యూదుడు కాని ఏ వ్యక్తయినా క్రైస్తవాన్ని స్వీకరించినట్లయితే అతడు మోషే [దైవప్రవక్త హజ్రత్ మూసా (అ)] కు దైవం తరఫున ప్రసాదించబడిన ధర్మశాస్త్రాన్ని అనుసరించడం తప్పనిసరి కాదు అనే నియమం. వాస్తవానికి ఆయన సత్యసంధత అద్భుత

కార్యాల ద్వారా నిరూపితమయింది కూడా.

పౌలు ఈ నియమం గురించి ప్రస్తావించే సందర్భంలో దానికి సమర్ధిస్తూ ఇంకా ఎన్నో మాటలు పలుకుతాడు. నియమమయితే తప్పనిసరిగా ఆమోదించవలసిన నియమమే. అయితే మనం అపొస్తలులు పేర్కొన్న అన్ని ప్రమాణాలను, ఉపమానాలను క్రైస్తవ సమాజానికి మద్దతు తెలిపే ఉద్దేశ్యంతో సమర్థించడం తప్పనిసరి ఏమీ కాదు. ఈ నియమాన్ని ఇతర అంశాల విషయంలోనూ దృష్టిలో ఉంచుకోవడం జరుగుతుంది. దైవజనులు ఏదయినా విషయంలో ఏకీభవించడమంటూ జరిగితే వారి వాదాల వల్ల ఏ ఫలితమయితే వెలువడుతుందో అది తప్పనిసరిగా ఆమోదించదగినది అయి ఉంటుందనే విషయం నాకు సంపూర్ణ స్థాయిలో విదితమయింది. అయితే మనం ఆ వాదాలన్నింటినీ వ్యాపింపజేయడం లేదా స్వీకరించడమనేది తప్పనిసరి కాదు. అయితే అటువంటి పరిస్థితిలో వారు ఫలితం వలె సంవాదాలను సైతం ఆమోదించిన పక్షంలో నిస్సందేహంగా అవి తప్పనిసరిగా ఆమోదించబడవలసినవి అవుతాయి "

ఈ ప్రసంగం వల్ల నాలుగు విషయాలు వెలికివచ్చాయని మేము పేర్కొంటాము:

**ఒకటి** ఏమిటంటే ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] శిష్యులు మరియు ప్రాచీన కాలానికి చెందిన క్రైస్తవులు తమ కాలంలోనే ప్రళయం సంభవిస్తుందనే విశ్వాసాన్ని, యోహాను ప్రళయం వరకు మరణించరనే విశ్వాసాన్ని కలిగియుండేవారు. మా అభిప్రాయమేమిటంటే ఇది పూర్తిగా సరియైనది. ఎందుకంటే మూడవ ప్రకరణంలో 'తప్పులు' అనే అంశం క్రింద పేర్కొనబడిన విషయాల పరంపరలో [509] ఈ విషయానికి సంబంధించి, అనగా ప్రళయం తమ కాలంలోనే సంభవిస్తుందనే విషయానికి సంబంధించి వారి వాక్కులు పూర్తిగా స్పష్టంగా ఉన్నాయనే విషయం తెలియజేయబడింది.

వ్యాఖ్యాత అయిన యార్ఫస్ యోహాను సువార్త యొక్క 21 వ అధ్యాయం గురించి వ్యాఖ్యానిస్తూ ఈ విధంగా పేర్కొన్నారు:

" యోహాను మరణించడనే అపోహ ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] యొక్క సులభంగా అపోహకు గురిచేసే రీతిలో ఉన్న వాక్కు కారణంగా ఉత్పన్నమయింది. యోహాను

**(అథఃసూచికలు)**

509 చూడండి : ఇదే గ్రంథంలోని 3 వ ప్రకరణంలో 64 వ తప్పు నుంచి 75 వ తప్పు వరకు పేర్కొనబడిన విషయాలు.



ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] యొక్క మిగిలిన శిష్యులందరూ మరణించిన తర్వాత కూడా జీవించియుండటంతో ఈ దురవగాహనకు మరింత బలం చేకూరింది."

**హెన్రీ వాస్కాట్ వ్యాఖ్యాన గ్రంథం కూర్పుకర్తలు** ఈ విధంగా పేర్కొన్నారు:

" ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] యొక్క ఈ వాక్కు యొక్క ఉద్దేశ్యం బహుశా యూదులతో ప్రతీకారం తీర్చుకోవడమయి ఉంటుంది. కానీ ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] శిష్యులు ఆయన మాట విని యోహాను ప్రళయం వరకు జీవించి ఉంటాడని లేదా సజీవునిగా స్వర్గానికి లేపుకు పోబడతాడని అర్థం చేసుకున్నారు "

వారు ఇంకా ఈ విధంగా పేర్కొన్నారు:

" ఈ సందర్భంగా అర్థం చేసుకోవలసిన విషయమేమిటంటే మానవుడి ఉల్లేఖనమనేది పరిశోధించకుండానే వెలువరించబడడమూ జరుగుతూ ఉంటుంది. కనుక దాని మీద విశ్వాసపు ప్రాతిపదికలను నెలకొల్పడమనేది మూర్ఖత్వమవుతుంది. ఎందుకంటే ఈ ఉల్లేఖనం ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] శిష్యుల యొక్క ఉల్లేఖనం. అది ఆనాటి ప్రజల్లో ప్రసిద్ధమయిన, సర్వత్రా వ్యాపించియున్న ఉల్లేఖనం. అయినప్పటికీ అది అసత్యమైనది. ఇక ఇప్పుడు వ్రాతపూర్వకంగా ఉనికిలోకి రాని ఉల్లేఖనాల విషయంలో ఎంతటి తక్కువ స్థాయిలో విశ్వసనీయత ఉంటుందో గదా! ఈ వ్యాఖ్యానం మన ఉల్లేఖనమే గానీ ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] యొక్క క్రొత్త వాక్కు ఏమీ కాదు. అయినప్పటికీ తప్పే"

ఆ తర్వాత అథఃసూచికలో వారు ఈ విధంగా పేర్కొన్నారు:

" ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] శిష్యులు ఆ పదాలను తప్పుగా అర్థం చేసుకున్నారు. ఈ విషయానికి సంబంధించిన వివరణను సువార్తికుడు [510] అందజేయడం జరిగింది. ఎందుకంటే వారి మస్తిష్కాలలో కేవలం న్యాయస్థాపన కొరకు దేవుని రాకడ సంభవించబోతున్నదనే విషయం నాటుకుపోయి ఉన్నది."

**(అథఃసూచికలు)**

510 **" కాబట్టి ఆ శిష్యుడు చావడను మాట సహోదరులలో ప్రచురమాయెను. అయితే చావడని యేసు అతనితో చెప్పలేదు గాని - నేను వచ్చువరకు అతడుండుట నాకిష్టమైతే అది నీకేమని చెప్పెను.** (యోహాను సువార్త, 21 : 23 )

ఈ వ్యాఖ్యాతల వ్యాఖ్యానపు ప్రాతిపదిక పట్ల ఎటువంటి సందేహమూ లేదు. వారు (అనగా ఏసు శిష్యులు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) శిష్యులు) నిశ్చయంగా తప్పుగా అర్థం చేసుకున్నారు. వారి విశ్వాసం ప్రళయం విషయంలో ఈ విధంగా ఉన్నప్పుడు, ఉదాహరణకు యోహాను ప్రళయం వరకు మరణించడని వారు భావించడం వంటి విశ్వాసాన్ని వారు కలిగియున్నప్పుడు, వారి యొక్క, తమ కాలంలోనే ప్రళయం సంభవించబోతున్నదనే విషయాన్ని సూచించే ఉల్లేఖనాలను [511] వాటి బాహిర అర్థాల ప్రకారమే గ్రహించడం జరుగుతుంది. ఆ విధంగా అవి తప్పుగా నిరూపితమవుతాయి. వాటికి ప్రత్యేక అర్థాలను ఆపాదిస్తూ వ్యాఖ్యానించడమనేది ఎంతమాత్రం సముచితం కాదు. ఆ విధంగా వ్యాఖ్యానించడమనేది ఒక మాటను పలికిన వ్యక్తి యొక్క ఉద్దేశ్యానికి, అభీష్టానికి వ్యతిరేకమైన అర్థాన్ని ఆపాదిస్తూ ఆ మాట గురించి వ్యాఖ్యానించడం వంటిదవుతుంది. మరి ఈ ఉల్లేఖనాలు తప్పుగా నిరూపితమయినప్పుడు అవి దైవప్రేరణచే వ్రాయబడినట్టివిగా పరిగణించబడజాలవు.

పేలీ ప్రసంగం ద్వారా వెలికివచ్చే **రెండవ** విషయం ఏమిటంటే ఏ విషయాలయితే ధర్మంతో సంబంధాన్ని కలిగియుండవో లేదా ఏ విషయాలయితే ధార్మిక విషయాలతో యాదృచ్ఛికంగా మిళితమయిపోయాయో వాటి విషయంలో తప్పులు చోటుచేసుకోవడం వల్ల క్రైస్తవ సమాజానికి ఎటువంటి నష్టమూ వాటిల్లదనే విషయాన్ని వారు అంగీకరించారు.

పేలీ ప్రసంగం ద్వారా వెలికివచ్చే **మూడవ** విషయం ఏమిటంటే ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] శిష్యులు పేర్కొనే ప్రమాణాల విషయంలోనూ, ఉపమానాల, దృష్టాంతాల విషయంలోనూ తప్పులు చోటుచేసుకోవడం వల్ల ఎటువంటి నష్టమూ వాటిల్లదనే విషయాన్ని కూడా వారు అంగీకరించారు.

పేలీ ప్రసంగం ద్వారా వెలికివచ్చే **నాల్గవ** విషయం ఏమిటంటే దురాత్మలు మానవులపై ప్రభావాన్ని కలుగజేయడమనేది అవాస్తవమని, అది కేవలం అపోహ వల్ల ఉత్పన్నమయ్యే సమస్య మాత్రమేనని, యాథార్థ్యం కాదని, అటువంటి అపోహలతోనూ, తప్పులతోనూ కూడిన విషయాలు ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] శిష్యుల యొక్క వాక్కుల్లోనూ, స్వయంగా

---

**(అథఃసూచికలు)**

[511] ఆ ఉల్లేఖనాలను ఇదే గ్రంథంలోని 3 వ ప్రకరణంలో 64 వ తప్పు నుంచి 75 వ తప్పు వరకు పేర్కొనబడిన విషయాల పరంపరలో పరిశీలించవచ్చు.



ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] యొక్క వాక్కులోనూ చోటుచేసుకోవడానికి కారణం ఆ కాలంలో ఆ దేశంలో అటువంటి భావనలు, విశ్వాసాలు ప్రజాభిప్రాయంగా వేళ్ళూనుకోవడమేననే విషయాన్ని కూడా వారు అంగీకరించారు.

ఇప్పుడు ఈ నాలుగు విషయాలు అంగీకరించబడిన తర్వాత మేము చెప్పేదేమిటంటే బైబిల్ లో సగభాగం కంటే ఎక్కువ భాగం దైవగ్రంథం కాదని నిరూపితమయిపోయింది. పేలీ అభిప్రాయం ప్రకారం కేవలం ధార్మిక ఆదేశాలు మరియు నియమాలు మాత్రమే మిగిలిపోతాయి. అనగా అవి మాత్రమే దైవం తరపున దివ్యప్రేరణచే లిఖించబడ్డాయని విశ్వసించవలసిందిగా పేర్కొన్నట్లు అవుతుంది. అయితే ఈ అభిప్రాయం అతడి నాయకుడయిన లూథర్ అభిప్రాయానికి వ్యతిరేకమైనట్టిది. కనుక ఈ అభిప్రాయం కూడా బలమైనది కాదని నిరూపితమయిపోయింది. ఎందుకంటే ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] యొక్క ఏ శిష్యునికీ స్వయంగా ఏదయినా ధార్మిక విధిని నిర్ణయించే అధికారం లేదని, అటువంటి అధికారాన్ని కేవలం ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] మాత్రమే కలిగియున్నారని లూథర్ అభిప్రాయపడ్డారు. కనుక ఈ విధంగా ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] యొక్క శిష్యులచే పేర్కొనబడిన ధర్మశాస్త్రీయ ఆదేశాలు మరియు నియమాలు సైతం దైవం తరపున దివ్యప్రేరణచే పేర్కొనబడినవి కావని నిరూపితమయింది.

## ప్రొటెస్టెంట్ వర్గానికి చెందిన ఇతర పండితుల ఒప్పుకోలు

వార్డ్ కేథొలిక్ క్రీ.శ. 1841 లో ప్రచురించబడిన తన గ్రంథంలో ప్రొటెస్టెంట్ వర్గానికి చెందిన విశ్వసనీయులయిన పండితుల వ్యాఖ్యలను పొందుపరిచారు. అలాగే ఆ గ్రంథంలో పేర్కొనబడిన పుస్తకాల పేర్లను కూడా ఆయన పేర్కొన్నారు. మేము ఆయన తన గ్రంథంలో పేర్కొన్న విషయం నుంచి 9 వ్యాఖ్యలను ఇక్కడ ఉల్లేఖిస్తున్నాము:

**1.** జోనికొలేస్ వంటి ప్రొటెస్టెంట్ వర్గానికి చెందినవారు ఈ విధంగా పేర్కొన్నారు: " పౌలు వ్రాసిన పత్రికలలో పేర్కొనబడిన విషయాలన్నీ పవిత్రమైన దైవవాక్కులు కావు. వాటిలో కొన్ని ఘటనల విషయంలో తప్పులు చోటుచేసుకొని ఉన్నాయి."

**2.** మిస్టర్ ఫలక్ ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] శిష్యుడయిన పేతురు తప్పుడు విషయాలను పేర్కొన్నారని ఆరోపిస్తూ ఆయనను సువార్త పట్ల అవగాహన లేనివానిగా నిర్ధారించారు.

**3.** డాక్టర్ కోడ్ తనకు, ఫాదర్ కీమ్ కు నడుమ జరిగిన చర్చ సందర్భంలో ఈ విధంగా పేర్కొన్నారు: " పేతురు పరిశుద్ధాత్మ అవతరించిన తర్వాత విశ్వాసం విషయంలో తప్పుకు పాల్పడడం జరిగింది"

**4.** జోవీల్ చే గొప్ప పండితుడయిన గురువుగా బిరుదును పొందిన బర్నషస్ ఈ విధంగా పేర్కొన్నారు: " ఏసు శిష్యులకు నాయకుడయిన పేతురు మరియు బర్నబాలు పరిశుద్ధాత్మ అవతరించిన తర్వాత తప్పుడు విషయాలను పేర్కొన్నారు. అదేవిధంగా యెరూషలేము చర్చి కూడా అటువంటి తప్పుకే పాల్పడింది.

**5.** జాన్ కాల్విన్ ఈ విధంగా పేర్కొన్నారు: " పేతురు చర్చిలో క్రొత్త ఆచారాన్ని కల్పించారు. అలాగే ఆయన క్రైస్తవ స్వాతంత్ర్యాన్ని ప్రమాదంలో పడవేశారు. అలాగే క్రీస్తు తరఫున ప్రాప్తమయ్యే సద్బుద్ధిని దూరంగా పారవేశారు"

**6.** మేక్డీ బర్జనస్ ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] శిష్యుల వైపుకు, ముఖ్యగా పౌలు వైపుకు తప్పుడు విషయాలను పేర్కొనడానికి సంబంధించి ఆరోపించారు.

**7.** వాయీ టేకర్ ఈ విధంగా పేర్కొన్నారు: " క్రీస్తు దివ్యారోహణ మరియు పరిశుద్ధాత్మ అవతరణ తర్వాత చర్చిలన్నింటికి చెందిన సామాన్య ప్రజలు మాత్రమే కాకుండా విశిష్ఠులు కూడా, ఇంకా చెప్పాలంటే ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] శిష్యులు కూడా ఇశ్రాయేలీయేతరులను క్రైస్తవం వైపుకు ఆహ్వానించే విషయంలో తీవ్రస్థాయిలో తప్పుకు పాల్పడ్డారు. పౌలు అయితే ఆచారాల విషయంలోనూ తప్పులకు పాల్పడ్డాడు. అటువంటి భారీ తప్పులు పరిశుద్ధాత్మ అవతరణ జరిగిన తర్వాత జరిగాయి.

**8.** జన్కీస్ తన పుస్తకంలో కాల్విన్‌కు చెందిన కొందరు అనుయాయుల పరిస్థితి గురించి ఈ విధంగా ప్రస్తావించారు: వారు ఈ విధంగా పేర్కొన్నారు: 'ఒకవేళ పౌలు జెనీవాలోకి వచ్చి కాల్విన్ కు పోటీగా ప్రసాదించినట్లయితే మేము పౌలును విసర్జించి కాల్విన్ మాటను వింటాము"

**9.** లవాథర్దస్ లూథర్ అనుయాయులలో కొందరు మహా పండితుల స్థితిగతుల గురించి వ్యాఖ్యానిస్తూ ఈ విధంగా పేర్కొన్నారు: వారు ఈ విధంగా పేర్కొన్నారు: " మేము పౌలుకు చెందిన ఏదయినా అంశం విషయంలో సందేహించేందుకు అవకాశముందేమో గానీ లూథర్ కు చెందిన ఏదయినా అంశం విషయంలో మేము సందేహించేందుకు ఎంతమాత్రమూ అవకాశం లేదు. అదేవిధంగా స్పర్గ్ చర్చికి చెందిన విశ్వాసాల పుస్తకం విషయంలోనూ సందేహించేందుకు ఎంతమాత్రం అవకాశం లేదు"



ఏయే పండితుల వ్యాఖ్యలయితే ఇక్కడ పేర్కొనబడ్డాయో వారు ప్రొటెస్టెంట్ వర్గానికి చెందిన ఉన్నత స్థాయికి చెందిన పండితులుగా ప్రఖ్యాతిగాంచారు. వారు బైబిల్ క్రొత్త నిబంధన గ్రంథంలో పేర్కొనబడినదంతా దైవం తరఫున దివ్యప్రేరణచే వ్రాయబడినట్టిది కాదని తీర్మానించారు. అదేవిధంగా ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] శిష్యులు సైతం తప్పులకు పాల్పడ్డారని వారు అంగీకరించారు.

## ఏక్‌హారన్ మరియు జర్మనీ పండితుల ఒప్పుకోలు

పండితుడయిన టోర్టన్ బైబిల్ మూలప్రమాణాల అంశంపై ఒక పుస్తకం వ్రాశారు. అది బోస్టన్ నగరంలో క్రీ.శ. 1837 లో ప్రచురితమయింది. ఆ పుస్తకం యొక్క మొదటి సంపుటిలోని పీఠికలో ఆయన ఈ విధంగా పేర్కొన్నారు:

" ఏక్‌హారన్ తన పుస్తకంలో ఈ విధంగా పేర్కొన్నారు: ' క్రైస్తవ మతం ప్రారంభంలో ఏసు స్థితిగతులపై ఒక క్లుప్తమైన పుస్తకం ఉండేది. అసలయిన సువార్త అదేనని దాని విషయంలో పేర్కొనవచ్చు. బహుశా ఆ సువార్త స్వయంగా తమ చెవులతో ఏసు బోధనలను వినియుండని, ఆయన స్థితిగతులను కళ్ళారా చూసియుండని అనుయాయుల కొరకు ఉద్దేశించబడి ఉంటుంది. ఆ సువార్త ఒక నమూనా లేదా మూస వంటిది. ఏసు స్థితిగతులన్నీ క్రమానుగతంగా అందులో పేర్కొనబడలేదు."

ఆలోచించండి. ఏక్‌హారన్ ప్రకటన ప్రకారం ఆ సువార్త నేడు వ్యాప్తిలో ఉన్న సువార్తలన్నింటికీ ఎంతో భిన్నంగా ఉండేది. ప్రస్తుతం ఉనికిలో ఉన్న సువార్తలు ఆ సువార్త వలె నమూనాలు కావు. ఎందుకంటే ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్న నాలుగు సువార్తలు ఎంతో కష్టంతో వ్రాయబడ్డాయి. వాటిలో ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] స్థితిగతుల గురించి ఇంతకు ముందు పేర్కొనబడిన నమూనా అనదగిన సువార్తలో పేర్కొనబడని విషయాలెన్నో పేర్కొనబడి ఉన్నాయి.

పైన పేర్కొనబడిన నమూనా వంటి సువార్త క్రీస్తుశకం ప్రారంభంలో ప్రాచుర్యంలోకి వచ్చిన అన్ని సువార్తలకూ మాతృక వంటిది. అదేవిధంగా మత్తయి సువార్తకు, లూకా సువార్తకు మరియు మార్కు సువార్తకు కూడా మాతృక ఈ సువార్తే. అయితే ఈ మూడు సువార్తలూ ఇతర సువార్తలన్నింటికంటే ఎక్కువ ప్రాధాన్యతను పొందాయి. ఎందుకంటే ఈ మూడు సువార్తల్లోనూ లోటుపాట్లు, లోపాలు, దోషాలు ఉన్నప్పటికీ ఆ దోషాలకు పరిష్కార మార్గాన్ని కనుగొన్నవారి చేతుల్లోకి ఈ మూడు సువార్తలు చేరాయి. వారు ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] దైవదౌత్యం తర్వాత వెలుగులోకి వచ్చిన స్థితిగతుల గురించి తెలిపే సువార్తలన్నింటినీ

నిరసించి విసర్జించారు. ఉదాహరణకు మార్సియూన్ సువార్త, ట్రైషన్ మొదలయినవారి సువార్తలు. వారు వాటిలో ఇతర పరిస్థితులకు సంబంధించిన వివరాలను సైతం నమోదు చేశారు. ఉదాహరణకు వంశావళి వివరాలు, ఏసు పుట్టుకకు సంబంధించిన స్థితిగతులు, ఏసు యవ్వనావస్థకు చేరుకోవడానికి సంబంధించిన స్థితిగతులు మొదలయినవి సైతం ఆ సువార్తలలో పేర్కొనబడ్డాయి. ఈ విషయం 'తజ్కిరహ్' పేరుతో ప్రసిద్ధమయిన సువార్త ద్వారా వెల్లడవుతుంది. దాని నుంచి జస్టిన్ ఉల్లేఖించారు. అలాగే సరన్థస్ కు చెందిన సువార్త ద్వారా కూడా ఈ విషయం వెల్లడవుతుంది. ఆ సువార్తలకు సంబంధించిన ఏయే భాగాలయితే మన వద్దకు చేరాయో వాటిని ఒకవేళ మనం పరస్పరం పోల్చి చూసినట్లయితే ఆ విధంగా అధికంగా పలు వివరాలు ఆ సువార్తలలో చేర్చబడడమనేది క్రమానుగతంగా జరిగిందనే విషయం బోధపడుతుంది. ఉదాహరణకు ఆకాశం నుంచి వినబడిన శబ్దం [512] వాస్తవానికి ఈ విధంగా ఉంది: " నీవు నా కుమారుడివి. నేను నేడు నిన్ను కన్నాను" జస్జిన్ రెండుచోట్ల ఈ విధంగానే ఉల్లేఖించడం జరిగింది. అలాగే క్లీమ్నస్ ఈ వాక్యాన్ని ఎవరికీ తెలియని ఒకానొక సువార్త నుంచి ఈ విధంగా ఉల్లేఖించారు: " నీవు నా ప్రియమైన కుమారుడివి. నేను నేడు నిన్ను కన్నాను" ఇక సాధారణ సువార్తలలో ఈ వాక్యం ఈ విధంగా పేర్కొనబడి ఉంది: " నీవు నా ప్రియకుమారుడివి. నేను నీ పట్ల ఆనందించుచున్నాను" బర్ఖష్ తన సువార్త యొక్క మొదటి అధ్యాయపు 11 వ వాక్యంలో ఈ విధంగానే ఉల్లేఖించారు. ఇక అబ్యూనీ సువార్త అయితే రెండు రకాల వాక్యాలనూ కలిపి వేస్తూ ఈ విధంగా పేర్కొన్నది: " నేను ఆనందించుచున్న ప్రియకుమారుడివి నీవు. నేను నేడు నిన్ను కన్నాను". దీనికి సంబంధించిన వివరణను ఏపీఫానిస్ అందజేసియున్నారు.

క్రైస్తవ చరిత్రకు చెందిన మూలప్రతి ఈ విధంగా క్రమానుగతంగా సువార్తలలో చేర్చబడిన విషయాలతో, లెక్కలేనన్ని మార్లు అనుసంధానించబడిన, ఆపాదించబడిన విషయాలతో వ్యత్యాసాన్నే గుర్తించలేని స్థాయిలో మిళితమయిపోయింది. ఏ వ్యక్తయితే ఈ విషయం గురించి తెలుసుకోవాలనుకుంటాడో అతడు వివిధ సువార్తలలో వివిధ రీతుల్లో పేర్కొనబడిన ఏసు

**(అథఃసూచికలు)**

512 ఈ విషయం గురించి పాఠకులచే చదవబడుతున్న ఈ గ్రంథంలోనే ఇంతకుముందే పేర్కొనడం జరిగింది.

513 ఈ విషయం గురించి 154 వ పేజీలోని 78 వ వైరుధ్యం క్రింద పేర్కొనబడిన విషయాన్ని అధ్యయనం చేయండి.



[దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] బాప్తిస్మము పొందడానికి సంబంధించిన సంఘటన [513] గురించి అధ్యయనం చేసి తెలుసుకోవచ్చు. ఆ విధంగా సువార్తలలో మార్పులూచేర్పులు, పలు విషయాల అనుసంధానం మొదలయినవాటి పర్యవసానంగా సత్యాసత్యాలు, ఏదయినా సుదీర్ఘమైన ఉల్లేఖనంలో చేర్చబడిన నిజమైన సంఘటనకు సంబంధించిన వివరాలు మరియు అసత్యమైన సంఘటనకు సంబంధించిన, వికృతిని పొందిన వివరాలు పరస్పరం ఏవిధంగా కలగలిసిపోయాయంటే దైవం రక్షించుగాక, చెప్పనలవి కాదు. ఆ తర్వాత ఆ గాథలు, వృత్తాంతాలు ఒక భాష నుంచి మరొక భాషకు ఏవిధంగా అనువదించబడుతూ పోయాయో అదేవిధంగా అవి మరింత వికృత స్వరూపాన్ని సంతరించుకుంటూపోయాయి. అప్పుడు చర్చి క్రీస్తుశకం రెండవ శతాబ్దపు అంతంలో లేదా మూడవ శతాబ్దపు ఆరంభంలో నిజమైన సువార్తను పరిరక్షించాలని, తద్వారా మున్ముందు ఉనికిలోకి వచ్చే సమాజాల వద్దకు మరియు జాతుల వద్దకు వీలయినంత స్థాయిలో నిజమైన గాథలకు సంబంధించిన సమాచారాన్ని చేరవేయాలని సంకల్పించింది. చర్చి ఆ కాలంలో వ్యాప్తిలో ఉన్న సువార్తలన్నింటిలో ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్న నాలుగు సువార్తలు విశ్వసనీయంగా, సంపూర్ణమైనవిగా గోచరించిన కారణంగా వాటినే ఎంపిక చేసింది. అయితే వాస్తవానికి మత్తయి సువార్త, మార్కు సువార్త మరియు లూకా సువార్త క్రీస్తుశకం రెండవ శతాబ్దాంతంలో లేదా మూడవ శతాబ్దపు ప్రారంభం వరకు వెలుగులోకే రాలేదు. మొట్టమొదటగా ఈ సువార్తలను గురించి ప్రస్తావించిన వ్యక్తి ఒక అంచనా ప్రకారం క్రీస్తుశకం రెండవ శతాబ్దపు కాలానికి చెందిన ఆరీనియోస్. ఆయన వాటి సంఖ్య విషయంలో పలు ఆధారాలను కూడా పేర్కొన్నారు.

ఇక ఈ విషయంలో క్రీ.శ. 216 లో క్లీమ్నస్ ఇస్కందరియానూస్ గొప్ప కృషి జరిపారు. ఆయనే ఈ నాలుగు సువార్తలూ తప్పనిసరిగా ఆమోదించబడవలసినవని ప్రకటించారు. దీనినిబట్టి చర్చి క్రీస్తుశకం రెండవ శతాబ్దాంతంలో లేదా మూడవ శతాబ్దపు ప్రారంభంలో అంతకు ముందు నుంచే ఉనికిలో ఉన్న నాలుగు సువార్తలను, వాస్తవానికి అవి ఈ సంఘటనలన్నింటి దృష్ట్యా యోగ్యమైనవి కానప్పటికీ ఆమోదింపజేసేందుకై గొప్ప స్థాయిలో కృషి జరిపినట్లుగా విదితమవుతోంది. అలాగే ప్రజలు ఈ నాలుగు సువార్తలను ఆమోదించి, స్వీకరించి, ఇతర సువార్తలన్నింటినీ విసర్జించాలని కూడా చర్చి కోరుకున్నది.

ఒకవేళ చర్చి అంతకు ముందరి ప్రసంగీకులకు వారి ప్రసంగాలకు ధృవీకరణగా లభ్యమయి ఉన్న మూల సువార్త ప్రతిని ప్రక్షిప్తాల నుంచి, మార్పులూచేర్పుల నుంచి సురక్షితం కావించి ఉన్నట్లయితే, యోహాను సువార్తను కూడా దానితో పాటు చేర్చుకొని ఉన్నట్లయితే రాబోయే తరాలు చర్చికి ఎంతగానో కృతజ్ఞతలు తెలుపుకొని ఉండేవి. అయితే చర్చికి ఆ విధంగా

చేయడం ఎందుకు సాధ్యం కాలేదంటే అప్పుడు ప్రక్షిప్తానికి అతీతమైన ఏ సువార్త ప్రతి కూడా చర్చికి లభించలేదు. అలాగే వాస్తవిక విషయాలకు, ప్రక్షిప్తాలతో కూడిన విషయాలకు మధ్య వ్యత్యాసాన్ని కనుగొనే సాధనాలేమీ చర్చి వద్ద ఆనాడు లేవు.

ఆ తర్వాత ఏక్‌హారన్ అథఃసూచికలో ఈ విధంగా పేర్కొన్నారు:

"ప్రాచీన కాలానికి చెందిన ఎందరో పండితులకు ప్రస్తుతం మన వద్ద ఉన్న సువార్తలలోని ఎన్నో భాగాల విషయంలో సందేహాలు ఉండేవి. వారు వాటికి సంబంధించిన వివరణలను అందజేసే సామర్థ్యాన్ని కలిగియుండలేదు.''

ఆ తర్వాత ఆయన ఈ విధంగా పేర్కొన్నారు:

" మన కాలంలో ప్రచురణకు సంబంధించిన పరిశ్రమ ఉనికిలో ఉన్న కారణంగా ఏ వ్యక్తయినా ఏ పుస్తకంలోనయినా ప్రక్షిప్తానికి పాల్పడడమనేది అసాధ్యమయిపోయింది. ఆ విధంగా ఎవరయినా ప్రక్షిప్తానికి పాల్పడినట్లుగా మనం వినియుండలేదు కూడా. కానీ ఆ కాలం, అనగా ప్రచురణకు సంబంధించిన పరిశ్రమ ఉనికిలోకి రాని కాలం నేటికాలానికి పూర్తి భిన్నంగా ఉండేది. కనుక ఒకానొక సువార్త ప్రతి ఒక వ్యక్తి అధీనంలో ఉన్నప్పుడు అతడు అందులో ప్రక్షిప్తానికి పాల్పడడమనేది సులభసాధ్యమయిన విషయంగా ఉండేది. ఆ ప్రతి నుంచి పలు ప్రతులు నకలు చేయబడేవి. కనుక ఒక ప్రతి రచయిత యొక్క వాక్కునే కలిగియున్నదా? లేక ప్రక్షిప్తానికి గురయినదా? అనే విషయం తేటతెల్లమయ్యేది కాదు. ఆ ప్రతులు అజ్ఞానం కారణంగా వ్యాపిస్తూనేపోయాయి. మధ్యయుగంలో ఆ విధంగా వ్రాయబడిన ఎన్నో ప్రతులు నేటికీ నిలిచియున్నాయి. అవన్నీ ప్రక్షిప్తాలతోనూ, దోషాలతోనూ కూడిన విషయాలను కలిగియుండడంలో పరస్పరం సారూప్యతను కలిగియున్నాయి. ఎంతోమంది బోధకులు ఆ సువార్త ప్రతులు రచించబడిన కొద్దికాలానికే లేఖకులు మరియు ఆ ప్రతుల యజమానులు వాటిలో ప్రక్షిప్తానికి పాల్పడ్డారని ఎంతో తీవ్రస్థాయిలో ఫిర్యాదు చేస్తూ ఉండడాన్ని మీరు చూస్తూ ఉంటారు. దియోనీషస్ కు చెందిన ప్రతుల్లో వాటి నకళ్ళు వ్యాపింపజేయడానికి ముందే ప్రక్షిప్తాలకు పాల్పడడం జరిగింది.

వారు ఇంకా ఈ విధంగా ఫిర్యాదు చేస్తూ ఉంటారు: " షైతాన్ (సాతాను) శిష్యులు ఆ పుస్తకాలలో (సువార్తలలో) మాలిన్యాన్ని చేర్చివేశారు, కొన్ని విషయాలను తొలగించివేశారు, కొన్ని విషయాలను తమ తరపు నుంచి చేర్చివేశారు.''

ఈ సాక్ష్యం ప్రాతిపదికన పరిశుద్ధ గ్రంథాలు సురక్షితంగా లేవనే విషయం తేటతెల్లమయిపోయింది. ఆ కాలానికి చెందిన ప్రజలు ప్రక్షిప్తాలకు పాల్పడే అలవాటును కలిగియుండనప్పటికీ అవి ప్రక్షిప్తాల నుంచి సురక్షితంగా ఉండలేకపోయాయి. ఎందుకంటే ఆ కాలానికి చెందిన రచయితలు తమ గ్రంథాల చివర శాపనార్థాలను, చెడ్డవయిన ప్రమాణాలను



పేర్కొనడం జరిగింది. తద్వారా ఏ వ్యక్తీ తమ గ్రంథాలలో ప్రక్షిప్తాలకు పాల్పడకుండా ఉంటాడని వారు ఆశించారు. ఇది ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) యొక్క చరిత్ర విషయంలోనూ సంభవించింది. లేకుంటే సల్సూస్ [514] "వారు తమ సువార్తలలో మూడు సార్లు లేదా నాలుగు సార్లు లేదా అంతకంటే ఎక్కువసార్లు ప్రక్షిప్తాలకు పాల్పడ్డారు. కొన్ని సువార్తలలో వేర్వేరు సువార్తలలో వైరుధ్యాలతో ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) కు చెందిన కొన్ని స్థితిగతులకు సంబంధించిన విషయాలు ఎందుకు చేర్చబడ్డాయి?'' అని అభ్యంతరాన్ని వ్యక్తం చేసే అవసరమేముంది? ఉదాహరణకు అబ్‌యూనీ సువార్తలో ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] బాప్తిస్మం పొందడానికి సంబంధించిన స్థితిగతులన్నీ పేర్కొనబడ్డాయి. అయితే అవి మొదటి మూడు సువార్తలలో మరియు (జస్టిన్ చే ఉల్లేఖించబడిన) 'తజ్‌కిరహ్' అనే సువార్తలో వేర్వేరు చోట్ల పేర్కొనబడి ఉన్నాయి. ఈ విషయానికి సంబంధించిన వివరణను ఏపీఫానీస్ అందజేసియున్నారు''

ఆ తర్వాత ఏక్‌హారన్ మరొకచోట ఈ విధంగా పేర్కొన్నారు:

"ఎవరిలోనయితే పరిశోధించే సామర్థ్యం లేదో వారు ఈ సువార్తలు వెలుగులోకి వచ్చిన కాలం నుంచే హెచ్చుతగ్గులకు పాల్పడడంలో, ఒక అర్థాన్ని సూచించే పదం స్థానంలో వేరే అర్థాన్ని సూచించే పదాన్ని ఉంచడం వంటి కార్యకలాపాలలో నిమగ్నులయ్యారు. ఇందులో విచిత్రమేమీ లేదు. ఎందుకంటే క్రైస్తవ చరిత్ర ప్రారంభం నుంచే ప్రజలు ఒక ప్రసంగ పాఠాన్ని, తమ వద్ద సురక్షితంగా ఉన్న ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] కు చెందిన స్థితిగతులకు సంబంధించిన సమాచారాన్ని తమ జ్ఞానానికి అనుగుణంగా మార్చుకుంటూపోయే అలవాటును కలిగియుండేవారు. క్రైస్తవ సమాజపు మొదటి తరానికి చెందినవారు జారీ చేసిన ఈ నియమం రెండవ మరియు మూడవ తరంలోనూ కొనసాగింది. ఆ అలవాటు క్రీస్తుశకం రెండవ శతాబ్దంలో ఎంతగా ప్రసిద్ధి చెందిందంటే క్రైస్తవ మత వ్యతిరేకులకు కూడా ఆ విషయం తెలుసు. అందుకే సల్సూస్ క్రైస్తవ సమాజం పట్ల అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తూ వారు తమ సువార్తలలో మూడు సార్లు లేదా నాలుగు సార్లు లేదా అంతకంటే ఎక్కువసార్లు ప్రక్షిప్తాలకు పాల్పడ్డారని పేర్కొనడం జరిగింది. ఆ ప్రక్షిప్తాలు కూడా ఎటువంటివంటే వాటి కారణంగా సువార్తలలోని అంశాలు, వాటి తాత్పర్యాలు సైతం మారిపోయాయి. క్లీమ్మన్స్ కూడా ఈ విషయం గురించి ప్రస్తావిస్తూ క్రీస్తుశకం రెండవ శతాబ్దాంతంలో కొంతమంది సువార్తలలో ప్రక్షిప్తాలకు పాల్పడేవారని పేర్కొన్నారు. అటువంటి ప్రక్షిప్తాల గురించి ప్రస్తావిస్తూ ఆయన ఈ విధంగా పేర్కొన్నారు:

**(అథఃసూచికలు)**

**514** ఇతడు క్రీస్తుశకం రెండవ శతాబ్దానికి చెందిన విగ్రహారాధకుడయిన ఒక పండితుడు.

" మత్తయి సువార్త యొక్క 5 వ అధ్యాయపు 10 వ వాక్యంలో [515] ' పరలోకరాజ్యము వారిది" అనే వాక్యభాగానికి బదులు కొన్ని ప్రతుల్లో " వారు పరిపూర్ణులగుదురు " అని పేర్కొనబడి ఉంది. కొన్ని ప్రతుల్లో " వారు ఎటువంటి కష్టమూ కలుగని స్థానమును పొందెదరు" అని పేర్కొనబడి ఉంది."

ఏక్‌హారన్ యొక్క ఈ వ్యాఖ్యను ఉల్లేఖించిన తర్వాత టోర్టన్ ఈ విధంగా పేర్కొన్నారు:

" ఏ వ్యక్తీ దీనిని కేవలం ఏక్‌హారన్ అభిప్రాయంగానే భావించడు. ఎందుకంటే జర్మనీలో ఆయన పుస్తకంతో పోలిస్తే మరే పుస్తకానికీ అంతటి ప్రసిద్ధి లభించలేదు. ఆయన అభిప్రాయం సువార్తల విషయంలో ఆఖరి కాలానికి (ఆధునిక కాలానికి) చెందిన జర్మనీ పండితులలో ఎక్కువమంది కలిగియున్న అభిప్రాయానికి అనుగుణంగానే ఉంది. అదేవిధంగా సువార్తల యాథార్థ్యం పట్ల ఆరోపణలకు తావిచ్చే విషయాలకు సంబంధించి కూడా ఆయన అభిప్రాయం వారి అభిప్రాయాలకు అనుగుణంగానే ఉంది."

అయితే టోర్టన్ సువార్త సమర్థకుడయిన కారణంగా ఏక్‌హారన్ వ్యాఖ్యను ఉల్లేఖించిన తర్వాత దానిని ఖండించారు. ఇందులో విచిత్రమేమీ లేదు. ఆయన రచనలను అధ్యయనం చేసినవారికి ఈ విషయం గుప్తంగా ఉండజాలదు. అయినప్పటికీ ఆయన ఈ సువార్తలలో క్రింద పేర్కొనబడిన 7 చోట్ల పేర్కొనబడిన వాక్యాలు ప్రక్షిప్తాలు, చేర్చబడినట్టివి. అవి సువార్తల కూర్పుకర్తలకు సంబంధించినవి కావు.

**1.** తన గ్రంథం యొక్క 53 వ పేజీలో ' మత్తయి సువార్తలోని మొదటి రెండు అధ్యాయాలు మత్తయి వ్రాసినవి కావు' అనే విషయానికి సంబంధించిన వివరణను అందజేశారు.

**2.** 63 వ పేజీలో ఈ విధంగా ఆయన ఈ విధంగా పేర్కొన్నారు: " మత్తయి సువార్త యొక్క 27 వ అధ్యాయంలో పేర్కొనబడిన ఇస్కరియోతు యూదా కు సంబంధించిన సంఘటన [516] విషయానికొస్తే 3 వ వాక్యం నుంచి 10 వ వాక్యం వరకు పేర్కొనబడిన విషయం పూర్తిగా అసత్యమైనది. అది తర్వాత కల్పించబడి చేర్చబడిన విషయం.

**(అథఃసూచికలు)**

515 పూర్తి వాక్యం ఈ విధంగా ఉంది: **" నీతి నిమిత్తము హింసింపబడువారు ధన్యులు; పరలోకరాజ్యము వారిది "** (మత్తయి సువార్త, 5 : 10)



**3.** అదేవిధంగా మత్తయి సువార్త యొక్క 27 వ అధ్యాయంలో 52 వ మరియు 53 వ వాక్యాలు కూడా తర్వాత కల్పించి చేర్చబడినట్టివి. [517]

**4.** 70 వ పేజీలో ఆయన ఈ విధంగా పేర్కొన్నారు: " మార్కు సువార్త యొక్క 16 వ అధ్యాయంలోని 12 వాక్యాలు, అనగా 9 వ వాక్యం నుంచి 20 వ వాక్యం వరకు ఉన్నవి కల్పిత వాక్యాలు [518]

**5.** 89 వ పేజీలో ఆయన ఈ విధంగా పేర్కొన్నారు: " లూకా సువార్త యొక్క 22 వ అధ్యాయంలోని 43 వ మరియు 44 వ వాక్యాలు కల్పిత వాక్యాలు [519]

**6.** 84 వ పేజీలో ఆయన ఈ విధంగా పేర్కొన్నారు:

" యోహాను సువార్త యొక్క 5 వ అధ్యాయపు 3 వ మరియు 4 వ వాక్యాలు కల్పితమైనవి.

**(అథఃసూచికలు)**

516 అనగా ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] ను బంధింపజేసిన తర్వాత ఇస్కరియోతు యూదా ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడడం, పొలాన్ని అమ్మివేయడానికి సంబంధించిన సంఘటన (ఈ సంఘటన విషయంలో సువార్తల్లో చోటుచేసుకున్న వైరుధ్యం గురించి పాఠకులచే చదవబడుతున్న ఈ గ్రంథం యొక్క 2 వ ప్రకరణంలో '100 వ వైరుధ్యం' క్రింద పేర్కొనబడి ఉంది. దానిని అధ్యయనం చేయగలరు).

517 **" సమాధులు తెరవబడెను; నిద్రించిన అనేకమంది పరిశుద్ధుల శరీరములు లేచెను. వారు సమాధులలో నుండి బయటికి వచ్చి ఆయన లేచిన తరువాత పరిశుద్ధ పట్టణములో ప్రవేశించి అనేకులకు అగుపడిరి "** (మత్తయి సువార్త, 27: 52, 53) మరిన్ని వివరాల కొరకు ఇదే గ్రంథం యొక్క 3 వ ప్రకరణంలోని '59 వ తప్పు' క్రింద పేర్కొనబడిన విషయాలను అధ్యయనం చేయగలరు.

518 ఈ వాక్యాలలో ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] మరణించిన తర్వాత తిరిగి బ్రతికి లేవడానికి (క్రైస్తవుల విశ్వాసం ప్రకారం) సంబంధించిన సంఘటనల గురించి ప్రస్తావించబడి ఉంది. వాటిలో ఎన్నో తప్పులు చోటుచేసుకొని ఉన్నాయి. మరిన్ని వివరాల కొరకు ఇదే గ్రంథం యొక్క 2 వ ప్రకరణంలోని '90 వ వైరుధ్యం' క్రింద పేర్కొనబడిన విషయాలను అధ్యయనం చేయగలరు.

ఈ వాక్యాలు క్రింద పేర్కొనబడుతున్నాయి:

**" ఆయా సమయములకు దేవదూత కోనేటిలో దిగి నీళ్ళు కదలించుట కలదు [520] . నీరు కదిలింపబడిన పిమ్మట మొదట ఎవడు దిగునో వాడు ఎట్టి వ్యాధిగలవాడైనను బాగుపడును, "** (యోహాను సువార్త, 5: 3, 4)

**7.** 88 వ పేజీలో ఆయన ఈ విధంగా పేర్కొన్నారు:

---

**(అథఃసూచికలు)**

519 ఈ వాక్యాలలో ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] శిలువ వేయబడడానికి (క్రైస్తవుల విశ్వాసం ప్రకారం) ముందు రోజు రాత్రి ఒలీవల కొండకు వెళ్ళడానికి సంబంధించిన సంఘటన గురించి పేర్కొనబడి ఉంది. ఈ వాక్యాలలో ఈ విధంగా చెప్పబడింది:

**" అప్పుడు పరలోకము నుండి యొక దూత ఆయనకు కనబడి ఆయనను బలపరచెను. ఆయన వేదన పడి మరింత ఆతురముగా ప్రార్థన చేయగా ఆయన చెమట, నేల పడుచున్న గొప్ప రక్తబిందువుల వలె ఆయెను "** (లూకా సువార్త, 22: 43, 44)

అయితే హోరన్ ఈ వాక్యాన్ని సరియైనదిగా, దానిని తొలగించడాన్ని తప్పుగా పేర్కొన్నారు. పాఠకులచే చదవబడుతున్న ఈ గ్రంథం యొక్క ఆఖరి సంపుటంలోని 6 వ అధ్యాయంలో ' ఏడవ విషయం' అనే మకుటం క్రింద పేర్కొనబడిన విషయానికి గాను మేము పొందుపరిచిన అథఃసూచికలో ఈ వాక్యాల గురించి విపులంగా చర్చించియున్నాము. దానిని తప్పకుండా అధ్యయనం చేయగలరు. (మౌలానా ముహమ్మద్ తఖీ ఉస్మానీ సాహెబ్, అథః సూచికల కూర్పుకర్త)

520 పూర్తి వాక్యం ఈ విధంగా ఉంది: **" ఆయా సమయములకు దేవదూత కోనేటిలో దిగి నీళ్ళు కదలించుట కలదు . నీరు కదిలింపబడిన పిమ్మట మొదట ఎవడు దిగునో వాడు ఎట్టి వ్యాధిగలవాడైనను బాగుపడును. గనుక ఆ మంటపములలో వ్యాధిగ్రస్తులు, గుడ్డివారు, కుంటివారు, ఊచకాలు చేతులు గలవారు, గుంపులుగా పడియుండిరి "**

బేతెస్ద అనే ఆరోగ్యాన్ని ప్రసాదించేదిగా ప్రసిద్ధి గాంచిన కోనేరు గురించి ఈ వాక్యాలలో పేర్కొనబడింది.



" యోహాను సువార్త యొక్క 21 వ అధ్యాయపు 24 వ మరియు 25 వ వాక్యాలు కల్పితమైనవి. [521]

విస్పష్టమైన విషయమేమిటంటే ఈ ఏడు చోట్ల పేర్కొనబడిన వాక్యాలు, అనగా టోర్టన్ దృష్టిలో కల్పితమైన, తర్వాతి కాలంలో చేర్చబడినట్టి వాక్యాలు దైవం తరపున దివ్యప్రేరణచే వ్రాయబడినవి ఎంతమాత్రం కాజాలవు. ఆ తర్వాత ఆయన 610 వ పేజీలో ఈ విధంగా పేర్కొన్నారు:

" లూకా ఉల్లేఖించిన అద్భుత కార్యాల వివరణలో ఉల్లఖనాపరమైన అసత్యం మిళితమయిపోయింది. లేఖకుడు కవిత్వ ధోరణితో అతిశయోక్తితో దానిని చేర్చివేశాడు. అయితే ఆ కాలంలో సత్యాసత్యాలను గుర్తించడమనేది ఎంతో కష్టసాధ్యమయిన విషయం"

మరి ఏ వివరణ అయితే కవిత్వ ధోరణిలో అతిశయోక్తితో చేర్చబడిందో అది దైవం తరపున దివ్యప్రేరణచే వ్రాయబడినదిగా ఎలా పరిగణించబడగలదు?

మేము చెప్పేదేమిటంటే ఏక్‌హారన్ వ్యాఖ్య ద్వారా ఏ విషయమయితే ప్రస్ఫుటమవుతుందో, సువార్తల విషయంలో ఆఖరి కాలానికి (ఆధునిక కాలానికి) చెందిన జర్మనీ పండితులలో ఎక్కువమందికి ప్రియమైన అభిప్రాయం ఏదయితే ఉన్నదో అది నాలుగు విషయాలతో కూడుకొని ఉన్నది:

**1.** నిజమైన సువార్త కనుమరుగయిపోయింది.

**2.** ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్న సువార్తలలో సత్యమయిన, అసత్యమయిన రెండు రకాల ఉల్లేఖనాలూ ఉన్నాయి.

**3.** ఈ సువార్తలలో ప్రక్షిప్తాలు కూడా చోటుచేసుకున్నాయి. విగ్రహారాధకులయిన పండితులలో సల్సూస్ క్రీస్తుశకం రెండవ శతాబ్దంలో క్రైస్తవులు తమ సువార్తలలో మూడు పర్యాయాలు లేదా నాలుగు పర్యాయాలు లేదా అంతకంటే ఎక్కువసార్లు మార్పులూచేర్పులకు పాల్పడ్డారని, చివరకు అందులోని అంశాలు సైతం మారిపోయాయని గగ్గోలు పెట్టడం జరిగింది.

---

**(అథఃసూచికలు)**

521 ఇందులో అసాధారణమైన రీతిలో అతిశయోక్తి ఉంది. ఈ వాక్యాలకు సంబంధించిన మరిన్ని వివరాల కొరకు ఇదే గ్రంథంలోని 2 వ ప్రకరణంలో '81 వ వైరుధ్యం' క్రింద పేర్కొనబడిన విషయాన్ని అధ్యయనం చేయగలరు.

**4.** క్రీస్తుశకం రెండవ శతాబ్దాంతంలో లేదా మూడవ శతాబ్దారంభానికి ముందు ఈ నాలుగు సువార్తలకు సంబంధించిన సమాచారమే ఎవరి వద్దా లేదు.

మొదటి విషయంలో వారి అభిప్రాయానికి చేరువలోనే లీక్లర్క్, కోబ్ , మైకేల్స్, సనక్ మరియు యత్‌మిరోమార్ష్ ల అభిప్రాయం కూడా ఉంది. ఎందుకంటే వారు ఈ విధంగా పేర్కొన్నారు: " బహుశా మత్తయి, మార్కు, లూకా ల వద్ద హిబ్రూ భాషలో వ్రాయబడిన ఒక్క ప్రతి మాత్రమే ఉంది. అందులో ఏసు [దైవప్రవక్త హజ్‌రత్ ఈసా (అ)] స్థితిగతుల గురించి పేర్కొనబడి ఉంది. ఆ ప్రతి ద్వారానే వారు తమ సువార్తలలో ఉల్లేఖించి ఉంటారు. మత్తయి అయితే ఎక్కువగా అందులో నుంచి ఉల్లేఖించడం జరిగింది. మార్కు మరియు లూకా అందులో నుంచి కొంచెం ఉల్లేఖించారు. ఈ విషయానికి సంబంధించిన వివరణను హోరన్ క్రీ.శ. 1822 లో ప్రచురించబడిన తన వ్యాఖ్యాన గ్రంథం యొక్క నాల్గవ సంపుటి యొక్క 295 వ పేజీలో అందజేశారు. అయితే ఆయనకు వారి అభిప్రాయం నచ్చలేదు. అయితే ఆయనకు నచ్చకపోవడం వల్ల మాకు జరిగే నష్టమేమీ లేదు.

## దినవృత్తాంతములు గ్రంథం విషయంలో గ్రంథవహుల ఒప్పుకోలు

పండితుడయిన టోర్టన్ బైబిల్ మూలప్రమాణాల అంశంపై ఒక పుస్తకం వ్రాశారు. అది బోస్టన్ నగరంలో క్రీ.శ. 1837 లో ప్రచురితమయింది. ఆ పుస్తకం యొక్క మొదటి సంపుటిలోని పీఠికలో ఆయన ఈ విధంగా పేర్కొన్నారు:

'గ్రంథవహులు (క్రైస్తవులు మరియు యూదులు) బైబిల్ పాతనిబంధన గ్రంథంలోని దినవృత్తాంతములు మొదటి గ్రంథాన్ని, దినవృత్తాంతములు రెండవ గ్రంథాన్ని హజ్‌రత్ ఉజైర్ (అ) (ఎజ్రా) దైవప్రవక్తలయిన హజ్‌రత్ హజ్జా (అ) [హగ్గయి] మరియు హజ్‌రత్ జకరియ్యా (అ) [జెకర్యా] తోడ్పాటుతో వ్రాసారనే విషయంలో ఏకాభిప్రాయాన్ని కలిగియున్నారు. కనుక ఈ రెండు గ్రంథాలు ముగ్గురు దైవప్రవక్తల రచనగా భావించాలి. వాస్తవానికి దినవృత్తాంతములు మొదటి గ్రంథంలో ఎన్నో తప్పులు ఉన్నాయి. అందుకే గ్రంథవహులకు చెందిన ఇరువర్గాల వారూ (అనగా యూదులు మరియు క్రైస్తవులు) ఈ విధఃగా పేర్కొన్నారు:

" రచయిత సంస్కారలేమి కారణంగా 'కుమారుడు' అని పేర్కొనబడవలసిన చోట 'మనవడు' అని, 'మనవడు' అని పేర్కొనబడవలసిన చోట 'కుమారుడు' అని పేర్కొనబడింది."

వారు ఇంకా ఈ విధంగా పేర్కొన్నారు:



" హజ్‌రత్ ఉజైర్ (అ) (ఎజ్రా) ఈ గ్రంథాలను వ్రాయడం జరిగింది. అయితే ఆయనకు వారిలో కొందరు కుమారులో మనుమలో కూడా తెలియదు. అలాగే హజ్‌రత్ ఉజైర్ (అ) (ఎజ్రా) కు వంశావళికి సంబంధించి ఏ పత్రాలయితే లభ్యమయ్యాయో, వేటి నుంచయితే ఆయన ఉల్లేఖించేవారో అవన్నీ లోపభూయిష్ఠమైనవి. అదేవిధంగా ఆయనకు తప్పొప్పుల వ్యత్యాసాన్ని గుర్తించే జ్ఞానం లేకుండాపోయింది."

ఈ విషయం గురించి పాఠకులకు ఇదే గ్రంథం యొక్క రెండవ అధ్యాయంలో లక్ష్యం-1 ద్వారా మరింత విశదంగా తెలుస్తుంది. దీనినిబట్టి ఆ దైవప్రవక్తలు ఈ గ్రంథాన్ని దైవప్రేరణ ద్వారా వ్రాయడం జరగలేదని విదితమవుతోంది. లేకుంటే లోపభూయిష్ఠమైన వంశావళి పత్రాలపై నమ్మకముంచవలసిన అవసరం ఎందుకు ఏర్పడేది? అలాగే వారి ద్వారా తప్పులు ఎందుకు జరిగేవి? వాస్తవానికి గ్రంథవహుల దృష్టిలో ఈ గ్రంథానికి, ఇతర గ్రంథాలకు నడుమ వ్యత్యాసమేమీ లేదు.

అలాగే ఏవిధంగానయితే క్రైస్తవుల దృష్టిలో దైవప్రవక్తలు పాపకార్యాలకు అతీతులు కావడం తప్పనిసరి కాదో అదేవిధంగా రచనాపరంగా తప్పులకు అతీతుల కావడం కూడా వారి దృష్టిలో తప్పనిసరి కాదు. పర్యవసానంగా ఈ గ్రంథాలు దైవం తరఫున దివ్యప్రేరణచే వ్రాయబడ్డాయనే విషయం నిరూపితం కాలేదు.

ఈ ప్రకరణంలో మేము ఏదయితే వ్యాఖ్యానించామో దాని ద్వారా ప్రస్ఫుటమయిన విషయమేమిటంటే క్రైస్తవులలో ఎవరయినా ఈ రెండు గ్రంథాలలో నుంచి ( అనగా పాతనిబంధన గ్రంథం మరియు క్రొత్త నిబంధన గ్రంథం) ఏ గ్రంథం విషయంలోనయినా లేదా వాటిలో ప్రస్తావించబడిన సంఘటనలలో ఏదయినా సంఘటన విషయంలో అవి దైవం తరఫున దివ్యప్రేరణచే వ్రాయబడ్డాయని ప్రకటించేందుకు లేదా నిరూపించేందుకు సాహసించలేరు.

## ఈ గ్రంథాల విషయంలో ముస్లింల విశ్వాసాలు

ఈ నాలుగు ప్రకరణాల గురించి వ్రాసిన తర్వాత మేము చెప్పేదేమిటంటే అసలయిన తౌరాతు గ్రంథం మరియు అసలయిన ఇంజీల్ (సువార్త) గ్రంథం ఆఖరి దైవప్రవక్త అయిన హజ్‌రత్ ముహమ్మద్ (స) ప్రభవించడానికి ముందే ప్రపంచం నుంచి కనుమరుగయిపోయాయి. నేటికాలంలో వీటిపేరుతో ఏ రెండు గ్రంథాలయితే ఉనికిలో ఉన్నాయో అవి కేవలం చరిత్ర గ్రంథాల స్థాయిని మాత్రమే కలిగియున్నాయి. వాటిలో సత్యమయిన మరియు అసత్యమయిన రెండు రకాల గాథలూ పేర్కొనబడి ఉన్నాయి. నిజమైన తౌరాతు గ్రంథం మరియు నిజమైన ఇంజీల్ (సువార్త) గ్రంథం ఆఖరి దైవప్రవక్త హజ్‌రత్ ముహమ్మద్ (స) జీవితకాలంలోనూ ఉనికిలోనే ఉన్నాయని, ఆ తర్వాత వాటిలో ప్రక్షిప్తాలు చోటుచేసుకున్నాయనే విషయాన్ని మేము ఎంతమాత్రం

అంగీకరించము. ఇక పౌలు వ్రాసిన పత్రికలు మొదలయినవాటి విషయానికొస్తే ఒకవేళ అవి నిజంగానే పౌలుచే వ్రాయబడిన పత్రికలుగానే అంగీకరించినప్పటికీ అవి మా దృష్టిలో ఆమోదయోగ్యమైనవి కాజాలవు. ఎందుకంటే మా దృష్టిలో పౌలు క్రైస్తవులకు చెందిన మొదటి తరంలో వెలుగులోకి వచ్చిన అసత్యవాదులలో ఒకడు, అతడు క్రైస్తవుల దృష్టిలో ఎంతటి పరిశుద్ధుడయినప్పటికీ. మేము అతడి మాటను ఒక రూకకు సైతం కొనుగోలు చేసేందుకు సిద్ధంగా లేము.

ఇక ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] దివ్యారోహణం కావించిన తర్వాత మిగిలియున్న ఆయన శిష్యుల విషయానికొస్తే వారి పట్ల మేము మంచి అభిప్రాయాన్ని కలిగియున్నాము. అయితే వారు దైవప్రవక్తలనే విషయాన్ని మేము అంగీకరించము. వారి వ్యాఖ్యల స్థాయి మా దృష్టిలో ముజ్‌తహిదీన్‌ల (దైవగ్రంథమయిన ఖుర్ఆన్ మరియు హదీసుల వెలుగులో ధార్మిక అంశాలను పరిశోధనాత్మకంగా వెలికితీసే సత్యశోధకులు) మరియు సజ్జనుల వ్యాఖ్యల స్థాయి వంటిది. వాటిలో తప్పులు దొర్లేందుకు అవకాశముందని మేము భావిస్తాము.

క్రీస్తుశకం రెండవ శతాబ్దం వరకు సమీప ప్రమాణం (సువార్తలలో పేర్కొనబడిన ఏదయినా విషయం ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] ద్వారా సమీప ఆధారంతో నిరూపించబడడం) లేకపోవడం, మూల హిబ్రూ భాషలో వ్రాయబడిన అసలయిన మత్తయి గ్రంథం కనుమరుగయిపోవడం, కేవలం దాని అనువాద గ్రంథం మాత్రమే మిగిలిపోవడం, ఆ గ్రంథ కూర్పుకర్త ఎవరో సైతం నేటివరకు నిశ్చయంగా తెలియకపోవడం, అందులో ప్రక్షిప్తాలు చోటుచేసుకోవడం మొదలయిన కారణాల రీత్యా వాటిలో పేర్కొనబడిన వాక్కుల పట్ల విశ్వాసం పూర్తిగా తొలగిపోయింది.

మూడవ కారణం కూడా ఉంది. అదేమిటంటే ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] కాలానికి చెందిన ప్రజలు ఆయన వాక్కుల భావాన్ని తరచుగా అర్థం చేసుకోలేకపోయేవారు. ఈ విషయం గురించి పాఠకులకు త్వరలోనే వివరంగా తెలియజేయబడుతుంది.

ఇక లూకా మరియు మార్కు అనే వ్యక్తుల విషయానికొస్తే వారు ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] శిష్యులు కారు. అలాగే వారిపై దైవం తరఫు దివ్యవాణి అవతరిస్తుందనే విషయానికి గాను ఏ పటిష్ఠమైన ఆధారమూ లేదు. మా (ముస్లింల) దృష్టిలో తౌరాతు గ్రంథమనేది దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) పై దైవం తరఫున అవతరింపజేయబడిన గ్రంథం. అలాగే ఇంజీల్ గ్రంథం అనేది దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) పై దైవం తరఫున అవతరింపజేయబడిన గ్రంథం. పవిత్ర ఖుర్ఆన్ లోని 'అల్ బఖరహ్ ' అనే సూరహ్‌లో ఒకచోట



ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" వలఖద్ ఆతైనా మూసల్ కితాబ "**

**అనువాదం : " మరియు నిస్సందేహంగా మేము మూసాకు గ్రంథాన్ని (అనగా తౌరాతు గ్రంథాన్ని) ప్రసాదించాము "**

పవిత్ర ఖుర్ఆన్ లోని 'అల్ మాయిదహ్ ' అనే సూరహ్‌లో దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) గురించి ఈ విధంగా పేర్కొనబడింది:

**" వ ఆతైనాహుల్ ఇంజీల "**

**అనువాదం : " మరియు మేము ఆయనకు ఇంజీల్ ను ప్రసాదించాము "**

పవిత్ర ఖుర్ఆన్ లోని 'మర్యమ్ ' అనే సూరహ్‌లో స్వయంగా దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) యొక్క వాక్కును ప్రస్తావిస్తూ ఈ విధంగా పేర్కొనబడింది:

**" వ ఆతానియల్ కితాబ "**

**అనువాదం : " మరియు అల్లాహ్ నాకు గ్రంథాన్ని (అనగా ఇంజీల్ ను) ప్రసాదించాడు"**

పవిత్ర ఖుర్ఆన్ లోని 'అల్ బఖరహ్' మరియు 'ఆలి ఇమ్రాన్' అనే సూరహ్‌లలో ఈ విధంగా పేర్కొనబడింది:

**" వమా ఊతియ మూసా వ ఈసా "**

**అనువాదం : " మరియు మూసా (అ) మరియు ఈసా (అ) కు ఇవ్వబడినవి (అనగా తౌరాతు మరియు ఇంజీల్ గ్రంథాలు)**

ఇక ప్రస్తుతం బైబిల్‌లో ఉన్న దినవృత్తాంతములు మరియు పత్రికలు ఎంతమాత్రం ఖుర్ఆన్‌లో పేర్కొనబడిన తౌరాతు మరియు ఇంజీల్ గ్రంథాలు కావు. కనుక అవి తప్పనిసరిగా ఆమోదించబడవలసిన గ్రంథాలు కావు. ఇంకా చెప్పాలంటే ఆ రెండింటి విషయంలోనూ, పాతనిబంధన లోని గ్రంథాలన్నింటి విషయంలోనూ ఆదేశమేమిటంటే వాటిలోని ఏ ఉల్లేఖనాన్నయితే ఖుర్ఆన్ ధృవీకరిస్తుందో అది నిశ్చయంగా ఆమోదయోగ్యమైనది. ఒకవేళ ఖుర్ఆన్ దానిని అసత్యమైనదిగా నిర్ధారించినట్లయితే నిశ్చయంగా అది తిరస్కరించదగినది.

ఒకవేళ వాటిలోని ఏ విషయాల పట్లయినా ఖుర్‌ఆన్ ఏమీ వ్యాఖ్యానించకుండా మౌనం వహించినట్లయితే మేము కూడా వాటి విషయంలో మౌనం వహిస్తాము. అనగా మేము వాటిని సత్యమైనవిగా ధృవీకరించము, అసత్యమైనవిగా పేర్కొంటూ తిరస్కరించము.

పవిత్ర ఖుర్‌ఆన్ లోని 'అల్ మాయిదహ్ ' అనే సూరహ్‌లో సర్వ సృష్టికర్త అయిన అల్లాహ్ తన ఆఖరి ప్రవక్త అయిన హజ్రత్ ముహమ్మద్ (స) ను సంబోధిస్తూ ఈ విధంగా పేర్కొన్నాడు:

**" వ అన్‌జల్‌నా ఇలైకల్ కితాబ బిల్ హఖ్ఖి ముసద్దిఖల్ లిమా బైన యదైహి మినల్ కితాబి వ ముహైమినన్ అలైహ్ "**

**తర్జుమా : " మరియు (ఓ ప్రవక్తా!) మేము మీ వైపుకు ఈ గ్రంథాన్ని సత్యంతో కూడినదిగా, తనకు పూర్వపు గ్రంథాలను ధృవీకరించేదిగా, వాటిని సంరక్షించేదిగా చేసి పంపాము"**

'మఆలిముత్తన్‌జీల్ ' అనే గ్రంథంలో ఈ వాక్యానికి గాను ఈ క్రిందివిధంగా వ్యాఖ్యానం అందజేయబడింది:

" ఇబ్నె జరీజ్ పేర్కొన్నట్లుగా ఖుర్‌ఆన్ తనకు పూర్వపు గ్రంథాలకు సంరక్షిణిగా ఉండడమంటే భావం గ్రంథవహులు ఏదయినా విషయాన్ని తమ గ్రంథం నుంచి వ్యాఖ్యానించినట్లయితే ఖుర్‌ఆన్ ఒకవేళ దానిని ధృవీకరించినట్లయితే మీరూ దానిని ధృవీకరించండి, ఒకవేళ ఖుర్‌ఆన్ దానిని ధృవీకరించనట్లయితే మీరు దానిని అసత్యమైనదిగా భావించండి. సఈద్ బిన్ ముసయ్యిబ్ (ర) మరియు జిహాక్ (ర) లు దీనికి 'తీర్పు చేసేది' అనే అర్థాన్ని గ్రహించగా, ఖలీల్ (ర) 'సంరక్షిణి' మరియు 'పర్యవేక్షిణి' అనే అర్థాలను గ్రహించారు. అన్నింటికీ సారాంశం ఒక్కటే. అదేమిటంటే ఏ గ్రంథం యొక్క సత్యసంధత విషయంలోనయితే ఖుర్‌ఆన్ సాక్ష్యం పలుకుతుందో నిస్సందేహంగా అది దైవగ్రంథంగా పరిగణించబడుతుంది. అలా కాని గ్రంథం దైవగ్రంథంగా పరిగణించబడజాలదు"

'తఫ్‌సీరె మజ్‌హరీ' అనే ఖుర్‌ఆన్ వ్యాఖ్యాన గ్రంథంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

" ఒకవేళ ఖుర్‌ఆన్‌లో ఆ విషయానికి సంబంధించిన ధృవీకరణ లభ్యమయిన పక్షంలో మీరు కూడా దానిని సత్యమైనదిగా భావించండి. ఒకవేళ ఖుర్‌ఆన్ దానిని అసత్యమైనదిగా నిర్ధారిస్తూ



తృణీకరించినట్లయితే మీరు కూడా దానిని అసత్యమైనదిగా భావించండి. ఒకవేళ ఖుర్‌ఆన్ ఆ విషయంలో మౌనం వహించినట్లయితే మీరు కూడా ఆ విషయంలో మౌనం వహించండి. ఎందుకంటే ఆ విషయంలో సత్యానికీ అవకాశముంది, అసత్యానికీ అవకాశముంది"

ఇమామ్ బుఖారీ (ర) ఒక హదీసును హజ్రత్ ఇబ్నె అబ్బాస్ (రజి) ఉల్లేఖనం ద్వారా 'కితాబుష్షహాదాత్ ' లో ప్రమాణంతో సహా పేర్కొన్నారు. అలాగే 'కితాబుల్ ఇత్‌తిసామ్' లోనూ మరొక స్థిరమైన ప్రమాణం ద్వారా ఉల్లేఖించారు. అలాగే 'కితాబుర్రద్ద్ అలల్ జహ్‌మియహ్' లోనూ మూడవ స్థిరమైన ప్రమాణం ద్వారా ఉల్లేఖించారు.

.... మేము ఆ హదీసును చివరి రెండు గ్రంథాల ద్వారా ఇక్కడ ఉల్లేఖిస్తున్నాము. 'కితాబుల్ ఇత్‌తిసామ్' లో ఖస్‌తలానీ (ర) ఈ హదీసు గురించి వ్యాఖ్యానిస్తూ వ్రాసిన విషయాన్ని కూడా ఈ హదీసుతో పాటే ఇక్కడ పేర్కొంటున్నాము [522] : -

**" మీరు గ్రంథవహులను (అనగా యూదులను మరియు క్రైస్తవులను) ఏదయినా ధర్మశాస్త్రీయ ఆదేశం గురించి ఎందుకు వాకబు చేస్తారు? (భావమేమిటంటే మీరు ఆ విధంగా వాకబు చేయకూడదు) వాస్తవానికి హజ్రత్ ముహమ్మద్ (స) పై అవతరింపజేయబడిన మీ గ్రంథమయిన ఖుర్‌ఆన్ తాజా గ్రంథం. అది అల్లాహ్ తరఫున ఇప్పుడిప్పుడే అవతరింపజేయబడింది. కనుక ఎవరిపైనయితే అవతరింపజేయబడిందో ఆయన దృష్టిలో సరిక్రొత్తది, స్వభావ రీత్యా ప్రాచీనమైనది. దానిని మీరు స్వచ్ఛమైన రీతిలో పఠిస్తారు, అనగా అందులో బాహిరమైన విషయమేదీ మిళితమవలేదు. అలాగే అందులో తౌరాతు మరియు ఇంజీల్ గ్రంథాలలో వలె ప్రక్షిప్తాలకు, మార్పులూచేర్పులకు అవకాశం లేదు.**

**(అథఃసూచికలు)**

**522** ఈ హదీసు యొక్క అరబీ మూలంలో కుండలీకరణాల (బ్రాకెట్ల) నడుమ హదీసు యొక్క మూలవాక్యాలు పేర్కొనబడ్డాయి. అవి తప్ప మిగిలినవన్నీ ఖస్‌తలానీ (ర) అందజేసిన వివరణలు. ఇక ఇక్కడ పొందుపరచబడిన తెలుగు అనువాద పాఠంలో గీత గీయబడిన వాక్యాలు మూల హదీసుకు అనువాద వాక్యాలు. మిగిలినవన్నీ అల్లామహ్ ఖస్‌తలానీ (ర) అందజేసిన వివరణలు మరియు వ్యాఖ్యలకు సంబంధించిన వాక్యాలు.

( మౌలానా ముహమ్మద్ తఖీ ఉస్మానీ (ర) - అథఃసూచికల కూర్పుకర్త )

**గ్రంథవహులు, అనగా యూదులు మొదలయినవారు తౌరాతును మార్చివేసారని, స్వహస్తాలతో దానిని వ్రాసి అది అల్లాహ్ తరఫున అవతరింపజేయబడినదని వారు పేర్కొని తద్వారా అందుకు గాను హీనమైన ప్రతిఫలాన్ని తమ కొరకు సిద్ధపరచుకున్నారనే విషయాన్ని అల్లాహ్ మీకు తెలియజేసి ఉన్నాడు. మీకు లభ్యమయిన ఉన్న ఖుర్‌ఆన్ మరియు సున్నత్‌ల జ్ఞానం మిమ్మల్ని ఆ విధంగా వారిని వాకబు చేయడం నుంచి వారించడం లేదా? లేదు. దైవసాక్షిగా! మేము వారిలో ఎవరినీ మీ కొరకు అవతరింపజేయబడిన గ్రంథం విషయంలో వాకబు చేస్తుండగా చూడలేదు. మరి మీరయితే మరింత శ్రేష్ఠమైన రీతిలో వారిని ప్రశ్నించకుండా, వాకబు చేయకుండా ఉండాలి.**

అలాగే 'కితాబుర్రద్ద్ అలల్ జహ్మియహ్' గ్రంథంలో ఈ హదీసు సారాంశం ఈ క్రిందివిధంగా పేర్కొనబడి ఉంది:

“ ఓ ముస్లింలారా! మీరు గ్రంథవహులను ఏదయినా విషయంలో ఎందుకు ప్రశ్నిస్తారు? వాస్తవానికి మీ వద్ద ఉన్న గ్రంథం దైవంచే మీ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) పై అవతరింపజేయబడింది. అది (పదం లేదా అవతరణ ప్రకారం అల్లాహ్ తరఫున సమాచారమిచ్చే రీత్యా) తాజా అయిన, సరిక్రొత్త గ్రంథం. అది పూర్తిగా స్వచ్ఛమైనది. అందులో మరే ఇతర విషయమూ ఎంతమాత్రం మిళితమయి లేదు. గ్రంథవహులు దైవగ్రంథాలలో ప్రక్షిప్తాలకు పాల్పడ్డారని, స్వహస్తాలతో వాటిని వ్రాసి అవి దైవం తరఫున ప్రభవింపజేయబడ్డాయని పేర్కొని తద్వారా అందుకు గాను హీనమైన ప్రతిఫలాన్ని తమ కొరకు సిద్ధపరచుకున్నారనే విషయాన్ని అల్లాహ్ తన గ్రంథంలో తెలియజేసి ఉన్నాడు. మీక్షు ఏ జ్ఞానమయితే చేరియున్నదో అది మిమ్మల్ని వారిని ప్రశ్నించకుండా (వాకబు చేయకుండా) వారించడం లేదా? (వారించడానికి సంబంధించిన ప్రమాణాలు దాని వైపుకు ఔపచారికంగా ఉన్నాయో అదేవిధంగా అందులో చేరడానికి సంబంధించిన ప్రమాణాలు జ్ఞానం వైపుకు అదేరీతిలో ఔపచారికంగా ఉన్నాయి. లేదు. దైవసాక్షిగా! మీ కొరకు అవతరింపజేయబడినదాని విషయంలో మిమ్మల్ని వాకబు చేసే ఏ వ్యక్తినీ మేము వారిలో చూడలేదు. మరి మీరు అవి ప్రక్షిప్తాలకు గురయినవిగా ఎరిగినప్పటికీ వారిని ఎందుకు ప్రశ్నిస్తారు ? (వాకబు చేస్తారు?) ”

'కితాబుల్ ఇత్‌తిసామ్ ' గ్రంథంలో కఅబ్ అహ్‌బార్ విషయంలో హజ్రత్ ముఆవియహ్ (రజి) యొక్క వాక్కు ఈ విధంగా పేర్కొనబడి ఉంది:



“ వారు గ్రంథవహుల ద్వారా హదీసులను ఉల్లేఖించేవారందరిలో కెల్లా ఆయన గొప్ప సత్యసంధులయినప్పటికీ ఆయనలో మేము అసత్యాన్ని గుర్తించాము”

దీనికి భావమేమిటంటే కొన్ని సందర్భాలలో ఆయన తాను పేర్కొనే అంశం విషయంలో ఎందుకు తప్పుకు పాల్పడడం జరుగుతుందంటే వారి (గ్రంథవహులకు చెందిన) గ్రంథాలు ప్రక్షిప్తాలకు గురయినట్టివి, మార్పులూచేర్పులకు గురయినట్టివి. అందుకే ఆయన వైపుకు అసత్య విషయాన్ని ఆపాదించడం జరుగుతుంది. అంతేగానీ ఆయన అసత్యవాది అయిన కారణంగా కాదు. ఎందుకంటే వాస్తవానికి ఆయన (రజి) దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) సహచరుల దృష్టిలో సజ్జనుడయిన యూదు పండితునిగా పరిగణించబడేవారు. ఆయన గురించి “ అయినప్పటికీ ఆయనలో మేము అసత్యాన్ని గుర్తించాము” అనే వాక్యభాగం విస్పష్టమైన రీతిలో దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) సహచరులు గ్రంథవహులకు చెందిన గ్రంథాలు ప్రక్షిప్తాలకు గురయినట్లుగా విశ్వసించేవారని తెలియజేస్తోంది. ఏ ముస్లిం అయితే ఆ తౌరాతు గ్రంథాన్ని మరియు ఇంజీల్ గ్రంథాన్ని అధ్యయనం చేసి గ్రంథవహులను తిరస్కరించాడో అతడు నిశ్చయంగా ఈ రెండు గ్రంథాలను తిరస్కరించాడు. అటువంటి వ్యక్తులచే రచించబడిన ఎన్నో గ్రంథాలు నేటికీ మిగిలియున్నాయి.

'తన్‌జీల్ మిన్ హర్రఫల్ ఇన్‌జీల్' గ్రంథ రచయిత తన గ్రంథం యొక్క 2 వ అధ్యాయంలో ఆ ప్రసిద్ధ సువార్తల గురించి ఈ విధంగా పేర్కొన్నారు:

“ ఈ సువార్తలు సత్యసంధుడయిన దైవప్రవక్త ఏ గ్రంథాలయితే ఇవ్వబడి పంపబడ్డారో ఆ సత్యమైన, దైవం తరఫున అవతరింపజేయబడిన సువార్తలు కావు ”

ఆ అధ్యాయంలోనే ఆయన ఇంకా ఈ విధంగా పేర్కొన్నారు:

“ నిజమైన ఇంజీల్ (సువార్త) అయితే దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) నోటి నుంచి వెలువడినది మాత్రమే ”

ఆ తర్వాత 9 వ అధ్యాయంలో క్రైస్తవుల చెడుగుల గురించి ప్రస్తావిస్తూ ఈ విధంగా పేర్కొన్నారు:

“ ఆ పౌలు వారిని తన సున్నితమైన మోసం ద్వారా ధర్మం నుంచి పూర్తిగా తొలగించివేశాడు. ఎందుకంటే అతడు వారి బుద్ధులు ఏవిధంగానయితే ప్రేరేపించబడేందుకు యోగ్యమైన రీతిలో డొల్లగా ఉన్నట్లుగా గ్రహించాడు. అందుకే ఆ దుష్టుడు తౌరాతు చిహ్నాల

వరకు తుడిపివేశాడు"

ఆలోచించండి! ఈ సువార్తలు ఎందుకు తిరస్కరించబడుతున్నాయి? పౌలు ఎంతటి తీవ్రమైన స్థాయిలో దాడికి గురవుతున్నాడో చూడండి! నా యొక్క మరియు 'మీజానుల్ హఖ్' గ్రంథ రచయిత యొక్క ప్రసంగాలపై ఒక హిందీ పండితుడు తన తీర్పును వెలువరించారు. అది హిజ్రీశకం 1270 లో ఢిల్లీ నుంచి ఫార్శీ భాషలో ప్రచురించబడిన 'రిసాలతుల్ మునాజిరహ్' అనే గ్రంథం చివర చేర్చబడింది. ఆయన పలువురు ప్రొటెస్టెంట్ వర్గానికి చెందిన పండితులు ఇతరులు తప్పుడు సమాచారాన్ని అందజేసిన కారణంగా లేదా స్వయంగా తప్పుడు అవగాహనకు లోనయిన కారణంగా ముస్లింలు ఈ తౌరాతు గ్రంథాన్ని మరియు ఇంజీల్ గ్రంథాన్ని తిరస్కరించరని ప్రకటిస్తూ ఉండడాన్ని గమనించారు. దానితో ఈ విషయంలో ఢిల్లీకి చెందిన ఇస్లామీయ పండితులను వాకబు చేయడం సముచితమని ఆయన భావించారు. అప్పుడు ఆయన వాకబు చేసిన మీదట ఢిల్లీకి చెందిన ఇస్లామీయ పండితులు ఈ విధంగా సమాధానమిస్తూ ఫత్వాను వెలువరించారు: " నేడు క్రొత్త నిబంధన పేరుతో ప్రసిద్ధమయి ఉన్న సంకలన గ్రంథాన్ని మేము ఆమోదించము ఖుర్ఆన్‌లో ప్రస్తావించబడిన గ్రంథం ఇది కాదు. దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) పై అవతరించినన గ్రంథమే మా దృష్టిలో ఇంజీల్ "

ఆ ఫత్వాను పొందిన మీదట ఆయన తన తీర్పులో దానిని చేర్చివేశారు. అలాగే ప్రజలందరికీ దాని గురించి తెలిసేందుకై దానిని 'రిసాలయె మునాజిరహ్' అనే గ్రంథం యొక్క భాగంగా మార్చివేశారు. భారతదేశంలోని ఇస్లామీయ పండితులందరి ఫత్వా ఢిల్లీకి చెందిన ఇస్లామీయ పండితుల ఫత్వాకు అనుగుణంగానే ఉంది. ఎవరయితే క్రైస్తవ పండితుల గ్రంథాలను ఖండించారో, తిరస్కరించారో, వారు 'అహ్లె సున్నత్' శాఖకు చెందినవారయినా లేక షియా వర్గానికి చెందినవారయినా, ఈ అంశం విషయంలో అతి స్పష్టంగా వ్రాశారు, ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్న గ్రంథవహులకు చెందిన గ్రంథాలను తీవ్రస్థాయిలో తిరస్కరించారు.

## ఇమామ్ రాజీ (ర) వ్యాఖ్య:

ఇమామ్ రాజీ (ర) తన 'అత్ మతాలిబుల్ ఆలియహ్, కితాబున్నుబువ్వహ్' అనే గ్రంథం యొక్క 2 వ భాగం యొక్క నాల్గవ ప్రకరణంలో ఈ విధంగా పేర్కొన్నారు:

" దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) యొక్క అసలయిన ధర్మసందేశపు ప్రభావం చాలా తక్కువగా ఉండినది. ఎందుకంటే నేడు క్రైస్తవులు దేనినయితే ధర్మసందేశంగా ప్రకటిస్తున్నారో



దానిని ఆయన (అ) ఎంతమాత్రం ఇవ్వలేదు. ఎందుకంటే తండ్రి, కుమారుడు, త్రిత్వం మొదలయిన అంశాలకు సంబంధించిన విషయాలు అత్యంత నీచమైన, అసభ్యమైన అవిశ్వాసానికి చెందినట్టివి. అలాగే అవి అజ్ఞానంపై ఆధారపడినట్టివి. అటువంటి విషయాలు మహోన్నతులయిన, పాపాలకు అతీతులయిన దైవప్రవక్తకు శోభించడం సంగతి అటుంచి అత్యంత అజ్ఞానులయిన ప్రజలకు సైతం శోభించవు. దీనినిబట్టి నిశ్చయంగా దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) అటువంటి అపవిత్రమైన మతానికి సంబంధించిన బోధనను అందజేసి ఉండరని విదితమయిపోయింది. ఆయన (అ) కేవలం పరమ పవిత్రుడయిన దేవుని ఏకత్వానికి సంబంధించి మాత్రమే సందేశాన్ని అందజేసి ఉంటారు. అయితే ఆయన (అ) సందేశం ప్రస్ఫుటం కాలేదు. ఇంకా చెప్పాలంటే అజ్ఞాతంగా ఉండిపోయింది. అలాగే సత్యం వైపుకు ఆయన (అ) అందజేసిన సందేశం యొక్క ప్రభావమేదీ వెలుగులోకి రాలేదనే విషయమూ నిరూపితమయిపోయింది.

## ఇమామ్ ఖుర్తుబీ వ్యాఖ్య:

ఇమామ్ ఖుర్తుబీ తన 'కితాబుల్ అత్‌లామ్ బిమా ఫీ దీనిన్నసారా మినల్ ఫసాద్ వల్ ఔహామ్' అనే గ్రంథం యొక్క 3 వ అధ్యాయంలో ఈ విధంగా పేర్కొన్నారు:

" ఏ గ్రంథమయితే క్రైస్తవుల చేతుల్లో ఉందో, దేనికయితే వారు 'ఇంజీల్' (సువార్త) అని పేరు పెట్టేశారో అది అల్లాహ్ తన ప్రవక్త అయిన హజ్రత్ ముహమ్మద్ (స) ద్వారా ప్రస్తావించిన ఇంజీల్ (సువార్త) ఎంతమాత్రం కాజాలదు.

**" వ అన్‌జలత్తౌరాత వల్ ఇన్‌జీల మిన్ ఖబ్‌లు హుదల్లిన్నాస్ "** [523]

ఆ తర్వాత ఆయన తన ప్రకటనకు గాను ప్రమాణాన్ని ఈ విధంగా పేర్కొన్నారు:

" దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) శిష్యులు దైవప్రవక్తలూ కారు, తప్పులకు అతీతులూ కారు. ఇక ఏయే అద్భుత కార్యాలయితే వారి ద్వారా వెలువడినట్లుగా సువార్తలలో

**(అథఃసూచికలు)**

523 **తర్జుమా : " మరియు అల్లాహ్ పూర్వకాలానికి చెందిన ప్రజలకు సన్మార్గం చూపేందుకై తౌరాతు గ్రంథాన్ని మరియు ఇన్‌జీల్ గ్రంథాన్ని అవతరింపజేశాడు"** (మౌలానా ముహమ్మద్ తఖీ ఉస్మానీ సాహెబ్ - అథఃసూచికల కూర్పుకర్త)

పేర్కొనడం జరిగిందో వాటిలో ఏదీ నిరంతరాయంగా ఒక తరం నుంచి మరొక తరానికి నిరంతరాయంగా ఉల్లేఖించబడుతూ రాలేదు. అన్నీ వినబడిన విషయాల స్థాయినే కలిగియున్నాయి. అవి కూడా నిజమైనవి కావు. ఒకవేళ వాటి స్వచ్ఛతను అంగీకరించినప్పటికీ అన్ని వృత్తాంతాల విషయంలో దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) శిష్యుల సత్యసంధతను అవి నిర్ధారించజాలవు. అలాగే వారు దైవప్రవక్తలు అని కూడా నిర్ధారించజాలవు. ఎందుకంటే వారు తమను తాము దైవప్రవక్తలుగా ఎన్నడూ ప్రకటించుకోలేదు. వారు తాము దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) ప్రచారకులుగా మాత్రమే తమను తాము ప్రకటించుకున్నారు. ”

ఆ తర్వాత ఆయన ఈ విధంగా పేర్కొన్నారు:

“ ఈ చర్చ ద్వారా ప్రస్ఫుటమయిన విషయమేమిటంటే ఏ ఇంజీల్ (సువార్త) గురించయితే ప్రకటించడం జరుగుతోందో అది నిరంతరాయంగా ఒక తరం నుంచి మరొక తరానికి ఉల్లేఖించబడుతూ రాలేదు. అలాగే దానిని ఉల్లేఖించినవారు తప్పులకు అతీతులు అనే విషయానికి సంబంధించిన ఆధారమూ లభించలేదు. ఎందుకంటే దానిని ఉల్లేఖించినవారు తప్పుకు పాల్పడేందుకు అవకాశముంది. కనుక ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్న సువార్త యొక్క సత్యసంధతా ఖచ్చితంగా నిరూపించబడజాలదు, పటిష్టమైన అంచనా కూడా ఏర్పడదు. కనుక అది శ్రద్ధ చూపదగినదీ కాదు, సత్యాన్ని నిరూపించేందుకై విశ్వసనీయమైనదీ కాదు. ఈ విషయం దానిని ఖండించేందుకై మరియు అందులో ప్రక్షిప్తాలను స్వీకరించే గుణం ఉన్నదని మరియు అందులోని అంశాలు విశ్వసించదగినవిగా లేవనే విషయాన్ని నిరూపించేందుకై చాలు. అయినప్పటికీ మేము అందులోని కొన్ని ప్రదేశాల గురించి ప్రస్తావించదలుచుకున్నాము. వాటి ద్వారా వాటిని ఉల్లేఖించినవారు ఎంతటి నిర్లక్ష్యానికి పాల్పడ్డారో, వారు దానిని ఉల్లేఖించే విషయంలో ఎటువంటి తప్పులు జరిగాయో విదితమయిపోతుంది.”

ఆ తర్వాత ఆయన అటువంటి ప్రదేశాలను గురించి పేర్కొన్నారు. ఆ తర్వాత ఈ విధంగా పేర్కొన్నారు:

“ ఈ నిజమైన చర్చ ద్వారా ప్రస్ఫుటమయిపోయిన విషయమేమిటంటే ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్న తౌరాతు మరియు ఇంజీల్ గ్రంథాలను విశ్వసించలేము. కనుక ఆ రెండింటి నుంచి ఆధారాలను పేర్కొనడమనేది సరియైనది కాదు. ఎందుకంటే ఈ రెండూ నిరంతరాయంగా ఒక తరం నుంచి మరొక తరానికి ఉల్లేఖించబడుతూ రాలేదు. అలాగే రెండింటిలోనూ ప్రక్షిప్తాలు చోటుచేసుకున్నాయనేందుకు అవకాశముంది. మేము అటువంటి కొన్ని ప్రక్షిప్తాల గురించి పేర్కొన్నాము కూడా. మరి వారి (క్రైస్తవుల) దృష్టిలో మహోన్నతమైన, ఎంతగానో ప్రసిద్ధి చెందిన, గొప్ప ధార్మిక నిదర్శనాలుగా వినుతికెక్కిన రెండు గ్రంథాలలోనూ అటువంటి ప్రక్షిప్తాలు



చోటుచేసుకునేందుకు అవకాశమున్న పక్షంలో ఇక క్రైస్తవులకు చెందిన ఇతర గ్రంథాల పరిస్థితి ఏమిటో, వాటి స్థాయి ఏమిటో పాఠకులు స్వయంగా అంచనా వేయగలరు. వాస్తవానికి ఆ ఇతర గ్రంథాలు వాటి వలె ప్రసిద్ధమైనవీ కావు, దైవం వైపుకు ఆపాదించబడినట్టివీ కావు. నిశ్చయంగా నిరంతరాయంగా ఒక తరం నుంచి మరొక తరానికి ఉల్లేఖించబడుతూ రాకపోవడంలోనూ, ప్రక్షిప్తాలను స్వీకరించే విషయంలోనూ ఈ గ్రంథాలు తౌరాతు మరియు ఇంజీల్ గ్రంథాలను మించిపోయి ఉన్నాయి. ”

ఈ పుస్తకం [524] కాన్స్టాంటినోపుల్ గ్రంథాలయమయిన కోపర్లీ లో ఉంది.

## అల్లామా మఖ్రీజీ వ్యాఖ్య:

అల్లామా మఖ్రీజీ ఎనిమిదవ శతాబ్దానికి చెందినవారు. ఆయన తన చరిత్ర గ్రంథం యొక్క మొదటి సంపుటిలో ఖబతీయుల కంటే ముందు ఉనికిలో ఉన్న జాతులకు సంబంధించిన చరిత్రను గురించి తెలుపుతూ ఈ విధంగా పేర్కొన్నారు:

“ యూదులు తమ వద్ద ఉన్న తౌరాతు గ్రంథం ఎటువంటి కల్పిత విషయాలూ మిళితమవకుండా సురక్షితంగా ఉందని భావిస్తారు. అయితే అందుకు విరుద్ధంగా క్రైస్తవులు తమ వద్ద ఉన్న ‘తౌరాత్ సబ్ఈన్’ [525] గ్రంథం ఎటువంటి మార్పులూచేర్పులకు గురి కాలేదని

**(అథఃసూచికలు)**

**524** అనగా ‘కితాబుల్ అత్లామ్ బిమా ఫీ దీనిన్నసారా మినల్ ఫసాద్ వల్ ఔహామ్’ అనే గ్రంథం. ఈ గ్రంథం నుంచే పైన పేర్కొనబడిన, అల్లామా ఖుర్తుబీ (ర) కు చెందిన వ్యాఖ్యలన్నీ ఉల్లేఖించబడ్డాయి.

**525** ‘ తౌరాత్ సబ్ఈన్ ’ అంటే ప్రసిద్ధమైన ‘హఫ్తాదీ తర్జుమహ్’ (Septuagint) . ఇది బైబిల్ పాతనిబంధన గ్రంథానికి చెందిన అతి ప్రాచీనమైన గ్రీకు అనువాద గ్రంథం. దీనిని ‘హఫ్తాదీ’ అని ఎందుకు పిలుస్తారంటే క్రీస్తుపూర్వం మూడవ శతాబ్దంలో యూదుల ప్రధాన యాజకుడయిన ఎలియాజరు కోరిక మేరకు యెరూషలేము లోని 70 మంది అనువాదకులు, ఇంకా సరియైన ఉల్లేఖనం ప్రకారం 72 మంది అనువాదకులు ఇస్కందరియహ్ కు పంపబడ్డారు.. వారందరూ ఉమ్మడిగా ఈ అనువాద గ్రంథాన్ని రూపొందించారు. ఆ తర్వాత ఈ అనువాద

విశ్వసిస్తారు. అయితే యూదులు ఈ విషయంలో అందుకు విరుద్ధంగా వ్యాఖ్యానిస్తారు.[526] సామిరీ వర్గానికి చెందినవారు తమ వద్ద ఉన్న తౌరాతు గ్రందమే సత్యమైనదని, తౌరాతు గ్రంథాలుగా చలామణీలో ఉన్న తక్కిన గ్రంథాలన్నీ అసత్యమైనవిగా పేర్కొంటారు. వారి ఈ వైరుధ్యంలో అనుమానాలను, సందేహాలను నివృత్తి చేసే విషయమేదీ లేదు. పైగా మరిన్ని సందేహాలను రేకెత్తించే విషయాలే ఉన్నాయి.

సరిగ్గా ఇటువంటి వైరుధ్యాన్నే క్రైస్తవులు ఇంజీల్ విషయంలో కలిగియున్నారు. దీనికి కారణమేమిటంటే క్రైస్తవుల వద్ద నాలుగు సువార్తలు ఉన్నాయి. అవన్నీ ఒకే ప్రతిలో

**(అథఃసూచికలు)**

గ్రంథాన్నే గ్రీకు ప్రజలు తమ బైబిల్ గా ఆమోదించారు. నేటికాలంలో ఎక్కువ బైబిల్ అనువాద గ్రంథాలకు మాతృకగా ఈ అనువాద గ్రంథమే ఉన్నది. (ఎన్సైక్లోపీడియా బ్రిటానికా లోని The Septuagint అనే అంశం ఆధారంగా, సంపుటి : 20, పేజీ : 335)

526 వాస్తవానికి యూదులకు చెందిన గ్రంథం ద్వారానే ఈ అనువాద గ్రంథమూ రూపొందించబడినప్పటికీ క్రైస్తవం వెలుగులోకి వచ్చిన తర్వాత చర్చి ఈ పాతనిబంధన గ్రంథాన్ని ప్రామాణికమైన అనువాద గ్రంథంగా ఆమోదించినప్పుడు యూదులు దానికి వ్యతిరేకులుగా మారిపోయారు. (బైబిల్ హ్యాండ్‌బుక్) ఆ విధంగా యూదులు కేవలం చర్చి పట్ల శత్రుత్వంతో తిరస్కరించారో లేక నిజంగానే ఆ అనువాద గ్రంథంలో క్రైస్తవులు ప్రక్షిప్తాలకు పాల్పడ్డారో విస్పష్టంగా తెలియలేదు.

527 మరియున్ (Mareion) క్రైస్తవులకు చెందిన మార్కోనియహ్ వర్గ స్థాపకుడు. ఆయన పెంతుస్ కు చెందిన సనూప్ పట్టణంలో పుట్టారు. ప్రారంభంలో ఆయన బహుదైవారాధకుడిగా ఉండేవారు. దాదాపు క్రీ.శ. 140 లో ఆయన క్రైస్తవునిగా మారారు. దాదాపు క్రీ.శ. 144 లో ఆయన తనదయిన క్రొత్త వర్గాన్ని రూపొందించారు. ఆ వర్గం యొక్క సిద్ధాంతాలు, విశ్వాసాలు ఈ విధంగా ఉండేవి: మానవుడిని ఒక నిర్దయుడయిన, దుర్మార్గుడయిన దేవుడు సృష్టించాడు. కొంతకాలం వరకు మానవాళి సృష్టించబడి ఆయన దుర్మార్గం బారిన పడి వేధించబడ్డారు. ఆ తర్వాత న్యాయవంతుడయిన, కరుణాంతరంగుడయిన మరొక దేవుడు తన కుమారుడయిన

(మిగిలిన భాగం తరువాతి పేజీలో)



సంకలించబడ్డాయి. మొదటిది మత్తయి సువార్త, రెండవది మార్కు సువార్త, మూడవది యోహాను సువార్త అయితే నాల్గవది లూకా సువార్త. ఈ నాలుగు సువార్తలను ప్రకటించినవారిలో ప్రతి ఒక్కరూ తమ ప్రాంతంలో కొనసాగిన తమ ధర్మసందేశ ప్రచారానికి అనుగుణంగా ఒక సువార్తను రచించారు. వాటిలో ఎన్నో వైరుధ్యాలున్నాయి. చివరకు ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) గుణగణాల విషయంలోనూ, ఆయన (అ) సందేశ కార్యాన్ని నిర్వహించిన కాలం విషయంలోనూ, ఆయన (అ)కు (క్రైస్తవుల విశ్వాసం ప్రకారం) శిలువ వేయబడడానికి సంబంధించిన సమయం విషయంలోనూ, ఆయన (అ) వంశావళి విషయంలోనూ చోటుచేసుకున్న వైరుధ్యాలు భరించజాలనివి. అయినప్పటికీ మరియున్ వర్గానికి చెందినవారు [527] మరియు ఇబ్నె వీసాన్ వర్గానికి చెందినవారిలో [528] ప్రతి ఒక్కరి వద్ద ఒక్కొక్క ఇంజీల్ (సువార్త) ఉండేది. వాటిలో కొన్ని

**(అథఃసూచికలు)**

( 527 వ అథఃసూచిక తరువాయి భాగం)

ఏసును (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)ను) మానవులకు ముక్తిని ప్రసాదించేందుకై భూప్రపంచంలోకి పంపించాడు. ఏసు బోధనలను సరియైన రీతిలో ఆయన శిష్యులు సైతం అర్థం చేసుకోలేకపోయారని ఈ వర్గ స్థాపకుడు పేర్కొంటారు. కేవలం పౌలు మాత్రమే ఆయన బోధనలను సరియైన రీతిలో అర్థం చేసుకున్నారని, వాస్తవానికి పౌలును ఏసే పంపారని, ప్రజలు ఆయన (పౌలు) మాటలను సైతం తగిన రీతిలో అర్థం చేసుకోలేకపోయారని, చివరకు ఆయన కూడా నిష్క్రమించారని, అప్పుడు న్యాయవంతుడయిన దేవుడు తనను ప్రవక్తగా చేసి పంపాడని, తాను ప్రజలకు ఏసు (దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)) యొక్క మరియు పౌలు యొక్క నిజమైన సందేశాన్ని అందజేస్తున్నానని ఆయన పేర్కొన్నారు. ఆయన వ్యాప్తిలో ఉన్న బైబిల్ ప్రక్షిప్తాలకు గురయిన గ్రంథంగా విశ్వసించేవాడు. ఆయన ఒక భిన్నమైన బైబిల్‌ను రూపొందించాడు. దానిని ఆయన 'నిజమైన బైబిల్' అని పిలిచేవాడు. ఈ వర్గానికి చెందినవారు ఎక్కువగా సిరియా, పాలస్తీనా మరియు కొన్ని ప్రాచ్య ప్రాంతాలలో ఉండేవారు. క్రీ.శ. 150 నుంచి క్రీ.శ. 250 వరకు ఈ వర్గం ప్రాబల్యం ఎక్కువగా కొనసాగింది. సర్వోత్కృష్ట చర్చి కొరకు ఈ వర్గం ప్రమాదకారిగా పరిణమించింది. అయితే ఈ వర్గం తరువాతి కాలంలో బలహీనపడింది. ఏడవ శతాబ్దంలో ఈ వర్గం అంతరించిపోయింది. ( బ్రిటానికా ఎన్సైక్లోపీడియా, 'మరియున్' అనే శీర్షిక, సంపుటి : 14, పేజీ : 868 )

భాగాలు సువార్తలకు పూర్తి వ్యతిరేకంగా ఉన్నాయి. మానీ [529] సహచరుల వద్ద మరొక ప్రత్యేకమైన ఇంజీల్ (సువార్త) ఉండేది. అది క్రైస్తవుల విశ్వాసాలకు పూర్తి వ్యతిరేకంగా ఉండేది. వారు తమ వద్ద ఉన్న ఇంజీల్ (సువార్త) మాత్రమే సరియైనదని, మిగిలినవన్నీ అసత్యమైనవని ప్రకటించేవారు. వారివద్ద మరొక ఇంజీల్ (సువార్త) కూడా ఉండేది. దాని పేరు 'ఇంజీల్ అస్‌బఈన్' అది తలామస్ వైపుకు ఆపాదించబడింది. క్రైస్తవులు మరియు ఇతరులు దానిని తిరస్కరించారు. మరి గ్రంథవహుల నడుమ ఇంతటి తీవ్రస్థాయిలో వైరుధ్యమున్నప్పుడు, సత్యాసత్యాల మధ్య వ్యత్యాసాన్ని గుర్తించడమూ బుద్ధిపరంగా కష్టసాధ్యమయిపోయినప్పుడు వారు వాటి ద్వారా సత్యం వైపకు అభిముఖులవడమనేది అసాధ్యం. ఈ విషయంలో వారికి చెందిన ఏ మాట కూడా విశ్వసనీయమైనది కాజాలదు.

'కష్ఫుజ్జునూన్ అన్ అసామియుల్ కితాబ్ వల్ ఫునూన్' అనే గ్రంథ రచయిత ఇంజీల్ (సువార్త) కు సంబంధించిన అధ్యాయంలో ఈ విధంగా పేర్కొన్నారు:

" అది ఒక గ్రంథం. దానిని అల్లాహ్ తన ప్రవక్త అయిన హజ్రత్ ఈసా (అ) పై అవతరింపజేశాడు''

ఆ తర్వాత ఒక సుదీర్ఘమైన చర్చ ద్వారా ఈ నాలుగు సువార్తలు (ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్న మత్తయి, మార్కు, లూకా, యోహాను సువార్తలు) నిజమైన సువార్తలనే విషయాన్ని ఖండించి ఈ విధంగా పలికారు:

**(అథఃసూచికలు)**

528 ఇతడి జీవితచరిత్రకు, ఇతడి వర్గం కలిగియుండే విశ్వాసాలకు సంబంధించిన సమాచారమేదీ మాకు లభ్యం కాలేదు.

529 మానీ ఇరాన్ దేశానికి చెందిన ప్రసిద్ధ తత్త్వవేత్త. ఆయన మానవీ మత స్థాపకుడు. ఆయన క్రీ.శ. 216 లో జన్మించాడు. అతడు ఈ విధంగా పేర్కొనేవాడు: " దేవుడు కేవలం వెలుగుకు మాత్రమే సృష్టికర్త. ఆ వెలుగు ద్వారానే మంచి అంతా ఉద్భవిస్తుంది. ఆయన అంధకారానికి సృష్టికర్త కాడు. ఆ అంధకారం నుంచే సమస్త చెడుగులూ ఉద్భవిస్తాయి. ఈ వ్యక్తి కొంతవరకు క్రైస్తవ విశ్వాసాల పట్ల కూడా ఏకీభవించేవాడు. అలాగే ఇతడు బైబిల్ లోని కొన్ని గ్రంథాలను విశ్వసించేవాడు. ( బ్రిటానికా ఎన్‌సైక్లోపీడియా, 'Manichaeism' అనే శీర్షిక, సంపుటి : 14, పేజీ : 868 )



" దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) ఏ ఇంజీల్ (సువార్త) నయితే తీసుకొచ్చారో అది ఏకైక ఇంజీల్ మాత్రమే. అందులో వైరుధ్యంతో కూడిన విషయం ఎంతమాత్రం లేదు. ఈ క్రైస్తవులు అల్లాహ్ పై మరియు ఆయన ప్రవక్త అయిన హజ్రత్ ఈసా (అ) (ఏసు) పై అపనిందను మోపారు ''

' హిదాయతుల్ హయారా ఫీ ఉజూబతుల్ యహూదు వన్నసారా' అనే గ్రంథ రచయిత ఈ విధంగా పేర్కొన్నారు:

" యూదుల చేతుల్లో ఉన్న తౌరాతు గ్రంథంలో ఎంతటి స్థాయిలో హెచ్చుతగ్గులు, ప్రక్షిప్తాలు చోటుచేసుకున్నాయంటే జ్ఞానులకు వాటి గురించి తెలియకుండా లేదు. అటువంటి వైరుధ్యం మరియు ప్రక్షిప్తమనేది దైవప్రవక్త హజ్రత్ మూసా (అ) (మోషే) పై అల్లాహ్ అవతరింపజేసిన తౌరాతు గ్రంథంలో ఎంతమాత్రం లేదనే విషయం పట్ల వారికి విశ్వాసముంది. అలాగే దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) పై అల్లాహ్ తరఫున అవతరింపజేయబడిన ఇంజీల్ గ్రంథంలోనూ లేదు. విస్పష్టమైన విషయమేమిటంటే దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) పై అల్లాహ్ తరఫున అవతరింపజేయబడిన ఇంజీల్ గ్రంథంలో ఆయన (అ) కు శిలువ శిక్ష విధించబడడానికి సంబంధించిన సంఘటన ఎందుకు ప్రస్తావించబడి ఉంటుంది? అదేవిధంగా ఆయన (అ) పట్ల అమర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ ఆయనను అవమానించడానికి సంబంధించిన సంఘటన, అలాగే ఆయన (అ) మూడు రోజుల తర్వాత సమాధి నుంచి బ్రతికి లేవడానికి సంబంధించిన సంఘటన మొదలయిన, వాస్తవానికి క్రైస్తవ పెద్దల కల్పిత సంఘటనలు అల్లాహ్ చే దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) పై అవతరింపజేయబడిన ఇంజీల్ గ్రంథంలో ఎందుకు ప్రస్తావించబడి ఉంటాయి? ఎంతమాత్రం ప్రస్తావించబడి ఉండవు. ''

ఆ తర్వాత ఆయన ఈ విధంగా పేర్కొన్నారు:

" ఎందరో ఇస్లామీయ పండితులు ఈ హెచ్చుతగ్గుల గురించి, వైరుధ్యాల గురించి, వ్యత్యాసాల గురించి స్పష్టంగా పేర్కొన్నారు. ఒకవేళ గ్రంథ విస్తార భీతి లేనట్లయితే, వీటికంటే ప్రధానమైన, ఆవశ్యక విషయాలను గురించి ప్రస్తావించవలసిన అవసరం లేకున్నట్లయితే ఇటువంటి ఇంకా ఎన్నో ఉదాహరణలను ఇక్కడ పేర్కొనవచ్చు. ''

పాఠకులచే ప్రస్తుతం చదవబడుతున్న ఈ గ్రంథం యొక్క మొదటి అధ్యాయాన్ని ఎవరయితే అధ్యయనం చేస్తారో వారికి మా వాదం యొక్క వాస్తవికత తేటతెల్లమయిపోతుంది. ఈ అధ్యాయంలో ఈ విషయం గురించి మరింతగా వ్రాయవలసిన అవసరమయితే లేదు గానీ కొన్ని విషయాల దృష్ట్యా మరొక రెండు తప్పుల గురించి ఇక్కడ పేర్కొనడం సముచితమని నేను

భావిస్తున్నాను.

## రెండు తప్పుడు అవగాహనలు

సాధారణంగా ప్రొటెస్టెంట్ వర్గానికి చెందిన క్రైస్తవ పండితులు సామాన్య ప్రజలను మోసపుచ్చేందుకై అప్పుడప్పుడూ ఈ విధంగా ప్రకటిస్తూ ఉంటారు: “ క్రీస్తుశకం మొదటి మరియు రెండవ శతాబ్దంలో ఈ సువార్తలకు సంబంధించిన ఆధార ప్రమాణం ఉనికిలో ఉంది. ఎందుకంటే దాని ఉనికి విషయంలో రోమ్‌కు చెందిన గొప్ప క్రైస్తవ పండితుడయిన క్లీమ్సన్ మరియు ఇగ్నాషిస్ మొదలయినవారు సాక్ష్యం పలికారు. వారు ఈ రెండు శతాబ్దాలకు చెందిన క్రైస్తవ పండితులు.”

ఇక వారు ప్రకటించే రెండవ విషయం ఇది: “ మార్కు తన సువార్తను పేతురు సహకారంతో వ్రాశారు. అలాగే లూకా తన సువార్తను పౌలు సహకారంతో వ్రాశారు. పేతురు మరియు పౌలు ఇద్దరూ దైవం తరఫున దివ్యప్రేరణను పొందిన వ్యక్తులు కనుక ఈ రెండు సువార్తలు, అనగా మార్కు సువార్త మరియు లూకా సువార్త ఈ విషయం రీత్యా దైవం తరఫున దివ్యప్రేరణచే వ్రాయబడిన గ్రంథాలుగా పరిగణించబడతాయి”

## మొదటి తప్పుడు అవగాహనకు సమాధానం

మొదటి తప్పుడు అవగాహనకు ముస్లింల తరఫున సమాధానం ఇది:

“ మాకు మరియు క్రైస్తవులకు నడుమ ఆధార ప్రమాణం విషయంలో వివాదం కొనసాగుతుంది. అసలు మేము (ముస్లింలు) కోరుతున్న ఆధార ప్రమాణం 'సనదె ముత్తసిల్ ' (సమీప ఆధార ప్రమాణం). 'సమీప ఆధార ప్రమాణం' (సనదె ముత్తసిల్) అంటే ఒక విశ్వసనీయుడయిన వ్యక్తి ఒకరు లేదా కొంతమంది మాధ్యమంగా మరొక విశ్వసనీయుడయిన వ్యక్తి ద్వారా 'ఫలానా గ్రంథం ఫలానా దైవప్రవక్త సహచరుల యొక్క లేదా ఫలానా దైవప్రవక్త యొక్క రచన' అని, తాను పూర్తి గ్రంథాన్ని ఆయన నోటి ద్వారా స్వయంగా విన్నానని లేదా తనకు ఇతరులు వినిపించారని లేదా తన ముందు ఆ వ్యక్తి 'నేనే ఈ గ్రంథాన్ని రచించాను' అని పలుకుతూ నిర్ధారించడం జరిగిందని ఉల్లేఖించవలసి ఉంటుంది. అలాగే మాధ్యమంగా ఉన్న వ్యక్తి లేదా వ్యక్తులు విశ్వసనీయులయి ఉండడం కూడా తప్పనిసరి. వారిలో ఉల్లేఖనానికి సంబంధించిన షరతులన్నీ నెరవేరి ఉండడమూ తప్పనిసరి.”

ఆ తర్వాత మేము చెప్పేదేమిటంటే మేము పైన పేర్కొన్నటువంటి సమీప ఆధార



ప్రమాణం (సనదె ముత్తసిల్) క్రీస్తుశకం రెండవ శతాబ్దాంతం నుంచి లేదా మూడవ శతాబ్దారంభం నుంచి సువార్తల రచయితల వరకు క్రైస్తవుల వద్ద ఎంతమాత్రం లేదు.

మేము ఎన్నో పర్యాయాలు ఇటువంటి సమీప ఆధార ప్రమాణాన్నే (సనదె ముత్తసిల్) వారి నుంచి కోరాము. అలాగే స్వయంగా వారి ప్రమాణాలకు సంబంధించిన గ్రంథాలలో అన్వేషించాము కూడా. అయితే శోచనీయమైన విషయమేమిటంటే ఈ విషయంలో మేము విఫలమయ్యాము. ఫాదర్ ఫ్రెంచ్[530] సంవాదపు సభలో ఈ క్రిందివిధంగా పేర్కొంటూ వివశత్వాన్ని వెల్లడించారు:

“ మా వద్ద ఇటువంటి ఆధార ప్రమాణం ఎందుకు లేదంటే క్రైస్తవం యొక్క ప్రారంభపు శతాబ్దాలలో 313 సంవత్సరాల వరకు పెద్ద పెద్ద ఒడిదుడుకులు ఎదురయిన కారణంగా ఈ సమీప ఆధార ప్రమాణం రోమన్ పాస్టర్ అయిన క్లీమ్సన్ మరియు ఇగ్నాషస్ మొదలయినవారి వద్ద క్రీస్తుశకం రెండవ శతాబ్దాంతం వరకు లేకుండాపోయింది.

మేము ఏ అంచనా ప్రాతిపదికన అయితే వారు ( క్రైస్తవులు) పరిశుద్ధ గ్రంథాలను వాటి మూల రచయితల వైపుకు ఆపాదిస్తున్నారో ఆ అంచనాను వ్యతిరేకించడం లేదు. అలాగే వారు తమ గ్రంథాలను వాటి రచయితల వైపుకు కేవలం అంచనా ప్రాతిపదికన ఆపాదించడం లేదని కూడా మేము పేర్కొనడం లేదు. మేము చెప్పేదొక్కటే! కేవలం అంచనాను లేదా ఊహను ఆధార ప్రమాణంగా పేర్కొనలేము, ఆమోదించలేము. ఈ విషయం పాఠకులకు ఇదే గ్రంథంలోని రెండవ ప్రకరణం ద్వారా ఇప్పటికే విదితమయింది.

అలాగే ఈ గ్రంథాలు క్రీస్తుశకం రెండవ శతాబ్దాంతంలో లేదా మూడవ శతాబ్దపు ప్రారంభంలో ప్రక్షిప్తాలకు పూర్తిగా ఆస్కారమిచ్చే లోపభూయిష్ఠమైన రీతిలో ప్రసిద్ధి చెందాయనే విషయాన్ని సైతం మేము నిరాకరించడం లేదు. అటువంటి లోపభూయిష్ఠమైన ప్రసిద్ధిని మేము

**(అథఃసూచికలు)**

530 పాఠకులచే ప్రస్తుతం చదవబడుతున్న ఈ గ్రంథం యొక్క మూల రచయిత అయిన హజ్రత్ మౌలానా రహ్మతుల్లాహ్ సాహెబ్ కైరాన్వీ (ర) కు, ఫాదర్ ఫండర్‌కు నడుమ ప్రసిద్ధ సంవాదం జరిగినప్పుడు ఫండర్ తరఫున ఫాదర్ ఫ్రెంచ్ సహాయకునిగా నిర్ణయించబడగా మౌలానా రహ్మతుల్లాహ్ (ర) గారి తరఫున డాక్టర్ వజీర్ ఖాన్ (ర) గారు సహాయకునిగా నిర్ణయించబడ్డారు.

(మౌలానా ముహమ్మద్ తఖీ ఉస్మానీ సాహెబ్ - అథఃసూచికల కూర్పుకర్త)

అంగీకరిస్తున్నాము. ఈ విషయం ఇదే గ్రంథం యొక్క 2 వ అధ్యాయం ద్వారా త్వరలోనే పాఠకులకు విదితమవుతుంది. ఈ సందర్భంగా మేము క్లీమ్నస్ మరియు ఇగ్నాషస్ పేర్కొన్న విషయాలను సైతం ఉన్నవి ఉన్నట్లుగా ప్రస్తావించదలుచుకున్నాము. తద్వారా విషయం మరింతగా ప్రస్ఫుటమయ్యేందుకు అవకాశముంది.

## క్లీమ్నస్ లేఖ సువార్తల నుంచి గ్రహించబడిందా?

రోమ్‌కు చెందిన గొప్ప క్రైస్తవ పండితునిగా ప్రఖ్యాతిగాంచిన ఫాదర్ క్లీమ్నస్ వైపుకు ఒక లేఖ ఆపాదించబడుతుంది. అనగా ఆ లేఖను ఆయన రోమన్ చర్చి తరఫున కొరింథుకు చెందిన చర్చికి వ్రాసినట్లుగా చెప్పబడింది. ఆ లేఖ వ్రాయబడిన సంవత్సరం విషయంలో కూడా అభిప్రాయభేదాలు ఉన్నాయి. కాంటర్‌బరీ " అది క్రీ.శ. 64 వ సంవత్సరానికి మరియు క్రీ.శ. 70 వ సంవత్సరానికి నడుమ ఏదో ఒక సంవత్సరమయి ఉంటుంది " అని పేర్కొన్నారు. లీక్లర్క్ ఆ సంవత్సరం క్రీ.శ. 69 అని పేర్కొనగా, దీవాన్ మరియు తలీమేంట్ లు " క్లీమ్నస్ క్రీ.శ. 91 వరకు లేదా క్రీ.శ. 93 వరకు మతాధిపతి కాలేదు. మరి ఆ సమయం వరకు అతడు మతాధిపతి కూడా కాలేకపోయినప్పుడు క్రీ.శ. 64 లో లేదా క్రీ.శ. 70 లో ఆ లేఖలను అతడు వ్రాసేందుకు అవకాశమెక్కడిది?" అని పేర్కొన్నారు.

ప్రసిద్ధ చరిత్రకారుడయిన విలియం మూర్ ఆ లేఖ క్రీ.శ. 95 లో వ్రాయబడిందనే విషయానికి అధిక ప్రాధాన్యతనిచ్చారు. ఇక వ్యాఖ్యాత అయిన లార్డ్‌నర్ ఆ లేఖ క్రీ.శ. 96 లో వ్రాయబడిందనే విషయానికి అధిక ప్రాధాన్యతనిచ్చారు.

మేము ఈ అభిప్రాయభేదాలను సైతం విస్మరిస్తూ ఈ విధంగా పేర్కొంటున్నాము: "ఆ లేఖ వ్రాయబడిన సంవత్సరం క్రైస్తవుల వాదాల ప్రకారం ఏదిఏమయినప్పటికీ క్రీ.శ. 96 ను మాత్రం మించజాలదు. యాదృచ్ఛికంగా ఆ లేఖలోని కొన్ని వాక్యాలు ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్న నాలుగు సువార్తలలో ఒక సువార్తలోని కొన్ని వాక్యాలతో ఒకానొక అంశంలో సారూప్యతను కలిగియున్న కారణంగా క్రైస్తవులు ఆ వాక్యాలను ఆ లేఖను వ్రాసిన ఫాదర్ క్లీమ్నస్ సువార్తల నుంచే ఉల్లేఖించడం జరిగిందని గట్టిగా వాదించారు.

అయితే క్రైస్తవుల యొక్క ఈ వాదం కొన్ని కారణాల రీత్యా తప్పు: -

**1.** కొన్ని అంశాలు ఏకీభవించినంతమాత్రాన సువార్తల నుంచే అవి ఉల్లేఖించబడియుండడమనేది తప్పనిసరి ఏమీ కాదు. లేకుంటే ఎవరినయితే ప్రొటెస్టెంట్ క్రైస్తవ వర్గానికి చెందిన పండితులు



ధర్మం నుంచి మరలిపోయినవారిగా [531] పేర్కొన్నారో వారి వాదం సత్యమైనదిగా పరిగణించబడడం తప్పనిసరి అవుతుంది. ఎందుకంటే బైబిల్ లో ఉన్నతమైన నైతిక విలువలకు సంబంధించిన ఏ బోధనయితే ఉన్నదో అదంతా తత్వవేత్తల నుంచి, విగ్రహారాధకులకు చెందిన పుస్తకాల నుంచి ఉల్లేఖించబడ్డాయని వారు వాదిస్తారు. అక్సిహోమో గ్రంథ రచయిత ఈ విధంగా పేర్కొన్నారు:

" బైబిల్ లో ఉన్నత నైతిక విలువలకు సంబంధించిన బోధన ఏదయితే ఉన్నదో, దేనిపట్లయితే క్రైస్తవులు ఎక్కువగా గర్విస్తూ ఉంటారో అది పూర్తిగా క్రీస్తు పుట్టుకకు ఆరు శతాబ్దాల పూర్వం జన్మించిన కన్ఫ్యూషియస్ [532] యొక్క నీతిశాస్త్ర గ్రంథం నుంచి ఉల్లేఖించబడింది. ఉదాహరణకు ఆయన గ్రంథంలో 24 వ నీతి ఈ విధంగా పేర్కొనబడింది: " మీరు ఇతరులు మీ పట్ల ఎలా వ్యవహరించాలని ఆశిస్తారో అదేవిధంగా ఇతరులతో మీరు కూడా వ్యవహరించండి. మీకు ఈ గుణం ఆవశ్యకతే ఉంది. ఎందుకంటే ఇది అన్నిరకాల నైతిక సుగుణాలకూ మూలం వంటిది." అలాగే 51 వ నీతి ఈ విధంగా పేర్కొనబడింది : " మీ శత్రువు మరణించాలని కోరుకోకండి. ఎందుకంటే ఆ కోరిక వ్యర్థమైనది. ఎందుకంటే అతడి జీవితం దేవుని చేతుల్లో ఉంది." 53 వ నీతి ఈ విధంగా పేర్కొనబడింది: " శత్రువు పట్ల ప్రతీకారం తీర్చుకోకుండానే అభ్యంతరాన్ని వ్యక్తం చేసేందుకు అవకాశముంది. సహజమైన ఆలోచనలు ఎల్లప్పుడూ చెడ్డగా ఉండవు." ఇటువంటివే ఇంకా ఎన్నో ఉత్తమ ఉపదేశాలు భారతీయ చింతనాపరుల వాక్కులలో మనకు లభ్యమవుతాయి."

**2.** ఒకవేళ క్లీమ్నస్ ఈ సువార్తల నుంచి ఉల్లేఖించి ఉన్న పక్షంలో ఆయన ఉల్లేఖించిన అంశం

(అధఃసూచికలు)

531 అనగా తమను తాము స్వేచ్ఛాయుత భావజాలాన్ని కలిగియున్న బుద్ధివాదులుగా (Rationalists) పేర్కొనే 'లిబరలిజమ్' మద్దతుదారులు.

532 కన్ఫ్యూషియస్ (Confuciouss) నీతిశాస్త్రానికి చెందిన ప్రసిద్ధ తత్త్వవేత్త. ఈయన చైనా లోని మతంపై మరియు నీతిశాస్త్రంపై ఎంతగానో ప్రభావం చూపాడు. (జననం : క్రీ.పూ.551, మరణం : 479) ఈయనను దృష్టిలో ఉంచుకునే చైనా యొక్క ప్రాచీన జీవన తత్వం 'కన్ఫ్యూషిజమ్' గా పిలువబడుతుంది.

(మౌలానా ముహమ్మద్ తఖీ ఉస్మానీ సాహెబ్ - అధఃసూచికల కూర్పుకర్త)

పూర్తిగా మూలం ప్రకారం ఉండాలి. కానీ అలా లేదు. ఆయన ఎన్నోచోట్ల సువార్తలను వ్యతిరేకించాడు. ఈ విషయం ఆయన సువార్తల నుంచి ఉల్లేఖించలేదనే విషయాన్ని నిరూపిస్తోంది. ఒకవేళ ఆయన ఆ విధంగా ఉల్లేఖించినట్లు నిరూపితమయినప్పటికీ ఆయన ఆ నాలుగు సువార్తల నుంచి కాకుండా తన కాలంలో వ్యాప్తిలో ఉన్న సువార్తల నుంచి ఉల్లేఖించేందుకూ అవకాశముంది. అందుకే ఇక్‌హారన్ 'ఆకాశవాణి' అనే అంశం క్రింద పేర్కొనబడిన వాక్యం విషయంలో అంగీకరించారు.

**3.** ఈ వ్యక్తి ఏసు [దైవప్రవక్త హజ్‌రత్ ఈసా (అ)] శిష్యుల యొక్క శిష్యుడు. ఏసు [దైవప్రవక్త హజ్‌రత్ ఈసా (అ)] యొక్క వాక్కులు మరియు స్థితిగతుల విషయంలో అతడి అవగాహన మార్కు మరియు లూకాల అవగాహన కంటే తక్కువ కాదు. అందుకే ఆయన ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్న నాలుగు సువార్తల నుంచి (అనగా మత్తయి, మార్కు, లూకా, యోహాను సువార్తల నుంచి) ఉల్లేఖించడానికి బదులు స్వయంగా తన వద్దకు చేరిన ఉల్లేఖనాల ఆధారంగా ఉల్లేఖించి ఉండేందుకు అవకాశం ఎక్కువగా ఉంది. అయితే ఒకవేళ ఆయన స్వయంగా తాను సువార్తల నుంచి ఉల్లేఖించానని తన వాక్కులో స్పష్టంగా పేర్కొని ఉన్నట్లయితే అప్పుడు అది సత్యమైనదిగా పరిగణించబడేది. అయితే ప్రస్తుత స్థితిలో ఆయన సువార్తల నుంచి ఉల్లేఖించారనే విషయం ఎంతమాత్రం సత్యమైన విషయం కాదు. మేము ఆయన లేఖ లోని మూడు భాగాలను (త్రిత్వపు సంఖ్య దృష్ట్యా) ఇక్కడ ఉల్లేఖిస్తున్నాము:

## క్లీమ్మన్స్ లేఖ లోని మొదటి భాగం

" ఏ వ్యక్తయితే ఏసు [దైవప్రవక్త హజ్‌రత్ ఈసా (అ)] ను ప్రేమిస్తాడో అతడు ఆయన (అ) ఉపదేశాల ప్రకారం ఆచరించవలసి ఉంటుంది "

క్లీమ్మన్స్ ఈ వాక్యాన్ని యోహాను సువార్త యొక్క 14 వ అధ్యాయపు 15 వ వాక్యం ద్వారా ఉల్లేఖించారని మిస్టర్ జోన్స్ వాదిస్తారు. యోహాను సువార్తలోని ఆ వాక్యం క్రింది విధంగా ఉంది:

" మీరు నన్ను ప్రేమించినయెడల నా ఆజ్ఞలను గైకొందురు "

ఈ రెండు వాక్యాలలోని సారూప్యత దృష్ట్యా జోన్స్ ఈ వాక్యం యోహాను సువార్త నుంచే ఉల్లేఖించబడిందని వాదించారు. అయితే రెండు వాక్యాల నడుమ ఉన్న విస్పష్టమైన వ్యత్యాసాన్ని ఆయన విస్మరించారు. ఈ వాదన పూర్తిగా మొండివాదన. దీనికి సంబంధించిన



మూడు కారణాలను ఇంతకుముందే మీరు తెలుసుకొని ఉన్నారు. ఇది పూర్తిగా తప్పు. ఎందుకంటే క్లీమ్మన్స్ లేఖ వ్రాయబడిన సంవత్సరం అన్ని వ్యాఖ్యల దృష్ట్యా క్రీ.శ. 96 కంటే మించజాలదనే విషయం పాఠకులకు ఇంతకుముందే తెలియజేయబడింది. వాస్తవానికి స్వయంగా వారి అభిప్రాయం ప్రకారం యోహాను సువార్త క్రీ.శ. 98 లో వ్రాయబడింది. కనుక ఈ వాక్యం యోహాను సువార్త నుంచి ఏవిధంగా ఉల్లేఖించబడగలదు? అయితే సువార్తలు క్రీ.శ. మొదటి శతాబ్దంలోనే ఉనికిలో ఉన్నాయని నిరూపించే ఆధార ప్రమాణం ఉన్నదని నిరూపించే ఉన్మాదం ఈ అపోహకు వారిని గురిచేసింది.

హారన్ క్రీ.శ. 1824 లో ప్రచురించబడిన తన వ్యాఖ్యాన గ్రంథం యొక్క 4 వ సంపుటిలోని 307 వ పేజీలో ఈ విధంగా పేర్కొన్నారు:

" యోహాను తన సువార్తను క్రిజాస్టమ్ మరియు ఏపీఫానిస్ వంటి ప్రాచీన కాలానికి చెందిన మరియు ఆధునిక కాలానికి చెందిన క్రైస్తవ పండితులలో డాక్టర్ మిల్, ఫీహరీషీస్, లీక్లర్క్ మరియు బిషప్ టామ్‌లాయిన్ ల అభిప్రాయం ప్రకారం క్రీ.శ. 97 లో వ్రాయడం జరిగింది. అలాగే మిస్టర్ జోన్స్ అభిప్రాయం ప్రకారం క్రీ.శ. 98 లో వ్రాయడం జరిగింది."

అంతేగాకుండా సహజమైన విషయమేమిటంటే నిజమైన ప్రేమికుడు తాను ప్రేమించే వ్యక్తి యొక్క ఉపదేశం ప్రకారం ఆచరిస్తాడు. ఏ వ్యక్తయితే ఆ విధంగా ఆచరించడో అతడి ప్రేమ ప్రకటన అసత్యమైనదిగా పరిగణించబడుతుంది. వ్యాఖ్యాత అయిన లార్డ్‌నర్ ఎంతో న్యాయవంతంగా వ్యవహరిస్తూ క్రీ.శ. 1827 లో ప్రచురితమైన తన వ్యాఖ్యాన గ్రంథం యొక్క 2 వ సంపుటిలోని 40 వ పేజీలో ఈ విధంగా పేర్కొన్నారు:

" ఈ ఉల్లేఖనంలో తప్పు ఉందని నేను భావిస్తున్నాను. ఎందుకంటే క్లీమ్మన్స్ ఏసు [దైవప్రవక్త హజ్‌రత్ ఈసా (అ)] శిష్యుల సంతకాల ద్వారా, వారితో గల సహచర్యం ద్వారా ఏసు [దైవప్రవక్త హజ్‌రత్ ఈసా (అ)] పట్ల ప్రేమ ఉన్నదని ప్రకటించేవారిపై ఆయన పట్ల గల ప్రేమ ఆయన ఆదేశాలకు అనుగుణంగా నడుచుకోవడాన్ని తప్పనిసరి కావిస్తుందనే విషయం పట్ల బాగా అవగాహన గల వ్యక్తి."

## క్లీమ్మన్స్ లేఖ లోని రెండవ భాగం

క్లీమ్మన్స్ వ్రాసిన లేఖ యొక్క 13 వ అధ్యాయంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

" ఏవిధంగానయితే వ్రాయబడియున్నదో మేము ఆ విధంగానే వ్యవహరిస్తాము.

ఎందుకంటే పరిశుద్ధాత్మ ఈ విధంగా పేర్కొని ఉన్నది: ‘ బుద్ధిమంతుడయిన వ్యక్తి తన బుద్ధి పట్ల గర్వించడు’ అలాగే ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] సహనం మరియు స్థైర్యాల గురించి బోధించే సమయంలో వెలువరించిన పలుకులను గుర్తుంచుకోవాలి. అనగా ‘ మీరు ఇతరులను కరుణించండి. తద్వారా మీరు కరుణించబడే అవకాశముంది. మీరు ఇతరుల తప్పులను క్షమించండి. తద్వారా మీ తప్పులు మన్నించబడే అవకాశముంది. మీరు ఇతరులతో ఏవిధంగానయితే వ్యవహరిస్తారో అదేవిధంగా మీ పట్ల కూడా వ్యవహరించబడుతుంది. మీరు ఇతరులకు ఏవిధంగానయితే ఇస్తారో అదేవిధంగా మీకూ ఇవ్వబడుతుంది. మీరు చేసుకున్న రీతిలోనే మీరు అనుభవించడం జరుగుతుంది. మీరు ఇతరులను ఏవిధంగానయితే కరుణిస్తారో అదేవిధంగా మీరూ కరుణించబడతారు. ఏ కొలమానం ప్రకారమయితే మీరు ఇతరులకు కొలిచి ఇస్తారో అదే కొలమానం ప్రకారం మీకూ కొలిచి ఇవ్వబడుతుంది”

క్లీమ్నస్ ఈ వాక్యాలను లూకా సువార్త యొక్క 6 వ అధ్యాయపు 36 వ, 37 వ మరియు 38 వ వాక్యాల నుంచి మరియు మత్తయి సువార్త యొక్క 7 వ అధ్యాయపు 1 వ , 2 వ మరియు 12 వ వాక్యాల నుంచి ఉల్లేఖించారని క్రైస్తవులు వాదిస్తారు.

లూకా సువార్త లోని వాక్యాలు క్రింద పేర్కొనబడుతున్నాయి:

“ **కాబట్టి మీ తండ్రి కనికరము గలవాడై యున్నట్లు మీరును కనికరము గల వారైయుండుడి. తీర్పు తీర్చకుడి, అప్పుడు మిమ్మును గూర్చి తీర్పు తీర్చబడదు; నేరము మోపకుడి, అప్పుడు మీ మీద నేరము మోపబడదు; క్షమించుడి, అప్పుడు మీరు క్షమించబడుదురు; ఇయ్యుడి, అప్పుడు మీకియ్యబడును; అణచి కుదిలించి దిగజారునట్లు నిండు కొలతను మనుష్యులు మీ ఒడిలో కొలుతురు. మీరు ఏ కొలతతో కొలుతురో ఆ కొలతతోనే మీకు మరల కొలువబడునని చెప్పెను** ” (లూకా సువార్త, 6 వ అధ్యాయం, 36 వ వాక్యం నుంచి 38 వ వాక్యం వరకు)

మత్తయి సువార్త యొక్క వాక్యాలు క్రింద పేర్కొనబడుతున్నాయి:

“ **మీరు తీర్పు తీర్చకుడి, అప్పుడు మిమ్మును గూర్చి తీర్పు తీర్చబడదు. మీరు తీర్పు తీర్చు చొప్పుననే మిమ్మును గూర్చియు తీర్పు తీర్చబడును, మీరు కొలుచు కొలత చొప్పుననే మీకు కొలువబడును.** ” (మత్తయి సువార్త, 7 వ అధ్యాయం, 1 వ మరియు 2 వ వాక్యాలు)

మత్తయి సువార్త యొక్క 7 వ అధ్యాయపు 12 వ వాక్యం ఈ విధంగా ఉంది:

“ **కావున మనుష్యులు మీకు ఏమేమి చేయవలెనని మీరు కోరుదురో ఆలాగుననే మీరును వారికి చేయండి. ఇది ధర్మశాస్త్రమును ప్రవక్తల (ఉపదేశమునై) యున్నది.** ”



మత్తయి సువార్త యొక్క 7 వ అధ్యాయపు 12 వ వాక్యం ఈ విధంగా ఉంది:

“ **కావున మనుష్యులు మీకు ఏమేమి చేయవలెనని మీరు కోరుదురో ఆలాగుననే మీరును వారికి చేయండి. ఇది ధర్మశాస్త్రమును ప్రవక్తల (ఉపదేశమునై) యున్నది.** ”

# క్లీమ్నస్ లేఖ లోని మూడవ భాగం

క్లీమ్నస్ వ్రాసిన లేఖ యొక్క 46 వ అధ్యాయంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

“ దేవుడయిన ఏసు వాక్కులను గుర్తుకు తెచ్చుకోండి. ఎందుకంటే ఆయన ఈ విధంగా పేర్కొని ఉన్నాడు: ఏ వ్యక్తి నుంచయితే పాపకార్యం వెలువడిందో అతడి కొరకు గొప్ప వినాశనముంది. నా చే ఎంచబడిన వారిలో ఎవరినయినా నష్టపెట్టడంతో పోలిస్తే అతడు పుట్టకపోవడమే మేలు. నా చిన్నపిల్లలకు కష్టం కలిగించడంతో పోలిస్తే అతడు తన మెడలో తిరగలి రాయిని వేలాడదీసుకోవడం మరియు సముద్రపు సుడిలో పడి మునిగిపోవడం మేలు”

క్లీమ్నస్ ఈ వాక్యాలను మత్తయి సువార్త యొక్క 26 వ అధ్యాయపు 24 వ వాక్యం నుంచి మరియు 18 వ అధ్యాయపు 6 వ వాక్యం నుంచి, అలాగే మార్కు సువార్త యొక్క 9 వ అధ్యాయపు 42 వ వాక్యం నుంచి, అలాగే లూకా సువార్త యొక్క 17 వ అధ్యాయపు 2 వ వాక్యం ద్వారా ఉల్లేఖించారని క్రైస్తవులు వాదిస్తారు.

ఆ వాక్యాలు ఈ క్రిందివిధంగా ఉన్నాయి:

మత్తయి సువార్త యొక్క 26 వ అధ్యాయపు 24 వ వాక్యం క్రింద పేర్కొనబడుతోంది:

“ **మనుష్య కుమారుని గూర్చి వ్రాయబడిన ప్రకారము ఆయన పోవుచున్నాడు గాని యెవనిచేత మనుష్యకుమారుడు అప్పగింపబడుచున్నాడో ఆ మనుష్యునికి శ్రమ; ఆ మనుష్యుడు పుట్టకుంటే వానికి మేలని చెప్పెను** ”

మత్తయి సువార్త యొక్క 18 వ అధ్యాయపు 6 వ వాక్యం క్రింద పేర్కొనబడుతోంది:

“ **నా యందు విశ్వాసముంచు ఈ చిన్నవారిలో ఒకనిని అభ్యంతరపరచువాడెవడో వాడు మెడకు తిరుగటి రాయి కట్టబడినవాడై మిక్కిలి లోతైన సముద్రములో ముంచివేయబడుట వానికి మేలు**”

మార్కు సువార్త యొక్క 9 వ అధ్యాయపు 42 వ వాక్యం క్రింద పేర్కొనబడుతోంది:

**“ నా యందు విశ్వాసముంచు ఈ చిన్నవారిలో నొకని అభ్యంతరపరచువాడెవడో వాడు మెడకు పెద్ద తిరుగటిరాయి కట్టబడి సముద్రములో పడవేయబడుట వానికి మేలు ”**

లూకా సువార్త యొక్క 17 వ అధ్యాయపు 2 వ వాక్యం క్రింద పేర్కొనబడుతోంది:

**“ వాడీ చిన్నవారిలో ఒకనికి అభ్యంతరము కలుగజేయుట కంటె వాని మెడకు తిరుగటిరాయి కట్టబడి సముద్రములో పడద్రోయబడుట వానికి మేలు ”**

లార్డ్నర్ క్రీ.శ. 1827 లో ప్రచురించబడిన తన వ్యాఖ్యాన గ్రంథం యొక్క 2 వ సంపుటిలోని 37 వ పేజీలో క్లీమ్నస్ వ్రాసిన వాక్యాలను మరియు సువార్తలలోని వాక్యాలను పేర్కొన్న తర్వాత ఈ విధంగా పేర్కొన్నారు:

“ ప్రతి వ్యక్తీ బాగా గుర్తించగలిగేందుకై, పోల్చి చూసేందుకై నేను పలు సువార్తలలోని పదాలను ఉల్లేఖించాను. అయితే సాధారణ అభిప్రాయమేమిటంటే ఈ రచన (క్లీమ్నస్ యొక్క లేఖ) యొక్క ఆఖరిభాగం లూకా సువార్త యొక్క 17 వ అధ్యాయపు 2 వ వాక్యం ద్వారా ఉల్లేఖించబడింది. ”

క్లీమ్నస్ వ్రాసిన లేఖకు చెందిన, పైన పేర్కొనబడిన రెండు భాగాలూ ప్రస్తుత సువార్తలకు సంబంధించిన ఆధార ప్రమాణం క్రీస్తుశకం మొదటి శతాబ్దంలోనే ఉన్నదని వాదించే క్రైస్తవుల దృష్టిలో అతిపెద్దవి. అందుకే పేలీ ఈ రెండింటి ప్రస్తావనతో సరిపుచ్చారు. అయితే ఈ వాదం తప్పు. ఎందుకంటే ఒకవేళ ఆయన (క్లీమ్నస్) ఏదయినా సువార్త నుంచి ఉల్లేఖించడం జరిగిందంటే ఆయన ఆ విధంగా ఏ సువార్త నుంచయితే ఉల్లేఖించడం జరిగిందో దాని విషయంలో తప్పనిసరిగా వివరణను అందజేసేవారు. ఒకవేళ స్పష్టంగా తెలియజేయనప్పటికీ కనీసం మిగిలిన భాగాన్నయినా ఉల్లేఖించేవారు. ఒకవేళ అదీ సాధ్యపడనట్లయితే కనీసం ఉల్లేఖించబడిన విషయం అది దేని నుంచయితే ఉల్లేఖించబడిందో దానికి అర్థపరంగా అనుగుణంగా ఉండేది. అయితే వీటిలో ఏదీ నిరూపితం కాలేదు. మరి క్లీమ్నస్ సువార్తల నుంచే తన లేఖ లోని విషయాలను ఉల్లేఖించే అవకాశమెక్కడ ఉంది? విచిత్రమయిన విషయమేమిటంటే లూకాకు క్లీమ్నస్ కంటే అధిక ప్రాధాన్యతనిచ్చి క్లీమ్నస్ ఆయన నుంచి ఉల్లేఖించాడని పేర్కొనబడింది. వాస్తవానికి క్లీమ్నస్ మరియు లూకా ఇద్దరూ ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] శిష్యుల యొక్క శిష్యులే. ఇద్దరూ ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] స్థితిగతుల పట్ల ఇతరులు చెప్పగా విన్న కారణంగా అవగాహన గలవారు.

ఒకవేళ క్లీమ్నస్ ఆ విధంగా సువార్తలలో నుంచే ఉల్లేఖించారని మనం అంగీకరించినప్పటికీ



ఏవిధంగానయితే బాప్తిస్మానికి సంబంధించిన ఒకానొక విషయం ఒక అనామిక సువార్త ద్వారా ఉల్లేఖించడం జరిగిందో అదేవిధంగా ఆయన తన లేఖలోని రెండు భాగాలనూ ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్న నాలుగు సువార్తలలో నుంచి కాకుండా మరొక సువార్త ద్వారా ఉల్లేఖించి ఉంటారని చెప్పగలము. ఈ విషయం ఇక్హారన్ వాక్కు ద్వారా విదితమయింది.

పారిస్‌కు చెందిన క్రైస్తవ మతాధిపతి న్యాయవంతంగా వ్యవహరిస్తూ ఈ విధంగా తన ఒప్పుకోలును ప్రకటించారు: “ క్లీమ్నస్ ఆ సువార్తల నుంచి ఉల్లేఖించలేదు”

లార్డ్నర్ తన వ్యాఖ్యాన గ్రంథం యొక్క 2 వ సంపుటిలో ఈ రెండు భాగాల గురించి ఈ విధంగా పేర్కొన్నారు:

“ ఎవరయితే ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] శిష్యుల యొక్క శిష్యుల సహచర్యంలో లేదా సువార్తీకుల వలె మన దేవుని స్థితిగతుల పట్ల పూర్తిగా అవగాహనను కలిగియున్న, మన దేవుని యొక్క ఇతర అనుయాయుల సహచర్యంలో ఉన్నవారి రచనలను పరిశీలిస్తారో వారికి ఎన్నో సమయాల్లో పలు సందేహాలు తలెత్తుతాయి, ఆ ఉల్లేఖనం గురించి వివరణ అందజేయబడనప్పుడు. ఈ ప్రదేశంలో తలెత్తే సందేహమేమిటంటే క్లీమ్నస్ ఈ రెండు చోట్ల ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] వ్రాసిన పదాలను ఉల్లేఖిస్తున్నారా? లేక కొరింథీయులకు ఆయన, వారు ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] శిష్యుల నుంచి లేదా ఇతర శిష్యుల నుంచి విన్న వాక్కులను గుర్తు చేస్తున్నారా? అనే విషయం అర్థం కాదు. కనుక లీక్లర్క్ క్లీమ్నస్ వ్రాసిన లేఖ యొక్క మొదటి భాగానికి ప్రాధాన్యతనిస్తే పారిస్‌కు చెందిన మతాధిపతి రెండవ భాగానికి ప్రాధాన్యతనిచ్చారు.”

మొదటి మూడు సువార్తలు ఆ కాలానికి ముందే రూపొందించబడ్డాయని మేము అంగీకరిస్తున్నాము. క్లీమ్నస్ వాటి నుంచి ఉల్లేఖించే విషయానికి వస్తే అది సాధ్యమే, ఆయన రచనలోని ప్రతి పదమూ మరియు ప్రసంగపాఠం సువార్తలలోని విషయాలకు పూర్తిగా అనుగుణంగా లేనప్పటికీ. అయితే ఆయన నిజంగానే సువార్తలలో నుంచి ఉల్లేఖించారో లేదోనని పరిశోధించడం సులభమేమీ కాదు. ఎందుకంటే ఆయన (క్లీమ్నస్) సువార్తలు క్రోడీకరించబడడానికి ముందే ఈ స్థితిగతుల పట్ల బాగా అవగాహన కలవాడు. అలాగే ఏయే స్థితిగతుల పట్లయితే ఆయన అవగాహన కలిగియున్నాడో వాటి గురించి ఆ సువార్తలు క్రోడీకరించడానికి ముందరి అలవాటు ప్రకారమే సువార్తల వైపుకు అభిముఖుడవకుండానే ప్రస్తావించారు. రెండు పరిస్థితుల్లోనూ సువార్తల యాథార్థ్యం పట్ల విశ్వాసం తాజాగా మారుతుంది. ఎందుకంటే వాటి వైపుకు అభిముఖుడయ్యే పరిస్థితిలోనయితే విస్పష్టమే. రెండవ పరిస్థితిలోనూ సువార్తల ధృవీకరణ ప్రస్ఫుటమవుతుంది.

ఎందుకంటే ఆయన తన లేఖలో వాడిన పదాలు సువార్తలలోని వాక్యాలకు అనుగుణంగా ఉన్నాయి. అలాగే అవి ఎంతగా ప్రసిద్ధి చెందాయంటే ఆయనకు స్వయంగా మరియు కొరింథుకు చెందిన ప్రజలకు సైతం ఆ విషయం తెలుసు. అలాగే మనకు సువార్తల కూర్పుకర్తలు ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] సహనం మరియు సాధనకు సంబంధించి బోధించిన విషయాలకు సంబంధించిన పదాలను ఉల్లేఖించారని మనకు నమ్మకమేర్పడుతుంది. అలాగే ఈ పదాలు ఎంతో గౌరవనీయ రీతిలో భద్రపరచదగిన స్థాయిలో ఉన్నాయి, ఇక్కడ మనకు క్లిష్టత ఏర్పడినప్పటికీ. అయినప్పటికీ నా అభిప్రాయమేమిటంటే ఎక్కువమంది పండితుల అభిప్రాయం లీక్లర్క్ అభిప్రాయానికి అనుగుణంగానే ఉంటుంది. అయితే బైబిల్ క్రొత్తనిబంధన గ్రంథంలోని 'అపొస్తలుల కార్యములు' యొక్క 20 వ అధ్యాయపు 35 వ వాక్యంలో పరిశుద్ధుడయిన పౌలు ఈ క్రిందివిధంగా ఉపదేశించాడు:

**" -పుచ్చుకొనుట కంటె ఇచ్చుట ధన్యత అని ప్రభువైన యేసు చెప్పిన మాటలు జ్ఞాపకము చేసికొనవలెననియు అన్ని విషయములలో మీకు మాదిరి చూపితినని చెప్పెను. "**

పౌలు ఈ వాక్కును ఏదో ఒక లేఖ నుంచి ఉల్లేఖించలేదని, ఆయనకు మరియు ఇతరులకు తెలిసియున్న ఏసు వాక్కులనే ఆయన ఉల్లేఖించడం జరిగిందనే విషయం సాధారణంగా ఆమోదించబడిందనే విషయం పట్ల నాకు విశ్వాసముంది. అయితే ఏదయినా అంశం విషయంలో ఉల్లేఖకులు దేని వైపుకయినా అభిముఖులవడానికి సంబంధించి ఇదే విధానం ఎల్లప్పుడూ కొనసాగిందని భావించనవసరం లేదు. ఈ విధానం లేఖలు మొదలయినవాటిలోనూ ఉపయోగించబడియుండడం సాధ్యమే. యూపీకార్ప్ ఈ విధానాన్ని అవలంబించిన విషయం మాకు తెలుసు. బహుశా, ఇంకా చెప్పాలంటే ఆయన వ్రాయబడిన సువార్తల నుంచి కూడా ఉల్లేఖిస్తారనే నమ్మకముంది."

లార్డ్నర్ వ్యాఖ్య ద్వారా స్పష్టమవుతున్న విషయమేమిటంటే క్రైస్తవ పండితులకు క్లీమ్నస్ తన లేఖను ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్న సువార్తల నుంచి ఉల్లేఖించారనే విషయం పట్ల పూర్తి విశ్వాసం లేదు. ఏ వ్యక్తయితే ఆయన ఆ విధంగా సువార్తల నుంచి ఉల్లేఖించారని వాదిస్తాడో అతడు కేవలం ఊహ లేదా అంచనా ప్రాతిపదికన మాత్రమే ఆ విధంగా వాదించడం జరుగుతుంది. ఇక ఈ రెండు పరిస్థితుల్లోనూ (అనగా వ్యాప్తిలో ఉన్న సువార్తలలో నుంచి ఉల్లేఖించడం లేదా తనకు తెలిసిన విషయాలను ఉల్లేఖించడం అనే రెండు పరిస్థితులు) సువార్తల యాథార్థ్యం నిరూపితమవుతుందని పేర్కొనడం పూర్తిగా తప్పు. ఎందుకంటే ఈ విషయంలో ఒక సందేహం



తలెత్తింది. అదేమిటంటే ఏవిధంగానయితే సువార్తల ఉల్లేఖకులు ఈ అంశం విషయంలో ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] యొక్క వాక్కులను హెచ్చుతగ్గులతో ఉల్లేఖించడం జరిగిందో అదేవిధంగా ఇతర అంశాల విషయంలోనూ హెచ్చుతగ్గులతో వారు ఉల్లేఖించి ఉండేందుకు, ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] వాక్కులను యథాతథంగా ఉల్లేఖించి ఉండకపోయేందుకు అవకాశముందనే సందేహం ఇక్కడ ఉత్పన్నమయింది.

ఒకవేళ మనం ఈ విషయాన్ని ఉపేక్షించినప్పటికీ 'క్లీమ్నస్ పేర్కొన్న విషయాల ద్వారా ఆ సువార్తలలోనూ పేర్కొనబడియున్న ఈ వాక్యాలు ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] వాక్కులుగా పరిగణించబడడం తప్పనిసరి అవుతుందే గానీ సువార్తలలో పేర్కొనబడియున్న విషయాలన్నీ ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] వాక్కులుగానే పరిగణించబడడం తప్పనిసరి ఎంతమాత్రం కాజాలదు. ఎందుకంటే ఏదో ఒక వాక్కు ఆ విధంగా ప్రసిద్ధి చెందినంత మాత్రాన అన్ని వాక్కులూ ఆ విధంగా ప్రసిద్ధి చెందాలనేది తప్పనిసరి కాదు. లేకుంటే ఇతర అసత్యమైన సువార్తలన్నీ కేవలం క్లీమ్నస్ లేఖలో పేర్కొనబడిన కొన్ని వాక్యాలు వాటిలోని వాక్యాలతో సారూప్యతను కలిగియున్నాయనే ఒక్క కారణం రీత్యా సత్యమైనవిగా పరిగణించబడడం తప్పనిసరి అవుతుంది.

ఇక పోలీకార్ప్ కూడా ఈ విధానాన్ని అవలంబించారని పేర్కొనడం కూడా తప్పే.[533] ఎందుకంటే ఈయన కూడా క్లీమ్నస్ వలె ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] శిష్యుల అనుయాయి. క్లీమ్నస్ మరియు పోలీకార్ప్ ల స్థాయి ఒక్కటే. పోలీకార్ప్ సువార్తల నుంచి ఉల్లేఖించారనే విషయం నిశ్చితమవడం సంగతి అటుంచితే అత్యధిక సంభావ్యతా స్థాయిని సైతం కలిగియుండదు. ఇంకా చెప్పాలంటే పోలీకార్ప్ స్థాయి ఈ విధానాన్ని అవలంబించే సమయంలో పరిశుద్ధుడయిన పౌలు స్థాయి వంటిదయి ఉండేందుకు అవకాశముంది. [534]

---

**(అథఃసూచికలు)**

533 అనగా స్వయంగా తనకు తెలిసియున్నప్పటికీ వ్యాప్తిలో ఉన్న సువార్తల నుంచి ఉల్లేఖించడమనే విధానం.

534 అనగా ఏవిధంగానయితే పౌలు అపొస్తలుల కార్యములు యొక్క 20 వ అధ్యాయపు 35 వ

(మిగిలిన భాగం తరువాతి పేజీలో)

# ఇగ్నాషస్ లేఖలు, వాటి వాస్తవికత

ఈ విషయంలో అందరిలోకెల్లా గొప్ప సాక్షి అయిన క్లీమ్నస్ స్థాయిని విశదపరచిన తర్వాత ఇప్పుడు రెండవ సాక్షి అయిన ఇగ్నాషస్ పరిస్థితి గురించి వినండి. ఈయన కూడా ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] శిష్యుల అనుయాయి. ఈయన అంతొకియ పీఠాధిపతిగా కొనసాగారు. లార్డ్నర్ తన వ్యాఖ్యాన గ్రంథం యొక్క 2 వ సంపుటిలో ఈ విధంగా పేర్కొన్నారు:

" యూసీబీస్ మరియు జెరోమ్ లు ఇగ్నాషస్ కు చెందిన అరుదయిన లేఖలను గురించి ప్రస్తావించారు. అవి మాత్రమే కాకుండా మరికొన్ని లేఖలు సైతం ఆయనకు ఆపాదించబడ్డాయి. వాటి విషయంలో పండితులందరి ఏకాభిప్రాయమేమిటంటే అవి కల్పితమైనవి. నా అభిప్రాయం కూడా ఇదే. ఆ ఏడు లేఖలకు చెందిన రెండు ప్రతులు ఉన్నాయి. ఒకటి పెద్ద ప్రతి అయితే, రెండవది చిన్న ప్రతి. మిస్టర్ విస్టన్ మరియు ఆయన యొక్క ముగ్గురు నలుగురు అనుయాయులు తప్ప మిగిలినవారందరి అభిప్రాయమేమిటంటే పెద్ద ప్రతిలో చేర్పులు జరిగాయి, చిన్న ప్రతి దాని వైపుకు ఆపాదించబడదగినదిగా ఉంది.

నేను ఎంతో సునిశితంగా ఈ రెండింటినీ పోల్చి చూడగా నాకు ప్రస్ఫుటమయిన విషయమేమిటంటే చిన్న ప్రతినే పలు మార్పులూచేర్పుల ద్వారా పెద్దదిగా చేసివేయడం జరిగింది. అంతేగానీ పెద్ద ప్రతిని కుదించి చిన్న ప్రతిగా మార్చివేయడం జరగలేదు. ప్రాచీన కాలానికి చెందిన క్రైస్తవ పండితుల వ్యాఖ్యలు కూడా పెద్ద ప్రతి చిన్న ప్రతిగా మార్చివేయబడడం కంటే చిన్న ప్రతి చేర్పుల ద్వారా పెద్ద ప్రతిగా మార్చివేయబడిందనే అభిప్రాయానికి అనుగుణంగా ఉన్నాయి.

ఇక ఇప్పుడు చిన్న ప్రతిలోని లేఖలు నిజంగానే ఇగ్నాషస్ ద్వారా వ్రాయబడ్డాయా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ఈ విషయంలో గొప్ప వివాదం చోటుచేసుకుంది. గొప్ప గొప్ప

**(అథఃసూచికలు)**

**534** వ అథఃసూచిక తరువాయి భాగం

వాక్యం వలె సువార్తలలో లేని, అతడి వద్దకు కేవలం మౌఖిక ఉల్లేఖనాల ద్వారా చేరిన ఎన్నో వాక్కులను ఏసు [దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)] వైపుకు ఆపాదించాడో అదేవిధంగా పోలీకార్ప్ సైతం వ్యవహరించి ఉండవచ్చు.



సత్యశోధకులు ఈ విషయంలో తమ కలాల అశ్వాలను దౌడు తీయించారు. ఈ విషయానికి సంబంధించి ఇరువర్గాల రచనలను పరిశీలించిన తర్వాత ఈ ప్రశ్న నా దృష్టిలో క్లిష్టమయిపోయింది. అయితే ఈ లేఖలు యూసీబీస్ చే పఠించబడిన, ఆరీజన్ కాలంలో ఉనికిలో ఉన్న లేఖలేనని విషయం నా దృష్టిలో సుస్పష్టంగా ఉంది. ఆ లేఖల్లో ఉన్న కొన్ని వాక్యాలు ఇగ్నాషిస్ కాలానికి చెందినవిగా లేవు. కనుక ఆ వాక్యాలు చేర్చబడినట్టి వాక్యాలనే అభిప్రాయాన్ని ఏర్పరచుకోవడమే సముచితమైనది. అయితే ఆ కొన్ని వాక్యాల కారణంగా మనం అన్ని లేఖలనూ తిరస్కరిస్తున్నట్లుగా భావించనవసరం లేదు, ముఖ్యంగా ప్రతులు తగినన్ని లభ్యమవని పరిస్థితిలో మనం ఉన్న కారణంగా. ఏవిధంగానయితే ఏరీన్ 535 వర్గానికి చెందిన ఏ వ్యక్తయినా పెద్ద ప్రతిలో ప్రక్షిప్తానికి పాల్పడడం జరిగిందో అదేవిధంగా ఆ వర్గానికి చెందిన మరే వ్యక్తయినా లేదా ధర్మపరాయణుల్లో ఏ వ్యక్తయినా లేదా రెండింటిలో దేనికయినా చెందిన ఏ వ్యక్తయినా చిన్న ప్రతిలోనూ ప్రక్షిప్తానికి పాల్పడి ఉండేందుకూ అవకాశముంది. అయితే నా దృష్టిలో అటువంటి ప్రక్షిప్తం వల్ల పెద్ద నష్టమేమీ జరగలేదు.''

**వ్యాఖ్యాత అయిన పేలీ అథఃసూచికలో ఈ విధంగా పేర్కొన్నారు:**

" పూర్వం ఇగ్నాషస్ కు చెందిన మూడు లేఖల అనువాదం సుర్యానీ భాషలో లభ్యమయి ఉండేది. దానిని క్యూరీటన్ ప్రచురించారు. దాదాపు నిశ్చితమైన విషయమేమిటంటే ఆషర్చే సంస్కరించబడిన చిన్న ప్రతిలోని లేఖలలో పలు కల్పిత విషయాలు చేర్చబడ్డాయి.

క్రైస్తవ పండితుల ఈ వ్యాఖ్యలు మరియు వివరణల ద్వారా కొన్ని విషయాలు నిరూపితమవుతున్నాయి:

**1.** ఆ ఏడు లేఖలు కాకుండా మిగిలిన లేఖలన్నీ క్రైస్తవ పండితులందరి దృష్టిలో కల్పితమైనవి. కనుక ఆ లేఖలు విశ్వసనీయమైనవి కావు.

**2.** లేఖలకు చెందిన పెద్ద ప్రతి కూడా మిస్టర్ విస్టన్ మరియు ఆయనకు చెందిన కొందరు అనుయాయులు తప్ప అందరి దృష్టిలో కల్పితమైనవి, ప్రక్షిప్తాలకు గురయినట్టివి. కనుక అది

**(అథఃసూచికలు)**

**535** ఆర్యూస్‌ను అనుసరించే వర్గమే ఏరీన్ వర్గం. ఈ వర్గం యొక్క విశ్వాసాలు దేవుని ఏకత్వం వైపుకు మొగ్గుచూపుతాయి. ఈ వర్గం నేకియ కౌన్సిల్ చే బహిష్కరించబడింది.

కూడా విశ్వసనీయమైనది కాదు.

**3.** చిన్న ప్రతి అసలయినదా ? నకిలీదా? అనే విషయంలో ఎంతగానో అభిప్రాయ భేదాలు చోటుచేసుకున్నాయి. అది అసలయినదనే విషయం వైపుకూ పెద్ద పెద్ద పరిశోధకులు మొగ్గుచూపారు, నకిలీదనే విషయం వైపుకూ పెద్ద పెద్ద పరిశోధకులు మొగ్గుచూపారు. కనుక తిరస్కారుల వ్యాఖ్య ప్రకారం ఈ ప్రతి కూడా విశ్వసనీయమైనది కాదు. ఇక ఎవరయితే ఈ ప్రతిని విశ్వసిస్తారో వారి వ్యాఖ్య ప్రకారం కూడా ఇది ప్రక్షిప్తాలకు గురయినట్లుగా అంగీకరించడం మినహా మార్గాంతరం లేదు, ఆ విధంగా ప్రక్షిప్తానికి పాల్పడే వ్యక్తి ఏరీన్ వర్గానికి చెందిన ఏ వ్యక్తయినప్పటికీ లేదా ధర్మపరాయణుల వర్గానికి చెందిన ఏ వ్యక్తయినప్పటికీ లేదా రెండింటిలో ఏ వర్గానికి చెందిన వ్యక్తయినప్పటికీ. కనుక ఈ విధంగా ఈ ప్రతి కూడా విశ్వసనీయమైనది కాదు.

బలమైన అంచనా ఏమిటంటే ఈ ప్రతి కూడా కల్పితమైనదే. అది కూడా ఇతర లేఖల వలె క్రీస్తుశకం మూడవ శతాబ్దంలో కల్పించబడింది. ఇందులో విచిత్రమైన విషయం కూడా ఏమీ లేదు. ఎందుకంటే ఆ విధంగా కల్పించడమనేది క్రైస్తవం యొక్క ప్రారంభకాలంలో సమ్మతమైన చర్య మాత్రమే కాదు, చేయదగిన కార్యంగానూ పరిగణించబడేది. అందుకే దాదాపు 75 సువార్తలు మరియు పత్రికలు ఆ విధంగా రూపొందించబడ్డాయి. అవి దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ)(ఏసు) వైపుకు, ఆయన (అ) మాతృమూర్తి అయిన హజ్రత్ మర్యమ్ (అ) (మరియ) వైపుకు మరియు దైవప్రవక్త హజ్రత్ ఈసా (అ) (ఏసు) శిష్యుల వైపుకు ఆపాదించబడ్డాయి. ఆ ఏడు లేఖలు కల్పితమవడమనే విషయం విచిత్రమేమీ కాదు, పైగా పటిష్ఠమైన అంచనా ప్రకారం దాదాపు నిశ్చితమే ఏవిధంగానయితే ఇతర లేఖలు ఆయన వైపుకు ఆపాదించబడ్డాయో సరిగ్గా అదేవిధంగా లేదా ఏవిధంగానయితే ఒక వ్యాఖ్యాన గ్రంథం కల్పించబడి మేషన్ వైపుకు ఆపాదించబడిందో [536] సరిగ్గా అదేవిధంగా!

---

**(అథఃసూచికలు)**

536 'మేషన్ సువార్త' - దీనిని 'డయాటేసరన్ ఆఫ్ టాషన్ ' (Diatessaron of Tation) అని కూడా పిలుస్తారు. జీ.టీ మేన్లీ ఈ విధంగా పేర్కొన్నారు: " ఇది సిరియా చర్చి కొరకు నాలుగు సువార్తలలోని విషయాలన్నింటినీ చేర్చి రూపొందించబడినది. అయితే ఇది గ్రీకు భాషలో ఉన్నదా లేక సుర్యానీ భాషలో ఉన్నదా? అనే విషయం తెలియదు. ( 'హమారీ కుతుబె ముఖద్దసహ్',, పేజీ : 28)



ఆడమ్ క్లార్క్ తన వ్యాఖ్యాన గ్రంథానికి ముందుమాటలో ఈ విధంగా పేర్కొన్నారు:

" టేషన్ వైపుకు ఆపాదించబడిన ఆ మూల వ్యాఖ్యాన గ్రంథం కనుమరుగయిపోయింది. ప్రస్తుతం ఆపాదించబడుతున్న గ్రంథం పండితుల దృష్టిలో సందేహాస్పదమైనది. వారు దాని విషయంలో సందేహించడమనేది సముచితం "

ఒకవేళ మనం ఈ లేఖలు ఇగ్నాషస్ చే వ్రాయబడినవని భావించినప్పటికీ ఒనగూడే ప్రయోజనమేదీ లేదు. ఎందుకంటే వాటిలో కల్పిత విషయాలు ఉన్నప్పుడు ఆ లేఖల పట్ల విశ్వసనీయత తొలగిపోయింది. అలాగే ఏవిధంగానయితే వాటిలోని కొన్ని వాక్యాలు క్రైస్తవుల దృష్టిలో చేర్చబడినట్టివో అదేవిధంగా వాటిలోని ఏ వాక్యాలనయితే కొంతమంది ప్రామాణికమైనవిగా పేర్కొంటారో ఆ వాక్యాలు సైతం కల్పితమైనవి అయ్యేందుకు అవకాశముంది. అటువంటి విషయాలు వారి సహజమైన అలవాట్ల రీత్యా విచిత్రమైనవేమీ కావు. యూసీబీస్ తన చరిత్ర గ్రంథం యొక్క నాల్గవ సంపుటిలోని 23 వ అధ్యాయంలో ఈ విధంగా పేర్కొన్నారు:

" కొరింథు యొక్క పీఠాధిపతి అయిన దేవ్నీషస్ ఈ విధంగా పేర్కొన్నారు: 'నేను మిత్రుల విజ్ఞప్తి మేరకు కొన్ని లేఖలు వ్రాశాను. అయితే షైతానుల (సాతానుల) అనుయాయులు వాటిని చెడ్డ విషయాలతో నింపివేశారు, కొన్ని వాక్కులను మార్చివేశారు, కొన్ని విషయాలను చేర్చారు. దానివల్ల నాకు మరొక దుఃఖం కలిగింది. అందుకే ఒకవేళ ఏ వ్యక్తయినా మన దేవునికి చెందిన పరిశుద్ధ గ్రంథాలలో ఏవయినా కల్పిత విషయాలను చేర్చాలని సంకల్పించినట్లయితే అది విచిత్రమేమీ కాదు. ఎందుకంటే వాటి స్థాయిలో లేని గ్రంథాల విషయంలో వారు ఆ విధంగా సంకల్పించి ఉన్నారు "

ఆడమ్ క్లార్క్ తన వ్యాఖ్యాన గ్రంథానికి ముందుమాటలో ఈ విధంగా పేర్కొన్నారు:

" ఆరీజన్ కు చెందిన పెద్ద పెద్ద రచనలు కనుమరుగయిపోయాయి. ఆయనకు చెందిన ఎన్నో వ్యాఖ్యాన గ్రంథాలు మిగిలి ఉన్నాయి కూడా. అయితే వాటిలో దృష్టాంతపరమైన, ఊహాత్మక వ్యాఖ్యానమే ఎక్కువగా ఉంది. అది వాటిలో ప్రక్షిప్తాలు చోటుచేసుకొని ఉంటాయనేందుకు గొప్ప నిదర్శనం. "

అధ్యాపకుడయిన మీకాయీల్ మషాఖహ్ ప్రొటెస్టెంట్ వర్గానికి చెందిన క్రైస్తవ పండితులలో ఒకరు. ఆయన తన అరబీ గ్రంథమయిన ' ఉజూబతుల్ ఇంజీలీన్ అలా అబాతీలుత్తఖ్లీదీన్ ' యొక్క మొదటి భాగపు 10 వ అధ్యాయంలో ఈ విధంగా పేర్కొన్నారు:

" ఇక వారు తమ పూర్వీకులయిన పెద్దల వాక్కులలో ప్రక్షిప్తాలకు పాల్పడే విషయానికొస్తే

ముందుగా మేము దానికి సంబంధించిన ఆధార ప్రమాణాలను పేర్కొంటాము. తద్వారా మా స్థితి వ్యతిరేకుల స్థితి వంటిది కాకుండా ఉంటుంది. అనగా మా వాదాలు సైతం వారి వాదాల వలె ఆధారరహితమైనవి కాకుండా ఉంటాయి. ఆ తర్వాత మేము చెప్పేదేమిటంటే యోహన్నా ఫముజ్జాహిబ్ [537] వైపుకు ఆపాదించబడిన, చర్చిలలో పఠించబడే అఫ్షీన్ గ్రంథం యొక్క ఒక ప్రతి ఒక వర్గం వద్ద ఉండి అందులో ఉండే విషయం మరొక వర్గం వద్ద ఉన్న దాని ప్రతిలో ఉండే విషయంతో సారూప్యతను కలిగియుండదు. ఎందుకంటే రోమీయుల దృష్టిలో ఇందులో దేవుడిని తన పవిత్ర ఆత్మను[538] రొట్టె మరియు ద్రాక్షరసంపై అవతరింపజేసి ఆ రెండింటినీ మాంసంగానూ, రక్తంగానూ మార్చివేసి దివ్యమైనవిగా మలచివేయవలసిందిగా విజ్ఞప్తి చేయడం జరుగుతుంది. అయితే కేథొలిక్ వర్గీయుల దృష్టిలో ఇందులో రొట్టె మరియు ద్రాక్షరసంపై అవి విప్లవాత్మక రూపాన్ని సంతరించుకునేందుకై పవిత్ర ఆత్మను పంపవలసిందిగా పేర్కొనబడుతుంది. కానీ ఆఖాయె మెక్సీమూస్ నాయకునిగా కొనసాగిన కాలంలో ప్రజలు అందులో మార్పులూచేర్పులకు పాల్పడ్డారు. పైగా వారు ఈ విధంగా పేర్కొనసాగారు: “ మార్పుకు లోనయ్యే, మార్పును స్వీకరించే ఈ రెండూ ఎందుకు పారిపోయాయంటే [539] రోమీయులు వారికి వ్యతిరేకంగా ఈ విప్లవం ఈ కారణంగా సంభవించిందని ప్రకటించారు. అయితే సుర్యాన్ కేథొలిక్ వారి ప్రకారం ఈ విధంగా ప్రకటించబడుతుంది: “ నీ పవిత్ర ఆత్మను నీ క్రీస్తు యొక్క శరీరపు మర్మమయినటువంటి రొట్టె మీదికి పంపు.” ఇందులో విప్లవానికి సంబంధించిన విషయాన్ని

**(అథఃసూచికలు)**

**537** ఇది క్రీజాస్టమ్ (Chrysostome) అనే వ్యక్తి యొక్క అరబీ నామం. ఎంతో గొప్ప ప్రసంగీకుడయిన కారణంగా ఆయనను ‘ఫముజ్జాహిబ్’ (బంగారు నోరు) అని పిలవడం జరుగుతుంది. ఈయన క్రీ.శ. 347 లో అంతొకియలో జన్మించాడు. ఈయన కొంతకాలం పాటు కాన్‌స్టాంటినోపుల్ పీఠాధిపతిగా కూడా కొనసాగాడు. క్రీ.శ. 407 లో ఆయన మరణం సంభవించింది. (అల్ మున్‌జిద్ ఫిల్ ఉలూమ్)

**538** ఇందులో ‘ప్రభువు భోజనము’ (అషాయె రబ్బానీ) అనే ఆచారానికి సంబంధించిన ప్రస్తావన ఉంది. ఈ విషయం గురించి పూర్తిగా తెలుసుకునేందుకై ముందుగా ఈ గ్రంథం యొక్క 2 వ ప్రకరణంలోని ‘115 వ వైరుధ్యం’ అనే అంశం క్రింద పేర్కొనబడిన అథఃసూచికను అధ్యయనం చేయవలసి ఉంటుంది.



నిరూపించే పదమేదీ లేదు. ఈ వాక్కు ఫముజ్జాహిబ్ దే అయి ఉండేందుకు ఎక్కువగా అవకాశముంది. ఎందుకంటే ఆయన కాలంలో విప్లవానికి సంబంధించిన బోధన చర్చిలలో కొనసాగే రివాజు లేదు.

అయితే రోమన్ చర్చిలో వేర్పాటుకు కారణభూతుడయిన, కేథొలిక్‌గా మారిపోయిన యాబీతామత్‌రాన్ క్రీ.శ. 1722 లో రోమీయుల సమూహం ముందు ప్రసంగిస్తూ ఈ విషయం గురించి ఈ విధంగా పేర్కొన్నాడు:

“ నా వద్ద ‘ మా ప్రత్యేకమైన బలిదానానికి (ఖుదాస్) సంబంధించిన ధార్మిక సేవా వ్యవస్థ’ [540] లో గ్రీకు, అరబీ మరియు సుర్యానీ గ్రంథాలు ఉన్నాయి. వాటిని మేము బాసిలీ సన్యాసులకు[541] చెందిన రోమన్ ప్రతితో పోల్చి చూశాము. ఆ గ్రంథాలన్నింటిలోనూ ఏ పదమూ విప్లవాన్ని సూచించే విధంగా లేదు. వాస్తవానికి ఈ కథను కాన్‌స్టాంటినోపుల్ కు చెందిన నీకోఫోరస్ ‘ఖుదాసుర్రూమ్’ లో అల్లాడు. ఈ కథ ఎంతో హాస్యాస్పదమైనది. తూర్పు నుంచి పడమర వరకు పూర్వీకులలో ఎంతగానో ప్రసిద్ధమైన, అన్ని వర్గాలకు చెందిన చర్చిలలో పఠించబడే అఫ్షీన్ గ్రంథం విషయంలో ప్రజలు ఆ విధంగా ఆడుకున్నప్పుడు, తమ లక్ష్యాలకు అనుగుణంగా దాని

**(అథఃసూచికలు)**

**539** ఈ విషయాన్ని ఎంతగానో సునిశితంగా అధ్యయనం చేసినప్పటికీ అర్థం చేసుకోలేకపోయాము. జ్ఞానుల కొరకు మూల అరబీ వాక్యం క్రింద పేర్కొనబడుతోంది:

و قالو المنتقلان المستحيلان هرباً من دعوى الروم عليهم بان الاستحالة تتم بہ

**540** బలిదానం, నమాజ్, పండుగలకు సంబంధించిన ప్రకటన మొదలయిన ధార్మిక సేవల వ్యవస్థను అరబీలో ‘తఖస్’ అంటారు. ఇది చర్చి యొక్క ఒకానొక పారిభాషిక పదం. ఏ వర్గమయితే లేదా ఏ వ్యక్తయితే ఈ సేవలను అందజేయడం జరుగుతుందో ఆ వర్గాన్ని లేదా వ్యక్తిని కూడా ‘తఖస్’ అని పిలవడం జరుగుతుంది. ఇక ‘ఖుదాస్’ అనేది ఒక ప్రత్యేకమైన బలిదానం పేరు.

(అల్‌మున్‌జిద్ ఫిల్ ఉలూమ్,

మౌలానా ముహమ్మద్ తఖీ ఉస్మానీ సాహెబ్ - అథఃసూచికల కూర్పుకర్త )

స్వరూపాన్ని మార్చివేసినప్పుడు, అలాగే దానిని ఆ ధార్మిక సేవకుని ( యోహన్నా ఫముజ్జాహిబ్) వైపుకు నిస్సిగ్గుగా ఆపాదించగలిగినప్పుడు అటువంటి ప్రజల బాధ్యత పట్ల మాకు నమ్మకం ఎలా కలుగుతుంది? అనగా వారు ఇతర పూర్వీకులకు చెందిన వాక్కుల విషయంలోనూ తమ కాంక్షలకు అనుగుణంగా వ్యవహరిస్తూ వాటి అంశాలను వాటి నామాలతో సహా మిగిల్చి ఉంచుతూ ప్రక్షిప్తానికి పాల్పడలేదని మాకు నమ్మకమెలా కలుగుతుంది?

స్వయంగా ఇటీవలి కాలానికి చెందిన, మా స్వీయానుభవమేమిటంటే కేథొలిక్ అయిన షమ్మాస్ గిరీల్ ఖబతీ [542] యోహన్నా ఫముజ్జాహిబ్ చే యోహాను సువార్తపై రచించబడిన వ్యాఖ్యాన గ్రంథపు అనువాద గ్రంథ సంస్కరణా కార్యాన్ని అసలయిన మూల గ్రీకు ప్రతి నుంచి ఎంతో కష్టపడి, ఎంతగానో ఖర్చుపెట్టి నిర్వహించారు. అలాగే రోముకు చెందిన గ్రీకు మరియు అరబీ భాషల్లో గొప్ప పాండిత్యమున్న పండితులు దమాస్కసులో దానిని పోల్చి అధ్యయనం చేశారు. అలాగే వారు అది సరియైనదిగా ఉందంటూ ధృవీకరించారు. అలాగే దాని నుంచి ఒక నిజమైన ప్రతిని స్వీకరించారు. కానీ మేక్సీమూస్ షోవీర్ మఠంలో [543] దానిని ప్రచురించేందుకై అనుమతించలేదు. చివరకు ఫాదర్ అలీక్సియూస్ అస్బానియూలీ మరియు ఖూరీ యూసుఫ్ జజా మారూనీ ల సహకారంతో దానిని అన్వేషించారు. వారిరువురూ అసలయిన గ్రీకు భాష పట్ల

**(అథఃసూచికలు)**

541 వైరాగ్యం విషయంలో బాసిలియూస్ (Basite) మార్గాన్ని అనుసరించిన వారిని బాసిలీయులు అని పేర్కొంటారు. బాలిసియూస్ (Basite) ( క్రీ.శ. 329 నుంచి క్రీ.శ. 379) ఖైసరియ్యహ్‌కు చెందిన ప్రసిద్ధ క్రైస్తవ పీఠాధిపతిగా పేరుగాంచాడు. ఆయన తన కాలంలో వైరాగ్య మార్గాన్ని (ప్రపంచాన్ని పరిత్యజించే మార్గం) ఒక పటిష్ఠమైన వ్యవస్థగా రూపొందించాడు. అలాగే ఆ మార్గానికి సంబంధించిన నియమనిబంధనలను, సూత్రాలను సైతం రూపొందించాడు. అయితే అంతకు ముందే ఈజిప్టుకు చెందిన పాకమ్ వైరాగ్య మార్గాన్ని ప్రారంభించినప్పటికీ దానిని అందరికంటే ముందు అభివృద్ధిపరచినది, వ్యవస్థీకరించినది మాత్రం బాసిలియూస్. ఆయన రచించిన గ్రంథాలు ఎన్నో ఉన్నాయి. (' అల్ మున్‌జిద్' మరియు 'తవారీఖె కలీసాయె రూమ్')

542 షమ్మాస్ (Deacon) అనేది చర్చికి చెందిన ఒక పదవి పేరు. ఈ పదవి 'ఖాదిమ్' (సేవకుడు) లేదా ' డేకన్ ' (Deacon) అని కూడా పిలువబడుతుంది. దీనికి సంబంధించిన వివరణ పాఠకులచే చదవబడుతున్న ఇదే గ్రంథంలో మరొకచోట పేర్కొనబడి ఉంది.



ఎంతమాత్రం అవగాహన లేనివారు. ఆ ఇద్దరూ ఆ ప్రతిలో తమ ఇష్టానుసారం హెచ్చుతగ్గులకు పాల్పడడం ద్వారా పోప్ మతానికి అనుగుణంగా దానిని మలచివేసేందుకై ప్రక్షిప్తాలకు పాల్పడ్డారు. ఆ విధంగా వారు ఆ ప్రతిని పూర్తిగా నాశనం కావించిన తర్వాత దాని స్వచ్ఛతను ధృవీకరిస్తూ తమ ఆమోదముద్రలు వేశారు. ఆ విధంగా అది ప్రచురించబడేందుకు అనుమతి పొందింది. మొదటి సంపుటి ప్రచురించబడి వ్యాప్తిలోకొచ్చిన తర్వాత దానిని రోమనుల వద్ద సురక్షితంగా ఉండిన మూలప్రతితో పోల్చి అధ్యయనం చేసినప్పుడు అది ప్రక్షిప్తాలకు గురయినట్లుగా విదితమయింది. అప్పుడు వారు చేసిన నిర్వాకం ప్రపంచమంతటా వెల్లడయింది. దాని పర్యవసానంగా షమ్మాస్ గిరీల్ ఆ నీచకార్యం వల్ల కలిగిన బాధను తట్టుకోలేక మరణించాడు"

ఆ తర్వాత ఆయన ఈ విధంగా పేర్కొన్నారు:

" మేము వారి ముందు అరబీ లిపిలో ఉన్న, వారి వద్ద సాధారణంగా ప్రచురించబడిన స్థితిలో లభ్యమయ్యే గ్రంథం ద్వారా వారి నాయకుల ఏకీభావంతో కూడిన సాక్ష్యాన్ని ఆధార ప్రమాణంగా పొందుపరుస్తాము. అది లెబనాన్ సభకు చెందిన నివేదిక. అది తన భాగాలన్నింటితో సహా రోమన్ చర్చి నుంచి తాయిఫహ్ మార్‌దనియహ్ [544] కు చెందిన క్రైస్తవ మతపెద్దలందరి తరపున మరియు వారి పండితుల తరపున రోమన్ కమిటీ అధ్యక్షుడయిన మోన్సీనూర్ సమ్ఆనీ

**(అథఃసూచికలు)**

543 షోవీర్ లెబనాన్‌లోని ఒక పట్టణం పేరు. దానికి కొంచెం దూరంలోనే క్రైస్తవులకు చెందిన ప్రసిద్ధ మఠం ఉంది. దాని వైపుకు ఆపాదిస్తూ సన్యాసులయిన మహిళలను 'షోవీరియాత్' (షోవీరి మహిళలు) అని పేర్కొనడం జరుగుతుంది. వైరాగ్యానికి సంబంధించి ఆ కాలంలో అక్కడ వ్యాప్తిలో ఉన్న ప్రత్యేకమైన మార్గం 'షోవీరియహ్' (షోవీర్ మార్గం) అని పిలువబడుతుంది. (అల్ మున్‌జిద్)

544 క్రైస్తవులకు చెందిన ఈ తాయిఫహ్ మార్‌దనియహ్ 'మార్‌మారూన్ ' అనే వ్యక్తి వైపుకు ఆపాదించబడింది. మార్‌మారూన్ క్రీస్తుశకం ఐదవ శతాబ్దానికి చెందిన ప్రసిద్ధ సన్యాసులలో ఒకడు. ఆయన యొక్క మఠం ఆయన గతించిన తర్వాత దర్శన స్థలంగా మారిపోయింది. ఆయన వైపుకు తమను తాము ఆపాదించుకున్న క్రైస్తవులు పోప్ వ్యవస్థతో కూడిన క్రైస్తవాన్ని ఎక్కువగా వ్యతిరేకించరు. వారు కేవలం పేరు రీత్యా మాత్రమే భిన్నమైనవారు. వారు మారూనీయులు (Maronites) గా పిలువబడతారు.

ఆధ్వర్యంలో జారీ చేయబడింది. అలాగే అది షోవీర్ మతంలో కేథొలిక్ నాయకుల అనుమతితో ప్రచురించబడింది. ఆ కమిటీ ధార్మిక సేవా కార్యకలాపాల వ్యవస్థ గురించి చర్చిస్తూ ఈ విధంగా పేర్కొన్నది: ' మా చర్చిలలో నవాఫీర్, అనగా 'లీతూర్ హయాత్ ' [545] పాతవి ఉన్నాయి. అవి తప్పులు లేకుండా స్వచ్ఛంగా ఉన్నప్పటికీ అవి ఎటువంటి ధార్మిక సేవాతత్పరులయిన వ్యక్తులకు ఆపాదించబడ్డాయంటే వారు వాటిని రచించనూ లేదు, అవి వారి గ్రంథాలూ కాజాలవు. వాటిలో కొన్ని క్రైస్తవ పీఠాధిపతుల పేర్లతోనూ ఉన్నాయి. వాటిని లేఖకులు తమ తుచ్ఛమైన లక్ష్యాల కారణంగా ప్రవేశపెట్టారు. వారు స్వయంగా తమకు వ్యతిరేకంగా ' మా చర్చిలు కల్పిత గ్రంథాలతో నిండిపోయి ఉన్నాయి' అని పేర్కొన్న విషయం పాఠకుల కొరకు సరిపోతుంది.''

ఆ తర్వాత ఆయన ఈ విధంగా పేర్కొన్నారు:

'' మా యొక్క ప్రఫుల్లమైన ఆలోచనాధోరణిని కలిగియున్న తరానికి ప్రతినిధులయినవారు తమ ఇష్టానుసారం ప్రక్షిప్తాలకు పాల్పడే కార్యానికి దూరంగా ఉన్నారనే విషయం మాకు తెలుసు. ఎందుకంటే సువార్తల పరిరక్షకులు వారిని గమనిస్తున్నారనే విషయం వారికి తెలుసు. అయితే అంధయుగాలలో, అనగా క్రీస్తుశకం ఐదవ శతాబ్దం నుంచి ఏడవ శతాబ్దం వరకు 'పోప్ లేదా క్రైస్తవ మత పీఠాధిపతి అంటే ఒక నియంతృత్వంతో కూడిన ప్రభుత్వం' అని పేర్కొనగలిగిన కాలంలో, ఎక్కువమంది వ్రాయడాన్ని, చదవడాన్ని సైతం ఎరుగని కాలంలో, పాపం ప్రాచ్య దేశాలకు చెందిన క్రైస్తవులు వివిధ జాతుల దాస్యంలో మగ్గుతున్న కారణంగా తమ ప్రాణాలను రక్షించుకునే చింతలో నిమగ్నులయి ఎంతో సంక్లిష్ట స్థితిలో ఉన్న కాలంలో ఏమేమి జరిగిందో మనకు ఖచ్చితంగా తెలియదు. అయితే ఆ కాలానికి చెందిన చరిత్రను మనం అవలోకించినప్పుడు మన కనుల ముందు క్రైస్తవ చర్చి యొక్క దయనీయ స్థితికి సంబంధించిన, సంపూర్ణ వినాశనానికి సంబంధించిన దృశ్యాలు సాక్షాత్కరిస్తాయి. వాటిని చూసి రోదించే వివశత్వానికి మనం లోనవుతాము.

పాఠకులారా! ఈ మూడు విషయాలనూ అధ్యయనం చేసిన మీదట ఇప్పుడు చెప్పండి. ఇప్పటికీ మేము ఇంతకుముందు పేర్కొన్న వివరణ విషయంలో ఏమయినా సందేహానికి

**(అథఃసూచికలు)**

545 లీతూర్ హయాత్ అనగా ధార్మిక సేవా కార్యకలాపాలు. ఇక్కడ ధార్మిక సేవా కార్యకలాపాలు ప్రస్తావించబడియున్న గ్రంథాలను 'లీతూర్ హయాత్' గా పేర్కొనడం జరిగింది.



ఆస్కారముందా?

# నేకియ కౌన్సిల్ చట్టాలలో ప్రక్షిప్తాలు

నేకియ సభ [546] ఆమోదించిన శాసనాల సంఖ్య కేవలం 20 మాత్రమే. వాటిలో ప్రక్షిప్తాలకు పాల్పడి ఆ శాసనాలలో మరి కొన్నింటిని చేర్చడం జరిగింది. కేథొలిక్ వర్గం దాని 37 వ మరియు 44 వ శాసనం ప్రకారం పోప్ నేతృత్వాన్ని నిర్ధారిస్తుంది. క్రీ.శ. 1849 లో ప్రచురించబడిన 'కితాబుస్సలాస అష్రహ్ రిసాలహ్', నెంబర్-7 యొక్క 68 వ పేజీలోనూ, 69 వ పేజీలోనూ ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

" పేర్కొనబడిన సభ (నేకియ కౌన్సిల్) ఆమోదించినవి కేవలం 20 శాసనాలు మాత్రమే. అందుకే సావు దోర్తియూస్ చరిత్ర గ్రంథం మరియు 'జీలాసియూస్' మొదలయినవారి గ్రంథాలు సైతం ఈ విషయానికి సాక్ష్యం పలుకుతాయి. అలాగే 'మస్కూనీ కౌన్సిల్ నెంబర్ -4' [547] కూడా నేకియ సభ కేవలం 20 శాసనాలను మాత్రమే ఆమోదించింది' అనే విషయానికి సాక్ష్యం పలుకుతుంది.

అదేవిధంగా ఇంకా ఇతర గ్రంథాలు సైతం కల్పించబడ్డాయి. వాటిని పోప్‌ల తరపున, ఉదాహరణకు కాలీతూస్, సీర్‌సియూస్, నికలీతూస్, ఇస్కందర్, మార్సీలియూస్ మొదలయినవారి తరపున ఆపాదించడం జరిగింది. పేర్కొనబడిన గ్రంథం యొక్క 80వ పేజీలో ఈ విధంగా

**(అథఃసూచికలు)**

546 ఇది నేకియ (Nacaea) పట్టణాన్ని సూచిస్తుంది. క్రీ.శ. 325 వ సంవత్సరంలో ఆర్యూస్ (Arius) అనే అలెగ్జాండ్రియకు చెందిన ప్రధాన యాజకుడు " ఏసు తన అస్తిత్వం విషయంలో దేవునికి సమానం కాజాలరు'' అనే విషయాన్ని ప్రచారం చేయనారంభించాడు. అతడి విశ్వాసాలు దేవుని ఏకత్వం వైపుకు మొగ్గు చూపేవి. కనుక కాన్‌స్టాంటినోపుల్ చక్రవర్తి అంతర్జాతీయ స్థాయిలో క్రైస్తవ పండితుల మహాసభను నేకియలో నిర్వహించేందుకై పిలుపునిచ్చాడు. అందులో అందరి ఏకాభిప్రాయం ప్రకారం పూర్తి చైతన్యంతో ఆర్యూస్ విశ్వాసాలు, సిద్ధాంతాలు తిరస్కరించబడ్డాయి. ఆ మహాసభ క్రైస్తవ చరిత్రలో ఎంతగానో ప్రాధాన్యతను కలిగి ఉంది. మరిన్ని వివరాల కొరకు చూడండి : 'బ్రిటానికా ఎన్‌సైక్లోపీడియా' లోని ' లలల ' అనే అంశాన్ని అధ్యయనం చేయండి.

పేర్కొనబడింది:

" పోప్ లావున్ మరియు మీ రోమన్ చర్చికి చెందిన ఎందరో పండితులు ఈ పోప్‌ల గ్రంథాలు అసత్యమయినవిగా, నిరాధారమైనవిగా అంగీకరించారు "

## 2 వ తప్పుడు అవగాహనకు [548] సమాధానం

## మార్కు సువార్త పేతురు తర్వాత వ్రాయబడినది

మార్కు తన సువార్తను పేతురు సహకారంతో వ్రాసారనే విషయం కూడా పూర్తిగా మోసపూరితమైనది. ఆరీనియూస్ ఈ విధంగా పేర్కొన్నారు:

" పేతురు శిష్యుడయిన, అనువాదకుడయిన మార్కు పేతురు మరియు పౌలు మరణించిన తర్వాత పేతురు ఉపదేశాలను గ్రంథస్థం కావించడం జరిగింది "

లార్డ్నర్ తన వ్యాఖ్యానంలో ఈ విధంగా పేర్కొన్నారు:

" నా అభిప్రాయమేమిటంటే మార్కు తన సువార్తను క్రీ.శ. 63, క్రీ.శ 54 కు ముందు వ్రాయలేదు. ఎందుకంటే పేతురు రోములో అంతకంటే ముందు బస చేయడానికి గల సముచిత

(అథఃసూచికలు)

547 'మస్కూనీ కౌన్సిల్' క్రైస్తవ చరిత్రకు చెందిన పారిభాషిక అర్థంలో అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించబడిన మహాసభను సూచిస్తుంది. ఆ మహాసభలో ప్రపంచం నలుమూలల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. అటువంటి మహాసభలు మొత్తం 15 నిర్వహించబడ్డాయి. ఇక్కడ 'నాల్గవ కౌన్సిల్' అంటే క్రీ.శ. 451 లో కేలిడోనియ (Chaleedoine) లో నిర్వహించబడిన మహాసభ. అందులో మోనూఫీసీ వర్గాన్ని ధర్మశాస్త్రానికి వ్యతిరేకమైన వర్గంగా తీర్మానించడం జరిగింది. (తవారీఖ్, అల్ మున్జిద్)

548 అనగా ' మార్కు తన సువార్తను పేతురు సహకారంతో వ్రాసారని, లూకా తన సువార్తను పౌలు సహకారంతో వ్రాసారని, వీరిద్దరూ (అనగా పేతురు మరియు పౌలు) దివ్య ప్రేరణను కలిగియుండేవారు గనుక ఈ రెండు సువార్తలు (మార్కు మరియు లూకా సువార్తలు) దైవం తరపున దివ్యప్రేరణచే వ్రాయబడిన గ్రంథాలు' అనే తప్పుడు అవగాహన.



కారణమేదీ మాకు కనిపించడం లేదు. అలాగే ఈ చరిత్ర ప్రాచీన రచయిత అయిన ఆరీనియూస్ వివరణకు పూర్తిగా అనుగుణంగా ఉంది. ఆయన ' మార్కు పేతురు మరియు పౌలు మరణించిన తర్వాత తన సువార్తను వ్రాశారు' అని పేర్కొన్నారు. బాసీచ్ ఆరీనియూస్ కు మద్దతు పలుకుతూ ఈ విధంగా పేర్కొన్నారు: " మార్కు తన సువార్తను పేతురు మరియు పౌలు మరణించిన తర్వాత క్రీ.శ. 66 లో వ్రాశారు'

బాసీచ్ మరియు ఆరీనియూస్ వ్యాఖ్యల ద్వారా మార్కు తన సువార్తను పేతురు మరియు పౌలు మరణించిన తర్వాత వ్రాసారనే విషయం స్పష్టమయిపోయింది.[549] పేతురు మార్కు సువార్తను నిశ్చయంగా చూడలేదు. పేతురు దానిని చూసారనేందుకు గాను పేర్కొనబడే ఉల్లేఖనం అసత్యమైనది, బలహీనమైనది, విశ్వసనీయమైనది కాదు. అందుకే 'ముర్‌షదుత్తాలిబీన్' గ్రంథ రచయిత పక్షపాత ధోరణిని కలిగియున్నప్పటికీ క్రీ.శ. 1840 లో ప్రచురించబడిన తన గ్రంథం యొక్క 170 వ పేజీలో ఈ విధంగా పేర్కొన్నారు:

" మార్కు సువార్త పేతురు పర్యవేక్షణలో వ్రాయబడిందనే నమ్మకం ఉంది"

పరిశీలించండి. కేవలం 'నమ్మకం' అనే పదం అతి స్పష్టంగా ఈ వాదం తప్పని, నిరాధారమైనదని నిరూపిస్తోంది.

## పౌలు లూకా సువార్తను చూడలేదు

అదేవిధంగా పౌలు కూడా లూకా సువార్తను చూడలేదు. ఇందుకు ఆధారంగా రెండు ప్రమాణాలను పేర్కొంటున్నాము.

**1.** నేటికాలపు ప్రొటెస్టెంట్ వర్గానికి చెందిన క్రైస్తవ పండితులు ప్రాధాన్యతనిచ్చిన

(అథఃసూచికలు)

549 జే.టీ మేస్లీ ఈ విధంగా పేర్కొన్నారు: " మార్కు సువార్త యొక్క, క్రీ.శ. 170 లో వ్రాయబడిన మార్కినీ పీఠికలో మరొక సమాచారం అందజేయబడింది. అదేమిటంటే మార్కు పేతురు మరణించిన తర్వాత తన సువార్తను ఇటలీలో వ్రాయడం జరిగింది. ఈ అభిప్రాయం సరియైనదిగా, సముచితమైనదిగా అనిపిస్తోంది " ('కుతుబె ముఖద్దసహ్' గ్రంథ ఉల్లేఖకుడు, పేజీ : 335)

అభిప్రాయమేమిటంటే లూకా తన సువార్తను క్రీ.శ. 63 లో వ్రాసారు. దాని కూర్పు అఖియా లో ఉంది.

మరొకవైపు నిశ్చితమైన విషయమేమిటంటే పౌలు క్రీ.శ. 63 లో ఖైదు నుంచి విముక్తిని పొందాడు. ఆ తర్వాత అతడు చనిపోయేంతవరకు ఏమయ్యాడోననే విషయం ఏ సరియైన ఉల్లేఖనం ద్వారానూ తెలియబడలేదు. అయితే పటిష్ఠమైన అంచనా ప్రకారం అతడు స్పానియా మరియు పశ్చిమ దేశాల వైపుకు వెళ్ళిపోయాడనే విషయం తెలుస్తోంది. అంతేగానీ అతడు ప్రాచ్య దేశాలకు చెందిన చర్చిల వైపుకు వెళ్ళలేదు. 'అఖియా' అనేది ప్రాచ్య దేశపు నగరాలలో ఒకటి. పటిష్ఠమైన అంచనా ఏమిటంటే లూకా తన సువార్తను వ్రాసిన తర్వాత అతడిని థెయొఫిల వద్దకు పంపివేశాడు. వాస్తవానికి థెయొఫిలయే సువార్త కూర్పుకు కారణభూతుడయ్యాడు.[550]

'ముర్షదుత్తాలిబీన్' గ్రంథ రచయిత క్రీ.శ. 1840 లో ప్రచురించబడిన తన గ్రంథం యొక్క 2 వ సంపుటి యొక్క 2 వ అధ్యాయంలోని 161 వ పేజీలో లూకా స్థితిగతుల గురించి ఈ విధంగా పేర్కొన్నారు:

" లూకా పౌలు ఖైదు నుంచి విడుదలయిన తర్వాత అతడి స్థితిగతుల గురించి ఏమీ వ్రాయలేదు.[551] కనుక ఏ సరియైన ఉల్లేఖనం ద్వారానూ అతడి ప్రయాణం మొదలయినవాటికి సంబంధించిన స్థితిగతుల సమాచారమేదీ లభ్యం కాదు "

లార్డ్నర్ క్రీ.శ. 1728 లో ప్రచురితమైన తన వ్యాఖ్యాన గ్రంథం యొక్క 5 వ సంపుటిలోని 350 వ పేజీలో ఈ విధంగా పేర్కొన్నాడు:

" మేము ఇప్పుడు అపొస్తలుని (పౌలు) యొక్క స్థితిగతులు అప్పటినుంచి (అనగా ఖైదు నుంచి విడుదలయినప్పటి నుంచి మరణం వరకు) ప్రస్తావించబడాలని కోరుకుంటున్నాము. కానీ లూకా వివరణ ద్వారా ఈ విషయంలో ఎంతమాత్రం సహకారం లభించదు. క్రొత్తనిబంధన

**(అథఃసూచికలు)**

550 లూకా తన సువార్త ప్రారంభంలో ఈ గ్రంథం థెయొఫిల కొరకు వ్రాయబడుతున్నట్లుగా పేర్కొన్నారు.

551 అనగా 'అపొస్తలుల కార్యములు' గ్రంథంలో



లోని ఇతర గ్రంథాల నుంచి కొంత సహకారం లభిస్తుంది. ప్రాచీన కాలపు పండితుల వ్యాఖ్యల ద్వారా కొంచెం ఎక్కువ సహకారం లభిస్తుంది. అలాగే అతడు (పౌలు) ఖైదు నుంచి విడుదలయిన తర్వాత ఎక్కడికి వెళ్ళాడనే విషయంలో అభిప్రాయభేదాలున్నాయి"

ఈ ఇద్దరు వ్యాఖ్యాతల వ్యాఖ్యల ద్వారా నిరూపితమవుతున్న విషయమేమిటంటే క్రైస్తవుల దృష్టిలో పరిశుద్ధునిగా పరిగణించబడే పౌలు ఖైదు నుంచి విడుదలయిన తర్వాత మరణించేంత వరకు గల స్థితిగతుల గురించి ఏ సరియైన ఉల్లేఖనం ద్వారానూ ఎంతమాత్రం సమాచారం లభ్యం కాదు. కనుక ఆఖరి కాలానికి చెందిన కొంతమంది క్రైస్తవ పండితులు బహుశా అతడు ఖైదు నుంచి విడుదలయిన తర్వాత ప్రాచ్య దేశాలకు చెందిన చర్చిల వైపుకు వెళ్ళిపోయి ఉంటాడని పేర్కొనడమనేది ఎంతమాత్రం ఆధార ప్రమాణం కాజాలదు.

అపొస్తలుడైన పౌలు రోమీయులకు వ్రాసిన పత్రిక యొక్క 15 వ అధ్యాయపు 13 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" ఇప్పుడైతే ఈ ప్రదేశములలో నేనిక (సంచరింపవలసిన) భాగము లేదు గనుక, అనేక సంవత్సరముల నుండి మీ యొద్దకు రావలెనని మిక్కిలి అపేక్ష కలిగి, నేను స్పానియాకు వెళ్ళునప్పుడు మార్గములో మిమ్మును చూచి, మొదట మీ సహవాసము వలన కొంతమట్టుకు సంతృప్తి పొంది, మీ చేత అక్కడికి సాగనంపబడుదునని నిరీక్షించుచున్నాను"**

చూడండి. క్రైస్తవుల దృష్టిలో పరిశుద్ధునిగా పరిగణించబడే పౌలు స్పష్టంగా తాను స్పానియా వైపుకు వెళ్ళాలనుకుంటున్నట్లుగా పేర్కొన్నాడు. ఏ సరియైన, పటిష్ఠమైన ఆధార ప్రమాణం ద్వారానూ ఖైదు నుంచి విడుదలవడానికి ముందు పౌలు ఆ వైపుకు (స్పానియా వైపుకు) వెళ్ళినట్లుగా నిరూపితం కాదు. కనుక పటిష్ఠమైన అంచనా ఏమిటంటే అతడు ఖైదు నుంచి విడుదలయిన తర్వాత అటువైపు వెళ్ళి ఉంటాడు. ఎందుకంటే అతడు తన సంకల్పాన్ని విరమించుకొని ఉంటాడని చెప్పేందుకై సముచితమైన కారణమేదీ కనిపించదు.

'అపొస్తలుల కార్యములు' యొక్క 20 వ అధ్యాయపు 25 వ వాక్యంలో ఈ విధంగా పేర్కొనబడి ఉంది:

**" ఇదిగో (దేవుని) రాజ్యమును గూర్చి ప్రకటించుచు నేను మీ మధ్యను సంచరించుచుంటిని గదా? మీలో ఎవరును ఇక మీదట నా ముఖము చూడరని నాకిప్పుడు తెలియును"**

ఈ వాక్కు కూడా అతడు ప్రాచ్య దేశాలకు చెందిన చర్చిల వైపుకు వెళ్ళాలని

సంకల్పించలేదనే విషయాన్ని నిర్ధారిస్తోంది.

రోమన్ చర్చి పీఠాధిపతి అయిన క్లీమ్నస్ తన లేఖలో ఈ విధంగా పేర్కొన్నాడు:

" పౌలు సమస్త ప్రపంచానికీ సత్యానికి సంబంధించిన పాఠాన్ని బోధించేందుకై పశ్చిమ దేశ అంతిమభాగం వైపుకు సాగిపోయాడు. అలాగే అతడు పవిత్రమైన ప్రదేశానికి తరలిపోయాడు"

ఈ వ్యాఖ్య కూడా అతడు పశ్చిమ దేశాల వైపుకే సాగిపోయాడని, ప్రాచ్య దేశాలకు చెందిన చర్చిల వైపుకు సాగిపోలేదని విదితపరుస్తోంది.

**2.** లార్డ్నర్ ముందుగా తువార్నియూస్ వాక్కును ఈ విధంగా ఉల్లేఖించారు:

" పౌలు అనుచరుడైన లూకా ఒక పుస్తకంలో పౌలు చెప్పిన విషయానికి సంబంధించిన శుభవార్తను

ఆ తర్వాత ఈ విధంగా పేర్కొన్నారు:

" వాక్య సంబంధం ద్వారా విదితమవుతున్న విషయమేమిటంటే ఈ కార్యం (అనగా లూకా తన సువార్తను వ్రాయడమనే కార్యం) మార్కు తన సువార్తను వ్రాసిన తర్వాత, పౌలు మరియు పేతురు మరణించిన తర్వాత జరిగింది "

ఇప్పుడు ఈ వ్యాఖ్య కారణంగా పౌలు లూకా సువార్తను చూడడమనేది ఎంతమాత్రం సాధ్యం కాజాలదు.

ఒకవేళ పౌలు లూకా సువార్తను చూసియున్నాడని అంగీకరించినప్పటికీ మా దృష్టిలో (ముస్లింల దృష్టిలో) ఆ విధంగా చూడడం వల్ల ఒనగూడేదేమీ లేదు. ఎందుకంటే మా దృష్టిలో లూకా వాక్కు దేవుని తరఫున దివ్యప్రేరణచే వెలువడిన వాక్కు ఏమీ కాదు. మరి దైవం తరఫున దివ్యప్రేరణచే వచించని ఒక వ్యక్తి యొక్క వాక్కు కేవలం పౌలు చూసినంత మాత్రాన దైవం తరఫున దివ్యప్రేరణచే వ్రాయబడిన వాక్కుగా ఎలా పరిగణించబడగలదు?

## మొదటి సంపుటి సమాప్తం